TEXT PROBLEM WITHIN THE BOOK ONLY

TIGHT BINDING BOOK

UNIVERSAL LIBRARY
OU_204161
UNIVERSAL LIBRARY

552—7-7-66—10,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T88 Accession No. T6481

Author S13S

Title సక్తి

This book should be returned on or before the date last marked below.

సఖి

సంపాదకులు

శ్రీ శివశంకరశాస్త్రి

శ్రీ వీరరాఘవస్వామి

ప్రథమ సంపుటము

[క్రోధన పుష్యము - అక్షయ మార్గశీర్షము]

సాహితీసమితి, గుంటూరు

ఆశీస్సు

శ్రీ శివశంకర శాస్త్రి

రమ్ము రమ్మోముద్దు బిడ్డా,
రంగభూమికి, నిన్ను గన్గొన
నాదరంబున వేచియున్నా
రాంధ్ర సజ్జనులు.

విడువు మమ్మా జంకు, నీముఖ
వీక్షణంబున నెల్లవారల
యంతరంగములందు గౌరవ
మంకురించు జుమీ!

పాడు మమ్మా, గళన్నవరస
భరిత నూతన ఖండకృతులను
నీసుధామధురాచ్ఛగళమున
నిరుపమానముగన్.

చెప్పు మమ్మ, కథానకమ్ముల,
జిన్నియాఖ్యాయికల, నభినవ
వివిధరీతుల రమ్యకథలను
వింత గొల్పంగన్.

నేడు వర్ధిలు వాఙ్మయమ్మున
నిర్ణయింపుము కన్నతల్లీ,
చతురమతిని రసస్వరూపము
జంకు లేకుండన్.

సరళహృదయము నీది తల్లీ,
సరససూక్తులు నీవి బిడ్డా,
సహృదయాంతఃకరణరంజన
సల్ప కుందునొకో?

ఆర్యు లెందరో కూడి యున్నా
రంజలిని ఘటియింపు మమ్మా!
నిలుచు గాక సరస్వతీ కృప
నీకయిని తల్లీ!

*

పునరావర్తనము

నోరి నరసింహ శాస్త్రి

శైశవవేళ బాల్యమున శాంత విశృంఖల సాధువృత్తి నీ
పేశల రమ్య గర్భపదపీస్థితి నెప్పుడు విశ్రమింతు క్షీ
రాశనుడైన యర్భకు డనారత మంబ యురస్స్థలంబునన్
లేశము చింతలేక పవళించి సుఖించు మనోజ్ఞ వైఖరిన్.

అంబరవీథి కాల జలదావృతి భీషణ మైన వేళలన్
సంబర మెత్తి కేకిక్రియ సర్వదిగంతములన్ లపింతు, నో
యంబ, శరన్మనోజ్ఞ లలితాకృతి నీవు ధరింప రాజహం
సం బయి మందయానముల సాగి చకోరమ నై గ్రసింతు నిన్.

పల్లవ పుష్పకోరకిత భాస్వరరూపము దాల్చి నీవు శో
భిల్లు వసంత దివ్యతర వేళ లతాగ్రము లెక్కి యూగి యు
త్ఫుల్ల మనంబుతో పికము ముద్దుల పాటల నాలకింతు; నీ
వల్లన శ్రాంత వౌ శిశిరమందున నేనును విశ్రమించెదన్.

ఈవిధి నిన్ను గూడి చరియింతు, స్మరింపుదు నీ కథాళినే,
సేవ లొనర్తు నీకె పెరచింతలు మాని, సకృద్భవంబు లై
ఏ పనగీతు లైన నుదయించిన నీకె సమర్పితంబు లౌ,
నీవు కృపార్ద్రదృష్టి గరుణించి భరించితి వీకుమారకున్.

ఈ విధి నెల్లకాలము గతించిన మే లయియుండు గాని యిం
కో విధ మయ్యె దైవగతి! యొయ్యన శైశవ బాల్యముల్ చనెన్,
యౌవన మంకురించె, హృదయంబున వెంటనె మొల్కలెత్తె హా
ర్దావహ నవ్య భవ్య వివిధాశయముల్ మధుర ప్రయత్నముల్.

నీ యుదరాంతరంబు స్మరణీయ భవత్ప్రతిపాలనంబు నే
బాయగ ద్రోసి లోకమున బాదము వెట్టితి, నవ్యజాతశ
క్త్యాయత గర్వ బుద్ధి నయి, యశ్రుత పూర్వ విచిత్ర సమ్మదా
ప్యాయిత చిత్తవృత్తి నిక నవ్యవిచారము దక్కి వెట్టి నై.

అంతట నాసికాపుటములం దలమెన్ గమనీయ వాసనల్,
సంతతధారగా శ్రవణ సంగత మయ్యె విలాస భావనా
భ్యంతర గీతికానురణి తాద్భుతగానము, ప్రజ్వల న్మహా
త్కాంతి దిగంతరాళముల కన్నులపండు వొనర్చె వింతమై.

తల్లి, క్రమంబుగా స్మృతిపథంబున దూరము కాదొడంగె యు
ష్మ ల్లలితామ లాకృతి, ప్రసన్నము లై రుచిరంబులై సుధా
వేల్లితముల్ ప్రతిక్షణ వివృద్ధము లై నవసౌఖ్యరాజి భా
సిల్లె త్వదాఖ్యయే నిరవశేషము నామది విస్మృతింపగన్.

ఓ ప్రకృతిస్వరూపిణీ, శుభోదయ శాంత పవిత్రమూర్తి, నీ
యప్రతిమానరక్ష విడనాడిన దాది క్రమ క్రమంబుగా
నప్రతిభుండ నైతిని సవార్త సుఖాభ్యుదయంబు లన్నియున్
క్షిప్రజవంబున వెనుక వెన్కకు బోవదొడగె న్నదృశ్యమై.

ముందు స్వకీయ సౌరభ సమూహములన్ వెదజల్లి యెందు నా
నందము సంఘటించు మృగనాభి సితాభ్ర లవంగ జాతి శ్రీ
చందన వంశకాగ్నిశిఖ సంకుమదాది సుగంధ వస్తువుల్
మందగతిన్ మనోహరత మాని తుదిన్ తలనొప్పి గూరిచెన్.

గీతరవామృతంబునను కిన్నర కింపురుషాప్సరోంగనా
వ్రాతము పాటలా యనెడు భ్రాంతి ఘటించి రసార్ద్రసేచనన్
చేతము చల్లనై తనువు ఝల్లురనం బులకింప జేయు సం
గీతము మంద్ర మంద్రమయి కేవలనిరవమై చనెన్ గుదిన్.

ఒక్కట కుంకుమాంకితము నొక్కట నీలమనోజ్ఞ దీప్తి వే
రొక్కట దివ్యకాంచన సముజ్జ్వల మొక్కట నిందుహారి యొం
డొక్కట చండ భాస్కరకరోగ్రము బర్హిణ బర్హచిత్ర మిం
కొక్కట నా మహాద్యుతు లొకొక్కటె పట్టె నదృష్టమార్గమున్

నూతనజాత సౌఖ్యపు వినోదములం దొకకొన్ని మాసియున్
రోత యొసంగి కొన్నియును రూపరె నన్నియు నన్నిరూపులై
ప్రాతరవాప్త దివ్యరుచి భాస్వర పద్మము బోలె వెల్గు న
త్యాతత యౌవనాతిశయ మల్లన పొందగ వొచ్చె జీర్ణతన్.

అప్పుడు ప్రాప్తమయ్యె హృదయాంతరమం దనవాప్త పూర్వమై
చెప్పదరంబు గాని బలుచిత్రపు భారము దుర్భరంబుగన్
ఎప్పుడు సాధు చింత లుదయింపగ పొంగెడి నామనంబు పెం
పొప్పరి శోకవిహ్వలత నొందె ననిర్వచనీయ వైఖరిన్ .

ఇంపు జనింప దేమి పచియింపను , మిత్రుని నర్మవాక్య మా
లింపను , గ్రంథరాజము పఠింపను , తీరని కార్యమేని గా
వింప , సమాగతాప్తుల గణింప , నకారణ మస్రుపూరముల్
నింపుదు నేత్రనీల నలినీద్వయి శోకనదచ్ఛవిం గనన్ .

ఉల్లము తల్లడిల్లు నెపు డూరట గానక , ఎల్లవేళ శో
షిల్లినరీతి నంగకము లెంతయు దోచును , బుద్ధిశాంతియొ
కల్లయి పోవ జాలిబడి కాయము నెవ్వగ నంఘ్రిపద్మముల్
చిల్లులు వారగా క్షణముసేపును నాగక సంచరించితిన్ .

ఎట్టి మనోహరస్థలుల నెంతటి పుణ్య జనాంగణంబులన్
మెట్టితినో యెఱుంగ మది నిండి క్షణ క్షణ జృంభమాణమై
పట్టు వశంబు గాని తమి బాధ వికర్షణసేయ మాధ్యసం
ఘట్టితచిత్తవృత్తి నిటు కన్నులు మూసి చరించు వేళలన్.

అంత వసంతసాయ మిను డస్తగిరీంద్ర మలంకరించి యా
శాంతరదేశ మెల్లెడల నాత్మ రుచుల్ ప్రసరించి నించు వే
శాంతమునన్ యథావిధవిహారము సల్పుచు బోవుచుంటి నే
కాంతమ పుష్పితాగ్ర సహకార మనోజ్ఞవనాంతరంబునన్ .

ఆ సమయంబునందు శ్రవణాగతమై వినవచ్చె చూతశా
ఖాసన సంస్థితం బగు పికాంగన కూకుహూ కూజితంబు బా
ధా సకలాపహారి యయి దాహనివారణ వారి యై పథా
యాస నిరాసకారి యయి హారి సుధాప్రసరానుకారియై .

ఆ కలకంఠ కంఠ నిసృతార్ద్ర కుహూధ్వని నన్నినాళ్ళకున్
నీ కరుణాస్వరంబు విన నేర్చితి, నావిధ మెన్నినాళ్ళుగా
నాకయి కంఠమెత్తి కరుణాంబుగ బిల్చితివో ! అనూన మా
నీకృప నీమహత్త్వము గణింప దరంబె కృతఘ్నబుద్ధికిన్ !

నీమాటల్ వినుచుండియున్ వినక , ని న్వీక్షించుచుం గానకన్ ,
సీమాంతభ్రమణం బొనర్చి మరలం జేరెన్ త్వదావాసమే ,
ఈ మోహాంధుని నేరమున్ మనుచుమీ , యీతండు నీయర్భకుం,
డో మాతా , ప్రకృతీ , యథావిధి త్వదీయోత్సంగముం జేర్పవే!

ఖేమాభిక్షుణి

నోరి నరసింహ శాస్త్రి

*

అంకితము

శ్రీ బాబురావుకు

*

మొదటి రంగము.

[రాజగృహప్రాసాదములో ఖేమాదేవి అంతః పురము. అతిమనోహరముగానూ శుభ్రముగానూ అలంకరించి ఉన్న ఖేమాదేవి మందిరములో ఖేమాదేవి బింబిసారుడు మాట్లాడుకుంటున్నారు. ప్రాతః కాలము.]

ఖేమాదేవి

బౌద్ధ భిక్షునులూ భిక్షులూ కలల్లో తరుచుగా కనపడుతున్నారు. మన స్సంతా వ్యాకులంగా ఉన్నది.

బింబిసారుడు

అవి సుస్వప్నాలే. అంతకంటె శుభదర్శనమే ముంటుంది!

ఖేమాదేవి

మీ రట్లా అంటా రనే నా భయము. వికారాకారులైన భిక్షుల దర్శనము వితంతు దర్శనము వంటిది, కాని శుభప్రద మవుతుందా!

బింబిసారుడు

భిక్షునింద చేయరాదు. వారు సర్వోత్కృష్టులు, పూజ్యులు.

ఖేమాదేవి

వాళ్ళను నిందించవలసిన అవసరము నా కేమున్నది! వికృతస్వరూపులను సుందరరూపు లనడమూమాత్రము నా చేతకాదు. ఈ నా రూపానికి నా నాథుడు ముగ్ధుడై ఉన్నంతకాలమూ నా కేభయమూ లేదు.— కాని రాత్రికల బాధిస్తున్నది.

బింబిసారుడు

ఏమి టా దుస్స్వప్నము ?

ఖేమాదేవి

ఈ నా తలకట్టు చూస్తున్నారా ?

బింబిసారుడు

చూడ కేమి ! నీ ఎదటికి వచ్చి నప్పుడు పొద్దుగ్రా నిగనిగలాడే నీ వెంట్రుకల అందము చూడకుండా నాదృష్టి ఒక్క క్షణ ముండగలదా !

ఖేమాదేవి

నా జడ ఎట్లా ఉన్నది ?

బింబిసారుడు

ప్రేమలతవలెనే మనోహరంగా ఉన్నది.

ఖేమాదేవి

తలలో పూ లెట్లా తురిమినానో చూసినారా ?

బింబిసారుడు

అందులో నీవు కృతహస్తవుగదా ! దివ్యవాసనలు వెదజల్లుతూ నేత్రపర్వము చేసే పుష్పలోకమంతా నీశిరస్సులో అలంకారార్థమే సృష్టిఐనది.

ఖేమాదేవి

ఈ ముంగురులు ?

బింబిసారుడు

నీముఖపద్మము మీద వాలుతున్న తుమ్మెదల వలె ఉన్నవి.

ఖేమాదేవి

ఈ కేశపాశము లేకుండా ఉంటే నే నెట్లా ఉంటాను ?

బింబిసారుడు

[ఎడమ చేతితో కళ్లు మూసుకుంటూ] తేనె వంటి మాటలు పలికే నీనోట ఇవ్వాళ ఈలాటి మాటలు వచ్చినవేమి !

ఖేమాదేవి

నాకల అదే మరి ! ఎవరో విచిత్రపురుషుడు నన్ను భిక్కునినిగా చేసినట్లు కలగన్నాను.

బింబిసారుడు

అదా నీ భయము ! భిక్కునివి కమ్మని నిన్నెవ్వరూ బలవంతము చేయరులే. మనస్సు కుదుటపరుచుకో.

ఖేమాదేవి

ఈకల నాకు భయోత్పాతము కలిగిస్తున్నది.

బింబిసారుడు

నీ కేమి భయము ! బుద్ధదేవుణ్ణి చూడ నన్నా చూడ నని దీక్షతో ఉన్న నీ కేమి భయము !

ఖేమాదేవి

ఒకరిమీద కల వస్తే ఆపీడ ఇంకొకరిమీదుగా పోతుందంటారు.

బింబిసారుడు

భిక్కులంటే నీకున్న నిరసనభావమువల్ల మనస్సు ఆందోళనపడి అటువంటి కల వచ్చినది. ఇతరమేమీ పట్టించుకోని బంగారు చిలకవల్లే నీఅందము నీవు చూసుకో ! నీతలలో ఇంకా కొన్ని పూలు పెట్టేదీ ?

ఖేమాదేవి

ఆలాగే ! మీ ప్రసాదము.

[బింబిసారుడు పూవొకటి తలలో పెట్టుతూ ఉంటే అది చేతులోనుంచి జారి కింద పడుతుంది.]

ఖేమాదేవి

[ఉలిక్కిపడి] అదుగో !

బింబిసారుడు

ఏమీ లేదు. స్వప్నంలోని నీ ఆకారము తలపుకు వచ్చి చేయి వణికింది, పూవు జారింది.

ఖేమాదేవి

[కొంచెము కంపిస్తూ] గుండెలలో గబగబలాడుతున్నది. చెవులల్లో దూరధ్వను లేవో అవ్యక్తంగా వినిపిస్తున్నవి.

బింబిసారుడు

సాహసికురాలవైన నీకు ఒక్క కలవల్లనే ఇంత చిత్తవిక్షోభము కలగవలెనా ! ఒక్కసారి 'తథాగతుణ్ణి' సేవించి వత్తాము, రా ! మనస్సు శాంతిస్తుంది. ఇవ్వాళ చాలా శుభదినము కూడాను !

ఖేమాదేవి

ఆ స్త్రీవిరోధా, నాకు మనశ్శాంతి కలిగించేది ? ఆయనను చూడకుండా ఉంటేనే నా కలల్లో భిక్కులు గంతులు వేస్తున్నారు. ఒక్కసారి వెంట్రుకలు లేని ఆయన రూపమే చూశానంటే కలలతో రాత్రుళ్ళు నా కిక నిద్రే ఉండదు !

బింబిసారుడు

ఖేమా, ఈదేహమూ ఈరూపమూ నిత్యమైనవా ? ఐనా భగవానుణ్ణి ఒక్కసారి చూసినావా, నీ వాపైన అట్లా అనవు. ఎందుకూ ! కుశలమైన ఆ ముఖదర్శనము చేసిన తత్క్షణమే నీకు భక్తిశ్రద్ధలు ఏర్పడతవి. ఒక్కసారిగా మారిపోతావు.

ఖేమాదేవి

నవయౌవనమువలె మార్పు ఆనందదాయకమే. క్షణక్షణమూ విజృంభిస్తున్న సూర్యకాంతిలో నూతనశోభతో ప్రకాశిస్తూ ఆకాశము ఎంత కన్నులపండువుగా ఉన్నదో చూడండి. అలంకారాలలో పూటపూటకూ రోజురోజుకూ ఒక్కొక్క కొత్తవిధము ఉండవలె. ఇవ్వాళ పెట్టిన సొమ్ము రేపు పెట్టరాదు. ఈ రోజు ఒకరకముగా చీరకట్టుకుంటే రేపింకొక రకంగా కట్టవలె. వెంట్రుకలు ఒకనాడు జారుజడవేస్తే ఒకరోజున చుట్టగా చుట్టవలె, మరొకనాడు మరొక్కమాదిరిగా తీర్చవలె. నేను బొట్టూ కాటికా ఎంత చిత్రచిత్రాలుగా దిద్దుకున్నానో చూస్తున్నారుగా ! కాని—

బింబిసారుడు

నీ అలంకారాలే కాదు, నీమాటల ధోరణి కూడా ప్రతిక్షణము నూతనముగా ఉండి రాగమాలగా నాకు శ్రవణానందము కలిగిస్తుంది.

ఖేమాదేవి

అందుకని ఈరోజు బట్ట కట్టినా మని రేపు దిగంబరుల మై తిరుగుతామా! పుట్టినప్పటి నుంచీ అతి శ్రద్ధగా పోషించి పెంచిన దివ్యమైన కేశపాశము ఒక్కసారి మార్పుకోస మని ఎవరన్నా తీసివేస్తారా!

బింబిసారుడు

అబ్బా! అకల నీచేత కటువుగా మాట్లాడిస్తున్నది. అజ్ఞానాంధకారంలో తవుడుకుంటున్న జీవుల కందరికీ సూర్యు డెవరో, సంసారసముద్రంలో మునిగి తేలుతున్న అసహాయులకు నావ ఎవరో, దుఃఖరోగముతో బాధపడుతున్న రోగులకు చికిత్స చేయగల వైద్యశిఖామణి ఎవరో, ఆ తథాగతుణ్ణి ఒక్కసారి నాతో వచ్చి దర్శించిపో!

ఖేమాదేవి

ఆ మీ తథాగతుడే నా భయకారణము. ప్రజలు గౌతముని విషయము ఏమనుకుంటున్నారో తెలుసునా?

బింబిసారుడు

ఈలోకంలో మానవులే కాక సహస్రకోటిభువనాలలో నివసించే నాగులు యక్షులు దేవతలు ఇత్యాదులు యావన్మందీ తథాగతునికి మొక్కి వెళ్లుతున్నారు.

ఖేమాదేవి

సహస్రకోటిభువన నివాసుల సంగతి ఏమో నాకు బాగా తెలియదు, కాని ప్రత్యక్షంగా కనపడే మన రాజ్యములో ప్రజలుమాత్రము ఏకగ్రీవంగా ఘోషిస్తున్నారు. వారి ఘోష అంతఃపురంలో ఉండే నాకే స్పష్టముగా వినవస్తున్నది.

బింబిసారుడు

ఈఅసందర్భపు మాటలు నీతో ఎవ రన్నారు? విదూషకుని హాస్యపుమాటలు నిజము పట్టించుకుంటున్నావా?

ఖేమాదేవి

మీగురువు ఉపదేశాలవల్ల ఎన్నెన్ని సంసారాలు చెడిపోయినవి! గౌతముడు వైద్యశిఖామణి కాదు, కొత్తవ్యాధి లోకంలో ప్రవేశపెట్టుతున్న మహానుభావుడు! ఈ అంటువ్యాధి మన దేశంలో ప్రబలి ప్రజలు క్షీణిస్తున్నారు. ఈవరసను ప్రజ లంతా భిక్కునులూ భిక్కులూ అవుతూవుంటే కొద్దికాలంలోనే మన రాజ్యము నిర్జన మవుతుంది. ఇప్పటికే ఎన్నోవంశాలు నిర్మూలమైనవి.

బింబిసారుడు

భగవానుని అవతారముచేత సృష్టిలోని సమస్త జీవజాతమూ ఆనంద పరవశమై ఉన్నది. అటువంటి తథాగతుణ్ణి నిందించడము పాపహేతువు. వచ్చి దర్శించ మని నిన్ను బలవంతపెట్టనులే.

ఖేమాదేవి

మహారాజా, ఈప్రియురాలిమీద కోపించవద్దు. నామాటలు సాంతంగా సావధానచిత్తముతో ఆలకించండి. ఈమాటుకు నన్ను మన్నించండి!

బింబిసారుడు

'ఉపాసకు' లైనవారికి కోపమూ అహంభావమూ ఉండవు.

ఖేమాదేవి

మీకు శ్రమణులయందు గౌరవమే గదా!

బింబిసారుడు

అవును.

ఖేమాదేవి

నూతనముగా ఎవరైనా భిక్కును లవుతే మీకు సంతోషమే కదా!

బింబిసారుడు

ఆ! అటువంటివాళ్లకు ముందు నేనే స్వయముగా ఆతిథ్య మిచ్చి సత్కరిస్తాను.

ఖేమాదేవి

'అజాతశత్రువు' పరివ్రాజకుడై పీతాంబరము ధరించి దేశదేశాలలో భిక్షాటనము చేయడము మీకు సమ్మతమేనా? నేను భిక్కునిని కావడము మీ కిష్టమేనా?

బింబిసారుడు

ఇంకా నీస్వప్నము మరుపుకు రాలేదా, అబ్బా!

ఖేమాదేవి

రాజా, మన సంసారమువంటివే ప్రజలందరి సంసారములూ. అనుభవించవలసిన ఈడు ఇంకా ఎంతో ఉన్న చిన్న చిన్న వాళ్లు ఎందరో గౌతమబోధల వ్యామోహములో పడి సన్యసిస్తున్నారు. పుత్రహీనులై తల్లిదండ్రు లెంత మందో పరితపిస్తున్నారు. సంసారభార మీడే తండ్రులు సన్యసించగా పోషించే నాథులు లేక పిల్లలు అల్లాడుతున్నారు. పాలుతాగే పసికూనలను వదిలిపెట్టి పిల్లతల్లులు 'సంఘము' లో చేరుతున్నారు. ఎందరో భార్యాభర్తలు నిరర్థకముగా అకాలంలో వేరవుతున్నారు. నిక్షేపమువంటి సంసారా లెన్నో నిరాధారా లవుతున్నవి. ఒకరు భార్యలేనివారు, ఒకతె భర్త లేనిది, తల్లిలేని బిడ్డలూ, తండ్రిలేని పిల్లలూ, సంతాన ముండీ ఆసౌఖ్యములేని తల్లిదండ్రులూ— ఈవిధముగా మనరాజ్యములో ప్రజలు దుఃఖిస్తున్నారు. ఇక మీగురువుగారి బోధామృతమేమో నాకు బోధపడడం లేదు. ఇంతమంది ఆర్తజనుల ఘోషా ప్రభువులమైన మనకే తగులుతుంది!

బింబిసారుడు

ఖేమా, నీ వీవేళ చిత్రముగా మాట్లాడుతున్నావు! తథాగతుణ్ణి దూషించేవాళ్లతో ఈ మాటలు చెప్పమని భగవానుని ఆజ్ఞ: "సత్యము నిర్వచించి తథాగతులు ప్రజలకు మార్గదర్శకు లవుతారు. సర్వజ్ఞులను ఎవరు పరిహాసించ గలరు! సజ్జనులను దూషించేవా రెవ్వరు! ఆత్మనిగ్రహము సన్మార్గగమనము శుద్ధచిత్తము అవసరమైన వని మాగురూపదేశము!"

ఖేమాదేవి

మీ గురువును నేను నిందించను. ఇంత ప్రజాఆఘోషణ పడితే ఊరికే పోతుందా?

బింబిసారుడు

నీ మనస్సు ఇవ్వాళ సరిగా లేదు. నీ తియ్యని మాట లేవీ? ప్రజాశాసనభారము భరించడానికి కుసుమసుకుమారమైన నీ మనస్సు సమర్థము కాదు. అది నా దీర్ఘభుజాదండముల మీద వదిలిపెట్టి నిశ్చింతగా ఉండు. నీ సంగీతమేదీ, ఒక్కసారి వినిపించు. రాగాలాపనతో నీ మనస్సులో రసోద్గారము అవుతుంది.

ఖేమాదేవి

నా కింకా సంగీత మెందుకు, ఈ అలంకారా లన్నీ ఎందుకు! మహారాజుకూ నాకూ అల్పకాలములోనే వియోగము కలగబోతున్న దని నాకు భయంగా ఉన్నది. మీ నీడ లేనిది నిలవ లేను, స్వామీ!

బింబిసారుడు

నీ కెందుకా వెఱ్ఱిభయము! నేను 'ఉపాసకు' డనే కదా!

ఖేమాదేవి

ఇవ్వాళ ఉపాసకులైనవారే రేపు భిక్కు లవుతున్నారు. మిమ్ము సంతోషపెట్టడానికి రోజు రోజు కొత్తరీతిగా కనపడుతున్నానే; అనుదినమూ నూతనత్వముకోసము ప్రయత్నించి నా మనస్సు మూర్ఛమాన మవుతున్నదే; ఇకముందు భిక్కునీవేషము ధరించి మిమ్మును సంతోషపెట్టవలసి వస్తుందేమో!

బింబిసారుడు

ఆ కల! ఆ కల! [శిరస్సు ధ్యానాభినయంతో పైకెత్తి] భగవన్! నేనేమి చేయవలె!

ఖేమాదేవి

మీ గురువును పూజించి అతిథిగా ఆహ్వానించి అర్చించినప్పుడు నేనేమైనా అన్నానా? అతి సుందరమైన 'వేణువనము' భిక్కుల నివాసార్థము దానము చేసినప్పుడు కాదంటినా? స్త్రీదూషణము చేసే గౌతముని దర్శించ వద్దని మిమ్మును ప్రార్థించినానా? లోకములోని సమస్త సౌందర్యమూ నిరసించే మీ గురువు సౌందర్యశత్రుత్వము తీవ్రముగా ఖండించినానా? 'ఉపాలి' 'అంబాపాలి' మొదలైన నీచజాతుల మిత్రుడైన మీబుద్ధుని సాంగత్యము ఎప్పుడైనా కూడ దన్నానా? చివరకు మీరు యజ్ఞభంగము చేసుకున్నప్పుడుకూడా నేను సమస్తమూ మీకే వదిలి ఊరుకున్నాను. కాని నాఓర్పుకు అంతము లేకున్నది.

బింబిసారుడు

ఖేమా, ఎందుకీ తొందర! ఇటువంటి తలంపులే ద్వేష కారణాలు. ద్వేషము పాపకారణము. అందువల్లనే మానవులీ కర్మచక్రంలో చిక్కుపడుతున్నారు. అదే దుఃఖకారణము. నీ నిసర్గసారళ్యము ఈనాడు ఏమైనది, దేవీ!

ఖేమాదేవి

శాక్యగౌతముని ధర్మము మీ మనస్సులో గాఢముగా నాటుకున్న తర్వాత ఈదాసురాలిమీద ఆదర మెట్లా ఉంటుంది! మీరుకూడా 'ఉపసంపద' స్వీకరిస్తారనే వదంతి!

బింబిసారుడు

నా కాభాగ్య మేదీ!

ఖేమాదేవి

వేణువనములో గృధ్రశిఖరముమీద గౌతముడు నివసిస్తున్నందుకు పిట్టలవంటి ప్రజల నందరినీ తన గర్భములో ఉంచుకుంటున్నాడు. ఉన్నట్లే ఉండి 'ఉరువేల కశ్యపుని' 'సంజయు'ని శిష్యులైన 'ఉపాతిశు'ని 'సరిపుత్రుని' శిష్య సహస్రములతో సహా తన మతములోకి మార్చుకున్నాడు. అటు తండ్రి కపిలవస్తుకు పిలవనంపితే కుర్రవాడైన 'రాహులుణ్ణి' కాక యౌవరాజ్యాభిషేకమూ నూతన గృహ ప్రవేశమూ వివాహమూ ఒక్కనాడే కాబోతూఉన్న 'నందు'ని కూడా పరివ్రాజకుణ్ణి చేసినాడు. చివరకు 'యశోధరా', 'ప్రజాపతీ' దేవులకు కూడా సన్యాస మిప్పించినాడు. ఇప్పుడా మహాగృధ్రము దృష్టి మగధ మహారాజు మీదనే వాలినదని తెలియవస్తున్నది. అందుచేతనే నాకీదుస్స్వప్నాలు వస్తున్నవి.

బింబిసారుడు

ఇందరు ఉత్తములూ బుద్ధమతావలంబులు అవుతున్నారంటే ఆ మహాత్ముని బోధల లోకాతిశాయిత్వమే సిద్ధాంత మవుతున్నది. కాని ఖేమా, 'మహాశ్రమణు'ని ధర్మము ఆశ్రయించే వాళ్లంతా భిక్కులు కావలె ననుకుంటున్నావేమో! అది సరి కాదు. ఉపాసకులు కూడా ఆర్యాష్టాంగమార్గ మవలంబించి తద్వారా ఉపాదానాలు వర్జించి దుఃఖనిరోధము చేయగలరు. నీ ప్రేమపాశములో చిక్కుపడి నీ కాటుక కన్నుల అజ్ఞకు లోబడి నీ సౌందర్య పిపాసతో నిరంతరమూ తృషితుడనైన నేను సంసారము త్యజించగలనా? నీవు నా మోహినీ దేవతవు, దేవీ!

ఖేమాదేవి

రాజా, మీరింత అలంకార ప్రియులుగదా, శిరోముండనము చేసుకొని ఎప్పుడూ ఒకటే రీతిగా పీతాంబరము ధరించి సర్వాలంకార విముఖుడైన శాక్యపుత్రుణ్ణి ఎలా సేవించ గలుగుతున్నారు?

బింబిసారుడు

సౌందర్యము జుట్టులో కట్టులో లేదు. అది ఆత్మలో ఉంటుంది. కాని బుద్ధునికి కేశహీనతా పీతాంబరధారణమూ అలంకారప్రాయములుగా ఉంటవి.

ఖేమాదేవి

స్వామీ, మీ కింత సౌందర్యపిపాస ఉన్నదే, కురూపి ఐన గౌతముని దగ్గరకు పోయి నమస్కరించి ఎలా నిలవగలుగుతున్నారు?

బింబిసారుడు

సౌందర్యమూ యౌవనమూ నిత్యమైనవి కావు. ఐనా తథాగతుడు దివ్యమంగళ విగ్రహుడు.

ఖేమాదేవి

దేవా, మీకు కామినులయం దింత అనురాగమే, స్త్రీవిరోధి ఐన గౌతముని ఉపదేశవాక్యము లెట్లా సావధానముగా ఆలకించ గలుగు తున్నారు?

బింబిసారుడు

బుద్ధునికి విరోధమూ ద్వేషమూ అసలే లేవు. కాని తృష్ణ అభివృద్ధి చేసి, ఈ లోకము నిత్యమనే భ్రాంతి కలిగించి దుఃఖమయమైన జన్మచక్రములో మానవుణ్ణి తిప్పుతూ ఉన్న మహాశక్తి అని స్త్రీకి దూరముగా ఉండవలసినదని మాత్రము భగవానుడు ఉపదేశిస్తాడు.

ఖేమాదేవి

మహాత్మా, మీరు రాజాధిరాజులైన చక్ర

వరుసే, అనంతకోటి సామంతరాజులు మీకు సప్రణామముగా కానికలు పంపుతున్నారే, తనకున్న స్వల్పరాజ్యముకూడా వదులుకొని దేశ దేశములా తిరుగులాడుతున్న మాయాదేవీ పుత్రునికి మీరుఎలా సాష్టాంగదండప్రణామము చేయ గలుగుతున్నారు ?

బింబిసారుడు

రాణీ, బుద్ధుడు 'ధర్మరాజు'. ఆమహాత్ముడు 'మారు' నే జయించినవాడు. సురేంద్ర బ్రహ్మలకే పూజ్యుడైన ఆమహానుభావుని సేవ వల్లనే నారాజ్యముతో సహా నేను చరితార్థుడను కాగలను.

ఖేమాదేవి

నాథా, మీ రింత ఐశ్వర్యశాలురే, ఇంత విలాసప్రియులే, ఆ భిక్షుకుని ఎట్లా పూజిస్తున్నారు ?

బింబిసారుడు

దేవీ, తథాగతుణ్ణి భిక్షు వంటున్నావా ? లోకాలకు నిర్వాణ భిక్ష పెట్టిన మునీంద్రుడే భిక్షువా ? 'దశపారమితము' లలో సిద్ధిపొందిన బుద్ధునికంటె అధికమైన ఐశ్వర్యశాలి ఎవరు?

ఖేమాదేవి

మహారాజా, మీ రింత దయార్ద్ర హృదయులు గదా, వంశము లన్నీ నిర్వంశములై క్షీణిస్తూ ఉంటే ఎట్లా చూస్తూ ఊరుకో గలుగుతున్నారు? ఆశాక్యునికి దయ లేదు.

బింబిసారుడు

శాక్యముని కరుణా సముద్రుడు, దయానిధి.

ఖేమాదేవి

గౌతముడు మన రాజ్యము విడిచిపోతే గాని మనకు శుభము కలగనేరదు. యజ్ఞదీక్ష సరిగా జరగడమే లేదు. దేవతలు కోపిస్తారు.

బింబిసారుడు

ఖేమా, సమస్త శుభప్రదుడైన తథాగతుని సమాగమనముకంటె వేరే శుభ మేమున్నది! ఏ మహాత్ముణ్ణి ప్రీతుణ్ణి చేయవలె నని ఇంద్రాదు లందరూ ప్రయత్నిస్తూ ఉన్నారో ఆ బుద్ధదేవుడే మనకు అతిథిగా ఉన్నప్పుడు మనకు రాగూడని సంపత్తు ఏ మున్నది! భగవానుడు మనరాజ్యములో అడుగుపెట్టి నప్పటినుంచీ దేశ మంతా ఎంత సుభిక్షముగా ఉంటున్నదో నీకు తెలియదూ ?

ఖేమాదేవి

మహారాజా, ఈవిధముగానే ఎల్లప్పుడూ ఉంటుందని నమ్మరాదు.

బింబిసారుడు

ఎందుకు నీ కింత అనుమానము! భగవానునిసేవకై దేశదేశాల ప్రజలూ వస్తున్నారు. ఆయన దివ్యతేజస్సు చూచినమాత్రానే ఎవరికి గౌరవ భావము కలగకుండా ఉంటుంది! ఒక్కసారి చూసి పో! నీవు నాప్రియమైనదేవివి కాదూ! ఇతర రాణు లంతా నే నడగకుండానే వచ్చి పూజించి వెళ్లలేదా ?

ఖేమాదేవి

ఈదేవికూడా బుద్ధదేవుని దర్శిస్తే మహారాజుకు ఇతరరాణులవంటిదే అవుతుంది.

బింబిసారుడు

నీవు ఇతరరాణులవంటిదానవు కావు. నీవే బుద్ధదేవుణ్ణి శరణు చొచ్చితే ఇప్పటికంటె సహస్రగుణముగా మాన్యురాల వవుతావు. నా మాటలు నమ్ము!

ఖేమాదేవి

ఈ దాసురాలిని మన్నించండి. సుందరపదార్థములు తప్ప ఇతరము నేను చూడలేను స్వామీ! కేశహీనులను చూడ నని నా దీక్ష.

బింబిసారుడు

ఖేమా, 'సత్కాయదృష్టి' తో కూడిన ఈ వెర్రిమాటలు విడిచిపెట్టు! గర్వము వర్జించు, అది బాధాకారణము. భగవానుని ఉపదేశములు ఒక్కసారి విని పో! ఇది చాలా మంచి రోజు!

ఖేమాదేవి

మీ తథాగతుని ఉపదేశములు విన్నందువల్ల ఏమి లాభము! లోక మంతా దుఃఖమయ మని చెప్పుతూ, దుఃఖ నిరోధము కలిగిస్తా

నని సంసారు లందరిచేతా గోలపెట్టిస్తున్నాడు. సుందరమయి హృదయంగమమయి సర్వవిధములా సుఖప్రదమయిన ఈ లోకయాత్ర దుఃఖమయ మని చెప్పి నవ్వేవారికి ఏమువు తెప్పించడమే గదా మీ గురువుగారు చేస్తున్న మహత్కార్యము! కాటిక తీర్చి కాంతులు వెదజల్ల మని బ్రహ్మదేవుడు నా కీ కళ్లు ప్రసాదించినాడు కాని కన్నీళ్లు విడవడాని కని ఇయ్యలేదు.

బింబిసారుడు

ఈ పూట నామాట లెక్క చెవిని పెట్టవు. తథాగతుణ్ణి దూషిస్తున్నావు! సరే కాని ఆమహాత్ముని ఉపదేశము మాత్రము మనస్సులో ఉంచుకో!

'సబ్బ పాపస్స అకరణం
కుశలస్స ఉపసంపదా
సచ్చిత్త పరియోదపానం
ఏతం బుద్ధాను శాసనమ్!'

నమో తస్స భగవతో అరహతో సమ్మా సంబుద్ధస్స!

[బింబిసారుడు నిష్క్రమిస్తాడు. తెరపడుతుంది]

రెండవ రంగము.

[బింబిసారమహారాజు తన మందిరములో ఆసనముమీద కూర్చుని చింతామగ్నుడై ఉన్నాడు. మధ్యాహ్న సమయము. ప్రవేశము విదూషకుడు]

విదూషకుడు

ఇట్లా ఉన్నారేం మహారాజా ఇవ్వాళమీరు? నిద్రపోతున్నారా? లేదే. [వినపడీ వినపడకుండా] ఈరోజుల్లో స్త్రీ పురుషుల కందరికీ సంసారాలమీద విరక్తి పుట్టుతున్నది. పెద్దల కాలంలో వార్ధక్యంలో మునివృత్తి అవలంబించడమో మరణశయ్యమీద సన్యసించడమో ఉండేది. ఇప్పుడు మీసాలు రానివాళ్ళు కూడా సన్యసిస్తున్నారు. ప్రియురాలు భిక్కుని విన పురుషునివల్లే ఉన్నారేం మహారాజావారు?

బింబిసారుడు

[చివరమాటలకు చివాలున తల ఎత్తి] ఏమంటున్నావు?

విదూషకుడు

ఏమీ లేదు. మీరు నిద్రపోవడం లేదన్నాను.

బింబిసారుడు

అది కాదు. సంసారాలసంగతి సన్యాసాల సంగతి ఏదో అన్నావు!

విదూషకుడు

అదా? అట్లా చెప్పండి. బుద్ధభగవానులు గారు మనరాజధానిలో వేంచేసిన దాదిగా యావజ్జనమున్నూ జ్ఞానమార్గంలో ప్రవేశించి తుచ్ఛమై క్షణికమయిన ఈ జగత్తున్నూ ఇందలి సంపత్తున్నూ తృణప్రాయంగా పరిగణిస్తున్నారు! కాని ఈ అజ్ఞానికి అజ్ఞానం ఇంకా కలగలా! నాకు సంసారమంటేను మహారాజావా రంటేను అభిమానం ఇంకా వదలలా!

బింబిసారుడు

అంతేనా! సరే కాని ముందు కూచో, నీతో ఒకమాట మాట్లాడవలె! [విదూషకుడు కూచుంటాడు] ఈ లోక మంతా దుఃఖమయం కాదూ?

విదూషకుడు

అట్లా సెలవిచ్చారేం మహారాజావారు? నాకు మాత్రము వేరే విధంగా తోస్తున్నది. నవ్వు, లోకమంతా నవ్వు — అని.

బింబిసారుడు

నీ కది వృత్తి కాబట్టి నీ కట్లా కనపడుతుంది. సరే! నీవు చాలా తెలివిగలవాడి వంటావు కాదూ?

విదూషకుడు

మా శాస్త్రములో నేను పారంగతుణ్ణి. కావలెనంటే పరీక్ష చేయవచ్చు. నవ్వు అష్టవిధాలు, మీ అష్టాంగమార్గం వల్లెనే! — స్మితము హసితము, విహసితము —

బింబిసారుడు

నీ తెలివితేట లన్నీ క్షేమాదేవివద్ద నిష్ఫలమేగా!

విదూషకుడు

క్షేమాదేవివద్దనా? రాణి అంటే మహారాణి ఆమె! లోకంలో తక్కిన రాణులంతా ఆమె పాదాలముందు పారాణులు! ఆమె నవ్వితే

ముత్యాలు ఒలుకుతాయి! ఆమెకు నేనంటే ఎంత గౌరవము. ఎంతవాత్సల్యము, ఎంత ఆదరము!

బింబిసారుడు

నీ తెలివితేటలవల్ల ప్రయోజన మేమున్నది! ఆమె నొక్కసారి వాళ్ళో బుద్ధదర్శనానికి రప్పించ లేకపోతివి!

విదూషకుడు

మహారాణి ఇంకొకరి దర్శనానికి వెళ్లుతుందా! ఆమె దర్శనానికి ఇతరులు వెళ్లవలె!

బింబిసారుడు

ఆమెయందు నాకున్న అనురాగాతిశయం వల్లనే ఆమెకూడా తథాగతుణ్ణి అర్చించి కృతార్థురాలు కావలె నని నా వాంఛ!

విదూషకుడు

క్షేమా మహారాణికి ఏమికొదవ! ఆమె నాలిక మీద వాగ్దేవి తాండవ మాడుతుంటుంది. సాక్షాత్తు రతీదేవి అవతారము. మీకు ప్రియ తమురాలు!

బింబిసారుడు

ఓయీ, సిరి సంపత్తు ఎంతఉంటే ఏమి లాభము! క్షేమాదేవి కాలమంతా తనదేహాన్ని అలంకరించుకోవడంతోనే వెళ్ళబుచ్చుతున్నది. నిర్వాణామృతము ఆమె సాధించేదిక ఎప్పుడు? తామరాకుమీది నీటిబిందువువలె జీవితము చంచలము కాదూ!

విదూషకుడు

ఐతే మీ మిత్రశిఖామణి నైన నా సంగతి ఏమంటారు మహారాజా? నేను కూడా భిక్షునై నిర్వాణామృతం సాధించేదా?

బింబిసారుడు

అవశ్యం!

విదూషకుడు

బాగానే ఉంటుంది. నేనే భిక్షువేషము వేసుకుంటే నా ఉద్యోగమూ వృత్తీ సార్థక మవుతవి. ఐతే అప్పుడు నా ఇష్టము వచ్చినట్లు నవ్వనీయరేమో, మరి!

బింబిసారుడు

సరే కాని క్షేమాదేవిని బుద్ధదర్శనానికి రప్పించ లేవా?

విదూషకుడు

నాకు చేతకాని పని ఏమున్నది కాని, ఈపని నాకేమాత్రమూ ఇష్టం లేదు. నేను వ్యర్థుణ్ణి అనుకున్నారేమో! మాశాస్త్రంలో నే నెంత పరిశోధన చేస్తున్నా ననుకున్నారు! ఈప్రాచీన గ్రంథాలు పరిశోధనచేయడంతో నామతికూడా పోతున్నది.

బింబిసారుడు

[చిరునవ్వుతో] అది కనబడుతూనే ఉన్నది. కాని నాపని ఏమంటావు!

విదూషకుడు

నవ్వు లనుకుంటున్నారేమో! పురాతన గ్రంథాలు పరిశోధన చేసి సారాంశాలు ఈ గ్రంథంలో వ్రాస్తున్నాను. చదివి వినిపించేదీ! వద్దులే అంటారా! ఎందుకూ, శాస్త్రవిష యాలు వినడానికి విసుగు పనికిరాదు. ఇప్పుడు చదివి వినిపిస్తా ఉండండి! [పుస్తకం తెరవ బోతాడు.]

బింబిసారుడు

ఇప్పుడు వద్దు, తర్వాత వింటాలే!

విదూషకుడు

తర్వాత ఎందుకు, ఇప్పుడే చూడండి! విదూష కుడికి పనిలే దనుకుంటున్నారేమో! మీ ప్రధాన మంత్రికికూడా ఇంత పని ఉండదు.

బింబిసారుడు

నిజమే కాని నీ విద్వాళ నా ప్రధాన మంత్రివి కావలె!

విదూషకుడు

అవశ్యంగా. తమరు ఆజ్ఞాపించడమూ నేను కాదనడమునా? దేవరవారి ఇష్టప్రకారము ప్రధాన మంత్రిని కావడానికి సమ్మతించాను.

బింబిసారుడు

సంతోషము! క్షేమాదేవి బుద్ధద్వేషిణి అని నీకు తెలుసునుగా!

విదూషకుడు

ఆహా ! ఆమహారాణి ఉత్తమోత్తమురాలు !

బింబిసారుడు

జరిగినరాత్రి ఆమె భిక్షుని వినట్లు కలగన్నది.

విదూషకుడు

[చెవులు మూసుకొని] అప్పైన నేను వినలేను. ఆమె ఆ ? — అంత చక్కనిది, అంత సాధ్వి, ఆమె ఆ ? — నే నాలాంటి మాటలు వినలేను.

బింబిసారుడు

ఇలాంటి మాటలే వినలేకపోతే నాకు మంత్రిత్వము ఎలా చేస్తావు ? ఆమెకు భిక్షులంటే ఉన్న అసహ్యముచేత అటువంటి కల కన్నది. అంతేకాని మరేమీ ఉపద్రవం లేదు. ఆకలవల్ల ఆమె మనస్సు వ్యాకులపాటు చెందింది.

విదూషకుడు

అయ్యో, అయితే నే నా మహారాణి దర్శనానికి వెళ్లుతాను. నన్ను పోనీయండి ! [వెళ్లబోతాడు]

బింబిసారుడు

[నెమ్మదిగా] ఇక నివ్వాళ నాపనికి ఎగనామము పెట్టదలచినట్లున్నాడే ! [ఎప్పటివలె] వెళ్లుదువుగానిలే, ముందు నీ మంత్రి కార్యము వినిపో!

విదూషకుడు

ఐతే త్వరగా సెలవియ్యండి, మహారాజా !

బింబిసారుడు

ఆమెను ఈరోజే 'మహాశ్రమణుణ్ణి' అర్చించడానికి రప్పించవలె ! ఇవ్వాళ మహాశుభదినము. నాప్రియత్నము నిష్ఫలమైంది. ఆమెకు కేశహీనులను చూడనని ప్రతిజ్ఞ !

విదూషకుడు

శేష్ ! అంతకంటె ఆమె చేయదగిన దేమున్నది!

బింబిసారుడు

ఆమె తథాగతపూజకు వచ్చేట్లు చేయవలె.

విదూషకుడు

బాగానే ఉన్నది మహారాజా ! ఆమె కన్న కల కాస్తా నిజము చేయవలె నని మీ కోరికా ఏమిటి !

బింబిసారుడు

నోరు మూయి, నేను చెప్పిన దేమంటావు ?

విదూషకుడు

నా కాపని చేతకాదు. ఈ కార్యము సాధించమని ఇప్పటికి నన్ను చాలాసార్లు అడిగినారు. చాలాసార్లు మన ప్రియత్నాలు నిష్ఫలమైనవి.

బింబిసారుడు

నిన్ను మంత్రిని చేసుకున్నప్పుడుకూడా పని సానుకూలం కాకపోతుందా ?

విదూషకుడు

నన్ను మహారాజావారు 'మంత్రి' అన్నారు కాదూ ! నే నిప్పుడు విదూషకుణ్ణి కాదు, 'మంత్రి'ని ! ద్వారంలోకి వెళ్లితే ద్వారపాలకు లంతా ఇక వంగి వంగి నమస్కారాలు చేయవలసిందే ! నవ్వితే కొరడా దెబ్బలు కొట్టిస్తాను. [లేని మీసము మెలివేయడము అభినయిస్తున్నాడు.]

బింబిసారుడు

అవును, నీ విప్పుడు 'మంత్రి' వైనావు.

విదూషకుడు

[కొంచెము ఆలోచించి] ఎబ్బే, మంత్రి నై లాభము లేదు. నన్ను సేనాపతిని చేస్తే కార్యము నిర్వహించ గలను !

బింబిసారుడు

అట్లాగే నన్ను సేనాపతిని చేసినానులే. పని సాధించు.

విదూషకుడు

ఐతే దండనాయకు లంతా నేను చెప్పినది చచ్చినట్లు వినవలసిందేనా ?

బింబిసారుడు

ఆహా ! ఐతే నీవు క్షేమారాణి అంతఃపురము మీద దండెత్తవు గదా ! అక్కడి భటులు నీ తల నరుకుతారు.

విదూషకుడు

మహారాజా, మన రాజధానిని ఎవరన్నా ఇప్పుడు ముట్టడిస్తే ఎదిరించేందుకు మనసైన్యాలు ఎక్కడెక్కడ ఉన్నవి ?

బింబిసారుడు

'రాజగృహము' చుట్టూ ఉన్న పర్వతా

లన్నిటిమీదా ఉన్నవి. వాటి నన్నిటినీ ఇప్పుడు రప్పిస్తావా ఏమిటి ?

విదూషకుడు

అవును, శత్రువులు వస్తే రప్పించవద్దూ మరి ! అన్నిటిమీదా సేన లున్నవా ?

బింబిసారుడు

ఆహా !

విదూషకుడు

గౌతమముని ఇప్పు డుంటున్న దెక్కడ ?

బింబిసారుడు

శైలగిరిమీద వేణువనంలో.

విదూషకుడు

అక్కడకూడా సైన్యా లున్నవా ?

బింబిసారుడు

ఆ.

విదూషకుడు

అయితే ఆ పర్వతము మీద కత్తులూ కఠారులూ పట్టుకుని రాజభటవేషము వేసుకున్నవాళ్లు నా కెప్పుడూ కనపడలేదేం ?

బింబిసారుడు

అక్కడ సైనికులు ప్రచ్ఛన్నంగా ఉంటారు.

విదూషకుడు

ఇప్పుడు శత్రువు లకస్మాత్తుగా రాజగృహము ముట్టడిస్తే ముందు ఏపర్వతము మీదికి ఎక్కవలె నని ప్రయత్నిస్తారు ?

బింబిసారుడు

నిజము తెలియక పోతే శైలగిరిమీదికి ఎక్కడానికి ఉద్యమిస్తారు.

విదూషకుడు

అప్పు డే మవుతుంది ?

బింబిసారుడు

అబ్బా, ఈ గోలంతా ఎందుకు ?

విదూషకుడు

మీ సేనాపతికి జవాబు చెప్పరూ ?

బింబిసారుడు

[విసుగుతో] సరే. మన సేనలు ఎదిరిస్తవి.

విదూషకుడు

ఐతే మహారాజువారు రణనీతివిశారదులే.

బింబిసారుడు

నన్ను తర్వాత స్తోత్రము చేతువుగాని. కాని ముందు నాకు కర్తవ్యము చెప్పు.

విదూషకుడు

ఇంత రణకోవిదులుకదా మీరు, ఈ విద్య అంతా మీరు ఉపయోగించుకోరేం ?

బింబిసారుడు

ఇప్పుడెందుకు, శత్రువులు దండెత్తి వచ్చినప్పుడుగా. ఐనా నీవుండగా నాకెందుకు శ్రమ!

విదూషకుడు

ఐతే మీకు శాస్త్రమే తెలుసును గాని దాని ప్రయోగము తెలియదు. ఇందులో సేనాపతి మాట వినండి. ఇప్పుడు ఖేమాదేవిని బుద్ధదర్శనానికి రప్పించవలె కాదూ ?

బింబిసారుడు

అబ్బా, సోది చెప్పుతావేం !

విదూషకుడు

మహారాజా, తొందరపడితే శత్రువులకు జయం కలుగుతుంది. యుద్ధసమయంలో రాజుకు ఓర్పు ఉండవలె. మహారాజు తొందరపడినా సేనాపతి శాంతించవలె.

బింబిసారుడు

సరేలే.

విదూషకుడు

ఖేమాదేవికి వనవిహార మంటే ఇష్టమే కాదూ ?

బింబిసారుడు

ఆమెకు వనవిహార మంటేనూ పుష్పాపచయ మంటేనూ వర్ణించలేనంత ప్రీతి.

విదూషకుడు

వేణువనము విహారయోగ్యమైనదే కాదూ ?

బింబిసారుడు

అవును. నా ఉద్యానవనాలల్లో అది మనోహరమైనది. అది భగవానునికి అర్పించినానుగా !

విదూషకుడు

మహారాణితో కలిసి మహారాజుగారు ఇవ్వాళ వేణువనవిహారము చేయరాదూ ?

బింబిసారుడు

బుద్ధదేవు డున్నందువల్ల వేణువనంలో ఖేమా

దేవి అడుగు పెట్టదు.

విదూషకుడు

ఇప్పుడు శత్రువులు ముట్టడిస్తే వాళ్లు శైలగిరి మీదికి ఎక్కరూ ?

బింబిసారుడు

ఎక్కుతారు కాని మన సేన లక్కడకూడా ఉన్నదని తెలుస్తే ఎక్కరు.

విదూషకుడు

ఇక్కడా అంతే! బుద్ధభగవానుడు వేణువనంలో లేడని తెలుస్తే మహారాణి విహారార్థము అక్కడికి రాదూ ?

బింబిసారుడు

రాకేమి! భగవానుడు 'శ్రావస్తి' లో ఉన్నాడన్నా ఆమె వేణువనములో విహరించడం లేదా !

విదూషకుడు

భగవానుడు వేణువనంలో లేనట్లుగా ఖేమా దేవికి నచ్చచెప్పేభారము నాది. ఆమెతో విహారార్థము వెళ్ళి భగవానుడు ఉండేవైపుకు సెమ్మదిగా తీసుకొని వెళ్లండి! — మీ సేనాపతి సరిగా మంత్రము ఉపదేశించినాడా! నా బహుమానం మరిచిపోవద్దు మహారాజా! — బీదబ్రాహ్మణ్ణి, సంసారం పెద్దది —

బింబిసారుడు

కార్యసాఫల్యము కానీ, అట్లాగేలే. అంతఃపురంలోకి వెళ్ళి సేనాపతి నని చెప్పుకుంటే అక్కడి భటులు నీ తల తీసివేస్తారు సుమా!

విదూషకుడు

నా కేం భయము లేదు. కత్తి పట్టుకొని ఎవరన్నా మీదికివస్తే సేనాపతిని కాదు విదూషకుణ్ణి అని మొరపెట్టుకుంటాగా!

[తెర పడుతుంది]

మూడవ రంగము.

[వేణువనములో దట్టమైన వెదురు పొదరింటిలో ఖేమాదేవితో బింబిసారుడు కూర్చుని మాట్లాడుతున్నాడు. సాయంత్రము జాము పొద్దుకూడా లేదు.]

ఖేమాదేవి

కాస్త ఆగండి మహారాజా! — అది వినండి!

బింబిసారుడు

[మాట్లాడుతున్నవాడు నివ్వెరపోయి ఆగి] ఏమున్నది ?

ఖేమాదేవి

కిన్నరులూ గంధర్వులూ ఎవరో మహాపురుషునికి మంగళహారతులు పాడుతున్నారు. ఎంత శ్రావ్యంగా ఉన్నదా పాట! నృత్యము చేస్తున్న శబ్దముకూడా వినబడుతున్నది. ఆలకించండి.

బింబిసారుడు

ఆ పాడేది గంధర్వులూ కారు, కిన్నరులూ కారు, యక్షులూ కారు. సరస్వతీనది మీదినుంచి వచ్చే సాయంకాల వాయువు వేణురంధ్రాలలో ప్రవేశించి తన సహజసంగీతము పాడుతూ నృత్యము చేస్తున్నాడు! అంతే!

ఖేమాదేవి

అంతేనా! మధ్యమధ్య నా కేవో జయధ్వనులు కూడా వినిపించినవే.

బింబిసారుడు

జయధ్వను లెక్కడివి! అది నీ కేదో చిత్తవిభ్రాంతి! ఇప్పుడే చిలకలగుంపు ఒకటి అరుస్తూ పారిపోయింది.

ఖేమాదేవి

ఈ వెదురు పొదరింటిలో అకాలముగా చీకట్లు కమ్ముతున్నవి. అప్పుడే సంధ్యాకాల మైనట్లు తోస్తున్నది. ఇంకొక చోటికి పోదామా!

బింబిసారుడు

ఐతే మామిడితోటలోకి వెళ్లుదామా! [ఉపక్రమిస్తారు.]

ఖేమాదేవి

కాస్త ఊకొమ్మ అందించండి రాజా! [రాజు అందిస్తాడు. మామిడి ఇగుళ్లూ పూలూ కోస్తుంది.]

బింబిసారుడు

ఆ మామిడి ఇగుళ్లలోనూ పూలల్లోనూ నీచేతి వేళ్లూ గోళ్లూ కలిసి పోయినవి. ఆ కోకిల చూడూ, విరుగు లేకుండా ఎలా గొంతు చించుకుంటూ అరుస్తున్నదో!

ఖేమాదేవి

లోకంలో ఉన్న వియోగదుఃఖమంతా ఆధ్వనిలో మూర్తీభవించినట్లుగా వినిపిస్తున్నదేం?

బింబిసారుడు

పంచమస్వరంలో నీకు దుఃఖధ్వని వినబడుతున్నదా!

ఖేమాదేవి

అదే చిత్రము!

బింబిసారుడు

ఆ కోకిల ఒంటరిగా ఉన్నది కాబట్టి నీ కట్లా తోచిందేమో!

ఖేమాదేవి

ఏమో మరి! అవతలికి పోదామా?

[ఇద్దరూ ఉపక్రమిస్తారు]

బింబిసారుడు

ఈ మాధవీలత ఉయ్యాలమీద ఎక్కు, నిన్ను ఊపుతాను!

ఖేమాదేవి

[ఉయ్యాల ఎక్కి] మీరు కూడా ఎక్కండి మరి! [అని చోటు చేస్తుంది]

బింబిసారుడు

నే నెక్కను. నీదేహమువల్లనే ఈ తీగకూడా అతి సుకుమారంగా ఉన్నది. ఎక్కడ విరిగి పోతుందో అని భయం! నీకూ ఈతీగకే లత కుదిరింది.

ఖేమాదేవి

మహారాజా వంది మాగధులలో మీకు వంది ఉద్యోగము ఇస్తే సరి పోతుంది!

బింబిసారుడు

రాణీ, నీ ఆస్థానంలో నేను వందిని కాదూ! ఊపేదీ?

ఖేమాదేవి

నెమ్మదిగా! [రాజు నెమ్మదిగా ఊపుతుంటాడు] మహారాజా ఆగండి, ఇవ్వాళ అప్పుడే నా కళ్లు తిరుగుతున్నవి.

బింబిసారుడు

ఈ మాత్రానికేనా? నాకు ఉయ్యాల ఊపే ఊడిగమిచ్చి అంత త్వరలోనే ఉద్యోగము చాలించుకో మంటావా!

[మళ్లీ ఊపుతాడు]

ఖేమాదేవి

ఊగలేను స్వామీ, ఏమో పైత్యముగా ఉన్నది. [మహారాజు కంఠాశ్లేషము చేసుకొని కిందికి దిగుతుంది]

బింబిసారుడు

ఐతే ఏం చేస్తాను! నా వంది ఉద్యోగము నీవు తీసివేయ లేవుగా!

ఖేమాదేవి

మహారాజుగారి కేమి సరస తండీ!

బింబిసారుడు

ఐతే ఆ సరోవరతీరానికి వెళ్లుదామా? ఆ మంచిగంధపు చెట్టునీడను చల్లగా ఉంటుంది.

[ఉపక్రమించి సరోవరతీరాన కూచుంటారు]

బింబిసారుడు

నీకు పైత్యముగా ఉన్న దన్నావు. నాకూ ఎండవల్ల కొంచెము తాపముగా ఉన్నది. ఇందులో జలక్రీడ లాడుదామా?

ఖేమాదేవి

ఈ ఎండకేనా తాపము? [నవ్వుతూ] జలక్రీడకోసము తాపముకూడా కల్పించినారే! కవిత్వము కూడా వస్తున్నదే. ఎంత ప్రజ్ఞ మీది మహారాజా!

బింబిసారుడు

నీ సరసు నుంటే ఎంత ప్రజ్ఞఐనా పుట్టుకొని వస్తుంది! ఏమంటావు!

ఖేమాదేవి

మహారాజు మాటకు కాదనను కాని ఈమాటుకు నన్ను క్షమించలేరూ! ఏమో అందుకు మనస్సు ఒప్పడం లేదు.

బింబిసారుడు

సరేలే. ఇక్కడ కూచుంటే చాలదూ!

ఖేమాదేవి

ఆ మగచక్రవాకము చూడండి, చక్రవాకిని బలవంతాన నీటిలో ఎట్లా తిప్పుతున్నదో! పురుషు లెంత కఠినాత్ము లండీ! - పరధ్యానంగా ఉన్నారేం?

బింబిసారుడు

నీ చెక్కిళ్ళవలె తేటగా ఉన్న ఈ నీటివంక చూస్తూ ఉన్నాను.

ఖేమాదేవి

ఎంత తెలివిగా తప్పించుకుంటారు మహారాజా!

బింబిసారుడు

నిజము చెప్పడానికి తెలివి ఎందుకు! పోనీ, ఆ బేడిసమీల వంక చూడు, ఎగిరెగిరి పడుతున్నవి. అవి సరిగ్గా నీవాలు కన్నులవల్లే లేవూ!

ఖేమాదేవి

నా రూపాన్ని పొగడడానికి మీ కేం విసుగులేదండీ! — మీ ముఖబింబము ఈ తేట నీటిలో ప్రతిఫలిస్తే కమల మనే భ్రాంతి కలుగుతున్నది చూడండి!

బింబిసారుడు

[చిరునవ్వుతో] ఇందాక పైత్యంగా ఉన్న దన్నావు, ఆ భ్రాంతి కొంత తగ్గుతుంది, పాద ప్రక్షాళన చేసుకురా!

[ఖేమాదేవి ఉపక్రమించి నీటిలో పాదాలు ఉంచి చేతితో నీళ్లు తీసుకోడానికి వంగబోతూ చివాలున వెనక్కు తిరిగి చూస్తుంది]

బింబిసారుడు

ఏమి టది!

ఖేమాదేవి

మీరు నన్నిప్పుడు పిలవలేదా! అట్లా పిలిచారేం!

బింబిసారుడు

నేను పిలవలేదే, అంత పైత్యంగా ఉన్నదా!

ఖేమాదేవి

'ఖేమా, ఖేమా' అని మధురంగా మృదులంగా స్పష్టంగా పిలిచినట్లు వినిపించిందే! పసితనంలో మా తల్లిగారు దగ్గరకు తీయడానికి పిలిచిన పిలుపువల్లే అమృతమయంగా వినపడ్డదే! మీరు కాదూ పిలిచింది! లేకపోతే నన్ను ఆడిస్తున్నారా?

బింబిసారుడు

అట్లా ఉలిక్కిపడుతున్నావేం? ముఖ మట్లా మారిపోయిందేం! నీటిలో దూరాన ఆహంసి కనపడడంలేదా, నీ వల్లేనే విలాసంగా నడుస్తున్నది; ఆ హంసి కూజితము విని ఉంటావు!

ఖేమాదేవి

అంత విభ్రాంతిగా ఉన్నదేం! ఇంకా నా చెవుల్లో ఆపిలుపు అమృతప్రవాహంవలె ప్రవిస్తూ ఉన్నది.

బింబిసారుడు

కొంచెము వడిగా నడుస్తూ పూలు కోసి బుట్ట నింపినావా అంటే ఆ కదలికవల్ల శరీరం స్వస్థపడుతుంది.

[ఘంటాధ్వనులు వినిపిస్తవి]

ఖేమాదేవి

అదుగో దేవాలయంలో ఘంటలు వినిపిస్తున్నవి. ఏమి శుభసూచన! భగవత్పూజకు వేళఅయింది. నేను పూలు కోస్తాను, మీరు పూలబుట్ట పట్టుకోండి. [చేతి కందిస్తుంది. ఇద్దరూ లేస్తారు]

బింబిసారుడు

రకరకాలుగా ఉండేట్లు పూలు కోయి!

ఖేమాదేవి

ఆ భారము నాకు వదిలివేయండి. [రకరకాల పూలతో బుట్ట నింపుతున్నది]

బింబిసారుడు

[రెండు గుండ్రని పూలగుత్తులు చూపి] అవి నాకు వదిలిపెట్టు! [ఖేమాదేవి వక్షస్థలము వంక చూస్తూ అవికోసి ముద్దు పెట్టుకుంటాడు]

క్షేమాదేవి

మహారాజులవారెంత విలాసప్రియులండీ, ఆహా!

బింబిసారుడు

సూర్యాస్తమయ మవుతున్నది. గృధ్రశిఖర మెక్కుదాము. అస్తమయశోభ అక్కడనుంచీ ఇంతకంటె అద్భుతావహంగా కనపడుతుంది. నీ వెన్నడూ చూడని కొత్త కొత్త పూలు కూడా దోవలో ఎన్నో ఉన్నవి.

క్షేమాదేవి

ఐతే దారి తీయండి! [ఉపక్రమిస్తారు]

బింబిసారుడు

అదుగో అశోకము - అదుగో మాధవి - అక్కడే కురవకము - ఇదుగో నవమల్లిక - నీ కుడిచేతి వానుకనే గన్నేరు - దాని పక్కనే మెట్టదామర - నీ శిరస్సుమీద పగడపూలు రాలుతున్నవి - ఈ పారిజాతపుష్పాలు అందుకో - చంద్రకాంతపూలు కోయి - సంపెంగ కనపడుతున్నదా - పొన్నపూలవే వేలాడుతున్నవి - పాదాలు నొప్పెత్తుతున్నవా?

క్షేమాదేవి

అంత లేదు. కాని మీరు చూపుతా నన్న కొత్త కొత్త పూ లేవీ?

బింబిసారుడు

నీవు కోస్తున్న పూల పేర్లన్నీ నేను చెపుతున్నానా? అదిగాక ఈపూలన్నీ ఒక్కపర్యాయము దొరకడమే కొత్త! — చాలా బడలిపోయినట్లున్నావు!

క్షేమాదేవి

బడలిక ఏమీ లేదు కాని దేహమంతా తేలితేలి పోతున్నది. ఈ గాలిలో ఏదో ఉన్నది!

బింబిసారుడు

ఏమీ లేదు. అలిసిపోయినావు పాపము! శిఖరము సమీపించింది లే. ఇక నాలు గడుగులు! — అటు సూర్యబింబమువంక చూడు!

క్షేమాదేవి

[రెండడుగులు ముందుకు వేసి] సూర్యభగవానునికీ నమస్కారము! [అని అకస్మాత్తుగా నిలుస్తుంది]

బింబిసారుడు

[విభ్రమంతో] ఆగినావేం?

క్షేమాదేవి

[నలుదిక్కులా వాసన చూడడము అభినయిస్తూ] ఎక్కడిదీ దివ్యవాసన! ఈ వాసన రుచి చూసిన తర్వాత వెనక చూసిన సువాసన లన్నీ కొరగానివనిపిస్తున్నది!

బింబిసారుడు

నాకూ ఈ వాసన ఆశ్చర్యముగా ఉన్నది. కాని నీలో ఇంత మార్పు కలిగిందేం?

క్షేమాదేవి

నాకూ విచిత్రంగానే ఉన్నది. ఎటునుంచి ఈ గంధము వస్తున్నది? [వాసన చూడడము అభినయిస్తుంది]

బింబిసారుడు

[వాసన చూడడము అభినయిస్తూ] ఆ శిఖరం మీదినుంచి కాదూ! మనము వాసనను సమీపిస్తున్నాము.

క్షేమాదేవి

నాకూ అలాగే తోస్తున్నది [నాలుగువంకలా చూస్తూ ఉపక్రమిస్తూ ఉండగా, క్షేమాదేవి చప్పున ఆగుతుంది]

బింబిసారుడు

[తత్తరముతో] మళ్లీ ఆగుతావేం! అక్కడ ఎవ్వరూ లేరులే పద!

క్షేమాదేవి

[విస్మయము అభినయిస్తూ] మహారాజా, మహారాజా! ఈ వనంలోకి ఇద్దరు అప్సరసలు విమానాలలోనుంచి అవతరిస్తున్నారుగో! వాళ్ల దేహకాంతులతో వన మంతా ఎట్లా వెన్నెలలు వ్యాపించినవో చూడండి!

బింబిసారుడు

[క్షేమాదేవి చూపిన వంక చూస్తూ ఆనంద పారవశ్యముతో] ఆహా!

క్షేమాదేవి

ఐతే ఆ కూర్చున్న దివ్యపురుషు డెవరు మహా

రాజా, — ఏమా తేజస్సు! — సూర్యుడా, నాగుడా, యక్షుడా, దేవేంద్రుడా, బ్రహ్మ దేవుడా? ఆ మహానుభావుని కా అప్సరస్త్రీలు వింజామరలు వేస్తున్నారు.

బింబిసారుడు

ఆ మహాపురుషుడు సూర్యునికంటె సురేంద్రుని కంటె బ్రహ్మదేవునికంటె — అందరికంటె ఉత్తమోత్తముడు!

ఖేమాదేవి

ఆ మహానుభావుని తేజస్సు కిరణాలు సూదుల వలె నా దేహమంతా గుచ్చుకుంటున్నవి.

బింబిసారుడు

ఖేమా, నిన్ను అలౌకిక మైన నూతనకాంతి ఆవరించింది.

ఖేమాదేవి

[శీఘ్రముగా చూపిస్తున్న వంక నడుస్తూ] దేదీప్యమానమైన ఆ దివ్యపురుషుని దే ఆ అప్సరస్త్రీల శరీరకాంతి! ఆ స్త్రీల సౌందర్యము ముందు ఈలోక స్త్రీలకు అసలు అందమున్న దనగలమా!

బింబిసారుడు

ఖేమా, ఈలోకము అనిత్య మైనది.

ఖేమాదేవి

అయ్యో! — అదేమిటి, మహారాజా! ఆ అప్సరస్త్రీల దేహకాంతుల వెన్నెల మాసి మాసి గుడ్డి వెన్నెల ఐపోయింది!

బింబిసారుడు

సౌందర్యము శాశ్వత మైనదనుకున్నావా మరి!

ఖేమాదేవి

ఇంతవరకూ నా కావిషయ మేం తెలుసును! చూడండి, ఆ శరీరాలు శోభపోయి సాధారణ మానవదేహాల వలె ఐపోయినవి! అవయవాల కున్న వర్తులత్వముకూడా క్షణక్షణమూ క్షీణిస్తున్న దేం!

బింబిసారుడు

ఈ జగత్తు క్షణికము కాదూ, దేవీ! దేహికి క్షీణించడము నైజధర్మము కాదూ! — ఖేమా, పెద్ద తుపాను రేగుతున్న మహాసముద్రము వలె ఉన్న దేం, నీ శరీర మంతా? ఒళ్ళంతా అట్లా చెమటలు దిగగారుతున్న వేం!

ఖేమాదేవి

స్వామీ, అంత దివ్యశోభలు వెదజల్లే రూపాలూ అట్లా అవుతున్న వేం! అబ్బా! చూడలేకుండా ఉన్నాను — ఎండిన ఆకులవలె వాళ్ల చర్మాలు ముడతలు పడ్డవి — ఆ నేత్రపద్మాల కాంతి పోయి పత్తికాయ లైనవి — గుత్తమైన స్తనాలు జారిపోతున్న వేమి! — బలువైన నితంబ ప్రదేశము చిక్కి శల్యావశిష్ట మవుతున్నది — స్వామీ, ఇక నే నటు వైపు చూడలేను. [కళ్లు మూసుకోబోతుంది కాని మూతపడవు] అబ్బా! [కన్నీళ్లు ఏకధారగా కారుస్తుంది]

బింబిసారుడు

ఎన్నడూ లేనిది అట్లా కన్నీళ్లు కారుస్తున్నా వేమి, ఖేమా! లోకము దుఃఖమయ మైనది. కళ్లవెంట నీళ్లు కారుతున్నా కళ్లలో అపూర్వ మైన శోభ ఏదో వెలుగుతున్నది.

ఖేమాదేవి

నే నింకొక అడుగు ముందువేయను [ఆగవలె ననుకుంటుంది కాని ఆగలేదు. ఎవరో తోస్తున్నట్లు ముందుకు పోతుంది] ఆదివ్యపురుషుని పాదపద్మాలు నన్ను బంధించి లాగివేస్తున్నవి!

బింబిసారుడు

ఆ పాదపద్మాలే అనంతకోటిలోక నివాసుల కందరికీ శరణ్యము లైనవి. అత్యుచ్ఛ్రయము పతనహేతువని పెద్ద లంటారు.

ఖేమాదేవి

నా గర్వానికి ఇంకా ఈశిక్ష చాలదా అయ్యో! ఆ స్త్రీల దవడలు పీకుకొని పోయి గుంటలుపడుతున్నవి. దంతపంక్తి ధావళ్యము పోయింది. అంతేకాదు. ఆ దంతాలు కదిలి ఒకటి తర్వాత ఒకటి రాలిపోతున్నవి. ఏమి టిదంతా మహారాజా. నామీదఉన్న అవ్యాజానురాగం చేత ఎవరో నాకు బోధచేయడముగా తోస్తున్నది!

బింబిసారుడు

ఈ లోకము మనకు రోజూరోజూ బోధచేస్తూనే

ఉంటుంది. కాని ప్రకృత సంపత్తుతో భవి ష్యత్తు సంగతే చూడకుండా ఉంటాము!

ఖేమాదేవి

నా హృదయమంతా తల్లకిందు లై పోతున్నది! అయ్యయ్యో! ఆ అప్సరసల తలవెంట్రుక లెట్లా నెరిసిపోయి ముగ్గుబుట్ట లయినవి! అబ్బా! నెరవడంకూడా చాలదు కాబోలు, పరియలు పరియలుగా ఊడి రాలిపోతున్నవి. స్వామీ —

బింబిసారుడు

ఖేమా, ఒక్కసారి భగవానుణ్ణి దర్శించినంత మాత్రానే ఇంత మారిపోయినావు! నాకు భయం వేస్తున్నదే!

ఖేమాదేవి

అంత దివ్యసుందర మైన విగ్రహాలూ ఎంత వికృతమై పోయినవి! అయ్యో! పాడుబడ్డ ఇంటి స్తంభాలవలె వాళ్ళ కాళ్ళు ఊగిసలాడు తున్నవి! ఇంకా నిలవవు! చూస్తే నాకు భయం వేస్తున్నది!

బింబిసారుడు

ఖేమా, మనకేమీ భయములేదు. తథాగతుడు అభయముద్ర ఒకచేతనూ రెండవచేత చిన్ముద్ర నూ ధరించినాడు. సమ్యక్సంబుద్ధ దర్శనము చేత మన జన్మలు సార్థక మైనవి!

[బుద్ధభగవానుడు అభయచిన్ముద్రలు ధరించి పద్మాసనము వేసుకొని నిశ్చలంగా కూర్చుం టాడు. వికృతవేషాలతో ఇద్దరు స్త్రీలు నిర్జీవంగా పడిపోయి ఉంటారు]

ఖేమాదేవి

మహారాజా, మీరు బౌద్ధ ధర్మమందిరానికి నాకు దారి చూపిన గురువర్యు లైనారు. తమరు అనుజ్ఞ ఇస్తే మహాశ్రమణుని దివ్యపా దాలు పూజిస్తాను. [పూలబుట్ట అందుకొని మోకరించి మహాభక్తితో ఒక్కొక్కపువ్వే బుద్ధ భగవానుని పాదాలమీద ఉంచుతుంది.]

బింబిసారుడు

[భగవానుని ముందు మోకరించి పూలతో తాను కూడా పూజిస్తూ] ఖేమా, చిరకాలము నుంచీ నాకున్న మనోరథము ఇప్పటికి సహస్ర గుణముగా సఫల మైనది!

ఖేమాదేవి

ఈ అజ్ఞానురాలియందు అపారమయిన కరుణ చూపిన వారు మీ రొక్కరే మహారాజా! ఇప్పటికి నాకు లోకము అనిత్య మని బోధపడ్డది. సంసారము దుఃఖమయ మనే జ్ఞానం కలిగింది. అనాత్మ స్వరూపము తెలియ వచ్చింది— రాజా, నా కిప్పు డొక్కటే కోరిక!

బింబిసారుడు

నీకు కోరిక గలగగానే నేను తీర్చినట్లే.

ఖేమాదేవి

నేను భిక్కునీ శాసనము స్వీకరించడానికి అనుజ్ఞ ఇవ్వండి మహారాజా! నాకు కావలసిన పరికరాలు దయచేయించండి!

బింబిసారుడు

[కొంతసేపు నివ్వెరపోయి త్వరలోనే మళ్లా తెలివి తెచ్చుకొని] అట్లాగే నీ ఇష్టము! జ్ఞాను లకు ఎవరు వద్దనగలరు!

ఖేమాదేవి

బుద్ధం శరణం గచ్ఛామి!

ధర్మం శరణం గచ్ఛామి!

సంఘం శరణం గచ్ఛామి!

భగవానునికి నా నమస్కారము! నాకు ఉప సంపద ప్రసాదించు, స్వామీ! నా తప్పు లన్నీ మన్నించు! నేను దశపారమితములూ అవలంబిస్తున్నాను, ఆర్యాష్టాంగమార్గగామి నవుతున్నాను. నన్ను భిక్కునీ శాసనములో చేర్చుకో దేవా!

బుద్ధం శరణం గచ్ఛామి !
బుద్ధం శరణం గచ్ఛామి !
బుద్ధం శరణం గచ్ఛామి !
ధర్మం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి

[అని బుద్ధ భగవానునికి సాష్టాంగ దండప్రణామము చేస్తుంది]

[కొంతసేపు నిశ్శబ్దము]

బుద్ధభగవానుడు

[నిశ్చలముగా] ఏహి భిక్కునీ!

[తెర పడుతుంది]

సమాప్తము

కవి — కన్య

చింతా దీక్షితులు

కవి

కవి కుమారుడ నేను కానా
కావ్య గీతము లల్ల లేనా
గీతమాలిక లంచ మిస్తే
హృదయ మిస్తావా ?

కన్య

కవి కుమారుడ వీవు అయితే
కావ్య గీతము లల్ల గలిగితె
ఒక్కమాటకు ఉత్తరంబును
ఇవ్వగల వయ్యా ?

ఎవరికోసము ఎందుకొరకై
ఏమి ఫలముల నందడానికి
కాలమైనా లెక్కచేయక
కావ్య మల్లెదవు !

పూలతోటలు పెంచరాదా ?
పీరకృతు లొనరించరాదా ?
భూతదయ చూపించరాదా ?
కావ్య మంటావు !

కవి

ఎవరి కోసము ఎందుకొరకై
ఏమిఫలముల నందడానికి
కోకిలలు గొంతెత్తిపాడు వ
సంత కాలమునన్ ?

ఎవరికోసము ఎందుకొరకై
ఏమి ఫలముల నందడానికి
పుష్పగుచ్ఛము కమ్మతావుల
చిమ్ము నల్లెడల ?

ఎవరికోసము వాయుదేవుడు
ఎల్లదిక్కుల పరువులెత్తును ?
ఎవరికోసము నదులు కొండల
యందు విహరించును ?

పూలతోటలు పెంచడానికి
వీరకృతు లొనరించడానికి
భూతదయ జూపించడానికి
కావ్యమే మూలం.

కన్య

పికములంటూ వాయువంటూ
పువ్వులంటూ నదులు అంటూ
పెద్దమాటలు చెప్పుచుంటివి
వింతగా ఉంది !

పుట్టుకను గన్నప్పుడే అవి
అట్టి గుణములు కలిగి ఉంటవి
పుట్టుకను గన్నప్పుడే నీ
విట్టి కావ్యము చెప్పితే-

మానవులసంఘంబులో ఒక
వ్యక్తివై జన్మించినాడవు
వాటివలె స్వేచ్ఛావిహారము
సల్పగలవయ్యా ?

పారమెరుగని మోదమునకుఁ
స్థానమగునా నీదుగీతము ?
దుర్భరంబగు కష్టసమితిని
తొలగజేయునె నీదు గీతము ?

చిన్ని తలపుల పెద్ద చేయగ
సాధనంబా నీదు గీతము ?
కాదు, పోసి, చెప్పు చూతము
కలుగ జేయునె పరజ్ఞానము ?

యశము కొరకో ధనము కొరకో
ప్రభు కటాక్షేక్షణము కొరకో
వయసు కన్నెల వలపుకొరకో
కావ్య మల్లెదవు !

పాతమాటల పైనిమోహము
పట్ట జాలక పాత సంధులు
పాతనగలను అతికి తెలియని
కావ్య మల్లెదవు !

కష్టపడి కల్పించి కావ్యము
ఘనతరంబని తలచుచుంటివి !
లేత కన్నెల హృదయముల కది
ఈడు రాగలదా !

కవి కుమారుడ వౌదువేమో,
కావ్యగీతము లల్లుదేమో,
గీతమాలిక లంచ మిస్తే
హృదయ మిస్తానా !

తాటివనములో

చింతా దీక్షితులు

*

౧

అక్కడ తాటిచెట్లు దట్టముగా పెరిగి ఉన్నవి. బారులు తీరిన తాటివృక్షములు అత్యున్నతములై తమశిరస్సులను ఆకాశముమీద కలుపుకొని ఉన్నవి. గాలి వీచినప్పుడు గలగలశబ్దములు చేస్తూ ఒకదాన్ని ఒకటి తాకుతూ ఉత్సాహము చూపుతూ ఉంటవి ఆవృక్షశిరస్సులు. కొన్నితాళ్ళు పాడిఆవులవలె ఉండి సెట్టిగాళ్ళు తమదగ్గరకు పదునుపెట్టిన కత్తులతో వచ్చినప్పుడు వారికి మధురమధువు ఇస్తున్నవి.

మరికొన్నితాళ్ళు పక్షులగూళ్ళను తమ శిరస్సులపై మోస్తూ ఉన్నవి.

సీతాఫలపుచెట్లూ, ఈతచెట్లూ, దుబ్బులూ, ఆతాటిచెట్ల నడుమనడుమ పెరిగి ఉన్నవి. తమచింపిరిజుట్లు వేలాడవేసుకొని పసిమిరంగు పండ్లగుత్తులను భరించి ఈ యీతదుబ్బులు ఒక్కచోటనే కురూపమునూ సౌందర్యమునూకూడా కనబరుస్తున్నవి.

ఈచెట్లకు కొంచెము దూరాన మామిడితోపులు వనలక్ష్మిశోభకు మరింత వన్నె తెస్తున్నవి. ఈతోపులు చిలకలకు, గోరువంకలకు, పాలపిట్టలకు, తోకపిచ్చుకలకు, కోవెలలకు, పిగిలిపిట్టలకు, పత్తిరాట్టపుపిట్టలకు ఆశ్రయమిస్తూ ఉన్నవి.

వైశాఖమాసము ప్రవేశించినది. పక్షులకలకలము హెచ్చినది.

ఆకుదొడుగుతున్న రావిచెట్లూ, ఎర్రని పువ్వులనుమాత్రమే తాల్చి ఆకులన్నింటినీ రాల్చిన తురాయిచెట్లూ తెల్లని సౌరభోపేతములైనపూవులను పూస్తూఉన్నతోడువెలగచెట్లూ పచ్చని పండ్లభారముచేత వంగినకొమ్మలుగల పనసచెట్లూ, ఆకులలో సందుసందునా కాయలు కాచిన మామిడిచెట్లూ, ఆరెచెట్లూ ఆవనములో కలకలలాడుతూ ఉన్నవి.

ఆవనముమధ్య గుడిసె కలదు. ఆ గుడిసెలో ఉత్సాహవంతుడైనబాలుడున్నాడు. ఈడిగకుటుంబానికి చెందినవాడు; నల్లని శరీరమువాడు, తేటకన్నులవాడు. భగవంతుడిచ్చిన అందము వాడు బట్టలతో కప్పలేదు. గుడిసెలో పుట్టినబాలుడు గుడిసెలో కొంతకాలము పెరిగినాడు. పిమ్మట తాటిచెట్ల మీద పెరుగుతున్నాడు.

అది పౌర్ణమిరాత్రి. అప్పుడే సూర్యుడస్తమించినాడు. అప్పుడే చంద్రుడుదయిస్తున్నాడు. తూర్పువైపున ఎర్రని పెద్దచంద్రబింబము తాటితోపులో నుంచి కనిపిస్తున్నది. సూర్యకాంతిలో స్పష్టముగా ఉన్న చెట్లు చంద్రకాంతిలో అస్పష్టములై చీకటిముద్దలాగున ఒక్కచోట కనిపించ మొదలుపెట్టినవి. చెట్ల మధ్య ఉన్న చీకటిని సగము సగము కబళిస్తున్నాడు ఉదయిస్తున్న చంద్రుడు. చంద్రుడాకాశాని కెక్కే సమయానే ఈడిగ చిన్నవాడు తాటిచెట్టు ఎక్కుతున్నాడు. కాలికి గుది వేసుకొన్నాడు. తునికోలమీద పదును పెట్టిన కత్తిని పొదిలో పెట్టినాడు. పొత్తము నడుముకు సవరించుకొని ఎక్కుతున్నాడు. చంద్రుడు గౌరవర్ణము త్యజించి శుద్ధశ్వేత వర్ణము ధరించినాడు. తాటివనములో వెన్నెల వెలిసినది. ఈడిగబాలుడు వృక్షాగ్రము చేరినాడు. పక్షులన్నీ తమగూండ్లలోనో కొమ్మలమీదో కూర్చుండి అప్పుడే రెప్పలు వాల్చినవి. పక్షులకలకలము లేదు. వాయుప్రచారము లేదు. నిండునిశ్శబ్దము, భయము వేసే నిశ్శబ్దము, భరింప శక్యముకాని నిశ్శబ్దము.

ఈడిగ చిన్నవాడు వృక్షాగ్రము చేరి పొదిలోనుంచి కత్తి తీసి ఒక్కమారు కిందికి చూచినాడు. తాటిచెట్లశిరస్సుల మీద వెన్నెల, తాటిచెట్ల మొదళ్ళలో చీకటి. పాలసముద్రముపైనా నీటిసముద్రము కిందా! పాలసముద్రములో పసరుతరంగాలు వృక్షశిరములు. నీటిసముద్రములో తెల్లని నురువులు వెన్నెలపీలికలు.

ఈడిగ చిన్నవాడు తాటాకులలో నుంచి పైకి చూచినాడు. నల్లని ఆకాశములో తెల్లనిమబ్బులు. అక్కడక్కడ చుక్కలతళుకులు. వెన్నెలసముద్రంలో తేలియాడుతున్న ట్లున్న ఈడిగబాలుడా నిశ్శబ్ద సమయాన సన్నని చల్లనికంఠమెత్తి పాడమొదలుపెట్టినాడు. ఆ ఆకాశసంగీతము వినుటకు కాబోలు వాల్చినరెప్పలను పైకెత్తి పక్షులు కిలకిలమన్నవి, వాయువు చలించినది, చంద్రుడు స్వచ్ఛశీతలకిరణాలతో బాలుని శరీరము స్పృశించినాడు. మధువును గ్రహిస్తూ ఆచిన్నవాడు ఆకాశముమధ్య మనోహరమైన సంగీతమును తెల్లనిమబ్బులకు వినిపించినాడు.

"ఆకాశమే మేడట. ఆమేడలో తా నెప్పుడూ ఆడుకొంటూ ఉంటాడట. లోకులందరూ తనతో ఆడడానికక్కడకి రావలెనట. పక్షులతని స్నేహితులట. మబ్బులతని చుట్టాలట. జీవితమంతా సౌఖ్యప్రదమట."

అతడు పాడినపాట చెట్లను దాటి వనమును దాటి దిక్కులవరకూ వ్యాపించినది.

ఆదారిని పోతున్న ఒకానొక సన్యాసి ఆపాట విన్నాడు. ఆవసంతసమయాన ఆరాత్రివేళ ఆవెన్నెలలో అతడాపాట ఆలకించి లోకమంతా సౌఖ్యప్రదమే కాబోలు అనుకొన్నాడు.

౨

తాటివనములో వృక్షములన్నీ తలంటిపోసుకొన్న ట్లున్నవి. అది వర్షాకాలము. ఖండవృష్టులు పడుతున్నవి. వృక్షములకు నూతనజీవము కలిగినది. వాటికి కళవచ్చినది. మాలిన్యముపోయి శుభ్రముగా ఉన్నవి. వాడుచూపిన మొలకలు తలలెత్తినవి కొన్ని. మోడులనుకొన్నవి కొన్ని చిగుళ్ళు పెట్టినవి. తాటివన మంతా కొత్తతేజముతో రాణిస్తున్నది. ధూళిచేత కలుషితమైన వాయువు ఈసడుయాన నిర్మలముగా తేటగా తేలికగా ఉన్నది. భూమిమీద పచ్చిక మొఖమల్ వలె మెరిసిపోతున్నది. ఆకాశముమీద ఉండుండీ నల్లమబ్బులు కనపిస్తున్నవి.

నాటిఈడిగచిన్నవాడు నేడు ఈడిగ యువకుడైనాడు. కండలు తేరినవల్లని శరీరము నిగనిగ లాడుతున్నది. ప్రతి అవయవమునందూ కళకాంతులు వెల్లివిరుస్తున్నవి. మొగమున మీసము మెరిసిపోతున్నది. మొలకు గోచీ, తలకు పాగా. ఆతాటివనములోనే ఆపూరిగుడిసెలోనే ఈడిగవాడు కాపురము చేస్తున్నాడు.

తాటివన మతనికి పరిచితమైనది. ఆతనితో తాటిచెట్లు మనసిచ్చి మాట్లాడుతూ ఉంటవి. అతనిమంచిచెడ్డలు వాటికి తెలుసును. వాటిపూర్వోత్తరాలతనికి తెలుసును. వాటిని చూచినప్పు డతనికి చిరమిత్రుని చూచినట్లు ఉంటుంది. అతనిని తనవారిలో ఒకనిగా తాటిచెట్లు ఎంచుకొంటున్నవి. అతనిమాట జవదాట వవి. ఒకరిపైన ఒకరికి ప్రేమ. తనకష్టాలను ఆపడుచువాడా చెట్లతో విస్తారము చెప్పుకొంటాడు. ఆచెట్లు అప్పుడు నిట్టూర్పు విడుస్తవి. అప్పుడప్పు డవి వానితో పరియాచకము చేయుటకూడా కలదు. అతడు చెట్టుపైన ఉన్నప్పు డవి వానిని ఇటునటూ ఊపి తొందరపెట్టుతవి. అతడు వాటిపరియాచకము గ్రహించి నవ్వుకొంటాడు. "నీవాళ్లా లెవరని" అతనిని అడిగితే "నాతల్లి, నాతండ్రీ, నాభార్యా నాతాళ్ళు" అని అతడు బదులు చెప్పుతాడు.

ఈవర్షాకాలమున పక్షులకు కొన్నింటికి మాత్రము కష్టజీవనము. జీవజంతుల కన్నింటికీ ఆహారము చెట్లు ఇస్తవి. ఆ రీతిగానే జీవజంతువు లన్నింటికీ నివాసముకూడా చెట్లే యిస్తున్నవి. కాని కొన్నిపక్షులకు కష్టాలు తప్పవు. ఆహారము నవి వర్షములో సంపాదిస్తవి. రాత్రివేళ ఒక్కొక్కమారు ఉరుములూ మెరుపులూ కుంభవృష్టి వాటికి దుర్భరముగా ఉండును. చెట్లకు సంతోషముగా ఉన్నప్పుడే వాటికి దుఃఖము. ఒక్కనాడు వర్షము కురిసి వెలిసినది.

శుద్ధచవితి. సూర్యు డస్తమించినాడు. ప్రాగ్దిశనుమబ్బులు. పశ్చిమదిశమబ్బులలో చంద్రుడు. చీకటీ వెన్నెలా కాకుండా ఉన్నది. ఈడిగయువకుడుతనసరంజాముతో

తాటివనములో సంచరిస్తున్నాడు. అప్పుడే చంద్రుడు మబ్బుల వెనకనుంచి బయట పడ్డాడు. అత్యున్నతమైన ఒక తాటిచెట్టు ఎక్కనారంభించినాడా పడుచువాడు. వాయువు కమ్మగా వాసన కొట్టుతున్నది. పక్షులు చలిచేత ఒక దానిపక్కన ఒకటి చేరి ముక్కులతో నెరుకలను సవరించుకొంటున్నవి. చెట్టులన్నీ మబ్బులవంక చూస్తూ వాటితో వేళాకోళము చేస్తున్నవి: మాశిరస్సుల పైన సంచరిస్తున్నామని గర్వించేమీకు మాపాదాలు పట్టవలసి వస్తుంది లెమ్మని.

జవజవలాడిస్తూ తాటిచెట్టు చివరకు వెళ్ళినాడు పడుచువాడు. చేతులు వదిలి పాత్రము (పగ్గము) మీద వెన్నుఆనించి నలువంకలా ఒకమారు చూచినాడు. ప్రకృతిఅంతా నిశ్శబ్దముగా ఉన్నది. పక్షులుపలకడము లేదు. చెట్లు కదలడము లేదు. అంతటా గుడ్డివెన్నెల. చంద్రునిచుట్టూ మేఘాలు కాంతితో ఉన్నవి. తాటివనము నల్లనల్లగా అస్పష్టముగా ఉన్నది.

సాంద్రమైన ఆనిశ్శబ్దమును చీల్చుకొని తాటివనము పైభాగమునుంచి గంభీరమైన కంఠధ్వని వినబడ్డది.

పడుచువాడొకపదముపాడ మొదలుపెట్టినాడు. మధువును గ్రహిస్తూ అతడు పాడినపదమును విని పక్షులు తమదుఃఖము మరచినవి. చంద్రవంక చుట్టూ ఉన్నమబ్బులు అతనికి సమీపముగా రా మొదలుపెట్టినవి. అలలు అలలుగా ఆసంగీతధ్వని వృక్షశిరస్సుల పైనుంచి కదలిపోతున్నది. చెట్లు కదలక మెదలక అతనిపదమును ఆలించ మొదలుపెట్టినవి.

ఉబుకుకొని వస్తున్నయౌవన స్వేచ్ఛతో, కట్టుబాట్లను పాటించని గడుసుతనముతో పడుచువాడు పదము పాడినాడు.

"ములలోతు నీళ్లల్లో మల్లెమొగ్గల రవిక తొడుగుకొని చల్వచీర కట్టుకొన్నదట చాకలిది. గట్టుపైన కోడెగాడు కన్నులు మూత వేయడము లేదట. ఆచిన్నదాని ముఖబింబము నీటిలో ప్రతిబింబించగా అది కలువపువ్వువలె ఉన్నదట కోడెగాడు ఆమెచీర చూచి, రవిక చూచి చెప్పరానిమోహము చెంది రావటే చిన్నదానా, రావే నాచిన్నదానా అనితనమోహము వెల్లడి చేసినాడట."

అతడు పాడినపాట చెట్లను దాటి వనమును దాటి దిక్కులవరకూ వ్యాపించినది.

ఆదారిని పోతున్న ఒకసన్యాసి ఆపాట విన్నాడు. ఆవర్షాకాలమున ఆనాడు ఆగుడ్డివెన్నెలలో అతడాపాటను ఆలించి లోకమంతా మోహసముద్రములో మునిగిఉన్నదనుకొని తల వంచుకొని తనదారిని పోయినాడు.

౩

శీతాకాలము బాగా ప్రవేశించినది. రాత్రి పొద్దు లెక్కువ కావడము కొందరికి సుఖకరముగానే ఉన్నది. కప్పుకోడానికి కంబళీ, కాచుకోడానికి

కుంపటీ ఉన్నవాడు శీతాకాలము చూచి భయపడవలసిన అవసర మేమిటి? ఋషి పక్షులకు శీతాకాలము సుఖ మనుకో వచ్చును. రాత్రి వేళల వనము లలో తిరిగి కడుపునిండా తిండి తిన వచ్చును. ఇతర పక్షులకు కొంచెము కష్టమేమో తిండి సంపాదించుకోడానికి. పగలు పొద్దు చాలక పోవడము ఒకటి. తిన్నతిండి రాత్రి త్వరగా జీర్ణమై ఆకలి కావడము రెండు. తాటివనము ముదిరి నది. మొలక లనుకొన్నవి పెద్దవృక్షము లైనవి. ముదురు చెట్లను చేవ పట్టినది. శీతాకాలము రాత్రిళ్ళు తాటిచెట్ల శిర స్సులమీద మేఘములు నిద్ర పోతవి. ఉదయమున మేఘములు లేచిపోతవి. అప్పుడు తాటిచెట్లు తమ శిరస్సులను ఆడించుటచేత మంచుబిందువులు (మేఘ ములబంటినుంచి ఆకులమీద పడ్డమన్ను) క్రిందకు రాలుతవి.

మామిడిచెట్లు చిగిరిస్తున్నవి. తెల్ల చిగుళ్లు. తూర్పుగాలిఉండుండి వీస్తున్నది.

తాటివనములో గుడిసె వెలుపల కూర్చున్నముసలివాడు వెనుకటి ఈడిగ చిన్నవాడు. తల నెరుస్తున్నది. ఒంటికి ముడతలు పడుటకు తొలిచిహ్నములైన గీతలు కనబడుతున్నవి.

చిన్ననాటి చిరునవ్వుగాని ఉత్సాహ ముగాని అతనిలో కనిపించడము లేదు. యౌవనప్రాయపు నిర్లక్ష్యము, స్వేచ్ఛ అతనిలో కనపడడము లేదు. లోక ముసు దాటి చూస్తూఉన్న ట్లున్నవి అతనికళ్ళు.

తాటిచెట్లు అతనిని గౌరవముతో చూస్తున్నవి. చిన్నతనమున తమతో ఆడుకొన్నాడు, పెద్దవాడైనాడు తమ దగ్గరనే. ముసలివాడైనాడు తమకళ్ళ ముందరే. అతని పాదములు వాటిశరీర ములమీద అరిగిపోయినసంగతి వాటికి తెలుసును. అవి తమ యౌవనమును కోల్పోవ లేదు. అతడు మాత్రము యౌవనము కోల్పోయినాడు. తమతో కలిసిమెలిసి సరదాగా ఆడుకునేచిన్న వాడు ముసలివాడైనందు కవి విచా రించినవి. అతను చెట్లు ఎక్కేటప్పుడు అవి అతనిని బహుజాగ్రత్తగా మోస్తవి. కదలవు మెదలవు. అతడు చెప్పినట్లు వింటవి. చిక్కులు పెట్టకుండా కావల సినంత మధువును అతనికి ఇస్తవి.

తాటిచెట్లను అతడు ప్రాణమిత్రము లుగా చూచుకొంటున్నాడు. తనకు జీవితములో ఎందరో స్నేహితు లన్న వారు తారసిల్లినారు. వారిస్నేహ బంధమును అతడు పరీక్ష చేసినాడు. తనకూ తనవాళ్ళకూ ఉన్నబంధమంత గట్టిగా అది లేదనుకొన్నాడు. “నీకు తోడునీడలై కష్టసుఖములలో వదిలి పెట్టకుండా నిన్నెప్పుడూ కనిపెట్టుకున్న వా రెవరంటే” “నాతాళ్ళే” అని అత డంటాడు. తనతాళ్లనుచూచినప్పుడు అతనికి ఉన్నతభావాలు కలుగుతవి. ఓడారులను ప్రేమించుకుంటూ ఆ

తాళ్ళ ఆ యీడిగ ముసలివాడూ కాలము గడుపుతున్నారు.

శీతాకాలపు పొద్దు కుంకిన దానాడు. బహుళ చతుర్దశి. నాలుగువైపుల నుంచీ చీకట్లు లోకమును కప్పుటకు పరుగెత్తుకొని వస్తున్నవి.

ముసలివాడు గట గాపట్టుకొని లొట్టె దానికి తగిలించుకొని కత్తులను అందులో దోపుకొని పొత్తము సవరించుకొని తునికోలను నిచ్చెన కానించి నిచ్చెన మీదినుంచి తాటిచెట్టొకటి ఎక్కుతున్నాడు. అతడెక్కుతున్న చెట్టుతో పక్కచెట్లు జాగ్రత్త సుమా అని చెప్పినవి. తూర్పువైపునుంచి వీతెంచుతున్న వాయువు గమనము మందగించినది. పక్షులప్పుడే తమకులాయములు చేరుకొన్నవి. ముసలివాడు చెట్టెక్కినాడు. మధువును గ్రహించుటకు ముందు అలవాటు చొప్పున పదము—కాదు, తత్వము పాడ మొదలు పెట్టినాడు. భయభక్తులతో చెట్లు ఆపాట ఆలించినవి. పక్షులాపాట విని నవ్వుకొన్నవి. రహస్యముగా వాయు వాపాటను పడమర దిక్కుకు మోసుకొని పోయినది. బొంగురుబోయిన కంఠముతో ముసలితనమువల్ల చలిస్తున్న స్వరముతో మెల్లగా అతడానసముగ తత్వోపదేశము చేసినాడు.

“ అంతా దుఃఖమయ మనీ లోకమంతా దుఃఖమయమనీ గ్రహించవలెనట. బతుకంతా పది గడియలు లేదట. పరమాత్మపాదములు నమ్ముకొన్న వారికి పరమార్థ మున్నదట. అదొక్కటే నిత్యమూ మిగిలిన దంతా అనిత్యమూ నట. ”

అతడు పాడినపాట చెట్లను దాటి వనమును దాటి దిక్కులవరకూ వ్యాపించినది.

ఆ దారిని పోతున్న ఒకసన్యాసి ఆపాట విన్నాడు.

ఆశీతాకాలమున ఆచీకటి పొద్దులో, అతడాపాట ఆలించి ఈచీకటిలో ఈనిరాశలో ఈఆశ ఎక్కడిది చెప్మా అని తల పైకెత్తి చూచినాడు.

*

తిరుప్పాణాళ్వార్

శ్రీ మాండూరు కృష్ణమాచార్యులు

*

కావేరీ భుజవల్లరీ వలయిత క్ష్మామధ్యదేశంబునన్
భూవైకుంఠము సర్వభక్తజన సంపూజ్యంబు శ్రీరంగ రా
జావాసంబు సమస్త కల్మషహరంబై నిత్యకల్యాణమై
సేవార్థాగత రాజలోక శిబిర శ్రీమంతమై యొప్పుచున్.

శ్రీరంగేశ్వర నాభిపంకజరజః శ్రీ చూర్ణముం దాల్చి వి
స్తారోదార భుజాంతరస్థ తులసీదామంబులన్ దిద్దు త
చ్చారు శ్రీపదపద్మ తోయముల నాస్వాదించు శేషత్వ దీ
క్షారంభుం డనిలుం డహర్ముఖములం దారంగధామంబునన్.

ఆయత నీలదేహుఁడు మహాభుజుఁ డున్నతవక్షుఁడున్ సరో
జాయత దివ్యనేత్రుఁడు మహాపురుషాకృతి నొప్పువాఁడునై
గాయకసార్వభౌము డనఁగాఁ దగు నొక్కఁడు దివ్యసుందర
శ్రీయుతుఁ డంత్యజుండు నివసించును తన్నగరాంతికంబునన్.

కావేరిన్ విరజాతరంగిణిగ రంగశ్రీప్రభుక్షేత్రమున్
శ్రీవైకుంఠముగా పరాత్పరుఁడు తచ్ఛ్రీరంగనాథుండుగా
భావంబందున నిల్పి భక్తిపరుఁడై పాణాభిధానుండు రం
గావాసంబును ద్రొక్కఁగా వెరచు నత్యంతంబు నేవేళలన్.

అంబరచుంబితంబగు జనార్దను గోపుర మొక్క క్రోశ మా
త్రంబున గాంచి వీణియ నతండు నఖంబుల మీటుచున్ మనో
జ్ఞంబుగ రంగమందిరము సైకతవేది లిఖించి ప్రత్యహం
బంబుజనాభు బాడు మధురారవ మంగళనామ కైశికిన్.

అత డొకనాడు మేల్కని నిశాంతమునందు కవేరజాతట
స్థితసికతాతలంబున సశీకరబాలసమీరడింభముల్
సతతము పైకొనన్ కమలషండవినిర్గతమత్తబంభర
శ్రుతుల విపంచితో గలిపి శ్రోత్రమనోహరలీల బాడుచున్ —

అత డభ్రంకషదివ్యమంటపసహస్రాకీర్ణమై గోపురా
యుతశోభాన్వితసప్తవప్రమయి పుష్పోద్యానరమ్యంబునై
శతవాపీయుతమై రంగని మహాస్థానంబు భావించి సై
కతవేదిన్ లిఖియించె గట్టిపట సంకల్పప్రభావంబునన్.

ముద మొప్పంగ తదాలయాంతరమునన్ భోగీంద్రపర్యంకమం
దుదితార్క ప్రతిమానురంగవిభు సత్పూర్ణాసయై వ్రాసి నె
మ్మది తన్మూర్తి దృఢంబుగా నిలిపి యాత్మారాముడై సర్వమున్
చిదచిద్వస్తువిశిష్టబాహ్యజగమున్ చేతోగతిన్ వీడినన్ —

ఆ సమయంబునన్ ద్విజులు హస్తభుక్తకృత్యము లాచరింప ద
ర్భాసన వస్త్రపేటికలు పాణుల దాల్చి నచ్చి తీరమం
దాసనబంధ నేరుడయి యంత్యజు డుండుట చూచి చేరి నీ
దోస మటంచు వాని వెస దూరము పొమ్మని హెచ్చరింపగన్ —

అతడు ననన్యదృష్టి మది నచ్యుతు నిల్పి సుఖండనిష్ఠతో
నితరము సర్వమున్ మరచి యీశ్వరుమంగళవిగ్రహంబు సం
తతమును యోగదృష్టి గని తన్మయతన్ రమియించుచుంటచే
బ్రతివచనంబొసంగ డది వంచనగా దలపోసి విప్రులున్ —

ఓరి దురాత్మ, తెమ్మిచట నుష్ణమయూఖునిరాక దోచెడున్
నీరములందు గ్రుంకవలె నీ వొకగ్రావము వోలె నడ్డమై
తీరమునందు జేరితివి తీర్థములందు వసింప జెల్ల దా
చారపవిత్రులైన ద్విజసత్తము లందరు వేచియుండగన్.

నీ వొకహాని కొదువాయెగా నిశ్చలతన్ వసియించినంతనే!
కావర మేల? బ్రాహ్మణుల గాదని నిల్వగజాలువాడవే?
త్రావితివో రి మద్యమును? తథ్యము, చిత్తము భ్రాంతి జెందె నీ
పావనతీర్థదేశమున పంచము డర్హుడె పాద ముంచగన్?

కరిపతిమూర్ధపీఠమున గాంచనకుంభము నుంచి వాద్యముల్
మొరయగ వేదపాఠకులు ముందును వెన్క జనంగ తీర్థమున్
మురహరు రంగరాజవిభు పూజకు గైకొనిపోవ నర్చకుల్
కరము చిరంబు నిల్చి యిట గార్యము మాని, తొలంగిపోవరా!

అటు పలుమారు పల్కినను నాతడు నేమియు మారు పల్కకా
తటమున బాష్పనేత్రు డయి తన్మయతన్ బులకాంకురంబు లు
త్కటముగ మేనిపై బొడమ గాఢసమాధి మునింగియున్న న
చ్చటిజను లాగ్రహించి యతిశాంతుని దండ్యునిగా దలంచుచున్ —

పటుపాషాణపరంపరా ప్రహతులం బాధింప నంగంబు ను
త్కటకీలాలము గ్రమ్మ నిశ్చలుడు నిస్తంద్రుండునై పాను స
స్ఫుటహాసంబు ముఖాబ్జమందు వెలయన్ శుద్ధాత్ము డా యోగి య
చ్చటివా రెల్లను తన్ను గన్గొని మహాశ్చర్యంబునం దేలగన్.

అతడు నిజేచ్ఛ గొంతతడ వచ్చట శ్రీహరిపైని గీతముల్
శ్రుతిసుఖలీల చిత్తము విశుద్ధి వహింపగ పాడి లేచి, సై
కతతలముం దొలంగిచనె కాయము పుష్పితకింశుకద్రుమ
ప్రతిభటమై వెలుంగ నిజపర్ణకుటీరపథానువర్తియై.

అంతట రంగమందిరమహామణిమంటపమధ్యవర్తియై
సంతతవక్షశ్శితుణా విచక్షణా రక్షణదీక్ష నున్నదై
త్యాంతకుమేన జందనము నర్చకు డర్పణసేయు వేళ న
త్యంతభయంబునం గనియె నంగమునం దరుణాస్రబిందువుల్.

కాంచి నిజాంగకంబు లతిగాఢభయంబునఁ గంపమొంద న
క్కాంచనగర్భవంశజు డఖండరయంబున నేగి పార్థివుం
గాంచి తదద్భుతం బానికట్టుకుటన్ వచియింప విస్మయో
దంచితసుస్థిరాత్ముడయి యాతడు పిల్వఁగ బంచె దగ్జ్ఞులన్.

వారు నృపాలునానతి నవారితస్వైరవృత్తి వచ్చినన్
క్ష్మారమణుండు పండితుల సత్కృతిచేసి ద్విజేంద్రులార నే
డారయ నొక్కవింత మనయాలమందలిస్వామిమేన ని
ష్కారణ మస్రబిందువులు కన్పడె నెట్టియమంగళంబొకో !

అనుటయు నందఱుం గలసి యంబుజనాభునిదివ్యదేహమున్
గనుఁగొను వేడ్క నేగి గగనస్థలచుంబితసప్తవప్రమై
తనరుమహాలయాంతర ముదారజవంబున జొచ్చి తప్తకాం
చనమయదివ్యమంటపవిశాలవిమానము గాంచి మ్రొక్కుచున్ —

వారలు గర్భమందిరకవాటము సొచ్చి భుజంగతల్ప సం
ధ్యారుణకాంచనాంబరు నుదగ్రచతుర్భుజశోభితాంగు వి
స్తారభుజాంతరున్ జలజచారువిలోచను దివ్యసుందరా
కారుని రక్తబిందుమయగాత్రుని రంగని గాంచి రచ్చటన్.

దేవ, యరిష్టచిహ్న మిది, దీనికి శాంతి యొనర్పఁగావలెన్.
భూవలయంబునం దిది యపూర్వము, సేయఁగ నాజ్ఞయిమ్ము భూ
దేవుల మంత్రహోమజపదీక్షసహస్రఘటాభిషేకమున్.
దేవరకున్ శుభోదయము, దేశసుఖంబును దీన గల్గెడిన్.

అనుచు నభిజ్ఞు లందరును నావిధి దెల్ప నృపాలు డట్లకా
మనమున నిశ్చయించి, తనమంత్రుల కాజ్ఞయొసంగి, నాటిరే
యిని నిజసౌధసీమ నిదురించి, నిశాంతమునందు స్వప్నమున్
గని కడువిస్మయం బడర గాల్యవిధుల్ నెరవేర్చి చయ్యనన్ —

కొలువయి పల్కె నిట్లు నృపకుంజరు డప్పు డమాత్యవర్గమున్
గలయగ జూచి స్వప్నమున గాంచ వలాహకవర్ణు నుల్లస
జ్జలజవిశాలలోచనుని జ్యాకిణకర్కశదీర్ఘబాహు ను
జ్జ్వలమణిభూషణప్రకరభాస్వరదేహుని దివ్యపూరుషున్.

కని భయసంభ్రమాతిశయకంపితదేహుడనై ప్రణామముల్
తనకు నొనర్ప సాంద్రజలదధ్వనిధిక్కృత బల్కె నాతడో
జనవర, నాదుభక్తు నతిశాంతుని బంచముం డంచు భూసురుల్
ఘనకఠినోపలప్రహతి గారియవెట్టిరి క్రూరకర్ములై !

తమభారంబు సమస్తమున్ పరమభక్తశ్రేణి నాపైని ని
ర్మములై నిల్పి సమస్తకర్మఫలముల్ బ్రహ్మార్పణం బంచు ఖే
దము మోదంబు సమత్వబుద్ధి గొని మత్కైంకర్యనిష్ఠాత్ములై
శ్రమముల్ వాసి సుఖింత్రు మచ్చరణకంజాతద్వయిన్ గొల్చుచున్.

కావున నాదుభక్తజనఘాతము సేయుట నాకు జేయుటా
పావనులైనవారియెడ భక్తిని జూపుట నాకు జూపుటా
నీవును నాదుసన్నిధి కనింద్యచరిత్రు మదీయు నాతనిన్
భూవర, తోడితెమ్మిపుడ భూసురముఖ్యపురస్సరంబుగన్.

అని యతడానతిచ్చుటయు నంతన మేల్కొని నిప్డు పంచమున్
జనములు హింససేయుటయు చారముఖంబున వింటి బద్మనా
భునకు బ్రియుండెవం డతడె పూజ్యుడు లోకమునందు గాన మీ
కనుమతియేని బోదమె మహాత్ముని నాతని దోడితేరగన్ ?

నావుడు వార లెల్ల నరనాథునివాక్యము సమ్మతింప నా
భూవరుడున్ గజాశ్వరథభూషణసంతతు లుపాయనంబుగా
భావనమూర్తి కాతనికి భక్తిని గైకొని పాదచారియై
వేవురువైష్ణవోత్తములు వెంబడి రా నరిగెన్ వినమ్రతన్.

అరిగి తదీయపర్ణగృహ మల్లన జొచ్చి ససంభ్రమాత్మత
త్వరుడయి వచ్చునాతనిపదంబులకున్ బ్రణమిల్లి రంగభూ
వరుడు భవత్సమాగమము భావమునం దలపెట్టె నేను త
చ్చరణపయోజసన్నిధికి సత్వగుణాకర వేగ రాగదే !

మీరలు వైష్ణవోత్తములు వేడుక బ్రహ్మరథస్థుజేసి యిం
పారగ రంగరాజచరణాబ్జములన్ మిము జేర్చ సిద్ధులై
కోరి తమంతతా మిచట గూడిరి వీరి ననుగ్రహింపవే
భూరికృపానిధీ, పరమపూజ్యులు మీరలు దోష మెంతురే ?

నరనాథుం డిటు విన్నవింప నతడున్ నారాయణోచ్చారణ
స్ఫురితోష్ఠుండయి వాస్రయుగ్మపిహితశ్రోత్రద్వయుండై మహీ
సుర లీవిప్రులు మీరు భూపతులు మీశుద్ధాన్వయం బేడ శ్రీ
హరి ! నానీచకులం బదేడ ! అకటా ! అస్పృశ్యుడన్ పాపుడన్ !

ఏమిమహాపరాధ మొనరించితినో తొలుజన్మమందు నే
నీమహి పాపజాతినయి యిప్పుడు పుట్టితి జేయనోప నో
భూమిప ! యింక భాగవతభూసుర దేవమహాపచారముల్ !
స్వాములు మీ రవాచ్య నను బ్రహ్మరథస్థుని జేయగూడునే ?

పౌలోమీపతిభద్రపీఠమున నిత్యంజాలు బాహాబలా
ఖీలుం డానహుషుం డగస్త్యునితపోవీర్యాతిరేకంబునన్
వ్రాలెన్ భూమిపయిన్ మహాజగరమై స్వారాజ్యవిభ్రష్టుడై
ఏలా ! మాలని కిట్టి బ్రహ్మరథముల్ హీనాన్వయుం డర్హుడే ?

కావేరీద్వయమధ్యసంస్థితమహాకల్యాణధామంబు భూ
దేవప్రాకృతాధ్వరాయుతములన్ దివ్యంబు శ్రీరంగరా
డ్దేవస్థానపవిత్రభూతలము నీదీనుండు పాదాహతిన్
సేవింపంగ ననర్హుడే విధి నగున్ శ్రీరంగసామీప్యముల్ ?

అని యాతండు వచింప వైష్ణవసమూహం బార్య, శ్రీరంగనా
థునిదివ్యస్థలమున్ బదాబ్జములతో ద్రొక్కంగ మీరన్నయ
ట్లనుమానించి యనుగ్రహింప మను మీ కాసక్తి యానేని మా
జననం బీమహి సార్థకంబె యగు, మీసాలభ్య మి ట్లొప్పునే!

అన, హరిపారతంత్ర్యమున నాతడు నిశ్చలవృత్తి నున్న యా
జనవిభుడున్ మహీసురులు చయ్యన బ్రహ్మరథస్థుజేసి యా
తని బహువాద్యఘోషము లుదారత మ్రోయగ రంగమందిరం
బునకు ముదంబుతోడ గొనిపోయిరి వేడ్క మహోత్సవంబుగన్.

భూరమణుండు వైష్ణవులు పూజ్యాః నాతని రంగమందిర
ద్వారము జేర్ప రత్నఖచితం బగుదివ్యవిమాన మష్టము
మ్మారు ప్రదక్షిణంబు గొని మాధవుసన్నిధి కేగుదెంచి త
చ్చారుపదాబ్జముల్ మొదట సంస్తుతి జేసె శిఖాంతి మాతడున్.

బలిదైత్యేంద్రు నవక్రవిక్రమమునన్ బంధించి బ్రహ్మాండమున్
గలయన్ వేడుక విక్రమత్రయవశాక్రాంతంబు గావించునా
డల బ్రహ్మాదులదృష్టి కైనను నమేయం బైననీపాదయు
గ్మలజంబు ల్గనన య్యె దాసునకు నీకారుణ్యపూరంబునన్.

ఘనతరమేఘమాలికల గ్రమ్ము సాంధ్యమయూఖజాలమో
యనగ భవత్కటిస్థలమునం దసమానవిభూతి వెల్గు కాం
చనమయదివ్యచేల పరిసర్పితమామకదృష్టి యోజనా
ర్దన, మరలంగనేర దది తామరసాంతరషట్పదాకృతిన్.

ఖరతరదావపావకశిఖల్ దరికొన్నకురంగమట్టు లో
సరసిజనాభ! చిక్కితిని సంసృతిఘోరవనాగ్ని, నేను నీ
కరుణ, సుశీతలహ్రదము గాంచినరీతి త్వదీయనాభికా
సరసిని గాంచి తాపములు సర్వము వాయగగంటి, మాధవా!

నీరజనాభ, నీవు నవనీతమిషంబున వల్లవీమనః
చోరకముల్ హరించుటకు ఘోషకుటీరములందు జొచ్చుచో
చోరవిచేష్టితంబును యశోద సహింపక బద్ధు జేసె నిన్:
ఆరసిచూడ వశ్యవిషయంబున నందరు వీర్యవంతులే !

శ్రీవత్సాంకితమై, మహార్ఘభద్రమై, శృంగారసారమై
లావణ్యామృతసాగరంబయి, మహాలక్ష్మీసుఖావాసమై
ఆసంధ్యాచలసానుసారమయి దేవా ! యొప్పు నీవక్షమున్
సేవింపంగని నాడ నీదుకరుణన్ శ్రీకౌస్తుభాలంకృతా !

సన్నద్ధై రావణోద్దండకర్కశములై, శక్రధ్వజాకారులై
కమనీయాంగదభూషశోభితములై, గాఢానుభావంబులై
రమణీయాకృతి నొప్పునీభుజములన్ రంగేశ ! సేవించు భా
గ్యము నాకిప్డు లభించె నీదుకరుణన్ కౌమోదకీలాంఛనా !

గోపసితంబిసీమృదులకోమలబాహువివేష్టితంబు శం
ఖోపమసుందరంబును మహోజ్జ్వలదివ్యసుగంధమాలికో
ద్దీపితమైన నీగళము దీనజనావన, నేడు గాంచి సం
తాపము వాయగంటి నను దాసునిగా గొని బ్రోవవే హరీ !

నీమధురాధరామృతము నీరజనాభ, యొసంగుదేని యీ
భూమిని గోపకాంత నయి పుట్టెద, కాదని యందువేని యీ
కామశరార్తి వాయ నతిగాఢభుజాంతరమందు జేర్చి, నీ
కామిని నేలుకొమ్మిపుడు కాంత ! వియోగము దుస్సహం బికన్ !

ఆకర్ణాంతవిశాలనీలరుచులై, యబ్జాతపత్రంబులై
లోకత్రాణపరాయణంబు లగుచున్ లోకేశ ! నీనేత్రముల్
వీకన్ భీతకురంగశాబనయనావిక్రీతదాసున్ ననున్
నీకు న్గింకరుగా నొనర్చెను దళన్నీరేజపత్రేక్షణా !

చారుపయోదమాలికలు, సాంద్రతమాలనికుంజపుంజముల్
భూరికళిందజామధురపూరము లంజనశైలదీధితుల్
నీ రమణీయదివ్యతనునిర్మలకాంతులు కోమలాంగ ! యీ
క్రూరుఘోరమానసముఁగూడ హరించె నిదేమి చిత్రమో !

తావకదివ్యదేహమును దానవభంజన, సేవఁజేసి యీ
స్థావరజంగమాత్మకము సర్వజగంబును జూచినొల్ల నీ
పావనపాదపద్మముల బంభరవృత్తి భజించువాఁడ నో
దేవ, భవత్పదం బొసఁగి దీనుని వీని ననుగ్రహింపవే !

అత డీరీతిని రంగరాజసుమనోజ్ఞాకారముఁ జేరువే
రతిభక్తిన్ వినుతించునంతకు తదీయం బైనదేహంబు ది
వ్యతమం బై హరిమంగళాకృతి కభేదాకారముం దాల్చె న
ద్భుతతేజోమయమున్నిరీక్ష్య మయి తద్రూపంబు శోభిల్లఁగన్ .

అప్పుడు చతుర్భుజంబులును హస్తయుగంబున శంఖచక్రముల్
విపులభుజాంతరస్థ మగు విష్ణుచిహ్నము కౌస్తుభాదులున్
తపనసహస్రతేజమును దప్తహిరణ్మయదివ్యరూపమున్
అపరిమితాంగసౌష్ఠవము నాతని కప్పుడు సంక్రమించినన్ —

నరనాథుండు జనంబు లప్పుడు నమోనారాయణా యేతి శ
బ్దరవం బొప్పఁగ నేత్రముల్ మొగిచి దిగ్భ్రాంతాత్ములై యుండ నా
హరిభక్తుండు నదృశ్యుఁడయ్యెను ! తదీయార్చావతారంబు నే
డరవిందోదరుపాదపద్మములయం దచ్చోట గన్పట్టెడున్ .

*

దారద్వయము

శ్రీ శ్రీనివాస శిరోమణి

*

౧

"అమ్మా, శివరావు మామయ్య వచ్చాడే" అంటూ రాజ్యలక్ష్మి వీథిగుమ్మములోనుంచి లోపలికి వెళ్ళింది. రాజ్యలక్ష్మికిప్పుడు పదిహేనవ సంవత్సరము నగపడ్డది. ఆమె పెద్దదయి ఒకటిన్నర సంవత్సరము కావచ్చింది. శివరావు ఆమెనుచూసి చాలా కాల మయినందున చప్పున గుర్తుపట్టలేకపోయినాడు.

శివరావు దూరపుబంధువు అయినా చాలా కాలము వారిఇంట్లో ఉండడమునుంచి వారూ అతనూ చాలా దగ్గిరబంధువులులాగా ఉండేవాళ్లు. శివరావూ రాజ్యలక్ష్మి పెనిమిటి వెంకటేశ్వరరావూ చాలా తరగతులలో సహాధ్యాయులుగా ఉండి బాల్యమునుంచీ జీవికాజీవులుగా ఉన్నారు. ఇతను వయస్సులో వెంకటేశ్వరరావుకన్న మూడు సంవత్సరములు పెద్ద. వెంకటేశ్వరరావు మదరాసు వెళ్ళిపోయిన తరువాతకూడా చాలా కాలము ప్రతివారమూ శివరావుకు ఉత్తరము వ్రాస్తూ ఉండేవాడు; అయితే కొంత కాలమునుంచి ఉత్తరము వ్రాయడము మానివేసినాడు. ఉత్తరములు రాకపోయినా అతన్ని శివరావు మరిచిపోవడము కానీ, అతనిమీద వెనకటి ఆదరము తగ్గిపోవడము కానీ జరగలేదు.

ప్రస్తుతము శివరావు రష్యా నవలాకారులను లక్ష్యముగా పెట్టుకుని గ్రంథరచనచేస్తూ జీవయాత్ర గడుపుతున్నాడు.

ఆ అమ్మాయి శివరావు వచ్చినట్టు తల్లిని కేక వేయగానే కామేశ్వరమ్మ త్వరత్వరగా చెంబుతో నీళ్లు పట్టుకునివచ్చి "నాయనా, శివుడూ, కాళ్లు కడుక్కో" అని నీళ్లు ఇచ్చింది. అతను కాళ్లు కడుక్కొనివచ్చి కుర్చీలో కూర్చున్నాడు. తల్లి ఏమి మాట్లాడుతుందో శివరావు ఏమి చెపుతాడో ఆలకించడానికి రాజ్యలక్ష్మి పక్కగదిలో తలుపు చాటున నిలుచున్నది. కామేశ్వరమ్మ కింద కూర్చుని "నేను వ్రాయించిన ఉత్తరముఅందిందా? నిన్ననే వస్తావని అనుకున్నాను. నీవు రాకపోతే నాకేమీ తోచింది కాదు" అన్నది.

"నీ ఉత్తరము అందగానే రావలె ననుకున్నాను. కాని కొన్ని అవసరమైన పనులు ఉండడమువల్ల ఈ [illegible] తీరింది కాదు మరి" అన్నాడు శివరావు

"ఏమో, నాయనా, నాకు అన్నలూ తమ్ములూ లేకపోయినా నీవే నాకు అన్నవీ, తమ్ముడివీ! మరి ఈ విషయములో నీవు తప్ప మరొకరు జోక్యము కల్పించుకున్నా ప్రయోజనము ఉండదు."

"అయితే అక్కయ్యా, వెంకటేశ్వరరావు పెండ్లి చేసుకున్నాడని ఎవరు చెప్పినారు? అది ఉత్తపుకారో ఏమోనని నా అనుమానము."

"ఏమని చెప్పేదిరా అబ్బాయీ! డిప్యూటీ కలెక్టరీ చేసి పింఛన్ పుచ్చుకున్న సీతారామయ్య గారి కుమార్తెను, పెద్దమనిషి అయినదాన్ని పెండ్లి చేసుకున్నాడట. ఈ విషయము ఈ మధ్య మాకు చూచాయగా తెలిసినప్పుడు మీ బావగారూ నేనూ నమ్మలేదు. మదరాసులో చదువుకునేవాళ్లు అతను పెండ్లి చేసుకున్నాడని చెపుతుంటే నమ్మకపోవడము ఎలా?"

" బావ ఈవిషయములో ఏమంటున్నాడు? "

" ఆయనకూ ఏమీ తోచడము లేదు. ఒకప్పుడు అతను పెండ్లి చేసుకుని ఉండడనీ, మరొకప్పుడు ఏమోననీ అంటూ ఉన్నారు. "

ఆలోచనచేస్తూ " ఏమోనమ్మా, వెంకటేశ్వరరావు పెళ్ళి చేసుకున్నాడంటే నేను నమ్మలేకుండా ఉన్నాను. అయినా వాడు మీ ఇంటికి వచ్చి ఎంత కాల మయింది? " అన్నాడతను.

" సుమారు మూడు సంవత్సరాలు కావస్తున్నది. అతను పట్నము వెళ్ళిన మొదటి సంవత్సరము మాత్రము వేసంగి సెలవలకు వచ్చి నెల రోజులు ఉండి పోయినాడు. అప్పటినుంచీ ఒక్క ఉత్తరమైనా అతని దగ్గిరనుంచి రాలేదు. మీ బావగారు రమ్మని అతనికి ఎన్నిపర్యాయములో వ్రాసినారు. పిల్లది పెద్దదయినప్పుడు, తప్పకుండా రమ్మని వ్రాశారు. ఒక్కదానికీ ప్రత్యుత్తరము లేదు. ఏమి చేయనున్నావు? "

" పోనీ బావ ఒకపర్యాయము [illegible] వెళ్ళి పిలన్న స్వయముగా పిలుచుకురాక పోయినాడూ! "

" నే నెన్నోసార్లు వారితో చెపితే సెలవు దొరకదని ఏదో ఊరుకున్నారు. ఇప్పుడు చివరకు ఇలా జరిగిందని తెలుస్తున్నది. "

శివరావు ఆలోచిస్తూ ఊరుకున్నాడు. కామేశ్వరమ్మ కళ్లనీళ్లు పెట్టుకుని " ఏమోరా, ఇంతకూ దీనివ్రాత ఇలా ఉన్నది కాబోలు. లేకలేక ఒక్క పిల్లని అంటూ పుట్టి పెద్దది అయ్యేసరికి దీనికర్మము ఇలా అయింది! " అని ఏడవసాగింది. ఆమె ఏడవడము చూస్తే శివరావుకు జాలివేసింది. " అక్కయ్యా, ఏడవకు. వాడు పెళ్లిచేసుకున్నాడని నీ వెంత చెప్తున్నా నేనుమట్టుకు నమ్మలేకుండా ఉన్నాను. అయినా స్వయముగా వాణ్ణి [illegible] మాట్లాడితే కాని ఏమీ చెప్పలేను " అన్నాడు శివరావు.

ఇట్లా మాట్లాడుతూ ఉండగా సోమసుందరముగారు ఆఫీసునుంచి వచ్చినారు. శివరావును చూస్తూ కొంచెము ముఖవికాసముతో " ఏమిరా వచ్చావూ! చాలా సంతోషము " అని పక్కన ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

" ఏమి బావా, అక్కయ్య చెప్పే విషయము నీవు ఎంతమట్టుకు విశ్వసిస్తావు? "

" ఏమోరా అబ్బాయి, నేనేమీ చెప్పలేకుండా ఉన్నాను. అయినా నీ అభిప్రాయ మేమిటి ఈ విషయములో? "

" నేను ఎంతమాత్రమూ నమ్మలేకుండా ఉన్నాను. "

" ఎందువల్ల? "

" వాణ్ణి చిన్నప్పటినుంచీ ఎరుగుదును. వాడు అల్లా మళ్ళీ పెళ్లి చేసుకున్నాడంటే ఎందువల్లనో నాకు నమ్మకము పుట్టడము లేదు. "

" నేను నమ్మకపోవడము ఇందువల్ల కాదు. రెండు సంవత్సరాల కిందట మనవాడి పెత్తండ్రి చనిపోయినాడు. ఆయన చనిపోతూ తన ఆస్తిని కూడా వెంకటేశ్వరరావుకే ఇచ్చివేస్తూ యావదాస్తినీ ట్రస్టీలపరము చేసిపోయినాడు. అతని మామగారని తెలుస్తున్న సీతారామయ్యగారున్నూ ట్రస్టీలలో ఒకరు. ఆయన అంత అవ్యక్తముగా పిల్లపైన పిల్లనిచ్చి చేస్తాడా? "

ఆశ్చర్యముతో " ఈ విషయము నాకు తెలియనే తెలియదు సుమా! అయితే ఇంక ఎంతమాత్రమూ నమ్మడానికి వీలులేదు " అన్నాడు శివరావు.

" అయితే అట్లా అనుకుని ఈ విషయము విశ్వసించకపోవడానికీ వీలులేదు. ఎందువల్లనంటే అతనికిదివరలోనే వివాహము అయిఉన్నట్టు ట్రస్టీలకు తెలుసునో తెలియదో! సీతారామయ్య కూతురి వ్యామోహములోపడి తనకు వివాహము కాలేదని చెప్పి నమ్మించి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడేమోనని అప్పుడప్పుడు ఊహ పోతుంది. ఏమంటావు? "

" అయితే మనము ఇన్ని కల్పనలు చేయడము కన్న స్వయముగా వెళ్ళి తెలుసుకుంటే బాగుంటుందేమో ? "

" సరే, అతను మరొక పిల్లను పెళ్ళి చేసుకున్నమాట వాస్తవమే అవుతుందనుకో ! అప్పుడేమిటి చేయడము ? "

" ఏమమ్మా , అక్కయ్యా , ఏమంటావు? "

" నాకేం తెలుస్తుందిరా , నాయనా ? మీరే యోచించండి " అన్నది కామేశ్వరమ్మ .

" యోచించేదేమున్నది ? ఏదో విధముగా అతన్ని ఒప్పించి మన పిల్లదానికి కూడా పునస్సంధానము చేసి అతని దగ్గరకు పంపించడమే కర్తవ్యము . "

" ఎన్నాళ్ళు యోచించినా నాకూ ఇట్లాగే తోచింది . అయితే ఈ కార్యనిర్వాహం నీ వల్ల తప్ప నావల్ల కాదు . అమ్మాయి భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని ఏదో విధముగా మరి పనిచెయ్యవలెను సుమా. "

" నిజమే . నా శాయశక్తులా చూస్తాను . "

" సరే, లే. పొద్దు పోయింది . భోజనము చేతాము . "

౨

వెంకటేశ్వరరావుకు పదిహేడు సంవత్సరాలప్పుడు తండ్రి అకస్మాత్తుగా చనిపోయినాడు. ఆయన తహసీల్దారుపని చేసినాడు. బ్రహ్మ సమాజ మత ప్రచారకుడై పెండ్లి పేరంటము లేకుండా కేవలము విరాగిగా ఉంటున్న అన్నగారు సాంబశివరావు తప్ప రక్త స్పర్శగల బంధువులు మరెవ్వరూ లేరు. ఆయన నడివయస్సులో ఉండగా లేక లేక వెంకటేశ్వరరావు జన్మించినాడు. కుమారునికి నాలుగు అయిదు సంవత్సరములు వచ్చి కొంచెము గ్రాహ్యత ఏర్పడుతున్న కాలములో తల్లి చనిపోయింది. ఎందువల్లనో అతని తండ్రి తిరిగి పెండ్లి చేసుకోలేదు.

అతి గారాబముతో కొమారుణ్ణి పెంచుతూ పుత్రవాడి భవిష్యత్తును గురించి ఆయన ఆలోచిస్తూ ఉండేవాడు. ఒకవేళ తన కేదయినా వ్యాధి వచ్చినా, మరణము సంభవించినా పిల్లవాడిని చూసే వాళ్ళు ఎవ్వరూ లేక పోతారనీ సామాన్యుల పిల్లను కొడుక్కు ఇచ్చి చేసుకుంటే వాళ్ళు తన తదనంతరము కుమారుణ్ణి చాలా జాగ్రత్తగా చూస్తారనీ అభిప్రాయపడ్డాడు. తన కచ్చేరీలోనే సోమసుందరం అనే నమ్మకమైన గుమాస్తాకు ఒక్కతే కుమార్తె, రూపసి. ఇంతకంటె మంచి సంబంధము దొరకదని ఒకనాడు తహసీల్దారు సోమసుందరాన్ని పిలిపించి ఆయన కుమార్తె రాజ్యలక్ష్మిని తన కుమారుడికి ఇచ్చి వివాహము చెయ్యవలసిందని కోరినాడు.

పేదవాడైన సోమసుందరం అందుకు చాలా సంతోషించాడు. పిల్లవానికి ఒకవేళ చదువు సంధ్యలు రాక ఉద్యోగము చెయ్యకపోయినా భూములమీద వచ్చే ఆదాయంతోటే రాజోపచారంగా పిల్ల సుఖపడుతుందని రాజ్యలక్ష్మిని ఇచ్చి పెండ్లి చేసినాడు.

వెంకటేశ్వరరావుకు పసితనమునుంచీ పెత్తండ్రి అంటే చాలా గౌరవము. ఎప్పుడో వచ్చి నాలుగురోజులుండి వెళ్ళేవాడు కావడంచేత ఆయనదగ్గర అతనికి అంతగా చనువులేదు. ఆయన గుణగణాలు ఇతరులు ఉగ్గడిస్తుండగా వినడంచేత పత్రికలలో చదువుతున్నందువల్లా ఆయన మీద భక్తీ అనురాగమూ అంతకంతకు ఎక్కువయినవి. ఆయన ఉపన్యాసాలు స్వయముగా వినేటప్పటికి అతని దృష్టిలో ఆయన ఒక అవతార పురుషుడుగా తోచాడు.

సాంబశివరావుగారు తమ్ముడికన్న అయిదారేండ్లు పెద్ద. వార్ధక్యములో ఉన్నాడు. ఓపిక లేక పోవడంచేత కొద్దికాలంనుంచీ ఆయన మత ప్రచారం చాలావరకు తగ్గించి, ఏదైనా గ్రంథ రచన, ఉపాసన ప్రశాంతంగా చేసుకుంటూ కాలం వెళ్లబుచ్చుదామని మదరాసు దగ్గర

కూంబళంలో పెద్దతోట ఒకటి కొని, అందులో చిన్న కుటీరము వేయించుకొని ఏకాంతముగా ఉంటున్నాడు.

అలాఉంటూ ఉన్న కాలములో అకస్మాత్తుగా తమ్ముడు చనిపోవడముచేత వెంకటేశ్వరరావును తన దగ్గరకు తీసుకువెళ్ళి మదరాసులో కాలేజిలో చేర్పించినాడు.

అతన్ని పెత్తండ్రి తీసుకు వెళ్ళేటప్పుడు సోమసుందరం కాస్త సూక్ష్మబుద్ధికలవాడు కావడంచేత సాంబశివరావుగారి ఆస్తికూడా అల్లుడికే ఉత్తరోత్రా చెందజేస్తాడనీ, విద్యాభ్యాసానికి అవకాశాలు అక్కడ ఎక్కువ ఉంటవనీ యోచించే సమ్మతించాడు.

మాఘోత్సవము వచ్చింది. ఆరోజుల్లో సాంబశివరావుగారు రాత్రింబవళ్లూ బ్రహ్మసమాజ మందిరంలోనే ఉంటూవచ్చారు. ఒకనాడు తానుకూడా మందిరమునకు రావచ్చునా అని వెంకటేశ్వరరావు ఆయన్ను ప్రశ్నించాడు. అందుకు సంతోషించి అతనిని వెంటబెట్టుకుని సమాజమందిరముకు తీసుకు వెళ్లి తనసమీపములో కూర్చుండ బెట్టుకున్నాడు. ఆరోజు ప్రధాన వక్తలలో సాంబశివరావుగారు ఒకరు. ఆయన సాంఘిక విషయాలను గురించి గంభీరముగా ఉపన్యసించాడు. వెంకటేశ్వరరావు సావధానముగా ఆఉపన్యాసమంతా విన్నాడు. అతని కోమల హృదయములో ఆఉపన్యాసము అంతులేని కల్లోలము కలుగ జేసింది.

తరువాత మరొకరు తమిళ భాషలో ఉపన్యసించడం ఆరంభించారు. వెంకటేశ్వరరావుకు అరవము తెలియక ఆ ఉపన్యాసము అంతా అయోమయముగా ఉంది. అయినా లేచిపోవడం మర్యాదగా ఉండదనుకొని అక్కడే కూర్చున్నాడు. విసుగువల్ల అటూ ఇటూ చూస్తూ ఏదో తీవ్రముగా యోచించుకుంటూ ఉండగా అప్రయత్నముగా దృష్టి ఎదుట కూర్చున్న వారి మీదికి పోయింది.

అక్కడ సీతారామయ్యగారి కుటుంబము కూర్చుని ఉంది. ఆయన ఎవరోనని మొదట జిజ్ఞాస కలిగింది. కొంచెము సేపటికి ఆయన కుడి పక్కన కూర్చున్న కుమార్తె సత్యభామ కనపడ్డది. తన వంక అతను చూడగానే ఆమె తల వంచుకున్నది. తన్ను చూచి తలవంచిందా అనే సందేహము అతనికి కలిగింది. తన సందేహాన్ని పోగొట్టుకో దలచి మరొకవైపు చూస్తున్నట్టు నటిస్తూ వెంకటేశ్వరరావు ఆమెను పరీక్ష చేశాడు. ఆమె తన ముఖారవింద మధువునే నేత్రాలతో గ్రోలుతున్నట్టు గ్రహించాడు. చప్పున తేరిపారచూస్తే ఏమి చేస్తుందో చూతామనే కుతూహలంతో ఆమె వంక చూసినాడు. సిగ్గుతో ఆమె తల వాల్చింది. ఇక అక్కడనుంచి ఆమెను అతను ఓరకంటితో చూడడమూ, అతనిని ఆమె ఓరకంటితో చూడడమూ సాగించినారు. వారు అన్యోన్యమూ ఎందుకు అట్లా చూసుకుంటున్నారో వారికే తెలియదు. అయితే చూసుకోవడం వల్ల వారిద్దరికీ ఏదో అవ్యక్తానందం కలిగింది. అట్లా ఎన్ని పర్యాయములు చూసుకున్నారో, సభలో ఏమి జరుగుతున్నదో అతనికీ తెలియదు, ఆమెకూ తెలియదు.

సభ అయిపోయింది. అందరూ బయలుదేరినారు. సీతారామయ్యగారి కుటుంబము లేచి బయటికి వెళ్లబోతున్నది. తండ్రి వెంట నడుస్తూ సత్యభామ వెనకకు తిరిగి చూసేసరికి అప్రయత్నముగా వెంకటేశ్వరరావు తల వంచి వెంటనే తలయెత్తి చూసినాడు. ఆమె అతని వంకే తిరిగి తిరిగి చూస్తూ తల్లిదండ్రులతో కదిలి పోయింది. ఆమె కనబడకుండా వెళ్లేవరకూ చూసిచూసి, లోపల ఎవరితోనో మాటలాడుతున్న సాంబశివరావుగారి దగ్గరకు వెంకటేశ్వరరావు వెళ్లినాడు.

అతను ఇంటికి చేరిన తర్వాత ఏమిచెయ్యబోయినా తోచలేదు. పడక కుర్చీలో కూర్చుని చదువుదామని పుస్తకమొకటి తెరిచినాడు. సమాజమందిరములో తన్నాకర్షించిన యువతిపైనే దృష్టి ఉన్నది. తాను పుస్తకములో ఎక్కడ చదువుతున్నాడో అని చూసేసరికి పుస్తకము తలకిందు

గా పట్టుకున్నట్టు తెలిసింది. అతనికి నవ్వువచ్చింది. నాలుగు పంక్తులు చదివినాడు. ఏమీ అర్థము కాలేదు. మనస్సు ఆయువతిపైకే మళ్లింది. పుస్తకము మూసి పడుకున్నాడు. చాలా పొద్దుపోయే వరకూ నిద్ర పట్టలేదు. ఆవిడ క్రేగంటి చూపులే చిరునవ్వే తిడవతిడవకు తలపుకు వచ్చేవి.

రెండుమూడు రోజులు గడిచేటప్పటికి అతను మళ్ళీ చదువుధోరణిలో పడ్డాడు. ఎప్పుడో అకస్మాత్తుగా ఆవిడ జ్ఞాపకము వచ్చినప్పుడు మాత్రము పుస్తకము మూసి ఆలోచనలో పడేవాడు.

ఆదివారము వచ్చింది. ముస్తాబు పూర్తిచేసుకుని అతను ప్రార్థనమందిరానికి బయలుదేరేటప్పటికి, ఎప్పటికన్న ఆరోజు ఎక్కువకాలము ముస్తాబు మీద గడిపినది మనసుకు తట్టి తనలో తాను నవ్వుకున్నాడు.

సత్యభామ ప్రతిఆదివారముప్రార్థనమందిరానికి వస్తుందో రాదో అనే సందేహము అతనికి తోవలో కలిగింది. రాదేమోనని తోచేటప్పటికి మనస్సు చివుక్కు మన్నది. తాను వెళ్ళడము ప్రార్థనకు కాదనీ సత్యభామనే చూడడము ముఖ్యమనీ తేలేటప్పటికి పాపము చేస్తున్నానేమోనని అతనికి అనుమానము వేసింది. ప్రేమ భగవత్స్వరూపమైనది గనుక దోషము లేదనుకున్నాడు.

తనకు సత్యభామ మీద ప్రేమ కలిగినట్లు ఆమెకు తన మీద కూడా ప్రేమఉంటే తప్పక ప్రార్థనమందిరానికి ఆమె ఎందుకురాదనే ధైర్యము కలిగింది.

మందిరములోకి వెళ్లేటప్పటికి సత్యభామ కనిపించినది. ఒకరి నొకరు చూచే టప్పటికి ఇద్దరికీ సిగ్గు వచ్చి మరొక వైపు చూచారు.

ప్రార్థన ప్రారంభము అయింది. అందరితో పాటు వెంకటేశ్వరరావు కూడా కండ్లు మూసుకున్నాడు. అతనికి ప్రార్థనవాక్యాలు వినబడడము లేదు. ఆమె ఏమి చేస్తున్నదో చూడవలెననే కుతూహలము తప్ప మరొక విషయము లేదు. కళ్ళు తెరిచినాడు. అదివరకే కళ్లు తెరిచి అతనిని చూస్తున్న ఆమె వెంటనే కళ్లు మూసుకున్నది. వెంకటేశ్వరరావు రెప్పవాల్చక ఆమెనే చూస్తున్నాడు. నాలుగు నిమిషము లయ్యేటప్పటికి మెల్లిగా కనులు తెరచి చూచింది. వెంకటేశ్వరరావు ధైర్యముతో చిరునవ్వు నవ్వినాడు. ఆమె పెదవులమీద కూడా అప్రయత్నముగా మందహాసము అంకురించింది.

వారికి తెలియకుండానే ప్రార్థన పూర్తిఅయినది. అందరూ లేవడములో వారి చూపులకు ఆటంకము కలిగింది.

తాను ప్రార్థన చేయక వెంకటేశ్వరరావును చూస్తూకూర్చున్నట్టు తండ్రి కనిపెట్టినాడేమోనని సత్యభామకు భయము వేసింది. వెంకటేశ్వరరావుకు కూడా అలాటి భయమే కలిగింది.

అందరూ వీధిలోకివచ్చినారు. సాంబశివరావుగారు పెద్దలతో మాట్లాడుతూ వెనక నడుస్తున్నాడు. ఆయన దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోవడానికి సీతారామయ్యగారు నిలబడ్డారు. సత్యభామకూడా కొంచెము బెదురుచూపులతో తండ్రి దగ్గరగా నిలబడినది.

వెంకటేశ్వరరావు పెత్తండ్రిని కలుసుకుని సీతారామయ్యగారున్నతావుకు వచ్చినాడు. సాంబశివరావుగారికి నమస్కరించి సెలవుతీసుకుంటూ సీతారామయ్యగారు వెంకటేశ్వరరావును చూపించి "ఈ అబ్బాయి ఎవరండీ" అని అడిగినారు.

వెంకటేశ్వరరావుకు పైప్రాణముపైనపోయింది పెత్తండ్రితో ఏమిచెపుతాడో కదా అని. సత్యభామ తన కాలివ్రేళ్లను చూస్తూ నిలబడ్డది. ముఖము కొంచెము జేవురించినట్లున్నది.

సాంబశివరావుగారు వెంకటేశ్వరరావు తన తమ్ముని ఏకపుత్రుడనీ, తమ్ముడు చనిపోయినప్పటి నుంచీ తనదగ్గరే ఉండి ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుతున్నాడనీ చెప్పినారు. సీతారామయ్యగారు ఆదరముగా చిరునవ్వుతో వెంకటేశ్వరరావు కరస్పర్శచేసి సత్యభామతో కలిసివెళ్లిపోయినాడు. వెంకటేశ్వరరావుకు ధైర్యము కలిగింది. అతను అనవసరముగా భయపడ్డానని అనుకున్నాడు. సత్యభామకూడా తనకరస్పర్శ చేసినట్టయితే ధన్యుడనయ్యేవాడి ననుకున్నాడు.

౩

సీతారామయ్యగారు అనుష్ఠానిక బ్రాహ్మసమాజికుడు కాకపోయినా బ్రహ్మమతాభిమాని; అంతేకాదు కార్యశూరుడైన సంఘసంస్కర్త. పెద్దకూతురికి రజస్వలానంతర వివాహము చేసినాడు. సత్యభామకుకూడా అలా చేయవలెననే ఆయన సంకల్పము. ఆమెకిప్పుడు పదునాలుగు వెళ్లి పదిహేనోయేడు వచ్చింది.

వెంకటేశ్వరరావు ప్రార్థన సమాజానికి వెళ్లడము ప్రారంభించి సంవత్సరం గడచిపోయింది.

ఈ సంవత్సరకాలములో సత్యభామా వెంకటేశ్వరరావుల అవాఙ్మానసమైన ప్రేమ చైతన్యము తాల్చి మాటలలోకీ, సరససల్లాపములలోకీ వచ్చింది. ఏకాంతమున చేరినప్పుడు వారు ఒకరి మనోభావములను ఇంకొకరికి వ్యక్తపరుచుకున్నారు. వివాహమాడడానికి నిశ్చయించుకున్నారు.

సత్యభామను చూసింది మొదలు అతనికి మతిపోయింది. తనను పెండ్లి చేసుకోవడానికి ఆమెకు ఇష్టమేనని తెలియజేసేవరకూ, అతనిమనస్సు అనేక సంక్షోభాలు అనుభవించింది. ఆ విషయంలో ధైర్యము కలిగే వరకు అతనికి సోమసుందరంగారి కూతురూ, పెత్తండ్రీ స్ఫురణకు వచ్చారు.

రకరకాలయిన ఆలోచనలు కలిగినవి. కర్తవ్యము ఏమీ తోచిందికాదు. సత్యభామను చూచిన సంవత్సరమునుంచీ అతను అనుభవించిన చిత్తసంక్షోభాలు వేరు; ఇప్పుడు కలిగినవి వేరు. సత్యభామ ప్రేమపాశాలతో అతన్ని బంధిస్తున్నది. అతను కూడా ఆమె బంధానికే ఆశిస్తున్నాడు. అయితే ఒక చెంప అతని పెత్తండ్రి మీద ఉన్న అనురాగమూ, భక్తీ, గౌరవమూ, జ్ఞప్తికి రావడము మొదలు పెట్టినవి. తాను సత్యభామను వివాహమాడడానికి ఆయన ఎంతమాత్రమూ ఒప్పుకోడని తెలుసును. ఆయనకు వ్యతిరేకించి ఏమి చేయడానికీ అతనికి ధైర్యము లేదు. మరొకచెంప రాజ్యలక్ష్మి. ఆమెను త్యజించడము అధర్మమని తెలుసును. అతను ఇటువంటి సందిగ్ధావస్థలో పడ్డాడు. నిద్రాహారాలు లేకుండా ఆలోచించాడు. అతని కేమీ తోచలేదు.

అప్పుడే సాంబశివరావుగారికి అవసాన దశ వచ్చింది. ఆయన చనిపోయేముందు తన ఆస్తిలో సగము బ్రహ్మసమాజమత ప్రచారమునకుగాను ధర్మశాసనము వ్రాసి మిగిలిన సగభాగమును వెంకటేశ్వరరావుకు చెందేటట్లు చేసినాడు. లోకానుభవము లేకపోవడము వల్లగాని పసితనము వల్లగాని వెంకటేశ్వరరావు ఆస్తిని పాడుచేసుకుంటాడనే ఉద్దేశ్యముతో తనకు ఆప్తులయిన ముగ్గురిని ఆ ఆస్తికి ట్రస్టీలుగా నియమించి అతనికి పాతిక సంవత్సరాలు వచ్చేవరకూ ఆ ఆస్తిని వారి స్వాధీనములోనే ఉంచినాడు.

ఆయన చనిపోయినప్పుడు అతని కెంతో దుఃఖము కలిగింది కాని తానిక సత్యభామను పెండ్లి చేసుకోవడానికి ఏ ఆటంకము లేదనే భావము కలిగినప్పుడు ఒకవిధమైన సంతోషము కూడా కలిగింది.

తర్వాత కొద్ది రోజులకే అతని నివాసము మాంబళమునుంచి విక్టోరియా హాస్టలుకు ట్రస్టీలు మార్పించినారు. ఇప్పుడు అతను సత్యభామకు దూరమైనాడు. వారి దేహము లెంత దూరము లయినవో వారి హృదయాలు అంత సామీప్యాన్ని పొందినవి. ప్రతి మూడు రోజులకూ ఒకరి కొకరు ఉత్తరాలు వ్రాసుకునే వారు. వారానికొక పర్యాయము ఎక్కడో అక్కడ ఎట్లాగో అట్లా కలుసుకునే వాళ్ళు.

సత్యభామా వెంకటేశ్వరరావుల అన్యోన్యానురాగమును గమనించి సీతారామయ్యగారు ఆమె నతని కిచ్చి వివాహము చేయ నిశ్చయించుకున్నారు. ఇతర ట్రస్టీలు కూడా అందుకు సమ్మతించినారు. అదివరకే అతనికి వివాహమైన సంగతి వారి కెవ్వరికీ తెలియదు. చివరకు వారి పాణిగ్రహణ మహోత్సవము జరిగింది.

౪

బాల్యస్నేహితుడు శివరావు ఆరోజు ఉదయము మెయిలులో తన్ను చూసిపోవడానికి వస్తున్నట్టు ఉత్తరము వచ్చినందువల్ల వెంకటేశ్వర

రావు మెయిలు వచ్చేవేళకు సెంట్రల్ స్టేషన్‌కు వెళ్ళినాడు. స్టేషన్‌లోకి మెయిలు వచ్చి ఆగింది. శివరావు కనబడ్డాడు. వెంకటేశ్వరరావు అతన్ని చూస్తూనే గాఢాలింగనము చేసుకున్నాడు.

శివరావూ అతనూ మాంబళము వెళ్ళినారు. వరండాలో సత్యభామ పేముకుర్చీలో కూర్చుని ఏదో చదువుకుంటున్నది. వారిని చూచి ఆమె లోపలికి వెళ్ళిపోయింది. చూస్తూనే ఆమె అతని ద్వితీయభార్య అయి ఉంటుందని శివరావు ఊహ చేసినాడు. వారిద్దరూ వరాండాలోని పడకకుర్చీలలో జేరగిలబడినారు.

కొంచెము సేపటికి లోపలినుంచి సన్నని స్వరముతో "వంటఅయి చాలాసేపయింది. లేస్తారా స్నానానికి ?" అని వినబడింది. "అలాగా" అంటూ "శివుడూ, లే, స్నానముచేసి భోజనము చేతాము" అని లేచినాడు వెంకటేశ్వరరావు. ఇద్దరూ స్నానము చేసినారు. కట్టుకోవడానికి శివరావుకు పట్టుబట్టలు ఇచ్చి వెంకటేశ్వరరావు ఉల్లిపొరలాగా ఉన్న మల్లుపంచె కట్టుకుని లాల్చీతొడుగుకుని భోజనానికి వచ్చినాడు.

భోజనానంతరము వారిద్దరూ హాలులో సోఫామీద కూర్చున్నారు. వెండిపళ్ళెములో తమలపాకులూ వక్కపొడీ తీసుకుని సత్యభామ వినయము ఉట్టిపడే నడకతో వచ్చి బల్లపైనపెట్టి వెళ్ళబోతుండగా "సత్యం" అన్నాడు వెంకటేశ్వరరావు. ఆమె తలవంచుకుని పక్కకు చూస్తూ నిలుచున్నది. "నీవు ఎప్పుడూ మెచ్చుకుంటూ ఉంటావే నవలలు — అభాగినీ, త్యాగినీ, కృష్ణవేణీ వ్రాసింది ఇతనే — శివరావు" అనిచెప్పినాడు. ఆమె తలవంచుకుని అతన్ని చూసి వెళ్ళిపోయింది.

"నాకు ఉత్తరము పత్రము నీదగ్గరనుంచి లేకపోయినా నాపుస్తకాలు మీఇంట్లో చదువుతున్నందుకు సంతోషము" అన్నాడు శివరావు.

"నిన్ను గురించి నాభార్యతో చెప్పనిరోజు లేదు. తెలుసునా ?"

"అలాగేం !"

ఇద్దరూ తాంబూలమువేసుకుంటూ సిగరెట్టు కాల్చుకుంటూ "ఏమిరా, నీ బ్యాగునిండా ఏవో పుస్తకాలు ఉన్నట్టున్నవి. అవన్నీ ఏమిటి ?" అన్నాడు వెంకటేశ్వరరావు.

"అవన్నీ నీబోటివాళ్ళు తప్పకుండా చదవవలసినవి. చాలా భాగము కామశాస్త్రము (Sexual Science) హేవలక్ ఎల్లిసు వ్రాసినవి."

"అయితే నవలలు వ్రాసేవాడివి నీ కెందుకురా అవన్నీ ?"

"కామశాస్త్ర విషయాలను వస్తువుగా తీసుకుని నవలలు వ్రాయవలెననే సంకల్పముతో చదువుతున్నాను."

"ఇదివరకు మన వాఙ్మయములో ఈలాంటి నవలలు లేవు సుమా !"

బ్యాగులో ఉన్న పుస్తకాలన్నీ తీస్తూ వెంకటేశ్వరరావు, "ఏమిరా, నిద్రపోతావా ఏం ? మత్తుగా ఉన్నట్టున్నావు" అన్నాడు.

"అవునురా. రాత్రి అంతా రైలులో నిద్ర లేనందువల్ల అలాగే ఉంది" అన్నాడు శివరావు.

ఆపొట్లు పక్కగదిలో పట్టెమంచము చూపించగా శివరావు పడుకున్నాడు.

మధ్యాహ్నము నిద్రలేచి వారిద్దరూ మద్రాసుకు బయలుదేరనారు. మద్రాసు వెళ్ళగానే కాఫీ మొదలైన పదార్థములు పుచ్చుకుని సముద్రపు ఒడ్డుకు షికారు వెళ్ళినారు. సముద్రపు ఒడ్డునే నడుస్తూ ఆధునికాంధ్ర వాఙ్మయాన్ని గురించీ, గ్రంథకర్తల జీవనాన్ని గురించీ, ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకుంటూ ఎస్ప్లనేడు బీచికి వచ్చి కూర్చున్నారు.

వెంకటేశ్వరరావు చాలా సంతోషముగా ఉండడము కనిపెట్టి అంతకంటె మంచిసమయము దొరకదనుకుని శివరావు తాను వచ్చిన విషయము ప్రస్తావన చేయుదలచుకున్నాడు. ఈ విషయము ముచ్చటించడానికి పూర్వము కొంచెముసేపు శివరావు మౌనము వహించినాడు. కొంతసేపు ఇద్దరూ నిశ్శబ్దముగా కూర్చున్న తరువాత శివరావు "నేను వచ్చిన విషయమేమిటో చెప్పమన్నావా ?" అన్నాడు.

వెంకటేశ్వరరావు కొంచెము ఉత్సాహముతో, "ఏమిటో చెప్పూ, అడగడము మరిచిపో

యుచానను" అన్నాడు.

శివరావు మందహాసముచేసి "రాజ్యలక్ష్మి నీదగ్గిరికి వెళ్లిరమ్మంటే వచ్చినాను," అన్నాడు.

"రాజ్యలక్ష్మి ఎవరూ!"

"అప్పుడే మరిచిపోయినావా?"

"అప్పుడే మరిచిపోయినావా అంటే అర్థమేమిటి?"

"ఆఁ"

"ఏమిటోచెప్పరాదా? లోకములో అనేక మంది రాజ్యలక్ష్మమ్మలున్నారు. వారి నందరినీ జ్ఞాపకము పెట్టుకోవడమేనా నాపని?"

"ఆ, నీవు ఎరగనట్లు మాట్లాడినా రాజ్యలక్ష్మిని మరిచిపోయినావంటే నమ్మను, ఎందుకు డాబు?"

"ఏమిటి ఇది? ఏమిటో చెప్పరాదూ!"

శివరావు అతనివంక చాలా తీవ్రముగా చూస్తూ "చాలా బాగుంది! రాజ్యలక్ష్మి ఎవరో మరిచి పోయినావూ! నేను గుంటూరులో ఎవరి ఇంట్లో ఉండే వాణ్ణో జ్ఞాపకము తెచ్చుకో!" అన్నాడు.

నిదానముగానూ, తీవ్రముగానూ యోజిస్తున్నట్టు తల ఊగించి మెల్లిగా "జ్ఞాపకము వచ్చింది" అన్నాడు వెంకటేశ్వరరావు.

"అయితే నేను వచ్చినపని ఏమిటంటే, నీ పునస్సంధాన ముహూర్తము నీ మామగారు ఈనెల ఇరవై రెండో తేదీని నిశ్చయించినారు. నిన్ను తీసుకుని రావడానికి నన్ను పంపించారు."

"నీవు మధ్యాహ్నము చూసినావే, ఆమెను నేను ఈ మధ్య పెళ్ళి చేసుకున్నాను."

"నాకు తెలుసును."

"అయితే —"

"ఈ నెల ఇరవై రెండో తేదీన నీ పునస్సంధానము. ఇవ్వాళ పద్ధెనిమిది. కాబట్టి రేపు లేదు ఎల్లుండి బయలుదేరి వెళ్ళవలెను."

ఇందుకు వెంకటేశ్వరరావు ఏమీ సమాధానము చెప్పలేదు. ఉభయులూ మౌనముగా కూర్చున్నారు. వెంకటేశ్వరరావు దిగాలపడిపోయి తలకింద మోచెయ్యి పెట్టుకొని పడుకున్నాడు.

౫

రాత్రి తొమ్మిదిగంట లయింది. గదిలోకి వెళ్ళి పందిరి మంచము మీద వెంకటేశ్వరరావు పడుకున్నాడు. సిగరెట్టు కాగా సిగరెట్టు కాలుస్తున్నాడు. ప్రతిరోజూ ఉండే ఉత్సాహమూ ఉల్లాసమూ లేకపోగా అఖండమైనదుఃఖముఅతని ముఖములోకనబడుతున్నది. అతనుపడుకునిఇటూ అటూమసలడము మొదలు పెట్టినాడు. అరగంట అయ్యేసరికి సత్యభామ గదిలోకి వచ్చింది. సన్నటి పచ్చదీపము వెలిగించి పెద్ద దీపము తీసి మెల్లిగా వెళ్ళి మంచముపైన కూర్చొని అతని వంక చూసింది. అత నేదో పెద్ద విచారములో ఉన్నట్టు ఆమె గ్రహించింది.

కొంతసేపటికి అతను తన ముఖము భార్యకు కనిపించకుండా ఉండేలాగున పక్కకు ఒత్తిగిలి పడుకున్నాడు. అతని అవస్థ చూసి చాలా జాలి చెంది "ఏమండీ, ఇలా ఉన్నారేం ఇవ్వాళ?" అన్నది సత్యభామ. అతను భార్యవంక తిరిగి ఆమె ముఖాన్ని తదేక దృష్టితో చూస్తూ ఏమీప్రత్యుత్తరము ఇవ్వకుండా ఊరుకున్నాడు. ఆమె కొంచెముసేపు ఊరుకుని "ఏమండీ, చాలాదూరము తిరిగినారా? తలనొప్పి వచ్చిందా?" అన్నది. ఇందుకూ ఏమీసమాధానము చెప్పకుండా ఆమెవంక వెర్రిగా చూడసాగినాడు.

ఆమెకు ఏమీతోచలేదు. జాగ్రత్తగా అతని స్థితి యోజిస్తూ ఒత్తిగిలిపడుకుని ఉన్న అతని మీదగా తనచెయ్యి అవతలవైపువేసి కూర్చుని అతన్ని ముఖాముఖీ చూస్తూ మరొకచేతితో అతను సాయంత్రము దువ్వుకోకపోవడముచేత ముఖముపైకి పడుతూఉన్న ముంగురులను ఒయ్యారంగా సవరిస్తూ "ఏమండీ, చాలా విచారముగా ఉన్నారు?" అన్నది సత్యభామ.

అతనేమీ జవాబు చెప్పలేదు. ఆమె కొంచెము దీనముగానూ, పరుషముగానూ, "మీ విచారానికి కారణ మేమిటో నేను తెలుసుకోవలసిన అగత్యము లేదనేట్లయితే అడగడము మాని వేస్తాను లెండి!" అన్నది.

ఈమాట అతని హృదయాన్ని కొంత కదిలించింది. అతను మెల్లిగా "మహావిచారసాగరములో మునిగి తేలుతూ ఉన్నాను. ఒడ్డు ఏమీ కనబడడము లేదు" అన్నాడు.

"మీరు ఇంటికి వచ్చినప్పటినుంచీకూడా విచారసాగరములోపడి తేలుతూఉన్నారని నాకు తెలుసును. అయితే ఆవిచారము ఏమిటో నాకు కూడా చెపితే నేనుకూడా ఏదో —"

"నీకు చెప్పితే నీవు నాకంటె ఎక్కువ దుఃఖము అనుభవిస్తావు. అందువల్లనే నీకు చెప్పడము మానివేసినాను."

"నేను దుఃఖము అనుభవిస్తావనేది మీ ఊహే కాని నిజమో అబద్ధమో తెలియదుకదా"

"కాదు, కాదు. నాకు తెలుసును."

"మీకు ఎట్లా తెలుసు నేం ?"

"అబ్బా నాకు తెలుసునంటే—"

"మీరు నాసంగతి తెలుసునని అనుకుంటున్నారు. కాని నే నెంతధైర్యము కలదాన్నో మీకు అసలు తెలియనే తెలియదు."

"ఊఁ. ఎనిమిది నెలల నుంచీ మన మిద్దరమూ ఒకచోట ఉంటూ ఉన్నాము. నీ హృదయమే ఎట్లాంటిదో నాకు తెలియక పోవడమేమిటి ?"

"మీకు తెలియదు లెండి. మా అన్నయ్యకూడా చిన్నప్పుడు నన్ను కటికగుండెగలదాని ననే వాడు."

"వాడు కటికగుండె కలవాడు కాబట్టి అందరినీ కటికగుండెవాళ్లు అంటాడు."

"అయితే మీరు కోమల హృదయులు కాబట్టి అందరినీ కోమల హృదయాలనే అనుకుంటారు."

"చాలులే. నీ చాకచక్యము !"

"పోనియ్యండి. అసలు విషయ మేమిటో చెపుదురూ !"

"మళ్ళీ మొదటికి వచ్చావూ !"

"అబ్బా, ఫరవాలేదు, చెప్పండి."

వెంకటేశ్వరరావు మహా విచారముగా చూస్తూ సత్యభామ చుబుకము పుణుకుతూ "చాలా దిగులుగా వుంది సత్యం" అన్నాడు.

"అవును మీరు మధ్యాహ్నము ఇంటిదగ్గర నుంచి వెళ్ళేటప్పుడుకూడా ఎంతో ఉత్సాహముగా ఉన్నారు. మళ్లీ వచ్చినప్పటినుంచీ ఏమో ఇదిగా ఉన్నారు. నాకొకటితోస్తున్నది. చెపితే మీకు కోపమువస్తుందేమో !"

"నాకు కోపమురాదులే. చెప్పు"

"ఏమీలేదు. శివరావుగారు మీ కేదో విచారము కలిగించేవిషయాన్ని చెప్పి ఉండకలెను."

అతను మౌనముగా ఊరుకున్నాడు.

"ఆ శివరావు వచ్చి హాయిగా ఉన్న మీ కేదో తెచ్చిపెట్టాడు ! అంతటితో మీమనస్సు అంతా వికలమై పోయింది."

"పాపము ! వాణ్ణి ఏమీ అనకు.—"

"స్నేహితుల కేవో పాడువిషయాలు చెప్పి బాధ కలుగజేయడము యోగ్యత కాబోలు !"

"అతనేమీ అట్లా చెయ్యలేదు. పొరపాటు పడ్డావు. నేనే కేవలము నిరపరాధు లయిన వాండ్లకు అన్యాయము చేశానే అనుకుంటూ దిగులుపడుతున్నాను."

సత్యభామ నివ్వెరపోయి అతనివంక చూస్తూ "ఏమిచేశా రేం ?" అన్నది.

"నీవు బాధపడుతావనే నీతో నేను అసలు విషయము చెప్ప నన్నది."

"అబ్బా ! ఎందుకండీ నన్నేడిపిస్తారూ ! చెపుదురూ ! కొంప మునిగిపొయ్యే దేమీ లేదు లెండి."

"నీవు అనవసరంగా విచారపడి పోతావని భయము."

"విచార పడనో అంటూ ఉంటే —"

"కాదు —"

"అయితే పడుకోండి. నేను చిన్న మంచము మీద పడుకుంటాను" అని సత్యభామ లేవ

పోయింది. లేవబోతున్న ఆమెను పట్టుకుని "కూర్చో కూర్చో" అన్నాడు. ఆమె బుంగ మూతి పెట్టుకుని కూర్చున్నది.

"నే నాసంగతి చెపితే ఒకవేళ నీకు విచారము కలగకపోయినా, నామీద అపరిమితమైన కోపము వస్తుంది."

చిరునవ్వుతో "ఏమిటండీ ఇది! నవ్వులాటా! మీమీద నాకు కోపము వస్తుందిటండీ!" అన్నది సత్యభామ.

"ఒకవేళ నీకు నామీద కోపమువస్తే?"

"నాకు మీ మీద కోపము రావడమేమిటండీ— చిత్రవిచిత్రాలు మాట్లాడుతారు!"

"నేను చేసినపనికి."

"మీ రేపనిచేసినా నాకు కోపము రాదు. అసలు నాకు కోపము వచ్చేపని చెయ్యనే చెయ్యరు."

"ఒకవేళ నీకు అపకారము చేసినా కోపము రాదూ?"

"నాకు మీరెందుకు అపకారము చేస్తారు?"

"చేశా ననుకో."

"మీరు అపకారము చెయ్యనే చెయ్యరు. ఒక వేళ మీరు అపకారమని చేసినా అది నాకు ఉపకారమే అవుతుంది."

"ఇట్లా అంటున్నావుగానీ చెపితే చిట్టచివర కేమనుకుంటావో మరి."

"ఏమనుకుంటానో చెప్పి చూడవలె కాని ఊరికే అనవసరముగా ఊహాలు చేసి అవస్థపడడ మెందుకు?"

"అయితే చెవుతాలే."

"సరే మీ ఇష్టము, చెపితే చెప్పండి లేకపోతే లేదు.

"చెపుతాను. మరి కోపపడకు" అంటూ వెంకటేశ్వరరావు భార్యను బుజ్జగిస్తూ "ఒక చిన్న పని చెపుతాను, చేస్తావూ?" అన్నాడు. ఆమె ఏమీ జవాబు చెప్పకుండా ఊరుకున్న ." "అతి సందర్భాలు చెపుతానుగా నీ తాంబూలము వేసుకుందాము. తమలపాకులూ, వక్కపొడీ పట్టుకురా" అని చెప్పినాడు. ఆమె అవి తీసుకురావడానికి లేచి పోయింది. అతనూ లేచి వెళ్ళి బీరువా తీసి, అడుగున సొరుగులో ఉత్తరాలు దాచిపెట్టుకునే అట్టపెట్టె తీసుకు వచ్చి మంచము మీద కూర్చున్నాడు. ఆమే వచ్చి అతని సరసనే కూర్చుని తాంబూలము అందిస్తున్నది. ఆ పెట్టె తీసి వెతికి వెతికి మూడు ఫొటోగ్రాఫులు తీసి సత్యభామ వంకచూస్తూ "ఈ పచ్చ దీపము తీసివేసి ఆ పెద్దదీపము వెలిగించు" అన్నాడు వెంకటేశ్వరరావు.

పెద్ద జ్యోతిలాగా వెలిగే దీపాన్ని ఆమె వెలిగించి వచ్చిన తరువాత అతను కొంచెము భయముతోనూ కొంచెము దైన్యముతోనూ, "ఈ ఫొటో ఎప్పుడైనా చూశావా?" అని భార్యను ప్రశ్నించినాడు.

"నే నెన్నడూ చూడలేదు" అంటూ ఆ బొమ్మవంక చూస్తూ చిరునవ్వుతో "మీకు చిన్నప్పుడు జుట్టూ జులపాలూ ఉండేవా ఏమండీ" అన్నది సత్యభామ. ఆ ఫొటోగ్రాఫులో ఒక వైపున వెంకటేశ్వరరావు తండ్రీ, మరొక వైపున రాజ్యలక్ష్మమ్మతండ్రీ, మధ్య వెంకటేశ్వరరావు రాజ్యలక్ష్మమ్మా ఉన్నారు. రాజ్యలక్ష్మికి అప్పుడు తొమ్మిది ఏండ్లు ఉంటవి. ఆ ఫొటో వంక నిదానించి చూసి చూసి ఆ కూర్చున్న వారిలో ఒక బొమ్మను చూపిస్తూ "ఇది మీ తండ్రిగారై ఉంటారు. ఏమండీ" అన్న దామె.

"అవును."

"ఈయ నెవరండీ?"

"మా మామగారు."

ముఖము చిట్లించి చూస్తూ "మామగా రంటే?" అన్న సత్యభామ.

"ఆ అమ్మాయి తండ్రి."

"ఆ అమ్మాయి ఎవరూ?"

" చెప్పుతాను, తొందరపడకు " అంటూ అతను ఇంకొక ఫొటోగ్రాఫు తీసినాడు. అందులో వెంకటేశ్వరరావు నిలుచుని ఉన్నాడు. రాజ్యలక్ష్మి కుర్చీలో కూర్చుని ఉంది. ఈ ఫొటో చూడగానే చాలా ఆత్రముగా " ఎవరీ అమ్మాయి చెప్పుదురూ ? " అన్నది సత్యభామ.

" చెప్పుతానులే. మరి తొందర పడకు " అంటూ అతను ఇంకొక ఫొటోగ్రాఫు చూపించినాడు. అందులో రాజ్యలక్ష్మి ఒక్కతే ఉన్నది. ఆ బొమ్మ చూసిన తరువాత " ఇక ఫొటోలు అక్కరలేదు లెండి. ఈ అమ్మాయి ఎవరో చెపితేనే గాని వీలు లేదు " అని సత్యభామ భర్త చెయ్యి పట్టుకున్నది.

అతను అతి ప్రశాంతముగానూ, గంభీరముగానూ, కొంచెము దుఃఖసూచకమైన స్వరముతో " ఆ పిల్ల నా భార్య " అన్నాడు. సత్యభామ ఆ మాటలు ఎంతమాత్రమూ విశ్వసించ లేక పోయింది. అతను తనను వేళాకోళము చేస్తున్నాడని ఎంచి " ఏమిటండీ వేళాకోళము ! ఆ అమ్మాయి ఎవరో చెప్పుదురూ ? " అన్నది.

" నా భార్య. "

" అంటే ? "

" అంటే ఏమిటి ?

ఆమె కత్యాశ్చర్యము కలిగింది. అయితే ఆపిల్లది తనభార్య అని కొంచెము గద్గదస్వరముతో చెప్పినందున చనిపోయి ఉంటుందని అనుకుని ఆమె " మీ మొదటిభార్య నాకంటె చక్కనిది సుమా అండీ " అన్నది.

" కావచ్చును. "

" నిజంగానండీ. అయితే ఆ అమ్మాయి దే ఊరండీ ? "

" గుంటూరు. "

" అయితే తలిదండ్రు లయినా జీవించి ఉన్నారా ? "

" అయినా అంటే ? "

" ఆ అమ్మాయి లేదుగా మరి ! "

" ఎందుకు లేదు. "

" ఉంటే నేనెందుకు మీదగ్గర ఉంటాను ? "

" అయితే ఆ అమ్మాయి ఏమైందని నీఅభిప్రాయము ? "

" ఆపిల్ల చనిపోయి ఉంటుందను కుంటాను. "

" జీవించే ఉన్నది. "

" నిజంగానా ! వేళాకోళమా ! "

" నిజంగానే —, వేళాకోళము కాదు. ఆ అమ్మాయి జీవించేఉంది. " ఈమాట లతనినోటి వెంట వచ్చి రాకముందే ఆమె నిర్ఘాంత పోయి అతనివంక తదేకదృష్టితో చూడడము మొదలు పెట్టింది.

అతను తల వంచుకుని ఖిన్నతతో మౌనముగా కూర్చున్నాడు. కొంచెము సేపటికి ఒకరినొకరు విపరీతముగానూ విరుద్ధముగానూ చూచుకోవడము మొదలు పెట్టినారు. కొంత సేపైన తరువాత ధైర్యముచేసి వెంకటేశ్వరరావు ఇట్లా చెప్ప నారంభించినాడు. " ఈ విషయము నీకు దుఃఖ కారణమైనా, కోప కారణమైనా సరే. చెప్పక తప్పనిసరి వచ్చింది. కాబట్టి చెప్పుతున్నాను. నాకు చిన్నప్పుడే మా నాయన పెండ్లిచేసినాడు. మా అమ్మ పోయిన తరువాత మా నాయన తిరిగి వివాహము చేసుకో లేదు. నన్ను అతి బాల్యమునుంచీ ఆయనే తల్లి లాగా పెంచినాడు. తల్లిదండ్రులకు ఒక్కతే కూతురు అయిన పిల్లదాన్ని ఇచ్చి పెండ్లిచేస్తే వాండ్లు నన్ను ఎంతో మమకారముతో చూస్తూ ఉంటారని ఊహచేసి ఆయన కచ్చేరి లోనే గుమాస్తాగా ఉన్న ఆయన కూతురును నాకు వివాహము చేసినాడు. "

" అయితే మీకూ మీ మామగారికీ ఏదైనా విరోధము వచ్చిందా ? "

" లేదు. "

" మీ నాయనగారు చనిపోయినప్పుడు ఆయన ఎందుకు మిమ్ములను ఇంట్లో అట్టేపెట్టుకోలేదు ? "

" నాకే ఆయనఇంట్లో ఉండడానికి ఇష్టము లేకపోయింది. దీన్ని కారణము అంటే ఏమీలేదు. మా పెత్తండ్రిదగ్గర నాకు ఉండవలెనని అభిలాష పుట్టింది. అందువల్ల ఇక్కడికి వచ్చినాను"

" అయితే ఇదంతా ఏమిటో చిత్రముగా ఉంది. ఆ అమ్మాయిని వదిలిపెట్టినారా ? "

" ఆఁ. "

" ఎందువల్ల ? "

" ఏమీ కారణములేదు. "

" కారణము లేకుండానే అంటే నేను ఎరీతమాత్రమూ నమ్మను ! "

కొంచెముసేపు ఆలోచించి వెంకటేశ్వరరావు ఇట్లా చెప్పినాడు. " నాకు సన్నని వాండ్లను చూస్తే పరమ అసహ్యము ! నేను సన్నగా ఉన్నందుకు నాకే చాలా అసహ్యముగా ఉంటుంది. ఆపిల్లది సన్నగా బక్కపలచగా ఉండేది. అంతేకాదు. నాకు తెల్లని రంగు కన్న చామనిచాయ అంటే ఇష్టము. దానిది తెల్లని దేహచ్ఛాయ. నాకు గుండ్రని ముఖము అంటే ఇష్టము. దానిది కోలముఖము. అంతే కాదు. అది నన్ను చూడగానే అపరిమితముగా సిగ్గుపడి ఎక్కడికో పారిపోయ్యేది. నాకు అదంతా పరమాసహ్యముగా ఉండేది. మా నాన్న ఆపిల్లదాన్ని నాకిచ్చి ఎందుకు పెండ్లిచేశాడా అని చాలాసార్లు దుఃఖపడ్డాను. చిట్టచివరకు ఆ పిల్లదాన్ని మనసులో తిట్టుకున్నాను. ఇక నా కీజన్మకు భార్యాసౌఖ్యము లేదు అనుకున్నాను ! "

" ఇంతమాత్రానికేనా ? "

" అవును. నా అవస్థ నీ కేం తెలుస్తుంది ! నీ వెప్పుడూ నాది కోమల హృదయ మంటావే ! లోకానికి అత్యల్పవిషయాలుగా కనబడే ఇవన్నీ నా కోమలహృదయము భరించ లేక పోయింది."

" ఈ చిన్న కారణాలకే ఆ అమ్మాయిని వదిలిపెట్టి నన్ను పెండ్లి చేసుకున్నామని చెపితే నేను నమ్మలేకుండా ఉన్నాను. "

" నీవే నమ్మలేకపోతే ఈ లోకములో ఇక నన్ను విశ్వసించే వెవరు ? " అని దీనముగా చెప్పి వెంకటేశ్వరరావు తల వంచుకున్నాడు. అతనినేత్రాలు అశ్రుపూరితములైనవి.

ఆమె కొంచెముసేపు ఊరుకుని " మీ పెత్తండ్రిగారికి తెలుసునా మీకు వివాహమయినట్లు ? "

" తెలుసు. "

" అయితే మానాన్నకు కూడా తెలుసునా ? "

" మీ నాన్నకు ఎంతమాత్రమూ తెలియదు. తెలిసిఉంటే నాకూ నీకూ వివాహము అయ్యేదే కాదు. మా పెత్తండ్రి జీవించిఉన్నా అయ్యేది కాదు. "

ఆశ్చర్యముతో " మా నాన్నకు తెలియదండీ ! " అన్నది సత్యభామ

" వెర్రిదానా తెలిస్తే నిన్ను నాకు ఇస్తాడా ? "

ఇద్దరూ కొంచెముసేపు మౌనము వహించినారు. వెర్రిగా ఒకరినొకరు చూసుకుంటూ ఏమిటో ఆలోచన చేయడము మొదలుపెట్టినారు. ఉండి ఉండి వెంకటేశ్వరరావు " ఈ కిందటి ఎనిమిది మాసములనుంచీ నాకు ఎన్నడు ఈ విషయమే జ్ఞాపకానికి రాలేదు. ఇప్పుడు శివరావు నన్ను పునస్సంధానము చేసుకోవడానికి రమ్మని ఆహ్వానము చేస్తున్నాడు. ఏమిచేయవలెనో తోచడములేదు ! "

" మీరేమీ అనుకోనంటే ఒకవిషయము అడుగుతాను. "

" ఏమీ అనుకోను. అడుగు. "

" ఎందుకులెండి — ఏమీ లేదులెండి.

" కాదు. అడుగు చెపుతాను. "

" ఏమీ లేదు. "

" కాదులే చెప్పు. "

" అయితే ఆ అమ్మాయి ఉండగా నన్ను ఎందుకు పెండ్లిచేసుకొన్నారో నిజముచెప్పండి,

ఇందాక చెప్పింది నేను ఎంతమాత్రమూ నమ్మను ”

“ అయితే ఏమిచెప్పేది ! నీ సౌందర్యము కంటే అందుకు వేరే కారణము ఏమీలేదు.”

“ నీవు ఆ మాఘోత్సవమురోజున నావంక ఎందుకట్లాచూసినావు ! అట్లా నీవు చూసిన తరువాత ఈలోకములో మళ్ళీ ఇంకొకళ్ళను ఎట్లా ప్రేమించగలను ? ”

చిరునవ్వుతో “ ఆరోజు ఇంకా జ్ఞాపకమున్నదా అండీ ? ” అన్నది సత్యభామ.

“ ఆరోజు మరిచి పొయ్యేట్లయితే ఇక నా ఈజన్మఎందుకు ? — నేను ఎప్పుడైనా కంటబడితే పెద్ద పులిగానో, దయ్యముగానో, భూతముగానో భావించి భయపడి పారిపోయి దాక్కునేదాన్ని ఎలా ప్రేమించడము ! అందులో నిన్ను ప్రేమించడము నేర్చుకున్న తరువాతనా ! ”

“ అయితే అమ్మాయిగతి ఏమిటి ఇప్పుడు ”

“ ఏమో నాకేం తెలుసును. ”

“ అట్లా అంటేఎలా ? ”

“ అయితే నన్నేమి చేయమంటావో నీవే చెప్పు. నీవు చెప్పినట్టు చేస్తాను. ”

“ నన్ను మీరు పెండ్లిచేసుకున్నట్టు వారికి తెలుసునా ? ”

“ తెలుసుననే శివరావు మాటలవల్ల గ్రహించినాను. ”

“ అందరికీ ఈవిషయము తెలిస్తే మనము అల్లరిపాలై పోతాము కాబోలు ! ”

“ నాకా భయములేదు. కాని ట్రస్టీలకు తెలిస్తే ఏమికొంప మునుగుతుందోనని భయముగాఉంది ” అంటూ అతను నిట్టూర్పు విడిచి “ఇట్లా చేసినందుకు నీవేమనుకుంటున్నావో! ” అన్నాడు. ఆమె ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నది. అతని కండ్లవెంట నీళ్ళు కారడము మొదలు పెట్టినవి. అంతట కూర్చున్నవాడల్లా చటుక్కున బోరగిల పడుకున్నాడు.

సత్యభామకు అతని అవస్థ అంతా బాగా హృద్గతమయి పోయింది. భర్త చాలా విషాదము అనుభవిస్తున్నట్టు ఆమె గ్రహించింది. ఏదైనా సాంత్వన వాక్యాలు చెప్పి అతన్ని ఉపశమింపజేయ దలచుకుని అతని వీపు చేతితో మృదువుగా తడుతూ “ గతించినదాని కేమి చేస్తారు లెండి దిగులుపడి ప్రయోజన మేమిటి ? ” అన్నది.

అతను మెల్లిగా తలయెత్తి నేత్రముల వెంట అశ్రుబిందువులు స్రవిస్తూ ఉండగా “ ఈలాటి పరిస్థితులలో నీ వేమి చేయమంటే అది చేస్తాను ” అన్నాడు.

“ నాకూ ఏమీ తోచడము లేదండీ. అయినా తొందరేమీ ? నిదానముగా ఆలోచింతాము. ”

“ ఏమిటో మహాఅగాధములో నేను పడడమే కాకుండా నిన్ను కూడా పడవేశాను ! ”

“ దిగులుపడకండి. ఏదో మార్గము ఆలోచింతాము. ”

“ ఏమీ తోచడములేదు. ”

“ ప్రస్తుతము ఏమీ ఆలోచించకండి. పడుకుని నిద్రపొండి. రేపు సావకాశముగా ఆలోచింతాము. ”

అతను వెర్రిగా ఆమెవంక చూస్తూ ఒత్తిగిలి పడుకున్నాడు. ఆమె అతని యెదుట ఒత్తిగిలి పడుకుని అతని మీసాలను దువ్వుతూ “ ఏమిటి వెర్రిగా ఆలోచించకండి. నిద్రపోదాము ” అన్నది. అత నేమీ మాట్లాడకుండా ఎప్పటి మాదిరిగానే చూస్తూ ఊరుకున్నాడు. “ ఏమిటండీ, పసిపిల్లవాడిలాగా వెర్రి వెర్రి ఊహలలో పడుతారు, ” అంటూ అతని చెంపలు దువ్వుతూ ముఖాన్ని ముద్దులాడింది.

౬

ఉదయము ఎనిమిది గంటలయింది. వెంకటేశ్వరరావు ఇంకా నిద్ర లేవలేదు. శివరావు దుస్తులు ధరించి ఎంతసేపు చూసినా అతను నిద్ర లేచేటట్టు కనుపించలేదు. వరండాలో కూర్చుని కూర్చుని లేచి సత్యభామ ఉన్నగది సమీపించి శివరావు, "నేను పని ఉండి మద్రాసు వెళ్ళు తున్నాను. ఇవ్వాళ అక్కడనే భోజనము చేస్తాను. మధ్యాహ్నము రెండుగంటల రైలులో వస్తాను. వెంకటేశ్వరరావును ఎక్కడికీ వెళ్ళ వద్దని చెప్పినానని చెప్పండి" అని వెళ్ళిపోయి నాడు.

వెంకటేశ్వరరావు పదిన్నర గంటలప్పుడు నిద్రలేచి స్నానముచేసి భోజనము చేసినాడు. ఒకటి రెండు పర్యాయములు సత్యభామ ఖులాసాగా అతనితో ఏదో మాట్లాడబోయింది. కాని అతను ముభావముగా ఊరుకున్నాడు. ఆమె ఊరుకున్నది. అతను కొంచెము సేపటికి పడక గదిలోకి వెళ్ళి పడుకుని సిగరెట్టు కాలుస్తూ, "సత్యం, సత్యం," అని పిలిచినాడు.

సత్యభామ పక్క గదిలోనుంచి నవ్వుముఖముతో చేతులో పుస్తకము పట్టుకుని వచ్చి నిలుచున్నది.

"ఏమి చేస్తున్నావు?"

"ఈ పుస్తకము చదువుతున్నాను"

"ఏమిటా పుస్తకము?"

"'రత్నావళీ' నాటకం."

"ఎవరి తర్జుమా?"

"వీరేశలింగము పంతులుది."

"రత్నావళి చాలా చక్కని నాటకాలలో ఒకటి సుమా!"

ఈ మాట అంటూ ఉండగానే టక టక జోడుస్నల చప్పుడు వరండాలో వినబడ్డది. ఆ చప్పుడు ఆలకిస్తూ "ఎవరో చూడు" అన్నాడు వెంకటేశ్వరరావు. కిటికీలోనుంచి వరండాలో చూసి "శివరావు గారు" అన్నది సత్యభామ. వెంకటేశ్వరరావు లేచి కూచుని "శివుడూ!" అన్నాడు.

"లోపలికి రావచ్చునా?" అన్నాడు శివరావు.

"ఓ ఫరవాలేదు. రా," అన్నాడు.

సత్యభామ పక్క గదిలోకి వెళ్ళిపోయింది. శివరావు లోపలికి వచ్చి మంచము ఎదట ఉన్న సోఫామీద కూర్చున్నాడు. వెంకటేశ్వరరావు మంచము దిగి అతని సరసనే కూర్చున్నాడు. ఇద్దరూ చెరి ఒక సిగరెట్టూ కాల్చడము మొదలు పెట్టినారు. "ఏమిరా, మరి నీవు వచ్చేట్లయితే రేపు సాయంత్రముదాకా ఉంటాను. లేకపోతే ఇవ్వాళ సాయంత్రమే వెళ్ళిపోతాను. ఎందుకు నేను అనవసరంగా ఇక్కడ?" అన్నాడు శివరావు.

"నీ ఇష్టము."

"అంటే, రానన్న మాటేనా?"

"ఆం రానులే."

"రాక తప్పదు సుమా!"

"నేను రానులేరా. చంపకు!"

"అయితే దాని గతి ఏమికావాలి మరి?"

"నాకేం తెలుసును!"

"చాలా గొప్పవాడివి! నీకు తెలియకపోతే ఎవరికి తెలుస్తుందిరా?"

"నాకు సంబంధము లేదు!"

"నాకు సంబంధము లేదన్నంత మాత్రాన పోదు, తెలుసునా? అగ్నిసాక్షిగా పెండ్లి చేసుకున్నావు. ఇప్పుడు వదిలి పెడతాననడము తప్పు. ఏదో ప్రేమవల్ల ఈమెను పెండ్లి చేసుకున్నంత మాత్రాన ఆమెను —"

"అసందర్భముగా మాట్లాడకు."

"కోపపడకోయి. నేను అంటున్నది సరిగా గ్రహించు. సరే, ఈ వివాహము నీ యిష్టము

వచ్చి చేసుకున్నావు. ఆ వివాహము మీ నా యన చేశాడు. కాబట్టి ఆ భార్యను కూడా స్వీకరించమని — "

" ఏమిటిరా, నీవు చదువుకున్న వాడివి. పైగా కామశాస్త్రము అంతా చదివానంటావు. ఏమిటి ఒక్క భార్యకంటె — "

శివరావు చిరునవ్వుతో " ఈ అభిప్రాయము శాస్త్రసమ్మతమూ కాదు, ధర్మమూ కాదు " అన్నాడు.

" రెండూ అవును. "

" పొరపాటు పడ్డావోయి వెర్రి నాన్నా ! రెండూ కాదు తెలుసునా ! కామశాస్త్రవిదుల అభిప్రాయము ఏమిటంటే మొగవాడికి బహు భార్యాభిలాష సహజమని. మనప్రాచీన కామశాస్త్రజ్ఞులు కూడా అట్లాగే అభిప్రాయపడ్డారు. నీవు ఏవో గ్రంథాలు చదివానంటివే, గ్రహించిందిదేనా ? ఇక ధర్మమా అధర్మమా అంటే పూర్వులు వ్రాసిన ధర్మశాస్త్రములలో ఎక్కడనైనా ఒక్క భార్యకంటే ఎక్కువమందిని పెండ్లిచేసుకోవడము నిషిద్ధమని చెప్పి ఉన్నట్టు నీవు చూపించ గలవా ! "

" ఏమోరా ఈ కామశాస్త్రాలూవద్దు, ధర్మశాస్త్రాలూవద్దు. నామనస్సుకు ఇష్టములేదు. "

" ఒక్కసారి జాగ్రత్తగా ఆలోచించు. నీవు ఎంత అసంగతముగా మాట్లాడుతున్నదీ నీకే తెలుస్తుంది. ఆ అమ్మాయి ఏమై పోవాలెనో చెప్పు, చూతాము. భర్త జీవించిఉండగానే దానిస్థితి ఎంతఘోరముగా ఉంటుందో ఊహ చెయ్యి ఒక్కసారి. జాలి లేదూ నీకు ? పోని ఆ అమ్మాయి లోప మేమిటో చెప్పు. "

" ఏమిటోరా నాకు తెలియదు. మా నాన్న నాకు ఊహ తెలియని రోజుల్లో పెండ్లి చేసినాడు! ఆ అమ్మాయిని గురించి నాకేమీ తెలియదు. నేను సత్యభామను ప్రేమించాను. వివాహము చేసుకున్నాను. "

" అయితే పితృతండ్రిని అగౌరవ పరచ దలచి నా వన్నమాట. నీబోటివాడు, యుక్తా యుక్తములు తెలిసినవాడు ఇదేనా చెప్పవలసింది ? "

" నే నేమీ మా నాయనను అగౌరవ పరచడము లేదు. "

" మీ నాయన నీకు భార్య అని నిశ్చయించి వివాహముచేసిన పిల్లదాన్ని తోసిపారవేయడము కన్న అగౌరవ పరచడము మరొకటి ఉందా? "

" ఏమో, ఇప్పుడు మించిపోయింది, ఏమి చేయడానికీ వీలులేదు. "

" ఏమి మించిపోయిందోయి ? "

" నాకు వివాహ మయిపోయింది. ఈ భార్యతో సుఖంగా ఉంటున్నాను. "

" పునస్సంధానము చేసుకుని ఆమెనుకూడా తీసుకునివస్తే ఇంకా ఎక్కువసుఖము అనుభవిస్తావు. "

" చాలులే ! "

" ఇంతకూ నీవు రాక తప్పదు " అంటూ శివరావు లేవబోయినాడు.

" అబ్బా, కూర్చోరా. గోల! నాకు లేని పోని అవస్థ తెచ్చిపెట్టావు ! "

" నే నేమీ గోల తెచ్చిపెట్టలేదు. నీవే మా కందరికీ గోల తెచ్చిపెట్టడమే కాకుండా నీకు కూడా తెచ్చిపెట్టుకున్నావు ! "

" అయితే ఇంతకూ ఇప్పుడు న న్నేమి చేయమంటావురా ? "

" గుంటూరు వచ్చి శోభనము చేసుకోమని ఆహ్వానము చేస్తున్నాను. "

"ఒకవిషయము అడుగుతాను, నిష్కపటంగా చెపుతావూ ? "

" ఒక్కటి కాదు. లక్ష చెపుతాను ! "

" అయితే ఈ విషయము ఆలోచించు. మన భాషలో కూడా ఒక పద్య మున్నది. " ముగు రాడువారలైనను పగలే .... " ఇద్దరు భార్యలతో నేను నెగ్గలేనేమోనని చాలా భయముగా ఉంది. అసలే ఆడవాండ్లు అసూయాపరులు. అందులో సవతులు చేరారంటే కొంప మునిగిపోయిం దన్నమాట! ఇక నాకు అజన్మాంతమూ దుఃఖమే ! "

“ ఈ విషయములో నీవు చాలా పొరపాటు పడుతున్నావు. నీవు చిన్నవాడివి కాబట్టినీ్న లోకానుభవము లేకపోబట్టినీ్న ఇట్లా అంటున్నావు. మన తెలుగులో ఉన్న పద్యము కేవలము చమత్కారము కోసము చెప్పింది. ఇక స్త్రీలకు ఈర్ష్య పురుషులకంటే చాలా తక్కువని కామకళావేత్తల అభిప్రాయము. నా అనుభవములోకూడా అలాగే కనుపించింది. సాధారణంగా స్త్రీ తాను ప్రేమించిన పురుషుడి కోసరము తన సౌఖ్యాన్ని—సౌఖ్యము ఏమిటి ?—సర్వస్వాన్ని కోల్పోవడానికి కూడా ఒప్పుకుంటుంది. చూడు, జారుడైన భర్తను ఏ స్త్రీ అయినా విడిచిపెడుతున్నదేమో. ”

“ ఒకవేళ భయమువల్ల విడిచిపెట్టక పోవచ్చును. నిందించనైనా నిందించదా ? ”

“ నిందించనైనా నిందించదు. ప్రేమవల్లనే మన్నించి ఊరుకుంటుంది. ”

వెంకటేశ్వరరావు ఊరుకున్నాడు.

“ రాజ్యలక్ష్మి వస్తే మీ రిద్దరూ కూడా ఒక్కమాదిరిగా దాన్ని ప్రేమించి తీరుతారని నాదృఢ విశ్వాసము.

రాజ్యలక్ష్మి కేవలము పల్లెటూరి పిల్ల అని ఊహించకు. పత్రిక బాగులది. ఈమాట అన్నందువల్ల దానికి లోకజ్ఞానము లేదు అనుకోవద్దు సుమా ! ఈభార్య ఇంగ్లీషు చదువుకున్నది. రాజ్యలక్ష్మికి సంస్కృతాంధ్రములలో మంచి ప్రవేశమున్నది. ఇందువల్ల కావ్యకన్యల సాహచర్య సౌఖ్యముకూడా పొందగలవు. ఆఖరుకు మరొక అభయముకూడా ఇస్తున్నాను. ఏనాడు రాజ్యలక్ష్మి నీ జీవితానికి దుఃఖకారణమైనట్టు ఊహపోతుందో ఆనాడు దాన్ని తోసివెయ్యి, నేను ఒప్పుకుంటాను, లోకము ఒప్పుకుంటుంది. అంతేకాని దాన్ని ఈవిధంగా తోసివేయడము ఉన్నదే, కేవలము అధర్మము ! ”

“ ఒరే, నీవు అఖండుడివి ! నామనసంతా క్షోభపెట్టావు ! ”

“ నీమనస్సు ఒకరు క్షోభపెట్టలేదు. నీవే కర్తవ్యము గ్రహించలేక క్షోభపడుతున్నావు ” అని శివరావు నవ్వుతూ అన్నాడు.

వెంకటేశ్వరరావు కాస్తసేపు ఊరుకుని, ఏదో తీవ్రముగా ఆలోచిస్తూ కొత్తసిగరెట్టు వెలిగించి “ అయితే శివుడూ, నాకొక పెద్దభయము తోస్తున్నది. నేను కొంతమంది ట్రస్టీల సంరక్షణలో ఉన్నాను. వాండ్లకీవిషయమంతా తెలియకపోదు. వాండ్లు నన్ను చాలా ఇబ్బంది పెడతారేమో ! ” అన్నాడు.

“ అయితే ఇక చెపుతా విను. ఒకవేళ ఏవిపరీత పరిస్థితులవల్లనైనా నీవు రాజ్యలక్ష్మిని తోసివేసేట్లయితే — నీ ట్రస్టీలనూ, అందులో ప్రత్యేకముగా నీమామగారిని ముప్పతిప్పలు పెట్టించవలెనని నాసంకల్పము. ఏలాగంటే నీ మామగారు ట్రస్టీలలో ఒకరు. నీ వివాహ సందర్భములో నీ ట్రస్టుడీడును వారు జాగ్రత్తగా చూసుకున్నట్లులేదు. ఇదిగో నీ ట్రస్టుడీడు నకలు ” అంటూ జేబులోనుంచి కాగితము తీసిచూపిస్తూ “ మీ పెత్తండ్రి ఈ ట్రస్టుడీడులో నీకు ఏకేవి అవసరమో అవన్నీ బాగా ఆలోచించి వాటికి అవసరమైనట్టు ప్రత్యేకముగా నీవు గృహనిర్మాణము చేసుకునేట్లయితే ఇంత ధనమనీ, నీవు వాహనాదికము పెట్టదలచుకునేట్లయితే ఇంత ధనమనీ, ఏర్పాటు చేసినాడు. అయితే నీ వివాహానికి ఇంతధనమని నిశ్చయించలేదు. పైగా నీభార్యకు నగలకింద నీవు కోరినట్లయితే ఇంత ఇవ్వవచ్చునని వ్రాశాడు. అంటే నీకు వివాహమే కాకపోయినట్లయితే వివాహము నిమిత్తము ఇంత ధనము వినియోగించుకోనవచ్చునని ఆయన నిర్ధారణచేసే ఉండేవాడు. నీకు వివాహమయినట్టు ఆయనకు తెలియనే తెలియును. ఈ ట్రస్టీలు ఈ వాక్యము జాగ్రత్తగా ఆలోచించలేకపోయి నీకు వివాహం చేసినారు. నేను ఏమి చేయదలచుకున్నానంటే, ట్రస్టీలలో ఒకరైన సీతారామయ్య

గారు నీకు ఆయన కుమార్తెను చూపించి వ్యామోహపెట్టి నీకదివరలో వివాహము అయి వున్నప్పటికిన్నీ దురుద్దేశముతో ఆయన కుమార్తె నిచ్చి వివాహము చేసినట్టున్నాన్న, పెద్దమనుష్యు లందరికీ చెప్పి అల్లరిచేయదలచుకున్నాను" అన్నాడు.

"అబ్బా! నీవు ఏవేవో లేనిపోని చిక్కులు తెచ్చిపెట్టి నన్ను మహాఅగాధములో పడవేయ దలుచు కున్న ట్టున్నావు."

"ఎంతమాత్రము కాదు. అలా ఎప్పుడూ అనుకోకు. నీవు ఇప్పటికంటె ఎక్కువ సుఖము అనుభవించడానికి మార్గము చూపిస్తున్నాను."

అప్పుడే గోడమీది పెద్దగడియారము నాలుగు కొట్టింది. వెంకటేశ్వరరావు గంటలు ఆలకిస్తున్నాడు. శివరావు అతనివంక ప్రసన్నవదనముతో చూస్తూ "చూశావురా. నేను అన్న మాటలకు ఘంటకూడా కొట్టింది" అన్నాడు.

వెంకటేశ్వరరావు చిరాకుతో లేచి, చాలా టయిము అయిపోయింది. ఇక ఈ విషయము తర్వాత ఆలోచింతాము. లే! కాస్త టీ తాగితేనే కాని నాకు తోచేటట్టులేదు," అంటూ లేచినాడు. శివరావున్నూ కొంచెము ఉత్సాహముతో లేచినాడు.

౨

శివరావు ఆ మర్నాడే గుంటూరు బయలుదేరినాడు. వెళ్లిపొయ్యేముందు ఏసంగతీ తేల్చుకుని వారమురోజులలో ఉత్తరము వ్రాస్తానని వెంకటేశ్వరరావుచేత వాగ్దానము చేయించుకొన్నాడు.

శివరావు వచ్చినరోజుల్లో సీతారామయ్యగారి కుటుంబము మద్రాసులో లేదు. చల్లదనము కోసము వారంతా ఉదకమండలములో ఉంటున్నారు.

స్నేహితుడు వెళ్ళిపోయినతర్వాత వెంకటేశ్వరరావు సత్యభామకు ముఖము చూపించలేక పోయినాడు. ఒకటి రెండు రోజులకు ఆవిడను తండ్రిదగ్గిరికి పంపించినాడు.

తాను వెళ్ళినప్పటినుంచీ వెంకటేశ్వరరావును ఉదకమండలము రమ్మని సత్యభామ ఉత్తరము వ్రాస్తున్నది; సీతారామయ్యగారు కూడా వ్రాస్తున్నాడు. మామగారు తన ప్రథమ వివాహ ప్రశంస తెస్తారేమో అనే జంకుతో అతను వెళ్ళడము మానివేసినాడు.

శివరావు వారానికి రెండు పర్యాయములు ఉత్తరము వ్రాస్తూ ఉన్నాడు. రాజ్యలక్ష్మిని గురించి తాను శివరావుకు చేసిన వాగ్దాన ప్రకారముగా వెంకటేశ్వరరావు ఇంతవరకూ నిశ్చితాభిప్రాయము ఏమీ తెలియపరచ లేదు. శివరావుకూడా ఉత్తరాలలో ఆ ప్రస్తావన చెయ్యలేదు.

శివరావు ఊహ ఏమిటో వెంకటేశ్వరరావుకు తెలియక కొంత ఆశ్చర్యము కలిగింది. అయితే కాలమే రాజ్యలక్ష్మి విషయములో తన కర్తవ్యాన్ని నిశ్చయిస్తుందని వెంకటేశ్వరరావు మనస్సు రాయిచేసుకుని ఊరుకున్నాడు.

అప్పుడప్పుడు వెళ్ళి భార్యను చూడవలెనని అతనికి సంకల్పము కలుగుతున్నది. ఒకనాడు మధ్యాహ్నము భోజనము చేసినతరువాత చక్కని దుస్తులు ధరించి మద్రాసు వెళ్ళడానికి బయలుదేరినాడు. ఆరోజు మద్రాసులో కొన్ని వస్తువులు కొనుక్కొని మరునాడు ఉదకమండలము వెళ్ళవలెనని అతని సంకల్పము.

మధ్యాహ్నము రెండున్నర గంటలకు మాంబళము స్టేషన్ వైపుకు గొడుగు వేసుకుని సిగరెట్టు కాల్చుకుంటూ మహా ఒయ్యారంగా వెంకటేశ్వరరావు నడుస్తున్నాడు. అప్పుడే మద్రాసునుంచి మాంబళమువచ్చే రైలు స్టేషన్‌లోకి వచ్చింది. ఆరైలు దిగి శివరావూ, రాజ్యలక్ష్మీ, కామేశ్వరమ్మా, బండీచేసుకుని వెంకటేశ్వరరావు ఇంటివైపు వస్తున్నారు. ఆరోజు

నే కొంచెము దూరములో ఎదురుగుండా ఊగులాడుతూ ఒయ్యారంగా నడిచివస్తూఉన్న వెంకటేశ్వరరావును శివరావు చూసినాడు. ఆ తాళంగా శివరావు బండిలోనుంచి దిగి త్వరత్వరగా నడిచి వచ్చి వెంకటేశ్వరరావును కలుసుకున్నాడు. వెంకటేశ్వరరావు అతన్ని ఆశ్చర్యముగా చూస్తూ "ఏమిటీ—ఎప్పుడూ రావడము!" అన్నాడు.

"ఇవ్వాళ మెయిలు చాలా ఆలస్యమైంది. అందువల్ల ఈ రైలులో వస్తున్నాము."

"వస్తున్నాము అంటున్నావు. అంటే నువు ఒక్కరేనా? ఇంకా ఎవరైనానా?"

"మనవాండ్లే, మా కామేశ్వరి అక్కయ్య, రాజ్యలక్ష్మి. అదుగో ఆబండిలో," అని చూపించినాడు శివరావు.

వెంకటేశ్వరరావు నిర్ఘాంత పోయినాడు. అతని శరీరము కంపించింది. తీవ్రముగా శివరావువంక చూస్తూ "ముందుగా తెలియజేయకుండా వాండ్లనిప్పుడు వెంటబెట్టుకుని వచ్చావు!" అన్నాడు వెంకటేశ్వరరావు.

ఇంతలో బండి చాలా దగ్గిరికి వచ్చింది. శివరావు మెల్లిగానూ, శాంతముగానూ, "తొందరపడకు. తరవాత చెపుతాను. వాళ్ళు ఆడవాళ్ళు. ఈసంభాషణ వింటే బాగుండదు మరి. సావకాశముగా మాట్లాడుదాములే" అన్నాడు.

బండి దగ్గిరకు రాగానే మొట్టమొదట వెంకటేశ్వరరావు కండ్లను ఆకర్షించింది రాజ్యలక్ష్మి. ఆసలానేత్రములు వాటి అంతట అవి పోయి ఆమెమీద వాలినవి. ఇప్పుడు రాజ్యలక్ష్మి పూర్వము మాదిరిగా లేదు. ఆమె కొంచెము పొడుగుగానూ, ఆ పొడుగుకు తగిన లావుగానూ ఉంది. ఆమె కాయము ఎంత రమణీయముగా ఉండి హృదయాకర్షకముగా ఉన్నా ఆమె ముఖాన మాత్రము దైన్యము కనిపిస్తున్నది. వెంకటేశ్వరరావు తనను చూడగానే, సిగ్గువల్లనో తన అభాగ్యత తలచుకొనో రాజ్యలక్ష్మి తల వాల్చింది. ఆమె తెల్లని మనోజ్ఞమైన వాలు గన్నులలోనుంచి ఒకటిరెండు నీటిబిందువులు ముత్యాలలాగా రాలినవి. అవి కాటుకవల్ల కొంచెముగా నల్లబడినవి. ఆ ముత్యాలను వెంకటేశ్వరరావు చూసినాడు. బండివెంట తలవంచుకుని పరధ్యానముతో నడుస్తూ ఉన్న అతని కవి స్వీయచరిత్ర చెప్పుకోవడము మొదలుపెట్టినవి.

అందులో ఒకముత్యము మొట్టమొదట ఇట్లా చెప్పడము ప్రారంభించింది: "నాథా, నా తప్పేమీ లేదే! నేను మిమ్ములనే ప్రేమించినానని చెపితే నమ్ముతారో నమ్మరో కదా? మీరుతప్ప నాకెవ్వరూ కలలోనైనా తోచనే తోచరే! అయ్యో, మీకూ నాకూ ఎడబాటు కలిగినందుకు ఎంత దుఃఖించానో ఎవరు చెపుతారు! ఒకవేళ చెప్పినా ప్రయోజనము ఉంటుందో ఉండదోగదా! పురుషులై సర్వస్వతంత్రులైన మీరే దైవయోగమువల్ల నన్ను తోసిపారవేసి మరిచిపోదలచుకున్నారూ? మరిచిపోయినారూ! చిట్టచివరకు ఇంకొకరిని చేపట్టినారూ? — నేను ఆడదానినే! నాకు స్వాతంత్ర్యములేదే! స్వాతంత్ర్యముఉన్న మీరే ఇట్లాచేస్తే మార్గాంతరములేని నాగతి ఏమిటో ఆలోచించినారా నాథా?"

మరొకముత్యము ఈవిధముగా మొదలుపెట్టింది "మీరు నన్ను మరిచిపోయినా, త్యజించినా, నేను మట్టుకు మిమ్ములను మరిచిపోలేను. త్యజించనూలేను. అందువల్లనే విధి చిట్టచివరకు స్వయముగా మీదగ్గిరికి పొమ్మని నన్ను నెట్టింది, వచ్చాను. స్వీకరించినాసరే, స్వీకరించక పోయినాసరే, నన్ను చంపివేస్తే ఏమోకాని బతికిఉండగా మిమ్ములను వదిలిపెట్టి పోదలచుకోలేదు. మీ ఇంటికి వచ్చాను. ఇక మీ ఇష్టము!"

ఈ మాదిరిగా వెంకటేశ్వరరావు చెవులలో మాటలు వినబడుతున్నవి. బండివెంట అతనూ, అతనివెనక అతన్నిచూస్తూ శివరావు నడుస్తూ

ఉన్నారు. క్షణక్షణముకు అతని ముఖములో దైన్యము ఎక్కువగా కనబడుతున్నది. శివరావు ఇదంతా కనిపెడుతూనే ఉన్నాడు. అయితే అతను పల్లెత్తు ఒక్కమాట అయినా అనలేదు. కొంతసేపటికి రాజ్యలక్ష్మి బండిలోనుంచి వెంకటేశ్వరరావువంక ఓరచూపు చూసింది. వెంకటేశ్వరరావుకూడా ఆమెవంక చూసినాడు. ఆ నేత్ర ద్వంద్వములు ఒక్కసారిగా గాఢాలింగనము చేసుకున్నవి. ఆమె ముఖాన్ని ఆవరించి ఉన్న దైన్యము పటాపంచలై పోయింది. ఆమె ముఖములో కొంత వికాసము కలిగింది. వెంకటేశ్వరరావు ముఖములో కూడా ఒకవిధమైన వికాసము పొడచూపకపోలేదు.

బండి వెంకటేశ్వరరావు ఇంటియెదుట ఆగింది. బండిలో నుంచి రాజ్యలక్ష్మి, కామేశ్వరమ్మ దిగి ఇంటి ఆవరణంలో ఉన్న రోడ్డున నడుస్తున్నారు. రాజ్యలక్ష్మి తల వంచుకుని కొంచెము వంగి గజగమనముతో పోతూఉంటే — స్తనభారము వల్ల వంగినదా, సంసారానుభవము లేని యువతుల సహజనమ్రతా, లేక తానామెను కష్టములపాలు చేసినందుకు వంగి పోతున్నదా, అనే ప్రశ్నలు వెంకటేశ్వరరావుకు తోచినవి !

తల్లీ కూతురూ ఇంట్లో ప్రవేశించినారు. వారి నొక గదిలో ప్రవేశపెట్టమంటూ వెంకటేశ్వరరావు శివరావుకు గది చూపిస్తూ సంజ్ఞ చేసినాడు. వారాగదిలోనే వారి సామాను పెట్టుకుని అక్కడనే ఉన్నారు. శివరావు బయటికి వచ్చి చూసేసరికి వెంకటేశ్వరరావు ఊరికే తారట్లాడుతున్నాడు. ఇది కనిపెట్టి " ఏమిరా ఎక్కడికో పోతూ ఉంటే అడ్డము తగిలి తీసుకొనివచ్చాను. నీవు ఇప్పుడు ఎక్కడికైనా వెళ్ళవలెనా ? " అన్నాడు శివరావు.

" అవును. మద్రాసు వెళుదామని బయలుదేరినాను. ఇంతలో మీరు తటస్థపడ్డారు. "

" అయితే ఇక మద్రాసువెళ్ళే రైలు ఇప్పటిలో లేదు కాబోలు. "

" ఉంది. ఇంకొక పావుగంట సేపటికి వస్తుంది. "

" పోనీ, పని ఉంటే అందులో వెళుదాములే. "

" నీవుకూడా వస్తావా ? "

" పోనీ, వద్దంటే మానేస్తాలే ! "

" అందుకు కాదు, మీరింకా భోజనం చేయలేదుగా ! వీళ్ళు వచ్చారని నేను ఎక్కడికైనా వెళ్ళిపోతానని నీకు భయం కాబోలు. "

" మేము పట్నంలో భోజనంచేసి వచ్చాము. నాకేమిభయమురా వెర్రివాడా ! నీవు ఎక్కడికైనా పారిపోతే లాభము ఉంటుందని నీవు అనుకుంటున్నట్టు నేను తలిస్తేగా. "

" ఐతేసరే వెళుదామువస్తావా ఏమిటి? "

" ఆఁ " అంటూ శివరావు లోపలికివెళ్ళి కామేశ్వరమ్మతో ఏదో మాట్లాడి వచ్చినాడు.

ఇద్దరూ స్టేషనుకు బయలుదేరినారు. ఏమీ మాట్లాడడానికీ వెంకటేశ్వరరావుకు తోచలేదు. కాని రాజ్యలక్ష్మిని వెంటబెట్టుకుని రావడము శివరావు తంత్రమేనని అతను గ్రహించాడు. అతనికి శివరావుమీద ఎంతమాత్రమూ కోపము రాలేదు, కాని కొంతవిచారము కలిగింది. తండ్రి యోగ్యతా యోగ్యతలు బాగా విచారించి తనకోసరము ఇచ్చిపోయిన చిన్ని పువ్వము, వికసించి పిందె అయి ఆపిందె కాయ అయి ఆ కాయ రుచ్యమైన ఫలమయి రుచిచూడ బోయ్యే సమయము వచ్చేసరికి దానివిషయము తెలియక అతను మరొక ఫలమును ఆశించి రుచిచూసిన తరువాత మొదటిఫలము కనుపించిది. ఇప్పుడీ ఫలాన్ని స్వీకరించడమా త్యజించడమా అనే జిజ్ఞాసలో అతను పడిపోయినాడు. మనస్సంతా డోలాయమానము అయిపోయింది. ఇటువంటి స్థితిలో అతనేమి మాట్లాడుతాడు ? పోనీ రెండు ఫలాలనూ ఏక కాలమందు అనుభవించవచ్చు

నన్న ఊహా అతనికి కలిగి ఉంటే అంత విచారము ఉండక పొయ్యేదే !

రైలు రాగానే ఇద్దరూ పెట్టెలో ఎక్కి కూర్చున్నారు. శివరావు వెంటతెచ్చుకున్న గ్రంథమేదో తెరచి చదువుతున్నాడు. వెంకటేశ్వరరావు కిటికీలోనుంచి బయటికి చూస్తూ కూర్చున్నాడు. అతని శరీరము మాత్రము అక్కడ ఉన్నది; అతని మనస్సంతా ఏదో లోకములోకి పోతున్నది.

కొంచెము సేపయ్యేసరికి అతనూ రాజ్యలక్ష్మీ ఏకశయ్యమీద ఉన్నట్టు తోచింది. అప్పుడే సూర్యోదయ మయింది. ఆమె ఇంకా నిద్ర లేవలేదు. అతను మాత్రము ముందుగా నిద్ర లేచి కండ్లు నులుముకుంటూ ఉంటే సత్యభామ నవ్వుతూ వచ్చి నిలుచున్నది. ఆ సత్యభామ కనపడగానే ముఖము చెల్లక అతను నిద్ర వస్తున్నవాడికి మల్లే మళ్లీ పడుకున్నాడు. సత్యభామ పక్కున నవ్వి "పాపము, తెల్లవార్లూ నిద్ర లేదు కాబోలు !" అన్నది. అతను గాఢ నిద్రలో ఉన్నట్టు నటించడము మొదలు పెట్టినాడు. ఆమె వేళాకోళము గా "ఏమండోయి, మీకోసము ఎవరో వచ్చారు; లేవండి" అన్నది. అప్పటికీ అతను లేవలేదు. "ఫరవాలేదు లెండి. రాజ్యలక్ష్మమ్మా అక్కయ్యే లెండి," అన్నా లేవలేదు. "నేనేమీ అనుకోను లెండి, నా కింతమాత్రమూ మీమీద కోపము లేదు, విచారమూ లేదు" అన్నది సత్యభామ. అప్పటికీ లేవకపోతే సత్యభామ నవ్వుతూ, "ఇదంతా నిద్రేనా అండీ" అంటూ అతని చెయ్యి పట్టుకుని లేవదీసి కూర్చోపెట్టింది. అప్పుడు వెంకటేశ్వరరావు ఉలిక్కిపడ్డాడు.

పుస్తకము చదువుతున్న శివరావు ఎందుకో అప్పుడు తల ఎత్తి చూడగా అతను ఉలిక్కిపడడము కనిపించి "ఏమిటిరోయి, ఉలిక్కిపడుతున్నావు ?" అన్నాడు.

"ఏమ్బే ఏమీ లేదురా."

"కలా ఏమిటి ?"

"ఆఁ"

ఇంతలోకే రైలు మద్రాసు పార్కుస్టేషనులో వచ్చి నిలుచుంది.

"లే, దిగుదాము" అన్నాడు శివరావు. అతనీమాట వినిపించుకోనేలేదు. పూర్వక్షణములో వచ్చిన కలనుగురించి అతను తీవ్రముగా ఆలోచిస్తున్నాడు. శివరావు అతనేదో యోజనలో ఉన్నట్టుగా గ్రహించి "ఏమిరా ? ఏ లోకములో ఉన్నావు ?" అంటూ బుజము తట్టినాడు.

"ఏ స్టేషనూ ?" అన్నాడు వెంకటేశ్వరరావు.

"పార్కు."

"అప్పుడే !"

"రైలు కదలబోతున్నది పద."

ఇద్దరూ రైలు దిగినారు. అప్రయత్నముగా ఇద్దరూ మూర్‌మార్కెట్టుదగ్గిరికి వెళ్ళినారు. "ఏమిరా, నీవు ఎక్కడికి పోవాలి ?" అన్నాడు శివరావు.

"ఏదో తోచక బయలుదేరాను. కాని నాకేమీ పనిలేదు ఇప్పుడు."

"బలేవాడివి ! అయితే మూర్‌మార్కెట్టుకు వెళుదాముర."

మార్కెట్టులోకి వెళ్లినారు. అక్కడ శివరావు రకరకాల పండ్లు కొన్నాడు; అక్కడినుంచి బయలుదేరి కొంచెము దూరము పైకి నడిచి చాలా మిఠాయిలు కూడా కొన్నాడు. ఇవన్నీ తీసుకుని తిరిగీ అయిదు గంటల రైలుకు ఇద్దరూ పార్కు స్టేషనుకు వచ్చి రైలు రాగానే ఎక్కినారు. దారి పొడుగునా వెంకటేశ్వరరావు కిటికీలోనుంచి బయటికి చూస్తూ ఏమిటో యోజిస్తూ కూర్చున్నాడు.

సాయంకాలము ఆరు గంటలకు వారుభయులూ ఇంటికిచేరినారు. చీకటిపడగానే బాగా వేడినీళ్ల స్నానము చేసి భోజనము చేసినారు. [illegible]జనానంతర

రము అతనూ శివరావూ వచ్చి వరండాలో కూర్చుని పూర్వ ప్రబంధాలలోని నాయికా నాయకులను గురించి ముచ్చటించుకుంటూ కూర్చున్నారు. రాత్రి రమారమి తొమ్మిదిగంటలు కావచ్చింది. అప్పుడు, " ఏమిరా, నాకు నిద్ర వస్తున్నది. పడుకుందాములే " అన్నాడు శివరావు.

" నేనూ పడుకుంటాను " అంటూ వెంకటేశ్వరరావు లేచినాడు. శివరావున్నూ లేచి అతని వెంట లోపలికి వచ్చినాడు.

వెంకటేశ్వరరావు పడకగదిలోకి వెళ్ళినాడు. అతను లోపలికి వెళ్ళినతక్షణమే శివరావు బయట తలుపు గొళ్ళెము పెట్టినాడు. గదిలో మంచము స్తంభాన్ని ఊతగా చేసుకుని, సిగ్గుపడుతూ, తల వంచుకుని రాజ్యలక్ష్మి నిలుచుని ఉంది.

సఖీ సందర్శనము

పెద్దిభట్ల
రామచంద్రరావు

శాంతజీవన యగు రేయి జడిమ మాన్పి
ఆర్తి విదళించు నానంద మూర్తివోలె
నిర్మలోజ్జ్వల విపుల వక్షా నేత్రయుగళి
గడు మనోహరమై యుషఃకన్య తోచె.

మెల్లని సుగంధ వాయువుల్ మిగుల చలువ
గూర్చి, వేణునాదము సేయు కూర్మి కృష్ణు
చిరునగవు దొంతరల రీతి చెలగి నులసె
సమ్మదము గూర్చి చైతన్య జనక మగుచు.

రాగవంతుడు లావణ్యరాశి యయ్యు
దివ్యదీధితి నజ్ఞానతిమిర మడచి
మోదముం గూర్చు విజ్ఞాన మూర్తి భాతి
బాలభానుడు పాండుర ప్రభల నీనె.

నూత్న చైతన్య తేజోమనోజ్ఞ మైన
నీ ముఖాంభోజ మాక్షణమే మదీయ
లలితహృదయ సరస్సు నలంకరించె
నిశ్చలం బయ్యె మన్మనోనేత్ర మపుడు !

సఖీ !

ఎదలోపలి మెదలో, నె
మ్మదిలో, జీవితరహస్యమార్గమ్ములలో
వదలని కోర్కవై, నా
బ్రదుకుబరువులెల్లఁ బాట పాడింతు సఖీ !

చలువపిసాళిగాలి నునుజక్కిలిగింతల కౌగిలింతలన్
నిలువునఁ బాటగాఁ గరగనేర్చునో నీరవవేణువీధి ; నీ
వలపుతలంపు సోకిననె, ప్రాణసఖీ, బ్రతుకెల్ల కోటిగొం
తుల విడి సోనలై పొరలు నూతనగీతసుధాపథాలలోన్ !

నీయాజ్ఞ కూడెనా గొంతుముడి వీడెనా
హాయిగా యుగయుగంబులకలల్ పాడనా ?
చిరగాఢనిద్ర మేల్కొలిపి సందేశాల
బఱపనా దిక్కుదిక్కులకు జుక్కలకు ?

నా గానము

ఈనవాబ్దాగమమ్ములో నీకిశోర
మధురకలకంఠమునకు హేమంత మెదలి
గొంతు చెఱ వీడెనేని హృదంతికమున
దాఁగి మొదిగిన ప్రేమగీతాలరుచుల
నొక్కటొకటె నీ కయి విప్పుచుండు సఖియ !

విరిసికొనిపోవుచున్నవి వీనియమృత
గళరవమ్మున కపుడె పక్షములు చెలియ !

ఎగసికొనిపోవు వారు లెవ్వ రెగురలేని
స్వప్నసీమల కూహాప్రపంచములకు !

నీ వొకర్తుక వానిపై నిదుర గొమ్ము,
మెల్లగాఁ బోదు వెచటి కెచ్చటికొ కాని,
ఇపుడపుడు నీవు మేల్కాంతువేని ఏవి
పాటతెక్కలరొద వినంబడును నీకు,
అంత జల్లను నీబ్రతు కంత, మఱల
నొత్తిగిలి హాయిఁ గన్ను మూయుదువు నీవు.

నాకుమాత్రము గాన మున్నంతవఱకు
చాలుచాలు నీ ప్రణయవిశ్వాస మొకటె ;
మోసికొందునో నాగీతములను నిన్ను,
మూగవోదునో రాయియై పోయి పరము !

ఆ మె క న్ను లు

ఆమెకన్నులలో ననంతాంబరంపు
నీలినీడలు కలవు ;
వినిర్మలాంబు
పూర గంభీర శాంత కాసార చిత్ర
హృదయములలోని గాటంపు నిదురచాయ
లందు నెడనెడఁ గ్రమ్ము ;
సంధ్యావసాన
సమయమున నింబపాదపశాఖికాగ్ర
పత్రకుటిలమార్గములలోపల వసించు
నిరులగుసగుసల్ వానిలో నిపుడునపుడు
వినబడుచునుండు ;
మరికొన్ని వేళలందు

వాన కారు మబ్బులమెయి వన్నె వెనుక
దాఁగుబాష్పమ్ము లాపెనేత్రములలోన,
బొంచుచుండును ;
ఎదియొ యపూర్వమధుర
రక్తి స్ఫురియించుఁ గాని అర్ధమ్ము కాని
భావగీతమ్ము లవి—

నీవు పాడినప్పుడు

నునుమబ్బు లేనునుఁ గొనలపై సోనసౌ నెలవంక చిఱునవ్వు చలువపాట,
తొలిప్రొద్దుపొడుపు ఱేకుల పైడిదారుల నేరుటామంచు కన్నీరుపాట,
పావురా యుయ్యాల సతౌల యంచుల జాలుటౌగాలి నీలాలపాట,
విరజాజి కన్నె నిద్దురకన్ను ఱెప్పల గొల్వాలొ నత్తావి కలలపాట,

కలిసి, నీ గొంతు త్రోవల సెలలుగట్టి,
యలల నుప్పొంగి, నా హృదయాంచలముల
జారి, దాహాన బీటలు వారి యెండు
ఈ బ్రతుకు నిండ నింపి పోయినవి, చెలియ !

ఒకపరి తీయనౌ బరువు లొత్తగ జీవితమంత క్రుంగి, వే
రొకపరి తేలి యేలొ యెటకో యెటకో జలదాల దాటి తా
రకల విశాలనీలపథ రాజులనెల్ల నతిక్రమించి పో
యి కలియు సోలిసోలి చదలేటితుషారపు స్వప్నరాసులన్.

ఈవు తేనియగొం తెత్తితేని, నీక
పోలములు చిఱునవ్వు నేత్రాలు కూడ
మఱచి సర్వమ్ము సొగసుగా శిరసు ద్రిప్పి
చెందులకొ పాడినట్లుండు నేదొయేదొ !

మఱియు నేవేవో కలలు ముంగురుల జారి ,
వాలి కనుబొమ్మ లేఁగొమ్మ వంపులందు,
దూరి చూపులఁ, జెక్కిళ్ళఁజేరి, మంద
మందహాసంపు మసకలో మాయమాను !

ఎప్పుడో ఎవరిమీదనో పద్యాలు

తుదిమొదలు లేని దానాటి తొలినిశీథ
పుందగాము,
అఖాత మయ్యాది,
అందు దారి
లేదు, మిణుగురైనను కానరాదు,
ఒకండ
బొంచి మొదిగితి నే మూలమూలలందు .

నాటి నిశీథ నీలగగనమ్ముపయిం గనుమోడ్చు మేఘపుం
గాటుక కౌగిలింతల బెనంగి సుఖమ్ముగ నిద్రవోవు నీ
వేటికొ యొత్తిగిల్లి, తరళేక్షణ, నూత్నవియోగ శోకపుం
జాటున స్రుక్కుదీను గనినా వనురాగము మోసులెత్తగాన్.

నవసి త్వదీయహా కరమృణాలము వీణియమీఁద మూగనై
యవశత వాలెనో ! యనలమై దహించు విషాదబాధ డి
ల్లవడెనొ నీమనోజ్ఞ మధురమ్మగు కంఠము, కారు చిచ్చు వే
సవి గళమెత్తి పాడుటకు జాలని సోనవిధానఁ బ్రేయసీ !

నీకనుచూపుచీఁకటులనీడల నాయెద నిల్వలేదు, వే
రాకలి గొన్న నా బ్రతుకునందు ద్వదీయమనోజ్ఞహాసరే
ఖాకమనీయకాంతిసుధ కాల్వలు గట్టగలేదు, కాని యే
మో కలగున్ మనమ్ము వలపుందమసమ్మున నిద్దలంచినన్...

ప్రేయసీ !

దారు లన్నియు మాపె దశదిశలు ముంచెత్తె
నీరంధ్ర భయదాంధకార జీమూతాళి ;
ప్రేయసీ, ప్రేయసీ, వెడలి పోయితివేల
ఆ యగమ్య తమస్వినీ గర్భకుహారాల ?

ఆయఃఖాతంపు ఏకాంతమ్ములో మ్రోసి
మాయమై మెల్లఁగా నీ యడుగుసందడులు
నా యెడఁదత్రోవనే పడి నడచిన ట్లయ్యె,
నాయెడఁదలోననే మాయమైన ట్లయ్యె !

అంత నా గొంతులో 'హా ప్రియా' యను కేక
యంతంత దివికేగ నంతంత దిగిపోయె ;
తారలే కను విచ్చి తమములే శ్రుతి విచ్చి
యారవము విని నన్ను గని జాలి నొందాయి !

నాటనుండియు నేను ప్రతినిశీథతమంపు
గాటుకలచాటు నోరు లే రరయ లేనితఱి
జూచికొని చూచికొని శూన్యహృదయములోని
'కోచెలీ' యని క్రుంగి క్రుంగి యేడ్తును సుమా !

నడిలేని నడిరేయి బడిపోయినట్టి నీ
కడియాలరవళులే చిఱుగాజుమ్రోతలే
వ్రేలెత్తిచూపు జీవితపథమ్ములు నాకు,
కేలెత్తి నడిపించు, నెల్గెత్తి న న్నిలచు !

ఒకటే కథ

వెదకి వేసారి నావెఱ్ఱి బ్రతు కెపుడేని
తుదిరేయిఁ గనుమూసినా,
బేలయై
నిదుర బరువులఁ గ్రుంగనా

మఱపు మసకల దారిఁ దెఱచికొని కలయేదో
విరిసికొని పఱతెంచును,
కారు రా
తిరి కొనల మెఱపించును.

కలఁగి తొట్రిలుచు, నాఁకలి తొందరల సోలు
కరము లట్టే చాతునో,
నామంచు
కనులనట్టే తెఱతునో,

అంతలో నింతలో నడుగు జాడయె లేక
వింతకల కరఁగి చనును
నాకు నా
వంతకథయే మిగులును.

వనరు చేడ్వఁగలేను చచ్చి చావగలేను
కనలేని వెలుగుకొఱకై,
ఎన్నడును
కనరాని దాని కొఱకై;

ఒక క్రొత్తబరువుతో నొక క్రొత్తయాసతో
నొకడనే పడిపోదును,
శూన్యమున
నొకడనే కృశియింతును.

అపుడు

అపుడు గొంతెత్తి యేడ్చినాను,
అపుడు నన్ను,
గాంచగా నోపగాలేక కన్నులల్లి
యార్చికొనినవి తారకలు,

అపుడు మొగిళ్ళు
లల్లనల్లన నలనల్లనై భరమ్ము
లైన నిట్టూర్పు దొంతరలైనవి,

అపుడు
కుంచుకొని కుంచుకొని కుహూకుహరవాటి
నను దొలగి దవ్వుదవ్వులు చని శిరాలు
వాల్చికొనినవి తిమిరాలు భయవశాన,

అపుడు బ్రతుకొక్కటే యేడుపైన గాలి
బిచ్చపడి వట్టిపసిపాప లీల పూన
యానమునఁ బారి సుప్త పత్త్రాళి నొదిగి
పొంచి చూచుచుఁ జరియించి పోయినాడు,

అప్పు డీవిశ్వమే నిత్యయాత్ర నాగి
శ్రవణములు మూసికొనినది, రాకరాక
నాగళతమఃపథమ్ముల శేగిశేగి
రోదనోచ్చలితోచ్చ గీతాదురంత
దుస్సహార్చులు వెడలిరాగా—

ప్రళయము

ఇపుడు ప్రళయమ్ము క్రమ్మిన దేమొ, కాక
దొరకదో నిల్వ నీడ నా చిఱుత పాట,
కింత యిరు కౌనె యిమ్మహా నంత విశ్వ
మలమి కొను చీకటుల కలకలము వలన !

ఎటు గనిన గాని ఆకాశ హృదయ వాటి
సంకుల విషాద జలధరచ్ఛాయలందు
బొంచు బాష్పాంబునిధులు ఘోషించు, నెగుర
పక్షములు దాల్ప వెఱచు నా పాట నేడు !

దశదిశల జీల్చికొని రేగు దారుణప్ర
భంజ నోచ్ఛలితోన్నత భంగవీథి
నెగయు, నయ్యయ్యొ, లోకేశు నెడద వెడలి
యేడ్పుసందడు లెగయూర్పు లేర్చుపొగలు;
పొంచి పొంచి నాలో మూల మూలలందు
క్రుంగి క్రుంగి వడంకి దాగుండు గీతి !

స్థాణువయ్యెనో పాషాణజడభరమ్ము
గనెనొ కదలదు మెదలదు కంఠరవము,
నేడిదేమో క్షమాజననీ పురాణ
గర్భకుహరమ్ము విదలించి కారుచిచ్చు
టెఱుపుమంట మూలుగేదో యేదో ప్రాకె —
నిపుడు ప్రళయమే —

నటరాజ!

అవధరింతువు ప్రతిదివ సాంతమందు
నిత్యనూతన తాండవ నృత్యకేళి,
ఓయి నటరాజ, తలలైన నూపలేక
భువనములు దుర్భరానందమున నడంగ.

అట్టి దూహాంచలమ్ముల నతిశయించి
పొరలు నమృత రసంపు మాధురులలోన,
గొట్టుకొనిపోవు, స్వామి, నాక్షుద్ర జీవి
తమ్ముకూడ దారియెలేక తనివిపోక.

అంత నే వెఱ్ఱినై పోదు నయ్య, నిన్ను
బోలె పాడబోవుదు. నిన్నుబోలె నాట్య
మాడబోవుదు లజ్జ బోనాడి ; కాక
యింత దాహమ్ము దహియింప నెటులు మనుదు !

ఏవిధాన సౌందర్య రసైక జీవి
నిలువనేరుతు నిట నొక్క నిముసమేని
మామకీన జీవిత శూన్యమార్గముల ద్వ
దీయ పదమంజీరముల్ మ్రోయకున్న ?

ఆటతో పాటతో నేర్చినట్లు దేవ,
ఏనుగూడ నీవలె నటియింప నిమ్ము ;
ఎడతెగని యాత్ర నెట్లో సాగించు వరకు
ఎట్లో నీదర్శనమ్ము సాధించువరకు !

శాపము

వింజమూరి
పార్థసారథి

ఆరోజు అమావాస్య !

ఉదయం ఎనిమిదిన్నరకే గోపి భోజనము చేసుకుని ఏమీతోచక సహాధ్యాయుడైన శ్రీనివాసరావును వెంట వేసుకుని సముద్రతీరానికి షికారు బయలుదేరి వెళ్ళినాడు. పల్లెవాళ్ళప్పుడక్కడ అడావుడిగా ఉన్నారు. సముద్రపు ఒడ్డు పొడుగునా ఉన్న తెప్పలకు సంచలనం కలిగింది. కొంతమంది అప్పటి కప్పుడే తెప్పలు సముద్రంలోకి కొంతదూరం పోనిచ్చినారు. కొంతమంది అల విరిగేచోటు దాటించడము కోసము సముద్రంలోకి దిగి తెప్పలు తోసుకుని పోతున్నారు. ఇంకా కొంతమంది తెప్పలు సరిచేసుకుంటూ చేపలు పట్టేటందుకు వాటిమీద పరికరాలు సిద్ధపరుచుకుంటున్నారు. కాని అందరూ తొందర పడుతున్నారు. అనుభవం వల్ల వాళ్ళు ఏదో గాలిరాక కనిపెట్టి చేపలు విశేషంగా దొరుకుతవని వాళ్ళట్లా బయలుదేరుతారు. ఆగాలి వచ్చిందా, ఏపని చేస్తున్నవాళ్ళు ఆపనిని అక్కడే వదిలిపెట్టి తెప్పలు వద్దకు వస్తారు.

గోపీ, శ్రీనివాసరావూ, పల్లెవాళ్ళను చూస్తూ అక్కడ కొంతసేపు నిలబడ్డారు. పల్లెవాళ్ళతో కూడా సముద్రంలోకి పోవాలని అకస్మాత్తుగా గోపికి బుద్ధి పుట్టింది. పట్నం వచ్చినప్పటినుంచీ వెళ్ళుదాము వెళ్ళుదా మనుకుంటున్నాడు కాని ఇన్నాళ్ళూ అది సందర్భపడిందికాదు. ఆపల్లెవాళ్ళ సందడి చూసే టప్పటికి అతని కుతూహలం అతిశయించింది. అంతట ఉత్సాహంతో గోపి "శ్రీనివాసులూ, మనముకూడా వాళ్ళతో వెడదాముట్రా?" అన్నాడు.

శ్రీనివాసరావు వెంటనే కళ్ళెఱ్ఱచేసి "నీ కేమైనా మతిపోయిందా ఏం ! ఐతే హాస్టలుకు పోదాం నడు !" అన్నాడు.

గోపి ముఖం చిన్నబుచ్చుకున్నాడు. కాని మనస్సులో కుతూహల మేమీ తగ్గలేదు. "అబ్బా, అంత భయమేం ? ఒకగంటసేపు కులాసాగా తెప్పమీద తిరిగి వద్దాము రద్దూ !" అని గోపి బతిమాలినాడు. "నువ్వు పోయేదే కాకుండా నా ప్రాణంకూడా తీయాలని చూస్తున్నావా ఏం ? నేనివ్వాళ లేచిన వేళ మంచిదికాదు, నీ కీదుర్బుద్ధి పుట్టింది !" అన్నాడు శ్రీనివాసరావు.

గోపి విసుగుతో "ఇంతలోకే మరేమీ ప్రాణాలు పోవులే ! నీ

ప్రాణానికి నా ప్రాణం అడ్డువేస్తాలేరా !" అన్నాడు.

" అబ్బాయి, చెబుతున్నా విను. నీ ఆటలు కట్టిపెట్టి రా ఈ పాటికి. ఇట్లాగే వెర్రి వెంకటాయి చేష్టలు చేస్తున్నావంటే మీ నాయనకు ఉత్తరం వ్రాస్తాను. ఆయన విన్నాడంటే లబాలబా మొత్తుకుంటాడు " అన్నాడు శ్రీనివాసరావు.

గోపికి కోపం వచ్చింది. స్నేహితుడితో తోడుగా వెళ్ళవలెననే సరదా ఇంకా పోలేదు. " నీ బెదిరింపులకేం జడవను కాని అసహ్యంగా మాట్లాడక వెడదాం రా ! " అన్నాడు.

"నేను రాను, నీ వెర్రి చెప్పినానగే!" అని శ్రీనివాసరావు ఖండితంగా చెప్పినాడు.

తాను అంతగా ముచ్చట పడుతూ ఉంటే అడ్డమాటలు చెప్పి తన్ను నిరుత్సాహపరుస్తున్నాడని గోపి స్నేహితుని మీద కొంచెం విసుగుకుని తాను మాత్రం వెళ్లకతప్పదని చెప్పినాడు. శ్రీనివాసరావు గోపిని అంత ఆఘాయిత్యం చేయవద్దని ఇంకా ఎంత విచారించినా అతను వినలేదు. చివరికి వార్డనుతో రిపోర్టు చేస్తానని కూడా బెదిరించి చెప్పి చూసినాడు. వద్దంటున్నకొద్దీ గోపికి సముద్రంలో వెళ్ళవలెననే ఉత్సాహమూ నిశ్చయమూ ఎక్కువైనవి. ఆఖరికి శ్రీనివాసరావు విసిగి " నీ వేపట్లో కలిస్తే నాకేం పో ! " అన్నాడు.

అతని మాట లెంత మాత్రమూ లక్ష్యము చేయక గోపి అక్కడికి సమీపంలో ఉన్న ఇద్దరు పల్లెవాళ్ళ దగ్గరికి వెళ్ళినాడు. వాళ్లు అప్పుడే సమస్తమూ సిద్ధముచేసుకుని తెప్పనునీళ్లలోకి లాగబోతున్నారు. తననుకూడా తెప్పమీద తీసి కెళ్ళమని గోపి వాళ్ళ నడిగినాడు. పల్లెవాళ్ళు గోపి మాటలు విని ఒకళ్ళ మొహాలు ఇంకొకళ్లు చూసుకున్నారు. తాము చేపలు పట్టడానికి వెళుతున్నామనీ, మళ్లీ తిరిగి ఒడ్డుకు వచ్చేటప్పటికి ఒకప్పుడు సాయంకాలం కూడా కావడం కద్దనీ చెప్పినారు.

అక్కడే నిలుచుని వాళ్ళమాటలు వింటూఉన్న శ్రీనివాసులు గోపి వెళ్ళ నిశ్చయించినాడని మనస్సు కరిగి "ఒరే నా మాట విను ఇప్పుడుకాదు. మరొకప్పుడు మన మిద్దరం కలిసి పోదాము రా ! " అని బతిమాలికూడా చెప్పినాడు. కాని గోపి ఆ మాటలు పెడచెవిని బెట్టినాడు. " భోజనం చేసే వచ్చాను. ఎంత పొద్దుపోయినా ఫరవాలేదు " అని పల్లెవాళ్ళతో గోపి చెప్పినాడు. వాళ్ళు కొంచెం ఆలోచించి రూపాయి ఇస్తే తీసుకుని వెళ్లుతామన్నారు. గోపి అందుకు వెంటనే ఒప్పుకున్నాడు.

వాళ్ళు నీళ్ళలోకి దిగి తెప్పను తోస్తూ అతన్ని రమ్మని తొందర పెట్టినాడు. ఇంతవరకూ శ్రీనివాసరావు మాటలవల్ల కలిగిన నిరుత్సాహమంతా

ఆ మాటలవల్ల పోయి గోపి ఉల్లాసంగా తెప్పమీద ఎక్కి కూచున్నాడు. తెప్ప ఎక్కబోయే టప్పుడు కూడా శ్రీనివాసరావు, "వద్దురా! ఈవేళ అమావాస్యకూడాను, పోటు ఎక్కువగా ఉంటుంది. అందులో నీకు నీటిగండం ఉన్నదనికూడా అంటూ ఉంటావు. నా మాట విను ఇప్పటికైనా" అని ఎంత తీవ్రంగా చెప్పినా గోపి చిన్ననవ్వు నవ్వి, "ఇంతట్లోకే మరేమీ చచ్చిపోనులే, మధ్యాహ్నం టిఫిను వేళకు పొడిబట్టలు పట్టుకురా" అని చెప్పినాడు.

శ్రీనివాసరావు కోరచూపులు చూసినాడు. అతన్ని చూసినకొద్దీ గోపికి నవ్వు ఎక్కువయింది.

పల్లెవాళ్ళు తెప్ప ఎక్కి తెడ్లు వేయ సాగినారు. తెప్ప సాగింది. అల విరిగే చోటు దాటినారు. అల వచ్చినప్పుడల్లా పైకి లేస్తూ అల దాటిపోయిన తర్వాత కిందకు పడుతూ ఉయ్యాల లూగుతూ తెప్ప సముద్రంలోకి పోతూ ఉన్నది. అప్పుడు పట్టరాని సంతోషంతోనూ ఉత్సాహంతోనూ గోపి వెనక్కు తిరిగి నివ్వెరపడి తనవంక చూస్తూఉన్న శ్రీనివాసరావును చూసి చప్పట్లుకొట్టి కిలకిల నవ్వినాడు. తెప్ప చూపుమేర దాటిపోయినదాకా శ్రీనివాసరావు గోపి వంక ఏకతీరున చూస్తూ ఉండి అతనికి ఏ ఆపద వస్తుందో అని భయపడుతూ విసుగుతోనూ కోపంతోనూ హాస్టలుకు మరలి పోయినాడు.

తెప్ప ఉయ్యాల లూగుతూ సముద్ర గర్భములోకి చొచ్చుకొని సొరచేప వలె శీఘ్రముగా పోతున్నది. గోపికి కలుగుతూ వచ్చిన ఆనందానికి మితిలేదు. నీటి తుంపురులు పడి తన దేహమూ బట్టలూ స్నానము చేసినట్లు తడిసిపోయిన సంగతే అతను గమనించలేదు. కొంతసేపు "చల్ మోహనరంగా" అనే పదము సముద్రఘోషతో శ్రుతి కలిపి పాడుతూ ముఖ్యముగా "మల్లెపూలా తెప్ప గట్టి తేలిపోదాం పదరా" అన్న చరణము మరీ మరీ పాడుతున్నాడు.

తెప్ప సముద్రంలోకి చాలా దూరం పోయింది. ఒడ్డు కనిపించడము లేదు. ఏ వంక చూసినా నీళ్ళూ ఆకాశమూ తప్ప మరేమీ కనబడడము లేదు. ఈ దృశ్యం చూస్తూ ఉన్నకొద్దీ గోపి హృదయాబ్జములో వింత భావాలు అంకురించసాగినవి. రాగాలాపన మందగించింది. కవితాత్మ గల అతను అత్యద్భుతమైన ఈశ్వర సృష్టిని కొనియాడ సాగినాడు. ఆకాశం వైపు కళ్ళు అట్టె నిలిపి ధ్యానము చేస్తున్న మునీశ్వరుడు లాగా కనబడుతూ ఉన్నగోపిని చూసి పల్లెవాళ్ళు తమలో తాము నవ్వుకోవడం సాగించినారు.

ఇప్పటి కప్పుడే ఒడ్డునుంచి బయలుదేరి షుమారు ఘంటసేపయింది. ఇంత

వరకూ విశేషఉత్సాహముతో ఉన్న గోపికి కొంచెం తల తిరగడము ఆరంభించింది. నెమ్మదిగా వికారం అంకురించింది. కొంతసేపటికల్లా కడుపులో చేయి పెట్టి కెలికినట్లున్నది. వచ్చేటప్పుడు నిమ్మకాయన్నా ఇంత చింతపండన్నా తెచ్చుకోకపోతినే అని నొచ్చుకున్నాడు.

వికారము అంతకంతకు ఎక్కువై వాంతులు కూడా వెళ్ళడ మారంభించినవి. అతని అవస్థ చూసి తెప్పకుకట్టిన తాళ్ళకు గట్టిగా పట్టుకుని కూర్చుండమని పల్లెవాళ్లు చెప్పినారు. కాని విశేషకాలం సముద్రంలో నానుతూ ఉన్నందువల్ల కొంగర్లుపోయిన అతని వేళ్లు ఎంతమాత్రమూ పట్టు పట్టలేక పోయినవి. ఎప్పటికప్పుడు తెప్ప ఊగినప్పుడల్లా సముద్రంలోకి దొర్లిపోతున్నట్లుగా అతనికి కనుపించేది. అంతకంతకు వాంతులవల్ల నీరసించి పోతున్నాడు. ఇంకా ఏమాత్రమూ సముద్రంలో ఉండలేననీ తన్ను వెంటనే ఒడ్డుకు తీసుకు వెళ్లవలసినదనీ పల్లెవాళ్లతో చెప్పినాడు. కాని వాళ్లు "ఇంకా చేపలు పట్టడం కాలేదు. అప్పుడే ఒడ్డుకు పోవడానికి వీలులేదు. 'చల్ మోహనరంగా' పదము పాడండి. కొంతసేపు అట్టె ఓపిక పెట్టుకుని కూచుంటే వికారము తనంతట అదే పోతుంది" అని చెప్పినారు.

అట్లాగా గోపి ఓపిక పట్టడానికి ప్రయత్నించినాడు. ఒక్కక్షణంలోనే వాంతి భళ భళగా వెళ్లిపోయింది. ఆబాధకు పొట్ట తీపువల్ల అంటుకునిపోయినట్లయింది. అందుకుతోడు చలివల్ల శరీరము వణుకుతో ఎగరగొట్టివేస్తున్నది. కళ్ళు చీకట్లు కమ్మడం ఆరంభించినవి. శరీరంలో పటుత్వం యావత్తూ పోయింది. అట్లాగే సముద్రంలో ఇంకోగంట ఉంటే బొత్తుగా చైతన్యమే తప్పిపోతుందని గోపి భయపడి చలితో పళ్ళు కరుచుకుంటూ వెంటనే తెప్పను మరలించుకుని తీసుకు వెళ్ళమని ఈసారి పల్లెవాళ్ళతో ఖండితంగా చెప్పినాడు. కాని పల్లెవాళ్ళు మాత్రం గోపి దీనస్థితిని చూచికూడా కనికరించలేదు. "ఇంతాకష్టపడి చేపలుపట్టకుండా ఊరికే ఎట్లా పోవడం !" అన్నారు. చివరకు వాళ్లు గోపిని చూసి నవ్వడం కూడా సాగించినారు. భయంకరమగు స్థితిలో ఉన్నతనను చూసి వాళ్ళు క్రూరంగా నవ్వుతూ ఉంటే ఆనవ్వు పిశాచాల నవ్వుగా అతని చెవులలో ప్రతిధ్వనించింది. ఇంతసేపూ ఏదోవిధంగా ధైర్యం చిక్కపట్టుకుని కూచున్నగోపి అధైర్యపడసాగినాడు. "అయ్యో ! శ్రీనివాసరావు వద్దంటే వద్దన్నాడు. వాడిమాటలు లక్ష్యంచేయకపోతినే" అనుకున్నాడు.

చలితో ఆపాదమస్తకము కంపిస్తూ పైత్యభ్రమచెందిన అతగాడికి నీటిలో తడిసి నల్లటి దేహచ్ఛాయలుగల ఆబెస్తవాళ్ళు మహాభీకర స్వరూపము దాల్చిన యమకింకరులు లాగా కనపడ్డారు. తాను వద్దని ఎంత నివారించినా , మీదు

మిక్కిలి అతి దీనంగా వేడుకున్నా తన మాటలు పాటించకుండా తమదోవను తాము నిశ్చింతగా తెడ్లు వేస్తూ మరింత దూరము సముద్రములోకి తీసుకుని వెళ్ళడము చూడగానే గోపికి వాళ్ళు తనను ఈ ప్రపంచంలో నుంచి ఆ ప్రపంచంలోకి తీసుకుని పోతున్నారనే భావము కలిగినది. గ్రీకు కథలలో తాను చదివిన ఏడుపాయలు గల " స్టిక్సు " నదిగా ఆ సముద్రము కనిపించింది. ఆ బెస్త వాళ్ళు నిర్ఘృణులైన ఇద్దరు "కేరనులు" గా తోచినారు. వెంటనే అతని గుండెలు తెట తటా కొట్టుకున్నవి. కళ్ళలోకి వెఱ్ఱిచూపు వచ్చింది.

ఒక్కసారిగా అతనికి తల్లి దండ్రులూ అన్న దమ్ములూ అక్కచెల్లెళ్ళూ తలపుకు వచ్చినారు. కన్నీళ్ళు కారినవి. తనకు నీటిగండ మున్నదని నూనె గుడ్డలవాడు చెప్పినమాట జ్ఞాపకము వచ్చినది.

మెరుపు మెరిసినట్లు అతనికి బాల్యస్మృతులు వచ్చినవి. రామాంజము వివాహం జ్ఞాపకము వచ్చినది. అప్పుడు వణుకు రోగము గల ఆముసాలి బ్రాహ్మణుడు తనను తిట్టిన తిట్లు జ్ఞప్తికి వచ్చినవి. గడ్డాలు మీసాలు పెరిగిన ఆ బ్రాహ్మణ స్వరూపము కళ్ళకు కట్టినట్లయింది. మనిషి కొయ్యబారి పోయినాడు.

నక్కల కూతలవలె ఏవో భయంకరధ్వనులు అతని చెవులకు వినబడి భయోత్పాతం కలిగించినవి. కళ్ళఎదుట వికృత వికృతమైన పిశాచాకారాలు కనిపించినవి. తన కిక మృత్యువు ఆసన్నమైనదని అనుకున్నాడు. అత్యంత త్వరితముగా కొట్టుకుంటున్న గుండె ఒక్కసారిగా ఆగిపోయింది. కళ్ళు మూతలు పడ్డవి. కెవ్వున కేకవేసి తెప్పమీద నిస్సారంగా తూలి పడ్డాడు.

౨

గోపి ఎనిమిదేళ్ళ పిల్లవాడుగా ఉన్నప్పుడు రామాంజం వివాహం బెజవాడలో జరిగింది. పెళ్ళి ఐదురోజులు కాగానే వాళ్ళంతా స్వగ్రామం గుంటూరుకు గృహప్రవేశానికి వచ్చినారు. గృహప్రవేశం చాలా గొప్పగా జరిగింది. ఆశీర్వచనానికీ తాంబూల సంభావనలకు వచ్చిన బ్రాహ్మణ్యాన్ని చక్కగా బహూకరించినారు. అందువల్ల మర్నాడు జరుగుతున్న సత్యనారాయణవ్రతము సందర్భంలో కూడా మరింతమంది బ్రాహ్మలు వచ్చినారు.

గోపీ, వేణూ ఇంకా ఒకరిద్దరు పెళ్ళికూతురు వేపుపిల్లవాళ్ళూ ఆరోజు ఉదయాన్నే లేచి ముఖం కడుక్కోవడమాలస్యంగా దొరసాని గారి తోటవైపుకు షికారు వెళ్ళినారు. వైశాఖ మాసం కావడంవల్ల తోటలో మామిడి చెట్లకు బాగా కాయలు పట్టినవి. తోటమాలి ఉన్నాడేమో అని గోపీ, వేణూ అన్ని వేపులా బాగా పరకాయించి

చూసి తోటమాలి అక్కడ లేడని నిర్ధారణ చేసుకుని ఉభయులూ మామిడి చెట్లు ఎక్కి కావలసినన్ని కాయలు కోసుకుని చెట్లు దిగి వచ్చినారు. అంతట్లో కే ప మూలనుంచో తోటమాలి కేకలు వేసు కుంటూ కాయలు కోసినందుకు తిడు తూ గోపీ వాళ్ళను పట్టుకోబోయినా డు. కాని అంతమాత్రానికే చిక్కడాని కి గోపీ వేణూ అంత తెలివితక్కువ వాళ్ళుగనకనా ! వాళ్ళిద్దరూ తప్పించు కుని పారిపోయినారు. వాళ్ళ వెంట వచ్చిన పిల్లకాయలు మాత్రము పట్టుబడ్డారు. కాని వాళ్ళు తెల్ల మొహాలు వేయడమూ వాళ్ళదగ్గర కాయలు లేక పోవడమూ చూసి తోటమాలిమరేమీ చేయలేక వాళ్ళను బాగా గదమాయించి వదలి పెట్టినాడు.

తోటమాలి ఇంకా తరుముతూ ఉన్నాడేమో అని వెనక్కి వెనక్కి చూసు కుంటూ గోపీ, వేణూ ఇంటికి పరుగెత్తు కుని పోయినారు. అప్పుడు పదకొండు గంట లయి ఉండవచ్చును. సంభావన సంతర్పణలకు వచ్చిన బ్రాహ్మణ్యంతో పెళ్ళిల్లు కిటకిట లాడుతున్నది. ఇంట్లో హాలూ వసారా ఆవరణం అంతా బ్రాహ్మలతో నిండిపోయింది.

ఆశీర్వచనాలు చదవడం ఆరంభమైంది. బ్రాహ్మలు గొంతెత్తి ఆశీర్వచనాలు చెప్పుతున్నారు. కొందరు బుక్కులు చెప్పినారు. మరి కొంతమంది పనసలు చెప్పినారు. సామగానము చేసినారు కొంతమంది, కొంతమంది పెదవులు మాత్రం కదులుతూ ఉన్నాయి కాని, వాక్కు మాత్రం బయటికి రావడం లేదు. అందరి కన్నా బిగ్గరగా మంత్రాలు చదివితే యజమాని తమవంక చూసి అఖండ పండితులుగా భావించి సంభావన బలంగా ఇస్తాడనే ఆశతో కొందరు బ్రాహ్మలు గొంతులు చించుకుంటున్నారు. అందరి కన్నా వెనక చిక్కి వచ్చిన ముసాలి బ్రాహ్మణుడు ఒక్కడుమాత్రం జనాన్ని తోసుకుని లోపలికి వెళ్ళలేక వాకిట్లో అరుగుమీదనే కూచుని ఆత్రంతో వీధి వాకిలి గుండా లోపలికి చూస్తున్నాడు. అతని కళ్ళు చింతనిప్పులవలె వెలుగుతున్నవి. అతని దేహం కాటికవలె నల్లనిది. మెడలోనూ చెవులకూ రుద్రాక్ష మాలలు ధరించినాడు. రుద్రాక్షమాలల పక్కనే మెడలో పాశము ధరించి, యమధర్మరాజు పాశము తలపుకు తెస్తున్నాడు. ముఖానా దేహానా విభూతి రేఖలు తీర్చిపెట్టినాడు. నుదుట పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకుని భయంకరంగా ఉన్నాడు. గడ్డాలు మీసాలు పెరిగి ఉన్నవి. జడలు అంటలు కట్టుకుని పోయినవి. కాషాయవస్త్రములు ధరించి నాడు. అందువల్ల సన్యాసి వలె కొంత కనబడుతున్నాడు. వణుకుడు రోగమువల్ల అతను ఆపాదమస్తకమూ కంపిస్తున్నాడు. అందులో శిరస్సును కొంతసేపుపక్కలకూ కొంతసేపు పైకీ

కిందకీ ఊగించడము వల్ల భయమూ హాస్యమూ కూడా పుట్టిస్తున్నాడు.

తోటమాలి బారినుంచిఎలాగో తప్పించుకు వచ్చాము గదాఅనే సంతోషం వల్ల ఉద్రూత లూగుతూ గోపీ వేణూ యకాయకి ఇంటికి వచ్చి పడ్డారు. లోపల సందడి చూసి వేణు తమాషా చూడడానికి చరచరాఇంట్లోకి పోయినాడు. ఆ కాషాయవస్త్రధారి గోపి దృష్టి ఆకర్షించినాడు. ఎందుకో గోపి ఉలిక్కిపడ్డారు. ఆ బ్రాహ్మణుని వికృత స్వరూపమూ వణుకుడూ చూసి గోపి అక్కడనే ఆగి ఎదురుగుండా ఉన్న రెండో అరుగు మీద కూచుని వెఱ్ఱివాణ్ణి చూసినట్లుగా వికృతంగా ఆబ్రాహ్మణుని వంక తదేక దృష్టితో చూస్తూ ఉన్నాడు. అతనికాబ్రాహ్మణు డేదో మహావిచిత్రంగా కనిపించినాడు. అతను తల కాయ ఊరికే తిప్పడము చూసి అతను ఎవడో ఎందుకు వచ్చాడో తెలుసు కుందామని గోపికి తోచింది. మొట్టమొదట అతని ఆకారముచూసినప్పుడు కలిగిన భయము అణచుకుని ధైర్యము తెచ్చుకుని 'మీదేవ్వూరు' ఇత్యాది ప్రశ్నలుఒకటొకటే అడిగినాడు. తాను బ్రాహ్మణుడనిన్నీ పెళ్లిఇల్లుగనకవచ్చాననీ చెప్పినాడు. గోపి అంతటితో ఊరుకోలేదు. "ఎందుకండీ అట్లా తల ఊరికే తిప్పుతారు?" అని ప్రశ్నించినాడు. కాని ఆమాట లతను వినిపించు కోకుండా ఆత్రంతో ఆహారం కోసం చూస్తున్న గుడ్లగూబవలె ఇంట్లోకి చూస్తూ కూచున్నాడు. తన ప్రశ్నకు సమాధానం ఇవ్వడేమి చెప్మా అని గోపి మళ్ళా మరింత పట్టుదలగా అడిగినాడు. అందుకు బ్రాహ్మణుడు శరీరములో వాతపు గుణము ప్రవేశించిన దనీ అందువల్ల ఆవిధంగా వణుకు పుట్టినదనీ చెప్పినాడు.

"ఓహో అట్లాగా!" అని గోపి అరిచి వికటంగా విరగబడి నవ్వి కాస్త సేపటికి ఇంట్లోకిపోయినాడు. కాని గోపికి ఇంట్లో ఏమీ తోచలేదు. వెంటనే మళ్ళా తిరిగివచ్చి బ్రాహ్మణుని కెదురుగుండా కూచుని అతనివలె తానుగూడా తల తిప్పడం సాగించినాడు. తెచ్చిపెట్టుకున్న వణుకురోగం కాబట్టి గోపి మరింతగా తల ఊపుతున్నాడు. బ్రాహ్మణుడు పక్కలకు తిప్పినప్పుడు పక్కలకూ పైకీ కిందకీ ఊపినప్పుడు పైకీ కిందికీ గోపి తల ఆడిస్తున్నాడు. బ్రాహ్మడు అది కొంతసేపు చూసి "తప్పు అబ్బాయి, తప్పు! జబ్బువాళ్ళను అట్లా వెక్కిరించ గూడదు, దోషం!" అనిచెప్పినాడు.

ఐనా గోపి అతని మాటలు లక్ష్యపెట్టకుండా మరింత ఎక్కువగా వెక్కిరించ మొదలుపెట్టినాడు. బ్రాహ్మణుడు కోపించి పెద్దవాళ్ళు మంచిగా చెప్తుతుంటే కూడా అంత మొండితనం కూడదని గోపిని గట్టిగా మందలించినా అతను అప్పటికైనా మానలేదు.

ఆ కాషాయవస్త్రధారి ఉగ్రుడైనాడు. "ఛీ! నా ఎదటనుంచి వెళ్లిపో!

పెద్దవాళ్ళతో చెప్పి చెంపలు వాయగొట్టిస్తాను!" అని గుడ్లెఱ్ఱజేసి అన్నాడు. అప్పుడతని కళ్ళలోనుంచి నిప్పులు రాలిపడుతున్నట్లు ఉన్నవి. రోగంవల్ల సహజంగా ఉంటూఉన్న కంపము మరింత ఎక్కువై ఝంఝామారుతమువల్ల ఆమూలము కంపిస్తున్న వటవృక్షమువలె ఆ మునివేషధారి కంపించినాడు. గోపి అతనిని అప్పుడే ప్రథమ పర్యాయము చూచి ఉంటే భయముతో పారిపోయి ఉండేవాడు. కాని అంత సేపటినుంచీ సంభాషిస్తున్నందువల్ల ఆ బ్రాహ్మణునితో పరిచయమై గోపికి భయమే కలగలేదు. బ్రాహ్మణుడు కోపించిన కొద్దీ మరింత నిర్భయంగా వెక్కిరిస్తూ గోపి నిశ్చలంగా కూచున్నాడు.

ఆ జటాధారికి ఒళ్లు మండిపోయింది. ఆ మహారౌద్రమున కాతని జడలూ, గడ్డాలూ, మీసాలూ నిక్కపొడుచుకున్నవి. చివాలున లేచి నిలుచున్నాడు. కుడిచేయి పైకెత్తి పిడుగువలె కఠోరమైన స్వరంతో "నీ కీమిడిసిపాటు పన్నెండేళ్ళపాటేగా!" అన్నాడు.

గోపికి అప్పుడు నాటకాలల్లో చూసిన దూర్వాసమహాముని కోపించి శపించడం జ్ఞాపకము వచ్చినది. ఆ బ్రాహ్మణుని నోటినుంచి ఆ మాటలు వెలువడ్డవో లేవో గోపి వినీవినకుండానే ఇంట్లోకి పరుగెత్తుకొనిపోయినాడు. తన వాకిటి అరుగుమీద కూర్చుని తనను అట్లా తిట్టిపోయడానికి ఆ బ్రాహ్మణుడు ఎట్లా సాహసించగలిగినాడో గోపికి అర్థము కాలేదు.

* * *

పై వృత్తాంతం జరిగి రెండు సంవత్సరాలయింది. గోపికి ఇప్పుడు పదోయేడు వచ్చినది. హైస్కూలు బ్రాంచిలో ఫస్టుఫారం చదువుకుంటున్నాడు. చదువంటే అట్టే శ్రద్ధ లేకపోయినా వాళ్ళతండ్రి ప్రయివేటు చెప్పిస్తూ ఉన్నందువల్ల గోపి ఏదోవిధంగా క్లాసులో కాస్త మెరుగ్గానే ఉంటూ ఉన్నాడు. బడి వదిలిపెట్టడమే ఆలస్యం ఇంటికి పరిగెత్తుకుని వచ్చి కారనేషన్ గ్రౌండులో స్నేహితులతో ఫుడ్‌బాల్ ఆడుకునే వాడు. అందులో ఎక్కువ నేర్పరి అవడంవల్ల పిల్లలందరిలో గోపి మొనగాడై ప్రతిశనివారమూ ఆదివారమూ పోటీ ఆటలు ఆడుతూ చీకూ చింతా లేక కాలక్షేపం చేస్తున్నాడు.

గోపికి బందరులో మేనమామ ఒకడు ఉన్నాడు. ఆయన ప్లీడరు. గోపి కాయన్ను చూస్తే ఎంతో ఆపేక్ష. తన పసితనమంతా మేనమామ బుజాలమీదనే గడిపినాడు గోపి.

ఆ మేనమామ స్వతస్సిద్ధముగా సంపన్నుడు. ప్లీడరీలో కూడా నెలకు నాలుగయిదు వందల రాబడి ఉండేది. పాశ్చాత్యపద్ధతులు బాగా అలవాటు ఐనవి ఆయనకు. మనిషి మంచి శరీర పటుత్వము కలిగి ముప్ఫైయైదు ఏళ్ళున్నా పాతికేళ్ళ లోపు వాడుగా కనబడేవాడు.

గోపి మేనమామగారింటికి దేవాంగ ముసలిది ఒకతె ప్రతి నిత్యమూ ముష్టికి వచ్చేది. ఆముసలిదానికి నూరేండ్లు నిండి ఉంటవి. విల్లంబు బద్దవలె వంగి ముళ్ళ కర్ర పట్టుకుని నడిచేది. ముడతలు పడి పోయిన చర్మమూ చింతపిప్పలవంటి కళ్లూ, ముగ్గుబుట్టవలె నెరిసి అంటలు కట్టుకునిపోయిన తలవెంట్రుకలు గల తల కాయా. తతిమ్మా పళ్ళన్నీ ఊడిపోయి పారలవలె బయటికి ఈడుచుకు వచ్చిన రెండు పళ్ళూ, గల ఆమనిషిని కొత్తగా చూసిన ప్రతి పిల్లవాడూ పిల్లా జడుసుకుని రెండు మూడు రోజుల వరకూ జ్వరం పడేవాళ్ళు. ఉదయం గోపి మేనమామ పార్టీలతో మాట్లాడే సమయమూ ఆముసలి ముష్టిది తయారయ్యే సమయమూ ఎప్పుడూ ఒకటిగా ఉండేది. అది వచ్చినప్పటినుంచీ ఉన్నంతసేపూ ఎడతెగకుండగా "తల్లీ తల్లీ" అని భయంకరమైన స్వరంతో పిలిచేది. ఆపిలుపు మనిషిపిలుపుగా ఉండేదికాదు, పిశాచము అరుపువలె ఉండేది. ఏవేళకయినా ముష్టి పెట్టందే వాకిట్లోనుంచి బయటికి అడుగు పెట్టేది కాదు. గోపి మేనమామ గారి వాకిట్లోకి వచ్చిన ముష్టివాళ్ళను బియ్యం పెట్టకుండా ఎప్పుడూ పంపేవాళ్లు కారు.

గోపి సెలవులలో తరుచుగా మేనమామగారి ఊరు వెళ్లేవాడు. గోపీ వేణూ ఇద్దరూ వెడితే పోట్లాడుకుంటారని వాళ్ళ నాన్నగారు వాళ్ళ నిద్దరినీ ఒక్కసారి పంపక చలికాలపు సెలవులలో ఒకళ్లనూ ఎండాకాలపు సెలవుల్లో ఇంకోళ్ళనూ పంపించేవారు.

గోపి మేనమామగారింటికి వెళ్ళినప్పుడల్లా ఆ ముసలిదాన్ని చూస్తూ ఉండేవాడు. ఆ అమ్మి ముష్టికి రాగానే "తల్లీ తల్లీ" వచ్చిందని వాళ్లఅత్తనడిగి బియ్యం తీసుకుని వెళ్లి పెట్టేవాడు. ఒకప్పుడు బియ్యం మరీ కాసిని తీసుకుని పోయేవాడు. ఒక్కొక్కసారి బియ్యంపెట్టబోయి పొరపాటున పోసినట్లు ఒలకబో[illegible]లె నని తానే కింద ఒలకపోసే[illegible] ఇంకొకసారి దోసెడునిండా బియ్యంపెట్టి ఇంకో దోసెడుకూడా తెచ్చి పెట్టేవాడు. మరొకసారి ఆ ముసలిది పట్టుకువచ్చే కర్రను — కుచ్చితపుబుద్ధి గల వాళ్ళ మనస్సువలె వంకర వంకరలు తిరిగిన ఆ ముళ్ళకర్రను— లాగుకోబోయేవాడు. ఈ విధంగా దానిని ఆటలు పట్టిస్తూ ఉంటే ఆ ముసలిది ముఖము మరింత చిట్లించి విసుగుకొనేది. అప్పుడది లోకాన్ని మింగివేయబోతున్న తామసదేవత వలె ఉండేది. గోపి అల్లరి చూసినప్పుడు వాళ్ల మేనమామ "ముష్[illegible]ని ముండతో నీకెందుకురా!" అని మందలించేవాడు. గోపి తలంటినీళ్ళు పోసుకునేటప్పుడు ఎప్పుడూ కుంకుడు కాయతో రుద్దుకుని తల వదిలిందో లేదో తెలుసుకోడానికి 'తల్లీ తల్లీ తల వలె ఉందా" అనేవాడు. ఆ ముసలిదాని జుట్టు నెరవడము అతని మనస్సులో

అంత గాఢంగా నాటుకొనిపోయినది. దానికి "తల్లీ తల్లీ" అని గోపి నామకరణం చేసినాడు.

గోపి తన పదో ఏట మేనమామ ఇంటికి వెళ్లినాడు. ఒక రోజున అతని మేనమామ వసారాలో పార్టీలతో అవసరవిషయాలు మాట్లాడుతుండగా "తల్లీ తల్లీ" వచ్చి ముష్టి పెట్టమని గోలచేసింది. "ఉండు పెడతారు, అట్లా అరవవద్దు" అని చెప్పి ఆయన తనపని చూసుకుంటున్నాడు. గోపి లోపలనుంచి వానిని చూసికూడా అల్లరికి విననట్లుగా నటించినాడు. గోపి మేనమామ మాటలు వినిపించుకోకుండా ముసిలిది విరామము లేకుండా "తల్లీ తల్లీ" అని అరిచింది.

గోపి మేనమామ సహజ సౌమ్యుడైనా ఎప్పుడో ఒక్కొక్కసారి అతనికి హఠాత్తుగా కోపం వచ్చేది. అప్పుడాయనకు ఒళ్ళు తెలియదు. ఆ పని తొందరలో ఆ ముష్టిది అట్లా అరుస్తూ ఉంటే చిరాకువేసి "ఛా! వెళ్ళిపో" అని రెండు మూడు మాట్లు కసిరి కొట్టినాడు. కాని ముసలిది కదలకుండా యథాప్రకారము ఏకటీరున గోలపెట్టింది. మేనమామ కోపం పట్టలేక పోయినాడు. దాన్ని బయటికి పంపించి తలుపు వేసేయమని జవానుకు చెప్పినాడు.

జవాను మోటముండావాడు. ముసలిదాని కర్రను ఊడ బెరుక్కొని వీధిలో పారేసి వాకిట్లోకి దానిని గెంటి వాకిలితలుపు వేసినాడు. పాపమా ముసలిది వీధిలో వెళ్లి కిలా పడ్డది. ఒడిలో బియ్యమంతా మట్టిపాలైనవి. ఆముసలిది మహాకోపముతో ఎట్లాగో పాకిపోయి కర్ర తీసుకుని ఏడుస్తూ గోపి మేనమామను అడ్డమయిన తిట్లూ తిట్టి "వేసిన తలుపులు వేసినట్లే ఉండాలి" అని ఘోరంగా శపించింది.

ఆ తర్వాత పది పదిహేను రోజులకే గోపి మేనమామ మశూచి వల్ల చనిపోయినాడు. మరణ నక్షత్రం చెడ్డది అవడం వల్ల నాలుగు నెలలా ఇంటిని పాడు పెట్టినారు.

గోపి ఇదంతా ప్రత్యక్షంగా చూసినాడు. అతని గుండెలు బద్దలయినట్లయింది. తనను అంత ప్రేమతో చూస్తున్న మేనమామ ఆముసలిదాని తిట్టువల్ల చనిపోవడము మనస్సులో నాటుకుని అతని మనస్సును కలతపెట్ట సాగినది. ఒకనాడు ఆ విషయమే అతని తల్లిగారూ వాళ్లూ చెప్పుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ ఉంటే అకస్మాత్తుగా అప్పటికి రెండు సంవత్సరాల క్రితం చూపిన ఒకానొక భయంకర స్వరూపమూ విన్న మాటలూ జ్ఞాపకానికి వచ్చినవి. గోపి హడిలిపోయినాడు. తానప్పుడాముసలి బ్రాహ్మణ్ణి వెక్కిరించడమూ అతనుతనను తిట్టిన తిట్టూ గోపి చెవులలో ప్రతిధ్వనించి అతనికి భయోత్పాతం కలిగించినవి. తనకు పన్నెండో యేట మరణము నిశ్చయమనుకున్నాడు.

అప్పటినుంచీ మనిషి మారిపోయినాడు. అతనిలో ఉన్న సహజోత్సాహం క్షీణించసాగినది. మాటిమాటికీ తన మేనమామ అకాలపుమరణవృత్తాంతమూ తనను ముసలి బ్రాహ్మణుడు అన్నమాటా తలపుకు వచ్చేది. అప్పుడల్లా గోపి గుండెలలో ధక్కు మనేది. ఎంత కులాసాగా ఉన్నప్పుడైనా ఆ తలపు వచ్చిందంటే దిగాలు పడిపోయేవాడు. అట్లాగే ఆడుకుంటున్నప్పుడు కూడా ఒక్కొక్కసారి అకస్మాత్తుగా ఆట పట్టులో ఉన్నా వెళ్లిపోయే వాడు. ఇట్లా చాలా మాట్లు చేయడం చూసి అతను ఆట మధ్య వెళ్లి పోతున్నప్పుడల్లా సావాసగాళ్లు "అరే! గోపికి ఇవాళ పిచ్చి తిరిగిందిరా" అని అపహాసించే వాళ్ళు. ఆటలో ముందతన్ని చేర్చుకోబోయే ముందు "నాయనా నీవు వద్దులే! పిచ్చి దొర్లకండా ఉంటేగా నీవు ఆసాంతం ఆడేది!" అని ఆటంక పెట్టే వాళ్ళు. కాని అందరిలోకీ మొనగాడైన అతన్ని చేర్చుకోకుండా ఉంటే వాళ్లెట్లా ఆడుకోగలరు? ఇట్లా తోడివాళ్లు అతన్ని ఆడిస్తున్నా ఒక్కరికన్నా అతను తన కున్న వ్యసనానికి కారణము చెప్పేవాడు కాదు.

ఒక్కొక్క రోజు ఆవిషయం తలపుకు తెచ్చుకుని ఒంటరిగా గదిలో గొళ్ళెం పెట్టుకుని కూచుని "అయ్యో! నాకు పన్నెండేళ్ళు నిండక మునుపే చచ్చిపోతాను కాబోలు" అనుకుని గుండె పగిలేటట్టు రహస్యంగా విలపించేవాడు. తాను తనకే ధైర్యము చెప్పుకోవలెనని చూసేవాడు కాని ఆధైర్యం ఎక్కువసేపు నిలిచేది కాదు. ఇతరులకు చెప్పడానికి అభిమానపడేవాడు. ఆ చింత వచ్చిన పూట తలకాయ నొప్పిగా ఉన్నదనో లేక జ్వరము వచ్చినట్లు ఉన్నదనో వంక పెట్టి భోజనంకూడా మానేసేవాడు ఇంట్లో వాళ్ళు వాళ్ళు ఏదో ఒంట్లో బాగులేదనుకునే వాళ్ళేకాని ఎక్కువ శ్రద్ధ తీసుకునేవాళ్ళు కారు కుశాగ్రబుద్ధులైన స్నేహితులు మాత్రము "గోపికి ఇవాళ గుబులు దొర్లిందిరా" అనుకునే వాళ్లు.

* * *

మార్గశిర శుద్ధ దశమికి గోపికి పన్నెండో ఏడు ప్రవేశించింది. ఆరోజున వాళ్ళ అమ్మావాళ్ళు గోపికి తలంటినీళ్ళు పోయడానికి పసుపు రాసిన పీటమీద కూచోబెట్టి ముఖాన బొట్టుపెట్టి మాడుమీద నూనె పెట్టినారు. గోపి అక్కలూ చెల్లెళ్లూ ముచ్చటగా హారతి పళ్ళెము పట్టుకుని పాటలు పాడి మంగళహారతి ఇచ్చినారు. తర్వాత గోపి తల్లిగారే స్వయముగా శ్రద్ధగా తలంటినీళ్ళు పోసి "శ్రీరామరక్ష, నూరేళ్ళ ఆయుస్సు" అని ఆశీర్వదించింది. వెంటనే గోపి మనోదృష్టిలో భయంకరమైన ఆ బ్రాహ్మణ వ్యక్తి పొడగట్టినాడు. అయ్యో పాపము

అమ్మకు నే నీ సంవత్సరం లోపలే చని పోతానని తెలియక నాకు నూరేళ్ళ ఆయుస్సు అని దీవిస్తున్నదే" అని వాళ్ళ అమ్మవేపు ఒక్కసారి దీనంగా చూసి మళ్ళా తల వంచుకున్నాడు. కళ్ళల్లో నీళ్లు గిరుక్కున తిరిగినవి. కళ్లు గట్టిగా మూసుకున్నాడు. అశ్రువులు జలజల రాలినవి. తల్లి అది చూసి "అదేమిరా నాయనా, కళ్ళల్లో కుంకుడుకాయ పడ్డదా తండ్రీ!" అని గోపిని అపారమైన ప్రేమతో దగ్గరకు తీసుకొని తువాలుతో కళ్ళు అద్ది ఇంట్లోకి పంపింది.

గోపి కారోజున అన్నం బొత్తిగా సయించలేదు. తన పుట్టినరోజు పండగకు చేసిన పులిహోరా క్షీరాన్నమూ తాను సరిగా తినక పోవడము చూసి వాళ్ళమ్మగారు "ఏంరా నాయనా, బొత్తిగా ఇవాళ అన్నంతినలేదు!" అని ప్రేమతో అడిగింది. కడుపులో ఏదో వికారంగా ఉన్నదన్నాడు గోపి.

ఆ రోజు సాయంత్రమే గోపికి జ్వరం వచ్చింది. దిష్టి అని వాళ్ళ అమ్మగారు దిష్టి తీసింది. మర్నాటికి కూడా జ్వర మేమీ తగ్గలేదు. వైద్యులను పిలిపిస్తే సన్నిపాత జ్వరమని ఒక వైద్యుడన్నాడు, జంతువాత మని ఇంకో వైద్యుడన్నాడు. జ్వరము ౧౦౩ డిగ్రీలకు తగ్గకుండా ఉంటున్నది. క్రమేణా రోజులు గడచిన కొద్దీ జబ్బు అంతకంతకు ఎక్కువ కాసాగినది.

ఈ జబ్బు తన ప్రాణాలు తీయడానికే వచ్చిందని గోపి నిశ్చయించుకున్నాడు. అతనికి జ్వరమువచ్చి ఇప్పటి కప్పుడే రెండు వారాలు ఐనది. ముసలి బ్రాహ్మణుని విగ్రహం వాళ్ళ వాకిట అరుగు మీద కూచున్నట్లు ప్రత్యక్ష మయింది. గోపి గుండెలు తట తట కొట్టుకున్నవి. అక్కడనుంచీ సంధి మొదలు పెట్టింది. అతని ముఖం భయంకరంగా మారి పోయినది. పెదవులంతా గిల్లుకోవడం మూలాన నెత్తురు కారి అతని ఆకారం మరింత భీభత్స మైపోయినది. ఆ సంధిలో ఆ ముసలి బ్రాహ్మడు ఊపినట్లే తల ఊరికే అటూ ఇటూ విసిరి కొట్టుకునే వాడు. "నీ కీమిడిసిపాటు పన్నెండేళ్ళ పాటేగా!" అని కఠోర స్వరంతో అంటూ ఉండేవాడు. "రాం మామయ్య పిలుస్తున్నాడు" అనేవాడు.

ఈ విధంగా గోపి సంధితో ఇల్లంతా గగ్గోలుగా ఉన్నది. ఇరవై ఒకటోరోజు వచ్చింది. ఆరోజు గడిస్తే ఇక ఫరవాలేదని డాక్టర్లు చెప్పినారు.

బార్లీగంజి ఇవ్వడానికి తల్లి గోపివద్దకు వెళ్లింది. పిల్లవాని ఒళ్లు చెమటలు పోసి ఉన్నది. ఇంతవరకూ ౧౦౪ డిగ్రీలజ్వరం ఉండి ఒక్కమాటు ఇంత చెమట ఎక్కడనుంచి వచ్చిందా అని చూసి "నాన్నా" అని ఆమె పలకరించింది. గోపి పలకలేదు. "ఊఁ" అని నెమ్మదిగా మూలిగినాడు. అతని కళ్ళు మూతపడి ఉన్నవి. చెవులూ పెదవులూ నల్లబడ్డవి. కాళ్ళూ చేతులూ

కూడా నల్లపడి మంచుగడ్డలాగా శీతలంగా ఉన్నవి. గోపి తల్లి కెవ్వున కేక వేసింది. ఇంట్లో అంతా మంచం చుట్టూ మూగినారు. డాక్టరు కోసం రామాంజం పరిగెత్తినాడు. గోపి అమ్మమ్మ కంట నీళ్ళు పెట్టుకుంటూ గద్గదస్వరంతో రామకర్ణామృతం చదువుతూ కూచున్నది. తిరుపతి వెంకటేశ్వర్లకు మొక్కుకున్నది.

కాస్సేపటికి గోపి కాళ్ళు చేతులకు వేడి మొదలు పెట్టింది. ముఖాన కాస్త తెలివి వచ్చినది. గోపి కళ్ళు తెరిచి "అమ్మా" అని ఏడ్చినాడు. పాపమామె కంట నీళ్ళు ఏకధారగా కారినవి. అట్లాగే ఓగ్చుకుంటూ ఆమె "నాయనా ఫరవా లేదు, నిమ్మళిస్తుందిలే" అని కుమారునికి ధైర్యం చెప్పింది. ఆమె కడుపు చలవవల్ల అక్కడి నుంచీ గోపికి దుర్లక్షణాలు తగ్గి సుగుణం కనబడసాగింది. కొద్ది కొద్దిగా గోపి మాట్లాడడం మొదలు పెట్టినాడు. క్రమేణా జ్వరం తగ్గి పోయినది. నెలరోజులకి గోపి మంచం మీద లేచి కూచుండటానికి ప్రయత్నం చేసినాడు.

గోపి నెమ్మదిగా లేచి తిరగడం ప్రారంభించినాడు. ఒంటరిగా మంచంమీద పడుకుని ఎప్పుడూ వెనకటి సంగతులు జ్ఞాపకానికి తెచ్చుకునే వాడు. అప్పుడప్పుడు అతను కంటనీళ్లు పెట్టుకున్నప్పుడు ఇతరులు చూసి "ఎందుకురా ఏడుస్తున్నావు?" అని అడిగితే తలకాయ నొప్పిగా ఉందనో కడుపు నొప్పిగా ఉందనో అనేవాడు.

గోపి ఎప్పుడూ తీవ్రంగా ఆలోచిస్తూ పరధ్యానంగా ఉండడము చూసి వాళ్ళ నాన్నగారు జబ్బు చేసినప్పటి నుంచీ గోపికి మెదడు కొద్దిగా చెడ్డదేమో నని అంటూ ఉండేవారు. ఇంట్లో వాళ్ళు అతన్ని సంధిలో నీకీ మిడిసి పాటు పన్నెండేళ్ళ పాటేగా! అని చూడవచ్చిన వాళ్ళ నట్లా అడిగే వాడవేమిరా? అని అడిగితే అట్లాగా నాకేం తెలుసు అనేవాడు.

గోపి ఆ సంవత్సరమంతా కోలుకోక పోవడం వల్ల వాళ్ళ నాన్నగారు అతన్ని బడి మాన్పించి వేసినారు. గోపికి ఆ సంవత్సరం విసుగూ కసీ చీదరా ఎక్కువైనవి. ఎప్పుడూ ఏదో వంక పెట్టుకుని ఏడ్చేవాడు. బలహీనంగా ఉన్నందు వల్ల అట్లా ఉంటూ ఉన్నాడని గారాబంగా చూసేవాళ్ళు. చదువు విషయం ఎప్పుడూ శ్రద్ధ లేకపోయినా ఈ సంవత్సరం చదువు పోయిందని ఊరికే గోల పెట్టేవాడు. అది చూసి వాళ్ళ నాన్నగారు వేసవి కాలం సెలవుల్లో ఇంటి దగ్గర పంతులును పెట్టి చదువు చెప్పించి బళ్ళు తెరవగానే మూడో ఫారంలో ప్రవేశ పెట్టినారు.

* * *

గోపికి పన్నెండో ఏడు వెళ్ళి పోయి

వది. పుట్టెడు జబ్బుచేసి బతికినా డని గోపి పుట్టిన రోజు గొప్పగా జరిపినారు. గోపికి ఆ రోజున కలిగిన సంతోషానికి మితిలేదు. తాను వృథాగానూ తెలివితక్కువగానూ భయపడి నానా అవస్థలు పడ్డానే అనుకున్నాడు. ఆ బ్రాహ్మడిమాట నిజంకాలే దని సంతోష పడ్డాడు.

గోపికి పన్నెండో ఏడు ఏనాడు వెళ్ళిపోయిందో ఆ నాటనుంచీ ముఖంలో మళ్ళా జీవకళ అంకురించింది. కొత్త నెత్తురు పడుతున్నందున అతని జుట్టు అంతా ఊడిపోయి తల బోడి ఐనది. పుట్టిన రోజున ఆ బోడి తలకే తలంటి వాళ్ల అమ్మగారు నీళ్ళుపోసి శ్రీరామారక్ష, నూరేళ్ళ ఆయుస్సు అని ఎప్పుడు దీవించిందో అప్పుడే హృదయ భారం యావత్తూ పోయింది. వెనకటి సంవత్సరం తన పుట్టిన రోజున కూడా అట్లాగే దీవించిందని జ్ఞాపకం వచ్చింది. తల్లి దీవన ఉండగా తన ఆయుర్దాయానికి భయ మేమీ లే దనుకున్నాడు.

ఆ యేడు క్లాసులో గోపి ఎన్నడూ లేనంత చురుకుగా ఉన్నాడు. మళ్లీ యథాప్రకారము అల్లరి కూడా ప్రారంభించినాడు. "రోగంతో గోపి గుబులు వదిలించిరా" అని సావాసగాళ్ళు అన సాగినారు. వాళ్ళను వెంటబెట్టుకుని ఊళ్ళో పళ్ల చెట్లు ఎక్కడెక్కడ ఉన్నవో అక్కడికల్లా దండయాత్రలు సాగించినాడు. తలపెంచి క్రాపింగు పెట్టినాడు. రెండేళ్ళు ఇట్లా వెళ్ళిపోయినవి. ఆ బ్రాహ్మడి సంగతే అతను మరిచిపోయినాడు.

గోపి ఐదో ఫారం చదువుతున్నాడు. ఒక రోజున తెలుగు శాస్త్రులు గారు భాగవతంలో పరీక్షన్మహారాజు కథా భాగం చెప్పుతున్నారు. మునికుమారుని శాపము నుంచి తప్పించుకోడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎట్లా విఫల మయిందో చెప్పినాడు. ఆ పాఠం చెబుతూ బ్రాహ్మణ శాపమువల్ల చెడిపోయిన పురాణ ప్రసిద్ధుల కథలు చెప్ప సాగించినాడు. నహుషుడు అగస్త్య శాపము వల్లనూ, త్రిశంకు మహారాజు వశిష్ఠ శాపము వల్లనూ, గౌతమ శాపము వల్ల దేవేంద్రుడూ, సనకాదుల శాపమువల్ల జయ విజయులూ – ఈవిధంగా ఎందరో శాపోపహతుల పురాణములు శాస్త్రులు గారు చెప్పినాడు. శాపముల వల్ల పిశాచము లైన వాళ్లూ బ్రహ్మరాక్షసు లైన వాళ్ళూ మృతులైన వాళ్ళూ వంశ నిర్మూలమైన వాళ్ళూ పదభ్రష్టులైన వాళ్ళూ సర్వనాశనమైన వాళ్ళూ అధోగతి పాలైన వాళ్ళూ – ఈ విధమైన కథలు ఎన్నో ఆ రోజు గోపి విన్నాడు. ఆ కథలు వింటున్న కొద్దీ మళ్ళా ఒకసారి గోపికి తన మేనమామ మృత్యువూ తన భయంకరానుభవమూ మనసులో పడ్డవి. మనసు కలత పెట్టినవి. ఐనా తన శాపము గడువు దాటిపోయిందిగా అని

ధైర్యము తెచ్చుకున్నాడు కాని ఆ ధైర్యము నిలవ లేదు. కొంత సేపైన తర్వాత ఒంట్లో బాగుండ లేదని శాస్త్రులగారిని అడిగి ఇంటికి వెళ్లి పోయినాడు.

ఇట్లా గోపి కొంచెము గుబులుతో ఉండగా వాళ్ళ ఇంటివద్ద ఒక విశేషం జరిగింది. కోడూరి వారి భావి దగ్గర శాయమ్మ నీళ్ళు తోడుకుంటూ ఉంటే నారాయణగారి భార్య ఉతుకుతున్న బట్టనీళ్ళు చింది శాయమ్మమీద పడ్డవి. శాయమ్మ మండిపడి "నీకేమి పొయ్యే కాలం వచ్చిందా, వళ్లూపై తెలియ కుండా బట్ట ఉతుక్కుంటావు! కళ్ళు కనబడడం లేదా ఎట్లా!" అని ఆమెను తిట్టింది. అప్పుడు పోట్లాట అయి వీధంతా పోగయినారు. శాయమ్మ తిట్టిన తిట్లకి లెక్క లేదు. "మహమ్మారి వచ్చి చావరాదా" మొదలైన తిట్లన్నీ తిట్టింది.

పాపం ఆ మరుసటి రోజున నారాయణ గారి భార్య కలరా తగిలి నాలుగు ఘడియల్లో చనిపోయింది. ఆ కిందటి రోజే ఆమెను శాయమ్మ తిట్టడమూ ఆ మర్నాడే ఆమె చనిపోవడమూ పేటల్లా పాక్కిపోయింది. ఈ వృత్తాంతం విన్న గోపికి మనస్సులో కలత ఎక్కువైంది. ఆ రోజు రాత్రి అతనికి పీడ కలలు వచ్చి అతన్ని చాలా బాధ పెట్టినవి.

మర్నాడు యథాప్రకారం గోపి స్కూలికి వెళ్లినాడు. ఆ రోజు ఇంటివద్ద ఏ పాఠమూ చదువుకుని వెళ్లలేదు. ఇంగ్లీషు మాస్టరుగారు పరీక్ష చేసి గోపికి గర్వమెక్కిపోతున్నదని ముక్కచీవాట్లు పెట్టినాడు. ఆ రోజు పాఠంలో గ్రీసుదేశంలో ఉన్న "డెల్ఫి ఆరకిల్" సంగతి వచ్చినది. ఏదన్నా గొప్ప కార్యము ఉద్యమించేటప్పుడు గ్రీకులు అక్కడికి పోయి ప్రశ్న అడిగి వచ్చేవారనీన్నీ అక్కడ వచ్చే జవాబు ద్వ్యర్థిగా ఉండి ఆశ కలిగించి కార్యము ఉపక్రమింప చేసి ఫలము వేరుగా ఇచ్చేదనీ మాస్టరు గారు చెప్పినారు. గోపికి ఏమేమో వింత భావాలు కలిగినవి. బ్రాహ్మడి మాటలు తిరిగి స్ఫురణకు వచ్చినవి. "నీకీ మిడిసిపాటు పన్నెండేళ్లదాకేగా!" అని తనలో తాను రామజపము చేసినట్లు జపము చేసినాడు. విద్యార్థులంతా నోట్సువ్రాసుకుంటూ ఉంటే, ఆ మాటనే మళ్లా మళ్లా తన నోటుపుస్తకం మీద వ్రాసినాడు. దానితో పేజీ నిండింది. అక్కడ నుంచీ వ్రాయడం ఆపి కాగితం మీది వాక్యాలవంక ఏకాగ్రచిత్తుడై చూస్తూ మననము చేయ మొదలుపెట్టినాడు.

అట్లా చేయగా చేయగా మనస్సు మొద్దుబారి పోయినది. శూన్యదృష్టితో చాలాసేపు ఆ కాయితాల వంకే చూడ సాగినాడు. అట్లా ఉండగా ఉండగా అకస్మాత్తుగా కాళరాత్రిలో మెరుపు మెరిసినట్లు అతని శూన్యమనస్సులో కొత్త అర్థము స్ఫురించింది.

మీద పిడుగు పడినట్లయిపోయినాడు. ముఖం వివర్ణమైపోయింది. దేహమంతా కంపించ సాగినది బ్రాహ్మడి మాటలకు క్రొత్త అర్థము కనబడ్డది!

గోపిని బ్రాహ్మడు తిట్టింది ఎనిమిదో ఏట! అక్కడనుంచి అతని "మిడిసి పాటు పన్నెండేళ్ళేగా!" తిట్టుకు ఇంకా గడువు తీర లేదు. ఇరవై యేళ్ళు వచ్చేదాకా ఆ తిట్టు ఫలించదు!

పక్కన కూచున్న స్నేహితుడు పరధ్యానంగా ఉన్న గోపిని చూసి నవ్వి అతని వీపుమీద మృదువుగా చేతితో తట్టి "పాఠం వినరా, రేపు ఇదే పరీక్షలో ఇచ్చే టట్టుగా కనబడుతోంది!" అన్నాడు. కాని గోపి మనస్సు పాఠం మీదికి పోలేదు. వెనకటి సంగతులే ఊరికే మననము చేయడ మారంభించినాడు. ఆ గంట ఐపోయింది. ఇంగ్లీషు టీచరు వెళ్ళిపోయినాడు. క్లాసంతా గోలగా ఉన్నది. తర్వాతగంట టీచరు వచ్చినాడు. "లేవరా" అని పక్కనున్నవాడు లేపే దాకా గోపి మన లోకంలో లేడు.

పిమ్మట గోపి ఏదో కారణం చెప్పి సెలవు తీసుకుని ఇంటికి వెళ్ళి చదువుకునే గదిలోకి పోయి మంచంమీద నిస్సారంగా పడ్డాడు. కోమలమైన అతని ముఖపద్మము వాడిపోయింది. తాను ఎనిమిదేళ్ళ వాడుగా ఉన్నప్పుడు వాళ్ళ రామాంజం వివాహసందర్భములో ఆ గడ్డాల మీసాలవాడు చెప్పింది తనను నాలుగు సంవత్సరాలదాకా బాధించి అంతటితోనైనా పోక ఇంకా నాలుగైదేళ్ళు భయంకరమగు హృదయవేదన కలిగిస్తుందని తలపోస్తూ కన్నీళ్ళు ఏకధారగా కార్చినాడు.

ఈ ఘోరవిషయమే మాటిమాటికి తలపుకు తెచ్చుకుంటూ గోపి అంతకంతకూ కృశించి పోతున్నాడు. గోపి చిక్కిపోవడము చూసి వాళ్ళ నాన్నగారు వైద్యుడికి చూపించి మందు ఇప్పించినారు కాని ఏమీ లాభించ లేదు మనోవ్యాధికి మందు ఏమున్నది? పోనీ తన వ్యధకు కారణం ఎవరికైనా తెలియ పరచి ఉంటే గోపి పాప మంత బాధ పడకుండా ఉండేవాడే.

ఈ స్థితిలో ఆ సంవత్సరం గోపి ఐదోఫారము తప్పినాడు. అందుకు గోపి ఇంట్లోవాళ్లే కాక స్కూల్లో అంతా ఆశ్చర్య పడ్డారు. క్లాసులో కల్లా తెలివి కలవాడని పేరు పడ్డవాడు పరీక్ష తప్పినాడని వాళ్ళ మేష్టర్లు మార్కులు చూసి కూడా మొదట నమ్మలేదు. పేపర్లు దిద్దిన టీచరు సరిపడక అట్లా మార్కులు తక్కువ వేసినాడేమో నని అనుమానించి పేపర్లు తెప్పించి చూసినాడు. ఇంగ్లీషు, లెక్కల పేపర్లలో ఎన్నో ప్రశ్నలు విడిచిపెట్టినాడు. వ్రాసిన ప్రశ్నలు కూడా ఏవో తూకీగావ్రాసినాడు. అతను ఇక ప్యాసయ్యే దెట్లా? ఐనా టీచర్లు గోపి తెలివి తేటలను పొగిడి పైక్లాసులో వెయ్యమని హెడ్మాష్ట

రుతో చెప్పినారు. కాని అంత తక్కువ మార్కులు వచ్చిన వాణ్ణి పైక్లాసులో వేస్తే ఇంకా చాలామందిని అట్లాగే వేయవలసి వస్తుందని ఆ క్లాసులోనే ఉంచినాడు గోపిని.

గోపిని పిలిచి క్లాసు టీచరు "నీకేమైనా పరీక్షప్పుడు మతి చలించినదా ఏంరా?" అని చీవాట్లు పెట్టినాడు. గోపి ఏమీ మాట్లాడలేదు. "దీర్ఘాయుస్సు లేనివాళ్ళు ప్యాసయి మాకేం ప్యాసు కాకపోయినా మాకేం?" అనుకున్నాడు.

ఆ మరుసటి సంవత్సరం కూడా గోపి పిచ్చిపిచ్చిగానే ఉన్నాడు. లెక్కల పేపరు తప్ప అన్ని పేపర్లూ బాగా వ్రాసినాడు. ఆవేళటికి ఏవో పాడు తలపులు వచ్చి ఆ పేపరు పాడు చేసినాడు. ఐనా టీచర్ల రికమెండేషను వల్ల పై క్లాసులో వేసినారు.

ఆ సంవత్సరం వేణు వివాహం జరిగింది. అప్పుడు తనను తిట్టిన బ్రాహ్మడు వస్తాడేమో, ఎక్కువగా బహూకరిద్దాము అని గోపి అనుకున్నాడు కాని ఆ బ్రాహ్మడు రాలేదు.

* * *

ఇంతలోకే గోపిలో గొప్ప మార్పు జరుగుతున్నది. దానితో అతని చింత నెమ్మదిగా విచ్చిపోసాగినది. అతనిలో అంకురించిన యౌవనము క్రమముగా అభివృద్ధి నొందినకొద్దీ అతని వెర్రి తలపులు మాయమైనవి. ఈశ్వరుణ్ణి ధిక్కరించే ఆ యౌవనములో బ్రాహ్మణుడు ఒకడు ఏదో నోటికి వచ్చినట్లన్న మాటలు నమ్ముతాడా? ఆ ఈడులో ఆత్మోత్సాహము మీద తప్ప ఇతరము దేనియందూ నమ్మక ముండదు.

ఈ సంవత్సరం క్లాసులోనూ పరీక్షలోనూ తెలివివల్లనే కాక ఆటలలో అతని ప్రావీణ్యము వల్ల స్కూలుకంతా కీర్తి తెచ్చినాడు గోపి. 'క్రిక్కెట్' మెడలు అతనికే వచ్చినది. స్కూలు ఫైనలు పరీక్షలో ప్రెసిడెన్సీలో ఫస్టుగా వస్తాడేమోనని కూడా హెడ్మాష్టరుగారు ఆశపడుతున్నారు. పరీక్షలైపోయినవి.

పసితనపు అల్లరిపోయి గోపికి పెద్దతనపు అల్లరి వచ్చింది. ఇది ఇతరులను నిజముగా బాధపెట్టే అల్లరి. ఒకనాడు నూనెగుడ్డలవాడు ఒకడు వాకిట్లోకి వస్తే వాణ్ణి అల్లరి పట్టిద్దామని లోపలికి గోపి పిలిచినాడు. అప్పుడు గోపి స్నేహితులు కూడా కొంతమంది ఉన్నారు.

గోపి ముందత్తిగా నూనె గుడ్డలవాడికి తన చెయ్యి చూపించినాడు. నూనె గుడ్డలవాడు తన ధోరణ్ణి చెప్పుకునివచ్చి చివరకు "ఇరథయ్యో ఏట దేభరవాటికి ఒఖ్ఖ సిఠిగండం ఉంథాది. నేను ఒఖ్ఖ వేరు ఇస్తాను" అని మొదలు పెట్టినాడు.

గోపి స్నేహితులు నూనెగుడ్డలవాణ్ణి అల్లరి చేసినారు కాని గోపి నిశ్శబ్దంగా ఊరుకున్నాడు. మళ్ళా అతనికి గిలి

ప్రవేశించింది. కాని వెంటనే వెఱ్ఱి భయమని దాన్ని మనసులోనుంచి తోసివేసినాడు.

పరీక్ష రిజల్ట్సు వచ్చినవి. ఒక్క ఫిజిక్సులో తప్ప అన్నింటిలో విశేషమైన మార్కులు వచ్చినవి. 'ఎలిజిబిలిటి' రాలేదు. గోపి మాత్రమే కాక హెడ్మాస్టరు కూడా ఆ ఫలితము చూసి నిర్విణ్ణుడై పోయినాడు.

మరుసటి సంవత్సరం మళ్ళా స్కూలు ఫైనలే చదివినాడు గోపి. ఈసంవత్సరం మరింత తెలివిగా ఉన్నాడు. చదవకుండానే పాఠాలన్నీ వచ్చేవి.

గోపికి వివాహ సంబంధాలు రాసాగినవి. ఎవరైనా ఇంట్లో అతని వివాహం సంగతి తీసుకువస్తే "ఇరవై యేళ్లయినా లేనిదే వివాహమేమిటి" అని ఆ సంగతి త్రోసివేసేవాడు. పిచ్చి నమ్మకాలు ఉండకూడదని అతనికి ఉన్నప్పటికీ బ్రాహ్మడి మాటలు ఎప్పుడూ బాధిస్తూ ఉన్నందున ఎందుకైనా మంచిదని ఇరవైయేళ్ళు బాగా నిండే వరకూ పెళ్లి చేసుకోకూడదని నిశ్చయము చేసుకున్నాడు.

* * *

గోపి స్కూలుఫైనలు చాలాబాగా ప్యాసయినాడు. వాళ్ళ నాన్నగారు ఉత్సాహాతిశయంలో ఇంటర్మీడియటు చదవడానికి చెన్నపట్టం రాజధాని కళాశాలకు పంపించినాడు. గోపి కూడా చెన్నపట్టంలో హాయిగా ఉండవచ్చునని ఉవ్విళ్లూరుతున్నాడు. పట్టం వెళ్లి విక్టోరియా హాస్టలులో ప్రవేశించినాడు. మొదటి సంవత్సరం గనక గోపికి కిందగది వచ్చినది.

పట్టం వచ్చిన నెల రోజులకే శ్రీనివాసరావు వద్దంటున్నకొద్దీ గోపి తెప్పమీద సముద్రంలో దూరము వెళ్ళడము తటస్థించినది. గోపి నిస్సారంగా తెప్పమీద పడిపోయినప్పుడు తనపూర్వకథ అంతా జ్ఞప్తికి వచ్చినది.

3

గోపికి స్మృతి వచ్చేప్పటికే సముద్రపు ఒడ్డున హాస్టలు స్నేహితులు కొంతమంది అతని చుట్టూ గుమిగూడి ఉన్నారు. శ్రీనివాసరావు పొడిబట్టలు తెచ్చి ఇచ్చినాడు. గోపి ఓపిక చేసుకుని ఆ బట్టలు కట్టుకున్నాడు. శ్రీనివాసరావు జాలితోనూ ఒకమూల కోపంతోనూ "ఓరి దౌర్భాగ్యుడా!" అని నవ్వుతూ అన్నాడు. గోపి చిన్నపుచ్చుకున్నాడు.

గోపి స్నేహితులంతా అక్కడనుంచీ తెప్పవాళ్ళను చీవాట్లు వేసి కొట్టబోయినారు. "స్మృతి తప్పిపోయేదాకా సముద్రంలో ఎందుకు ఉంచాలి" నన్నారు. వాళ్లు గోపి పడిపోయే దాకా తమ కేమీ తెలియదనీ పాటలు పాడుకుంటూ కులాసాగా ఉన్నవాడు అకస్మాత్తుగా పడిపోయినాడనీ

వెంటనే అది చూచి తాము అతన్ని ఒడ్డుకు తీసుకు వచ్చామనిన్నీ చెప్పి వాళ్ళు ఎట్లాగో అట్లా తప్పించుకొన్నారు.

స్నేహితుల బుజాల నానుకొని గోపి హాస్టలు చేరినాడు. అక్కడనుంచీ గోపి అతిసాహసికుడని హాస్టలులో అంతా పేరు పడ్డాడు.

కాని ఆ 'అతిసాహసకుడికి' మర్నాటినుంచీ మార్పొకటి యేర్పడ్డది. శరీరంలో రుగ్మత ఒకటి ప్రవేశించినట్లయింది. పొద్దునే లేచీ లేవడముతోనే కళ్ళు గిర్రున తిరిగి చీకట్లు కమ్మడమూ ఆకలి బొత్తుగా మందగించి పోవడమూ శరీరంలో బొత్తిగా పటుత్వం లేక పోవడమూ సంభవించినవి. అతని కుశాగ్ర బుద్ధి మందగించి పోయినది. చదవడానికి ఓపిక బొత్తిగా నీరసించి పుస్తకాలంటే ఒక విధమైన అసహ్యము కూడా కలుగుతూ వచ్చినది. నిర్మలంగా ఉండే అతని మనస్సునందు వ్యాకులత సంభవించి అతనికి మనోవేదన విపరీతంగా కలిగించినది. తన జీవితాన్ని చూస్తే తనకే గౌరవము లేకపోయింది. రోత పుట్టించే అసహ్యపు తలంపులు ఎంత తరిమివేసినా పోక అతని మనస్సునందు నిలిచి అతనికి కలిగించిన మనోవేదన ఇంత అంత అని చెప్పడానికి అలవి కాదు. ఒక్కొక్కప్పుడు ఆత్మహత్యే మేలనిపించేది.

శరీరంలోనూ మనస్సునందు రోగ పీడితుడైన గోపికి మనశ్శాంతి ఎక్కడిది? ఎల్ల వేళలా భూత ప్రేత పిశాచాలు అతన్ని పట్టుకుని పీడించి అతని జీవితపు నెత్తురును గ్రోలేవి.

గోపి ఒంటరిగా కూచున్నప్పుడు నానావిధములైన తలంపులు అతన్ని చితుక బొడిచేవి. అందుచేత అతను విస్తారంగా స్నేహితుల గదులలోకి వెళ్ళి వాళ్ళతో ఊరికే గంటల పర్యంతము ఉబుసు పోవడానికి మాట్లాడుతూ ఉండేవాడు.

ఇదంతా సముద్రస్నాన ఫలితమేమోనని అతనికి తోచలేదు. ఎన్నడూ ఇల్లు విడిచి దూరదేశం పోనందున ఒకవేళ ఇంటిమీద బెంగేమో అనుకున్నాడు. కాని సెలవులు ఇవ్వందే ఇంటికి వెడితే వాళ్ళ అక్కచెల్లెళ్లు "ఏబ్బే ఇంటిమీద బెంగపెట్టుకున్నావట్రా!" అని హేళన చేస్తారని సిగ్గుపడి ఆ ప్రయత్నం మానుకున్నాడు. సాయంత్రం కాగానే అతని బుద్ధి ఇంటివంక మళ్ళేది.

గోపికి ఇంటి దగ్గర వాళ్ళ కోసం బెంగకన్నా తాను ఇంటివద్ద ఎంతో మురిపెంగా పెంచుకున్న "కోతి, కుక్క" మీద బెంగ ఎక్కువై పోయింది. పాపం నోర్లేని ఆకుక్కకు సరిగా ఇంట్లోవాళ్లు అన్నము పెడుతున్నారో లేదో అని చింతించేవాడు.

* * *

విక్టోరియా హాస్టలుకు దక్షిణంగా 'ఫాలన్సు పాండు' అని విద్యార్థులు చెప్పుకునే మురికి గుంట ఒకటి పెద్దది

ఉన్నది. దాని చుట్టూ పెద్దపెద్ద మర్రి చెట్లు ఉన్నవి. అవి రాత్రిళ్ళు పెను భూతాలువలె ఉంటవి. ఆ గుంటా, ఆ దాని చుట్టూ ఆ చెట్లూ చూచిన వాళ్ళకి భీషణ మనోహరంగా కనబడుతవి. అక్కడ దయ్యాలు ఉన్నాయనీ ఆమురికి నీళ్ళలో గుండా వాటి మాటలు రాత్రిళ్ళు అప్పుడప్పుడు వినబడుత వనీ విద్యార్థులలో వదంతి ఉన్నది. రాత్రిళ్లు భోజనమైన తర్వాత తరుచుగా చెట్ల కింద ఉన్న బండలమీద గోపి ఒంటరిగా కూచుంటూ ఉండేవాడు. అప్పుడే మరింతగా విచారం గొలిపే తలంపులు వస్తుండేవి. ఆ బ్రాహ్మణుని తిట్టుకూడా జ్ఞప్తికి వచ్చేది. తనకు ఇరవై యవ యేట ఆయువు ఒకవేళ చెల్లిపోతుందేమో అని అనుకునే వాడు. అప్పు డతని గుండెలు ఝల్లు మనేవి. హృదయంలో అవ్యక్తమైన బాధ కలిగేది. ఎప్పటి కప్పుడు గోపి సమాధాన పరుచుకుని తనకు తాను ధైర్యం చెప్పుకునే వాడు. కాలేజీలో చదువుకోవడమూ, అందులో చెన్నపట్న మంత మహా పట్నంలో చదువు కోవడమూ పిచ్చిపిచ్చి భయాలు పెట్టుకుని తెలివితక్కువగా బాధ పడడమూ హాస్యాస్పదమని అనుకునే వాడు.

ఇంతలో దసరా సెలవులు వచ్చినవి. సెలవులకు గోపి ఇంటికి వెళ్ళినాడు. "ఎప్పుడూ కళ్ళలో మెలుగు తుండే వాడివి; ఇన్నాళ్ళూ కళ్ళు పోయినట్లు న్నాయిరా!" అని అన్నది వాళ్ళ అమ్మగారు. "చెన్నపట్నం వెళ్లిన తర్వాత కాస్త పోకులు ఎక్కువైన ట్లున్నాయే" అన్నది వాళ్ళ అక్కగారు. పట్నంనుంచి మా కేమి తెచ్చావని అడిగినా రాతని చెల్లెళ్ళు, ఊళ్ళో స్నేహితులు "ఒరే, పట్నం వెళ్ళాక కొంచెం బలిసినట్లున్నా వురా!" అన్నారు.

ఇక గోపి మాత్రము సెలవులకు ఇంటికి వచ్చాననే సంతోష పడడానికి బదులుగా అప్పుడే సెలవులు ఐపోతు న్నాయని దిగులు పడసాగినాడు. "అయ్యో, ఇంటిగట్టున ఉండి చదువుకుంటే నే బాగుండేది" అనుకునేవాడు. కాని ఐనదేదో ఐనది. కొన్నాళ్ళకైనా అల వాటు పడి ఇంటి ధ్యాస పోకపో తుందా అనుకుని ధైర్యం తెచ్చు కున్నాడు.

౪

దసరా సెలవులు వెళ్ళి పోయినవి. పట్నం వెళ్ళేనాడు అతనికి కళ్ళనీళ్ళ పర్యంత మవుతున్నది. రామాంజం స్టేషనుదాకా వెంటవచ్చి పంపించినాడు.

మళ్ళా గోపి వచ్చినప్పటినుంచీ వానలు ప్రారంభించినవి. ఆ వర్షాకాలంలో కింద గదిలో ఉన్న గోపికి దోమల బాధ ఎక్కువైనది. "ఫాలన్ను పాండు" లోని దోమ లన్నీ తన గది లోకే వచ్చి ఉన్నట్లు అతనికి తోచేది.

ఇట్లా ఉంటూ ఉండగా మేడపైన గదిలో ఉండే మెడికలు విద్యార్థి ఒకడు విషం మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. అందువల్ల ఆ గది ఖాళీ అయింది. ఇష్టమున్నవాళ్లు ఆగదిలో ప్రవేశించడానికి దరఖాస్తులు హాస్టలు అధికారికి పెట్టుకోవచ్చునని నోటీసు వేసినారు. విచారించగా ఆ గదిలో ఈ మెడికలు విద్యార్థి కాక ఇద్దరు వెనకటి సంవత్సరాలల్లో ఆత్మహత్య చేసుకున్నారనీ అందులో వాళ్ళ దయ్యాలు ఉండి ఎవ్వరినీ అక్కడ సుఖంగా ఉండనీయవనీ తెలియ వచ్చింది. విద్యార్థులంతా దానికి "ఆత్మహత్య గది" అని పేరు పెట్టినారు.

ఆ గది కావలెనని ఎవ్వరూ కోరలేదు. కాని ఆ మాట వినగానే ఆ గది తీసుకోవాలని అతను నిశ్చయించుకున్నాడు. ఒక్క క్షణ మాత్రము అతను కూడా మొదట పస్తాయించినాడు కాని వెఱ్ఱి వెఱ్ఱి భయాలు పెట్టుకుని దోమల బాధ పడుతూ తాను ఉంటూ ఉన్న గదిలోనే కాలం వెళ్ళబుచ్చుకోవడము తెలివి తక్కువ అని అతనికి తోచింది. అదిగాక తన వంటి ధీరులు, నాగరికత గల వాళ్ళు ఛాందసులవలె దయ్యాల భయం పెట్టుకోవడము హాస్యమని నిరసించినాడు. "భయపడే వాళ్ళకే భయం కాని నాబోటి ధైర్య సాహస శాలురను భయాలు బాధించలే" వనుకున్నాడు.

ఆ గదికి గోపి తప్ప మరెవ్వరూ దరఖాస్తు చేయలేదు. వార్డను గోపిని పిలిపించి నవ్వుతూ "నీకుకూడా అందరి విద్యార్థుల వలె దయ్యాల భయం లేదా?" అని అడిగినాడు. లే దన్నాడు గోపి.

గోపి "ఆత్మహత్యగది" లో ప్రవేశించినప్పటి నుంచీ హాస్టలులో ఉన్న విద్యార్థులు యావన్మందీ అతనికి అచిరకాలంలోనే పరిచయు లైనారు. వెనక సముద్రంలో బహు దూరం తెప్ప మీద వెళ్ళిన సంగతి కూడా అందరి మనస్సులలో ఉన్నది. చాలా మందికి అతని నిర్భయానికి ఆశ్చర్యమూ గౌరవమూ కలిగినవి. శ్రీనివాసరావు మాత్రం "నీవేం బతక దలుచుకున్నట్లు లేవే?" అని కోప పడ్డాడు.

తనను అంత ధైర్యసాహసాలు కలవా డని మెచ్చుకోవడములో గోపికి ఉల్లాసం కలిగినది. అంతమంది విద్యార్థుల లోనూ తా నొక్కడే ధైర్యశాలి నని గర్వ మతనికి కలిగింది. ఈవిధంగా మొదటి పది పదిహేను రోజులూ నిశ్చింతగానూ నిర్భయంగానూ ఉన్నాడు. అథవా అర్థ రాత్రి వేళ ఎప్పుడైనా మెలకువ వచ్చినప్పుడు కొంచెం భయం వేసినా గోపి ధైర్యము తెచ్చుకునేవాడు.

ఆత్మహత్య గదిలో గోపి ప్రవేశించడము విని అతనితో సావాసం చేసు... వాళ్ళలో నంబియాదిరి అనే మళయా

శపు విద్యార్థి ఒకడు. అతను నంబూదిరీ బ్రాహ్మణుడు. విక్టోరియా హాస్టలుకు వచ్చినప్పటికీ వీలయినంత వరకు తన శిష్టాచారము విడవకుండా ఉన్నాడు. వెనక కాస్త పిలక మాత్రం అట్టిపెట్టి తల నున్నగా క్షౌరము చేయించి మొహం నిండా గంధం పూసుకుని నుదట పెద్దకుంకమ బొట్టు పెట్టుకుని శుద్ధ శ్రోత్రియంగా కన బడుతూ అంతకంటే ఎక్కువ ఛాందసంగా మాట్లాడేవాడు. అందువల్ల కేవలము పాశ్చాత్య పద్ధతుల మీద నడిచే విక్టోరియా హాస్టలు విద్యార్థులు అతనికి 'హాస్టలు గురువు' (Bishop of the Hostel) అని పేరు పెట్టినారు. హేళనకు పెట్టిన పేరు అతను ఒక గౌరవ బిరుదంగా గ్రహించి ఇతరులతో ఆమాట ఊరికే చెప్పుకునేవాడు.

అతను కొద్ది రోజులలోనే గోపికి ముఖ్యస్నేహితుడైనాడు. వాళ్ళు ఒకరి గది కొకరు తరచు వెళ్లి కూచుని కబుర్లు చెప్పుతూ ఉండేవాళ్ళు. నంబియూదిరి ఎప్పుడూ భగవద్విషయాలను గురించి తప్ప వారి వేటిని గురించీ మాట్లాడే వాడు కాడు. అందువల్ల అతనియందు గోపికి గొప్ప గౌరవ భావము ఏర్పడింది. గోపికూడా గొప్ప భగవద్భక్తుడై తనవల్ల బాగుపడుతున్నాడని నంబియూదిరి తలపోయ సాగినాడు.

ఆ మళయాళ స్నేహితుని గదిలో కాళికాదేవి భయంకర చిత్ర మొకటి ప్రధాన స్థాన మలంకరించి ఉండేది. అది చూసి నప్పుడల్లా గోపికి వింత ఐన భయభావాలు అంకురించేవి. తాను గొప్ప ఉపాసకు డననీ తనకు హాని చేయదలచిన వాళ్ళను సంకల్ప మాత్రాన్న భస్మీ భూతులను చేయగలశక్తి తన కా దేవి ప్రసాదించిన దనీ నంబియాదిరి గోపికి చెబుతుండే వాడు. గోపి ఆ మాటలు విశ్వసించక పోయినా అతనివద్ద ఏవో కొన్ని సిద్ధులు ఉన్నవని అనుకునేవాడు.

కాని కొద్దికాలములోనే వాళ్ళ స్నేహానికి అంతరాయం కలిగింది. ఒక రోజున మత ప్రశంసలో వాళ్ళకు అభిప్రాయ భేదం ఏర్పడ్డది. కొంత సేపు ఘర్షణ జరిగిన తర్వాత గోపిని చూసి నంబియూదిరి "గురువు మాటలు తిరస్కరించ రాదు" అన్నాడు. గోపికి కోపము వచ్చి "నీవు నాకు గురువువా?" అన్నాడు. ఇన్నాళ్ళూ తనను గురుభావంతో చూస్తున్నాడని తలచి గోపి తన శిష్యు డని అందరితో చెప్పుతూ వచ్చిన నంబియూదిరికి ఆ మాటలు వినగానే ఒళ్ళు మండి పోయింది. "గురుధిక్కారము చేశావు గురుద్రోహివి" అని మొదలుగాగల మాటలు అన్నాడు. అక్కడనుంచీ గోపి కూడా మాటలు తూలనాడినాడు. అంతటితో వాళ్ళ స్నేహము అంత మొందింది.

"గోపి గురుద్రోహి ఐనాడు. అతణ్ణి భస్మము చేస్తాను" అని నంబియాదిరి

చెప్పడం వా ళ్ళామాటలు గోపికి హేళనగా చెప్తూ వచ్చినాడు. శ్రీనివాసరావు "ఒరేయి, వాడితో విరోధం పెట్టుకున్నా వేంరా? వాడి వద్ద మళయాళ మంత్రా లున్నాయి! వాడెప్పుడో నీ కొంప తవ్వుతాడు, నాకు తెలుసు!" అన్నాడు. ఆ మాటలకు గోపి నవ్వినాడు. కాని అతనికి అవ్యక్తమగు భయ మొకటి అంకురించక పోలేదు.

* * *

గోపి గదికి ఎదురుగానే కిటికీలోనుంచి "ఫాలన్ను పాండు" కనబడుతూ ఉంటుంది. ఒక రాత్రి భయంకర ధ్వని ఒకటి విని గోపి ఉలిక్కిపడి లేచినాడు. గొంతు పిసుకు తుంటే వచ్చే మూలుగు వలె అతని కది వినబడ్డది. కళ్ళు తెరిచి చూసే సరికి నంబియూదిరి గదిలోని కాళికాదేవి చిత్రము వంటి భీషణాకారము తన గది కిటికీలోనుంచి తనవంక మిర్రి మిర్రి చూస్తూ వెనక్కు వెనక్కు నెమ్మదిగా పోయి "ఫాలన్ను పాండు" లోని మర్రి చెట్లతో కలిసి పోయినట్లు కనిపించింది.

గోపికి భయంవేసి ముచ్చెమటలు పోసినవి. కాని వెంటనే ధైర్యము చిక్కబెట్టుకుని శ్రీనివాసరావు గదిలోకి వెళ్ళి తాను సినీమాకు వెళ్ళివచ్చాననీ తన గది తాళంచేయి పోయినందున అక్కడికి పడుకుంటానికి వచ్చానని అబద్ధా లాడి గోపి ఆ రాత్రి అక్కడే నిద్రపోయినాడు.

అక్కడనుంచీ మళ్ళా గోపికి గిలి ఏర్పడ్డది. నంబియూదిరి ఎప్పుడైనా కనబడితే గోపికి కాళీ స్వరూపంవలె తోచేవాడు. రాత్రిళ్ళు 'ఫాలన్నుపాండు' కనపడే కిటికీ తలుపు తెరుచుకుని నిద్రించడానికి జంకేవాడు. దానికి తోడు ఎప్పుడూ పీడకలలు వచ్చేవి. అతనికి ముందు ఆ గదిలో ఉండి ఆత్మహత్య చేసుకున్న మెడికలు విద్యార్థిస్వరూపమతనికి ప్రత్యక్ష మయ్యేది. ఈ భయాలకు తోడుగా అతనికి ఇరవయ్యో ఏడు వచ్చింది. బ్రాహ్మణుని భయంకర శాపాక్షరాలు అతనికి స్మృతిలోకి వచ్చి వేధించ సాగినవి.

ఎప్పటి కప్పుడు మొండి ధైర్యముతో మనస్సు స్థిరంగా ఉంచుకోడానికి ప్రయత్నించేవాడు. ఆ గది విడిచి పెట్టవలె నని ఎన్నోసార్లు అనుకున్నాడు కాని అంతా అతన్ని పిరికివా డని ఎగతాళి చేస్తారేమో అనే అభిమానంవల్ల సంశయించినాడు. ఒక గౌరవ స్థానంలో ఇతరులు నిలిపిన తర్వాత అటువంటి వానికి ఆ స్థలం వదిలి పెట్టడం సాధ్యము కాదు.

౫

ఆ రోజు చంద్రగ్రహణము. గ్రహణము పట్టడము రాత్రి ఎనిమిదింటికి. హాస్టలులో తెలుగు విద్యార్థులు చాలా

ఉంది సముద్ర స్నానానికి వెళ్ళ దలచుకొన్నారు. విశుపు స్నానం ముఖ్యమయినా ఆ వేళటికి పొద్దు పోతుం దని పట్టు స్నానం మాత్రమే చేయడమని తీర్మాన మయింది. గోపి కూడా వస్తా నన్నాడు.

అంతా మొదట కులాసాగానే ఉన్నది. కాని శ్రీనివాసరావు వాళ్లకు పానకంలో పుడక లాగ ఉత్సాహ భంగము చేసినాడు. గోపి వస్తే తాను రా ననడమే కాక గోపి వస్తే ఏదో విపత్తు సంభవిస్తుందనీ ఎవరి ఖర్మమో మూడడం బట్టే వాళ్ళందరికీ ఆదుర్బుద్ధి పుట్టిం దనీ, శాపనార్ధాలు సాగించినాడు. స్నేహితులంతా కొంతసేపు శ్రీనివాసరావుకూ గోపికీ చిలకా గోరువంకా సరాగంగా ఉంటుం దని హేళన చేశారు. కాని శ్రీనివాసరావు ఎంతకూ పట్టినపట్టు విడవకుండా వాక్యాలు పెట్టడ మారంభించినాడు. "నీవు రాకపోతే రాకపోయినావు కాని వెధవవాక్యాలు పెట్టకుండా ఉండు బాబూ" అని వాళ్ళంతా శ్రీనివాసరావును బతిమాలికున్నారు. అయినా శ్రీనివాసరావు ఊరుకోలేదు.

సాయంత్రమయింది. స్నానానికి వెళ్ళడానికి అంతా సిద్ధ మవుతున్నారు. గోపి కూడా తువాలాలు మొదలైనవి తయారు చేసుకుంటున్నాడు. మధ్యాహ్నం స్నేహితు లంతా స్నానానికి వస్తావా అని అడిగినప్పటినుంచీ శ్రీనివాసరావు అవాక్కులు పెట్టుతున్నా కూడా కులాసాగానే అతని మాటలు తీసుకుంటూఉన్న గోపికి అకస్మాత్తుగా గుబులు తిరిగింది. సముద్ర స్నానానికి వెళ్ళకపోతే ఏం అనిపించింది. తనమంచికే శ్రీనివాసరావు నోట ఆవాక్కు అట్లా పలికిస్తున్నదేమో నని కూడా అనుకున్నాడు. నూనె గుడ్డలవాడు అతనికి నీటిగండ మున్నదని చెప్పినమాటలు జ్ఞాపకము వచ్చినవి. ఒళ్ళు ఝల్లు మన్నది. నీళ్ళలో మునక వేసినట్లు అతని కాక్షణం తోచింది. ఇంతలోకే ఆ బ్రాహ్మణస్వరూపం కూడా మనశ్చక్షుస్సు ఎదట ప్రత్యక్ష మయింది. ఆముసలి బ్రాహ్మడివల్లేనే గోపి దేహమంతా వణికి పోయింది. ఏదో కారణార్థముండ బట్టే ఆ ఆత్మహత్య గదిలోకి తాను వచ్చా ననుకున్నాడు.

స్నేహితు లంతా బయట కూడుతున్నారు. గోపికి అవసాన దశ వచ్చినట్లు గానే ఉన్నది. ఇట్లు జ్ఞాపకము వచ్చింది. అక్క చెల్లెళ్లూ అన్నతమ్ములూ, తలిదండ్రులూ అందరూ తలపుకు వచ్చారు. దుర్వార్త వింటే తల్లిదండ్రులెంతగా విలపిస్తారో తలచుకునే టప్పటికి గోపికి ఆవురు మని ఏడుపు వచ్చింది. స్నానానికి తీసుకున్న గుడ్డలు అవతల మూల గిరాటు పెట్టినాడు.

"గోపీ, గోపీ!" అనే కేక బయట వినవచ్చింది. స్నేహితులు గందరగోళంగా అతన్ని పిలుస్తున్నారు. గోపి

తలుపు తీసుకుని బయటికి వచ్చినాడు. "నేను రాను" అనే మాటలు అతని నోటినుండి వస్తున్నాయి. అప్పుడే అతని ఆకారం కనిపెట్టి స్నేహితులు ఎగతాళి చేసినారు. "శ్రీనివాసరావు పిరికి మందు నీమీద బాగా పనిచేసిందిరా!" అన్నాడు ఒక స్నేహితుడు.

గోపికి రోషం వచ్చింది. వాళ్ళ మాటల కేమీ జవాబు చెప్పలేదు. అతి వేగంతో పోయి స్నానానికి కావలసిన వస్త్రాలు తెచ్చుకుని స్నేహితులను కలుసుకున్నాడు. "నేను పిరికివాణ్ణి అనుకున్నారా!" అనే తిరస్కార భావం అతని మొహంలో వ్యక్తమవుతున్నది.

చంద్రుడు చల్లని వెన్నెల కాస్తున్నాడు. సముద్ర తీరమంతా జన సమర్దముతో సందడిగా ఉన్నది. ఆ ఘోష సముద్రపు ఘోషలో లీనమైపోయింది. స్త్రీలూ పిల్లలూ కూడా గుంపులు కూడి స్నానం చేస్తున్నారు. వాళ్ళ నందరినీ చూచేటప్పటికి తన కిదివరకు కలిగిన భయానికి గోపి సిగ్గుపడ్డాడు. ఒక్కసారిగా అతని మనస్సులోని మాలిన్య మంతా తొలిగి పోయింది. ఒక్కసారిగా ఉత్సాహం పొంగి పొరిలింది.

గ్రహణం పట్టు ప్రారంభించింది. సంకల్పము చెప్పుకుంటూ కొందరూ ఏమీ లేకుండానే మరికొందరూ సముద్రంలో మునకలు వేస్తున్నారు.

స్నేహితులతో సహా గోపి సముద్రంలోకి దిగినాడు. మొదట జాగ్రత్తగా ఉందా మనుకున్నా గోపి అప్పటి ఉల్లాసంలో విశ్వాము మరిచినాడు. కెరటము వచ్చినప్పుడల్లా దానితో లేచి ఎగురుతూ లోపలి లోపలికి వాళ్ళంతా సాగి పోయినారు. అల విరిగే చోటుకు కాస్త ఇవతలగా ఆగి ఉండి స్నానాలు చేస్తున్నారు. ముందు వచ్చే అల ఒడ్డుకూ, వెనక్కుపోయే అల లోపలికీ లాగుతూ ఉంటే వాళ్ళకు ఉయ్యాల ఊగు తున్నట్లుగా ఉన్నది. గోపి స్నేహితులు మధ్యమధ్య అల్లరికి "గోపి ఉన్నాడా?" అని ఒకరి నొకరు అడుగుతూ ఎగతాళి పట్టిస్తున్నారు. "నిన్ను మళ్లా శ్రీనివాసరావుకు అప్పగించకపోతే వాడు మా ప్రాణాలు తీస్తాడు, జాగ్రత్త నాయనా!" అని ఒకడన్నాడు. ఆ మాటలకు గోపి వెకిలి నవ్వు నవ్వుతూ ఉన్నాడు.

అంత కంతకు అలల దెబ్బ ఎక్కువవుతున్నది. అంత కంతకు పెద్దపెద్ద కెరటాలు రావడమే కాకుండా ఒక దాని వెంట ఒకటి వెంట వెంటనే రావడము సాగించినవి. ఒక్కొక్కసారి పక్కనుంచి కూడా నీటి దెబ్బ తగులుతున్నది. స్నేహితులంతా అక్కడనుంచీ వెనక్కు పోదామని బయలు దేరుతున్నారు. గోపి "కాసేపు ఉందాము. అప్పుడే ఎందుకంత తొందర?" అన్నాడు. స్నేహితులలో ఒకడు "బతక

దలచుకున్న వాళ్లకు తొందరకాదా మరి !" అన్నాడు.

అన్నింటికంటే బ్రహ్మాండమైన కెరటము వస్తున్నది. స్నేహితులంతా వెనక్కు పరిగెత్తుతూ గోపినికూడా రమ్మనమని కేకలు పెట్టినారు. గోపి ఆమాట వినిపించుకోలేదు. పెనుభూతము వలె కెరటము గజము దూరములోకి వచ్చింది. అది చూసే టప్పటికి గోపి గుండె నీరయింది. అప్పటికే అలల తాకిడికి అలిసి ఉన్న అతని దేహము అట్లా అధైర్యం తోచగానే మరింత నీరసించినది. అడుగు వెనక్కు వేయబోయినాడు. కాని కాలు కదలలేదు.

అల రానే వచ్చింది. అది అమాంతం వచ్చి గోపి తత్తరపాటుతో నిలుచున్న చోటనే విరిగింది.

* * *

గోపి ఏమై పోయినాడో ఎవరికీ ఏమీ తెలియదు. ఆ అల దెబ్బకు ఉక్కిరిబిక్కిరి ఐ పడిపోయి లోపలికి కొట్టుకుని పోయినాడని కొంతమందిఅనుకున్నారు. ఆ అలతో సహా పెద్దచేప ఒకటి వచ్చిందనీ అది గోపిని మింగుతుండంగా తాము స్వయంగా చూశామనీ కొంతమంది అన్నారు. అక్కడ ఉన్న పల్లెవాళ్ళను తెప్పలు వేసుకుని వెళ్ళి గోపి దేహాన్ని పట్టుకునివస్తే గొప్ప బహుమాన మిస్తామని స్నేహితులు ఆశపెట్టినారు. కాని ఆ రాత్రి వెన్నెల ఉన్నా సముద్రం అంత భీకరంగా ఉన్నప్పుడు వెళ్ళడానికి వాళ్ళు కూడా సాహసించలేదు.

ఎవరో విద్యార్థి సముద్రం లోకి కొట్టుకుని పోయినాడని కొందరూ, స్వయంగా ఆత్మహత్య చేసుకోవలెనని సముద్రంలో పడ్డాడని కొందరూ అనుకుంటూ అక్కడ వందలకొలది జనము కూడినారు. ఆ మహాసముద్రంలో ఎంతమంది ఈది ఏమిచేయగలరు ? సముద్రము ఘోష చాలించలేదు. రాహుగ్రస్తుడైనప్పటికీ చంద్రుడు వెన్నెల కురుస్తూనే ఉన్నాడు. అత్యుల్లాసముతో స్నానానికి వచ్చిన తెలుగు విద్యార్థులు హాస్టలుకు వెళ్ళేటప్పుడు ఒక్కరికీ ముఖాన కత్తిగాటు వేసినా నెత్తురు చుక్క లేదు. వాళ్ళ వెంట గోపి రాలేదు.

ఆ దుర్వార్త వినగానే శ్రీనివాసరావు స్త్రీ వలె గొంతెత్తి రోదనము చేసినాడు. తరువాత కొన్నాళ్ళ వరకూ అతను నిద్రాహారాలు చాలించినాడు.

*

ముఖాంభోజము * పెద్దిభట్ల రామచంద్రరావు

దివ్యమోహన లలిత సందీప్తిశాలి
నీముఖాంభోజమే దృష్టి నిలుచుకతన
నిశ్చలం బయ్యె నామది నిబిడరక్తి
ప్రియునిదర్శన మబ్బిన ప్రియ విధాన !

దివ్యమోహన లలిత సందీప్తిశాలి
నీముఖాంభోజమే దృష్టి నిలుచుకతన
పులకరించెను నామేను సలలితముగ ,
చిన్కు నిలిచిన ముత్తెపుచిప్పవోలె !

దివ్యమోహన లలిత సందీప్తిశాలి
నీముఖాంభోజమే దృష్టి నిలుచుకతన
హృదయ ముప్పొంగె హర్షమ్ము హెచ్చి నాకు ,
పూర్ణిమానిశి వార్ధి యుప్పొంగుపగిది !

దివ్యమోహన లలిత సందీప్తిశాలి
నీముఖాంభోజమే దృష్టి నిలుచుకతన
రుచ్య రాగామృతరసమ్ము గ్రోలినాను
కాంక్ష పూదేన గ్రోలు భృంగమ్ముకరణి !

*

నౌక * పెద్దిభట్ల రామచంద్రరావు

ఎంతకాలము మోహాబ్ధి నీదగలను !
అంతు పొంతును లేని యీ యబ్ధియందు
తీవ్ర యాతనచే కాళ్లు తేలిపోయె:
నన్ను దరి జేర్ప వేమి నా నౌక వగుచు !

ఎంతకాలము మోహాబ్ధి నీదగలను !
సహజబలమును గూర్చు విశ్రాంతి లేమి
సరళవృత్తిని నూపిరి సలుప దయ్యె:
నన్ను దరి జేర్ప వేమి నా నౌక వగుచు !

ఎంతకాలము మోహాబ్ధి నీదగలను !
దుర్భరార్తిని పూర్తిగా దూలిపోయి
అవయవ సమూహ మంతయు నదరు చుండె:
నన్ను దరి జేర్ప వేమి నా నౌక వగుచు !

ఎంతకాలము మోహాబ్ధి నీదగలను !
నీదు చిరునవ్వు తరగల నెయ్యమునని
ఇంతకాలము నిల్చితి వింతగాను:
నన్ను దరి జేర్ప వేమి నా నౌక వగుచు !

విరహిణి * శ్రీ బాబురావు

నీ పదంబులచెంత హృత్తాప భరము
తీర్చికొంటిని ప్రేమ గీతికలు పాడి !
ఏదియును లేని యీ నిరుపేదరాలి
నేల యాచింతు వింక గీతాల కొరకు !

వినిర్గమనము * నోరి నరసింహశాస్త్రి

౧

పూర్ణిమా పూర్ణచంద్ర సంఫుల్ల మగుచు
కౌముదీస్నిగ్ధ కమనీయ కాంతిజలధి
కేలి డోలాడుచుండె సంతృప్తి సృష్టి.

శాంతగంభీర మా నిశాసమయమందు
ఛన్నుడా ఛన్నుడా యను శాక్యపుత్త్రు
పిలుపు విని మేలుకొన ఛన్ను డులికి పడుచు.

" దేవగంధర్వ సిద్ధాది దివ్యులకును
మానవాళికి భువన సమస్తమునకు
కర్మబంధంబు గోసి దుఃఖంబు వాపు
శాశ్వతం బైన నిర్వాణ శాంతపదము
నరయ వెడలితి, కంటక హయవరంబు
సజ్జ మొనరింపు నాకు తత్క్షణమె ఛన్న ! "

గౌతముం డిట్లు పల్కు వాక్యముల దిగుల
నద్భుతావిష్టు డై ఛన్ను డనియె మరల.

" రాజపుత్రక, యీ యర్ధరాత్రివేళ
నెందు బోయెద వీరాజ్యమెల్ల విడచి ?
తలిదండ్రుల యశోధరాదేవి నీకు
దివ్యతేజస్వి పుత్త్రు నీ దినమె కనెట ! "

ఛన్ను డీరీతి బల్కి విషణ్ణు డగుచు
రాజపుత్రుడు ప్రత్యుత్తరం బొసంగె.

" ఎన్నినాళ్లందు నీప్రేమ శృంఖలముల
మోహమూఢ చతుర్దశ భువనములును
దుఃఖవారిధిలో మునిగి తూల గనుచు !
లెమ్ము మమ్మెల్ల రక్షింప ర మ్మటంచు
దీనులై జీవకోటులు దినము రేయు
చెవుల ఘోషించుచున్నారు చెవుడు వడగ !
తుచ్ఛశారీర చింతా జితుండ నగుచు
ఎంతకాలంబు నా జన్మ వృధయొనర్తు
జగము సర్వమ్మును సజీవశవము లుండు
ప్రేతనిలయంబు గాగ నెరింగి యెరిగి ?
తడయగా జాల క్షణికమాత్రంబు నింక
హయము సిద్ధం బొనర్పు ప్రయాణమునకు ! "

శాక్యగౌతము నాజ్ఞ నిస్తబ్ధు డగుచు
ఛన్ను డతిశీఘ్రగతి నశ్వశాల కరిగె.

సర్వసన్యాస మొనరింప జనెడి యిచ్ఛ
నమృత మొల్కు హిమాంశు సమక్షమందు
నిలిచి యుండిన సిద్ధార్థు నిర్మలాత్మ
రాగయంత్రిత మొక వికారంబు పొడమె.

" పరమ సాధ్వి యశోధర ప్రథమపుత్రు
నేడ ప్రసవించె సర్వంబు వీడు మునుపు
పుత్రు రూపంబు చూడ్కుల ముంచి తేల్చి
రెండు చేతుల నెత్తి యాహ్లాది గదించి
మూర్కొని శిరంబు మనసార ముఖసుధాంశు
ముద్దు గొని యొక్కమూరు నే పోదు వదలి. "

గౌతముం డిట్లు తలచి యాక్షణమునందె
మరలి చేరె యశోధరమందిరంబు.

శాంతగంభీర మా నిశాసమయమందు
నిదుర నోలాడుచుండెను నిఖిల జగము.
చేతనము లేకయుండె దాసీజనంబు.

రత్నదీపప్రభాకోటిరమ్య మైన
భవనమున హంసతూలిక పాన్పునందు
పుత్రు బజ్జ యశోధర ముగ్ధమూర్తి
దివ్యరమణీయకాంతి నిద్రించుచుండె.

సర్వసన్న్యాస మొనరింప జనెడి ముందు
పుత్రు నొకసారి మొత్తి కవుంగిలింప
నమ్మదిగ బోయి శాక్యుడు నిలిచె నచట.

చనెడి స్మరసుహృ దుత్సవసమయ మనుచు
ప్రమదవన చూతశాఖాగ్రంబునుండి
పికవరం బొండు హృదయ విభేదకగీతి
గాన మొనరించి వెడలె రెక్కలు విదల్చి.

౨

ప్రథమ పుత్రుడు జన్మించె రాజపుత్రి
మంగళమ్మని శుభవార్త మనవి చేయు
దాసజనమును ఘనవిషాదమున గాంచి
రాహులము పుట్టెనని పల్కె రాహులుడని
గౌతమతనూజునకు నామకరణ మయ్యె.

అరనగవు నాట్య మాడు నాస్యమ్ముతోడ
ముద్దు లొల్కు మనోహరమూర్తితోడ
తనదు తేజంబు మందిరాంతరము నిండ
నొదిగి పొత్తుల నిద్రించుచుండె శిశువు.

ఎట్టు లాజన్మకృపణు డదృష్టలబ్ధ
వసువిశేషంబు తడిమి గుప్తపరచు నట్లు
రాహులుని సౌమ్యబాహువల్లరిని బొదివి
అతిశయశ్రమక్లిన్న సర్వాంగ యగుచు
గౌతమప్రియ యుండెను గాఢనిద్ర.

మందిరద్వారి నున్న శాక్యేంద్రు నెడద
ఉయ్యెలయు బోలె నిటు లటు లూగదొడగె.

ప్రేయసీరూప దర్శనామేయ సుఖము
ప్రథమపుత్రోపగూహన పరమసౌఖ్య
మాత్మలోనిండ శాక్యవంశార్ణవమణి
చని యశోధర పాన్పు పార్శ్వమున నిలిచె.

నిద్రలోనామె నిట్టూర్పు నిగుడ జేసె
శిశువు పెదవులు వికసించె జిరునగవున
శాక్యసింహుని లోచనాబ్జములయందు
బాష్పధారాఝరీపరంపరలు వెడలె.

కాలమేఘావగుంఠనకాండ మపుడు
క్రమ్మె నాకాశవీథి నాకస్మికముగ,
మాసెను హిమాంశు నక్షత్ర మండలములు,
దిశల విన నయ్యె నవ్యక్త దీనరవము !

గౌతముం డిన్నివాళ్ళ భాగ్యంబు కలిమి-
ఏవిలాసిని యౌవనేందీవరంపు
మధువు కన్నుల కరవు బో మరల మరల
ముగ్ధుడై గ్రోలుచును తృప్తి పొరయకుండు;
ఏ సువాణి సుధాప్రవాహిని నతండు
లీనమై మోహపరవశోద్రేకియగును;
ఏ కుసుమకోమలాంగ సంస్పృష్టుడగుచు
గాఢరోమాంచ మొంది లోకంబు మరచు;
ఆ లతాతన్వి స్నిగ్ధకాంతాలలామ
చంద్రికాహీర మల్లికా స్వచ్ఛచరిత
పతిమహాద్యమ మెరుగని పరమముగ్ధ
బాలకుని రూపు కెంగేల బదిలపరచె.

తనయు జే నందుకొన యశోధరయు లేచె.
ఆమె మేల్కొన్న సిద్ధార్థు డాత్మ మరచు
ఆ శుభేక్షణ మృదుదృష్టి పాశములను
తవిలి విడవడలే డవి తథ్యముగను
శాక్యసింహుని మరల్చు సంసారమునకు.

చిరునగవు నృత్య మొనరించు శిశువు ముఖము
జనకు హృదయంబు బల్మి కర్షణమొనర్చె.

అతిశయాత్మసౌఖ్యమున దేహయష్టి వంగ
శాక్యముని చాచె మృదులహస్త ద్వయంబు
బాలకుని ముద్దురూపంబు పట్టుకొనగ.

సంచలించెను గిరులు ఘోషించె నబ్ధి
పుడమి వడకె చతుర్దశ భువనములును
ఘూర్ణితధ్వాన లీన సంక్షోభ మొందె.
దిశల వినవైన యవ్యక్తదీనరవము
మేఘఘోషాతితీవ్ర గంభీర మగుచు
విశదమై చొచ్చె సిద్ధార్థు వీను లిట్లు:

“ కావవో, మము బోధిసత్త్వావతార !
సృష్టియందియు నిరత ప్రవృద్ధమగుచు
పృథ్విని నిరంతరముగ వ్యాపించియున్న
భవమహాంధము జ్ఞానదీపమున బాపి.

“ ఛేద మొనరింపు లోకమ్ము జీల్చుచున్న
కర్మబంధంబు నిర్వాణఖడ్గధార !
తూలుచున్నది భువన చతుర్దశంబు
దుస్తరం బగు సంసార దుఃఖవార్ధి.

“ తలచునది యేమి యిపుడు తథాగతుండు
‘ మారు ’ నకు మమ్ము బలియీయ గోరునొక్కొ !
అరయడో దీనుల గృపాసమగ్రదృష్టి
మరచునో మున్ను పల్కిన మాట లన్ని.

“ విమల శుభదివ్యధామంబు విడిచి బలిమి
సతతకలుషాత్మ మీప్రపంచంబునందు
జన్మ మెత్తుచు జన్మించు క్షణమునుండి
రోదన మొనర్తు మేము హృద్భేదకముగ.

“ శోకభరమున తనువులు తల్లడిల్ల
పరమ విశ్రాంతి సుఖములు పల్లటిల్ల
దేహధారణ మాది బాధించు తీవ్ర
రోగముల జృంభణంబున రోసినాము.

“ నడుము వంగెను, చర్మము ముడుతలుపడె,
తల నెరసె, నూడె దంతముల్ తరిగె శక్తి,
అల్లలాడుచునుండె సర్వాంగకములు,
దుర్భరజరాధిగమమున తూలినాము.

"రక్తబిందువు లాస్యరంధ్రముల వెడల,
దృష్టి నిలువగ, సారవిహీనము లయి,
ప్రాణములు లేని యీ కళేబరము లైన
కనుగొనెడ, మహాత్మ, అనుకంప కలుగ దొక్కొ!"

భంగ మయి నిద్ర మేల్కాంచువాని పగిది
చిత్రముగ నుల్కిపడె శాక్యసింహు డపుడు.
అరయ నయ్యె సిద్ధార్థు ముఖాబ్జమందు
అతితరాస్పష్ట గంభీర హాస మొండు.

రాహులుని నంద బోవు కరద్వయంబు
అప్రయత్నంబుగా వెన్క కరిగి నిలిచె.
చంద్రకాంతాశ్మకుట్టిమస్థలమునందు
మెల్లమెల్లన నడుగులు మెట్టుకొనుచు
మరలె గౌతము డాదివ్యమందిరమున
ప్రథమసుతుని యశోధరా రమణి వదలి.

అభినవోద్భిత్తు వోలె వర్షాగమమున
మెరసె దిక్కులు నవనవోన్మేష మొంది;
తెలివి పొందె నభంబు, చంద్రికలు నవ్వె,
కువలయంబు మోదాబ్ధి దోగుచు వెలింగె.

దిక్కుల బ్రతిధ్వనించిన దీనఘోష
లబ్ధకాముల కోలాహలముగ మారి
యస్ఫుటంబయి క్రమముగా నడగిపోయె
శాంతగంభీర మై నిశాసమయ మొప్పె.

3

పండు వెన్నెల కురిసెడి నిండుచంద్రు
నిజసుధాచ్ఛ వపుః కమనీయకాంతి
గేలిసేయుచు కంటకాగ్రియ హయము
కనకవసనా భ్యలంకృత కాయ మొప్ప
రత్న ఖచిత ఖలీన విరాజితముగ
చారుతర మార్గమున ఛన్నసజ్జిత మయి
శాక్య గౌతమ మృదుపద స్పర్శకాంక్ష
వేచియుండె గృహాంగణ వీధియందు.

గౌతముం డాదరంబున గంటకంబు
జేరి విపుల వక్షః పీఠసీమ జేర్చి
మృదు కరాబ్జతలంబున మేను నిమిరి
యనియె నిట్లని యాప్తమిత్రునకు బోలె :

“తురగ సత్తమ, దుష్టశత్రుల జయించు
నృపుని రణభూమి మున్ను వహించుచుందు
విపు డపూర్వామృతంబు లభించు కాంక్ష
నరుగు నన్ను వహింపు జయప్రదముగ !

“ఘోరసమరాంగణంబున బోరువేళ
బంధు మిత్ర సహాయలాభంబు సులభ,
మాపదలయందు ధర్మసంస్థాపనమున
దుర్లభం బది ; సుకృతమే దొరకునెడల !

“పాపపుణ్యోద్యమంబుల ఫలములందు
నొందెదరు పాలు తత్సహాయులును గాన
హయమ, నన్నిప్పుడు వహించి యాత్మహితము
సల్పు లోకహితమ్ము నిష్కలుషవృత్తి.”

ఇట్లు మధురాక్షరముల వచించి యతడు
అశ్వరత్నాధిరోహణం బాచరించె
విమలమేఘంబు శారదవేళయందు
నధివసించు వివస్వంతు విధము దోప.

గౌతము మనం బెరింగిన " కంటకంబు "
వెడలె నిశ్శబ్దముగ రాజవీధి నపుడు
యక్షు లేమైన స్వీయకరాబ్జములను
కంటకపదాగ్రతలముల గప్పిరేమొ !

మత్తగజసంఘము ప్రయత్నమాత్రమునను
తెరచు పట్టణ గోపురగురుకవాట
యుగ్మము తమంత విష్కంభ మూడిపోవ
దెరచుకొనె వింతగా శాక్యు డరుగువేళ.

గోపురద్వారి దాటెను ఘోటకంబు
కపిలవస్తుపురం బెల్ల గాఢనిద్ర
మున్గి నిశ్చింతముగ నుండె మూఢవిధిని
స్వీయ సంపత్సమస్తంబు విడుచుకొనియె.

తల్లిదండ్రుల బ్రియను నూతనకుమారు
బంధుమిత్రుల సర్వసంపదల వదలి
ఛన్నమాత్రానుచరుడయి శాక్యచంద్రు
డరిగె కొండొకసే పిట్లు హయవరమున.

పోయిపోయి యొకానొక పుణ్యభూమి
గంటకనివర్తన మొనర్చె గౌతముడు,
ప్రేమభాజను లెల్ల నిద్రించు పురము
కనులపండువుగా గాంచ కపిలవస్తు.

దూరమున చంద్రికాస్వచ్ఛపూరమందు
స్పష్టముగ గాన నయ్యెను సౌధములును
హర్మ్యములు గోపురంబులు, నందు మరల
నగవరంబులలో హిమనగము మాడ్కి
వివిధధాతు విచిత్రిత భిత్తియగుచు
ఆత్మశిఖరాగ్రహసితవిహాయస మయి
అరయనయ్యె నాత్మీయ మందిరము గూడ.

అందె యిప్పుడు నిద్రావశాత్మ యగుచు
నుండు ప్రియురాలు చేత రాహులుని బొదివి !

ఏపవిత్రస్థలంబున నీవిధమున
కంటకనివర్తన మొనర్చి గౌతముండు
కనులపండువుగా గాంచె కపిలవస్తు,
తత్స్థలిని " దేవతాప్రియదర్శనుండు "
దివ్య చైత్యం బొకండు ప్రతిష్ఠ చేసె
కంటకనివర్తనాఖ్య విఖ్యాతముగను.

౧౯-౨౩

మా ప్రణయలేఖల కథ

దేవులపల్లి కృష్ణశాస్త్రి

*

[జనవరి రెండో తారీఖు ఉదయాన్నే వ్రాసాను]

౧

నా జీవిత పరిమాణ మింతే కాని బ్రతికిన ఇరవై యేడేళ్ళలోనూ నాకు ప్రేమ దొరికింది కాదు; నా ఆదర్శానికి సరిపోయే సౌందర్యమూ దొరికింది కాదు.

నేను వాటికోసమే పుట్టాను; వాటికోసమే జీవిస్తున్నాను.

నా పసికన్ను రెప్పలచాటునుంచి నా మొదటిచూపు అల్లనల్లన విచ్చుకుని, వాటికోసమే "ఎక్కడున్నాయి" అని ఆశ్చర్యపడుతూ ప్రశ్నించింది; నా లేతహృదయము "ఎక్కడున్నాయి" అని వాటి కోసమే మొదటిసారే తత్తరపాటుతో కొట్టుకుంది.

నేటికి కూడా నా వీక్షణములో ఆప్రశ్న ఒక్కటే నిలిచి ఉంది; ఈ యిరవై యేడేళ్లూ నా హృదయ మూ ఒక్కజవాబుకే కొట్టుకుపోతూంది.

ఉయ్యాలరోజుల్లో ఆ ప్రశ్నలో తొందర ఉంది. ఆటపాటల దినాల్లో అమాయకత్వ ముంది. నవయౌవనములో ఉత్సాహపులకిత మైన సిగ్గు ఉంది. నేడు నిరాశా, నిస్పృహత్వమూ, నిరసనభావమూ, నిర్లక్ష్యమూ ఉన్నాయి. ప్రశ్న మాత్రము నిలిచి ఉంది.

నడి వేసవినాటి మట్టమధ్యాహ్నపు కారుచిచ్చులలో ఇంటింటికీ కడవకడవకూ తల్లడిల్లిపోయే కాకి వెర్రి పరువుల్లో ఆ ప్రశ్నే ఉంది; ఏడాదికేడాదీ, నెలంతా, ఇరవై నాలుగ్గంటలూ, ప్రతినిముషమూ, ఆజన్మాంతమూ, వీధివీధికీ, గడపగడపకూ సోలి తూలే బిచ్చగాని కాటకపు చేతిలో, కరువు నడకల్లో, వాని నిలువునా ఆ ప్రశ్నే ఉంది. అంతకంటె తీవ్రంగా, అంతకంటె భయంకరంగా, అంతకంటె ఉన్నతంగా, అంతకంటె దుందుడుకుగా ఆ ప్రశ్నే నిలిచి ఉంది నా చూపులో, నాహృదయములో

ఈ బేలజీవితాన్ని అరచేతిలో పెట్టుకుని లోకంమధ్య చాపాను; నిరసనభావము దానిమీద ఉమ్మేసింది. క్రౌర్యము దాన్ని పొడిచివేసింది, కౌటిల్యము చించేసింది. కాని ఆ చాపినచెయ్యి చాచినట్టే ఉంది. వాడవాడల అపరిచితపు కాకులూ గద్దలూ ఎగిరి వచ్చి తుత్తునియలు చేసి పోయిన ఈశిథిల జీవితము తనరుద్ధ కంఠ మెత్తి ఇప్పటికీ ఆ ప్రశ్నే వేస్తుంది; జవాబు లేక కుంగిపోతూంది. మళ్లీమళ్లీ ఆ ప్రశ్నే వేస్తూంది; నరక వేదనలో బూడిదై పోతూంది.

నా కైదేళ్లున్నప్పుడు నామొదటివలపు. ఆమెకు ఇరవైఅయిదేళ్లేమో. ఆమె వీణవాయిస్తూన్నప్పుడు ఆబంగారపువేళ్లు నాచిన్నిహృదయాన్ని నొక్కేవి; అదీపాడేది. ఆమె కెదురుగా కూర్చుండి ఎందుకో నిండా తెరుచుకునిపోయిన నాకళ్లతో నా లోనికామెను లాక్కొనేవాణ్ణి; అలా చేస్తూ ఆమె కాళ్లదగ్గిర పెంపుడుకుక్కపిల్లలాగ నిద్ర పోయేవాణ్ణి; ఆమెను కలలుకనేవాణ్ణి; మేలుకొనేటప్పటికి కంటినిండా మళ్లీ ఆమె నిండి ఉండేది. తరవా త్తరవాత ఆమె యెక్కడికో అదృశ్యమై పోయింది. అప్పుడేదో, ఎందుకో, ఎంతకాలమో బాధపడ్డాను. ఆ వేదన తెలియరానిదీ తెలుపలేని దీని. ఆమె యేమనుకునేదో నన్నుగూర్చి !!

నాపన్నెండో యేట ఇలాగే ఇంకో స్త్రీని వలచాను. ఈమెకు పద్ధెనిమిదేళ్లు. చక్కదనమంతా కలిసి ఈమె ముఖమైంది; ముఖ్యంగా కళ్ళు. అవి మాట్లాడేవి; పాడేవి; ఆలోచించేవి; ఎక్కడెక్కడికో యెగిరి పోయేవి. ఆకళ్లకేసే నే నెప్పుడూ చూసేవాణ్ణి. అవి తిరిగి చూసినప్పుడు, చటుక్కున రెప్పలకిందికి పారిపోయేవా నాచూపులు, లేక పక్కపక్కలకి తప్పుకునేవో. అప్పుడు "నీకళ్ళు బాగుంటాయి" అనేది. ఈమెకళ్ళకేసి ఎప్పుడూ చూడడంవల్ల నాకళ్లు అలాగే అయాయో, లేక తన కళ్ళ ప్రతిబింబం నాకళ్ళల్లో చూసిందో! తరవా త్తరవాత వివాహమై మాయమై పోయింది ఈమెకూడా నాజీవితంలోనుంచి. అప్పుడు మూడేళ్ళు నాసుకుమార హృదయం భయంకర తాపంలో కుమిలిపోయింది. అన్నం సయించేది కాదు. గుండెలో, ఆకలిగాని ఆకలీ, దాహంగాని దాహమూ రేగిపోయేవి. గొంతులో ఇవతలికీ వెళ్ళక అవతలికీ వెళ్ళక ఎప్పుడూ ఏదో ఉండేది. ఎవరేనా పలకరిస్తే ఏడుపు వచ్చేది; ఎందుకో అందరూ నన్ను వేధించడం! నవలల్లోనూ కథల్లోనూ మమ్మల్నిద్దర్నీ ఆనవాలు పట్టేవాణ్ణి; పట్టుతూ ఎందరిదొంగల్నో పట్టుకుని, ఎందరిక్రూరుల్నో హింసించి, ఈమె నెన్నిగండాలనుంచో తప్పించేవాణ్ణి. ఆ వేదన అధికమై పోయింది. ఈమెకు మాత్రము తెలియదు. క్రమక్రమంగా ప్రణయగీతాలూ విరహగీతాలూ వ్రాయమొదలెట్టాను. అవి ఇప్పుడు బాగుండవేమో ఎవరికేని; అప్పుడు నాకు హృదయ శాంతి ఇచ్చేవి.

తరవాత ఒక అద్భుతవ్యక్తి నా హక్కయింది. నాకోసమే జీవితం వహించింది. తనప్రేమతో నన్నుకప్పేసింది. నా ఊపిరాడింది కాదు. నాకెందుకో యిరుకైందిఈ ప్రపంచం. అప్పుడు తన శరీరమూ మనస్సూ హృదయమూ నాతో నింపేసుకుంది. తానుకూడా నాలో నిండిపోదామని, నావైపు తన రెండుచేతులూ చాపుకుంది. నేను పెడమొగం పెట్టాను; తొలగిపోయాను.

అప్పుడు రెండుకళ్ళూ తెరుచుకుని రాత్రీపగలూ నాకేసే చూసేది; ఏమీ తోచకనే నా రెండుకళ్ళూ ఊడబెరికేశాను. అప్పుడు నాకంఠరవం వినడానికని శరీరమంతా శ్రవణాలుగా విప్పుకుని వేచిఉండేది; నేను సహించలేక వాటిలో పాషాణశూలాలు గుచ్చేసి ఆమెకు శాశ్వతంగా మూగనైపోయాను. అప్పుడు ప్రతినిముషమూ నాదగ్గిరగా చేరి తనహృదయం తొందర తొందరగా మోగించేది, దానితోనే వింటున్నట్టూ చూస్తున్నట్టూను; నాకు ఆపరానికోపంవచ్చి దాన్ని తునకలుతునకలుగా చింపేసి దుమ్ములో విరజిమ్మేశాను. అప్పుడు నాపాదాలమీద ఆరాధిస్తున్నట్టు పడిపోయింది; నాకు వెర్రెత్తి ఆమెమీద నడిచిపోయాను; అప్పుడే ప్రేమమీదా విశ్వాసంమీదా, ఆనందంమీదాకూడా నడిచి పోయాను.

ఈవిధంగా, ఆరేడేళ్లయేటప్పటికి చిరునవ్వు కార్చిచ్చుచూపులతో కాల్చేసి, అభినందన అశనిపాతంతో అణగదొక్కి ఆచిత్రవధ పూర్తిచేశాను; హంతకుణ్ణయాను.

హంతకుణ్ణయాక ఆ ప్రశ్నలోకి నిస్పృహత్వం వచ్చింది; అందువల్లనే తొందర హెచ్చింది; ఇక జబాబు రాదని తెలిసి మరీతొందర హెచ్చింది.

ఇక ప్రేమా సౌందర్యమూ విశ్వాసమూ నాదగ్గిరికి నమ్మి ఎలా వస్తాయి? నాటినుంచి పరుగు పరుగున ప్రపంచమంతా తిరగడం మొదలెట్టాను. తిరుగుతూ ప్రతివస్తువువైపూ చూశాను సౌందర్యంకోసం; అది కనబడుతూ కనబడుతూ చేయిచాపుతుండగానే మాయమయేది. ప్రతిముఖంకేసీ చూశాను ప్రేమకోసం; అది ఎదురుచూస్తూ ఎదురుచూస్తూ పోల్చుకుంటుండగానే పెడమొగమయేది. ప్రతిహృదయాన్నీ పలకరించాను విశ్వాసంకోసం; అది మారుపలుకుతూ మారుపలుకుతూ ఆలింగనంచేస్తుండగానే మూగైపోయేది.

అప్పుడీహంతకుడు ఉన్మత్తుడుకూడా అయాడు. అదివరకు నేనూ అందరిలాగే ఉండేవాణ్ణి. కాని తరవాత ఎప్పుడూ తిరగడంవల్ల నా కాళ్లు తేలిపోతూ పరిగెత్తడమే. ఎప్పుడూ గిరగిర చూడడంవల్ల చీపిరికళ్లు అయిపోయి ఊరికే ఎప్పుడూ తిరగడమే నా కళ్ళు. ఒకటే వెదకడంవల్ల వంగినవీపూ, అటూఇటూ అకారణంగా

తిరిగే మెడ. రెండు చేతులూ ముందుకు చాపి, ఒక చేతితో ఏదో యిస్తున్నట్టున్నూ, ఒక చేతితో ఏదో అడుగుతున్నట్టున్నూ.

లోకమంతా నవ్వడం మొదలెట్టింది; "ఏమిటీ వెర్రి వాలక" మంది. నేను లక్ష్యపెట్టలేదు; నాకు వినబడనే లేదు. ప్రతివ్యక్తికీ, ప్రతిప్రాణికీ, ప్రతిపదార్థానికీ నాహృదయమూ నాజీవితమూ అప్పజెప్పేవాణ్ణి. మళ్లీమళ్లీ నిరసింపబడి ధూళిలో పడిఉన్న శిథిలతరహృదయాన్ని మళ్ళీమళ్ళీ దేశదేశాల్లో వాడవాడల్లో గుమ్మంగుమ్మం దగ్గిరా అమ్మకానికో ఉచితంగానో అంటగట్ట జూసేవాణ్ణి.

ఈవిధంగా కదలిక హెచ్చిహెచ్చి కొంతకాల మయాక ఒక వింత స్తిమితం వచ్చింది. సంధి రేగిరేగి సరియైన పరిస్థితి సంభవించింది.

ఇదివరకు నా సంగతీ నా తత్వమూ నాకే తెలియలేదు. అందువల్లనే శేలనై పోయాను. లోకానికంతా ఒక్కణ్ణే హాస్యాస్పదు ణ్ణయాను.

ఇప్పుడు బాధంతా ఘనీభవించి దుఃఖమైపోయి బ్రతుకంతా నిండిపోయింది. నేను గ్రహించాను ఇది ప్రాయశ్చిత్తమని.

ఇదివరకు లోకంమీద రోషంతోకూడా ఏదో వాంఛ ఉండేది; దాన్ని ఆకర్షించాలని కూడా చూసేవాణ్ణి. ఇప్పుడూ దానిమీద అసహ్యమూ, నిరసన మూను; కాని దానితోవ దానిదీ నాతోవ నాదీ అనుకున్నాను.

ఇదివరకు ఖులాసాగా ఆనందం నటించేవాణ్ణి లోకములో వాణ్ణవడానికి; "వీడెందుకు ఏడవడు?" అని లోక మసహ్యించుకుంటూ నవ్వుకునేది. ఇప్పుడూ ఆనందం నటిస్తాను, లోకానికి నాదుఃఖం కనబడకుండా ఉండడానికి; కాని నే నేకాంతంలో ఆలపించే దుఃఖగీతాల రొదలు లోకం కొద్దిగా విని, వాటిలో సత్యం లే దనుకుని, "వీడెందుకు ఏడుస్తున్నా నంటాడు" అంటుంది ఇప్పుడు.

ఇది వరకు నాగీతాలలో లోకసామాన్యమైన బాధలూ, కోరికలూ, దుఃఖాలూ స్ఫురించేవి: ఇప్పటి దుఃఖ గీతాలలో లోకాతీతమైన సంతృప్తీ, ఔన్నత్యమూ "నన్ను ముట్టు కోకు" అంటున్నాయి. అసలు ఎప్పుడూ నాహృదయ భారం విడబోసుకుందుకు నా విషాద గీతాలు. లోకానికి నే నర్థంగా నని నాకు తెలుసు. కనుక నాతో నేనే నా కథ చెప్పుకుంటాను. నాతో నేనే మొరబెట్టుకుంటాను. నన్ను నేనే ఊరడించుకుంటాను. నన్ను నేనే అన్వయించు కుంటాను. అర్థం చేసుకుంటాను. నామీద జాలైనా పడలే దీలోకం. నా స్వేచ్ఛా యాత్రలో, నాప్రేమాన్వేషణంలో, నాదుఃఖసమయంలో, ఎన్నడూ నాతో రాలే

లే దీనిర్జీవ ప్రపంచం. నాకు నేనే ఉన్నాను; నా ప్రాణమిత్ర మీవిశ్వ ముంది. సర్వాధికారి ఒకడుంటే యీశ్వరు డున్నాడు. అందువల్లనే నా స్వేచ్ఛా గీతాలలో, నా ప్రేమగీతాలలో, నా శోకగీతాలలో నాకు ఈ సామాన్య లోకం లేదు. వాటిని నాతో, నాలాగే స్వచ్ఛంద జీవమూర్తి అయిన ప్రకృతితో ఆలపించే వాణ్ణి; పరమేశ్వరుని పాదరేణువునే ప్రార్థించేవాణ్ణి అనుకంపకోరకు.

ఇంతకూ లోకానికి కళ్లూ లేవు మనస్సూ లేదని నే నెరుగుదును. అమితోల్లాసమూ అత్యంత విషాదమూ అంటిపెట్టుకుంటాయని దానికి తెలియదు. వాటిమధ్య కనబడీ కనబడని సరిహద్దు. ఒకదానిలోనుంచి ఒకదానిలోకి ఇట్టే ఒకటే అడుగు.

కాని ఇదివరకు ఆనందం తెచ్చిపెట్టుకున్నప్పుడు ఆవెర్రిబలంలో లక్ష్యంలేకపోయింది. ఇప్పుడూ, ఎన్నడూ, నలుగురిలోనూ కన్నీరు కురియను; నిట్టూర్పు రాసను; కాని ఒక నిముషం నటించానో, ఏకాంతంలో ఒకరాత్రి సగం నీరసించానే!

ఇంకో నటన వచ్చిపడింది. పాతచరిత్రం ప్రాయశ్చిత్తం ద్వారా పూర్తిగా అర్థ మవడంచేత, ఈ భయంకర దుఃఖార్చులు ఇంకొకరికి దుస్సహమని గ్రహించి, లౌకికబంధాల వల్ల నన్ను చేరేవాళ్ళమీద వలపు నటించడం మొదలెట్టాను. ఇంక రక్తం తాగలేను; హత్య చెయ్యలేను; ప్రేమకు బదులు రాకపోతే హృదయం ఎంత తపించుకుపోతుందో గ్రహించాను; కనుక అద్భుతంగా నటించడం ప్రారంభించాను.

కాని, లేని ప్రేమ నటించడం మరీ దుస్సహం. అమ్మో! ఈ హృదయమూ ఈ జీవితమూ ఎంత అలిసిపోయాయి!

కనుక, చూశారా, నాకు ప్రేమ దొరికింది కాదు. నేను ప్రేమించినవాళ్ళు నన్ను ప్రేమించలేదు; నన్ను ప్రేమించిన వాళ్ళని నేను ప్రేమించలేదు. ప్రేమ లేని చోటికి సౌందర్యం రాదు, సౌందర్యం లేనిచోటికి ప్రేమ పోదు గదా!

ఇంక ఏం చెయ్యను? ప్రవాసినై పోయి కృశించడం మొదలెట్టాను; వేటికోసం పుట్టానో అవి లేకపోవడం వల్ల మెల్లమెల్లగా నీరసించిపోతున్నాను.

కాని ఎవ్వరూ న న్నర్థం చేసుకోలేదు. కొందరు స్వేచ్ఛావిహంగం అన్నారు; కొందరు కుటిలపన్నగం అన్నారు; కొందరు మూఢదివాంధం అన్నారు. నేను మాత్రం నాయథార్థస్వరూపం అజ్ఞాతదుఃఖంలో పదిలపరచాను.

నాహృదయాంతరాళాల్లో దాచేశాను నాబాష్పవారాశుల్ని! నా జీవితమధ్యంలోకి తరిమేశాను నానిశ్వాసప్రభంజనాల్ని. అవి నాలో లోపలలోపల నుసి చేసేస్తున్నాయి; లోపలలోపల గుల్ల చేసేస్తున్నాయి!

ఒకసారిమాత్రం ఒకసహృదయుడు, "నీ కళ్ళనాట్యాల్లో ఏదో అలసట ఉంది. వాటిపాటల్లో ఏదో వెలితి వస్తుంటుంది. వాటిలో తళతళలు సంధ్యారుచులవంటి వనుకుంటాను; వెనకాలే పొంచి నిశీథతమస్సు లున్నాయి. ఆకళ్ళు మాతో నవ్వుతూ నవ్వుతూ మాట్లాడుతూ మాట్లాడుతూ ఇట్టే అత్మగతంగా వాటిలో అవే గొణుగు కుంటాయి" అన్నాడు; ఇతడు సూక్ష్మదర్శికూడాను; కవిన్నీ.

నేను మొగం తిప్పేసుకున్నాను; అదే నేను మొదటిసారి ఇతరులదగ్గిర కన్నీరు తెచ్చుకోడం.

నే నేకాంతంగా మాత్ర మప్పుడప్పు డేడుస్తాను.

౨

ఇంతలో ఒక సంవత్సరాది వచ్చింది. లోకానికంతా వచ్చింది. మానవ లోకానికి మాత్రమేకాదు; చెట్లు చేమలకీ, రాయి రప్పలకీ కూడా వచ్చింది. నవజీవనంతో, నవనవోత్సాహంతో, నవనిర్మలానందంతో వచ్చింది.

నాకు మాత్రం రాలేదు.

ఉదయాన్నే ఒకమిత్రుడు చిరునవ్వుతో నా కభినందన మందిచ్చాడు. "నీకు కొత్తసంవత్సరం కొత్తఆనంద మిస్తుంది" అనిహెచ్చరించాడు. ఈ ఆశాసందేశమే, ఈ ఆనందాభినందనమే, ఆదినము ఆశావకాశాలంతా అలముకొనిపోయింది. హిమాలయము కనువిచ్చి వాత్సల్యంతో శిరస్సు వంచింది; అణువు గర్వోద్రేకం వల్ల పై కెగసింది!

నా కొకవికృతమైన నవ్వు వచ్చింది. ఒకగీతముకూడా వచ్చింది.

నా కుగాదులు లేవు
నా కుషస్సులు లేవు
నేను హేమంత కృ
ష్ణానంతశర్వరిని
నాకు కాల మ్మొక్క
టే కారు రూపు నా
శోకమ్మువలెనె, నా
— కుకువలె, నావలెనె—

అంటూ ఏమిటో గొణుగుకున్నాను ఆరోజు రోజంతా. నాడు విశ్వమంతా విరిసిపోయిన నాట్యాలకూ, క్రీడలకూ, ప్రణయోత్సవాలకూ ఇదే నాలిరుగు మాట, నాజవాబు.

ఆ రాత్రి నా స్నేహితురాలొకర్తెకు వీడ్కోలు పిస్తున్నాను. నా డామె నదే తొలిసారి కలుసుకోవడము.

“ మీకు కొత్త సంవత్సర మానందప్రద మవాలని కోరుతున్నాను ” — ఇదీ ఆమె మొదటి మాట.

“కృతజ్ఞుడను” అని తలవంచుకున్నాను, ముఖంమీద వికృతభావాలేవైనా ఆమెకు కనబడతాయేమో అనిన్నీ, నాలో ఒకటే మోగిపోతూన్న నాగీత మొక్కసారి వినడానికిన్నీ.

నేను గుడ్ల గూబనై పోయానని నామిత్రురాలికి తెలియదు. వెలుగక్కరలేని స్వభావం అయిపోయింది నాది. నేను సర్వద్వేషిని కూడా అయాను; దేనిలోకూడా విశ్వాసంలేదు అప్పటికి; అక్కర్లేదు.

ఆ రాత్రి తిరిగి వచ్చేశాను; స్వగృహానికి గాదు; సముద్రతీరానికి. నాకు ఆరోజున ఆ మహాసముద్రుని సందేశ మేదో తెలుసుకోవాలని కుతూహలమూ ఆతురతా కలిగాయి.

పాప మతనికీ ఆనిశీథాన్నే కాస్త ఏకాంత సౌఖ్యం. అంతఏడుపు సందడీ, అంత కడుపుచిచ్చూ, పగలల్లా తీరస్థు లెవరూ గ్రహించరని తెలుసు. మొండికెత్తాడు నాలాగే. అబ్బ! రాత్రుళ్లుమాత్రం ఏమేడుస్తాడు!!

మీరెవరేనా ఎప్పుడేనా సముద్రతీరాన్ని ఏడ్చారా? అభిమానవంతుల కదే అనువైన స్థలం, హృదయభారం విడబోసుకుందుకు. మన చిన్ని ఏడుపు అతని రోదనారావములలో ఒక జీరై ఇమిడిపోతూంది; మనకన్నీటి చినుకులు అతని బాష్పవాహినులలో ఒకనాలుగు బిందువులై కలిసిపోతాయి.

సరే, సాగర సందేశము విన్నా. ఇదేమిటి? ఇదేమిటి? ఆఁ! ఇది వరకు విన్నది కాదు. ఆకంఠరవమే వేరు; ఆ స్థాయే వేరు; ఆబాణియే వేరు.

ఇదివరకు గర్జన, ఘోష, హాహారవము, హోరుహోరారు. ఇది సంగీతము. పొర్లిపోతూన్న ప్రేమ ఇది; ఎగిసిపోతూన్న ఆనంద మిది.

నేను చెవి ఒగ్గి విన్నాను. ఒకటే చెవిగా విన్నాను. మళ్లీ విన్నాను. మళ్లీమళ్లీ. అయ్యో! ఇ దేమివింత! ఏమి టీవెర్రి! మహావిశ్వమంతా మూడ్చివేసే కాలకూ

టాగ్ని లోలోన దాచుకుని, ముల్లోకాలూ ముంచెత్తే అనంతాశ్రు ప్రవాహాల నణచుకుని, కంఠమెత్తి, తగుదునమ్మా అని గానం చేస్తున్నాడు.

ఆ గొంతులో ఆశ విరిసిపోతూంది ; ఆనంద మొగసిపోతూంది; ప్రేమ పొంగి పొనలై పారుతూంది.

ఆ గొంతు భావోద్రేకంవల్ల వణకుతుంది ; నాట్యం జేస్తూంది.

నే నుండ బట్ట లేకపోయాను. నిల బడ్డాను. కుడిచేయీ తర్జనీ ముందుకు చాపాను. మొగమంతా ఒక్కటే కళ్ళుగా విప్పేశాను. గజగజ వణుకు తున్నాను.

“ సముద్రుడా ! ఏమయ్యా సముద్రుడా ! ”

“ ఆఁ ! ఏ వరది ? ఓహోహోహో ! ”

“ ఏమయ్యా ! ఏమి టీ ప్రణయగానాలు ? ”

“ ఓహోహోహో ! ”

‘ ఎక్కడివయ్యా ఈ ఆనంద సంకీర్తనాలు ! ”

“ ఆహాహా ! ”

“ అయ్యయ్యో ! ఎందు కీ ఆటలు ! ఈ పాటలు ! ఈ ఉత్సవాలు ! నీకూ సంవత్సరాది వచ్చిందా ? ”

“ ఓహోహోహో ! నాయనా, మీ కీనిముషమందు నూతనవత్సరారంభ సమయమా ? ఓహో, నా సంవత్సరాదు లెప్పు డెప్పుడో ! నాకు తెలియనే తెలియదు ; తెలుసుకోవాలని తొందరలేదు ! హ్హ హ్హ హ్హ ! నాకు కాలమంతా ఒకటే సంవత్సరాది ! ఆహా ! ఒకటే నిత్యనూతన వసంతం ! ”

“ సెహబాష్ ! నాకు నచ్చినవాడవయ్యా ! సముద్రుడా ! ”

“ హ్హ హ్హ హ్హ ”

“ ఒకటేకాదా, కాలం అంతా నీకూ ఒక్కటేరూపుకాదా ? కాదా పాపం!”

“ ఆహా ! ”

“ ఎంతబాధ నీది! లోకంలో దుఃఖమంతా నిజంగా నీవే. ఈవిశాల విశ్వంలో ఉన్న ఆర్తి అంతా నీదేకదా ! నీవు ప్రవాసులలో చక్రవర్తివి. కేవలము ద్వేష స్వరూపుడవు. సాక్షాత్ శోకాధిష్ఠానదేవుడవు. నీశివ్యపరమాణువు కాదటయ్యా ప్రావృట్కాల పయోధరస్వామి ! ఇంత అనంత విశ్వహృదయంలో నిండిఉన్న నీ ప్రేమకు ఎవరు సమాధానం చెప్పగలరు. శహబాష్, ఎవ రెదురుచూపగలరు ! వినవయ్యా, నాగీతం విను,

నా కుగాదులు లేవు
నా కుషస్సులు లేవు
నేను హేమంత కృ
ష్ణానంత శర్వరిని.
నాకు కాలమ్మొక్క-
టే కారు రూపు నా
శోకమ్ము వలెనె నా
బ్రతుకువలె, నావలెనె.

"ఓహోహో! ఏమి టీవెర్రి వాగాడంబరము! ఆగు! ఆగు! ఓహోహో! ఆగు."

"ఏమయ్యా! ఇ దేమి!"

"ఓహెూ! ఏమా! ఏమా? నాకు శోక మేమిటి! నాకు ద్వేషము కటా! నా ప్రేమకు తిరుగులేదా? ఓహెూ, బాబూ, ఉన్మత్తుడవా? నిష్ఫల ప్రణయం వల్ల తల్లడిల్లిపోయిన ప్రియుడవా! కవివి కూడానా! ఆహాహా! విను, నాయనా, ఇటు విను. నే నెప్పుడూ ప్రేమతో నిండి ఉంటానోయ్! నీ పై నేమిటో చూడు — ఆకాశము. ఆహా, నా లోన చూడు, ఆకాశమే. ఆకాశము నాప్రియు రాలు సుమీ! హ్హా హ్హా హ్హా! మీ కాకాశమంటే ఏమీ లేదు; నాకుంది. ఆకాశం నేనే నిర్మించుకున్నాను; నేనే నా అంత విశాలంగా పరుచుకున్నాను. ఆమె అంత దూరంగా ఉందని నేను కృశించను; నాకు బెంగే లేదు. ఓహోహో! ఆమెను నా ప్రేమతో, ఆదీ అంతూ లేని నా ప్రేమతో నేనే నింపాను. నా ప్రేమ సందేశాలు పంపుతుంటా; అప్పు డామె మబ్బులు మబ్బులుగా పులకరిస్తుంది. ఆహా! ఆమె ప్రణయ వార్తలు నా కందజేస్తుంది; అప్పుడు తరంగాలు తరంగాలుగా జలుజల్లు మంటుంది నా శరీరము. ఆహా, చంద్రకిరణాలు మా కౌగిలింతలు! ఆహా, వర్షబిందువులు మా చుంబనాలు! ఆహా హా హా! నీవే అన్నట్లు ఇంతవిశ్వ విశాల హృదయం ఊరికే ఉండ గలదా? అందుకే అంత ప్రియురాలైన ఆకాశా నికి అనురాగరూపం ఇచ్చుకున్నాను. ఇక నా అంతప్రియు డేడోయి? ఓహెూ, నాయనా, కవివంటావు; ప్రియురాలిని సృష్టించుకోలేనివాడవు కవివా! కావా లంటే, కనురెప్పపాటులో, త్రిభువనైక మోహిని, ప్రణయైకమూర్తి దొరకద టోయ్! ఓ హెూ హెూ! ఓ హెూ హెూ! ఆలోచించు! ఆలోచించు!!!"

ఎంతసేపు అలాగే నిలబడ్డానో ఆ అర్ధరాత్రి ఆమహాసముద్రుని సన్నిధిని, అతని ప్రియురాలైన ఆకాశంసన్నిధిని, ఒక్కణ్ణి !

కొంతసేపయాక నెమ్మదిగా కన్నీళ్లు జారుతున్నాయి రెంపుకళ్ళంటా. అంతలో వెక్కి వెక్కి యేడ్వడం మొదలెట్టాను. ఇంతవఱకు ఎప్పుడూ నేనే యేడవలేదు !

మెల్ల మెల్లగా రోదన విరావము చల్లారింది. నాకు తెలియకుండా చతికిల బడ్డాను.

కూర్చుండి నాగీతా లాలపించడం ప్రారంభించాను. ఎందుకో మొట్ట మొదటి దానితో మొదలెట్టాను. అలాగే చదివాను. చదువుతున్నాను. చదువుతూనే ఉన్నాను.

చదువుతూ ఆగీతామార్గాలలో నే నెరగకుండానే భూతకాలమంతా ప్రయాణం చేశాను. జరిగిపోయిన జీవితమంతా మళ్లీ బ్రతికాను.

ఆవేగము హెచ్చింది. ఆపాదమస్తకమూ వేడివేడైపోయింది. వడవడ వడికే గొంతుకతో, శరీరమంతటితో, బ్రతుకంతటితో, గీతాలు పాడాను, పాడాను. నాటి వరకూ చేసిన పద్యాలన్నీ, ఆ సంవత్సరాది గీతికూడా చదివాను.

ఆ సంవత్సరాది గీతి ఎందుకో వెలితిగా వినబడింది ఈసారి. మళ్ళీ కెవ్వుమని ఏడిచాను. అమ్మా ! అమ్మా ! నేటికి నా యేడుపులో ఎంత ఆనంద ముంది !

నే నా నిముషమందు కొత్తవాణ్ణయానని నాకు తెలిసింది. నాకూ సంవత్సరాది వచ్చిందని నాకు తెలిసింది. అంతేకాదు ; లోకానికివలె ఎప్పుడోకాక సముద్రునికివలె నాకూ నిత్యనూతన వసంత ముదయించిందని తెలిసింది.

కాని ఆరాత్రి మరణించిపోయిన "నేను" కొరకు కూడా తిరుగ జన్మించిన నేను ఆ చివరసారి కొంతవర కేడిచాను సుమండీ ! అందువలననే ఆరోదనములో కొంత వియోగ విషాదము స్ఫురిస్తుంది.

అప్పుడు ప్రశాంతంగా సాగరతీరాన్ని ఉపవసించాను. ఈసారి చల్లగా మళ్లీ నా గీతాలన్నీ చదువుకున్నాను.

ఎందుకొరకో తెలుసునా ?

నా గీతా మార్గాల కిరుపక్కలనీ, నాపూర్వ జీవిత ప్రపంచములో పడున్న సౌందర్య ఖండాలన్నీ ఏరుకున్నాను. నేను పుట్టినది మొదలుకుని ఆనిముషమువరకూ ఏయేపదార్థములో ఏయేవ్యక్తిలో ఏలావణ్యలవం సందర్శించానో దానిని సంగ్రహించాను. తెచ్చి నా హృదయంలో ఒక్కటొక్కటే పెట్టుకున్నాను.

ఆ గీతావీథులనే మళ్ళీ మళ్ళీ వెనుదిరిగి వెడలి, ఇదివరకు నా హృదయమునుంచి అపుడపుడు విరిసిన ప్రేమ లేశాలున్నూ, ఇతర హృదయాలనుంచి నా మీద కురిసిన అనురాగ శకలాలున్నూ, జన్మించినదాది నాటి వరకూ నన్ను సోకిన ప్రణయము ప్రతీదీన్నీ, సేకరించాను. సేకరించి నా హృదయంలో ఒక్కొక్కటే ఉంచాను.

అప్పుడు, కవిరాజును కానూ, రెక్కలు తొడుగుకున్నాను. పదునాలుగు లోకాలు పరుగులెత్తాను — అంటె పదునాలుగు లోకాలూ నా లోనికి వచ్చేశాయన్నమాట! ఎక్కడెక్కడిదో కంటబడిన సౌందర్య మల్లా తెచ్చాను; స్ఫురించిన ప్రే మల్లా తెచ్చాను.

ఒక్క సారి కన్ను మూసుకున్నాను!

ఇంతలో తెరిచాను!

శహబాష్! ఆనందం వల్ల గడగడ వడకాను. అంతలో శాంతించాను. సృష్టి పూర్తి అయింది.

అహో! చతుర్దశ భువనాల్లో, సకలావకాశాల్లో, ఒక్కతే సౌందర్యైక స్వరూపిణి, ఒక్కతే స్వచ్ఛ సుధా పరిపూర్ణ ప్రణయైక మూర్తి.

ఆమె నాది. నా ప్రియురాలు. నేను ప్రియుణ్ణి. నాకు ప్రేమ దొరికింది. సరే, సౌందర్యమూ దొరికింది.

అప్పుడామెకు నామకరణం చేశాను. ఒక నివాసస్థలం కూడా నిర్మించాను. అక్కడే నివసిస్తుంటుంది.

ఇంక లోకంలో ప్రేయసీ ప్రియు లందరి వలెనే కాదు; అందరినీ మించి జీవిస్తాను. ఎందువల్లనంటే, లోకంలో అందరినీ సంతృప్తిపరిచే ప్రేమ కావలిస్తే ఇదివరకే నాకు దొరికి ఉండును!

నా ప్రేమ నేనే ఇట్టిదని నిరూపించలేను.

మే మొకరి నొకరు తాగెయ్యాలి, పీల్చాలి, జీవించాలి. ఒకరి నొకరు ముంచెత్తాలి. ఒకరి నొకరు దహించి వెయ్యాలి. ఒకరిలో నొకరు నిండి అలా అలా

అలా కరిగిపోవాలి, అలా అలా అలా పెరిగిపోవాలి. ఒకరి నొకరు ఒక్కసారే నాశంజెయ్యాలి, బూడిద చెయ్యాలి; విశ్వానికి ప్రళయం రావాలి. ఒకరిలో నొకరు శాశ్వతంగా జీవించాలి; తిరుగ విశ్వం పునస్సృష్టిలో పులకలెత్తాలి.

శాఫో గొప్పకవే, నిజమే; ఎక్కడో విన్నవాణ్ణి వలచింది; కాని విఫలమొంది కృశించింది. పిగ్మాలియన్ భావశీలుడే, యథార్థమే; తాను నిర్మించిన శిలావిగ్రహాన్ని ప్రేమించాడు; కాని 'అయ్యో, ప్రాణము పొయ్య' మని ఎదీనికి మొరబెట్టుకున్నాడు; మరణించాడు. ఉషాకన్య మహానుభావురాలే, ప్రణయినీ రాజ్ఞే, సందేహంలేదు; కలలో చూసిన వాణ్ణి వలచింది; కాని స్వప్నంలోనైనా వాణ్ణి చూసింది; అత డొకా నొక చోట ప్రాణికోటిలో నున్నాడని తెలుసుకుంది. అజుని విలాపం నేటికీ వినబడుతూంది. జేబున్నిసా లోకానికంతా కలకాలానికీ ఒక్కతే భగ్నహృదయురాలైన విరహిణి. ప్రణయ విజయము కొరకు మన్మథుడే భస్మమయాడు; ప్రేమ సాక్షాత్కారంకోసం పార్వతే మొదట బూడిదై పోయింది.

నేను వీరందరినీ మించిన కవిని. భావార్ద్రహృదయుణ్ణి. ప్రణయ రాజ రాజేశ్వరుణ్ణి.

నేను విధాత అంతవాణ్ణి. అతడు సరస్వతిని సృష్టించుకున్నాడు, ప్రేమించాడు, ప్రేమింపబడ్డాడు. నేనూ అంతే.

విక్టర్ హ్యూగో జ్యూలియట్ అనే ప్రియురాలిని దూరంగా ఒక పట్టణంలో ఒక గృహంలో ఒకమూలగదిలో నివసింపజేశాడు. ఎప్పుడో అప్పుడప్పుడు తాను వచ్చేవరకూ తనకు ఉత్తరాలు వ్రాస్తూ వాటి నాగదిలోనే ఒక మూల పడవేస్తూ జీవయాత్ర సాగించమన్నాడు, ఆమె అలాగే చేసింది. అతనికి ఆప్రణయవిశ్వాసముంది ఆమెకూ ఆ ప్రణయవిశ్వాసముంది.

నేనూ నాప్రియురాలిని వ్రాయమన్నాను. నేనూ వ్రాస్తున్నాను. "ఏమివ్రాయను? నేను కవినిగాను. కవిప్రియురాలినని మాత్రం గర్వమొందుతున్నాను. నా ఉత్తరాలు మీకు రుచిస్తాయా?" అనిఅంటుంది.

కాని నాప్రేయసి కూడా కవే. ప్రేమ ఆమెను కవిని జేసింది; నా అంత కవినీ జేసింది. అనేకవిషయాలలో ఆమె కద్భుతమైన ధీశక్తినీ, తేజస్సునూ ఇచ్చింది.

సరి, ఆ ఉత్తరాలు ఇక మీరే చదువుతారు. వాటిచరిత్రముమాత్రము యదార్థమని మీరుగ్రహించి ఉంటారుగదా ఇప్పటికి! కాని నాప్రియురాలు నాకొక్కనికే కాని తనదివ్యరూపసందర్శనం లభింపజేయదనీ గ్రహించి ఉంటారు.

నాప్రత్యుత్తరాలూ చదువుతారు; వాటితో అప్పుడప్పుడు నాకొత్తగీతాలూ వింటారు.

ఇదివరకు నాహృదయంలోనికి తేజస్తమస్సులతో, జీవమృత్యువులతో భూతభవిష్యత్తులు గుమిగూడి, "నీవు మాకు వినిపించే దేమిటి ?" అని ప్రశ్నించి నట్టుండేది ! "ఏదీ, నీసందేశము ?" అని ఈ మహావిశ్వమంతా నాకంఠద్వారమువద్ద నిలిచి తట్టి నట్టుండేది. నాజీవితభార మప్పటికి తొలగిపోలేదు; నావిషాదగీతాలద్వారా పూర్తిగా కరిగిపోలే దది. నాహృదయేశ్వరి నాగొంతుచెర విప్పివేసింది; పాడమంది. సాధన అయిందని హెచ్చరించింది. అగ్నిపరీక్ష అవసర మంటుంది; అది నాగీతాలకు మరీలోతూ మరీఔన్నత్యమూ ఇచ్చిందని పొగడుతుంది. ఆగీతాలే ఈగీతాలకి కారణ మంటుంది. నేనొక్కణ్ణే జీవించినవాణ్ణి, జీవిస్తున్నవాణ్ణి అని మెచ్చుకుంటుంది.

ఓహో ! ఇక వినండి, క్షీరసాగరగర్భంనుంచీ, కైలాసపర్వతశృంగంనుంచీ, అణువణువునుంచీ, ప్రతికీటకమునుంచీ నేను పంపే ప్రేమసందేశాలు, ఆనందసందేశాలూ కల్యాణసందేశాలు ! ! ఇక పఠించండి మాప్రణయలేఖలు నాపద్యాలున్నూ ! ! !

తారావళి

కొమాండూరు కృష్ణమాచార్యులు

*

తరుణి, సమున్నతాగ్రములు తాళఫలప్రతిమానముల్ మనో
హరములు పీనవృత్తకఠినాకృతులైన భవత్కుచంబులన్
ఖరనఖరాంకుశాగ్రముల ఖండశశాంక మనోజ్ఞ చిహ్నముల్
కర మనురక్తి నిల్పుట కఖండతపం బెవ డాచరించెనో !

నీవక్షోజ విశాలసౌధవలభీ నిశ్శ్రేణికాకారమై
పూవిల్కాని కరాళ ఖడ్గలతమై పుండ్రేక్షుచాపాయత
జ్యావల్లీసమమై కుచద్వయ ఘటీయంత్రస్ఫురద్రజ్జువై
భావంబున్ హరియించె రోమలతికాపాశంబు శాతోదరీ !

కాంచనకుంభగౌరవము గాంచి భుజద్వయ పుష్పమాలికో
దంచితమైన చందన రసార్ద్ర భవత్కుచ మండలంబు భా
వించెద పంచసాయకున కెత్తిన మంగళకుంభయుగ్మకం
బంచు మదీయచిత్తమున నబ్జదళాయతచారులోచనా !

నతనాభీహ్రదవారిసేచనమున న్నానాటికిన్ దీర్ఘమై
అతివా, తాల్చె త్వదీయరోమలత నవ్యామోదగుచ్ఛద్వయం
బతివేలం బగు నూత్నయౌవన వసంతారంభవేళన్ మధు
వ్రత ఝుంకారసమాకులంబుగ విటవ్రాతంబు ఘోషింపగన్.

నతనాభీ సరసీవినిర్గత మిళిందశ్రేణి రోమావళీ
ప్రతిరూపంబున నీకుచస్తబక సౌరభ్యార్థియై యేగెనో
అతివా, నీకమనీయ యౌవనమహోద్యానంబులో మంజరీ
తతులన్ భృంగము లాశ్రయించినవి చిత్రం బేమి వీక్షింపగన్.

భామగభీరనాభి యను పల్వలతీర్థమునం జనించె సు
శ్యామల రోమరాజిమిష చారుతరం బగు నారికేళపుం
భూమిరుహంబు వృత్తకుచభూరిఫలద్వయితోడ మన్మథో
ద్దామ నిదాఘ ఖిన్న జనతాప నిరాకరణాతిహారియై.

కటి గగనాంగణస్థలిని కమ్రవరోమజలదాగమంబునం
బటుతరహార వైద్యుత విభారమణీయ పయోధరంబు లు
త్కట విటబర్హిసమ్మద విధామధురంబుగ దోచె కాంత, వి
స్ఫుట నవరోమరాజి జలపూరము నాభిహ్రదంబు జేరగన్.

సతి, రోమావళినీలధూమలత నిశ్శ్వాసానిలాంకూర సం
గతమై దివ్యపయోధరాంగణము దాకన్ వ్యాప్తి జెందంగ దా
మతి నూహించెను కాళిదాసుడు జగన్మాన్యుండు ధూమాదిమా
రుతి సంఘాతముగా బయోధరములన్ రోలంబనీలాలకా!

బాలా, రోమలతామిషంబున భవద్వక్షోజ శైలస్థలిన్
నీలాకారమనోజ్ఞ ధూమలతికానిష్ఠన్ విలోకింపగా
జ్వాలున్ వహ్నికి సత్వ మచ్చుటను నోపూబోణి, కాకున్నచో
నేలా మాన్పును శీతబాధ నవియున్ హేమంతకాలంబునన్?

తనదుత్తుంగ కుచోరుమూర్ధము సుదీర్ఘస్నిగ్ధరోమావళీ
ఘన శుండంబు త్వదీయ యౌవనమహాగంధద్విపేంద్రంబు పా
వన గంభీర మదీయ మానససరోవారం బ్రవేశించె భీ
షణ తీక్ష్ణాగ్రవిషాణఖండిత పయోజస్తోమ భీమంబుగన్.

బాలమృణాళతంతువును బోరని నీకుచమధ్యమందు ని
లాలక లగ్నమైనహృదయాంబుజమున్ మరలింపజాల నో
బాల, ధనంజయాత్మజుడు వైరులు పన్నినతమ్మిమొగ్గరం
బాలము సేయజొచ్చినటు లయ్యెను వెల్వడ నేర్పు చాలమిన్.

నీరోమావళి మోహనాళ లుళిత స్నిగ్ధ స్తనాయశ్శిలా
గోళద్వంద్వ విశీర్ణధైర్యుని ననుం గ్రూరుండు మారుండు ప్ర
త్యాలీఢ స్థిరపాదుడై వెస మహాయాసంబు నొందించెడున్
బాలా, నీభుజవప్రగుప్తి గనినన్ భంజించెదన్ శాత్రవున్.

ఘననాభీగుహనుండి రోమలతికా కాకోదరం బున్నత
స్తన దుర్గాభిముఖంబుగా నరుగు తత్సంరంభ మీక్షింపగా
జనియించెన్ భయకంప ఘర్మకణముల్ చంద్రాస్య, రక్షింపు మీ
జనునిన్ నీమధురాధరోదిత సుధాసార ప్రదానంబునన్ !

మధురరతాంత ఘర్మకణ మౌక్తికజాల పరిష్కృతంబులై
ప్రథమసమాగమాంతమున భాసురగాత్రి, భవత్కుచాగ్రముల్
మథితసముద్ర మధ్యగత మాఘవన ద్విపకుంభ యుగ్మక
ప్రథిత విలాససంపదల భాసిలు నంచు దలంతు నెమ్మదిన్.

స్తననీహార గిరీంద్రశృంగ నిపతత్తారావళీ గంగయున్
ఘననీలాద్భుత దీర్ఘరోమలతికా కాళిందియుంగూడ ద
ద్వన సంభేదమునందు గ్రుంకి తరుణీ, పంచాస్త్రసాయుజ్యముం
గని ధన్యత్వము గాంతు నీమధురసంకల్పానుసారంబుగన్.

వనితా, మౌక్తికహారభూషిత భవద్వక్షోజయుగ్మంబు నా
క నదీ నిర్మలవారిపూర విలసత్కైలాస శైలాకృతిం
గని తద్భూధర వాసియైన శివునిన్ గౌరీమనోనాయకున్
నిను న న్నేకము చేయ వేడెదను నిర్నిద్రానురాగంబునన్.

*

ధర్మసంస్థాపనము

శ్రీ శ్రీనివాస శిరోమణి

౧

౧౯- సంవత్సరము మార్చి ౧౫, ౧౬, ౧౭, తేదీలలో మద్రాసులో శ్రీ వాసుదేవరావు " వర్ణవ్యవస్థ " ను గురించి ఉపన్యాసాలు ఇస్తాడని పత్రికలన్నీ ప్రకటించినవి.

శ్రీ వాసుదేవరావు అదివరలో వందేమాతరోద్యమములో పనచేసి ఆరు మాసములు కఠినశిక్షకూడా అనుభవించినాడు. అతను జయిలులోఉన్న కాలములో అహోరాత్రములూ దేశక్షేమాన్నిగురించి యోజనచేసి , దేశములో నిజముగా జరగవలసినది సాంఘికపు మార్పేకాని, రాజకీయపు మార్పుకాదని నిశ్చయించుకున్నాడు. అతను జైలునుంచి వచ్చేసరికి ఆ ఉద్యమము చల్లారిపోయింది. అంతట అతను సాంఘిక విషయాలను సమగ్రముగా పరిశీలన చేయదలచుకుని గ్రంథావలోకనము చేయడానికి కలకత్తా వెళ్ళినాడు. అచ్చట ఇంపీరియలు గ్రంథ భాండాగారములో కూర్చుని ప్రాచీన ధర్మశాస్త్రజ్ఞుల గ్రంథములనూ, పాశ్చాత్య సాంఘిక వేత్తల అభిప్రాయములనూ, అయిదారు సంవత్సరములు సంపూర్ణ పరిశ్రమచేసి కూలంకషముగా గ్రహించి హిందూసంఘములో జరుగవలసిన మార్పులను నిశ్చయించుకుని తన అభిప్రాయాలను లోకానికి వెల్లడిచేయడముకోసరము ముస్ముందు మద్రాసులో ఉపన్యాసాలు ఇవ్వదలచుకున్నాడు.

అతను మార్చి ౧౪ వ తేదికే మద్రాసు వచ్చినాడు. అతని అక్కగారు క్వీన్ మేరీ కళాశాలలో బి. ఏ. జూనియరు తరగతిలో చదువుతున్నది. ఆమె నతను చూసి అప్పటికి అయిదుసంవత్సరములు గడచిపోయినవి. అత నారోజు సాయంత్రము ఆమెను చూడడానికి కళాశాలవసతిగృహముకు వెళ్ళినాడు. అతను సాయంత్రము అక్కడికి వస్తాడని ఆమెకూ ఆమెగదిలోనే ఉంటున్న సహాధ్యాయినికీ తెలుసును.

సుమారు అయిదున్నర గంటలప్పుడు సాయంత్రము అతను వసతిగృహానికి వచ్చినాడు. గడ్డమూ, అందుకుతోడు మెడలేని చొక్కా, జీరాడే కుచ్చెళ్ళూ, బిళ్ళగోచీ, మేజోడు, బూడ్సులూ, ఇవన్నీ చూస్తే అతను కేవలము బాంగ్లావాడిలాగా

ఉన్నాడు. అతనిముఖము గుండ్రనిదే అయినప్పటికిన్నీ గడ్డము కొనతేలేటట్టు కత్తిరించడమువల్ల కోలముఖముగా కనబడుతుంది. ఆనల్లనిగడ్డమువల్ల అతని ముఖము మేఘావృతమైన చంద్రబింబములాగా ఉంది. వసతి గృహములో ఉన్న విద్యార్థినులు మొదట అతను రమణమ్మతమ్ముడని అనుకోలేదు; అయితే అతనినేత్రద్వయాన్ని వారు బాగా చూచినతరువాతమాత్రము ఆమెతమ్ముడయి ఉంటాడని నిశ్చయించుకున్నారు.

ఆ నేత్రములు విశాలములు. ముఖము ఎంతప్రశాంతముగా ఉంది ఔదార్యమునూ, కారుణ్యమునూ, సూచిస్తున్నదో ఆలోచనద్వయము అతనిలో ఉన్న ద్రఢిమను అంతప్రస్ఫుటముగా వ్యక్తము చేస్తున్నది.

అతను సహజగంభీరగమనముతో గది సమీపించడము చూసి రమణమ్మ వెంటనే వరండాలోకి వచ్చి అపరిమితానందముతో, " వాసూ, ఎంత మారిపోయినావురా ! రా, లోపలికి, " అన్నది. అత నామెవెంట గదిలోకి వెళ్ళి అక్కడ ఉన్న కుర్చీలో జేరగిలబడి కూర్చున్నాడు.

అక్కడ రమణమ్మ బల్ల దగ్గరగా షుమారు ఇరవైసంవత్సరాల యువతి తల కొంచెము వాల్చి ఓరకంటితో వాసుదేవరావును చూస్తూ నిలుచున్నది. సీత కాయ పారుమనిషి. కొంచెము పొడుగయినదే అని చెప్పవచ్చును. ఆమె ఎర్రనిచీర ధరించి ఉన్నది. ముఖాన బొట్టులేదు. మెడలో ఒకటిరెండు నగలుమాత్రమే ఉన్నవి. చేతులకు రెండుజతల బంగారుగాజు లున్నవి. కాళ్ళకు ఏ ఆభరణములూ లేవు. తల వంచుకునే ఉన్నది. కొనతేలిన ఆమె గడ్డమూ, దొండపండ్లవంటి ఆమె పెదవులూ, కొనతేలి వంకరతిరిగిన ఆమె నాసికా, ఉన్నతములయిన ఆమె గండస్థలములూ, బాదము ఫలములను బోలిన ఆమె నేత్రములూ, విశాలమై ఉన్నతమయిన ఆమె ఫాలభాగమూ, నొక్కులు నొక్కులుగా ఉన్న ఆమె వెంట్రుకలూ, పిరుదుల వరకూ వ్రేలాడుతున్న ఆమెజడా, ఎంతో హృదయంగమముగా ఉన్నా ఆమె ముఖములో అనంతమైన – అపారమైన–అఖండమయిన–దైన్యము అతనికి కనబడినది. ఆమె ముఖములో ప్రస్ఫుటముగా ఉన్నదైన్యము అతని కోమల హృదయాన్ని తత్క్షణమే ఆకర్షించింది. ఆమె ఎందు కంతదైన్యముగా ఉన్నదో తెలుసుకోవలెనని కుతూహలము పుట్టింది. అక్కగారి నేదో ప్రశ్నించబోయినాడు. అప్పుడే ఆమె సీతను చూపిస్తూ " వాసూ, ఈ అమ్మాయి ఎవరో నీకు చెపుతాను. ఈమె నా సహాధ్యాయిని. నాకీమె అంటే చాలాప్రేమ. ఈ అమ్మాయిది విశాఖపట్నము జిల్లా, ఈమె తండ్రిగారు మన ఊళ్ళో పూర్వము తహశీలు దారీ చేసిన వెంకటరావుగారు. ఈమె చాలా తెలివిఅయినది. పేరు సీత, " అన్నది.

ఆమెను వాసుదేవరావు సాలోచనముగా చూసినాడు. ఎంతో ఉత్సాహముగా ఆమెతో మాట్లాడవలె ననుకున్నాడు. కాని ఆమె ముఖములో కనబడుతున్న దైన్యమువల్ల అతని ఉత్సాహమంతా నశించిపోయింది. అయినప్పటికిన్నీ లేని ఉత్సాహాము తెచ్చిపెట్టుకుని లేచి ఆమె కరస్పర్శచేసి "మిమ్ములను ఈ రోజు చూసినందుకు చాలాసంతోషముగా ఉన్నది. మీ నాయనగారిని కొద్దిగా ఎరుగుదును. కాని వారితో నాకు అట్టే పరిచయము లేదు, " అన్నాడు.

" చిత్తము. మీబోటి మహాపురుషులను సందర్శనము చేసినందువల్ల నా జన్మ ధన్యమయింది. "

" అయ్యో, సామాన్యుణ్ణి అలా అనకండి. "

" చిత్తము, అలాకాదు. ఈకాలములో సంఘముకోసరము జీవితమంతా ధారపోస్తున్నది మీరొక్కరే, మీబోటివారు కాకపోతే మహానుభావులు ఇంకా ఎవరు ? "

" ఏమో నాబోటివారు ఇంకా ఎందరున్నారో ఈ లోకములో, అయినా ఇంతమాత్రముకే నేను మహానుభావుణ్ణి కాజాలను. "

ఆమె ఏమీ మాట్లాడకుండా నిలుచున్నది. ఆమెను కూర్చుండమని రమణమ్మ చెప్పింది. రమణమ్మ ఏవేవో సంసారవిషయాలను గురించి వాసుదేవరావుతో ముచ్చటించసాగింది. అతనయితే ఏవో సమాధానములు చెప్తున్నాడు కాని అతని మనస్సంతా సీతమీదనే లగ్నమయింది. ఆమెనుగురించే అతని మనస్సు పరిపరి విధాల యోజిస్తున్నది. నవయౌవనములో ఉన్న ఆమె ఎందుకంత దీనముగా ఉన్నదో అనే జిజ్ఞాసలో పడిపోయినాడు. ఏమీ తోచలేదు. తదేకముగా ఆమెను చూడడము మొదలుపెట్టినాడు.

రమణమ్మా, వాసుదేవరావూ ఏవో స్వవిషయాలు మాట్లాడుకుంటూ ఉండడమువల్ల తాను వెళ్ళిపోతానని చెప్పి సీత వారిద్దరిదగ్గిరా సెలవు తీసుకుని వెళ్లిపోయింది. ఒకటి రెండు పర్యాయములు ఆమెనుగురించి అక్కగారి నడగబోయినాడు. ఆమెనుగురించి అడిగితే అక్కగా రేమనుకుంటుందోనని ఊరుకున్నాడు. కాని అలా అని ఆమెనుగురించి ప్రశ్నించకుండా ఊరుకో లేక పోయినాడు. చివరకు " అక్కయ్యా, నీవు ఇందాక చూపించినసీత వితంతువా యేమిటి ? " అన్నాడు వాసుదేవరావు.

" నీవు ఎందుకువల్ల అలా అనుకున్నావు " ? అన్నది రమణమ్మ.

" ఏమీ లేదు. మనదేశములో ఉన్న బాల వితంతువుల ముఖాలలో సాధారణముగా కనిపించే దైన్యము ఆమెముఖములో నాకు కనబడ్డది. పయిగా ముఖాన బొట్టు లేదు."

" నిజంగానా ? "

" అవును. "

" కాని సీత వితంతువు కాదుసుమా ! "

ఆశ్చర్యముతో " ఏమిటి ? " అన్నాడు వాసుదేవరావు

" ఆమె వితంతువుకాదు. "

" వాస్తవముగానా ? "

" వాస్తవముగానే. అయితే ఆమె దొక పెద్దగాథ— "

" ఆగాథ నేను తెలుసుకోవచ్చునా ? "

" నీకు అనేకపర్యాయములు ఆమె చరిత్ర అంతా ఉత్తరము వ్రాతామనుకున్నాను. కాని స్వయముగా చెప్పదలచి వ్రాయలేదు. "

" అయితే ఏమిటో చెప్పు వింటాను. "

" ఇప్పుడు సమయము కాదు. ఎందువల్లనంటే ఆమె చరిత్ర ఎటువంటి కఠిన హృదయాన్ని అయినా కరిగించి వేస్తుంది. అందులో నీబోటి కోమలహృదయము అసలే కరిగిపోతుంది. ఆమె చరిత్ర ఇప్పుడు చెప్పేట్లయితే నీవు ఆమెగొడవలో పడిపోయి రేపుసాయంత్రము ఉపన్యాసాలు ఇవ్వకుండా వెళ్లిపోతావు. తర్వాత సావకాశముగా చెపుతానులే. "

" కాదు చెప్పు, ఫరవాలేదు. నేను వచ్చినపని మరిచిపొయ్యేటంత అవ్యక్తుణ్ణి కాను. "

" కావచ్చును. కాని సావకాశముగా ఆమెనుగురించి చెపుతాను. ఇప్పుడు కాదులే. "

" నీవు ఇట్లా చేయుడమువల్ల నాకు కుతూహలము ఎక్కువయి పోతుంది. "

" ఈమాత్రము కుతూహలము చంపుకోలేక పొయ్యేట్లయితే నీవు ఏవో ఘనకార్యాలు ఎలాచేస్తావు ? "

వాసుదేవరావు ఏమీ మాట్లాడలేదు.

రమణమ్మ చిరునవ్వుతో " ఏమీ అనుకోవద్దు. తరువాత తప్పకుండా చెపుతానులే " అన్నది. ఏవేవో కబుర్లు మాట్లాడి చీకటిపడుతున్నప్పుడు వాసుదేవరావు అక్కడినుంచి వెళ్లిపోయినాడు.

౨

మద్రాసులో ఉపన్యాసాలు అయిపోగానే రాజమహేంద్రవరములో ఉపన్యాసాలు ఇవ్వడానికి వాసుదేవరావు ఒప్పుకున్నాడు.

మూడురోజులూ ఉపన్యసించే సరికి మద్రాసులో ఉన్న అనేకమంది పత్రికాధిపతులూ లాయర్లూ, జడ్జీలూ, వాసుదేవరావు అభిప్రాయాలను ఎంతో మెచ్చుకున్నారు. హైకోర్టు జడ్జీలలో ఒకరు అతనితో స్వయముగా అనేక విషయములు చర్చించి తెలుసుకోవడముకు అతిథిగా ఆహ్వానముకూడా చేసినారు. ఉపన్యాసాలు ఇచ్చిన మూడురోజులూ అతనికి పెద్ద పెద్ద వారందరితో పరిచయము కలగడము నుంచి తీరికలేక ఎక్కడికీ కదలడానికి వీలులేక పోయింది. నాలుగోరోజు జడ్జీగారితో అతనికి సరిపోయింది. ఇందువల్ల అతను తిరిగి అక్కగారిని కలుసుకోవడానికి అవకాశము కలగలేదు. పైగా ఆరోజున రాజమండ్రముకు బయలుదేరి వెళ్ళకపోయ్యేట్లయితే పెద్దమనుష్యులకు ఆశాభంగము కలుగజేసినట్లు అవుతుందని వెళ్లిపోయినాడు.

అయితే అతనెక్కడికి పోయినా అతనికళ్ళలో సీతే మెలుగుతున్నది. రోజురోజుకు సీత చరిత్ర తెలుసుకోవలెననే వ్యగ్రభావము ఎక్కువయి పోయింది. ఆమెను చూసివచ్చిన తరువాత పదిహేనురోజుల వరకూ అతనికి విశ్రాంతిలేక పోయింది. చిట్టచివరకొకనాడు సీత చరిత్ర ఏమిటో వ్రాయవలసిందని అక్కగారికి అతను ఉత్తరము వ్రాసినాడు. ఉత్తరము టపాలో వేసింది మొదలు ప్రతిరోజూ జవాబు కోసరము ఎదురుచూడడము మొదలు పెట్టినాడు. అయిదురోజులయిన తరువాత రమణమ్మ దగ్గరనుంచి ఉత్తరము వచ్చింది. ఆఉత్తరము వాసుదేవరావు ఇట్లా చదువుకున్నాడు.

క్వీన్ మేరీ కళాశాల
మద్రాసు

వాసూ,
ఏప్రిల్ ౮

నీవుత్తరము అందింది. సంగతులు తెలిసినవి. సీత చరిత్ర అడిగినావు. సీతనే తన చరిత్ర అంతా వ్రాయమన్నాను. వ్రాయడము కన్న స్వయముగా చెపితే బాగా ఉంటుందని ఆమె సలహా ఇచ్చింది.

మాకు వేసంగి సెలవులు ఎల్లుండినుంచీ ఇస్తారు. ఈసెలవులకు నేను రాజమండ్రి అన్నయ్య దగ్గిరికి రాదలచుకోలేదు. మద్రాసులోనే ఉందామని ఉంది.

" సాంఘిక పునర్నిర్మాణము " ను గురించి నీవు వ్రాసిన పుస్తకాలు అచ్చువేయించవలసినట్లు నీవు ఇక్కడికి వచ్చినప్పుడు చెప్పిఉన్నావు. నీవుకూడా ఇక్కడికివస్తే

పుస్తకాలు అచ్చు వేయించుకోవచ్చును. సీతకూడా సెలవులలో నాదగ్గరే వుంటా నంటున్నది. పైగా నీవు నేర్పేట్లయితే బాంగ్లాభాష నేర్చుకోవలెనని సీత యెంతో అభిల షిస్తున్నది. కాబట్టి నీవు వచ్చేట్లయితే ఒకరోజు ముందుగా తెలియజేస్తే వేసంగిసెల వులలో మనము ఉండడానికి ఇల్లు సముద్రసమీపములో అద్దెకు తీసుకుంటాను. నీవూ నేనూ కలిసిఉండి ఇప్పటికి ఎంతో కాలమయిపోయింది. నీవువస్తే ఎంతో సంతో షిస్తాను.

రమణమ్మ.

ఈ ఉత్తరము చూసుకుని వాసుదేవరావు కొంచెముసేపు దీర్ఘముగా ఆలో జించినాడు. రెండు మూడు పర్యాయములు చదువుకున్నాడు.

టపావేళకాగానే తానునాల్గు అయిదురోజులలో మద్రాసు వస్తూ ఉన్నట్లు ఉత్తరము వ్రాసినాడు. వాసుదేవరావు మద్రాసు వస్తాడని సీతా, రమణమ్మా ఎంతో సంతోషించినారు. వారు తిరువలిక్కేణిలో సముద్ర ప్రాంతాలలో ఒక చిన్నయిల్లు అద్దెకు తీసుకున్నారు. నాల్గురోజులయిన తరువాత అతను మద్రాసు వచ్చినాడు.

అతను వచ్చినతరువాత నాల్గు అయిదు రోజులదాకా అక్కడి పెద్దమనుష్యు లను చూడడముతో కాలముగడిచిపోయింది, పుస్తకాలు అచ్చువేయించడమునకు ముద్రాక్షరశాలలకు తిరగడముతో మరి రెండు మూడు రోజులయిపోయినవి. ఒక వారమురోజులకు అతనికి విశ్రాంతి చిక్కింది. ఆపాళంగా సీతకు బాంగ్లాభాష నేర్ప డము మొదలు పెట్టినాడు.

ప్రతిరోజూ అతను రమణమ్మను సీతచరిత్ర ఏమిటో చెప్పమని అడగవలెనను కుంటాడు. అలా అడిగితే తన అభిప్రాయాన్ని ఆమెగ్రహించలేక అపార్థముచేసుకుం టుందేమో నని అనుమానపడి అడగడము మానివేసినాడు. ఇంకా బాగాపరిచయ మయిన తరువాత సీతనే స్వయముగాఅడిగి ఆమెదైన్యమునకు కారణమేమిటో తెలు సుకోవచ్చునని మనస్సు సరిపెట్టుకుని ఊరుకున్నాడు

అతను మద్రాసువచ్చి అప్పటికి ఇరవైరోజులుపైగా కావచ్చింది. ప్రతి రోజూ రమణమ్మా, సీతా, అతనూ బీచికి షికారు వెళుతుండేవాళ్లు. వాసుదేవరావామెతో అనేక విషయాలు యథేచ్ఛగా మాట్లాడుతున్నాడు. ఆమెకు బెంగాలీపాఠము చెప్పే టప్పుడు ఎన్నెన్ని సంగతులో ఆమెకు చెపుతున్నాడు. ఏలాగైనా ఆమెసంగతి సంద ర్భములు తెలుసుకోవలెనని ఎన్ని ప్రయత్నాలో చేసినాడు, కాని ప్రయోజనము లేకపోయింది. ఆమెకెన్ని ఉత్సాహజనకములయిన విషయములు చెప్పినా ఆమె ఏమీ చలించలేదు. ఆమె ఎందువల్లనో దుఃఖాన్నికానీ సంతోషాన్నికానీ ప్రస్ఫుటముగా వెల్లడి చేయలేకుండా ఉన్నట్లు కనిపెట్టినాడు.

ఆమె బాలవితంతువేమో అనుకున్నాడు వాసుదేవరావు. అయితే ఆమె వితంతువుకాదని రమణమ్మ గట్టిగా చెప్పింది. అయితే ఆమె ఎందుకంత విషాదము అనుభవిస్తున్నదా, అనే ప్రశ్న కలిగింది. ఆమె ఏదైనా అపచారము చేసినందువల్ల భర్త ఆమెను వదిలివేసినాడేమో ననుకున్నాడు. అంత అమాయకపు మనిషి అపచారము చేయదనీ, చేయజాలదనీ ఉత్తరక్షణములోనే తిరిగి నిశ్చయించుకున్నాడు. ఎంత యోజించినా, ఆమెకంత కష్టము, అంత దైన్యము ఎందుకో నిర్ణయించలేకపోయినాడు.

ఇక ఆమెను పరీక్షచేయదలచుకుని ఎన్నో హాస్యరసపూరితములయిన కథలు చెప్పినాడు. ఆమె నవ్వలేక పోయింది. పరమ విషాదోదంతములు చెప్పినాడు. సంతోషమున కెంత తావు ఆమెముఖములో కనుపించిందో దుఃఖముకు కూడా అంతే తావు కనుపించింది. అతని కేమీ తోచింది కాదు. అతను మద్రాసువచ్చి నెలపయిన అయిపోయింది. సీతను మొదట చూసినప్పు డామెను గురించి అతని కెంత తెలుసునో ఇప్పుడూ అంతే. ఆదీనముఖాన్ని చూసినకొద్దీ అతని హృదయము తరుగుకుని పోవడము మొదలుపెట్టింది.

ఒకనాడు సాయంత్రము రమణమ్మ వాసుదేవరావూ సముద్రము దగ్గిరికి షికారు పోయినారు. సీత ఆవేళ ఏదో చదువుకుంటూ ఉండి వారితో షికారుకు రాలేదు. ఎప్పటిమాదిరిగా ఏవేవో కబుర్లు రమణమ్మ చెప్పడము మొదలు పెట్టింది. వాసుదేవరావు ఊ కొడుతూ కబుర్లన్నీ ఆలకిస్తూనే ఉన్నాడు. కాని అతని మనస్సు అక్కడలేదు. చాలాసేపటికి రమణమ్మ అతను తనకబుర్లు వింటున్నట్లు లేదని గ్రహించింది, అక్కడికి వచ్చినప్పటినుంచీకూడా ఏదో పరధ్యానముగానే అతను ఉన్నట్టు తెలుసుకుని, "ఏమిరా, వాసూ అట్లా దిగులుగా ఉన్నావు?" అన్నది రమణమ్మ.

"దిగులేమీ లేదు. ఒకవిషయాన్ని గురించి దీర్ఘముగా ఈమధ్య ఆలోచిస్తున్నాను, ఏమీ అంతుచిక్కలేదు" అన్నాడు వాసుదేవరావు.

"ఏమిటా విషయము?"

"ఆవిషయము నీకు సంబంధించినది కాదులే." 'నీకు' అనే శబ్దోచ్చారణను బట్టి రమణమ్మ వెంటనే గ్రహించి, "అయితే సీతకు సంబంధించిన విషయమా ఏమిటి?" అన్నది.

"సీత విషయమేమిటో నాకు తెలిస్తేగా ఆలోచించడానికి?"

"సీత నీకు చెప్పనేలేదూ ఇంతవరకూ?"

"లేదు."

"అయ్యో సీత ఇదివరకే చెప్పివుంటుందని నేను చెప్పలేదు సుమా! ఇప్పుడు చెప్పేదీ సీత సంగతి?"

“ చెప్పు ”

“ అయితే విను, చెపుతాను. ”

3

సీత వెంకటరావుగారి పెద్దకూతురు. ఆయనకు మొగపిల్లలెవరూ లేరు. ఇద్దరు ఆడపిల్లలు. రెండో పిల్లది ఇప్పుడు విశాఖపట్నములో నాల్గోఫారము చదువుతున్నది. మొగపిల్లలులేని కారణమువల్లనైతేనేమి, పెద్దకొమార్తె అయిన కారణమువల్లనైతేనేమి, సీత అంటే తలిదండ్రులకు పరప్రేమ. సీతను పురాణప్రసిద్ధమయిన సీతలాగా తండ్రి చేయదలచుకున్నాడు. ఆమెకు సమస్తవిద్యలు చెప్పించదలచుకున్నాడు.

కాలు కదిలితే కందిపోతుందని సీతను తల్లి అతి గారాబముతో పెంచింది. వెంకటరావు సంపన్న గృహస్థు. అంతేకాకుండా డిప్యూటీకలెక్టరుఅయినందువల్ల నౌకర్లూ చాకర్లూ ఉండడముచేత భూమిమీద కాలుపెడితే ఏలా ఉంటుందో సీతకు చాల్కాలము వరకూ తెలియనే తెలియదు. ఆమెకు అక్షరాభ్యాసము అయింది మొదలు తండ్రి స్వయముగా శ్రద్ధ తీసుకుని ఇంటివద్దనే చదువుచెప్పడము మొదలు పెట్టినాడు. పదేళ్లువచ్చేసరికి ఆమె నాల్గోతరగతి పరీక్ష అయింది. ఇంగ్లీషు చదువు ఆమెకు చెప్పించవలెనని తండ్రి నిశ్చయించుకున్నాడు. ఆయన అక్కలు, అత్తగారు మొదలయిన స్త్రీలంతా “ ఆడపిల్లకు ఇంగ్లీషుచదువేమిటి? ఉద్యోగము చేస్తుందా? ఊళ్లు ఏలుతుందా?” అని గోలకత్తినారు. అయితే ఆ మాటలు వెంకటరావు లెక్క చేయలేదు. ఇంతలో సీత అదృష్టవశాన ఆయన విశాఖపట్నముకు బదిలీ అయినాడు.

అక్కడ ప్రత్యేకము ఆడపిల్లలకు హైస్కూలుఉంది. వెంకటరావు విశాఖపట్నము రాగానే బంధువులెంత చెప్పినా వినకుండా సీతను హైస్కూలులో ఫస్టుఫారములో చేర్పించినాడు. సీతకు పదమూడో సంవత్సరము వచ్చేసరికి మూడోఫారము చదువుతున్నది. సీతకు పెండ్లి చెయ్యమని బంధువులంతా గోలపెట్టడము మొదలుపెట్టినారు. సీతకు రజస్వలానంతర వివాహము చేయవలెనని వెంకటరావుగారి అభిప్రాయము. అయితే ఈ అభిప్రాయము అతను పైకి వెల్లడించలేదు. సమీపబంధువులు గోలపెట్టడమూ, ఎరిగినవాళ్లూ ఇరుగుపొరుగులవాళ్లూ ఎగతాళిచేయడమూ చూడగా చూడగా ఆయనకూ ధైర్యము కొంచెము చలించింది. తీరా పిల్లది రజస్వల అయిన తరువాత తగిన వరుడు దొరుకుతాడో దొరకడో అనే సందేహము కలిగింది. ఈ సందేహము కలగగానే పిల్లదాని భవిష్యత్తును గురించి రకరకాలుగా ఆయనకు యోజనలు పోయినవి. వరుడు తగినవాడు దొరకని కారణాన్నిబట్టి చివరకు పిల్లకు అసలు వివాహమే కాదేమోనని కూడా తోచింది. ఇటువంటి ఊహా పరంపరలలో

చిక్కుకొని కర్తవ్యాన్ని నిశ్చయించుకోలేక పోయినాడు. పోనీ ఆయనకు కలిగిన సందేహాలను నివారణచేయగల మిత్రులయినా లేకపోయినారు.

“ పిల్లది పెద్దది అవుతున్నది. కులములో వెలివేస్తార”ని ఒకచెంప భార్యా హమేషా పోరడము మొదలుపెట్టింది. ఆయన ఎన్ని విధాల ఆలోచించినా ధైర్యము కలగలేదు. తలి దండ్రులను ప్రతిఘటించి రజస్వలానంతర వివాహము చేసుకున్న యువకుడు ఈదేశములో ఒక్కడయినా ఉన్నట్టు ఆయనకు ఎక్కడా కనుపించలేదు. చివరకాయన కొక ఊహ తోచింది. సంఘసంస్కారాణాభి లాషి అయిన వారి కొమారుడి కెవరికైనా కూతురి నిచ్చి వివాహముచేస్తే పదహారు పద్దెనిమిది సంవత్సరాలు వచ్చేదాకానైనా పునస్సంధానము చేయకుండా ఉండవచ్చుననీ కనీసము స్కూలు ఫయినలు పరీక్షవరకయినా పిల్లదానికి చదువు చెప్పించడానికి అభ్యంతరము ఉండదనీ అనుకున్నాడు.

విచారించి విచారించి చివరకు సంఘ సంస్కరణో పన్యాసాలు ఇవ్వడములో ప్రసిద్ధిచెందిన సూర్యనారాయణరావుగారి పెద్దకుమారుడికి సీతనిచ్చి వివాహముచేయ నిశ్చయించుకున్నాడు. సూర్యనారాయణరావు విశాఖపట్నములో ప్లీడరు. మోహనరావు ఇంటరు జూనియరు తరగతి చదువుతున్నాడు. మోహనరావు అలే మోహనమయినవాడు కాకపోయినా పోకీవాలా.

సీత వివాహమయిన అయిదారు మాసాలకు స్కూలు హాస్టలులో రజస్వల అయినది. సీత పెద్దమనిషి అయినట్టు ఆరోజునే హాస్టలు సూపరింటెండెంటు సీత అత్తవారింటికీ, అప్పటిలో అనకాపల్లి డిప్యూటీకలెక్టరుగా ఉంటున్న వెంకటరావుగారికీ వర్తమానము పంపించింది. ఆవర్తమానము వినగానే సీత అత్తగారు హాస్టలుకు వచ్చి కోడలిని తమయింటికి పంపమంటూ కూర్చున్నది. తన్ను అత్తవారింటికి సుతరామూ పంపవద్దని సీత హాస్టలు సూపరింటెండెంటును వేడుకొన్నది. ఎందువల్ల సీత అలాతన్ను బతిమాలు కొంటున్నదోనని ఊహచేసి వచ్చిన అత్తగారితో సీతను వారియింటికి పంపడానికి వీలులేదని సూపరింటెండెంటు చెప్పింది. ఆమెచెప్పేసరికి సీత అత్తగారికి పట్టరాని కోపంవచ్చింది. సీతను పంపిస్తేనేకాని వీలులేదని సూపరింటెండెంటును బెదిరించింది. ఆమెప్రయత్నములు ఏమీ సాగకపోయినవి. అంతట ఆమె సీతను రమ్మని కూకలువేసింది. సీత మెదలకుండా ఊరుకున్నది. ఆమె హడావిడి చూసి సూపరింటెండెంటుకు చాలా కోపము వచ్చింది. “ ఇక ఆట్టగోల చేస్తే బంట్రోతు చేత గెంటించి వేస్తాన ” ని చెప్పేసరికి ఆమెవెళ్ళిపోయింది.

తనంత ఆమెవెళ్ళి కోడలిని తనయింటికిరమ్మంటే తను రాకపోవడమే కాకుండా సూపరింటెండెంటు తన్ను అవమాన కరముగా మాట్లాడి నప్పుడయినా సీత తన

వెంటరా లేదే అని తీవ్రమయిన కోపము వచ్చింది. ఆకోపము క్షణములో అగ్ని జ్వాలగా మారిపోయింది. ఒక్కసారిగా సీతను దహించివేతామా అన్నంత ఊహాకలిగింది. అయితే అప్పటిలో కొంతజ్వాల చల్లారిపోయి నిప్పుమాత్రము నిలిచింది. పొగ రాజడము మొదలు పెట్టింది. ఇక సీతకు తత్క్షణము పునస్సంధానము చేయించి ఇంటికి తీసుకుని వచ్చి ఇష్టమువచ్చినట్లు ముప్పతిప్పలుపెట్ట దలచుకున్నది. సీత తనకు అనుక్షణమూ లొంగిపోయి అడుగులకు మడుగులొత్తేటట్లు చేయసంకల్పించుకొన్నది.

సూర్యనారాయణరావు భార్యా విధేయుడు, మోహనరావుకు తల్లిఅంటే అతిభయము. ఆమె గట్టిగా మాట్లాడితే నూరుమాట్లాడలేడు. అసలికి సూర్యనారాయణరావు తల్లి, తల్లియేమో తండ్రి. అందువల్ల అతని కిష్టమున్నా లేకపోయినా తల్లి ఎంత చెపితే అంతా చేసితీరుతాడు. కోడలిని త్వరగా తమయింటికి తీసుకుని రావలెనని ఆమె సూర్యనారాయణరావుతో చెప్పింది. అతనికి కూడా కొడుకూ కోడలూ కాపరము చేస్తూఉంటే చూసి ఆనందించవలెనని బుద్ధి పుట్టింది. ఆపాట్ల ఆమాసములోనే సీతకు ముహూర్తము పెట్టించవలసిందని వియ్యంకుడికి సూర్యనారాయణరావు కబురు చేసినాడు.

ఈ వర్తమానానికి వెంకటరావుగారెంతో ఆశ్చర్య పోయినారు. ఎందువల్లనంటే సీత స్కూలుఫయినలు పరిక్షకు వెళ్లేవరకూ పునస్సంధానము మాట తలపెట్టకూడదని వివాహకాలమప్పుడు ఆయన సూర్యనారాయణరావుచేత వాగ్దానము చేయించుకున్నాడు. అసలీ ఒడంబడిక అయిన తరువాతనే వెంకటరావుగారు మోహనరావుకు సీతనిచ్చి వివాహము చేసినాడు. అంతట ఆయన విశాఖపట్టణము స్వయముగావచ్చి సూర్యనారాయణరావుగారితో అతివినయముగా వివాహసమయములో వారుభయులూ చేసుకొన్న ఒడంబడికను జ్ఞాపకము చేసినాడు. సూర్యనారాయణరావు, తాను వృద్ధు అయిపోయినట్లు అందువల్ల కొడుకు ఒకఇంటివాడయితే చూడవలెనని మనసు అయినట్లు ఏవేవో సాకులు చెప్పసాగినాడు. వెంకటరావుగారు ఎన్ని విధములనో ఆయన్ను ఒప్పించవలెనని ప్రయత్నము చేసినాడు. కాని ప్రయోజనము లేకపోయింది. చివరకు వెంకటరావుగారు కుర్రదాని అభిప్రాయము ప్రకారము చేయదలచుకున్నట్లుగా వారితో చెప్పినాడు.

అంతవరకూ వారి సంభాషణ వింటూ జోక్యము కలగజేసుకోకుండా ఉన్న వియ్యపురాలు వెంటనే సంభాషణలో కుర్రదాని అభిప్రాయము ఎంతమాత్రమూ పనికిరాదనీ తన కుర్రవాడి అభిప్రాయము ప్రకారము చేయవలెననీ చెప్పింది. అంతవరకూ మౌనము వహించి ఉన్న మోహనరావుకూడా తనకు

వెంటనే పునస్సంధానము చేస్తేనేకాని వీలులేదని వెంకటరావుతో చెప్పినాడు. వారి నిద్దరినీ ఏదో విధముగా సమాధానపరచవలెనని వెంకటరావు మాట్లాడబోయినాడు. ఉత్తమ కుటుంబస్త్రీలకు సాధారణముగా తోచనైనా తోచనటువంటి అభిప్రాయాలను ఆమె వెంకటరావుగారి యెదుట వెలిబుచ్చింది. ఆమె అంత అపభ్రంశముగా మాట్లాడినందుకు వెంకటరావుగారు ఎంతో నొచ్చుకుని ఏమి చెప్పడానికీ తోచక ఊరుకున్నారు. పునస్సంధాన ముహూర్తము తెలియజేయడానికి ఆమె రెండురోజులు వ్యవధానము ఇచ్చింది.

సీతను చూసి మాట్లాడడము కోసరము ఆసాయంత్రమే వెంకటరావుగారు హాస్టలుకు వెళ్లినారు. కూతురు తండ్రిని చూడగానే అత్యంతానందము పొంది ఆయన కౌగిటలోకి పరుగెత్తి " నాన్నా ఎప్పుడు వచ్చావు? నీవు మళ్లీ ఇప్పుడే వెళ్ళిపోతావేమో నాకు కొన్ని ఇంగ్లీకథలపుస్తకాలు కావాలి నాన్నా, " అన్నది. అంత అమాయకురాలిని అంతచిన్నదాన్ని అప్పుడే సంసారసముద్రములో విసిరి పారవేయడమా అనే ఊహవచ్చి ఆయన ఒక్క వేడినిట్టూర్పు విడిచినాడు. అయినప్పటికీ సంగతిసందర్భములన్నీ ఆమెతో చెప్పడమే యుక్తమని నిశ్చయించుకున్నాడు. ఆరాత్రికి తనతో కుర్రది ఉండడానికోసరము హాస్టలు సూపరింటెండెంటు అనుజ్ఞ తీసుకుని ఆమెను వెంటబెట్టుకుని ఒకానొకస్నేహితుడి ఇంటికివెళ్లినాడు.

అక్కడ తండ్రీకూతురూ భోజనము చేసినతరువాత ఒకగదిలోనే పడుకున్నారు. సీతకు వేరేమంచము వేసిఉన్నా తండ్రి ప్రక్కలోనే పడుకొని చిన్నపిల్లలాగా వాళ్ళ హెడ్‌మిస్ట్రెసును గురించీ, హాస్టలు సూపరింటెండెంటును గురించీ, ఇంకా తోటి విద్యార్థినులను గురించీ ఏవేవో కబుర్లు తెగచెప్పడము మొదలుపెట్టింది. ఆకబుర్లన్నీ తండ్రివింటున్నాడో లేదో కూడా ఆమెకు తెలియదు. కబుర్లు చెప్పి చెప్పి ఎప్పుడో తెలియకుండానే నిద్రపోయింది.

వెంకటరావుగారు ఆమెకో వాళ్ళ అత్తవారికిన్ని తనకున్నూ జరిగినసంభాషణ ఎలాచెప్పడమో తెలియక గిజాటు పడుతున్నాడు. నిద్రపట్టలేదు. దీపము వెలుగుతూనేఉంది. ఆయనపడుకొన్నైనా పడుకోలేదు. ఆ ఆందోళనలో గడ్డంకింద చెయ్యి పెట్టుకొని దీపమువంక చూస్తూకూర్చున్నాడు. ఒకరాత్రివేళ సీత లేచి బయటికి వెళుతూ, " నాన్నా, పెరటిలోకి వెళుతాను. నాకు భయము, నీవు తలుపు ఇవతల నిలుచో నాన్నా " అన్నది. ఆయన ఆలాగే చేసినాడు. అంతభీరువును, అంత పసిదాన్ని అత్తవారింటికి పంపడమేలాగా అనుకొని చాలా కించపడి పోయినాడు. ఏదో సాకులు సూర్యనారాయణరావుతో చెప్పి అప్పటికో పునస్సంధానము ఆపివేయించనిశ్చయించుకొన్నాడు. ఇక కుర్రదానితో ఆ ప్రస్తావన చేయదలచుకోలేదు.

సీత వచ్చి పడుకున్నది. వెంకటరావుగారునూ్న పడుకున్నాడు. అయితే ఆయనకు నిద్ర పట్టనేలేదు. ఒకవేళ సూర్యనారాయణరావు ఒప్పుకొన్నా వియ్యపురాలు ఏసాకులకూ ఒప్పుకోదనుకున్నాడు. ఏదైనా నియోగ్యపు యెత్తువేసి అప్పటిలో పునస్సంథానము తప్పించవలెనని ఆలోచించ సాగినాడు. మళ్లీ లేచి కూర్చున్నాడు. కొంతసేపటికి సీతకు నిద్రమెళకువ వచ్చింది. చూసేసరికి ఏదోవిచారముగా తండ్రికూర్చున్నట్టు గ్రహించింది. కొంచెము ఆలోచించింది, ఆ సాయంత్రమునుంచీ కూడా ఆయన విచారములోనే మునిగి ఉన్నట్టు ఆమెకు తోచింది. తను మొదట లేచి బయటికి వెళ్ళినప్పుడు కూడా ఆయన కూర్చుని ఏదో ఆలోచిస్తూ ఉన్నట్టే జ్ఞాపకము వచ్చింది. ఒక్కసారి తండ్రి ముఖము వంకతేరి పారచూసింది. ఆమెకు భయమువేసింది. "నాన్నా నాన్నా" అని మెల్లిగా పిలిచింది. ఆయన ఆమె వంకచూస్తూ "ఏం," అన్నాడు. "దిగులుగా ఉన్నావేం నాన్నా! అమ్మ ఖులాసాగాఉందా? బుజ్జి (అంటే చెల్లెలు) ఖులాసాగాఉందా నాన్నా? నాన్నా, చెప్పవేం?" అన్నది సీత. వెంకటరావుగారు సాలోచనముగా సీత వంకచూస్తూ ఊరుకొన్నాడు. సీత మరింత ఆదుర్దాతో లేచి కూర్చుని, "ఏంనాన్నా, మాట్లాడవేం?" అన్నది. ఆయన మెల్లిగా "మీఅత్తగారింటికి వెళ్లాను," అన్నాడు.

"వాళ్ళు ఏం అన్నారేం. నాన్నా అంతదిగులుగా మాట్లాడు తున్నావు."

"ఏ – మీ – లేదు."

"అయితే అంత దిగు లెందుకుమరీ!"

వెంకటరావు ఊరుకొన్నాడు. సీతకు ఆదుర్దా మరింత ఎక్కువయిపోయి "వాళ్లఇంట్లో ఎవరికైనా జబ్బుగా ఉందా ఏం, నాన్నా?". అన్నది.

"ఏమ్బే, లేదు వారము రోజులలో నిన్ను పంపించమని వాళ్ళు చాలా తొందరచేస్తున్నారు," అన్నాడు వెంకటరావు.

సీత ఊరుకొన్నది.

"నేను మీ మామగారితో మొదట, అంటే నీవివాహసమయములో చేసు కొన్న వాగ్దానము జ్ఞాపకము చేసినాను. కాని ప్రయోజనము లేకపోయింది. మీ అత్తగారితో ఎన్నిచెప్పినా ససేమిరా అంది. నీమెనిమిటి కూడా ఇప్పుడే పంపి తేనే కాని వీలు లేదన్నాడు. నిన్ను అడిగి నీ అభిప్రాయము కనుక్కొని ఏసంగతీ తెలియ జేస్తానని వాళ్ళతో ఆఖరుకు చెప్పివచ్చినాను."

ఇందుకు కూడా సీత ఊరుకొన్నది.

"అయితే నీ అభిప్రాయము ఏమిటి? సందేహమువద్దు. చెప్పు ఫరవాలేదు." అని వెంకటరావు ఆమెను బుజ్జగించినాడు.

సీత తలవంచుకుని సిగ్గుతో "వారినిచూస్తే నాకు భయము నాన్నా"అన్నది

"ఏమిటి వెర్రి దానిలాగా భయమేమిటి? మోహనరావు చాలా మంచివాడు. ఇంకా మీ అత్తగారు కొంచెము గయ్యాళిది. మీ మామగారు చాలా మంచి వాడు. అయినా నీకెనిమిటి మంచివాడు కాబట్టి మీ అత్తగారు నిన్నేమీ చెయ్య లేదు."

"ఇప్పుడు ఒద్దు నాన్నా"

"మరి వాళ్లు చాలా తొందర చేస్తున్నారు. మీ అత్తగారు మరీ పట్టు పట్టింది."

"ఏమైనా సరే ఇప్పుడు వద్దు నాన్నా."

"ఎందువల్ల ?"

"నాకు భయము వారంటే"

"భయమెందుకు ?"

సీత మళ్లీ ఊరుకొన్నది. "చెప్పు ఫరవాలేదు. ఎందుకుభయము ?" అన్నాడు వెంకటరావు.

"పోనీ వాళ్ళు అంత తొందరపడుతుంటే ఈ సంవత్సరము వైశాఖ మాసము దాకా ఆగమని వాళ్ళను ఒప్పించు. ఈ లోపలవారు మన ఇంట్లో ఒక నెలరోజులు ఉండేటట్టు చేస్తే నాకు భయము పోతుంది. నాన్నా."

"అసలు నీకు భయమెందుకు ?"

"ఏమీలేదు. ఈమధ్య వారు ఒకసారి హాస్టలుకు వచ్చినారు. వారు ఫలానా అని తెలియక నాతో మాట్లాడవలెనంటే మనబంధువులని అనుకుని సూపరింటెండెంటుగారు ఒప్పుకున్నారు. వారు నాగదిలోకి వచ్చి కూర్చున్నారు. నేను ఏం తోచక నిలుచున్నాను. ఒక క్షణమయిన తరువాత లేచి నాదగ్గిరికి వచ్చి నాచెయ్యి పట్టుకొన్నారు. నాకు చాలా భయము వేసింది. ఇంతలో మా సూపరింటెండెంటు ఇది చూసి వెంటనే అక్కడికి వచ్చి వారిని బయటికి పంపించి వేసింది. అప్పటినుంచీ నామీద వారికి అపరిమితమైన కోపము. ఈమధ్య నేను స్కూలు నుంచి వస్తూఉండగా వారు కనబడ్డారు. ఎంతో కోపముతో కండ్లురిమి చూశారు నావంక. అందువల్ల వారంటే నాకు భయము. ఒక నెల వారు మన ఇంట్లో ఉన్న తరువాత నైతే సరే."

"ఇంతమాత్రానికేనా ?"

"కాదు నాన్నా, నీకుతెలియదు. ఒక నెలవారు మన యింట్లో ఉండేటట్టు చెయ్యి నాన్నా ! అయితే అమ్మ ఏమంటున్నది ?"

" మీ అమ్మతో ఇంకా మాట్లాడలేదు. "

" అయితే అమ్మ అభిప్రాయముకూడా కనుక్కో. నేను ఇలా చెప్పానని కూడా చెప్పు నాన్నా. "

" ఒకవేళ మీఅమ్మ ఇప్పుడేనంటే. "

" అయితే అమ్మతోనే నొకసారి మాట్లాడిన తరువాత మరీ వాళ్ళకు కబురు చెయ్యి. "

" సరే పడుకో. "

" నాకు భయముగాఉంది నాన్నా, ఇప్పుడేనంటే ! "

" ఫరవాలేదులే. నేను తొందరపడను. అంత మీదుమిక్కిలి వస్తేచూదాము పడుకో. "

౪

వెంకటరావు ఇంటికివచ్చి జరిగినదంతా భార్యతో చెప్పినాడు. అంతపసిది అప్పుడే కాపరానికి వెళ్ళడానికి ఇష్టములేక ఆమె ఎంతమాత్రమూ ఒప్పుకోలేదు. కనీసము సంవత్సరమయినా గడవవలెనని ఆమె భర్తతోగట్టిగా చెప్పినది. వెంకటరావు తిరిగి యోజనచేయ సాగినాడు.

అప్పటికి సీతకు పద్నాలుగో సంవత్సరము వచ్చింది. పదిహేను సంవత్సరము లయినా సగపడనిది పిల్లదానికి పునస్సంధానము చేయడానికి ఆయనకు ఇష్టములేక పోయినది. ఈసంగతి తను వ్రాస్తే వాళ్లు ఒప్పుకోరని ఆయనకు తెలుసును. కాలయాపనము చేయడానికి మార్గాలు ఆలోచిస్తూ కాలయాపన చేయసాగినాడు.

సూర్యనారాయణరావు ఉత్తరాలపైన ఉత్తరాలు దూకించడము మొదలు పెట్టినాడు. ఆలోచించి ఆలోచించి అప్పటిలో కార్యముచేయడానికి తాను తూగ లేనట్టూ ఒకవేళ తను తూగినా తన బంధువులంతా రావడానికి వీలు ఉండనట్టూ అందుచేత వైశాఖ మాసము వరకూ ఊరుకోవలసి వచ్చినట్టూ వెంకటరావు సమాధానము వ్రాసినాడు. ఈ సమాధానానికి సూర్యనారాయణరావు భార్య భగ్గున మండిపడి అంతవారు తూగలేక పొయ్యేట్లయితే తామే అశుభకార్యానికి అయ్యే ఖర్చులన్నీ భరించేటట్టున్నూ మరొకప్పుడు అయితే తమ బంధువులంతా రావడానికి వీలు ఉండనట్టున్నూ భర్తచేత ఉత్తరము వ్రాయించినది. ఆఉత్తరము వెంకటరావుకు ఎంతో అవమానకరముగా తోచింది. ఆపాట్ల ఆయన వైశాఖమాసము

దాకా కార్యము చేయడానికి వీలుపడదని ఖండితముగా ఉత్తరము వ్రాసినాడు. అప్పుడే చేస్తేనేగాని వీలుపడదని సూర్యనారాయణరావు తిరిగీ ఖండితముగా ఉత్తరము వ్రాసినాడు. వెంకటరావు సమాధానము వ్రాయకుండా ఊరుకొన్నాడు. వారమురోజులు గడిచిన తరువాత తనకు వెంటనే పునస్సంధానము చేయవలసి నట్టుగానూ, అలాచేయక పొయ్యేట్లయితే తన భార్యను స్వాధీనము చేసుకోవ డానికి దావా చేసేటట్టున్నూ మోహనరావు వెంకటరావుకు రిజష్టరు ఉత్తరము ఇచ్చినాడు. ఆరిజష్టరు నోటీసుచూసి వెంకటరావు నిర్విణ్ణుడై పోయినాడు. ఆయ నకు వారి చర్య అంతా మహాఅసహ్యముగా తోచింది. అటువంటి క్లిష్టపరిస్థితులలో కూతురిని పంపించడమూ పంపించక పోవడమూ అనే గొడవలో పడిపోయి కర్త వ్యాన్ని ఇదమిత్థమని నిర్ణయించలేక పోయినాడు. ఆయన భార్యకూ ఏమీ తోచి నదికాదు. పక్షము గడిచిపోయినది.

మోహనరావు భార్యను స్వాధీనము కోసరము దావా తీసుకొని వచ్చినాడు. వెంకటరావుకు సమన్లు వచ్చినవి. వారి కుటుంబము అంతా విచార సాగరములో మునిగిపోయింది. దావా విషయములో ఆన్సరు పెట్టవలసిన గడువు సమీపించింది. ఏమి ఆన్సరు పెట్టవలెనో వెంకటరావుకు తోచక చివరకు అప్పటిలో తన కొమా ర్తెను భర్తకు స్వాధీనముచేయడానికి దేహములో స్వాస్థ్యము లేనట్టున్నూ ఆరో గ్యముకలగగానే స్వాధీనము చేయడానికి ఏ అభ్యంతరమూ లేనట్టున్నూ ఆన్సరు పెట్టినాడు. ఆపైన కోర్టువారు పిల్ల దాన్ని డాక్టరుచేత పరీక్ష చేయించినారు. డాక్టరు సీతకు దేహారోగ్యము సరిగానే ఉన్నట్టు చెప్పినాడు. సీతను భర్తకు స్వాధీ నము చేయడానికి డిక్రీ అయింది. వెంటనే డిక్రీ అమలు జరపడానికి పెట్టినారు.

పుష్యమాసములో ఒకనాడు మిట్ట మధ్యాహ్నమప్పుడు కోర్టు అమీనా సీతను వెంటబెట్టుకొని వెళ్ళడానికి వారంటుతో అనకాపల్లి వచ్చినాడు. రైలు లేనందువల్ల అమీనా మోటారులో వచ్చినాడు. ఇక వెంకటరావుకు సీతను పంపక తప్పందికాదు. ఆయనకూడా మహావిచారముతో విశాఖపట్నము బయలు దేరినాడు. సాయంత్రానికి సీత అమీనాతో విశాఖపట్నము చేరింది. వారు విశాఖ పట్నము చేరగానే అమీనా సీతను సూర్యనారాయణరావు ఇంటికి తీసుకొని వెళ్ళి అప్పజెప్పినాడు. సీత లేడిపిల్లలాగా బిత్తరిచూపులతో అత్తవారి ఇల్లు ప్రవేశించింది.

కూతురికి ఏమి అవాంతరము వస్తుందో ననుకొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెంకటరావు ఆఇంటి దగ్గిరనే అటూ ఇటూ తిరుగుతూ కనిపెడుతూ ఉన్నాడు. ఆరాత్రి సీతకు అన్నము పెట్టినారు, కాని ఆమె భోజనము చేయనేలేదు.

రాత్రి తొమ్మిది పది గంటలప్పుడు సీత ఏడుస్తూ బయిటికి వచ్చింది. అత్తగారు సీతను బయటికి తోసివేసి తలుపు వేసుకొన్నది. వెంకటరావు తక్షణము ఆమె దగ్గరకు వెళ్లి "అమ్మా, ఏడవకు" అని సముదాయిస్తూ వెంటబెట్టుకొని కొంత దూరము వచ్చి అప్పుడే వారు మోటారు చేసుకొని అనకాపల్లి చేరినారు.

తర్వాత మాసానికే మోహనరావు మరొకరి పిల్లను వివాహము చేసుకొన్నాడు. ఆ అమ్మాయితో ఇప్పుడు మోహనరావు కాపురము చేస్తున్నాడు.

సీతను వంచన చేయడమే వారు ప్రధానముగా పెట్టుకొన్నారు. ఆమె జీవితమంతా భగ్నమయిపోయినది. ఇప్పుడు సీతను మరొకరు వివాహము చేసుకొనడానికి వీలులేదు. హిందూలా ఇందుకు ఒప్పుకోదు. ఒకవేళ ఏయువకుడయినా ధైర్యముచేసి సీతను వివాహముచేసుకొంటే మోహనరావు అతనిమీద దావా తీసుకొనివచ్చి ఏడు సంవత్సరాలు కఠినశిక్ష పడేటట్టు చేస్తాడు. అతనా ఈమెను ఒల్లడు. ఒకవేళ సీతకు కర్మముజాలక పిల్లలుకలిగేట్లయితే ఆపిల్లలు తన పిల్లలుకారని కోర్టులో రుజువుచేసి ఈమెను బహిరంగముగా అవమానపరుస్తాడు. ఈమె గతి ఏమిటి ఇంక? ఈలాకృశించి పోవలసినదే లేకపోతే ఈ దౌర్భాగ్యదశకు ఆత్మహత్య చేసుకోవలెను. ఇది ఈమెకథ.

కథంతా సావధానముగా వింటూఉన్న వాసుదేవరావు కళ్ళు చింత నిప్పులు లాగా అయిపోయినవి. అతనేమీ మాట్లాడలేదు. ఒకపెద్ద నిట్టూర్పు మాత్రము విడిచినాడు. తదేకముగా నేలవంక చూస్తూ ఊరుకొన్నాడు.

ఈగాథ విన్నందువల్ల అతని హృదయము కంపించి పోయినట్టు రమణమ్మ కనిపెట్టింది. "వాసూ, ఇప్పుడు వర్ణ వ్యవస్థను గురించి నీవు పరిశోధనలుచేసి ఏవో పెద్దపెద్ద పుస్తకాలు వ్రాయడముకంటే హిందూలా, భార్యాభర్తలు తమ వివాహము రద్దుచేసుకోవడము అంగీకరించేటట్టు చేయడానికి నీవు ఎందుకు ప్రయత్నము చేయరాదు? ఈ దేశములో ఎంతమంది భార్యలు భర్తలంటే ఇష్టములేకపోయినా వారిని వదలిపెట్టడానికి వీలులేక ఎంత అవస్థపడుతున్నారో ఎవరు చెప్పగలరు? స్త్రీకి ఆమాత్రమయినా స్వాతంత్ర్యము లేని ఈదేశములో ఏవేవో సంఘసంస్కరణాలవల్ల ఏమి ప్రయోజనము?" అన్నది రమణమ్మ.

వాసుదేవరావు ఆమెవంక సాలోచనముగా చూసి ఊరుకొన్నాడు. కొంచెముసేపయిన తరువాత "చీకటి పడుతున్నది. ఇంటికి వెళుదామా?" అన్నాడు.

ఉభయులూ మౌనములో ఇంటికి బయలుదేరినారు. వీధిగుమ్మము దగ్గరికి వెళ్ళగానే వాసుదేవరావు ఆగిపోయి "అక్కయ్యా" అన్నాడు. ఆమె వెనకకు తిరిగి "ఎందుకు" అన్నది.

"అయితే సీతకు ఎవరినైనా పెండ్లి చేసుకోవలెనని ఉందా ?"

"అంటే నీ అభిప్రాయము ఏమిటి ? సీత ఇప్పుడు ఎవరినైనా ప్రేమిస్తున్నదా అనా నీ ప్రశ్న ?"

"కాదు. సీతకు అవకాశముంటే ఇంకెవరినైనా పెండ్లి చేసుకోవలెననే అభిలాషఉందా అని నేను అడుగుతున్నాను."

"అవకాశమే లేదు కాని ఎందుకు ఉండదు ? సీత నవయౌవనములో ఉంది. నా లాగా ముసలిదా ?"

వాసుదేవరావేమీ మాట్లాడలేదు. ఇద్దరూ లోపలికి వెళ్ళినారు. వారు వచ్చేసరికి సీత అన్నము వండినది. ఆపాళంగా వారు ముగ్గురూ భోజనము చేసినారు.

ఎవరి దారిన వారు పడుకొన్నారు. వాసుదేవరావుకు నిద్రపట్టలేదు. రాత్రి పదకొండు గంటలు అయిపోయినవి. అతని హృదయసముద్రములో ఉన్న బడబాగ్ని మెల్లిగా రగులుకొంటున్నది. లేచికూర్చుని సీత ఏమిచేస్తున్నదోనని చూసినాడు. ఆమె పడుకొని పుస్తకమేదో చదువుకొంటున్నది. రమణమ్మ నిద్ర పోతున్నది. అతను మంచముమీదనుంచి ఆమె మంచముదగ్గరకు వెళ్లి నిలుచున్నాడు. ఆమె అతన్ని చూడగానే లేచి నిలుచున్నది. "ఫరవాలేదు. కూర్చో కూర్చో" అన్నాడు వాసుదేవరావు. ఆమె కూర్చోలేదు. అతనూ కూర్చుండలేదు. "సీతా, నిన్నొక విషయము అడుగుదామని వచ్చినాను. ఏమీ అనుకోవద్దు." అన్నాడు వాసుదేవరావు.

"అడగండి" అన్నది సీత.

"నన్ను అపార్థము చేసుకోవద్దు — నీకు అవకాశము ఉండేట్లయితే మరొకరిని వివాహము చేసుకోవలెనని ఏమయినా ఉందా ?"

ఈప్రశ్నకు సీతముఖములో ఎన్నడూలేని వికాసము వచ్చింది. అయితే ఆమె కంత వికాసము కలిగినట్టు వాసుదేవరావుకు తెలియదు. అతని గొడవలో అతను ఉండి ఆమె ముఖభంగి కనిపెట్టలేదు. ఆమె వెంటనే జవాబు చెప్పలేదు. మందహాసములో తలవంచి నిలుచున్నది.

"వేరేవిధముగా అనుకోవద్దు, నీశ్రేయస్సు కోరేవాళ్ళలో నేను అగ్రగణ్యుడిని, చెప్పు, ఫరవాలేదు," అన్నాడు తిరిగి వాసుదేవరావు.

అతివినయముతో తల వంచుకొని కొంచెము సిగ్గుపడుతూ నిదానముగా "అవకాశములున్నప్పుడు గదా ఆవిషయము ఆలోచించవలసినది!" అన్నది సీత.

"సరే చదువుకో" అనివాసుదేవరావు అక్కడినుంచి వచ్చి పడుకొన్నాడు."

౫

రోజులు గడిచిన కొద్దీ వాసుదేవరావు అన్నిపనులూ మరచిపోయి సీత విషయమే ఆలోచించడము మొదలు పెట్టినాడు. సీత సాధ్యమైనంత త్వరలో వివాహము చేసుకోవడమునకు అవకాశము కల్పించి తీరవలెనని సంకల్పించుకొన్నాడు. అందుకు హిందూలాలో మార్పు తీసుకొనిరావలె ననుకొన్నాడు. శాసననిర్మాణసభ వివాహము రద్దు చేయిడానికి అంగీకరించేటట్లు చేయవలె ననుకొని శాసన నిర్మాణ సభా సభ్యుడయిన బారిష్టరు రామయ్యా చౌదరీ దగ్గిరికి వెళ్ళినాడు.

గుంటూరులో అప్పటిలో రామయ్యా చౌదరీ బారిష్టరుగా ఉంటున్నాడు. ఆయిన కమ్మవంశజుడు. సివిల్ కేసులలో, అందులో ముఖ్యముగా హిందూలాకు సంబంధించిన వ్యాజ్యములలో పట్టులేక పోయినా ఆయన తీసుకొనేట్లయితే గెలిచి తీరవలసినదే ఆయన ఏ వ్యాజ్యములో పనిచేసినా ఓడిపోవడమంటూ ఉండేదికాదు. చౌదరీ వాసుదేవరావూ చిన్నప్పుడు చాలా తరగతులలో సహాధ్యాయులుగా ఉన్నారు. అంతేకాకుండా చిన్నప్పటినుంచి కూడా వారుభయులూ చాలామైత్రితో ఉండేవారు. చౌదరీ ఇంగ్లాండు వెళ్లి వచ్చి బారిష్టరు అయినప్పటినుంచీ అతనికి వాసుదేవరావు మీద మరింతగౌరవము హెచ్చింది. తను దేశములో తీసుకొనిరాదలచుకొన్న మార్పు లన్నింటికీ చౌదరి తోడ్పడుతాడని వాసుదేవరావు నిశ్చయించుకొన్నాడు.

నిజానికి చౌదరి అతిపట్టుదల గలవాడు — అతి మొండి. చిన్నప్పుడు అతన్ని స్నేహితులంతా "మిష్టరు పెడకట్టె" అనిపిలుస్తూండే వాళ్ళు. అతనేదైనా పనిచేయదలచుకుంటే బ్రహ్మాదులు తల్లకిందులయినా సరే చేసి తీరవలసిందే; పట్టినపట్టు విడవడమనేది అతనికి తెలియనే తెలియదు. అతను పైగా బ్రహ్మచారి. బ్రహ్మచారికి సహజమయిన నిర్లక్ష్యము అతనిలో మూర్తీభవించిపోయింది.

అతన్ని గనుక వివాహమురద్దువిషయమయి ఒప్పిస్తే ఇక శాసన నిర్మాణ సభను వేధించి అయినా హిందూ చట్టములో మార్పు తీసుకొని రాగలడని వాసుదేవరావు త్రికరణశుద్ధిగా విశ్వసించినాడు. అందుకోసరము అతను గుంటూరు వచ్చి చౌదరి ఇంట్లోనే మకాము చేసినాడు.

వాసుదేవరావు అతని దగ్గిరికివెళ్లినతరువాత వారము రోజుల దాకా ఇష్ట గోష్ఠి సలపడానికి చౌదరికి వీలు లేకపోయింది. ఒకనాడు సాయంత్రము చౌదరికి విశ్రాంతి దొరకగానే వాసుదేవరావుతో కాలక్షేపము చేయడము కోసరము వారి ద్దరూ మోటారులో రింగురోడ్డుకు షికారు బయలుదేరినారు. చౌదరి ఎంత ఉత్సాహముతో బయలుదేరినాడో వాసుదేవరావు అంతనిరుత్సాహముతో బయలుదేరి నాడు. మోటారు బయలుదేరిన క్షణములోనే వాసుదేవరావు ఉత్సాహముగాలేనట్టు కనిపెట్టి " ఏమిరా, వాసూ, అంత బేచారుగా ఉన్నావు? " అన్నాడు చౌదరి.

" నిజమేరా, ఒకవిషయాన్ని గురించి తీవ్రముగా రెండు నెలలనుంచీ ఆలోచిస్తున్నా తెగకుండా వచ్చింది. ఉత్సాహము కొంత తగ్గిపోయినమాట వాస్తవమే " అన్నాడు వాసుదేవరావు.

" ఏమిటిరా విషయము? "

" హిందులాలో ఒక మార్పు తీసుకొనిరావలెనని ప్రయత్నము. వివాహము రద్దు చేసుకోవడముకు లా అంగీకరించేటట్టు చెయ్యవలెనని ... "

పకపక నవ్వి " ఇప్పుడింతహఠాత్తుగా వచ్చిందేం ఈసమస్య! " అన్నాడు చౌదరి.

" కాదు, కాదు, నాకు ఇదివరలో హిందూలాలో ఇంతఘోరవిషయాలున్న వని తెలియదు. ఈ లా తప్పని ఋజువుచేయడానికి ధర్మశాస్త్రాలు తిరగవేస్తున్నాను. నీవు శాస్త్ర సహాయముచేస్తే 'లా' లో మార్పు తీసుకొని వచ్చానన్నమాటే. "

" అఘోరించావు! ధర్మశాస్త్రాలలో ఉన్నవన్నీ మనవాళ్ళు ఒప్పుకొంటున్నారా? "

" ఒప్పిస్తాను. "

" ఒరే అబ్బాయి, నీకు మతి పూర్తిగా పోయింది. కాని ఇంకొక విషయము మాట్లాడు. "

" లా లో మార్పు తీసుకొని రాలేమనేనా నీ అభిప్రాయము? చూడు, నీవు శాసననిర్మాణ సభలో కాస్త నోరు తెరచి మాట్లాడేట్లయితే ఉత్తరక్షణములో చట్టములో మార్పు రాదటరా ? "

" పుణ్యభూమిరా మనది. ఈపుణ్యభూమిలో మార్పు తీసుకొని రావడము ధర్మశాస్త్రాలు వ్రాసిన వాళ్ళకుకూడా చేతకాదు లేవోయి! "

" ఎందువల్ల ? "

" ఎందువల్లనా, మనది పుణ్యభూమి అయినందువల్ల ! ఈ మనదేశములో ఈలాంటివి తలపెడితే మనము హాస్యాస్పదుల మయిపోతాము. ఇంత చండాలపు

దేశమూ మనుష్యులూ భూభాగములో ఎక్కడా లేరు. మనము ఒకటి చెపితే ఒకటి మాట్లాడుతారు. మనము Humanitarian Stand Point నుంచి మాట్లాడితే చచ్చుశాస్త్రాలు తీసుకొని వస్తారు. పోనీ మనము శాస్త్రప్రమాణము చూపిస్తే ఆచారమంటారు. ఈదేశమంతా ఒక్కసారి నశించిపోయి మళ్ళీ క్రొత్తగా జనము పుడితే అప్పుడేమైనా—అంతేకాదు అసలే దౌర్భాగ్యముగా ఉన్న దేశములో పరమహంసలు రామతీర్థులు పుట్టి కొంచెము కొంచెము వికాసము కలుగుతున్న యువకుల హృదయాలనూ దేశాన్ని ధ్వంసముచేశారు. వాడు—ఆ నిర్భాగ్యుడు—తాగుబోతు వివేకానందస్వామి ఏవేవో గప్పాలు కొడతాడు. ఇప్పుడు వాడు బ్రతికి ఉన్నట్లయితే వాణ్ణి ఖూనీచేద్దును."

"ఈ ఉపన్యాసమంతా ఎందుకు? అసలు విషయము ఆలోచించరా. ఈ మాత్రము చట్టములో మార్పు తేలేకపోతే నీబోటివాళ్లు శాసన సభలలో ఉండడ మెందుకురా?"

"ఒరే, నీకు కోపమువస్తుందేమో నేను చెపితే. అయినా విను. ఈదేశములో శ్రుతులూ స్మృతులూ, పురాణాలూ, తగలడిపోయి సంస్కృతమనే భాషే లేకుండా పోయి బ్రాహ్మణులంతా నిశ్శేషమయి పోయిన మర్నాడు ఈ దేశానికి, ఈసంఘానికి మోక్షము. అప్పుడే స్వరాజ్యము ... ... అరేరే నీవు ఒక పెళ్ళి రద్దును గురించి మాట్లాడుతున్నావు. దత్త స్వీకారము, ఔరసత్వము హిందూలాలో ఎంత ఘోర విషయాలో నీకు తెలియదు. తలచుకుంటే గుండెలు తరుగుకొనిపోతవి ... ..."

"నేను చెప్పేది ఒకటి. నీవు మాట్లాడుతున్నది మరొకటి. నిజమే, హిందూలా అమానవ చట్టమే కావచ్చును. మరి చట్టములో మార్పులు తీసుకొని రావాలె. అందుకోసరమే శాసననిర్మాణసభలో పనిచేయమని చెప్పుతున్నాను."

"నీవు ఆరుసంవత్సరాలనుంచీ పుస్తకాలలో మునిగి తేలుతున్నందువల్ల జన సామాన్యాన్ని ముఖాముఖీ చూడలేకుండా ఉన్నావు. ఏ మార్పు సంఘములో కలగ వలెనన్నా బ్రాహ్మణోత్తములతో ఉన్నది వాళ్ళు పరమకిరాతులు."

"బ్రాహ్మణులేమి చేశారు?"

"ఆలా అడుగు చెప్పుతాను. రేపు వివాహ రద్దు విషయమయి శాసననిర్మాణ సభలో ప్రతిపాదిస్తాననుకో. అప్పు డేమి జరుగుతుందంటే, ఊరూరా సభలుచేసి బ్రాహ్మణోత్తములు ఈపుణ్య భూమికి అగ్గి అంటుకు పోతున్నదని మహాజర్లు పెడుతారు. అప్పుడు గవర్నమెంటుసభ్యుడు లేచి "నాన్నా, నీ తీర్మానము ఉపసంహరించుకోవోయి!" అంటాడు.

" మనము మట్టుకు ఊరూరా సభలుచేసి మహజర్లు పంపలేమా ? "

" చేయనే లేము. ఒకవేళ చేసినా ప్రయోజనము ఉండదు. "

" ఎందువల్ల ? "

" ఈదేశము బ్రాహ్మణుడి హస్తగత మయిపోయింది. ... "

" ఏడిచినట్టుంది ! బ్రాహ్మణుడు బ్రాహ్మణుడు అని కొట్టుకులాడుతావు కాని అసలు విషయ మేమిటో గ్రహించవు. "

చౌదరి చిరునవ్వుతో " కోపము వచ్చింది కాబోలు బ్రాహ్మణులను తిట్టినందుకు. అయితే సరేకాని అసలు ఈచట్టము మార్పును గురించి నీవు ఎందుకు యోజించవలసి వచ్చిందిరా ? " అన్నాడు.

" ఆకారణములు నీతో చెప్పినా ఫరవా లేదు. కాని అవసరము లేదు. "

" కుతూహలముచేత అడిగాను. ఇష్టమయితే చెప్పు. "

" ఏబ్బే, పెద్ద రహస్య మేమీ లేదు " అంటూ సీత కథంతా చెప్పినాడు. కథ అంతా విని "చ్ చ్ పాపము " అనికొంచెముసేపు ఊరుకొని తిరిగి " నీ వాయువతిని ప్రేమిస్తున్నావా ఏమిటి? " అన్నాడు రామయ్య చౌదరి.

" లేదు, నేను ప్రేమించడము లేదు. అయితే ఆమె జీవితమంతా దుర్భరమయిపోయిందే అని జాలిపడుతున్నాను. "

" పాపము ఏమి చేస్తాము. "

" అలా అంటే కాదు. ఏదైనా ఉపాయము ఆలోచించవలెను. "

ఆలోచిస్తూ " ఒక్కటే మార్గమున్నది. ఆయువతి వివాహము చేసుకోడానికి" అన్నాడు చౌదరి.

" ఏమిటి ఏమిటి ? "

" ఆయువతి వితంతు వయితే నిరాటంకముగా పెండ్లి చేసుకోవచ్చును. "

" ఆసంగతి నాకూ తెలుసును. అయితే ఆయువతి వితంతువు కావడము ఏలాగు ? "

" What is there. You can make her a widow " (ఏమున్నది, ఆమె వితంతు వయ్యేట్లు నీవు చేయవచ్చును).

" ఎలా ? "

" ఎలా ఏమిటి నీ ముఖము—అసలు నీకు నిజంగా ఆ కుర్రదానిమీద జాలి ఉందీ ? "

" జాలేమిటి — ఆ కుర్రదాని సౌఖ్యముకోసరము ఏ పనిచేయడానికైనా సంసిద్ధముగా ఉన్నాను. "

" ఏమిటో నీవు చెప్పేదంతా పరస్పర విరుద్ధముగా ఉంది — ఆ యువతిని ప్రేమిస్తున్నావా అంటే అదీలేదు. ఏమిటో జాలి అంటావు. ఆ యువతికి వివాహము అంటావు. నాకర్థము కాకుండా ఉంది. "

" నీదంతా గొడవ. అది కాదురా. ఆ అమ్మాయిని నేను వివాహము చేసుకోవలెనని ఎంతమాత్రమూ నాకు లేదు. అయితే ఆ యువతి ఎవరినైనా ప్రేమించడానికీ ఆ ప్రేమించినవాణ్ణి వివాహము చేసుకోవడానికీ అర్హత కల్పించవలెనని నా అభిప్రాయము. "

" అదేనోయి నేనడుగుతున్నది. ఆ కుర్రది యథేచ్ఛగా వివాహము చేసుకోవలెనంటే శాసన నిర్మాణ సభలో హడావుడి చేసి చట్టములు మార్పించడము కాదు చేయవలసిన పని. ఒకవేళ చట్టములు మారినా సంఘములో మార్పు రావడము దుర్లభము. ఈలాంటి మార్పులు సంఘములో జరగవలెనంటే సంఘాన్ని దద్దిరిల్ల జేయవలెను. సంఘము భీతావహమయి పొయ్యేటట్టు చేయవలెను. అప్పుడు మార్పు దానంతట అదే వస్తుంది. చట్టములు వాటిఅంతట అవి మారిపోతవి. ఇప్పుడాయువతికి స్వేచ్ఛ కావలెనంటే సంఘాన్ని నీవు దద్దిరిల్ల చేయవలెను. అవసరమయితే నీవు ధర్మవీరుడులాగా కారాగృహానికి పోవాలె. "

" అయితే ఆయువతిని వివాహము చేసుకొని నన్ను జయిలుకు పొమ్మంటావా?

" నీవు ఆ యువతిని ప్రేమించడము లేదన్నావుగా మరి ? "

" అవును. "

" ఇప్పుడు సంఘములో మార్పు ఈలాంటి విషయములలో రావలెననీ, ఆ యువతి వివాహము చేసుకుని సుఖపడడమూ నీవు కోరేది. అంతేనా ? "

" అవును. "

" అయితే మొదటి విషయము అంటే సాంఘికపుమార్పు ఎలా వస్తుందో చెప్పాను. ఇక పోతే ఆ అమ్మాయి వివాహము. అందుకోసరము నీవు ఎటువంటి కష్టములయినా పడడానికి ఒప్పుకొన్నావు. నీవు ఏలా పోయినా ఆ యువతికి నీతో సంబంధము లేదు. ఆ యువతి సౌఖ్యమే నీ లక్ష్యము. "

" ఏమిటి ఇది కోర్టుకాదు — వాదన చేయడానికి. అసలుసంగతి చప్పున తేల్చు. "

" ఏమీలేదు. Go on murder that husband. (ఆ పెనిమిటిని ఖూనీచెయ్యి)"

వాసుదేవరావు నిర్ఘాంతపోయి "ఎంతఅమానుషకృత్యము చేయమన్నావు!" అన్నాడు.

"అమానుషమేమి — వాడు, ఆ పెనిమిటి చేసినదానికి హిందూ లా చేస్తున్న దానికి ఈ అమానుషకృత్యమే మంచిమందు — అయినా నీకు శాస్త్రమేది? పప్పు తింటావు?"

"ఆ పెనిమిటిది అటే తప్పుకాదేమో, తల్లిదండ్రులు వాడిచేత —"

"ఓరి గుడ్డిపెద్దమ్మా, మన పుణ్యభూమికి ప్రహ్లాదుడుగా లక్ష్యము — తల్లి దండ్రులు చేయమంటే చేశాడేం వాడు? వాడికి వ్యక్తిత్వం లేదేం? — నేను స్నేహితుణ్ణి చెప్పానని నీ తల్లిని చావగొట్టు చూదాము — అసలు తప్పు వాడిది. ఇంతకూ వాడు లేకపోతే ఈ గొడవే ఉండదు కా మరి."

సాలోచనముగా "వాడు మరొక కుర్రదాన్ని వివాహము చేసుకొని సుఖము అనుభవిస్తున్నాడు. దాని గతేమిటి?" అన్నాడు వాసుదేవరావు.

"వాడుచస్తే ఆపిల్లది వితంతువు అవుతుంది, కాబట్టి మరొకణ్ణి ఇష్టమయితే వివాహముచేసుకొని సుఖంగా ఉంటుంది."

"ఇందుకోసరము కొత్తగా ఒకతెను వితంతువుచేయడము చాలా ఘోరము!"

"అవునురా నాయనా, నీకు అన్నీ ఘోరాలే. అయినా కాస్త ఆలోచించు. నేను చెప్పింది ఎంతమాత్రమూ ఘోరముకాదు. ఎందువల్లనంటే ఈ కొత్త వితంతువు తిరిగి ఇష్టమయిన వాణ్ణి వివాహము చేసుకోవచ్చును. ఒకవేళ ఆ పెనిమిటి అకస్మాత్తుగా చనిపోయినాడనుకో. అప్పుడేం చేస్తుందేం?"

"ఎంతచెప్పినా మనస్కరించడము లేదురా."

"అవునురా ఎందుకు మనస్కరిస్తుంది. వివాహరద్దును గురించి ఉపన్యాసాలు ఇవ్వమంటే గుక్క తిప్పకుండా అయిదు గంటలు అరుస్తావు. వ్రాయమంటే కృష్ణాపత్రిక అంతా పాడుచేస్తూ అర్థముకాని తెలుగులో చెడా మడా వ్రాస్తావు. ఏది శాస్త్రము? ఎందుకురా ఒక్క వ్యక్తికి మోక్షము ఇవ్వలేని నీవు? వెధనదేశము! ప్రతివాడూ లోకమరమ్మతు చేయడానికి ఉపన్యాసాలూ, గ్రంథాలూ, వ్యాసాలూ, వీటికిమాత్రము తయారు!"

ఈలా అంటూ ఉండగా మోటారు చౌదరి ఇంటి ఎదటికి వచ్చి ఆగిపోయింది. చౌదరి హుషారుగా దిగి లోపలికి వెళ్ళినాడు. వాసుదేవరావు సాలోచనముగా దిగి మంద గమనముతో లోపలికి వెళ్ళినాడు.

రాత్రి పన్నెండు గంటలు కావచ్చింది. యావద్విశ్వమూ నిద్రపోతున్నది. చతుర్దశి అయినందున ఆకాశాన నక్షత్రాలుమాత్రము మిణుకు మిణుకు మంటున్నవి. మహా ప్రశాంతముగా ఉంది.

చాదరి సొమ్మసిల్లి నిద్రపోతున్నాడు. వాసుదేవరావుకుమాత్రము రెండు రాత్రిళ్ళనుంచి నిద్రలేదు. సీతను చూచినప్పటినుంచీ ఆమెమీద అతనికి అఖండ మయిన అనురాగము కలిగింది. అతను బ్రహ్మచర్యము అనుష్ఠించవలె ననే సంకల్ప ముతో ఉన్నాడు కాబట్టి ఆమెను ప్రేమిస్తున్నట్టు అతనికి తెలియలేదు. అతనికి తెలియకుండానే అత నామెను ప్రేమిస్తున్నాడు. ఎంత ప్రయత్నముచేసినా అతనికి నిద్ర పట్టలేదు, కళ్ళు మూతలుపడడము లేదు. ఏదో ఆలోచన ప్రారంభించినాడు.

ఏ ఆలోచన చేయబోయినా సీతే రావడము మొదలుపెట్టింది. ఒక్క క్షణము ఊరుకొన్నాడు. సీతకూ తనకూ ఏమిటి సంబంధమని ఆత్మపరీక్ష ప్రారంభము చేసి నాడు. అతను ఆరు సంవత్సరములు అహోరాత్రములు సంఘ పునర్నిర్మాణము కోస రము గ్రంథావలోకనము చేసిఉన్నందున సీతకూ తనకూ ఏమీ సంబంధము లేనట్టూ సంఘములో మార్పు తీసుకొనిరావడానికి ఆమె నిమిత్తకారణమయినట్టూ తోచింది. ఇంతటితో ఊరుకోలేదు. ఇంకా ఏమేమిటో యోజనలు చేయసాగినాడు. వివాహ యోగ్యత కలిగి సీత మరొకణ్ణి వివాహమాడి కాపురము చేస్తుంటే ఏలా ఉంటుందో ఊహచేయ మొదలుపెట్టినాడు.

ఎంతసేపటికీ ఊహ తెగలేదు. అట్లాగే పడుకొన్నాడు. సీత అతని ఎదురు గుండా నిలుచున్నట్టు అయింది. ఎవరినో ప్రేమించినట్టూ, ఆ ప్రియుణ్ణి పొందడానికి ఆమెకు వీలులేక పోయినట్టూ, ఆ దుఃఖముతో ఆవిరహముతో ఆమె కృశించి పోయి నట్టూ చివరకు మరణించినట్టూ అతని భావ ప్రపంచములో తోచింది. ఆమె మరణిం చినట్టు తోచగానే చివాలున లేచి కూర్చున్నాడు. పట్టరాని దుఃఖము వచ్చింది. అతను పెద్దపెట్టున అయితే ఏడవలేదు కాని జలజల కళ్ళవెంట నీరు కారింది. ఒక కొంత మోహనరావు పిల్లా మేకలతో విశాఖపట్నము సముద్రపుబడ్డున సాయం త్రము షికారు చేస్తున్నట్టుగా తోచింది. ఇక పట్టరాని కోపము వచ్చింది. మంచము మీదనుంచి లేచి అటూ ఇటూ గబ గబ పచారుచేయడము మొదలు పెట్టినాడు.

రక్తము క్షణక్షణానికి వేడి ఎక్కసాగింది. షికారు చేస్తున్నవాడు చటుక్కున నిలుచున్నాడు. భగవంతుడు లేడా ? అని ప్రశ్నించినాడు. దుష్టశిక్షణము ఈ ప్రపంచములో లేదా ? అని అడిగినాడు. అతని కెవరూ జవాబు చెప్పలేదు. అతని హృదయము శూన్యమయి పోయింది.

అరగంటకు తెలివి వచ్చింది. అతను మంచముమీద వాలినాడు. ఇక సీత కర్మము సీతదే. సీతవిషయము తలపెట్టగూడదనుకొన్నాడు. కళ్ళుమూసుకొన్నాడు. కాని ఆమెనుగురించిన ఆలోచనలే రావడము మొదలుపెట్టినవి. ఆ ఆలోచనలను పారద్రోల నిశ్చయించుకొన్నాడు. కాని అతనికి అంతశక్తి లేకపోయింది. ఏదైనాపుస్తకము చదివేట్లయితే భావాలన్నీ ఆ పుస్తకములోని విషయముమీద లగ్నమయిపోతే సీతవిషయము మరిచిపోవచ్చుననుకొన్నాడు. మంచముమీదనుంచిలేచి దీపము వెలిగించి బల్లమీద పెట్టినాడు. పక్కనే ఉన్న పడకకుర్చీలో జేరగిలబడి బీరువాలో ఉన్న పుస్తకాలకేసి చూడసాగినాడు. పోతరాజుభాగవతము రెండు సంపుటములూ కనుపించినవి. అందులో ఒక సంపుటము తీసి చేతులో పట్టుకొని తెరవగానే ఎక్కడ వస్తే ఆ పట్టు చదవ దలచుకొన్నాడు. తీసే తీయడముతోటే ఈ పద్యము అతనికంట బడ్డది.

అంగవ్రాతములో చికిత్సకుడు దుష్టాంగంబు ఖండించి శే
షాంగశ్రేణికి రక్షసేయుక్రియ నీ యజ్ఞుల్ ......

పుస్తకముమూసి మళ్ళీ ఆలోచనచేయుటను మొదలుపెట్టినాడు. చౌదరి చెప్పిన సలహానుగురించి దీర్ఘముగా యోజనచేసినాడు. మోహనరావును సంహరించడము కేవలము ధర్మముగానూ అదే ఏకైకగతిగానూ కనిపించింది. అట్లాచేస్తే సంఘము దద్దరిల్లిపోయి క్రమశః సంఘములో మార్పువచ్చి తీరుతుంది అనుకొన్నాడు. వెంటనే సీతకు మోక్షము ఇచ్చినట్టూ అవుతుందనుకొన్నాడు. ఒక్కసారి కండ్లురిమి చూసినాడు. తాను మహత్కార్యము చేయబోతున్నట్లుగా తోచింది.

కుర్చీలోనుంచి లేచి వెళ్ళి చౌదరిని లేపినాడు. చౌదరి లేచి కళ్లు నులుముకుంటూ " ఏం " అన్నాడు.

అత్యుత్సాహముతో " నీ ఉపదేశాన్ని ఆచరణలో పెట్టబోతున్నాను " అన్నాడు వాసుదేవరావు.

" ఏమిటి— ? "

" మోహనరావును ఖండించి వేయబోతున్నాను ! "

" నిజంగానా ? "

" నిజంగానే—నిశ్చయంగా ! "

గడియారము ఒంటిగంట కొట్టింది.

" ఏమిరోయి వాసూ, శుభశకున మయింది. "

" ఎవరికోసము అవుతుంది మహాత్కార్యము చేయబోతుంటే ! "

" ఒరే ఇంతకూ నీకు ఈ ధైర్యము ఉంది. సెబాష్, India requires men of your type (హిందూదేశానికి నీబోటి వాళ్ళు కావాలి) అయితే సరేకాని ఎలా చంపదలచుకొన్నావు ? "

" విషము ఇస్తాను. "

" ఓ—అలాచేయడము చాలా కష్టసాధ్యము. బాకుఉంది నాదగ్గిర తీసుకో. సమయము దొరికినప్పుడు ఒక్కపోటుతో ఈలోకములోనుంచి వాణ్ణి తోసి పార వెయ్యి. "

" చాలా బాగుంది, ఇవ్వు. "

" ఎప్పుడూ వెళ్ళడము ? "

" ఈ తెల్లవారుజాము రైలుకే. "

" అచ్ఛా " అంటూ లేచి చౌదరి పెట్టెలో దాచిఉంచిన బాకును వాసుదేవ రావు కిచ్చినాడు. దాన్ని వాసుదేవరావు తీవ్రముగా చూసి మందహాసముచేసి పది లముగా చొక్కాఅడుగున మొలలో దోపుకొన్నాడు. రైలువేళ అయినందున వెంటనే బయలుదేరినాడు. చౌదరి స్టేషన్ వరకూ వెళ్ళి వాసుదేవరావును సాగ నంపినాడు.

౭

ఆరోజున ఠాకురు ఖార్ చంద్రవర్మ ఏసునాథుడు మిథ్యాపురుషుడని ఉప న్యాసము ఇస్తాడని తెలిసింది.

వాసుదేవరావు విశాఖపట్నము వచ్చి రెండురోజు లయింది. మోహనరావు ఎవరో తెలుసుకొన్నాడు. సమయము ఎప్పుడు దొరుకుతుందా ఎప్పుడు అతన్ని ఈ

లోకములోనుంచి తోసి పారవేతామా అని ఆలోచిస్తున్నాడు. రెండు రోజులలోనూ సమయము దొరకక పోయినందున అతనికి విసుగెత్తి పోయింది.

ఆసాయంత్రము వాసుదేవరావు అయిదున్నర గంటలకు అందరితోపాటు ఉపన్యాసము వినడానికి టవున్‌హాలుకు వెళ్లినాడు. అతను హాలులో ప్రవేశించగానే సభను ఏర్పాటుచేసిన వారు వాసుదేవరావును ఎరిగిఉన్నందువల్ల ఆహ్వానముచేసి కూర్చుండబెట్టినారు. ఎప్పుడుబడితే అప్పుడు బయటికి వెళ్ళిపోవడానికి వీలుగాఉండే చోట అతను కూర్చున్నాడు. కొంచెముసేపటికే మోహనరావుకూడా వచ్చి అతని ఎదటఉన్న కుర్చీలో కూర్చున్నాడు. అతన్నిచూడగానే ఇక ఆరోజు సమయము దొరికిందనుకొని వాసుదేవరావు ఎంతో సంతోషించినాడు. బాకు ఉన్నదో లేదోనని ఒకసారి చూసుకొన్నాడు. అది ఉండనే ఉంది. అప్పుడే అతను మరణించినట్లు, మరణానంతరము ఏమేమి జరిగేది వాసుదేవరావు ఊహ చేయసాగినాడు.

ఉపన్యాసము సకాలముకే ప్రారంభమైంది. ఉపన్యాసకుడు తెగ అరచి మాట్లాడుతున్నాడు. రాత్రి సుమారు ఏడున్నర ఎనిమిది గంటలు కావచ్చింది. ఇంకా మోహనరావు లేచి ఒంటరిగా వెళ్ళడేమా అని వాసుదేవరావుకు తహతహ పుట్టింది. ఒకవేళ ఉపన్యాసము అయ్యేటంతవరకూ ఉండి అందరితోకలిసి వెళ్ళిపోతాడేమోనని అతనికి తోచింది. ఈలాతోచగానే అతని ప్రాణముపోయినట్లు అయిపోయింది. ఇట్లా డోలాయమానంగా వాసుదేవరావు యోచిస్తూఉండగా మోహనరావు లేచి ఒంటరిగా బయటికి వెళ్ళిపోయినాడు. అతను బయటికి నడిచిన మూడు నాలుగు నిముషాలకు వాసుదేవరావు రెండో కంటివాడికి తెలియకుండా బయటికి వెళ్ళిపోయినాడు.

మోహనరావు బీచి రోడ్డున ఎగువకు వేగముగా నడిచి వెళ్లిపోతున్నాడు. వాసుదేవరావు అతన్ని వెంబడించినాడు. కొంచెముదూరము పోయిన తరువాత మోహనరావు రోడ్డు దిగి సముద్రపు ఒడ్డున నడవసాగినాడు. పావుగంట అయ్యేసరికి కొండలూ తిప్పలూ ఉన్న ప్రదేశము వచ్చింది. అతనియింటికి వెళ్ళడానికి ఒక తిప్ప ఎక్కి దిగవలెను. ఆతిప్పపైన రోడ్డుమీదికి మోహనరావు వెళ్ళినాడు. అతని వెంటనే, తన్ను చప్పున గుర్తుపట్టడానికి వీలులేకుండా వాసుదేవరావు తలకు పాగా చుట్టుకొని నడుస్తున్నాడు. ఆరాస్తా జనశూన్యముగా ఉంది. ఇక అంతకంటే మంచి సమయమూ మంచి ప్రదేశమూ దొరకవని వాసుదేవరావు నిశ్చయించుకొని గబ గబ నడిచి అతన్ని సమీపించినాడు. పక్కను ఎవరో నడుస్తున్నట్లు తోచగానే మోహనరావు

పక్కకు తిరిగి చూసినాడు. వాసుదేవరావు మరీదగ్గిరికి వచ్చేసరికి మోహనరావు ఆగి "ఎవరు నీవు ?" అన్నాడు.

"నీవేనా మోహనరావు ?" అన్నాడు వాసుదేవరావు.

"అవును, నీవెవరవు ?"

"నీపాలిటి యముణ్ణి !"

"ఏమిటి—"

అర్ధోక్తిలోనే వాసుదేవరావు బాకు చర్రున వెళ్ళిపోయి అతని డొక్కలో గుచ్చుకొన్నది. "అయ్యో అయ్యో" అంటూ మోహనరావు కిందపడి పోయినాడు. ఆ బాకుతోటే ముమ్మారు తీవ్రముగా డొక్కలోనూ కంఠములోనూ పొడిచి వాసుదేవరావు కనబడకుండా వెళ్ళిపోయినాడు.

౮

సాయంత్రము చీకటికడబో తుండగా సీత, రమణమ్మ బీచినుంచి హాస్టలుకు వచ్చినారు. అప్పుడే పత్రికల కుర్రవాడు వచ్చి "హిందూ" పత్రికను రమణమ్మకు ఇచ్చినాడు. రమణమ్మ గదిలోకి వచ్చి కూర్చుని పత్రిక తెరిచి చూస్తున్నది. సీత బయట వరండాలో పచారుచేస్తూ ఉన్నది. ఇంతలో రమణమ్మ "సీతా, సీతా" అని పిలిచింది. సీత లోపలికి వెళ్ళింది. ఆమె వెంటనే పత్రిక మడిచిపట్టుకొని "సీతా, నీకు పరమసంతోషకరమైన వర్తమానము చెపితే నాకేమి ఇస్తావు?" అన్నది.

"మిమ్ములను హాస్టలులో నాగదిలోనే ఉండనిస్తాను" అని చిరునవ్వుతో అన్నది సీత.

"కొంటె! విను" అని పత్రిక తెరచి ఇలాచదివింది. "ఘోరమైనహత్య పోలీసు ఉద్యోగులు తీవ్రముగా విచారణ చేస్తున్నారు. హత్యచేసింది ముసల్మాన్ అని తెలుస్తున్నది. విశాఖపట్టణము ౧౭ వ తేది. నిన్నసాయంత్రము మోహనరావు అనే హైస్కూలు ఉపాధ్యాయుడు ఠాకూరు ఖాన్ చంద్రవర్మ ఉపన్యాసము వినడానికి టవున్ హాలుకు వెళ్లినాడు. అక్కడనుంచి ఎప్పుడు బయటకు వెళ్ళిపోయినాడో తెలియదు. రాత్రితొమ్మిది గంటలప్పుడు హాస్పటలు దిబ్బమీదినుంచి సముద్రము వైపుకు వెళుతూ పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టరు రోడ్డుపక్కను కొనఊపిరితో ఎవరో కొట్టుకులాడు తున్నట్టు గ్రహించినాడు. వెంటనే ఆగి ఎలక్ట్రిక్ దీపములో చూసినాడు.

దేహమంతా రక్తమయముగా ఉన్నది. అప్పుడే అతన్ని ఆసుపత్రికి తీసుకొని వెళ్ళినారు. కొనఊపిరితో ఉన్న ఆయువకుడు తన్నెవరో మహమ్మదీయుడు బాకుతో పొడిచినట్టు కైఫీతు ఇచ్చి చనిపోయినాడు. తెల్లవారిన తరువాత విచారించగా న్యాయవాది సూర్యనారాయణరావుగారి కుమారుడనీ అమాయకుడనీ తెలిసింది. పేరు మోహన రావు. పోలీసువారు హంతకుణ్ణి పట్టుకొనడానికి తగిన ప్రయత్నాలు చేస్తున్నారు. "

ఇది రమణమ్మ చదివింది. సీతకు కళ్ళవెంట నీళ్ళు వచ్చినవి. అక్కడనే ఉన్న మంచముపైన పడుకొన్నది. ఆమెను రమణమ్మ చూసి " ఏం ఎందుకుకే పోయినాడని సంతోషపడడముకు బదులు దుఃఖపడుతున్నావేం? " అన్నది. సీత ఏమీ జవాబు చెప్పలేదు. మళ్ళీ రమణమ్మ ఉత్సాహముతో " ఇక నీవు వితంతువు, నీఇష్టమువచ్చిన వాణ్ణి వివాహము చేసుకొని ఖులాసాగా ఉండవచ్చును " అన్నది.

ఏదో ఆలోచిస్తూ " ఎవరు చంపారో? " అన్నది, సీత.

" ఎవరు చంపితే మనకేం. చచ్చిపోయినాడు. ఇక తిరిగి జీవించడు. జీవిస్తాడనే భయముకూడా అక్కర్లేదు. "

" అదికాదండీ. "

" ఏదండీ మరీ ? "

" ఆఁ ఎవరు చంపారోనని ? "

" చదివింది అర్థముకాలేదా ఏం. ఎవరో మహమ్మదీయుడు చంపినట్టు కైఫీతు ఇచ్చినాడు. "

" సరే పోనియ్యండీ. "

" అయితే సీత, ఒకవిషయము అడుగుతాను చెపుతావు? "

" అడగండి చెప్పదగినదయితే చెపుతాను. "

" అబ్బో, చాలాదాకా ఉందే ! "

" ఆఁ కాదు. అడగండి చెపుతాను. "

" అడగమన్నావు ? "

" అడగండి. "

" నీకు కోపము వస్తుందేమో అడగనులే. "

" అబ్బా, ఫరవాలేదు అడుగుదురూ ! "

" అయితే సీతా, నీవిదివరకైనా ప్రేమించినావా ? "

సీత సిగ్గుతో " మీకు చెప్పకుండా అయింది. చెపుతాను. ఇప్పుడు కాదు లెండి " అని పోబోయింది.

" ఆఁ ఆఁ కాదు. కాదు. చెప్పు. "

" భోజనముచేసి వచ్చినతరువాత చెప్తానులెండి. "

" కాదు ఇప్పుడే చెప్పవలె. ఆయువకుణ్ణి ఎరిగి ఉంటే—"

" అబ్బ, ఇప్పుడు కాదులెండి. "

ఇంతలోనే భోజనాలగంట గణ గణ మ్రోగింది.

" ఇదుగో సీతా, గంట అయింది వెళుదాము చెప్పు మరి. "

" అబ్బ ! ఆనిక చెప్తానులెండి. "

" పోనీలే. దాచిపెట్టుకో. "

సీత తలవంచుకొని " మీ — తమ్ముడుగారిని " అన్నది.

రమణమ్మ ఆశ్చర్యముతో " నిజంగానా సీతా ! " అన్నది.

గంట రెండోసారి మరింత తీవ్రముగా మ్రోగింది. ఇద్దరూ భోజనము చేసి వచ్చి గదిలో కూర్చున్నారు. కొంచెమసే పయిన తరువాత ఇద్దరూ ఒకపక్కలోనే పడుకొన్నారు. ఉభయులూ ఒత్తిగిలి పడుకుని ఒకరి నొకరు మందహాసముతో చూసుకొన్నారు. " అయితే సీతా, మా వాడు కూడా నిన్ను ప్రేమిస్తున్నాడా ? " అని సాలోచనముగా రమణమ్మ ప్రశ్నించింది.

" అదే చాలా సందేహముగా ఉంది. "

" అవును. వాడికి వివాహము చేయవలెనని నాకు చాలా మనసు. చెపితే వాడు వినేటట్టు కనుపించదు. వా డేదో పిచ్చి బ్రహ్మచర్య మంటాడు. నాకు వాడి గోలే పట్టింది. సీతా, నీవు వాణ్ణి ప్రేమించావంటే నా కపరిమితమయిన సంతోష ముగా ఉంది — సరే వాడు నిన్ను ఏలా పెండ్లిచేసుకోకపోతాడో చూస్తాను కాదూ. నీవు నిజంగా వాణ్ణి చేపట్టదలచినావా ? "

" ఊఁ "

" అయితే నేను చెప్పినట్టు నడుచుకొనేట్లయితే నీకూ వాడికీ తప్పకుండా వివాహము అవుతుంది. లేకపోతే ఏమో. "

" అలాగే. "

" అయితే సీతా, ఒకవేళ మీ నాయనగారు ఒప్పుకోకపోతే ? "

" ఒప్పుకోకపోతే ఏం. అయినా నా కీవిషయములో మా నాయనగారు ఆమాత్రము స్వాతంత్ర్యము ఇవ్వకపోరు లెండి. "

" అయితే నీవు నాకు మరదలువు కాబోలు. "

" మీరు ఆడబిడ్డగారు కాబోలు. "

రాత్రి పదిగంట లయినందువల్ల హాస్టలుదీపములు ఆరిపోయినవి. ఇద్దరూ ఎవరిమట్టుకు వారు ఏదో ఆలోచించుకుంటూ నిద్ర పోయినారు.

తెల్లవారింది. ఒకరినొకరు చూసి నవ్వుకొన్నారు. సీత ముఖము వికసించింది. ఆ వికాసము స్పష్టముగా కనబడుతూనే ఉంది. ఇక వారిద్దరూ కార్యసానుకూలము అయ్యేటందుకు ఆలోచనలు ప్రారంభించినారు. అనుక్షణమూ సంకల్ప వికల్పాలతో మూడురోజులు గడిపినారు. చిట్టచివరకు మూడోరోజు సాయంత్రము వాసుదేవ రావును మద్రాసు రమ్మంటూ రమణమ్మ ఉత్తరము వ్రాసింది. అతను గుంటూరులో చౌదరిదగిర ఉన్నాడని వారు అనుకొన్నారు. ఉత్తరము పోష్టుకు పంపించినారు. మూడోరోజుకు అతను తప్పక వస్తాడని వా రనుకొన్నారు. ఇక అతను వచ్చిన తరు వాత ఏవిధముగా అతనితో మాట్లాడి ఒప్పించవలెనో అని రమణమ్మా, ఏవిధముగా తను ప్రవర్తించవలెనో నని సీతా, యోజనలుచేయడము మొదలుపెట్టినారు. వారు అత్యానందములో ఓలలాడు తున్నారు.

యథా ప్రకారము సాయంకాలము "హిందూ పత్రిక" వచ్చింది. రమణమ్మ పత్రిక తీసుకొని మధ్యపుట తెరిచి చదవసాగింది. క్షణములో ఆమె నిర్ఘాంతపోయింది. కళ్లు గిర్రునతిరిగిపోయినవి. క్షణలేశములో ఆకళ్ళవెంట బాష్పములు ధారలుగా ప్రవ హించ సాగినవి. ఇదంతా సీత చూసి భయభ్రాంత అయిపోయి, "ఏమండీ—ఏమి టండీ ?" అని ఆత్యాత్రముతో ప్రశ్నించింది. రమణమ్మ కళ్ళవెంట అశ్రువులు కురి పిస్తూ ఆపత్రికను సీతకు అందించింది. సీత తీసుకొని ఈవిధంగా పత్రికలోనుంచి చదవ సాగింది.

"మోహనరావు హత్య. వాసుదేవరావు అరెస్టు కాబడినాడు. అతని కేఫీతు. సెషన్సుకు వేయబడింది. గుంటూరునుంచి బారిష్టరు రామయ్యచౌదరి వచ్చి సెష న్సులో వాసుదేవరావు తరఫున పనిచేస్తారని తెలుస్తున్నది. పట్టణ మంతా ఈకేసును గురించే చెప్పుకుంటున్నారు. ఎక్కడ చూసినా హడావుడిగా ఉంది." సీత ఇదంతా చదవడము ముగించింది. అట్టే మంచముమీద వెల్లకిలబడ్డది. ఆమె ఏమీ మాట్లాడ లేదు. మరొకవైపు ఆమె దృష్టి పోలేదు. ఆపత్రికలో ఉన్న వాసుదేవరావు బొమ్మనే చూస్తూ ఉన్నది. నోట తడిలేదు. తదేకముగా యోజనచేస్తున్నది. చేతులోనుంచి పత్రిక జారి కింద పడిపోయింది. ఆమె కాసంగతి తెలియనే తెలియదు.

రమణమ్మ ఆమెను చూసింది. ఆమె కింకా దుఃఖము ఎక్కువైపోయింది. వెళ్ళి సీత పక్కలో కూర్చుని కళ్ళనీళ్లు కారుస్తూ " సీతా, విశాఖపట్టము వెళ్లి మావాణ్ణి

చూస్తామని ఉంది. నీవుకూడా వస్తావా ?" అన్నది. సీత మారుమాట చెప్పకుండా సంసిద్ధురాలుగా ఉన్నట్టు లేచి నిలుచున్నది. వెంటనే రమణమ్మ సామానులు సర్ది కాలేజికి సెలవుచీటి వ్రాసింది. రైలుకు ఉభయులూ బయలుదేరినారు. వారు ఒక్క మాటయినా మాట్లాడుకోలేదు.

౬

మెయిలు అప్పటికే వెళ్లిపోయినందువల్ల రమణమ్మ, సీత ప్యాసెంజరులో ప్రయాణముచేయడము తటస్థించింది. ఆప్యాసెంజరు వారి దురదృష్టవశమున బెజవాడవరకే వెళ్లి ఆగిపోయింది. అక్కడనుంచి తిరిగీ ప్యాసెంజరు పన్నెండు గంటలయిన తరువాతగాని బయలుదేరదు. అందువల్ల వారు విశాఖపట్టణము చేరడానికి రెండున్నర రోజులు పట్టింది. వారు విశాఖపట్టణము చేరే సరికే వాసుదేవరావుకు జడ్జిగారు ద్వీపాంతరవాస శిక్ష వేయడమున్నూ అతన్ని రాజమండ్రము జయిలుకు తీసుకుని వెళ్ళడముకూడా జరిగింది. ఈపిడుగువంటి వర్తమానము వారు తెలుసుకుని గుండె లవిసిపొయ్యేటట్టు దుఃఖించినారు. ఆపూటే రాజమండ్రము ప్యాసెంజరులో బయలుదేరి వెళ్ళిపోయినారు. మరునాడు ఉదయమే జయిలు అధికారులకు అతనితో మాట్లాడడముకు అవకాశము ఇప్పించవలసినదని దరఖాస్తుచేసినారు. రెండవనాడు మధ్యాహ్నము వారు వాసుదేవరావును చూడడముకు జయిలు అధికారి అనుజ్ఞ ఇచ్చినాడు.

మధ్యాహ్నము సుమారు ఒంటిగంటకు వారుభయులూ కలిసి జయిలుకు వెళ్ళినారు. జయిలు సింహద్వారముదగ్గిర ఒక అరగంటసేపు కూర్చున్న తరువాత లోపలికి వెళ్ళడానికి ఉత్తరువు వచ్చినది. వారివెంట జయిలు నౌకర్లు ఉండి వలయాకారముగా ఉన్నజయిలు ఆవరణలో మధ్యఉన్న కచ్చేరిలోకి తీసుకుని పోయినారు. అక్కడ మేడమీద సూపరింటెండెంటుగదిలో వారు చెరిఒక కుర్చీమీద కూర్చున్నారు. కొంచెము సేపటికి వాసుదేవరావును అక్కడికి ఇద్దరు నౌకర్లు వెంటబెట్టుకుని వచ్చి నిలుచున్నారు. వాసుదేవరావుకు జయిలు అధికారులు ఆరోజు ఉదయమే ఆయుష్కర్మ చేయించారు. అతనికి గడ్డములేదు, క్రాపింగ్ లేదు. సన్నని పాముకుబుసములాంటి ఉప్పాడ ఉత్తరీయములేదు. గ్లాసుగోమల్లు ధరించి ఉండలేదు. లాల్చీ లేదు. చిన్న చేతులచొక్కా, తలకు తెల్లనిటోపీ, మెడలో నెంబరుబిళ్ళ, మోకాళ్ళపైకి ఇజారూ, కాలికి ఇనుప కడియముతో ఉన్నాడు. అతను సీతను చూడగానే మందహాసముచేసినాడు. అయితే సీత మందహాసము చేయలేక నిష్కంపముగా

ఉండి పోయినది. ఆమె ముఖము త్రుటిలో శూన్యమయిపోయింది. తల వంచింది. బొటనవ్రేలితో నేలమీద రాస్తూ నిలుచున్నది.

రమణమ్మ అతన్ని చూడగానే అపురున ఏడ్చి అతన్ని కౌగలించుకో బోయింది. జయిలు అధికారి అట్లుచేయడముకు వీలులేదని సంజ్ఞ చేసినందున ఊరుకున్నది. " నాయనా—" అని ఏమో చెప్పబోయింది. ఆమె కంఠము రుద్ధమయింది. మాట పెగలలేదు, తదేకముగా కళ్ళవెంట నీరు కారుస్తున్నది.

" అక్కయ్యా, ఎందుకు ఏడుస్తావు? సీతకు సౌఖ్య మిచ్చి నేను దుఃఖము అనుభవించదలచుకున్నాను. దేశమంతా ఈనాచరిత్రతో గగ్గోలు అయిపోతుంది. నాయందు నీకు అనురాగముఉంటే నేను ద్వీపాంతరవాసముచేసి తిరిగి వచ్చేసరికి ఈదేశములో హిందూలా divorce అంగీకరించేటట్టుచేయడానికి ప్రయత్నముచెయ్యి."

" వాసూ, నీవు అప్పీలు చేస్తే నీకు ఖైదు తప్పుతుందేమో. "

" ఖైదు తప్పదు. ఖైదు తప్పవలెనని నేను అతన్ని చంపలేదు. సీతకు వివాహస్వేచ్ఛ ఇవ్వడమే నాసంకల్పము. "

" అయ్యో, ఎంత వెర్రివాడివిరా వాసూ ! సీత నిన్నుకాదుటరా ప్రేమిస్తున్నది. తెలుసుకోలేక పోయినావా ? ఏరోజునైతే మోహనరావు చనిపోయినట్టు పేపరులో వచ్చిందో ఆరోజు రాత్రంతా సీతా నేనూ వివాహాన్ని గురించే ఆలోచించాము. నీకు ఉత్తరము వ్రాయవలెననుకుంటూ నాల్గురోజులు గడిచేసరికి పిడుగులాంటి ఈవర్తమానం విన్నాము. "

వాసుదేవరావు నిర్ఘాంతపోయినాడు. ఒక్కసారి సీతను సాలోచనముగా చూసినాడు. సీత అతనివంక సవినయముగా చూసింది. ఆఉభయుల నేత్రద్వంద్వములూ ఒక్కక్షణకాలములో దివ్యభాషలో ఏమేమో మాట్లాడుకున్నవి. వాసుదేవరావు సీతవంక ఇంకాచూస్తూనే " సీతా నేనెన్నడూ నిన్ను భార్యగా పరిగ్రహించవలెనని అనుకోలేదుసుమా ! " అన్నాడు.

" నాకు తెలుసు. "

" తెలిసి ఉండి నన్నేలా ప్రేమించినావు ? "

" దైవికము ! నేను చెప్పలేను. "

" అయితే ఇప్పుడు నాస్థితి చూస్తూనే ఉన్నావు. అంతేకాదు. నేను బ్రహ్మచర్యము అవలంబించవలె ననుకున్నాను. పై హెచ్చు నాబోటి అరసికుణ్ణి నీవు ఎలా

ప్రేమించావో నాకే ఆశ్చర్యముగా ఉంది. నేను ఎంతటిదారుణకార్యమునకైనా ధర్మ మని తోస్తే వెనుదీయను. స్త్రీలు కోరే మార్దవము నాలో లేదు. నేను కేవల పాషాణ హృదయుణ్ణి. ఇప్పుడు ఖైదిని. నన్ను ప్రేమించడ మేమిటి ? ”

“ మీరు ఖైదీలయితే నేను కూడా జయిలులోకే ఖైదీ అయి వచ్చి ప్రతి నిత్యమూ మీ ముఖావలోకనమయినా చేసుకుంటూ జన్మ వెళ్ళబుచ్చుతాను. ”

“ సీతా, నీవు వెర్రి దానివి. నీ వేమి మాట్లాడుతున్నావో నీకు తెలియదు. మరొక యువకుణ్ణి యోగ్యుణ్ణి ప్రేమించు. వివాహము చేసుకో. నేను ఈ జయిలులో నుంచే ఆశీర్వాదము చేస్తాను. ”

“ నా కీలోకములో మీరు తప్ప నాథులుగా ఉండతగినవా ళ్ళెవరూ లేరు.”

“ వెర్రి అభిప్రాయము. ”

“ కాదు. ”

“ నేను చేసినది ఘనకార్యమని తలచి ఇట్లా అనుకుంటున్నావు. ”

“ ఎంతమాత్రమూ కాదు. కిందటి మార్చి ౧౮ వ తేదీ సాయంకాలము మొట్టమొదటిసారి చూసినప్పుడే మిమ్ములను భర్తగా వరించినాను. ”

“ సీతా, లాభము లేదు. ”

“అవును. మిమ్ముల నన్నదోషము లేదు. ఇదంతా నేను పుట్టిన వేళావిశేషము. తల్లిదండ్రులకు దుఃఖము కల్పించినాను. అత్తమామలని లోకము అనుకుంటున్న వాళ్ళకు పుత్రవియోగదుఃఖము కల్పించాను. ఆయన భార్యకు భర్తృవియోగ దుఃఖము కల్పించాను. మిత్రురాలికి సోదరకారాగృహ ప్రవేశ దుఃఖము కల్పించాను. మిమ్ములను హంతకులను చేశాను. చివరకు మీబోటి అలభ్యులను ఒళ్ళు పై తెలియక ప్రేమించి నేనే — నాకే ఆ జన్మాంతమూ దుఃఖము కల్పించుకున్నాను. నా అంత దౌర్భాగ్యురాలు, కిరాతురాలు పుట్టబోదు. ”

“ సీతా, దుఃఖపడకు. నన్ను ప్రేమించి ప్రయోజనమేమిటి ? నేను పద్ధాలుగు సంవత్సరాలవరకు జయిలులోనుంచి రావడమునకు వీలులేదే ! ”

“ కావచ్చును, అయితే ఏమి, అంతవరకూ వేచిఉంటాను. ”

“ ఆః అమానుషము, అమానుషము ! ”

“ అమానుషము కాదు. మీరు తెలిసినవారు. సీతాదేవి రాములవారి కోసము ఎంతకాలము వేచిఉన్నదో జ్ఞప్తికి దెచ్చుకోండి ! ”

" వారు పురాణపురుషులు. "

" మనమూ పురాణ పురుషుల మవుదాము. "

" ఏమన్నావు సీతా ?

" మనమూ పురాణ పురుషులము కాగలమన్నాను. "

" నిజంగా నా ? "

" నిజంగా మీరు చక్రధరులు. "

" అయితే నీవు సత్యావు అన్నమాట " అని సీత చెయ్యి ముద్దుపెట్టుకున్నాడు కళ్ళనద్దుకున్నాడు. జయిలు అధికారులు అట్లా చేయకూడదని వారించినారు. వాసుదేవరావు అక్కగారివంక చూసినాడు. దుఃఖసముద్రములో మునిగిఉన్న మనిషి తెప్పకొయ్య దొరికితే ఎటువంటి సంతోషమువస్తుందో అటువంటి కించిత్సంతోషము ఆమె ముఖములో కనుపించింది. వాసుదేవరావు పెద్దవేడినిట్టూర్పు విడిచి ఆమెవంక చూస్తూ " అక్కయ్యా, నాకేసు అపీలుచేయడానికి అంగీకరించానని నాస్నేహితుడు బారిష్టరు చౌదరికి తెలియజెయ్యి. ఒకవేళ నాకు శిక్ష కొంతతగ్గిస్తారేమో" నన్నాడు.

ఇంతలో జయిలు అధికారి అప్పటికే కాలాతీత మయిపోయిందని విసుగు కుంటూ నిర్బంధముగా వాసుదేవరావును తీసుకుని వెళ్ళినాడు.

* * *

మద్రాసు హైకోర్టులో వాసుదేవరావు కేసు అప్పీలు విచారణకు వచ్చింది. చౌదరి వాసుదేవరావుపక్షము వాదన చేయడానికి నిలవబడినాడు. ఆవ్యాజ్యము అసామాన్యమనే కారణముతో ఏఇద్దరో ముగ్గురో న్యాయాధికారులుకాక యావన్మంది న్యాయాధికారులూ విచారించవలసినట్టు పట్టుబట్టి శక్తియుక్తులను వినియోగించి చౌదరి కృతకృత్యుడయినాడు. యావన్మంది మద్రాసు న్యాయాధికారుల ఎదుటను చౌదరి తనవాక్చక్యము వినియోగించి వాసుదేవరావు చేసినహత్య కేవలము ధర్మము అని ఋజువుచేసినాడు. న్యాయాధికారులు కూడా చౌదరి అభిప్రాయములో ఏకీభవించినారు. కాని ప్రయోజనము లేకపోయింది. విధిలేక చిట్టచివరకు న్యాయాధికారులు వాసుదేవరావు అయిదు సంవత్సరములు మాత్రము కఠినశిక్ష అనుభవించేటట్టు తీర్పుచెప్పినారు.

ధర్మ సంస్థాపనము

౧౦

అనకాపల్లిలో అభినవ శబరి అభినవ రామమూర్తి కోసము ఎదురుచూస్తూ రోజులు లెక్కపెడుతూ వెంకటరావుగారి ఇంట్లో ఉన్నది. నాల్గు సంవత్సరముల పది కొండుమాసము లయింది. ఇంకా 30 దినములకు వాసుదేవరావు వస్తాడని అతన్ని ఎలా ఆహ్వానము చేయుదమా అనీ యోజనచేస్తున్నది. పన్నెండో నెల సగపడింది. సీతకు రోజురోజుకు ఉత్సాహము ఎక్కువవుతున్నది. ఆ వేళ సాయంత్రము బయట వరండాలో సీతకూర్చుని ఏమో ఆలోచించుకుంటున్నది. చేతులో వాసుదేవరావు ఛాయాపట మున్నది. ఆమెఎదుట ఎవరో నిలుచున్నట్టుగా తోచింది. చూసేసరికి వాసుదేవరావు !

చింపిరితలతో మలిన వస్త్రములతో కర్కశ దేహముతో ఉన్నట్టు ఆమెకు తెలియనే లేదు. వాసుదేవరావును మంద స్మితముతో సమీపించింది. వెంటనే లజ్జ వచ్చింది. ముఖము వంచుకున్నది. దేహము కుంచితమయినది. అయితే వాసుదేవరావు ఆనందముతో ఆమెవీపుమీదుగా దక్షిణహస్తము కటిస్థలముపై నుంచినాడు. ఆమె తన వక్షఃస్థలమును అతని వక్షస్థలమునూ ఏకము చేసింది. తనగడ్డముకిందుగా ఉన్న దొండపండుమీద వాసుదేవరావు దంతక్షతము చేసినాడు.

*

చిత్రరువు

మొక్కపాటి
నరసింహశాస్త్రి.

౧

లజ్ చర్చి రోడ్డు, మైలాపూర్
జూలై ౧౭, ౧౯-

అయ్యా: నే నీరోజు ఉదయమే ఇక్కడికి వచ్చినాను. నేటి సాయంకాల మైదు గంటలకు తమరు నా బసకు దయచేసినట్లైతే మన ముఖ్యులమూ కాలేజీకి వెళ్ళి పిల్లను చూచి తరువాత సంగతి మాట్లాడవచ్చును. ఈ సాయంకాలము పిల్లను చూచుటకు ప్రిన్సిపాలు అనుమతిని పొందినాను. తొందరపను లుండుటచేత తిరిగి ఈ రాత్రే నేను వెళ్ళిపోవలెను. కాబట్టి తాము సాయంకాలము తప్పక దయచేస్తా రని నమ్ముతాను.

విధేయుడు,

భ. కుటుంబరావు.

ఆనాడు సాయంకాలము కొంచెము వర్షము కురిసి వెలిసింది. అస్తమించబోతున్న సూర్యకాంతి బంగారు నీరువలె చూడడానికి ముచ్చటగా ఉన్నది. ఆకు నంటి ఉన్న ప్రతివానచినుకూ నక్షత్రములాగ ప్రకాశిస్తున్నది. తూర్పున పెద్ద ఇంద్రధనస్సు ఆకాశాన్నీ భూమినీ కలిపి వేసింది.

చట్‌పట్‌లో తన బంగాళాలో పడకగదిలో అద్దానికి ఎదురుగా నుంచుని ప్రపంచములో తనకుమరొకఆలోచన ఏమీ లేనట్లుగా తదేకదీక్షతో 'బో' సవరించుకుంటూ నిలబడ్డాడు నారాయణరావు. ఆసవరణ అయిన తరువాత కాస్తసేపు తన ప్రతిబింబముకేసి చూచుకొని నేవీబ్లూ కోటు తొడుక్కొని పట్టు సేలంకండువా పైన వేసుకొని పైఉత్తరము బల్లమీదనుంచి తీసి మళ్లీ చదువుకొని జేబులో పెట్టుకొని చేతికర్ర తీసుకొని మళ్ళీఅద్దములో ఒకసారి చూచుకొనిఅద్దముపైన గోడనున్న పటము కేసి చూచినాడు.

ఆ పటమునందు సుమారు ఇరవై సంవత్సరముల వయస్సుగల జవ్వని రూపు చిత్రింపబడి ఉన్నది:

'కలకల నవ్వినట్లు తెలిగన్నుల నిక్కము చూచినట్లతో

బలుక గడంగినట్ల కడు భావగభీరత లబ్బినట్ల పెం

పొలయ దనర్చి జీవకళయుట్టిపడ, ...

చిత్రింపబడిన ఆపటము చూస్తే అందులో ఉన్నరూపవతి జీవము తాల్చిఉంటే ఇంకా ఎంత అందముగా ఉండేదో అనిపిస్తుంది. ఆ కన్నులలో గభీరత ఎంతమందిని ముగ్ధులను చేసిందో అని ఆలోచన కలుగుతుంది. ఆ పెదవులపైన నాట్యమాడే వెన్నెల ఎంతమందికి మతిభ్రమ కలుగజేసిందో అని భయమువేస్తుంది. తాను ప్రేమించిన పురుషునకు స్వర్గసౌఖ్యము చవిచూపించి మర్త్యలోకమునుంచి ఎత్తివేసి దేవత్వము ఇప్పించి ఉంటుంది.

ఆ పటముకేసి నిదానముగా ఒక్కమారుచూచి "మోహినీ, వెళుతున్నాను, నీ తుదికోరిక చెల్లించబోతున్నాను, తరువాత నన్నేమీ అనకు!" అన్నాడు నారాయణరావు. ఆ సౌందర్యరాశి, కన్నులలో ఆనందము నాట్యమాడుతున్నట్లూ, పెదవులు వెళ్లండి అంటున్నట్లూ నారాయణరావుకు తోచింది. ఒక్క నిట్టూర్పువిడిచి నెమ్మదిగా మేడమెట్లు దిగివచ్చి బయటనున్న మోటారుకారు ఎక్కి ఆయన లజ్ చెర్చి రోడ్డుకు వెళ్లినాడు.

౨

నారాయణరావు సుమారు ముప్పైఅయిదు సంవత్సరముల వయసువాడు, బ్రాహ్మణుడు, కులీనుడు. ఇరవైయో సంవత్సరముననే బి. యే. ప్యాస్ అయినాడు. తండ్రి వెంకట్రావు రత్నవ్యాపారము చేస్తూఉండేవాడు. ఆయన చాలా డబ్బు ఆర్జించినాడు. కొడుకు బి. యే. ప్యాస్ కాగానే అతనినికూడా వర్తకములో ప్రవేశపెట్టి ఆరుమాసములు తరిఫీదుచేసి యూరపులోని గొప్పవర్తకులతో ఖాతాలు ఏర్పాటు చేసుకొని రమ్మని పంపించినాడు.

నారాయణరావు సుఖముగా ఒకసంవత్సరముపాటు దేశాటనము చేసినాడు. యూరపు అంతా తిరిగి అమెరికా చూచి జపానుమీదుగా స్వదేశము చేరినాడు. కావలసినంత లోకానుభవమూ, విజ్ఞానమూ, సంపాదించినాడు. ఎక్కువ పెద్దమనిషితరహా మర్యాదా సంపాదించినాడు. అతను స్వదేశానికి తిరిగివచ్చిన ఆరుమాసముల లోనే తండ్రి కాలముచేసినాడు. ఆయన పోయినప్పటినుంచీ వ్యాపారమంతా తానే చూచుకోవడ మారంభించినాడు. వర్తకులలో ఇంత మంచివాడూ న్యాయస్థుడూ మరొకడు లేడనేపేరు కొద్దికాలములోనే సంపాదించినాడు. దానితో వ్యాపారము హెచ్చినది. వ్యాపారము హెచ్చినకొలదీ అతనికి శాంతమూ సౌమ్యతాకూడా హెచ్చినవి. అతని పెదవుల పైని మందహాసమూ కన్నులలోని దయా ముఖము

నందలి గాంభీర్యమూ చూచి, "ఏమి మనిషి, ఏమి అదృష్టము !" అని అనుకోని వాళ్ళు లేరు.

నారాయణరావు బి. యే. సీనియర్ చదువుతూ ఉండగా భార్య కాపురానికి వచ్చినది. సూదిలో దారములాగా ఒకరి మనస్సులో ఒకరు మెలగుతూ, ఎప్పుడూ ఒకరి నొకరు విడువకుండా దేవతలకుకూడా అసూయాజనకమైన ఆనందమును అనుభవిస్తూ ఉండేవారు. ఈదంపతులను చూచి మెచ్చుకొననివారు కానీ, వీరి అదృష్టమును కొనియాడనివారు కానీ లేరు.

ఇంతమంది కళ్ళా నోళ్ళా పడ్డ సౌఖ్యము ఎన్నాళ్ళు నిలుస్తుంది ! ఎంతసంతోషదాయకమైనా శరత్కాలపూర్ణిమ ఎల్లకాలమూ ఎందు కుంటుంది? చూస్తూ చూస్తూ ఉండగా నాలుగురోజులు విషజ్వరము కాచి పూర్తిగా వికసించిన పుష్పము వలె రాలిపోయింది ఇతని భార్య. ప్రాణము పోయేవరకు బాగా తెలివిగా ఉన్నది. జబ్బులోకూడా ఒక్క క్షణమైనా విడువకుండా నారాయణరావు ఆమెను కనిపెట్టుకొనే ఉన్నాడని వేరే చెప్పడ మెందుకు ! ఇంకొకగంటకు ప్రాణము పోతుందనగా భర్తదగ్గిర సెలవుపుచ్చుకొని అతనిని బెంగపెట్టుకొన వద్దని ధైర్యము చెప్పి ఏమీ సందేహించక తిరిగివివాహము చేసుకొమ్మని కడసారి ఒక ముద్దు పెట్టుకొని అతని చేతులలోనే ప్రాణములు విడిచింది.

కొంతసేపటివరకూ నారాయణరావుకు ఒళ్ళు తెలియలేదు. చేష్టలుడిగి కళావిహీనము కాక మామూలుగా నిద్రపోతూ ఉన్నట్లుగా ఉన్న తన భార్య ముఖంకేసి రెప్ప వాల్చకుండా చూస్తూ అలాగే కూర్చున్నాడు. తరువాత తెలివి తెచ్చుకొని ఆమెకు అంత్యవిధులు జరిపినాడు.

తరువాత కొన్ని దినాలవరకూ మతిలేనివానివలె తిరిగినాడు. భార్యపోయిన సంగతే తెలియనట్లుగా ఉండేవాడు. ఏ పుట్టింటికో వెళ్ళినట్లు భావించుకొంటూ ఉండేవాడు. అందరూ ఇతనికి పిచ్చెత్తుతుందేమో నని భయపడే వాళ్ళు. కొన్ని దినా లిలా జరిగిన తరువాత అతనికి మతి కుదుటపడ్డది. తన నష్టమును తెలుసుకొన్నాడు. దుఃఖసముద్రము దాటడానికి అతను పడ్డ అవస్థ చెప్ప శక్యముకాదు.

నారాయణరావు భార్యతో ఒకసారి బొంబాయి వెళ్ళినప్పుడు అక్కడ ఒక ప్రసిద్ధ చిత్రకారుని చేత తన భార్య రూపమును చిత్రింపించి అప్పటినుంచీ దానిని తన పడకగదిలో పెట్టుకొన్నాడు. ఆ పటము అంత సజీవముగా ఉన్నందుకు అనేకమంది చిత్రకళానిపుణులు ప్రశంసించినారు. భార్య ఊళ్ళో లేనప్పుడు రోజూ లేవగానే ఆ బొమ్మ నొక్క ముద్దుపెట్టుకొని మరీ ఇవతలికి వచ్చేవాడు. భార్య పోయిన

పిమ్మటకూడా ఆ పటమునఁ ఆమె జీవించి ఉన్నట్లుగానే భావించి ఆమెతో మాట్లాడుతూ ఉండేవాడు. క్రొత్తగా కాపురానికి వచ్చిన రోజులలో ఆమెకు 'మోహిని' అని అతను ముద్దుపేరు పెట్టుకొన్నాడు. ప్రతిరోజూ సాయంకాలము ఇంటికి రాగానే దుస్తులు విడిచి సావకాశముగా పటము దగ్గిర కూర్చొని, "మోహినీ, ఇవాళ ఏమి జరిగిం దనుకున్నావు" అని ఆనాటి విశేషము లన్నీ పూస గుచ్చినట్లు చెప్పేవాడు. మళ్ళీ ఉదయాన బయటికి వెళ్ళేటప్పుడు, "మోహినీ, వెడుతున్నాను, ఇవాళ" అని ఆరోజు తన కున్న పని అంతా చెప్పేవాడు. ఇలా చెప్పేటప్పుడు ఆమెముఖము ఒకప్పుడు నవ్వుతున్నట్లూ, ఒకప్పుడు చిట్లించినట్లూ అతనికి కనబడుతూ ఉండేది. ఆమె ముఖవైఖరిని బట్టి తానుచేయబోయే కార్యము ఆమె కిష్ట ముందో లేదో తెలుసుకొని ఆ ప్రకారము తాను నడుచుకొంటూ ఉండేవాడు.

భార్యపోయి సుమా రైదు సంవత్సరము లైనది. మొదటిరోజులలో ద్వితీయ వివాహము చేసుకొనవలసిన దని అనేక మంది హితోపదేశము చేసినారు. అనేక సంబంధము లెక్కడెక్కడినుంచో వచ్చినాయి. ఆ సంగ తెప్పుడూ తన దగ్గిర తల పెట్ట వద్దని తన స్నేహితులతోటి గట్టిగా చెప్పినాడు. తన కష్టములు మరచి పోవడానికి క్రమేణా వ్యాపారము బాగాచేసి ధనార్జన చేయవలె ననే పట్టుదల బయలుదేరినది. డబ్బు విశేషముగా వస్తూ ఉన్నకొద్దీ అతనికి లుబ్ధత్వము హెచ్చినది దాని తోబాటు హృదయము కొంచెము కర్కశత్వము వహించినది. దయాదాక్షిణ్యాములు తగ్గినాయి. వెనుకటి సౌమ్యత వెనకంటింది. చిరాకూ కోపమూ హెచ్చినాయి. తన స్వభావములోని మార్పు తానే కనిపెట్టినాడు. ఇటువంటి మార్పుకు కారణ మేమై యుంటుందా అని విచారించినాడు. తనలో మంచిచెడ్డలను సవరించుటకూ, హృదయ కాఠిన్యమును మృదుల పర్చుటకూ, ప్రేమ స్వరూపురా లైన రాధిక ఒకర్తె లేకపోవడముచేత కదా అనుకొన్నాడు. ఇలా కొంతకాలము అఖండైశ్వర్యములో ఏకాకిగా ఉంటే తనలో ఉండే మానవత్వము పూర్తిగా నశించి పశుప్రాయుడనై పోతానేమో నని భయపడినాడు. అందుకని తన్ను రక్షించడానికి సమర్థురాలైన ప్రేమమూర్తి ఎవరైనా దొరికితే బాగుండు ననుకొన్నాడు.

భార్య తన అవసానకాలమందు ఈయనను మళ్ళీ వివాహము తప్పకుండా చేసుకొమ్మన మని మరీమరీ చెప్పి పోయినది. అంతటి తోటి ఊరుకోకుండా ఈ మధ్య రోజూ రాత్రి కలలో కనబడి వివాహము చేసుకొమ్మన మని ఆయనను బలవంతపెడుతున్నది. పటములో కూడా ముఖవికాసము కొంచెము తగ్గినట్టుగా ఉన్నది. అందు

చేత వివాహ మెందుకు చేసుకొన కూడదా అని ఆయనకు ఆలోచన పుట్టినది.
" చేసుకొంటే పూర్వసుఖము లన్నీ ఎలా మరిచిపోయి మళ్ళీ మొదటికి రావడము!
ఆ మోహిని స్థానములో ఇంకొకరిని ఎలా నిలపడము! మోహిని కర్పించిన హృద
యమును మళ్ళీ ఇంకొకరికి ఇవ్వడ మెలాగు! ఇవ్వడానికి మాత్ర మే ముంది! నా
హృదయాన్ని నా మోహినే తీసుకొని పోయింది. అలాం టప్పుడు హృదయ
శూన్యుడనైన నన్ను ఎవరు పెండ్లాడుతారు? పెళ్ళిచేసుకుంటే మట్టుకు నా మోహిని
జ్ఞాపకం రాకుండా ఎలా ఉంటుంది, అలా ఉంటే బ్రతకడ మెలాగు! నే నింకొకళ్లను
ప్రేమించనప్పుడు వాళ్లుమట్టుకు నన్ను ప్రేమిస్తారన్న మాటేమిటి? ఎందుకు ప్రేమించాలి
పోనీ అన్నిటిమాటా అలా అట్టిపెట్టి నా కిప్పుడు ముప్ఫైయైదేండ్లు ఉన్నాయి కదా!
ఏ పన్నెండేండ్ల పిల్లనో పెండ్లి చేసుకొంటే — తనకంటె ఇరవైమూ డేండ్లు పెద్ద
వాడిని — నా మీద అంత అనురాగ ముండ మంటే ఎలా ఉంటుంది! పోనీ ఆ
సంకోచ మెందుకు? పెద్దపిల్లనే ఎందుకు పెండ్లాడకూడదు? నన్ను వెలివేస్తా రన్న
భయము నాకు లేదు. నా ఇంటికి రాకపోతే ఎలాగా అన్నంత ఆప్తులా లేరు.
తక్కిన నా శ్రేయస్సు కోరేవారు ఎలాగూ వస్తారు. అవును, అలాచేస్తే బాగుం
టుంది. పిల్లకు జ్ఞానము వచ్చి ఉంటుంది, సంగ తంతా చెప్పినపిమ్మట నచ్చితేనే
పెండ్లాడుతుంది. అలా ఇష్టపడ్డ పిల్ల ఎప్పుడు దొరికితే అప్పుడే పెండ్లాడవచ్చును.
అని కొన్నాళ్లు తర్కవితర్కములు చేసుకొని చివరకు తాను వివాహము చేసుకొం
టానని, సంబంధ మెక్కడ నైనా ఉంటే విచారించవలసిన దనీ, ఒక స్నేహితునితో
చెప్పినాడు నారాయణరావు.

3

ప్రపంచకములో 'నా' అన్నవాళ్లు ఎవ్వరూ లేని ఏకాకిని రుక్మిణి. ఇరవైరెం
డేండ్లు ఉంటాయి. ఆమె నెంతసేపు చూచినా చూడ బుద్ధి అవుతుంది. సుగుణవతీ, రూప
వతీని. పోసిన బంగారుబొమ్మ. నిశ్చయముగా నిలుచున్నప్పుడు చూస్తే ఆమె అసమా
న్యుడైన శిల్పి ఎవడో చెక్కిన విగ్రహమువలె ఉంటుంది. అవయవసౌభాగ్యమునందు
గాని రూపసంపదయందు గాని రేఖావిలసనమున గాని శరీరలావణ్యమునందు గాని
ఆమెను వంకపెట్టడానికి ఎవ్వరికీ శక్యముకాదు. మలయమారుతోచ్చలితమైన లేదీ
గవలె ఆమె కదలినప్పు డెప్పుడూ విలాస మొలుకుతూ ఉంటుంది. అంత నాజూ
కుగా ఉన్నదని కేవలము అబల కాదు. ఆ తీర్చినముక్కూ, సన్నగా దగ్గరగా ఉన్న
పెదవు లందలి కట్టుదలా, కన్నులలోని లోతూ, మెరపుమెరసినట్లు ఒక్కొక్కప్పుడు

కళ్ళు తళుక్కుమన్నప్పుడు వాటిలో కనబడే రాజసమూ చూస్తే చరిత్రలలోని రాజపుత్ర స్త్రీలు జ్ఞప్తికి వస్తారు.

ఆమె పేద బ్రాహ్మణ కుటుంబములో పుట్టినది. తల్లిదండ్రుల కామె ఒక్కర్తె. నిరుపేద లైనప్పటికీ ఏలోటూ లేకుండా వా రామె నెంతో గారాబముగా పెంచుకొంటూ ఉండేవాళ్ళు. కాని దురదృష్టమువల్ల ఆమె కేడవయేటనే రెండుమూడు రోజులు హెచ్చుతగ్గుగా తల్లితండ్రు లిద్దరూ కాలము చేసినారు. దిక్కులేని పిల్లను ఆ స్థితిలో ఎవళ్ళు నెత్తిమీద పెట్టుకుంటారు !

భమిడిపాటి కుటుంబరావని ఒక సంపన్నగృహస్థు, ధర్మదేవత. న్యాయవాది, న్యాయమైన కేసుగా ఉండి ఆయన చేపట్టినాడూ అంటే అది నెగ్గిన దన్నమాటే ! ఆయనకు దైవము ఒక్కటే లోటు చేసినాడు. ఆయనకు సంతానము లేదు. అందుచేత ఆయనా ఆయనభార్యా దేశములో ఉండే దిక్కులేని వాళ్ళ నందరనూ తమ పిల్లలుగా భావించుకొని తమకు చేతనైన సహాయము చేస్తూ ఉండేవాళ్ళు. చుట్టుపక్కల ఉండే ప్రతిస్కూలులోనూ ప్రతిక్లాసులోనూ ఒకరో ఇద్దరో కుటుంబరావు కుటుంబములోని వాళ్ళే.

కుటుంబరావుకు రుక్మిణి సంగతి తెలిసినది. వెంటనే ఆయన ఆ పిల్లను రప్పించి దైవనిర్ణయమున కాశ్చర్యపడుతూ, " అమ్మాయీ, ఇంక ఇదే నీ ఇల్లు అనుకో, తల్లిదండ్రులు లేరని బెంగపెట్టుకో కమ్మా. నన్నూ నాభార్యనూ నీ తల్లితండ్రులే అనుకొని ఇక్కడనే ఉండు. నీ కేమీ లోటుండ దమ్మా " అన్నాడు. రుక్మిణి తెల్లబోయి ఒకసారి కుటుంబరావు కేసీ ఒకసారి ఆయన భార్య కేసీ ఒకసారి ఆ ఇంటికేసీ చూచి, "నే నిక్కడ ఉండ" నన్నది. కుటుంబరావా పిల్లను దగ్గరకు తీసుకొని తల నిమురుతూ, "భయపడకమ్మా ! ఒక్కతెవు ఉంటే చాలా చిక్కనబడతావు. ఇక్కడకూడా మీ ఇంట్లో ఉన్నట్లే ఉండవచ్చును. నీకు కావలసినన్ని చొక్కాలూ పరికిణీలూ బొమ్మలూ అన్నీ కొని ఇస్తాను. నీ స్నేహితురాండ్రంతా ఇక్కడకే వచ్చి నీతో ఆడుకొంటూ ఉంటారు " అన్నాడు.

భయము చేతనూ విచారము చేతనూ కన్నీరు కారుస్తూ ఉన్న రుక్మిణిని కుటుంబరావుగారి భార్య ఎత్తుకొని కన్నీరు తుడిచి, ఓదార్చి తల దువ్వి నీళ్ళుపోసి ముఖాన్ని బొట్టూ కళ్ళకు కాటుకా పెట్టి వాకిట్లోకి తీసుకువచ్చినది. ఇప్పటికి రుక్మిణికి కొంత బెదురు వదిలింది. కుటుంబరావుగారు బండి పిలిపించి రుక్మిణిని తీసుకొని

బజారువెళ్ళి ఆ అమ్మాయికి పదిపండ్రెండు రకాల చొక్కాలు పరికిణీలు కుట్టించి అయిదారు బొమ్మలు, కాస్త మిఠాయి పకోడీలు కొనిపెట్టి ఇంటికి తీసుకొచ్చేసరికి రుక్మిణి బ్రహ్మానందపడి తన కష్టాలన్నీ మరిచిపోయినది. ఒకవారము దినముల వరకూ ఇక్కడ నీమములు కట్టుబాట్లు, ఆమెకు కొంచెము కష్టము కలిగించినాయి. మధ్యన ఒకటి రెండు సార్లు "నేనిక్కడుండను వెళ్ళిపోతా" నని బెదిరిస్తూ వచ్చింది. అప్పటికేదో లంచము పుచ్చుకొని మళ్లీ సమాధాన పడుతూండేది. క్రమేణా ఇక్కడి సౌఖ్యములలో తన పూర్వ చరిత్ర మరిచిపోయినది.

కుటుంబరావుగారు రుక్మిణికి ఇంటిదగ్గర సంగీతమూ సంస్కృతమూ చెప్పిస్తూ బడికి పంపిస్తూ ఉండేవారు. "పన్నెండు సంవత్సరములు వచ్చిన తరువాతను "అమ్మా నీ కిప్పుడు పెళ్ళి చెయ్యనా, బి. ఏ. దాకా చదువుకుంటావా" అని అడిగినారు. ఏమి తోచినదో మళ్లీ ఆలోచించకుండా నిర్భయంగా "బి. ఏ దాకా చదువుకోవలెనని ఉన్నది నాకిప్పుడు పెళ్లి చేసుకోవలెనని లేదు" అన్నది. కుటుంబరావు భార్య అందు కంగీకరించక పోయినా ఆ అమ్మాయికి ఇష్టము వచ్చినట్లే చేయవలెనని మళ్లీ వివాహ ప్రశంస తేకుండా చదువు చెప్పించినారు. సకాలములో స్కూలు ఫైనలు క్లాసు ప్యాసు అయినది. అక్కడనుంచి చెన్నపట్నము పంపించి క్వీన్ మేరీస్ కాలేజీలో ఇంటర్‌మీడియేట్‌లో ప్రవేశపెట్టినారు. ఆమె బి. ఏ చదువుతూ ఉండగా ఈ సంబంధము సంగతి కుటుంబరావు గారికి తెలిసినది. భార్య కూడా అమ్మాయికి త్వరగా వివాహము చెయ్యమని తొందరపెట్టడముచేతా సంబంధము బాగుందని తోచడముచేతా స్నేహితులద్వారా నారాయణరావుతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగినారు. నారాయణరావుగారు పిల్లని చూడడానికి అంగీకరించగానే ఆమెను చూడడానికి కాలేజీ ప్రిన్సిపాలు అనుమతిని పొంది చెన్నపట్నము వచ్చి నారాయణరావు గారికి పై ఉత్తరము వ్రాసినారు.

౪

వాకిట్లో మోటారుచప్పుడు వినగానే కుటుంబరావుగారు వారి స్నేహితులూ లేచివచ్చి నారాయణరావుగారిని ఆహ్వానముచేసి లోపలికి తీసుకువెళ్ళినారు. కొంచెము ఇష్టాగోష్ఠిఅయిన పిమ్మట కుటుంబరావుగారూ వారిస్నేహితులూ కూడా దుస్తులు ధరించి నారాయణరావుగారితో కూడా కాలేజీకి బయలుదేరినారు.

కుటుంబరావుగారు మధ్యాహ్నమే కాలేజీకి వెళ్ళి రుక్మిణితోటి అదివరకు ఉత్తరములద్వారా తెలిపినదీ తాను కొత్తగా స్నేహితులవల్ల విన్నదీ రుక్మిణితో

సావకాశముగా చెప్పినారు. అప్పటినుంచీ రుక్మిణికి ఏమీ తోచింది కాదు. హృదయము కల్లోలముగా ఉన్నది. ఆపూట కాలేజీలో చెప్పిన దేమీ తల కెక్కలేదు. తనజీవితములో మూడవసారి మార్పు కలగబోతున్నది. ఈ మార్పుకూడా వెనుకటివలె మంచికే అవుతుందో చెడుకే అవుతుందో దీనిపైన తనభావి జీవితమంతాఆధారపడి ఉన్నది, ఈనారాయణ రా వెలాటివాడో పైకి లోకానికెంతమంచిగా కనపడ్డా అంతర్యమెట్లా ఉంటుందో. నాగరికులలో ప్రపంచకానికి కనబడేమనిషికీ ఇంట్లో భార్యకు పిల్లలకూ కనబడేమనిషికీ ఎంతో తారతమ్యమింటున్నది. అలాంటివాడౌతడా లేకపోతే నానాన్నగారు కుటుంబరావుగారికిమల్లే ఉంటాడా చూపుల కెట్లా ఉంటాడో మనిషి రెండవపెళ్ళివాడుకూడా అంటున్నారు. ముసలివాలకము కద్దేమో. పోనీ వాలకముమాట ఏలాఉన్నా తనప్రేమ అంతా ఇదివరకొకరికి అర్పించిన తరువాతను నాకేమి మిగులుతుంది. ఏస్వల్పలోపము వచ్చినా తన ప్రథమపత్నితో సాపత్న్యము తెచ్చి ఆమె మంచిదని సాధిస్తూ ఉంటాడేమో. అన్నిటిమాటా అటుంచి పెళ్లికాగానే తీసుకువెళ్లి మళ్ళీ కాలేజీకి రానివ్వడేమో ఒకవేళ ఇప్పుడురానిచ్చినా, ఈపరీక్ష కాగానే మామూలుస్త్రీలవలె నన్నింక మళ్ళీ బయటకు వెళ్ళనివ్వడేమో. ఇంతచదువు చదువుకొని అస్తమానమూ లోపల అణగి ఎలా ఉండగలను. నాన్నగారడిగినప్పుడు మొదటిపెళ్ళి వాడు కావాలనక ఏమీఆలోచించకుండా దీనికెందుకు సమ్మతించాను? ఏమో ఇంతవరకు దైవము నాపాలిట ఉండి అన్నివిధాలా నాకు మేలే చేస్తున్నాడుకదా దీనివల్లకూడా మేలే కలుగుతుందని ఎందుకనుకోకూడదు? నాకిప్పుడీ సందేహమెందుకు అని పరివిధముల ఆలోచిస్తూ గాలిలో గాలిపడగవలె తటపటాయిస్తూన్న మనస్సుతో శుభ్రమైన దుస్తులుధరించి చక్కగా తలదువ్వుకొని ముఖమున ఎర్రని తిలకముతీర్చి గదిలోపచారుచేస్తూ మధ్యమధ్య తన తండ్రి మొదలయినవారు వస్తున్నారేమోఅని కిటికీలోనుంచి తొంగిచూస్తూ మహా ఆదుర్దాతో వేచియున్నది.

కాలేజీగడియారము ఆరు గంటలు కొడుతుండగా కాలేజీ కాంపౌండులోకి మోటారుకారొకటికివచ్చి నిలిచింది. రుక్మిణి కిటికీలోనుంచి తొంగిచూచింది. కారులోనుంచి కుటుంబరావుగారు మరి ఇద్దరూ దిగినారు. ఇందులో ఎవరు నారాయణరావుగారైఉంటారని ఆలోచిస్తుండగానే నౌకరు ఒకతెవచ్చి రుక్మిణిని పిల్చి "మీ కొరకు ఎవరో వచ్చినా" రని చెప్పింది. రుక్మిణి ఒక్కసారి అద్దములో చూచుకొని హృదయములోని ఆందోళనము పైకివినబడుతుందేమో అనే భయముచేత గుండెల నదుముకొని నెమ్మదిగా తనతండ్రి మొదలయినవారు ఉన్న వెయిటింగురూమ్ లోకి వచ్చింది. లోపలికిరాగానే కుటుంబరావుగారు లేచి రుక్మిణిని తీసుకువెళ్ళి కుర్చీపై కూర్చో

పెట్టి నారాయణరావుగారిని ఎరకపర్చారు. నారాయణరావు రుక్మిణులు ఒకరి నొకరు మూడు నిమిషములు రెప్పవాల్చక తదేకదీక్షతో చూచుకొన్నారు. ఆవీక్షణ క్షణము లోనే ఒకరి యంతఃకరణ లొకరికి తెలిసిపోయినాయి. నారాయణరావు కన్నులలో ప్రేమపూరితమైన హృదయము నిర్మలమయినమనస్సు దయాదాక్షిణ్యాది సద్గుణములు రుక్మిణికి గోచరించినను యథాప్రకారముగానే దైవము మన పాలిట ఉన్నాడు. ఏ విధమైన సంకోచమూ లేకుండా ఈయనను వివాహమాడి నా జీవితమంతా ఈయన చేతులలో పెట్టవచ్చును. ద్రోహమేమీ ఉండదు, అనుకున్నది రుక్మిణి.

రుక్మిణి కన్నులలో తొందర అసందేహము నారాయణరావుకు కనుపించి నాయి. ఈ అమ్మాయి సందేహము కొంత తీర్చి ధైర్యము చెప్పాలి. ఏలాగైనా మొత్తముమీద చురుకుపాలెక్కువ. కొంత పెడాపిడిగానే ఉంటుంది. అయినా ఇది బాగానే ఉన్నది. ఈమెకు నేను నచ్చితే నాకేమీ అభ్యంతర ముండదనుకున్నాడు.

నారాయణరావు రుక్మిణి నుద్దేశించి తన స్థితిగతులు తనకు మోహినియం దుండుకున్న ప్రేమాతిశయములు మొదలైనవి చెప్పి "నేను స్పృహశూన్యహృదయముతో ఉన్నాను. ఈలాంటి మనిషిని నీవు వివాహమాడి ప్రేమపూరితుని చేయగలననే ధైర్యముంటే నన్ను వివాహము చేసుకొనవలెనని ఉన్నది. పెండ్లి అయినంతమాత్ర మున నీవిద్యకేమీ అభ్యంతరముండదు. నీ పరీక్ష అయ్యేవరకూ నీవు ప్రతిరోజూ కాలేజీకి వస్తూ పోతూ ఉండవచ్చును. ఉన్నసంగతంతా రవ్వంతైనా దాచకుండా యథార్థముగా నీతో చెప్పినాను. నీవు సావకాశముగా ఆలోచించుకొని నీనిశ్చయము నీతండ్రిగారి ద్వారా నాకు తెలియపర్చవలసినది. ఈక్షణమందే నీవు సమాధానము చెప్పవలసిన తొందరలేదు" అని కుటుంబరావుగారి వైపుతిరిగి "అయ్యా! ఇంక నాకు సెలవు ఇప్పిస్తే నేను వెడతాను. మీరూ మీ అమ్మాయీ సంప్రతించుకొని ఆమె ఇందుల కంగీకరించినట్లయితే వివాహమునకు ఎప్పుడు వీలుగా ఉంటుందో ఆలో చించి నాకు తెలియపర్చండి సాధ్యమైనంత త్వరలో ఏసంగతీ నాకు తెలిసినట్లయితే నా ప్రయత్నము మీద నేను ఉంటాను. సెలవు" అని వెళ్ళిపోయినాడు.

ఆయన వెళ్ళగానే కుటుంబరావుగారు "ఏమమ్మా, నేనీరాత్రి బయలుదేరి మెయిలుకు వెళ్ళిపోవాలి. నీవు సావకాశముగా ఆలోచించి నాకు ఉత్తరము వ్రాస్తావా నీవు అసలు ఎవరినైనా వివాహము చేసుకోవలెనని ఉంటే చెప్పు ఇంతకంటె మంచి సంబంధము దొరకడము దుర్లభమని నా నమ్మకము. అయినా నువ్వు ప్రాజ్ఞురాలవు. వరుణ్ణి చూచుకొన్నావు. ఆయన చెప్పినదంతా విన్నావు. అందులో ఏమి తేడా లేదు. కాబట్టి నీవు బాగా ఆలోచనచేసి నాకు త్వరలో ఉత్తరము వ్రాయి. మన మాలస్యము చెయ్యడము బాగుండదు. ఇంక నాకు వేళఅవుతున్నది. నే వెడతాను.

ఉత్తరము వ్రాయటము మట్టుకు ఆలస్యము చెయ్యకు" అని కుటుంబరావుగారు వారి స్నేహితులు లేచి వెళ్ళిపోయినారు.

రుక్మిణి తొందరగా తన గదికి వెళ్ళి నిర్హేతుకముగా పొరలివస్తున్న కన్నీటి తరగల నాపుకొని ఈశ్వరున కొక్క నమస్కారము చేసి తన అంగీకారము నప్పుడే ఉత్తరము వ్రాసి ఆరాత్రి మెయిలుకే పంపించింది.

౫

ఒక శుభవారమునాడు లజ్ చర్చిరోడ్డులో కుటుంబరావుగారి స్నేహితుని ఇంట్లో కొద్దిమంది స్నేహితుల సమక్షమందు రుక్మిణికి వివాహము జరిగించి మరునాడు నారాయణరావు భార్యను తన ఇంటికి తీసుకొచ్చాడు.

ఉదయము సుమారు ఏడు గంటలవుతుంది. మంచుతెర అప్పుడప్పుడే తొలగి పోతున్నది. తోటలో చెట్లు తమ నిద్రామాంద్యమును విడిచిపెట్టి నూతనదంపతులకు స్వాగత మిస్తున్నాయి. పారిజాత సౌరభములు ఇంక వాయుతరంగములపైన తేలి యాడుతున్నది. పక్కనున్న తామరకొలనిలో ఎర్రతామర ఒకటి కలకల నవ్వింది. చెట్లపయిన పక్షులు ఆనందదాయకమైన పాటలను పాడినాయి. నౌకర్లంతా గుమ్మము దగ్గర నిలబడ్డారు.

మొదటికారులోనుంచి నారాయణరావుగారు రుక్మిణి దిగినారు. రెండవ కారులోనుంచి కుటుంబరావుగారు భార్య దిగినారు. మరిరెండు కారులలో వారి స్నేహితులంతా దిగినారు. నౌకర్లంతా వధూవరులకు స్వాగతమిచ్చినారు. తోట మాలీ దివ్యమైన రెండు గులాబీ పూలదండలతో వధూవరుల నలంకరించినాడు. నారాయణరావుగారు అతనిభార్యను బంధువులను స్నేహితులను లోపలికి వెళ్ళి ఇల్లంతా చూపించినాడు. ఆగృహ నిర్మాణమూ, అందలి చిత్రపు సముదాయము చూపరులను ఆశ్చర్యానంద భరితులను గావించినాయి. ఆనాడు నారాయణ రావు ఊరిలో తన స్నేహితులనందరినీ పిల్చి గొప్పవిందు చేసినాడు.

సుమారొక వారము దినము లున్న తరువాత కుటుంబరావుగారూ భార్యా తదితర బంధువులు నారాయణరావుగారి దగ్గర సెలవుపుచ్చుకొని తమ స్వస్థానము లకు చేరినారు.

నారాయణరావుగారు రోజూ భార్యను తీసుకువెళ్లి కాలేజీలో దిగబెట్టి మళ్లీ సాయంత్రము ఆమెకోసము వెళ్ళి ఆమె రాగానే ఇద్దరూ బీచ్ వద్దున కొంత

సేపు కాలయాపనచేసి సాయంకాలము ఇంటికి వచ్చేవారు.

రుక్మిణి మొదటఅనుకున్నట్టుగానే నారాయణరావు చాలా ఉత్తముడు. ఇటువంటి సంబంధము దొరికింది కదా అని చాలాసంతోషించింది. ఆమెకు ఏలోటూ లేకుండా నారాయణరావు వెయ్యికళ్ళతో కనిపెడుతూ ఉండేవాడు. ఆమెకు ఏమి కావలెనో అడక్కుండానే తను తెలిసికొని తెచ్చి ఇస్తూఉండేవాడు. రుక్మిణి కూడా దినదినము నారాయణరావుపైన ప్రేమామృతము అధికముగా కురిపిస్తూఉండేది. ఒకనాడు నారాయణరావు తనగదిలో పటముకేసిచూసి "ఏమి మోహిని, ఈపిల్ల నిన్ను మరిపించేటట్టుంది. నన్ను మాట్టుకు ఏమీ అనవద్దు. ఇదంతా నువ్వు తెచ్చిపెట్టుకున్నదే కదా" అన్నాడు. పటములో పెదవులు చిరునవ్వు నవ్వినాయి.

యుక్తకాలములో రుక్మిణి పట్టపరీక్షయందు కృతార్థురాలయినది. అంతటితో చదువుముగించినది. ఆమెకింక రోజూ కాలేజీకి వెళ్ళవలసినపనిలేదు. ఇంట్లో పనిఅంతకంటె లేదు. అస్తమానమూ ఏపుస్తకమో చదువుకోవడము, ఏబొమ్మలనో చూచుకోవడము. ఏసంగీతమో పాడుకోవడము. ఎన్నిచేసినా కాలక్షేపము అయ్యేదికాదు. ఇంట్లో ఒక్కర్తె. ఎవరింటికైనా వెళ్ళడానికైనా ఆత్మీయ పరిచితులు లేరు. కొన్నాళ్ళు నారాయణరావును మధ్యాహ్నము ఫలహారమునకు తను కారుమీదవెళ్ళి తీసుకు వస్తూఉండేది. మళ్ళీ సాయంకాలము అయిదు గంటలకు అతనికోసము వెళ్ళి అక్కడనుంచి ఇద్దరూ షికారుకో సినిమాకో వెడుతూ ఉండేవారు. రానురాను ఒక్కక్షణముకూడా నారాయణరావును ఎడబాసి ఉండలేకపోయేది.

౬

రామచంద్రయ్య సుమారు డబ్భై సంవత్సరములవాడు. నారాయణరావుగారి ఏజంటు. చాలానమ్మకస్తుడూ ఘరానామనిషీని. నారాయణరావు తండ్రి కాలము నుంచి కూడా ఈప్రాంతమున వారికుండే వ్యాపారములన్నీ చూస్తూ ఉండేవాడు. ఎప్పుడూ ఒక్కదమ్మిడీ తభావతు రాలేదు. ఒక్కపల్లెత్తుమాట ఎవరిచేతా అనిపించుకొనలేదు. అతను కాకినాడలో మకాముగా ఉంటూఉండేవాడు. ఆయనకు కృష్ణమూర్తి అని ఒక్కడే కొడుకు. ఇంటరుమీడియట్ సీనియర్ చదువుతున్నాడు. రామచంద్రయ్యగారి భార్య పోయి ఏడెనిమిది సంవత్సరములయింది. అప్పటినుంచీ ఆయనే బహుశ్రద్ధగా కొడుకునుపెంచి పెద్దవాణ్ణిచేసినాడు. ఇటీవల ఆయనకుకూడా అవసానము సమీపించినది. ఆసంగతి తెలుసుకొని నారాయణరావుగారిపేర వారి వ్యవహారములన్నీ వప్పజెపుతూ తనస్థితిగతులు తెలియపరుస్తూ దిక్కులేని తనకొడుక్కు

విద్య పూర్తిగావించి వివాహము చేయవలసినదని వ్రాస్తూ ఒక పెద్ద ఉత్తరము వ్రాసినాడు. వారివద్దనుంచి సమాధానము వచ్చేలోపున నిశ్చింతగా రామచంద్రయ్య పరలోకగతుడయినాడు.

ఈసంగతి తెలియగానే నారాయణరావు కాకినాడవచ్చి కర్మ అయ్యేవరకూ అక్కడనే వుండి దానికయ్యే ఖర్చు అంతా ఇచ్చి కృష్ణమూర్తిని హైస్కూలులో ప్రవేశపెట్టి అతనికి కొంతసొమ్ముఇచ్చి బెంగపెట్టుకోవద్దని ధైర్యము చెప్పి ఈ పరీక్షఅయిన పిమ్మట బి. ఏ. క్లాసుకి చెన్నపట్నము రావచ్చునని చెప్పి తనువెళ్ళి రామచంద్రయ్యకు ఇచ్చేజీతము కృష్ణమూర్తికి నెలనెలకు పంపుతూ ఉండేవాడు.

కృష్ణమూర్తి బహునమ్రమైనవాడు. నిష్కల్మషమైన హృదయము కలవాడు. ప్రపంచముసంగతి విశేషము తెలియకుండా అజ్ఞానములో పెరిగినాడు. చదువుయందు విశేషము భక్తి శ్రద్ధలు కలవాడు. ఆసంవత్సరము ఇంటర్మీడియట్ ప్యాసు అయినాడు.

వేసంగి సెలవలు కాగానే నారాయణరావు గారి ఆజ్ఞ చొప్పున బి. ఏ. లో చేరడానికి చెన్నపట్నము వచ్చినాడు. నారాయణరావుగారి గుమాస్తా ఒకఅతను స్టేషనుదగ్గరకు వెళ్లి కృష్ణమూర్తిని నారాయణరావుగారింటికి తీసుకువచ్చి వప్పజెప్పినాడు. మరునాడు నారాయణరావుగారే స్వయముగాప్రెసిడెన్సీ కాలేజీకి తీసుకువెళ్లి బి. ఏ. క్లాసులో ప్రవేశపెట్టినారు. ఇంటిదగ్గర ఇతనికి చదువుకొనడానికి ఒకచక్కని గదీ కావలసిన బట్టలూ పుస్తకములూ రోజూ స్కూలికి వెడుతూ వస్తూ ఉండడానికి ఒక సైకిలూ కొని ఇచ్చినారు. అతని ఖర్చు అంతా నారాయణరావుగారే వహించి అతనికి ఏలోటూ లేకుండా అన్ని విధములా కనిపెడుతూ ఉండేవారు.

కృష్ణమూర్తి చెన్నపట్నము ఎప్పుడూ చూడలేదు. ఒక చెన్నపట్నము అన్నమాటేమిటి ఏపెద్దపట్నమూకూడా చూడలేదు. ఇక్కడి మేడలు, తోటలూ, జనసమూహమూ, మోటారుకారులూ మొదలయినవి చూచి కొంతకాలము ఆశ్చర్యపోతూ ఉండేవాడు. క్రమేణా ఊరికి అలవాటు పడ్డాడు. అతని చదువేమిటో అతని ధోరణేమిటో తప్ప, ఇంకొకరి జోలి జోక్యము అతని కవసరముండేది కాదు. దేనిలోనూ కలుగజేసుకునే వాడు కాదు. అతను ఉన్నసంగతే ఎవరికి తెలియనట్లుగా ఉండేవాడు. అతనికి భోజనముకూడా తనతోటి సంబంధము లేకుండా వేరే పెట్టవలసినదని నారాయణరావుగారు ఏర్పాటు చేశారు. అందుచేత ఏరెండుమూడునెలలకోగాని నారాయణరావుగారికికూడా అతను కనపడేవాడుకాదు.

౨

కృష్ణమూర్తి చెన్నపట్నము వచ్చి సుమారారుమాసములయినది. ఆరోజు ఆది వారము. నారాయణరావుగారూ రుక్మిణీ మధ్యాహ్నము తమ స్నేహితులను చూడడానికి వెళ్లినారు. తోటమాలీ తోటలో పనిచేస్తున్నాడు. గేటులో ఉండే నౌకరు ఏదో పనిమీద బజారుకు వెళ్లినాడు. రుక్మిణి దాసి ఆపూట సెలవు తీసుకున్నది. ఇంట్లో ఇంకెవ్వరూ లేరు. కృష్ణమూర్తి ఒక్కడే ఉన్నాడు. అతనికి కాలయాపనగాక ఊరికే కూర్చున్నాడు. కొంతసేపటికి అతనికి ఆ మేడ మీద భాగము చూడవలెనని బుద్ధి పుట్టింది. తక్షణము లేచి మేడమీదకు వెళ్లినాడు. వెళ్లగానే ముందొక పెద్దగది కనుపించినది. అది నారాయణరావు కచ్చేరీగది. దానినిండా ఏడెనిమిది బీరువాలలో పుస్తకములు ఉన్నాయి. గోడల్ని గొప్ప గొప్ప కవులూ సంస్కర్తలూ దేశాభిమానులూ మొదలయినవారి పటము లున్నాయి. కంచుతో చేయబడిన బుద్ధుడూ కృష్ణుడూ, నటరాజూ మొదలయిన విగ్రహము లు కొన్ని చిన్నబల్లలమీద అమర్చబడి ఉన్నవి. ఒకపక్క నొక పెద్ద మేజా, దానిముందొక కుర్చీ, ఇంకొకవైపున రెండు పెద్ద సోఫా కుర్చీలు, రెండు చిన్నకుర్చీలు అమర్చబడి యున్నవి. చాలాసేపు ఆపుస్తకములూ పటములూ చూస్తూ అక్కడ కాలయాపన చేసినాడు. తరువాత ఆగది పక్కనే ఉన్న నారాయణరావు గారి పడకగదిలోనికి వెళ్ళినాడు. తలుపు తెరవగానే వర్ణములతో చిత్రింపబడిన దివ్యసుందర విగ్రహమొకటి అతనికి కనపడ్డది. ఆమె నారాయణరావుగారి ప్రథమకళత్రమై యుండునని ఊహించి కొంతసేపా చిత్తరువు కేసి చూచి తరువాత ఆగది చక్కదనము చూసి అక్కడనుంచి ఆపక్క గదిలోనికి వెళ్ళినాడు.

అది రుక్మిణి పడకగది. నారాయణరావుగారిగదికీ ఆగదికీ మధ్య తలుపొకటి ఉన్నది. ఆతలుపు తెరవగానే ఎదుట గోడదగ్గర ఒక సొరుగులపెట్టె కమర్చి ఒక పెద్ద నిలువుటద్దమున్నది. కుడిచేతివైపుగోడకు రెండు పెద్దకిటికీలు. వాటివద్దనే మంచిగంధపు చెక్కతో చేయబడిన పెద్దపందిరిపట్టిమంచ మున్నది మంచపుకమ్ములపైన బహునేర్పరియైన పని వానిచే రామాయణమునందలి కథలు కొన్ని చెక్కబడియున్నవి. గుమ్మమునకు రెండువైపులనూ రెండు బీరువాలు బట్టలతోనూ బొమ్మలతోనూ నిండియున్నాయి. మంచానికెదురుగుండా ఒక గుమ్మమూ దానికి ఒకవైపున తలనూనెలూ, సెంట్లు మొదలైనవాటితో నిండిన డ్రస్సింగుటేబిలూ రెండవవైపున, ఒక పెద్దసోఫా గోడలకన్నివైపులా గొప్పగొప్ప చిత్రకారుల చేత చిత్రింపబడినపటములూ కొన్ని రుక్మిణి స్వయముగా చిత్రించినపటములూ మంచము దగ్గర నారాయణ

రావు పెద్దపట మొకటి ఉన్నవి. ఈగది కవతల రుక్మిణి వ్రాసుకోడానికి చదువుకోడానికి వేరే గది ఒకటి ఉన్నది. దాని అవతల స్నానాల గది ఉన్నది.

ఈ పడక గదిలో చిత్రములన్నీ చూస్తూ ఆనందమున మునిగి నిశ్చేష్టుడై ఉన్నాడు కృష్ణమూర్తి. అతను మేడమీదకు వచ్చి ఎంతసేపయినదీ అతనికి తెలియలేదు. ఈ తన్మయత్వములో ఉండగా గది ఎదుట వసారాలో అడుగులచప్పుడు వినబడ్డది. తెలివి తెచ్చుకొన్నాడు. ఏమి చెయ్యడానికీ తోచలేదు. ఎటుపోవడానికీ కాళ్లు ఆడలేదు. అడుగులు తలుపు దగ్గరకు వచ్చినాయి. ఒక అడుగులో దగ్గరనున్న సోఫా వెనుక చేరి గజగజ వణకుతూ నక్కి పడుకున్నాడు.

ఇతను పడుకోనడము తడవుగా రుక్మిణి గదిలోకి వచ్చినది. వచ్చి తిన్నగా అద్దము దగ్గరకు వెళ్లి తల ఒకసారి దువ్వుకొని బయటకు వెళ్ళినది. వెళ్ళిపోయినదేమో లేద్దామా వద్దా అని ఆలోచిస్తూ ఉండగానే ముఖము కడుక్కొని తుడుచుకుంటూ రుక్మిణి వచ్చినది. ఒక కుర్చీ పైన తువ్వాలు వారవేసి బీరువాలోని చాకలి తెచ్చిన బట్టలు తీసి మంచముమీద పెట్టుకొని నిలువుటద్దమున కెదుర నిలబడి, తనుకట్టుకున్న చీర, తొడుక్కున్న జాకెట్టు విడిచి సోఫాపైన పడేసి మంచముమీద చీర తీసి అద్దములో తన అవయవసౌభాగ్యము చూచుకుంటూ ఒక్కక్షణము మట్టె నిలబడ్డది. ఆక్షణములో, ఆగదిలో తనొక్కర్తేకాక మరొకరెవరో కూడా ఉన్నట్లు ఆమెకు హఠాత్తుగా తోచినది. తోచగానే త్వరగా చేతులోఉన్న బట్ట చుట్టబెట్టుకొని గది నాలుగు మూలలా వెదకగా సోఫాకింద గజగజ లాడుతూ, ఒళ్లంతా చెమటతో తడిసి, ఆరిపోయిన పెదవులు తడుపుకుంటూ ఉన్న కృష్ణమూర్తి కనబడ్డాడు.

కన్నులనుండి నిప్పులు కురుస్తూ రుక్మిణి "రా ఇవతల" అని ఒక్క ఉరుము ఉరిమింది. కృష్ణమూర్తి నెమ్మదిగా పాకి ఇవతలికి వచ్చి నిలబడినాడు. కన్నుల వెంబడి నీరు ధారగా ప్రవహిస్తూ ఉన్నది. సిగ్గుచేత ముఖము ఎర్రబడ్డది. "ఏమిటీపాడుపని ఎందుకువచ్చావిక్కడికి" అని మళ్లీ రుక్మిణి గర్జించినది. పాపము ఏమిసమాధానము చెప్పగలడు? మరింత వణకుతూ, నోటమాటరాక మరింత కళ్లనీళ్లు కారుస్తూ నిలబడ్డాడు. "ఏమి మాట్లాడవేమి? ఆడవాళ్ళ పడక గదిలోకివచ్చి దాగుకోడానికున్న సాహసము ఆడదానికి సమాధానము చెప్పడానికి లేదేమి. మళ్ళీ చూస్తే బి. ఏ. చదువుతున్నావు. చదువుకొన్నవాడు పెద్దమనిషి చెయ్యవలసిన పనేనా ఇది. నారాయణరావుగారు నీకు చూపిన దయకూ నీయందుంచిన నమ్మకమునకూ తగిన ప్రత్యుపకారము చేసినావు. మాట్లాడకుండా ఎందుకు ఇడియట్‌లాగా ఏడుస్తూ అలా నిల

బడతావు. నను అవతలికి నాకళ్లకెప్పుడూ కనబడకు. ఈచర్యవింటే నారాయణ రావుగారు బ్రహ్మానందపడతారనుకుంటా. పో అవతలికి" అని గుమ్మమువైపు వేలు చూపించినది.

అప్పటికి కృష్ణమూర్తికి కొంచెము చైతన్యము వచ్చినది. 'తల్లీ క్షమించండి' అని ఆమె కాళ్ళపై బడినాడు. "ఏమి టీవెర్రి వేషము లే" అన్నది. లేచి వెక్కి వెక్కి రాగాలు పెడుతూ జరిగిన సంగతంతా చెప్పినాడు అతను చెప్పినదంతా విని "నను లోపలికి రాగానే నా కెందుకు కనబడ్డావు కావ" న్నది. "అమ్మా భయము చేత నా తెలివి తెల్లవారినది. ఏమిచెయ్యడానికీ తోచలేదు. ఈ లోపలికి వచ్చినందుకే మీరు కోప్పడతారని భయము వేసింది. అప్పైన మీరు తక్షణా వెళ్ళిపోతారేమో అందాకా దాక్కుంటే తీరిపోతుందనుకొన్నాను. ఇంతకూ భయముతప్ప సరిగా ఏమీ ఆలోచించడానికి తోచలేదు. ఇంక మీరు చీకొట్టుకోవడము ప్రయత్నము చెయ్యగానే దైవమును తలంచుకుంటూ కళ్లు మూసుకున్నాను. దైవ సాక్షిగా చెబుతున్నాను. నామాట నమ్మండి. నాఅపరాధమును మన్నించండి" అని చేతులు జోడించి బ్రతిమాలినాడు. ఒక్క క్షణము అతని ముఖముకేసి నిదానముగా ఆ దృష్టి హృదయము దూసుకువెళ్లి లోపల సంగతంతా పరిశీలించేటట్టు తీవ్రముగా చూచింది. అతను చెప్పినదంతా నిజమని తోచిందికాబోలు 'సరే నేను బయటకు వెళ్ళేవరకూ నారాయణరావుగారి కచేరీ గదిలో కూచుని నేను వెళ్ళినతరువాత నీగదికి వెళ్ళు. ఇంకదయచెయ్యి' అన్నది రుక్మిణి. మారుమాట లేక తలవంచుకుని కృష్ణమూర్తి నారాయణరావు గదిలోకి వెళ్ళినాడు.

౮

రుక్మిణి కాపురానికి వచ్చి సుమారు సంవత్సరమున్నర అయినది. నారాయణరావును పూర్తిగా స్వాధీనము చేసుకొన్నది అతన్ని మళ్లీ మామూలు మనిషిగా మార్చినది. నారాయణరావు వెనుకటి వలె ఎప్పుడూ ఖులాసాగా ఉండడ మారంభించినాడు. గుమాస్తాలకూ నౌకర్లకూ సౌఖ్యము హెచ్చినది. రుక్మిణి మనస్సులో ఏదైనా అనుకోవడము తడవుగా నారాయణరావు తీసుకు వచ్చి ఇంట్లో పడ వేస్తూ ఉండేవాడు.

అతను అనుకొన్నట్టుగానే రుక్మిణికి కొంచెము చురుకు పాలెక్కువే. మాట్లాడితే కోపము చిరాకూను. అస్తమానము ఎందుకో ఎందుకు నౌకర్లమీద, దాసీలమీద కోప్పడుతూ ఉండేది. కదలిక ఎక్కువ. ఒకచోట ఒక క్షణమైనా నిలక

దగా ఉండలేకపోయేది. ఎప్పుడూ ఎక్కడికో మోటారు మీద నే తిరుగుతూ ఉండేది. అలంకారమంటు అభిలాష ఎక్కువ. ఎన్నిరకాల చీరలూ జాకెట్లూ కొనేదో లెక్ఖలేదు. కొత్తరంగు చీర ఏదేనా వచ్చిందీ అంటే బట్టల కొట్టువాళ్ళంతా రుక్మిణికి తాలూక ఉత్తరమూ వ్రాసేవారు. ఆవిడ గబగబ వెళ్లి కొనక్కొచ్చుకొచ్చేది. రోజుకు ఎన్ని సార్లు చీరలూ జాకెట్లూమార్చేదో ఎన్నిసార్లు తలదువ్వి బొట్టుపెట్టుకునేదో లెక్ఖలేదు. నారాయణరావు రత్నవ్యాపారము చేస్తున్నప్పుడు రుక్మిణికి రత్నాభరణాలకి లోటేమిటి. ఇంక ప్రతిసాయంకాలము భర్తతో కాని తనొక్కతేకాని, ఏసినిమాకో, ఏగానసభకో, ఏనాటకానికో వెళ్ళేది. ఏదో వినోదము చూస్తేనేగాని రోజు గడిచేది కాదు.

నారాయణరావు హఠాత్తుగా తొందర పనిమీద ఫ్రాన్సు వెళ్ళవలసి వచ్చినది. భార్యనుకూడా తీసుకు వెడదామనుకొన్నాడు. కాని ఆమెకు ఒంట్లో కొంచెము నలతగా ఉండడము చేత డాక్టర్లు ఆమె నంతదూరం ప్రయాణము తీసుకువెళ్ళడము అంతమంచిది కాదన్నారు ఆపైన కాలముకూడా సముద్రయానమునకు అనువైనది కాదు. అందుకని నారాయణరావు రుక్మిణిని ఇంటిదగ్గర విడిచిపెట్టవలసివచ్చినది. మళ్లీ తిరిగి రెండు మాసములలో వస్తానని, అప్పుడు ఏకముగా ఒకసారి బయలుదేరి యూరోపు అమెరికా తీసుకు వెడతాననీ చెప్పి ఏలాగో సమాధానపరిచాడు. ఆమెకు ఇష్టమయితే రాజమండ్రీ తీసుకువెళ్లి పుట్టింట దిగబెట్టి వస్తానన్నాడు. "అక్కర లేదు నేనిక్కడనే ఉంటాను. నాకేమీభయము లేద" న్నది. సరే నీ యిష్టమన్నాడు నారాయణరావు.

ఆనాడే నారాయణరావు బయలుదేరినాడు. రుక్మిణికూడా బొంబాయి వరకు వెళ్లి నారాయణరావును స్టీమరెక్కించి, ప్రతిమెయిలుకూ తప్పకుండా ఉత్తరము వ్రాయమని చెప్పి తనింకో రెండు రోజులు బొంబాయిలో ఉండి తిరిగి చెన్నపట్నము వచ్చినది.

౬

ఇల్లంతా బావురుమంటూ ఉన్నది. ఎటుచూచినా రుక్మిణికి ఏమీ కనపడ లేదు. ఏగదిలోకివెళ్ళినా, ఏవస్తువు తీసినా నారాయణరావు జ్ఞాపకమువచ్చేవాడు. ఏపని ప్రారంభించినా రెండునిమిషములలో మనసు భావతరంగములపైన తేలియాడు తూ, స్టీమరులోఉన్న నారాయణరావు దగ్గరకు పోయేది. ఏపని చెయ్యకుండా ఊరికే కూచుంటే, సముద్రము, దానిలో ఒక పెద్ద స్టీమరూ, అందులో పచారు

చేస్తూనో, చదువుకుంటూనో, పడుకునో, నారాయణరావూ ఆమె కళ్ళఎదుట నాట్య మాడుతూ ఉండేవారు. వెనుకటి మోస్తరుగా ఎక్కడికీ బయటికైనా వెళ్ళబుద్ధి అయ్యేది కాదు. ఒకవేళ వెళ్లినా అక్కడ నిలువ బుద్ధి అయ్యేది కాదు.

ఈలాగు ఒక్కవారము అవస్థపడ్డది. రోజూ ఒక పెద్ద ఉత్తరము నారాయణ రావుకు వ్రాసి వారము రోజులవరకూ వెళ్ళదని తెలిసినా పోష్టుకు పంపిస్తూ ఉండేది. ఆఖరుకు ఒకసారి పుట్టింటికి వెళ్ళివద్దామని బుద్ధి పుట్టినది. ఉద్దేశము కలగడము తడ వుగా ఇల్లంతా కృష్ణమూర్తికి వప్పజెప్పి రాజమండ్రి ప్రయాణము కట్టినది.

చెన్నపట్నములోనే కాలముగడపలేనిదానికి రాజమండ్రీలో ఏలా కాలయాపన అవుతుంది. అక్కడ మరీ అసహ్యాముగా ఉన్నది. ఏలాగో బిగపట్టుకుని ఒక్కవారము రోజులు గడిపినది. అక్కడనుంచి తిరిగి చెన్నపట్నము వచ్చినది.

ఒకటి రెండు ఉత్తరములు నారాయణరావు దగ్గరనుంచి రాగానే రుక్మిణికి కొంత శాంతి కలిగినది. క్రమేణా పతివియోగమున కలవాటుపడ్డది. పగలస్తమా నమూ అనేక రకములుగా నారాయణరావు బొమ్మలు వేస్తూ ఉండడము, లేదా ఏదో ఒక నవల చదవడము, సాయంకాలము ఏగానసభకో ఏసినీమాకో వెళ్ళడము ఈలాగు కాలము గడుపుకుంటూ ఉన్నది రుక్మిణి.

నారాయణరావు వెళ్లి షుమారు నెలా పదిహేనురోజు లయినది. ఆయన వెళ్ళినపని ఇంకా పూర్తికాకపోవడముచేత మరొక నెలరోజులు ఎక్కువ ఉండవలసి వస్తుందని ఉత్తరము వ్రాసినాడు. ఆ ఉత్తరము చూడడముతోనే రుక్మిణికి చాలా ఆశాభంగము కలిగినది. భర్త ఎప్పుడు వస్తాడా అని ప్రతిక్షణమూ ఒక్క మహా యుగముగా లెక్కచూచుకుంటూ ఉన్నది. ఇంకా ఒకనెలంటే ఏలాగు తాళగలను. ముప్పైరోజులు ఎప్పటికి గడనను! ఇప్పుడే విరహబాధ దుస్సహాముగా ఉన్నది.

నానాటికీ వియోగము ఆమెను దహించి వేయడము మొదలు పెట్టినది. మనిషి చిక్కి సగమయినది. ముఖమువన్నె తరిగిపోయినది. ఏలాగో ఈమహానలము నుండి బయటపడవలెనని ఆమె శాయశక్తులా తంటాలు పడుతూ ఉన్నది. ఆమె కాలక్షేపార్థము చదువుతున్న పుస్తకాలూ, చూస్తున్న నాటకాలూ, సినీమాలూ, ఈ విరహాగ్ని నంతకంతకు రగులుకొల్పి సహింప శక్యముగాని జ్వాలగా చేశాయి కాని, ఈ బాధ మరిచిపోవడాని కెంతమాత్రమూ ఉపకరించలేదు.

అంతకంత కామె అవస్థ గ్రంథములందలి నాయికలవలె అయిపోయినది. నారాయణరావు వెళ్ళి రెండు మాసములు పైన అయినది. ఉత్తరములు వస్తూ ఉన్నాయి. వస్తేమట్టుకు ఉత్తరము లెంతవరకు శాంతి నివ్వగలవు?

ఒకనాడు పెందరాడే భోజనముచేసి Ouida రాసిన నావెలు ఒకటి చదవడ మారంభించినది. పుస్తకము విడువకుండా సాయంకాలము మూడుగంటలవరకూ చదివినది. అందులో నాయకచర్యలు ఆమె మనస్సును మరింత కలత పెట్టినాయి. ఆపుస్తకము కట్టిపెట్టి ఫలహారముచేసి, కాస్సేపు తోటలో తిరుగుదామని తోటలోనికి వెళ్లినది. ఆకాశము కొంచెము మేఘావృతమైనది. సూర్యకాంతి మందముగా ఉన్నది. చెట్లనీడలు దీర్ఘముగా ఉన్నాయి. పుష్పజాతులన్నీ పూర్తిగా వికసించి ఉన్నాయి. ఎటుచూచినా ఝుమ్మని తేనెటీగలూ, అనేక చిత్రచిత్ర వర్ణములతో తిరునాళ్ళకు అలంకరించుకొని వచ్చిన వైష్ణవాంగనలవలె సీతాకోకచిలుకలూ తిరుగుతున్నాయి. తామరకొలను నిండా తామరలూ, కలువలూ వికసించి ముద్దులొలుకుతూ ఉన్నాయి. గాలి చల్లగా వీస్తూ ఉన్నది.

ఈ ప్రకృతి సౌందర్యము మధ్యను ఆమె నిలువలేక పోయినది. ఎటు చూచినా ప్రేమ స్వరూపములైన పుష్పములూ, కామోద్దీపకమైన సౌరభమూ, ఆనంద స్వరూపములైన సీతాకోక చిలుకలూ, అసూయాజనకములైన శకుంత దంపతులూ ! ఈ తోటంతా ఒక్కసారి తగులపెట్టవలెనని బుద్ధి పుట్టినది. నాలు గడుగులలో మళ్లీ తన గదికి వెళ్లినది. వెళ్ళి తెలుగుపుస్తకాల దగ్గర నుంచున్నది. పుస్తకాలకేసి చూసిందన్నమాటేకాని అక్షరాలు ఆవిడకు కనుపడలేదు. పది పుస్తకాలు వెతికి ఏదో చేతికి వచ్చిన చిన్న పుస్తకము తీసినది. పేజీలు తిరుగ వేసి చదువడ మారంభించినది. కొంతసేపటి కది తారాశశాంకవిజయమని తెలుసు కున్నది. సుమారొకగంట చదివినది. బాధ మరింత హెచ్చినది. అంతటితోటి ఆపుస్తకము కట్టిపెట్టి సినీమాకు వెళ్ళి ఈసంగతి మరిచిపోదా మనుకున్నది. అందు కని పెందరాడే భోజనముచేసి తనకారులో బయలుదేరి సినీమాకు వెళ్లినది. ఈమె వెళ్ళేటప్పటి కప్పుడే ప్రదర్శన మారంభించినారు. హాస్యరస ప్రధానమైన Film ఒకటి చూపించారు. అదికాగానే Alphonse Daudet అను ఫ్రెంచి గ్రంధకర్త వ్రాసిన Sapho అనే నవల చూపించారు

అది చూచినకొద్దీ నిలువలేకపోయినది రుక్మిణి. ప్రపంచమంతా ఈమెను ఓడించవలెనని పట్టు పట్టినట్టు కనిపించినది. అబల, అసహాయురాలు. శత్రుకోటి ఇంత పంతము పట్టినప్పుడు ఏమిచేయగలదు. ఈ విరహాగ్నినుండి తప్పకొంచునమువలె పరి

శుభ్రముగా బయట పడవలెననుకున్నది. కాని ఈ పరిస్థితులలో ఏలాగు నెగ్గుకు రావడము !

చివరవరకు ప్రదర్శనము చూచినది. కన్నులు అశ్రుపూరితములైనాయి. ఒళ్లు తహతహలాడి పోయినది. హృదయములో రక్తము పొంగి వేడి తరంగములుగా రక్తనాళములలో ప్రవహించినది. తల దిమ్ము ఎక్కినది. నెమ్మదిగా బయటకు వచ్చినది. కాస్సేపు సముద్రతీరానికి వెడితే ఒళ్ళుచల్లబడి ఈ తాపము కొంచెము తగ్గుతుందేమో ననుకొన్నది. కారు బీచికి పట్టించి నెమ్మదిగా పోనివ్వమని చెప్పినది.

ఆనాడు పూర్ణిమ. ఆకాశము నిర్మలముగా ఉన్నది. పండువెన్నెల వర్ణింప శక్యముకాకుండా ఉన్నది. సముద్రము మిలమిలలాడుతూ అనేక రత్నకాంతులతో ప్రకాశిస్తూ ఉన్నది. ఒడ్డున కెరటములు విరిగినపుడు నురగలు నీలిమందుపెట్టిన ఢక్కామస్లిన్‌వలె ముద్దుగా ఉన్నాయి. ఆనాడు Moonlight Band వాయిస్తున్నారు. పాశ్చాత్య యువతీ యువకులు అక్కడ విలాసముగ నిలబడి Band వింటున్నారు. కొందరు చెట్టాపట్టాలు వేసుకొని పచారు చేస్తున్నారు. మరికొందరు పరస్పర గాఢాశ్లేషమున బద్ధులై ప్రపంచమును మరచి ఇసుకపాన్పుపై విశ్రమించి ఉన్నారు. వారి చుంబనధ్వనులు వాయుతరంగములపై తేలి రుక్మిణి చెవిని చేరినాయి.

ప్రపంచములోకల్లా రుక్మిణే ఒంటరిగా ఉన్నట్లు కనపడ్డది. ఎక్కడికి వెళ్ళినా విధి ఈలా పంతము పట్టినట్లు తరుముకొస్తూఉంటే ఏమిచెయ్యగలదు. ఏలాగు నెగ్గగలదు. ఇక్కడికి వస్తే భగ్గున మండి పోతున్న ఒళ్ళు కొంచెము చల్లారి హృదయములో ఆందోళన తగ్గుతుందేమో ననుకుంటె గాలి వీచినకొద్దీ జ్వాలఎక్కువైనట్లుగా ఈచల్లగాలి తగలినకొద్దీ తాపము హెచ్చిపోయినది. సముద్రములో కల్లోలము చూచినప్పటినుంచీ, అంతకంటె ఎక్కువగా హృదయములో కల్లోలము ఎక్కువయినది. ఇంక గెలువలే ననుకున్నది. ఆమెబలమంతా నీరైపోయినది. ఇంక నీఒంటరితనము సహింపలేననుకొన్నది. ఈరాత్రి గడవడమేలాగు. ముందిక్కడినుంచి పోతే తరువాత సంగతి ఆలోచించ వచ్చుననుకొని కారు ఇంటికి పట్టించినది.

ఈఅవస్థలలో బ్రతుకడమేలాగు. ప్రపంచమంతా ఆనంద సుఖవార్ధిలో తేలియాడుతూఉంటే తనొక్కతేమట్టుకు ఈలా బాధపడవలసినఅవసర మేమిటి. తనూ మనిషికాని దేవత కాదుకదా. దేవతలు మట్టుకు ఏవంకా లేకుండా పవిత్రముగా అఘోరించారా ఏమిటి. నారాయణరావు ఈలా ఒంటరిగా విడిచిపెట్టి చక్కాపోవడమేమి. అన్నప్రకారము వచ్చేసెయ్యకూడదూ. ఇంకోనెల అక్కడ ఆగడమెందుకు. ఈ

నెలా అవగానే మట్టుకు వస్తాడన్నమాటేమిటి. మళ్లీ ఇంకొక నెల పనుందని ఆవేళకింకో ఉత్తరము చక్కా వస్తుందేమో. ఏమోఅక్కడ ఎందుకాగాడో ఎవరికి తెలుసు. ఆపని ఏమిటనో. వెళ్ళినది పారిస్. పాశ్చాత్య స్త్రీలు అందులో పరాసు దేశస్త్రీల యొక్క చర్యలు ఎరుగని వారెవరు? ఆసంగతంతా జగద్విదితము. అక్కడకు వెళ్లి, అస్త్రీలమధ్యను, ఆదేశములో, ఆఉద్యానవనములలో ఆరంభలంకో చెట్టాపట్టాలు వేసుకు తిరుగుతూ ఊరుకుంటాడా ఏమిటి నారాయణరా వయితేమట్టుకు. ఈయనఊరుకున్నా వాళ్ళు ఊరుకోనిస్తారా! అక్కడ—ఏమో ఎవరికి తెలుసును. నేనుమట్టుకు ...

కారు బంగాళాలోకి మళ్ళినది. సంపంగి నైటుక్వీను పుష్పముల దివ్య సౌరభముతో తోటంతా నిండిపోయినది. ఆ సువాసన తగిలేటప్పటికి రుక్మిణికి మరీ పిచ్చెత్తిపోయినది. కారు దిగి లోపల ప్రవేశించినది. కింద నొకగదిలో సన్నని గొంతుకతో పాడుతున్న అద్భుతమైన గానము వినుపించింది. ఎక్కడనుంచి ఈ సంగీతము ఎవరు ఇక్కడ అంతచక్కగా పాడగలవారు. అయినా చూద్దామని నెమ్మదిగా ఆసంగీతము వినబడుతున్న గదివైపుకు వెళ్ళి కిటికీలోనుంచి గదిలోకి తొంగిచూచినది. అది కృష్ణమూర్తి గది. గదిలో కృష్ణమూర్తితప్ప మరెవ్వరూ లేరు. అతనే పాడుతున్నాడు. ఇంత చక్కగా అతను పాడగలడని రుక్మిణికి తెలియదు. నిశ్చేష్టురాలై సువర్ణ ప్రతిమవలె నిలబడి సంగీతము విన్నది. జయదేవుని అష్టపది పాడుతున్నాడు. సంగీతము చక్కగా ఆమె శ్రోత్రపుటములలోనుండి ప్రతిరక్తనాళములోను ప్రవేశించినది. ఒళ్లు జలదరించినది. హృదయము చెయ్యేసికలచిన ట్లైనది. శరీరము అట్టుడికిన ట్లుడికి పోయినది.

పాట పూర్తిఅయినది. పూర్తిఅయిన సంగతి ఆమెకు తెలియలేదు. ఒక్క అయిదు నిమిషములకు చైతన్యము వచ్చినది. తనగదికి వెళ్ళవలెనని బయలుదేరినది. కృష్ణమూర్తి పడుకోడానికి పక్కవేసుకొని దీపము తగ్గించి క్షేత్రయపద మొకటి పాడుతూ పడుకున్నాడు. ఇది రుక్మిణికి ఆఖరుదెబ్బ. తలవంచుకొని గాలిలో రావి ఆకువలె మేడమెట్లెక్కి తనపడకగది చేరినది. తలుపుతీసి తిన్నగా మంచముదగ్గర కెళ్ళి దానిమీద అడ్డగాపడి రెండు నిమిషములు వెక్కివెక్కి రాగాలెట్టినది. అప్పటికి తుపాను తగ్గలేదు. కళ్ళు తుడుచుకుని వసారాలోకి వచ్చినది. నిండుచంద్రుడు పక్కన నవ్వుతూ ఎదురుగా కనపడ్డాడు. మధ్యాహ్నము చదివిన తారాశశాంకుల చరిత్ర జ్ఞాపకము వచ్చినది. పాపము అప్పుడు తార ఎంతబాధ పడ్డదో అనుకున్నది. మళ్ళీ గదిలోకి వెళ్ళినది. కట్టుకున్న చీర విడిచి వేరుచీరకట్టుకుని పడుకుందామని అద్దము దగ్గరకెళ్లి చీరా జాకట్టూవిడిచి రాత్రికట్టుకునే చీర పట్టుకు నిలబడ్డది.

వెనుక నొక పర్యాయము ఈలాగే నిలబడడమూ కృష్ణమూర్తి గదిలో ఉండడమూ జ్ఞప్తికి వచ్చినది. ఇప్పుడుకూడా ఉన్నాడేమో. లేదు. ఇప్పుడేకాదూ అతని గదిలో అతను పడుకోవడము చూచివచ్చినది. ఉంటేనా ... ఆరోజు అతను తనశరీరము చూచినాడేమో. మెరుపువలె ఒకఆలోచనతోచినది. అతన్ని పిలిస్తేనో ... ... మళ్లీ ఆలోచన లేకుండా బట్టైనా కట్టుకోకుండా వసారాలోకి వెళ్లి కృష్ణ మూర్తిని నాలుగుకేకలేసినది. ఎందుకో అనుకొని "వస్తున్నాను" అన్నాడు. మళ్లీ గదిలోకి వచ్చినది. ముఖము ఎర్రబడ్డది. బుగ్గలమీద చేతులుపెట్టుకుంటే కాలిపోయి నాయి. కన్నులలో నీరునిండుతుంది. పొంగి బిగియబారిన స్తనములను ఒక్కసారి గట్టిగా అదుముకొన్నది. బయట అడుగులచప్పుడు వినబడ్డది. చీర గబగబ కట్టుకుంది. రవిక తొడుక్కోలేదు. కృష్ణమూర్తి గదిదగ్గరకు వచ్చాడు.

౧౧

బయటనుంచే "వచ్చానమ్మా, ఎందుకండీ" అన్నాడు. "రా లోపలకురా" అన్నది. ఒక అడుగే లోపలపెట్టి "ఏమండీ" అన్నాడు మళ్లీని. "పరవాలేదు లే. లోపలకురా నేను రమ్మంటున్నాను గనుక తప్పులేదు రా" అన్నది. లోపలికి వెళ్ళాడు. "కూచో" అన్నది. కూచున్నాడు. ఈ లాలనఏమిటి. ఈ సంగతిఏమిటి. ఈ అర్ధరాత్రి వేళ మన్ని ఎందుకు పిలిచినది. ఆముఖమైకిరి, ఆలజ్జ, ఆకళ్ళలో కాంతులూ కొత్తగా ఉన్నాయి. కిందనొక ల్లెవరైనా మేలుకున్నారేమో, వాళ్లు ఏమన్నా అనుకుంటా రేమోనని అనేక మోస్తర్లుగా ఆలోచిస్తూ ఏమీతోచక ఏమిచెప్తుందో అని కని పెట్టుకు కూచున్నాడు.

మూడు నిమిషములవరకూ రుక్మిణి ఏమీ మాట్లాడలేదు. తల వంచుకునే కూర్చున్నది. ఒక్కమాటు తలఎత్తి "అయితేనేను లోపలకు వస్తుంటే నీగదిలో సంగీతము వినపడ్డది. ఎవరుపాడుతూంటా. నీస్నేహితులెవరేనా వచ్చారాఏమిటి. లేకపోతే గాయకురాలి నెవరినేనా తీసుకవచ్చి గానసభ జరిపిస్తున్నావా" అన్నది మందహాసముతో. కృష్ణమూర్తి ఉలిక్కిపడి "ఎవ్వరూలేరండి. నేనే ఏదోకొద్దిగా కూనురాగము తీసుకుంటున్నాను" అన్నాడు. ఆశ్చర్యము నభినయిస్తూ "ఆఁఏమిటీ నువ్వేనా ఆపాడుతున్నది. నిమ్మళముగా కూనురాగమంటూ వేమిటి. అదిపాటకాదు. అమృత ప్రవాహము కాని, నిజముగా నువ్వే పాడుతుంటా. నీకు సంగీతము వచ్చునని ఎప్పుడు చెప్పేవుకావు. ఏది ఆకూనురాగము మళ్ళీ ఒక్కమాటుతియ్యి. వినాల నున్నది. ఏమి సందేహిస్తు

న్నావు. నిద్రవస్తూఉన్నదా ఏమిటి" అన్నది. " లేదండి నిద్రలేదు. కాని నేను బాగా పాడలేను. ఎక్కడా చెప్పుకున్నదికాదు. ఏదోగాలిపాట" అన్నాడు. "పరవాలేదు. పాటయొక్క మంచిచెడ్డలు నిర్ణయించేదాన్ని నేను. కానియ్యి" అన్నది. భయముతో ఆనంద భైరవి కొంచెముసేపు ఆలపించి

"సాయంకాలే వనాంతే కుసుమితసమయే సైకతే చంద్రికాయాం
త్రైలోక్యాకర్షణాంగం సురనరగణికామోహనాపాంగమూర్తిమ్
సేవ్యం శృంగారభావై ర్నవరసభరితై ర్గోపకన్యాసహస్రైః
వందేహం రాసకేళీరత మతిసుభగం వశ్యగోపాలకృష్ణమ్"

అను కృష్ణ కర్ణామృత శ్లోకము చదివి ఊరుకున్నాడు.

పాడేటప్పుడు అతని ముఖము మారిపోయినది. కన్నులు స్థూలదృష్టికి కనుపడని వస్తువును దేనినో చూస్తున్నట్టున్నాయి. ముఖములో వింత ఆనంద ముదయించినది. రుక్మిణి సమ్మోహనాస్త్రము తగిలినదానివలె నిశ్చేష్టురాలై విన్నది. "ఓహో అద్భుతముగా ఉన్నది. కాని శృంగారరసము భక్తిరసములోకి మారినదేమి. అయినాఇదైనా శృంగారరసముతోటి మిళితమైన భక్తిరసమే. బాగున్నది. కానీయి. మరోటికానీయి. ఆజయదేవుని వాగమృతధారలు నాపైనకూడా పడనియ్యి" అన్నది. అనేటప్పటికి మరొక శ్లోకము చదివేశాడు క్రమేణా మొదటిసందేహమూ బెదురూ వదలి కొంచెము ధైర్యమువచ్చినది. శ్లోకాలూ, పద్యాలూ, అష్టపదులూ సుమారు రెండు గంటలు పాడాడు.

రుక్మిణి పరవశయై పోయినది. కృష్ణమూర్తి నెప్పుడూ ఇంత పరిశీలనగా చూడలేదు. మనిషికూడా చక్కనివాడే. ఇంక పాటా అద్భుతము. కేవలము దేవ గానమే. ఇటువంటిమనిషిని ... ... "పాపము చాలాశ్రమపడ్డావు. కాసిని పాలు పుచ్చుకో. లేకపోతే కాస్త టీ కాచి ఇమ్మన్నావా" అన్నది. "వద్దండి. ఏమీవద్దండి" అన్నాడు. "ఆలాగుకాదు. కాసినిపాలు పుచ్చుకో"అని తనకోసము అక్కడఉన్నపాలు అతని కిచ్చినది. అవి అతను పుచ్చుకుంటూ ఉండగా తనూ కొంచెము రాగ మాలపించి ఒక అష్టపది పాడింది.

"చరణ రణిత మణి నూపురయా పరిపూరిత సురత వితానమ్
ముఖర విశృంఖల మేఖలయా సకచగ్రహచుంబనదానమ్ ... సఖిహే ...
రతిసుఖ సమయ రసాలసయా దరముకులిత నయనసరోజమ్
నిస్సహ నిపతిత తనులతయా మధుసూదన ముదితమనోజమ్ ... సఖిహే ...

"ఆహాహా ఏమిసంగీతమండీ. ఏమిగాత్రమూ ఏమిసౌకుమార్యము ఏమిసౌఖ్యము. ప్రాణమునకు ఇంతహాయి నిచ్చేసంగీతము ఎప్పుడూ వినలేదండీ అతిశయోక్తికాదు. ముఖస్తుతికాదు. అమ్మా ఇటువంటి సంగీతము తమ స్వాధీనములో ఉన్నప్పుడు నాపోటి వాడిని పాడమని అదిబాగుందని స్తోత్రము చేస్తూన్నారే" అన్నాడు. "సరే ఒకరినొకరు పొగడు కోవడము అయిపోయినది కనుక ఒక్కక్షేత్రయ పదమేనా పాడు" అన్నది. "అమ్మా ఇంక నే పాడలేను. మీపాట విన్నతరువాత మళ్లీ నోరెత్తడమే ఈ ఇంట్లోను! మీకు శ్రమలేకపోతే మీరే ఏదేనా పాడుతే సంతోషిస్తాను" అన్నాడు. "ఆలాగా. సంతోషిస్తావా. సరే అయితేను" అని సుమారు ఒక్క గంటసేపు శృంగారరసప్రధానములైన ప్రబంధ కవుల పద్యాలు శ్లోకాలు అష్టపదులు శ్రోత్రపేయముగా వినిపించినది

కృష్ణమూర్తి పరవశుడయినాడు. ఇతని ఆత్మ అంబరవీధిని విహారము చేసినది. నేత్రములు అర్ధనిమీలితములైనాయి. అవయవములు పట్లు తప్పినట్లుగా జార్లపడి కూచున్నాడు. అర్ధరాత్రి. పుచ్చపువ్వులా వెన్నెల. సంపంగి, నైటుక్వీను, పారుజాతము మొదలయిన పుష్పముల దివ్యసౌరభము. దూరమున సముద్రపు రొదతప్ప ప్రపంచమంతా నిశ్శబ్దము. ఎదుట అప్సరసవంటి స్త్రీ దేవగానమును వినిపిస్తున్నది. కృష్ణమూర్తికి ఒళ్లు తెలియలేదు. అభ్యాసములేనివాడు ఘాటైనవిస్కీ తాగితే తలకెక్కినట్లు, ఈఅర్ధరాత్రి ఈవెన్నెలలో ఈసంగీతము ఇతని తలకెక్కినది. ముఖము ఎర్రబడ్డది. లలాటమున ఘర్మబిందువులు ముత్యములవలె మెరుస్తున్నాయి. ఆనంద పారవశ్యతచేత నేత్రములు అశ్రుపూరితములైనాయి. ఒళ్లుపులకరించినది. హృదయములో సూక్ష్మ భావతరంగములు బయలుదేరినాయి. మనసులో అనరాని ఆలోచనలు పరుగులెత్తినాయి.

రుక్మిణి పాట నిలువగానే తనొక అష్టపది పాడినాడు.

" స్మరగరలఖండనం మమ శిరసి మండనం
దేహి పదపల్లవ ముదారమ్
జ్వలతి మయి దారుణో మదన కదనానలో
హరతు తదుపాహిత వికారమ్......ప్రియే ..."

ఇతనిలో మార్పు రుక్మిణి గ్రహించింది. ఇతని మనసులో ఉన్న ప్రతి ఆలోచన ముఖములో అద్దములో ప్రతిబింబముగాగ కనపడుతూ ఉంది. మనసు జయించినామనుకొన్నది. అష్టపదికాగానే క్షేత్రయపద మొకటి పాడినాడు. సుమారు

రెండు గంటలవుతుంది. రుక్మిణి ఇంక నిలువలేక పోయినది. ఇతనిపాట పూర్తి కాక ముందే గాలిలో లేడిగలాగ ఊగుతూ కృష్ణమూర్తి కూచున్న సోఫా దగ్గరకువచ్చి ఇతని ప్రక్కను కూచుని ఇతనినిబిగి కౌగిట జేర్చి పట్టి నోటి మీదా కన్నుమీదా ముఖము మీదా తలమీదా గబ గబ ఒక ఇరవై సార్లు ముద్దు పెట్టుకొన్నది. ఆవిడ పైట తొలగి పోయినది. పొంగి బిగియబారిన ఆమె వెచ్చని చన్మొనలు ఇతని హృదయమును దూసుకు పోయినాయి. గజ గజ వణకుతూ అవశుడై తన చేతులలో ఉన్న కృష్ణునకు స్త్రీ స్పర్శ తగులుటకదే మొదటి సారి అని ఆమె తెలుసు కున్నది.

కృష్ణమూర్తి ఒక్క క్షణమునకు చైతన్యము తెచ్చుకొని ఆమె కౌగిలి పట్టు విడిలించుకోవలెనని ప్రయత్నము చేశాడు. "వద్దు తోసెయ్యకు నా ముద్దు కృష్ణా భయపడకు. ప్రవరుడు లాగ వెర్రి వేషా లెయ్యకు. అతనికున్న నిగ్రహాము నీకు లేదు. నీ కేమీ భయము లేదులే స్వర్గము దగ్గర కెళ్లి 'అబ్బే ఇది కాదు స్వర్గ మంటే' అక్కడనుంచి తిన్నగా నరకములోనే పడడము. మనము కోరినప్పుడల్లా స్వర్గము రాదు. నిజమైన ఆనందము మనకు జీవితములో ఎప్పుడో కాని లభించదు. అదృష్టవశాత్తున అది వచ్చినప్పుడు ఆనందము ఇదవునా కాదా అని మీమాంస పడుతూ ఉంటే మనకోసము అది వేచిఉండదు. మళ్ళీ యథాప్రకార స్థితిలోనే ఉంటాము. అందుకని అట్టే సందేహించకు. ముద్దులకృష్ణా రా" అని కౌగిలి వదల కుండానే మంచము దగ్గరకు లాగినది.

కృష్ణమూర్తికి ఈమె చెప్పినదేమీ వినపడలేదు. ఆమె శరీరము వేడి తన వంటి కెక్కినది. ఆమె వేడి యూర్పులు తన ముఖమునకు తగులుతున్నాయి. ఆమె శరీర సౌరభము మత్తు మందువలె ఇతనికి మాంద్యమును కలిగించినది. దానితో అతని బలము పూర్తిగా నశించినది. కీలుబొమ్మవలె ఆమె పక్కను మంచము మీద కూచున్నాడు. అతని తల ఒక చేత్తో నిమురుతూ రెండవ చేత్తో కౌగిలి మరింత బిగించి మరోమారు రుక్మిణి మళ్లీ ముద్దు పెట్టుకొన్నది. దానితో అతని వెనుకటి స్వరూపమంతా మారిపోయినది. కొత్త ప్రాణమూ దానితో మళ్లీ బలమువచ్చినది. ఒక్కసారి ఒళ్ళంతా పులకరించినది. కళ్ళు జ్యోతులవలె ప్రకాశించాయి. ప్రవాహములో మునిగిపోతున్నవాడు చేతికి దొరికిన వస్తువును గట్టిగా పట్టుకున్నట్టు రుక్మిణిని తన బలముకొద్దీ ఆలింగనము చేసుకొని ఆమెకు ఊపిరాడకుండా నోటి మీద ముద్దుపెట్టుకున్నాడు. ఆ కౌగిటిలో పుష్పమువలె ఆమె నలిగిపోతూ "అబ్బా" అని వెనక్కు వాలింది.

ఆ ఉభయులకు ప్రపంచ మంతటితో అంతరించిపోయినది.

౧౨

ఈ రెండుమాసములనుంచీ పడ్డ అవస్తను మరిపించు ఒళ్ళు తెలియని ఆనందములో ఒకవారము గడిచినది. వెన్నెలపోయి చీకట్లు అలుముకోడము మొదలుపెట్టినాయి. ఎల్లకాలమూ శుక్లపక్షము ఎందుకు నిలుస్తుంది. కృష్ణపక్షము వెంటనే రాకమానదు. ఆ అనాలోచితకార్యము చెయ్యడమూ చెయ్యిదాటి పోయిన తరువాత దాని మంచిచెడ్డలను గురించి ఆలోచనా, తరువాత విచారము.

రుక్మిణికి ఆ ఉద్రేకము ఇప్పటికి కొంచెము తగ్గినది. పొరపాటు చేశామనే జ్ఞానము కలిగినది. అయితే మట్టుకు ఇప్పుడు చేసేదేమున్నది. "ఇంకా నారాయణరావు ఎప్పుడు వస్తాడో వచ్చిన తరువాత తెలిస్తే ఏలాగు, కొంప మునిగిపోతుంది. అయినా ఏలా తెలుస్తుంది ఆయనకు. అన్నట్లు ఈమధ్య ఉత్తరము వచ్చికూడా చాలాకాలమయినది. ఎందుచేతనో, ఎప్పుడూ తప్పకుండా వ్రాసేవారు, ఈసారి ఇంత ఆలస్యానికి కారణ మేమైయుంటుంది. శరీరములో ఏమీ అస్వస్థగా లేదుగదా కొంపతీసి, నేనూ ఉత్తరము వ్రాసి రెండువారములు కావస్తున్నది. ఏలాఉన్నారో ఏమిటో అని ఆలోచించి ఒకనాడు ఉదయము తొమ్మిది గంటలకు రుక్మిణి తన గదిలో కూచున్నది. క్రింద కృష్ణమూర్తి భోజనము చేస్తున్నాడు. ఆకాశాన్ని చిరుమబ్బులు ఒకదాన్ని ఒకటి తరుముకెడుతున్నాయి. ఒక క్షణము నీడగానూ ఒకక్షణము ఎండగాను ఉంటూఉంది. హఠాత్తుగా వాకట్లో మోటారుచప్పుడు వినపడ్డది. ఎవరయి ఉంటారా వచ్చినవారని రుక్మిణి ఆలోచించి కూచున్నది. లేచి ఇవతలికి రాలేదు.

నారాయణరావు కారులోనుంచి దిగి నాలుగడుగులలో మేడమీదకే వెళ్ళి తిన్నగా రుక్మిణి గదిదగ్గర నవ్వుతూ నిలబడ్డాడు. గుమ్మమున కెదురుగా పడకకుర్చీలో కాళ్ళూగిస్తూ వచ్చేవారెవరా అని ఆలోచిస్తూ కూచున్నది రుక్మిణి. భర్తను చూచి నిర్ఘాంత పోయినది. "ఎక్కడ నుంచి ఊడిపడ్డాడు. ఏలా వచ్చాడు. ముందు ఉత్తరము ఎందుకు వ్రాయలేదు. అతని సంగతి అనుకుంటూ ఉండగానే ఈలా ప్రత్యక్షము కావడ మేమిటి. అనే ఆలోచనలు గాలిలో మబ్బులు లాగ పరుగు లెత్తడము మొదలు పెట్టినాయి. ఈ ఆలోచనలో, లేవవలెననీ, అతనికి స్వాగత మివ్వవలెననే సంగతి మరచి పోయినది. నారాయణరావు రెండు అంగలలో ఆమె కుర్చీ దగ్గరకు వచ్చి కుర్చీలో వెల వెల బోతూన్న మనిషిని కౌగిట్లో పట్టుకు లేవనెత్తి ముద్దాడి, 'ఏమి రుక్మిణీ, అప్పుడే రెండు మాసములకే నన్నుమరచి పోయావా ఏమిటి, లేక

పోతే చెప్పకుండా వచ్చి నందుకు కోపమా, అక్కడ పని అనుకున్నకంటె పదిహేను రోజులు ముందుగా అయి పోయినది. అందుచేత తక్షణం బయలు దేరినాను. నాకు తెలియ పర్చడానికి వ్యవధి లేక పోయినది. కేబుల్ ఇద్దామను కున్నాను, కాని మళ్ళీ నీకు తెలియ కుండా హఠాత్తుగా వస్తేనే సంతోషిస్తావని స్టీమరు రైలూ తీసుకు వచ్చి నంత త్వరగా వచ్చాను. పొరపాటు చేశా నన్నమాట, నీకు ముందు తెలియ పరచ వలసినదే, అయినా ఆ మాత్రముదాని కంతకోప మెందుకూ, ఈపాటికైనా ప్రసన్నురాలవు కాకూడదూ, అని నారాయణరావు భార్య గడ్డము పట్టుకొని ముఖము పై కెత్తి మళ్లీ ముద్దు పెట్టుకున్నాడు.

రుక్మిణి బలవంతముగా తెచ్చిపెట్టుకొని ఒక చిన్ననవ్వు నవ్వి " అబ్బే నాకు కోప మేమిటి, కోప మేమీ లేదు. ఇప్పటికేనా నాయందు దయగలిగి వచ్చినారు. చాలా సంతోషముగా ఉన్నది. ఈపదిహేను రోజులనుంచీ మీదగ్గరనుంచి ఉత్తరము రాకపోయేటప్పటికి ఏమీ తోచడము లేదు. ఎలా ఉన్నారా ఏమిటా అనుకుంటూ ఇంకా రావడానికి వీలు లేదని మళ్ళీ ఉత్తరము వ్రాస్తారేమోనని భయపడుతూ ఏమీ తోచక రోజో యుగముగా గడుపుకుంటూ వచ్చినాను. ఇకనుంచి మీ రెక్కడకు వెళ్ళినా ఒక్క రోజేనా నన్ను విడిచిపెట్టి వెడితే నేను వప్పుకోను. మీతో కూడా తీసుకువెడుతూ ఉండండి, అని భర్త మెడచుట్టూ చేతులు వేసుకొని అతని రొమ్ము మీద తలపెట్టుకొని కళ్ళనీళ్ళు పెట్టుకున్నది.

ఇప్పటికి కొంచెము రుక్మిణికి మనసు కుదుటపడ్డది. కాని ప్రేమ పురికొల్పగా రెక్కలమీద ఎగిరివచ్చిన అమృతమయుని ఎదుట అతని కౌగిట్లో నిలబడ్డప్పుడు తను చేసిన అపరాధము యొక్క పరిమితి తెలుసుకొన్నది. అగ్నిజ్వాలలమధ్య ఉన్నట్టుగా ఉన్నది. కన్నీరు సముద్రపు పొంగు లా వస్తూ ఉన్నది. నారాయణరావు తనజేబు రుమాలుతో భార్యకన్నీరు తుడిచి, ఏడవకు, అలాగే ఇకమీ దెప్పుడూ నిన్ను విడిచి వెళ్ళనులే, ఊరుకో ఇంత బెంగ పెట్టుకుంటావని తోస్తే ఏమైనాసరే మొన్ననుకూడా నాతోటి తీసుకువెళ్ళేవాడనే ఊరుకో అని ఊరడించాడు.

నౌకర్లు ఇంతలోకే సామాను తీసుకొని పైకి వచ్చినారు. నారాయణరావు బట్టలు విడవడానికి తనగదిలోకి వెళ్లినాడు.

౧౩

నారాయణరావు తనగదితలుపు తీసి "మోహినీ వచ్చా ... " అతనిమాట పూర్తి కాలేదు. పటము కేసి చూసి నిర్ఘాంతపోయినాడు. పటము అక్కడనే ఉన్నది. పటములో నున్నది మోహిని రూపమే, దానిలో ఏమీ తేడాలేదు. కాని ఆము ఖములో మార్పు. ఆనవాలు పట్టడానికి వీలులేకుండా మారిపోయినది. ఆపటము వేయించి మొదట తను ఊరికి వెళ్లేవరకూ ముఖము ఎప్పుడూ కలకలలాడుతూ ఉండేది. వెళ్ళేరోజునకూడా చిరునవ్వుతో సాగనంపినది, అలాంటి దిప్పుడు ముఖము కళావిహీనముగా నున్నది. ఏ దెయ్యమిది లంకణములు చేసినమనిషివలె చిక్కిపోయి ఉన్నది. కన్ను లశ్రుపూరితములయి ఉన్నాయి. ముఖముందు కోపమూ జాలీ కన పడుతూ ఉన్నాయి.

ఇటువంటిమార్పు ఇదివరకు నారాయణరావు ఎప్పుడూ చూచి ఉండలేదు, పటమునందు అటువంటిమార్పు సాధ్యమా అనికూడా అతనికి అనుమానము. ఇదివర కెప్పుడైనా నవ్వుతూ ఉన్నట్టుగాని ముఖము చిట్లించుకున్నట్టుగాని తన అభిప్రాయము నుబట్టి తనకు ఊరికే అల్లా కనపడే దనుకునేవాడు కాని ఇప్పుడుమట్టుకు అలా అనుకోడానికి ఏమీ అవకాశము లేదు. ఒకవేళ బొమ్మని ఎవరేనా మార్చి ఉందురా? మార్చడానికి ఎవరి కేమి అవసరము. బొమ్మను చూచినా అలా మార్చబడినట్లు కను పించదు. చాలకాలము క్రితము చిత్రించబడినపటమువలెనే ఉన్నది. పైగా ఇక్కడికి వచ్చి ఈపటము పాడుచేయడానికి ఇంకొకళ్ళ కేమి అవసరము. అయితే ఈమా ర్పుకు కారణ మేమై యుంటుంది. ఎవరిమీద కోపము. ఎవరిమీద జాలి.

బట్ట విడవకుండానే పటము దగ్గరకువెళ్లి కూచున్నాడు. "మోహినీ ఏమిటిది. ఎందు కీకోపము. ఎందు కీలా ముఖము వన్నెతరిగి ఉన్నది. ఎందు కిలా చిక్కిపోయి నావు. నేను వెళ్లిపోయానని కోపమా, నీతోటి చెప్పే వెడితినిగా. ఉత్తరము వ్రాయలేదనా నాసంగతులన్నీ నీకుతెలుస్తూనే ఉన్నాయిగా, నువ్వెప్పుడూ నాకు తోడునీడుగా ఉంటూనే ఉన్నావుగాదూ, వేరే ఉత్తర మెందుకు. పోనీ నావల్ల లోప మేదేనా వస్తే అప్పుడే చెపుతే సవరించుకునేవాడిని గాదూ. ఏమి మాట్లాడవు. సమాధానముచెప్పవు. మోహినీ ఏమిటిది నా కేమీ తోచడము లేదు. నువ్వేదో చెపుతేనేగాని నే నిక్కడనుంచి కదలను" అని అక్కడనే కూచున్నాడు.

ఎంతసేపు కూచుంటేమట్టుకు పటము ఏమి మాట్లాడుతుంది. ఏమీ జవాబు రాలేదు. కళ్ళల్లో అశ్రువులుమట్టుకు ఎక్కువయినట్టు కనపడ్డది. సుమారు రొకగంట అలాగే కదలకుండా ఏమీ ఆలోచకుండా కూచున్నాడు. ఆఖరికి లేచి బట్టలు విడిచి స్నానానికి ఇవతలికి వచ్చినాడు. ఈసంగతి రుక్మిణితోమట్టుకు ఏమీ చెప్పలేదు.

స్నానముచేసి రుక్మిణి తనూ భోజనమునకు వెళ్ళినారు, భోజనముచేస్తూ అందరియోగక్షేమమూ అడిగి తెలుసుకున్నాడు. "ఏడీ కృష్ణమూర్తి ఏడీ, అప్పుడే భోజనముచేసి కాలేజీకి వెళ్ళేడా ఏమిటి, బాగా చదువుకుంటున్నాడా. అతనికి ఏమీ లోటు లేకుండా కనుక్కుంటున్నావా, అతని కేమైనా డబ్బు గిబ్బు అవసరమయితే ఇచ్చావా, ఏమీ ఇబ్బంది పడలేదుకదా అతను" అన్నాడు రుక్మిణితో.

రుక్మిణి తెల్లబోయినది. "ఇదేమిటి కృష్ణమూర్తినిగురించి ఇంతగా నన్నడుగుతున్నాడు. ఇతని కేమీ అనుమానము లేదుగదా" అనుకున్నది. 'అయినా ఇతనికి అనుమానము కలగడానికి ఏమి అవకాశము ఉంటుంది' అని ధైర్యము చెప్పుకొని అతనికి సమాధానము చెప్పినది, కాని గుండెలలో మట్టుకు ఒకవిధమైన బెదురు ఆరంభమయినది.

౧౮

నారాయణరావు మోహినిపటములో మార్పుచూచినప్పటినుంచీ మనిషి మనిషిలా లేడు. ఒకవిధమైన బెంగ బయలుదేరినది. పటములో మార్పు నిజమే, ఏదో తగినంత గొప్పకారణ ముంటేనేగాని ఇటువంటిమార్పు కలుగదు. అదేనా ప్రతిపటములోనూ ఇటువంటిమార్పులు కలుగవు. తనమోహిని పోయినా ఈపటములో ఇంకా జీవించి ఉన్నది గనుక మామూలువలెనే అవస్థాబేధము లన్నీ ముఖములో కనపడుతున్నాయి, కాని ఇంతమార్పు కలిగించేకారణము ఏమై ఉంటుంది. ఏలాగు తెలుసుకోవడము, మోహినా మౌనముద్రవహించి కూర్చున్నది. ఇంక నీసందేహము తీర్చేవా రెవరు, అని అనేకవిధాలుగా ఆలోచిస్తూ కూర్చున్నాడు. తనపనికూడా సరిగా చూసుకోవడము మానేశాడు.

దీనికి తగినసమాధానము రుక్మిణి ఏమైనా చెపుతుందేమో అడిగిచూదామా అనుకున్నాడు. మళ్ళీ ఏమిలోచినదో ఆమెదగ్గర ఈసంగతి తలపెట్టలేదు. రుక్మిణిలో కూడా కొంచెము మార్పు కలిగినది. వెనుకటి ఉత్సాహము ఉద్రేకము కొంత

తగ్గినట్టు కనుపించినవి. మునపటిచురుకు పోయి కొంచెము మాంద్యములో పడ్డది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూన్నట్టుగా పరధ్యానముగా ఉండడము మొదలు పెట్టినది. పలకరిస్తే ఉలికిపడి లేనిహాసము తెచ్చిపెట్టుకొని సమాధానము చెపుతూఉంటుంది. నాటకాలమీద సినీమాలమీదా పూర్వపు అభిమానము తగ్గినది. అన్నిటిమాటా అలాఉంచి తనవిషయములోకూడా కొంచెము దూరదూరముగా ఉంటున్నది. ఏమిటీచిత్రమంతాను అని ఆలోచిస్తూఉండగా హఠాత్తుగా మనసు కొకఊహ తట్టినది.

కాని దానినిగురించి మళ్ళీ ఆలోచించడానికి భయపడ్డాడు. తనకే సిగ్గుగా తోచింది. అటువంటిఆలోచన తనకు తగ దనుకొన్నాడు. ఇంతనీచమైన ఊహ తనకు ఏలాకలిగిందా అనుకున్నాడు. అనేకవిధముల ఆఆలోచనను మనసులోనుండి తొలగించవలెనని శాయశక్తులా తంటాలుపడ్డాడు. కాని అదిమట్టుకు తొలగిపోలేదు. ఏది ఆలోచించబోయినా పంతముపట్టినట్టు ఆ ఆలోచనే పైకిరావడము మొదలు పెట్టినది. వద్దనుకున్నకొద్దీ ప్రతివిషయము ఆ ఊహను రూఢిచెయ్యడానికి ప్రయత్నిస్తూ ఉన్నట్టు కనపడ్డది. ఊరినుంచి వచ్చినప్పటినుంచీ కృష్ణమూర్తి ఒక్కసారీ కనపడలేదు. ముఖము తప్పిస్తూ ఉన్నట్టు కనపడ్డది. ఆలోచన నిజమే అయియుంటుందా, కాదు ఒక్కనాటికి కాదు. అయినా ఏమో మోహినిని అడిగిచూదాము. అని తిన్నగా తనగదిలోకి వెళ్ళాడు.

గంభీరమైన ముఖముతో నిశ్చలమైనచూపుతో, దృఢమైన నడకతో మనోనిశ్చయమును సూచించునట్లుగా పెదవులు బిగించి తిన్నగా పటముదగ్గరకు వెళ్ళి నిలబడి "ఏమి మోహినీ నాఊహ నిజమేనా ఏమిటి కొంపతీసి అంతపని జరిగినదా ఎంతపని. ఎంతద్రోహము చేసినది, నిజమే సందేహ మేమీ లేదూ" అన్నాడు. వేడినిట్టూర్పులు అతిత్వరితముగ వస్తున్నాయి, మోహిని వేరే సమాధానము చెప్పే దేమిటి, కళ్ళమ్మట నీళ్ళు బొటబొట కారుతున్నట్లు వెక్కివెక్కి రాగాలెడుతున్నట్లుగా, రొమ్ముకదులుతున్నట్టు, ఎగుపులు వస్తున్నట్టు నారాయణరావుకు కనపడ్డది. ఆమెచేతులు క్షమాపణ వేడుతున్నట్లుగా జోడించి ఉన్నాయి.

నారాయణరావు నిశ్చేష్టుడై దగ్గరనున్నకుర్చీలో కూలబడ్డాడు. ఒళ్ళు కంపిస్తోంది. మోకాళ్ళమీద మోచేతు లానుకొని అరచేతులలో ముఖము పెట్టుకుని దుఃఖనిమగ్నుడై కూచున్నాడు. హృదయము ఎండిపోయినది. పొడిగుడ్లు పడ్డాయి. ఒక్కసారి పిల్లవానివలె ఏడిస్తే హృదయభారము కొంతవరకు తగ్గుతుం దనుకొన్నాడు. కాని ఒక్క కన్నీటిచుక్కైనా ఎంతప్రయత్నముచేసినా రాలేదు. అలాగే

కదలకుండా కొన్నిగంటలసేపు కూచున్నాడు. అప్పటికి కొంచెము దుఃఖభారము తగ్గింది, హృదయము కొంచెము చులకపడ్డది.

౧౫

మోహిని ఇచ్చిన సలహాయే బాగున్నది. తాను ఒకరియందు దోషారోపణ చేసి వారిని శిక్షించడానికి తన కేమి అధికారము ఉన్నది.

దూరము ఆలోచించి తనేమీ ఎరగనట్టుగానే ప్రవర్తించడము మొదలు పెట్టేడు. వెనుకటికంటెకూడా రుక్మిణియెడల ఎక్కువ దయగా ఉండడము మొదలు పెట్టినాడు. ఒక్క క్షణమైనా బొత్తుగా విడిచిపెట్టుటలేదు. కృష్ణమూర్తిని సెలవలు ఇవ్వడముతోటే తనపని ఏదో చూడుమని కాకినాడ పంపివేసినాడు.

కాని నారాయణరావు దయగా ఉంటున్నకొద్దీ రుక్మిణికి మనోవ్యథ హెచ్చినది. అతను దగ్గరకువచ్చినకొద్దీ రుక్మిణి దూరముగా ఉండడము మొదలుపెట్టినది. అతను అమృతవర్షము కురిపించినకొద్దీ రుక్మిణి కృశించిపోవడము మొదలుపెట్టినది. ఏలాగో తనకు తెలియదు కాని నారాయణరావు తన అపరాధము తెలుసుకున్నాడని రుక్మిణి గ్రహించినది. ఏలా తెలుసుకున్నాడు. ఎవరు చెప్పిఉంటారు. ఎవరైనా చెప్పడానికిమట్టుకు ఒక్క భగవంతుడికి తప్ప ఈసంగతి ఇంకొకరికి ఎవరికి తెలుసును. ఏలాగైతేనేమి తెలుసుకున్నవాడు నన్ను తిట్టడమో కొట్టడమో పొమ్మనడమో చేయక ఈనెత్తిమీద పెట్టుకోవడమేమిటి. ఇది మరింత బాధగాఉందే. ఏలాగు ఏమిదారి. పోసి వెళ్లి అంతా చెప్పేస్తేనో మనము అనుకున్నట్టుగా ఇదివరకు తెలియకపోతే చెపితే ఏమి కొంపమునుగుతుందో. ఇదివరకే తెలిస్తే ఇప్పుడు మనము చెప్పినందువల్ల వచ్చే లాభమేమిటి.

అంతకంతకు రుక్మిణి మతిపోయినదానివలె ఉన్నది. హృదయములో ఆందోళన హెచ్చినది. ఏమిచేయడానికీ తోచలేదు. నారాయణరావు వచ్చి సుమారు నెల రోజులు కావచ్చింది. ఆనాడు ఆదివారము. రుక్మిణి తనగదిలో ఉన్నది. నారాయణరావు గదిలో అతను ఏదో పనిచేసుకుంటూన్నాడు. సాయంకాలము సుమారు నాలుగు గంటలవుతుంది, ఆకాశమున కారు మబ్బులు కమ్మినాయి. ఉరుములూ మెరుపులూను. రుక్మిణిహృదయములో బాధసహింప శక్యముకాకుండా ఉన్నది. ఈఅవస్థ ఏలాగో ఓలాగ అంతమొందిస్తేనేగాని బ్రతుకు దుర్లభమనుకున్నది. ఏలాగ అంత

పొందించడము. తను ప్రాణహత్య అయినా చేసుకోవలె. లేకపోతే అతని కాళ్ళ మీదపడి జరిగినదంతా చెప్పి రక్షించమనేనా వేడుకోవలె. ఇప్పు డతను క్షమించ లేదు అని కాదు. కాని అతని నోటంట ఆమాటవస్తే ఈహృదయవేదన తీరుతుందే మో ఆలాచెప్పేస్తే కృష్ణమూర్తికి ఏమి నష్టము కలుగుతుందో. పోనీప్రాణ త్యాగము చేసుకుందాము అంటే ఇంత చిన్నవయస్సులో ౨౨ ఏండ్లయినా నిండలేదు. ఇటువంటి భర్తను విడిచిపెట్టి ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టి ఏలాగు పోవడము. పోతేమట్టుకు ముక్తి ఉంటుందా. ఈశ్వరుని ఎదట నిలబడి సమాధానము చెప్పుకో నక్కరలేదూ, మనలాంటి మనిషిదగ్గరనే ఈలా జడిసేటప్పుడు ఇంతదోషముతో ఈశ్వరుని దగ్గర ఏలానిలబడడము. అయినా చేసిన దానికి ఫల మెక్కడో ఒకచోట అనుభవించవలె కదా. ఈఅనుభవ మిప్పుడు తప్పించుకుంటే ముందు తప్పుతుందన్నమా టేమిటి. కర్మ చేసేటప్పుడు ఉండే ధైర్యము దానిఫల మనుభవించేటప్పుడు ఉండనక్కరలేదూ, ప్రాణత్యాగము చేసుకోడము పట్టిపిరికిపని. అది తప్పు. వెళ్ళి ఆయనకాళ్ళమీదే పడ తాను. నాయందు ఇంతదయగా ఉన్నవాడు కృష్ణమూర్తిని మట్టుకు శిక్షిస్తాడా, పాపము అతనిని ఇందులోకి దింపినదాన్ని నేనేకదా. ఆసంగతి స్పష్టముగా నారా యణరావుతో చెపితే అతనియెడలమట్టుకు దాక్షిణ్యము వహించకపోతాడా అని చాలా దూరముఆలోచించి చెంగున లేచి నారాయణరావు గదిగుమ్మము దగ్గరకు వెళ్ళినది.

అక్కడకు వెళ్ళేటప్పటికి మొదటనున్న ధైర్యము స్వేదరూపమున నీరై స్రవించి పోయినది. ఒళ్ళంతా బలువు ఎక్కిపోయినది. అడుగు ముందుకి సాగలేదు. బయట ఉరుములూ మెరుపులూ ఎక్కువయినాయి. పెద్ద సుడిగాలి బయలుదేరినది. ఒక్కక్షణము మళ్ళీ తటపటాయించినది. కాని ఆఖరికి తెగించి ఒక్కఅంగలో వెక్కివెక్కి రాగాలెడుతూ వ్రాసుకుంటున్న నారాయణరావు కాళ్ళపైన పడ్డది. ఇదేమని నారాయణరావు భార్యను బలవంతాన లేవదీసి ఒడిలో కూచోపెట్టుకుని కన్నీరు తుడిచి దుఃఖహేతు వేమిటని అడిగినాడు.

రుక్మిణి నోట మాటరాక పొంగిపొరలి వస్తున్నదుఃఖమును ఆపుకోలేక ఒక పది నిమిషములు అతని రొమ్ముమీద తలపెట్టి ఏడ్చి తుదకు తను చెప్పదలచుకొన్న దంతా ఎగుపులతో చెప్పి తనను ఇంట్లోనుంచి వెళ్ళగొట్టేసెయ్యవలసినదని అతని సన్నిధియందు నుంచోడానికి కూడా యోగ్యతలేదనీ ఏదో ఒక విధమైన శిక్షవిధిస్తేనే కాని ఈబాధ సహించలేనని ప్రాధేయపడ్డది.

నారాయణరావు నిదానముగా ఆమెనొకసారి చూసి తల నిమురుతూ "ఈ పశ్చాత్తాపముకంటె వేరుశిక్ష ఏమికావాలి. ఇదంతా మరచిపో. నూతన జీవిత మారంభిద్దాము" అన్నాడు.

తుపాను తొలగి పోయినది. ఆకాశము నిర్మల మయినది. అస్తమిస్తున్న సూర్యుడు గాఢాలింగనమున బద్ధులైన ఆదంపతులను చూచి దొంగతనము చేసిన వానివలె సిగ్గుచేత ఎర్రవారిన ముఖముతో పశ్చిమాద్రి వెనుక దాక్కున్నాడు.

౧౬

నాడు నారాయణరావు విదేశమునుంచి తిరిగి వచ్చినరోజు మొదలు కృష్ణమూర్తి నారాయణరావుగారి ముఖము తప్పించుకు తిరిగేడు. వెనుకటి చనువుగా ఆయన దగ్గరకు వెళ్ళడము మానేవేసినాడు. తను వారియెడల ఒనర్చిన అపరాధము యొక్క పరిమితి తెలుసుకొని సిగ్గుపడిపోయినాడు. ఇంత మహోపకారము తనకు చేసినందుకు ప్రత్యుపకారముగా ఇంత నీచకృత్యము చేశాముగదా అని విచారించినాడు. కాలేజీకి వెళ్లేవాడన్న మాటేగాని అక్కడ గురువులు చెప్పే దేదీ తల కెక్కేది కాదు. ఇంటికి వస్తే పుస్తకము చేతపట్ట బుద్ధి అయ్యేదికాదు. భోజనము దగ్గరకు వెడితే అన్నము తినబుద్ధి అయ్యేదికాదు, రాత్రి పడుకుంటే కంటికి కునుకు వచ్చేది కాదు.

ఈఅవస్థలో ఉండగా కాలేజీకి వేసంగి సెలవలు ఇచ్చారు. ఇంటికి వెళ్ళడమా మానడమా. ఇంటికి వెళ్ళడానికి డబ్బో. ఇన్నాళ్ళు ముఖము తప్పించి నారాయణరావుగారి ఎదుట ఏలాపడడము. ఇంటిదగ్గర "నీకంత అప్పు లెవరున్నారు వెళ్లి ఏమి చేస్తావు" అని అడుగుతే ఏమిసమాధానము చెప్పేది. అని సెలవులిచ్చేనాడు రాత్రి పడుకుని ఆలోచిస్తూ పక్కమీద దొర్లడ మారంభించినాడు.

మరునాడు ఉదయాన్ని నారాయణరావుగారు అతన్ని పిలిచి కొంతసొమ్మిచ్చి కాకినాడ వెళ్ళి వారి పనులేవో చూచిరమ్మని పురమాయించారు. కృష్ణమూర్తి గజగజ లాడుతూ తలవంచుకుని నిలబడ్డాడు. నారాయణరావుకు తన సంగతి తెలుసునని ఓమో సరుగా గ్రహించుకున్నాడు. అక్కడ నిలబడ్డంతసేపు ఆయన చూపులాగ్నేయాస్త్రముల వలె నిలువల్లా దహించేస్తూన్నట్టు ఉన్నాయి. కాని ఆయన మాటలయందు మార్దవముగాని ముఖమునందు హాసముకాని తగ్గలేదు.

వారివద్ద సెలవుదీసుకుని మళ్ళీ నారాయణరావు గారికి కనబడకుండా ఆసాయంకాలమే బయలుదేరి కాకినాడ వెళ్లిపోయినాడు. మద్రాసు విడిచి పూర్వపు స్నేహితుల మధ్యకు వచ్చినా నారాయణరావు గారికి తెలిసింఢేమో ఏమి చేస్తారో అనే భీతిమట్టుకు వదలలేదు. మనోవ్యథ అనేక విధముల బాధిస్తోన్నది. పోనీ ఈ సంగతంతా వారికి ఉత్తరము వ్రాసేదా మనుకున్నాడు. అలా వ్రాస్తే రుక్మిణిసంగతి ఏటౌతాను. వారి సంసారము ఇంతటితో ఛిద్రమయిపోతుందేమో. దానికి కారణము మన మెందుకు కావలెనని కొన్నాళ్ళు ఊరుకున్నాడు. కాని మనోవేదన పిశాచమువలె వెన్నంటి పీడిస్తూనే ఉన్నది. దుస్సహమైన ఈబాధనుండి తప్పించుకోడానికి ఒక్కటే మార్గము. ఏమైనా ఆపనిచేసి తీరవలసినదే. లేకపోతే జీవితము దుర్భరమౌతున్నది.

మరునాడు జరిగిన సంగతంతా వ్రాసి ఇక తనెప్పుడూ చెన్నపట్నమురానని ఈ అపరాధము మన్నించమనీ తన భావి జీవితమంతా వారి క్షమాపణపై ఆధారపడి యున్నదనీ ఒకపెద్ద ఉత్తరము నారాయణరావుగారి పేర వ్రాశాడు. తనిల్లావ్రాసినట్టు ఆమెకూడా ఆయన పాదములపైన పడితే కొంతపాపపరిహార మౌతుందని ఆమె రహస్యమును బయలు పెట్టినందుకు క్షమింపుమని రుక్మిణి పేరకూడా వ్రాశాడు.

౧౭

ఈ రెండు ఉత్తరములు రుక్మిణి నారాయణరావుతో మాట్లాడిన మర్నాడు వచ్చినాయి. రుక్మిణి తన ఉత్తరము తీసుకువెళ్ళి నారాయణరావుకు చూపించినది. నారాయణరావు తనకు వచ్చిన ఉత్తరము ఆమెకు చూపించినాడు. రుక్మిణి అది చదువుతుండగా గతమంతా మళ్ళీ ఒకసారి అద్దములోనవలె కనుపించినది. తలవంచుకున్నది. కన్నీటికాల్వలు ప్రవహిస్తున్నాయి. నారాయణరావు రెండు ఉత్తరములూ తీసుకుని నిప్పుపుల్ల వెలిగించి అంటించేశాడు. "రుక్మిణీ, దీనితో గతమంతా నశించి పోయినది. ఇంక నెప్పుడూ ఆసంగతి తలపెట్టకు" అని ఆమెకన్నీరు తుడిచినాడు.

౧౮

ఇంకొక రెండురోజులకు బి. ఏ. పరీక్షలు తెలిసినాయి. కృష్ణమూర్తి ప్యాసు అయినాడు. నారాయణరావు కృష్ణమూర్తికి ప్యాసుఅయినట్టు టెలిగ్రాముఇచ్చి అతని తండ్రి ఇదివరలో చేసే పనిని అతనిని చూస్తూ ఉండమనిన్నీ కాన్వొకేషనుకు తప్పక రావలసినదనీ ఒక ఉత్తరముకూడా వ్రాసినాడు.

ఉత్తరము వ్రాయడము ముగించడముతోనే నారాయణరావుకు ఒక పెద్ద నిట్టూర్పు వినపడ్డది. ఎవరా అని తిరిగిచూచేసరికి ఎవ్వరూ గదిలో కనుపించ లేదు. పైన చూచేసరికి మోహిని చిరునవ్వుతో నిజస్వరూపముతో కనుపించినది. "మోహినీ! అయితే నేను చేసినపని నీకు నచ్చినదన్నమాటే" అన్నాడు. మోహిని నవ్వి నారాయణరావును కళ్ళతో ఆశీర్వదించినది.

*

బూచాడు

చింతా దీక్షితులు

చీకటి అమ్మా చీకటి అమ్మా చీకటి చూస్తే భయమే
ఇంట్లో చీకటి దొడ్లో చీకటి అంతా చీకటి మయమే.

చీకట్లోనూ బూచీవాడూ దాక్కొన్నాడమ్మా
బూచీవాడిని చూస్తే నాకు భయమేస్తుందమ్మా.

నల్లటి వళ్ళూ ఎర్రటి కళ్ళూ ఊచల్లా కాళ్ళూ
చేత్తో కత్తిని పట్టుకువచ్చీ ముక్కూ కోస్తాడు.

బూచీవాడూ బుట్టా తెచ్చీ ఎత్తుకు పోతాడు
బూచీవాడిని పొమ్మని చెప్పే, బబ్బుంటా నమ్మా.

అమ్మా నేనూ నీవళ్ళోను బబ్బుంటా కాదే
నీవళ్ళోనూ బబ్బుంటేనూ బూచాడొస్తాడా?

బబ్బున్నాకా మంచీ మంచీ కథలూ చెప్పవులే
బబ్బున్నాకా మంచీ జోలాపాటలు పాడవులే.

కథలూ జోలాపాటలు వింటూ నిద్దరపోతాను
బబ్బుని నేనూ అల్లరిచేయక నిద్దరపోతాను.

నిద్దరపోయీ తెల్లారేకా కళ్ళు తెరుస్తాను
చీకటి పోయి అంతా తెల్లని వెల్తురు వస్తుంది.

బూచీవాడు బుట్టాపట్టుకు వెళ్ళిపోతాడు
అప్పుడు బొమ్మలతోటీ నేను ఆడూకుంటాను.

*

కృష్ణమ్మకొడుకు

కృష్ణమ్మ కో చిన్నకొడుకు పుట్టాడే
ఆకొడుకు నెత్తుకుందాము రారమ్మ.

కొడుకంటె కొడుకటే గారాల కూచి
ముత్యాలహారమే ముద్దుల మూటే.

రకరకము విద్దెల్లు చూపు తున్నాడే
కిక కికా కిక కికా నవ్వు తున్నాడే.

చిన్ని చేతులు తట్టి ఆడు తున్నాడే
బోసినవ్వులు వెళ్లబోయు చున్నాడే.

చల్లన్ని చూపుల్లు చల్లుతున్నాడే
ఇల్లంత వెన్నెల్లు కాయుచున్నాడే.

ఆ కళ్లు ఆ మొహం ఆ జుట్టు తీరూ
అచ్చంగ కృష్ణమ్మ పోలికే నమ్మా.

పూలటోపీ నల్లి తీసుకూ రండి
పట్టు జుబ్బా కుట్టి పట్టుకూ రండి.

కృష్ణమ్మ పుత్రుడికి ముస్తాబు చేసి
అందరూ ఎత్తు కొని ముద్దాడుదాము.

అందరూ ఈ కొడుకు నెత్తుకోరండీ
ముద్దుల్లు కొల్లగా పెట్టుకోరండీ.

కొడుకు నెత్తుకు ముద్దులాడేటి వేళ
హృదయాలు ఉప్పొంగి ఉప్పొంగి పోవు.

కృష్ణమ్మ కో చిన్న కొడుకు పుట్టాడు
ఆ కొడుకు నెత్తుకుందాము రారమ్మ.

*

నెమలి కన్ను

ధగధగ మెరిసేకాంతిని చల్లే
కళ్ళు నెమలి కెవ రిచ్చారో ?
పురి విప్పుతు అది నాట్యమాడగా
తాండవకృష్ణుడు జ్ఞప్తికిరాడా ?

మేఘాలందం నీలాలందం
కాంతలకాటుక కన్నుల అందం
అందా లన్నీ జీవం దాలిచి
నీలో నాట్యం చేసేనే !

జ్ఞాపక ముంటే చెప్పరాదటే
కృష్ణుని బాల్యక్రీడలు మాతో ?
కృష్ణునివేణికి నీవా అందం
నీకే అందం ఆవేణా ?

చెప్పరాదటే చిన్నికృష్ణుని
కూకటిముడిలో తాండవ మాడిన
నాటివైభవము నీదే అయితే
కృష్ణగాధలను కర్ణామృతముగ !

ఆనా డామురళాలించితి వట
గోపాలోన్నత శిరమున నిలిచి
మురళీ మోహన దివ్యగీతముల
ప్రతిబింబములా నీలో తళుకులు ?

నిన్ను బాలకులు నిత్యము కోరుతు
నీతో ఆటలు ఆడేవేళల
వారు కృష్ణు లనుభావము పుట్టును
నిజ మంటావా కాదా చెప్పవె !

*

ఏకాదశి

నోరి నరసింహశాస్త్రి

శ్రీమచ్ఛంకర భగవత్పాదులు
చెప్పిన భజగోవిందపదావళి
జిహ్వాగ్రంబున నుద్ఘాటించుచు
జీవము విడిచితి నమ్మా !

జలధర సంకుల సంచారమ్మగు
శ్రావణ భీషణ సమయం బయ్యది
అంబరంబు మేఘాచ్ఛాదితమై
అల్లన నిర్మల మగుచుండెన్.

శ్రీవైకుంఠుని దివ్యపదంబును
సేవింపం జను పుణ్యాత్మకులకు
ఏతిథి స్వర్ద్వారము వివృతం బా
ఏకాదశి తిథి ఏతెంచెన్.

అల్పాల్పము మేఘాచ్ఛాదితమగు
నాకాశంబున నక్షత్రముఖేందుం
డసితజ్యోత్స్నల నాశాంతంబుల
నల్లన బరపుచు నలరారెన్.

కాయము హిమమటు క్రమ్మగ శైత్యము
గళమున భరమై కఫ మెక్కంగా
కంఠగతంబై ప్రాణపంచకము
కడపటి వేదన పడుచుండఁగ;

అవసానక్షణ మరుదెంచిన దని
అంగిట నుంచితి తులసీతీర్థము
నారాయణవిభు నామోచ్చారణ
నాటితి చెవులను తల్లీ !

ఆసన్నప్రాణావసానులకు
ఆప్తుల యప్పటి యాఘోషణములు
అశుభావహములు నఘదాయకములు
నని పలుకుదు రెపు డమ్మా !

భవ దాదేశ స్వర్ణాక్షరములు
భావవీధి గాఢాంకిత మగుటను
అతియత్నంబున నార్తిభర మ్మపు
డాగితి నట్టులొ తల్లీ !

నీ పవిత్రతర నిర్మలదేహావి
నిర్గతమై జీవాత్మ వెడలగా
నీపవిత్రతర నిర్మలదేహము
నిర్జీవంబై నిలువంగా;

హృదయాబ్జాంతర మెరియించుచు నం
దిముడక రేగెడి శోకజ్వాలలు
ఒక్కసారిగా నుత్సేకింపగ
నుద్ఘోషించితి తల్లీ!

జన్మజన్మముల నంచిత మగునా
సత్కర్మంబుల సాక్షాద్దేవత
వీ జన్మంబున నిలలో భాగ్యం
బీ వొక్క తెవే తల్లీ!

*

మబ్బుల గుట్టలు

చింతా దీక్షితులు

౧

అది పౌర్ణమినాటిరాత్రి. పది పదకొండు గంటలై ఉండవచ్చు. భూమిమీద వెన్నెల లేదుకాని కొంచెము కాంతిఉన్నది. చంద్రుని నల్లమబ్బులూ, తెల్లమబ్బులూ కప్పినవి, పూర్తిగా కప్పినవి. భూమిమీద ప్రజలకు చంద్రుడు కనపడడమే లేదు.

మనుష్యులు చాలామంది నిద్రపోయారు. కొందరుమాత్రం ఆ గుడ్డివెన్నెలలో కేకలు వేసుకుంటూ ఆడుకొంటున్నారు.

అక్కడక్కడ ఒక్కొక్క కుక్క ఆకాశంవేపు ముట్టె పెట్టి రోదనము చేస్తూ ఉన్నది.

తాటిచెట్టు జీబురుతలలో దూరి ఋషిపక్షి తాటిపండు తినబోతూండగా అది క్రిందకు రాలి చప్పుడయింది. మళ్ళీ యింకోపండు సగము తినగా అదికూడా క్రింద పడింది. గంటకోమారు ఈరీతిగాపడ్డ తాటిపళ్ళచప్పుడు ఆనిశ్శబ్దంలో వినపడుతున్నది.

భూమిమీద గాలిలేకపోయినా ఆకాశంమీద గాలి ఉన్నట్టుంది. మబ్బులు నెమ్మదిగా తూర్పునుంచి పడమరకు పోతున్నవి. మిక్కిలి నెమ్మదిగా! కదులుతున్నవో లేవో అన్నంత నిమ్మళముగా! ఎడతెగకుండా తూర్పునుంచి మబ్బులు వస్తూనే ఉన్నవి. పడమటికి పోతూనే ఉన్నవి. అన్నీ తెల్లమబ్బులే. కాని అక్కడక్కడ ఒక నల్లమబ్బుకూడా వాటిలో కలిసిఉన్నది. తెల్లమబ్బు చంద్రుని కప్పినప్పుడు భూమిమీద కాంతి ఎక్కువగా ఉంది. నల్లమబ్బు కప్పినప్పుడు చెట్లనీడలైనా స్పష్టముగా లేవు.

ఆకాశముమీద మబ్బులు తెల్లసుద్ద గుట్టలవలె ఉన్నవి. ఆ గుట్టలకు సోపానములు కూడా ఏర్పడిఉన్నవి.

ఆ గుట్టలమీదికి వెడదామా! మరిచిపోండి, మీ భూలోకముసంగతి మరిచిపోండి! మీకష్టసుఖాలు మరిచిపోండి! మీ ప్రణయాలు మరిచిపోండి! భూలోకముతో సంపర్కమున్నంతకాలమే ఆ కష్టసుఖాలు! భూమినివదలితే అవి

లేవు. మరిచిపొండి! మీ ధర్మా ధర్మాలు మరిచిపొండి. స్వోత్కర్షకోసం మానవుడు చేసుకొన్న శాసనాలు మరిచిపొండి. మరిచిపొండి. ప్రస్తుతావస్థలు మరిచిపొండి. వీటిమీద ఆధారము చేసుకొని భవిష్యత్తులో సుఖము వస్తుందని పెట్టుకొన్న ఆశలు మరిచిపొండి. మీ సౌందర్య భావములు, మీ తప్పొప్పులు, మీ హాస్య దృష్టులు మీ జ్ఞానగర్వము, మరిచిపొండి మరిచిపొండి!

మరిచి పోయారా?

వెడదామా మబ్బుల గుట్టలమీదికి?

దేహము బరువగుటవల్ల కాదు మనము మబ్బులలోనికి వెళ్ల లేకపోవడము! మనస్సులు బరువగుటచేత! ద్వేషములు, స్వప్రయోజనపరత్వము, నీచపుటూహాలు, గర్వము, నాస్తికభావము ఎన్నని చెప్పను. ఇవీ మనస్సును బరువుచేస్తూంట. ఇవీ మన రెక్కలను బంధిస్తూంట. ఇవిఅన్నీ మరచిపోయి మన రెక్కలను ఉపయోగిద్దాము. ఈ రెక్కలాడించుకొంటూ వెళ్లుదాము. పైకి- పైకి- ఎంతోపైకి వెళ్ళివెళ్ళి మబ్బుల గుట్టలమీద కూర్చుందాము.

మరిచిపోయారా?

వద్దు, వద్దు. మీ బట్టలు తేవద్దు, మీ జరీసెల్లాలు, మీ ఉప్పాడ పంచెలు, మీ సేలంచీరలు వద్దు. తేవద్దు. మబ్బుల దగ్గరకు వెళ్ళేదాకా గాలిబట్టలు కట్టుకుందాము. మబ్బులలో మబ్బుల చీరలు- లకులు- కోట్లు- మంచి మంచివి కట్టుకొందాము. భూలోకంతో సంబంధం వద్దు. మనకు- అవి- ఆ భూలోకపు బట్టలు బరువు. మన రెక్కలను ఆడనియ్యవు. భూలోకపు సిగ్గు ఇంకా వదలిపెట్టలేకుంటే మబ్బులలోకి వెళ్ళడం ఎలాగ! వద్దు! మీ బట్టలు పారవెయ్యండి! మీ ఆభరణాలు వదిలివెయ్యండి! మీ జుట్టు విప్పివేయండి! ఏవేనా పువ్వులందులో ఉంటాయి. దులిపివెయ్యండి!

సిద్ధమయ్యారా?

వెడదామా మబ్బుల గుట్టలమీదికి? జాగ్రత్తసుమండీ. భూలోకపు వాసన మనస్సును పట్టుకు వదలదు. ఆ వాసన పూర్తిగా పోగొట్టుకోవాలి. తల్లీ తండ్రీ, భార్యా, పిల్లలూ, స్నేహితులు, విరోధులూ, చుట్టాలూ—ఎవరూ లేరు మనకు. ధనమూ, కీర్తీ, మంచీ చెడ్డా, లేవు మనకు; ఇల్లూ వాకిళ్ళూ, భూమీ లో

టా లేవు మనకు. లేవు ! ఇతరుల అభిప్రాయాలతో మనకు సంబంధం లేదు. వాళ్ళు ఏమైనా అనుకుంటారేమో అని భయంలేదు మనకు. అటువంటి వాళ్ళే అసలు మన ఊహలో ఉండకూడదు. భూలోకపు వాసన పోయిందా, అంతా పోయిందా ? మనకు రేపు లేదు సుమండీ మనకు నిన్న లేదు సుమండీ. ఇదంతా భూలోకపు వాసనే. మనస్సు నిర్మల మైనదా ?

వెడదామా మబ్బుల గుట్టలమీదికి ? మరిచి పోయారా లేదా ? భూలోకం సంగతి. మరిచిపోతే మన దేహానికి చెమట మొదలైన మురికి పదార్థాలు లేవు. మన కళ్ళకు రెప్పపాటులు లేవు ! మనకు ముసలితనము లేదు ! మనకు చావులేదు ! మనకున్నది లోకాతీతమైన ఆనందము ! దానితోపాటు ఎన్నడూ తరగని అతిలోక సౌందర్యము ! దానితోపాటు కట్టుబాట్లు లేని నిరవధిక స్వేచ్ఛ ! అన్నిటినీ మించిన శాశ్వతిత్వము !

ఈమాటు వెడదామా మబ్బుల గుట్టల మీదికి ?

భూలోకపువాసన ఏమాత్రము మిగిలిఉన్నా మన కట్టుబాట్లు మనకు తప్పవు. భూలోకమంతా చెరసాల. ఈ చెరసాలలో కూర్చుని స్వేచ్ఛ స్వేచ్ఛఅని సంతోష పడేవాళ్ళ సంగతి మనకెందుకు. సంకెళ్ళు మోహించేవాళ్ళకు చెరసాలే స్వర్గము. మనకీ స్వర్గమువద్దు. చెరసాలలో స్వేచ్ఛ మనకు వద్దు. గాలిలాగ అంతరిక్షాన్ని మనము అంటాలి. అగ్ని తేజములాగ అన్నిదిక్కులూ ఆవరించాలి. నీళ్ళలాగ లోకాలని ముంచెయ్యాలి. విద్యుత్తులాగ సమస్తాన్నీ లోబరుచుకోవాలి. అదీస్వేచ్ఛ.

ఆస్వేచ్ఛతో మనము మబ్బులగుట్టలమీదకి వెడదామా ?

భూలోకపు సంగతులు మరిచిపోయినంత మాత్రాన లాభములేదు. రెక్కలు ఆడించగల బుద్ధికలగాలి. ఊర్ధ్వప్రయాణానకు మనస్సు సిద్ధపడాలి. దృష్టి భూమిని వదలి ఆకాశమువైపు పరుగెత్తాలి. రెక్కలు తమంతటతాము విడాలి, తమంతట తాము ఆడాలి. అప్రయత్నముగా మనము ఎగిరిపోవాలి. దేహము బరువని మనకు తోచకూడదు. మనను కిందకులాగే భూమిశక్తికన్న, మనను పైకిలాగే బుద్ధిశక్తి ఎక్కువగా ఉండాలి. నైచ్యము పోవాలి ; మాలిన్యము పోవాలి; బరువుపోవాలి. ఘనత రావాలి ; శౌచము రావాలి ; లఘిమ రావాలి.

వెడదామా మబ్బుల గుట్టలమీదికి ?

చంద్రుని కడ్డంగా నిలుచున్నవి మబ్బులగుట్టలు. భూలోకంతో సంబంధం మనకు లేనప్పుడు ఆ స్థితిగతులు వర్ణించడ మెందుకు ? మబ్బులగుట్టలు కిందా

చంద్రుడు పైనా--రెంటికీమధ్య ఏమి జరుగుతున్నదో భూలోకమువారి కేమితెలుసును ? మనము చూద్దాము రండి ! మబ్బులగుట్టలమీద కూర్చుని చూద్దాము. ఎగరండి, ఎగరండి. పట్టుకోండి ! మబ్బుల అంచులు పట్టుకోండి !

రాళ్ళుకావు అవి. ఒళ్ళు కొట్టుకుపోదు.
పువ్వుముకంటె మెత్తన యీగుట్టలు.
దూదికంటె తేలిక యీగుట్టలు.
బంగారముకంటె విలువయీగుట్టలు.
వజ్రముకంటె కాంతివంతములీగుట్టలు.
కూర్చున్నారా మబ్బుల గుట్టమీద ?

కూర్చోండి ! చూడండి ! ఎప్పుడూచూడని వింతలు చూడండి ! కళ్లు సగం తెరిచి ఉంచండి ! పూర్తిగా తెరిచి ఉంచితే చీకట్లు కమ్ముతవి. మీకళ్ళకు అపరిచితమైన వింతలు ! చూడండి !

౨

తెల్లని మబ్బులు. స్వచ్ఛమైన తెల్లనిచంద్ర కిరణములు. ఈమబ్బులలో ఆ చంద్రికిరణములు లీనమైపోయినవి. నీటిలోపంచదార కరిగినట్లు కరిగిపోయినవి. ఒక్కచంద్రుడు నల్లనిఆకాశముమధ్య తళ తళ మెరుస్తున్నాడు. అతళుకులన్నీ మబ్బులలో దాక్కొన్నవి.

పైన నల్లని ఆకాశము. మధ్యచంద్రుడు. అడుగున తెల్లనికాంతిని మింగిన మబ్బులు.

దట్టముగా ఉన్నవి మబ్బులు. మబ్బులక్రింద ఏమిఉన్నదో ఎవరికి కావాలి ? చీకటిలో రహస్యాలు ఎవరికి కావాలి ? మబ్బులమధ్య సింహాసనము. ఒకమబ్బుసింహము ఒకవైపూ, ఇంకో మబ్బుసింహము ఒకవైపూ. రెంటికీమధ్య ఉన్నతాసనము. ఆపీఠమంతా మబ్బులమయమే. రంగు రంగుల ఉన్నతాసనము. ఆ సింహాసనమునకు చంద్రుడు గొడుగు. చంద్రకిరణాలు గొడుగుకామ. పాలసముద్రములో ఉయ్యాలలూగుతున్నట్లున్నదీ ఉన్నతాసనము, సింహాసనము.

ఒక గంధర్వుడు—ఒక విద్యాధరి. ఉన్నతాసనముపైన ఇరువురూ కూర్చున్నారు. చెరియొక చంద్రకిరణము పట్టుకొన్నారు. పైకి ఎక్కిపోతున్నారు. చంద్రుని

సమీపించారు. చంద్రుడిలో మాయమైనారు. ప్రక్కనక్షత్రములు చప్పట్లు కొట్టి నవ్వినవి. చంద్రుడు పక్కన నవ్వాడు. మరింత కాంతి మబ్బులమీద పడింది.

చంద్రుడిలో నిలబడి గంధర్వుడూ విద్యాధరీ కిందికి చూచారు. పాలసముద్రము అరటిదొప్పలాగ ఉంది. మబ్బులను తాకి కొన్ని చంద్రకిరణములు పైకిలేచినవి. ఈదొప్పలోకి వారు ఉరికారు. మెత్తని మబ్బులమీద పడ్డారు.

విద్యాధరి దేహము తెల్లగా నిగనిగలాడుతోంది. సున్నని శరీరము. లావణ్యము విరజిమ్మే శరీరము. మోహములో ముంచెత్తేనవ్వు. శరీరసౌందర్యమును కప్పేపాటి బట్టలూ, మబ్బులూ ఎక్కడా లేవు. దేహమంతటిరు చక్కగా కనిపిస్తోంది. గంధర్వుడు ఎర్రని శరీరమువాడు. కండలుతేరిన దేహము. చక్కని తీరైక్కిన దేహము. సహజ సౌందర్యము మరుగుపడని దేహము.

గంధర్వుడు తీగ; విద్యాధరి పువ్వు.
గంధర్వుడు బంగారము; విద్యాధరి మణి.
గంధర్వుడు సరస్సు; విద్యాధరి పద్మము.
గంధర్వుడు పగలు; విద్యాధరి సూర్యుడు.

పాలసముద్రపు దొప్పలో ఇద్దరూ పడిలేచారు. ఒంటికి అంటుకొన్న మబ్బుతునకలు దులుపుకొన్నారు. ఒకరినొకరు చూచుకొన్నారు. ఒకరిలో ఒకరు మాయమయ్యారు.

ఇద్దరు లేరు. ఇప్పుడుంట ఒకవ్యక్తి. బలము-నాజూకు; పౌరుషము; ఆ.దము-చాకచక్యము - ఒయ్యారము; కాఠిన్యము - కోమలత్వము; ఈవ్యక్తిలో ఒక్కమారు ప్రకాశిస్తున్నవి. గులాబీతో మల్లెపువ్వు కలిసిపోయింది. పద్మముతో సూర్యుడు కలిసిపోయాడు.

అదీ అవ్యక్తిశోభ !

మబ్బుల గుట్టలు పడమరదిక్కుకు నిమ్మళముగా వెళ్ళుతున్నవి. అవకాశ మనేసరస్సులో ఊగులాడే పుండరీకమువలె ఉన్నవి మబ్బులు. ఈ మబ్బులమీద అవ్యక్తి వాణీహిరణ్యగర్భులా, అర్ధనారీశ్వరుడా, రమామాధవులా--ఎవరుచూచేవారు వాగిని - ఈవ్యక్తివారని పోల్చుకోడానికి.

గంధర్వుడూ విద్యాధరీ మళ్లీ వేరుపడ్డారు. చంద్రకిరణాలు చీల్చుతున్నారు. సన్నని మెరిసే దారాలకింద చీల్చుతున్నారు. కెంపులదారాలు - వజ్రాలదారాలు -

పచ్చలదారాలు - ఇంకా ఎన్నోరకాల దారాలు - అల్లుతున్నారాదారాలు బట్టల కింద - బట్టలుఅల్లినారు. ఆబట్టలతో చంద్రుని కప్పారు. కప్పీకప్పడంతోనే ఒకరి నొకరు ముద్దెట్టుకొన్నారు. చంద్రుడిలోబట్టలు కలిసిపోయినవి. చంద్రుడు వారిచుం బనములలో అమృతం చిలికినాడు.

ఒక కొన్నికిరణాలు పేని గంధర్వుడు ఊగిసలాడుతున్నాడు. ఉయ్యాలా ఊగుతున్నాడు. విద్యాధరి అతని వళ్ళోఒదిగి కూర్చున్నది. దారాలు గట్టిగా పట్టుకొన్నాడుచంద్రుడు. తూర్పునుంచిపడమరకు, పడమరనుంచి తూర్పుకు రంయిమని ఉయ్యాలాఊగుతోంది. మబ్బులు ఉయ్యాలాతోకూడా ముందుకూ వెనక్కూ పరుగెత్తుతున్నవి. విద్యాధరి కేశపాశమువిడి చంద్రుడికి అడ్డువచ్చినది. మబ్బులునల్లబడ్డవి. మళ్ళీకేశములు ఆమెమెడను చుట్టుకొన్నవి. మబ్బులుతెల్లబడ్డవి. ఒకకాలితో ఒక నక్షత్రాన్ని తన్ని వెనక్కు వస్తున్నాడు గంధర్వుడు. విధ్యాధరి ఒకనక్షత్రాన్ని గట్టిగా పట్టుకు లాగివేసింది. అదికిందపడిపోయింది. రంయిన ఊగుతున్నారు. చంద్రుడు కదిలి పోతున్నాడు. మబ్బులు చిందర వందరై నానారూపములు దాల్చుతున్నవి. పుటుక్కున కిరణాలుతెగినవి. విద్యాధరీ గంధర్వుడూ చంద్రుడి శిరస్సుమీద నిలబడి నవ్వారు. మబ్బులగుట్టలు పువ్వులరాసులైనవి.

లక్షలకొద్ది గంధర్వులు-కోట్లకొద్ది దేవకన్యకలు మబ్బుల గుట్టలమీదనుంచి నడిచిపోతున్నారు. ఒకగుట్టమీదనుంచి ఒకగుట్టమీదికి ఉరుకుతున్నారు, నవ్వుతు న్నారు. కేకలువేస్తున్నారు. చప్పట్లు కొట్టుతున్నారు. పాటలు పాడుతున్నారు.

అంతా ఆనందము. అంతాశాశ్వతదాంపత్యము, మంగళసూత్రము ఎరుగని దాంపత్యము, పసుపూ కుంకుమా అక్కరలేని దాంపత్యము, కట్టుబాట్లులేని దాం పత్యము, దాంపత్యమనే సంగతితెలియని దాంపత్యము, ఎందుకీ ఆనందము. దుఃఖ ములేనిదే ఆనందముంటుందా ? మనుష్యులకు దుఃఖము ఉంటేనేకాని ఆనందము అను భవముకాదు. వారికలాగకాదు, అంతా ఆనందమే !

ఆ గంధర్వులందరూ ఒక్కగంధర్వుడే !
ఆదేవకన్యకలందరూ ఒక్కవిద్యాధరే !

గంధర్వులందరూ దేవకన్యలందరూ మారిపోతున్నారు, మారిపోతున్నారు. చంద్రుడు పసరుముద్దలాగ ధగధగమెరిసిపోతున్నాడు. మబ్బుల గుట్టలు తోరణాల కుప్పలైనవి. తోరణాలకుప్పలమీద పువ్వులరాసులు. ఆకాశానికీ మబ్బులకీమధ్య

భాగము పసరుకాంతులతో నిండినది. పలువన్నెల పక్షులు పక్షాలు విప్పుకొని చంద్రునికేసి పరుగెత్తుతున్నవి. పక్షాలు కొన్ని ముడిచి పల్టీలుకొట్టుతున్నవి. కొన్ని రెక్కలు చాచి గాలిలో ఈదుతున్నవి. కొన్ని బారులు దీరినవి. అన్నిచంద్రునికేసి పరుగెత్తినవి. అన్ని చంద్రునిలో చంచువులు ముంచి అమృతము తాగినవి. అన్ని మత్తెక్కి కిందకు కూలిపోయినవి. అవి మబ్బులను తాకకముందే పసరుకాంతులు మాయమైనవి.

పసుపుకాంతులు ఆకాశమును చుట్టుకొన్నవి. మబ్బులగుట్టలు పసుపుముద్దలైనవి. చంద్రుడు-తళతళ లాడే బంగారు గుండ్రని రేకు సూర్యకాంతిలో ప్రకాశించుచున్నట్లు ప్రకాశిస్తున్నాడు. మేఘములు తాండవ మాడుతున్నవి. మబ్బులమీద మహర్షులు తాండవమాడుతున్నారు. మహర్షుల పాదవిన్యాసములు మబ్బులలయ గతికి సరిపోతున్నవి. చేతిలో ఏవోపాడే యంత్రములు. కాషాయవస్త్రములు ధరించి నారా లేక వారిదేహ కాంతులేఅట్టివా? వారిదేహములనుంచి వెలికివస్తూన్న కాంతులు-పసుపా-సూర్య తేజమా-భక్తిరూపమా ? మనస్సుల కవి చలవ యిస్తున్నవి.

అతిలోకమోహన దివ్యగానము వారి ముఖములనుంచివస్తున్నది. అవకాశమంతా నిండింది. చంద్రుడు కదలడంలేదు. నక్షత్రాలు మినుకుమనడంలేదు. దిక్కులుదీక్షతో ఆలకిస్తున్నవి. ఆకాశము స్తబ్ధమైనది. చంద్రకిరణములు వీణతంత్రులవలె కదిలి ఆ పాటకు శ్రుతి వేస్తున్నవి. ఆపాట వేదములా ? ఆపాట భగవద్వాక్కులా ?

ఆత్మలు దేహాలని విడిచి పోతున్నవి ఆపాట విని. మనస్సులు నిష్కళంకమైనవి. ప్రపంచమంతా తానే; తానే ప్రపంచం. ఆపాటమహిమ అట్టిది !

ఇంతలో చంద్రుడు తెల్లగానవ్వుతున్నాడు. మబ్బులగుట్టలు సుద్దగుట్టల లాగ మెరుస్తున్నవి.

గంధర్వుడు విద్యాధరీ నూతన తేజంతో ప్రకాశిస్తున్నారు.

గంధర్వుడూ విద్యాధరీ నక్షత్రాలకేసి ఎగిరిపోతున్నారు.

గంధర్వుడు నవ్వాడు. ఉరుము ఉరిమింది.

విద్యాధరి నవ్వింది. మెరుపు మెరిసింది.

మబ్బుల గుట్టలలో కలవరం పుట్టింది.

వానచినుకులై పోతూన్నాయి అవి.

"ఏమిటీ స్వప్నం" అన్నాడు లోకమానవుడు మబ్బుమీద నిలబడి. అతని అనుభవమనే ప్రహరీ గోడలోపల ఉన్నదంతా అతనికి నిజం. మిగిలింది స్వప్నం, అబద్ధం !

"ఇది దేవపూజ" అని వాక్కు వినిపించింది.

భూలోకపు వాసన స్మృతికి తెచ్చుకొని ఇదంతా స్వప్నమన్న మానవుడు వానచినుకులతో పాటు నేలకు పడ్డాడు.

భూమిమీద చంద్రుడు మళ్లీ ప్రకాశించాడు.

అంతా శాంతే.

ఋషిపక్షులు మర్రిచెట్ల కొమ్మలనుంచి తలకిందుగా వేలాడుతున్నవి.

ప్రజలందరూ హాయిగా నిద్రపోతున్నారు.

ఆకాశము మేఘరహితమై నిర్మలముగా ఉన్నది.

చుక్కలు ఎప్పటివలె మినుకు మినుకు మని అబద్ధమాడుతున్నవి.

కాని చంద్రునికాంతిలో విచార మున్నది.

ఆడుకొని ఆడుకొని వచ్చిన పిల్లవానికి పుస్తకము పట్టుకొన్నప్పుడుండే విచారము !

*

హృదయహంస

పెద్దిభట్ల
రామచంద్రరావు

అమలసౌందర్యరాశి యాయమృతకరుడు
నీలమేఘాల మాటున నిలిచిపోయె
కరము నల్లని ధూళిచే గప్పబడిన
విలువలేనట్టి వజ్రమ్ము విధముఁ దోప.

పూర్ణచైతన్యవార్ధిని బాయుజనము
లేమికుగురైన జడమున లీనమయ్యె
జీవరాసుల నెన్నొ పోషించుచున్న
వార్ధి యాకాశమందున వరలుభాతి.

ఇంపు లొలికించు నవనీతహృదయసీమ
నలమికొనియెను గాఢమాంద్యమ్ము పసిడి
రమ్యకోశాల పుష్పాంతరమ్ము నందు
కాలమధులిట్సమూహమ్ము క్రమ్మునట్లు.

మధురరాగామృతమ్ము రమ్యముగ జిల్కి
దృష్టి నుదయార్కబింబ ముద్దీప్తమయ్యె
అమలహృదయాబ్జ విస్ఫూర్తి నాప్తరీతి
హృదయహంసము జృంభించె సుధను గ్రోలి!

*

వింత కర్త

ఏదియో యేలనో యెట్లో యెరుకపడదు
నిమిషమేనియు స్తిమితమై నిలువదయ్యె
నిలువ దాయెను-కర్తయో-నిండుదృష్టి
కనులు గుంటలు పడె పూర్వకాంతి దొరగి!

ఏదియో యేలనో యెట్లో యెరుకపడదు
వన్నెచిన్నెల నలరిన కన్నెమోము
ముద్దు గులుకదు-కర్తయో-మున్నువోలె
మోము నలమెను గాటంపు ముడత లెన్నొ!

ఏదియో యేలనో యెట్లో యెరుకపడదు
మిగుల నానంద జనకమై మీరినట్టి
నాశరీరమ్ము-కర్తయో-నవసిపోయె
అస్థిపంజర మీదేహయష్టి యయ్యె!

ఏదియో యేలనో యెట్లో యెరుకపడదు
నీపదాబ్జరజోలేశనిచయ మపుడు
నవ్యసుధ గూర్చి నాదృష్టినాళమందు
విబుధశక్తి జనించె నావింతకర్త!

ఎపుడు!

హృదయపద్మము విప్పారునదియ యెపుడు
అమలరాగ సచ్ఛాయల సమయ మెపుడు
ప్రేమవాహిని దలమున్క వేయు టెపుడు
నెయ్య మొప్పార నిం జేరునిమిష మెపుడు!

తరుణ మియ్యది నిం జేర త్వరితగతిని:
నిరుపమాన రసామలనిలయ మయ్యె
నెట్టులో వసివాడె నీహృదయసుమము
నెయ్య మొప్పార నిం జేరు నిమిష మెపుడు?

చిగురుటాకులు లేవాయె చెట్లయందు
కానరాడాయె చంద్రు డాకసమునందు
వసుధ ననుకూలపవనముల్ పర్వవాయె
నెయ్య మొప్పార నిం జేరునిమిష మెపుడు?

నీహృదయ నీరజాతము నిర్మలంబు
చిగురుటాకులు తొడుగును చెట్టుచేమ
హృదయపద్మము విప్పారునదియ మగును
నెయ్య మొప్పార నింజేరు నిమిష మపుడు!

*

స్పర్శసుఖము

గాఢభంగిని నినుగూర్చి పాడుచున్న
విమలస్నిగ్ధనక్షత్ర వితతి గాంచి
చెలువు మీ[illegible] సమీగ[illegible]
[illegible] ను హాయిగా శీతకరుడు
శిష్యపరివృతుడైన దేశికు విధాన.

చైత్రదళములు విప్పార శైత్య మొలికి
పరిమళించెను మల్లెపూబాన్పు మీద
బవ్వళించితి నేను నీభావమునను
ఘనసమాధిని సుఖదయా శాంతకరణి.

అన్ని కోర్కులు శమియించు నస్మదీయ
నిఖిలభువనైకమూర్తి వాసిచరిత్ర
శ్రవణసంగత మయ్యె సుశ్లాఘ్యగతిని
తామరసనేత్రు వేణునాదమ్ము భాతి.

శైత్యవీచులు పొరలు హాసమయుమందు
అమలరాగార్ద్ర వైచిత్ర్యమగుచు గలిగె
శయ్య నీకరపల్లవస్పర్శసుఖము
పులకరించెను మేను నాపుణ్యమేమొ!

*

సమ్మేళనము

నిన్ను గాంచెడు వేడ్కతో నెమ్మనంబు
సమ్మదస్ఫూర్తి దివ్యమౌచాయ లీన
నుదయరాగాన మైదీవ యొప్పుచుండ
మెరపుచాడ్పున మెరసితి మేరమీరి !

నెయ్యమొప్పారు సంఫుల్ల నేత్రములను
సంభ్రమోత్సాహ నవవిలాసమ్ముతోడ
నన్ను దూరాన గని యల్ల నగుచు వచ్చి
కదిసినా వీవు కౌగిట గాఢముగను !

ప్రేమరసపూర్య మాణవిస్ఫీతహృదయ
పద్మపత్ర విన్యాససంస్పర్శ మనము
చిరమనోహర వీచికాజీవజలధి
కాలమానము తెలియక తేలినాము !

ఆత్మగేహార్థ మే నంత నరుగవలసె
కాలురాదయ్యె నిన్వీడి కదలిపోవ
మానసాబ్జము చింతచే మలినమయ్యె
వీడికోలున మైదీవ వెల్లనయ్యె !

*

మృత్యురథము

మునిమాణిక్యం
నరసింహారావు

దక్షిణ దిక్కున దుందుభి మోగింది. మేఘములు గంభీర గర్జన చేసినవి. కన్నులు చీల్చుకొని పోవునట్లు మెరుపులు మెరసినవి. మృత్యురథము కదిలింది. పెద్ద మైదానముమీద మే మందరితో పాటు చేరాము. అక్కడ చాలారకాల పెద్ద మనుష్యులు చిన్న మనుష్యులు, చిన్న చిన్న పెద్ద మనుష్యులూ చేరారు. రకరకాల దుస్తులు ధరించారు. కొందరు బెంగాలీ కట్టులో తయారయినారు. వీరికి పెద్ద క్రాఫులు. నిలువుపైన అంగరఖాలు. ఉత్తరీయము వల్లెవాటుగా వేసుకొన్నారు. కొందరు పంజాబీల మోస్తరుగా సీమా జామా వేశారు. ఇంతమంది ఇన్నిరకాలుగా ఉన్నా ఒక్క విషయముమాత్రము నన్ను ఆకర్షించక మానిందికాదు. అది సమితి వారి వేషము. ఆడ వాళ్ళ లాగ కనిపించవలెనని వీరి ఉద్దేశమేమో అని నాకు భ్రమ కలిగింది. జుట్టు పెంచుకొనడము మూలానా మెడలో హేమభూషణములు ధరించడము మూలానా వీరు స్త్రీజనానికి సన్నిహితులైనారు. వీరు జన్మాంతరంలో స్త్రీలయి ఉంటారు

ఇంతలో జనములో కలవరము పుట్టింది. దక్షిణ దిక్కుకు తదేకదృష్టితో చూశారు. ఇంతలో మృత్యురథము దూరదర్శనమయింది. కలవరమణిగింది. దూరాన ప్రళయకాల మేఘమువంటి నల్లనిదేదో గోచరమయినది. వినీలకుంతలములు విరియబోసుకొన్న పెనుభూతములాంటి భయంకరరథ మొకటి మాకు కనిపించింది.

నల్లటి జడలవలె జండాలు పైన ఎగురుతున్నవి. ఆరథంలో నీలగాత్రుడూ, భీకరస్వరూపుడూ అయిన భటు డున్నాడు.

రథము ఆగడము తోనే జనులు గుంపులుగా బయలుదేరారు. మృత్యుదేవతా సందర్శనాభిలాషులు ముందుకు రండని భీషణ శంఖధ్వని లాంటిధ్వని పలికింది. మృత్యుదేవత బలాత్కారముగా లాగినా రానివారు ఉంటారేమో కాని ఇష్టపడి భీకర మృత్యువును కోరి వరించేవారు ఎవరైనా ఉంటారా అని సందేహము కలిగింది. ఇంతలో పాతికేళ్ళవాడు ముందుకు వచ్చాడు. కుర్రవాడు చక్కనివాడు. శిరమున ఉన్న కుటిలదీర్ఘకుంతలములు ఎంతో ముచ్చటగా ఉన్నవి. కళ్ళకు జోడు ఉన్నది. ముఖము కళకళ లాడుతూ తేజోవంతముగా ఉన్నది కాని తేజోవిహీనముగా గాని విషాద చ్ఛాయా వృతమై గాని లేదు. ఇట్టి వానికి చావు ఎందుకో నాకు బోధపడక, అట్టె నిర్ఘాంతపోయి స్తబ్ధుడనై నిలుచున్నాను. అతడు నదురు బెదురు లేకుండా రథము కేసి నడిచినాడు. పైగా అతని చిరుపెదవులపై చిరునవ్వు నృత్యము చేస్తున్నది. అతనిమీద నాకు జాలి పుట్టి అబ్బాయీ ఎందుకు నీవు మృత్యుదేవతా సన్నిధానానికి పోతావు అన్నాను. అతడు నావంక నిరసన భావముతో చూచి చిరునవ్వు నవ్వి నన్ను దాటి పోయినాడు. నా కెందుకని నే నూరుకొన్నాను. ఏ మవుతుందో నని అతనితో నేను కూడా రథానికి సమీపంలోకి వెళ్లాను. అతడు అమాంతం రథంలోకి దూకి లోపల కూర్చోబోయే సమయంలో భృత్యుడు అడ్డుపడి, దింపి "అల్లా ఎక్కకూడదు, చావుకు మాత్రం అర్హత లేదా? ఎవరు మీరు?" అన్నాడు.

"ఏమోయి, ఎవ్వ రనుకొన్నావు! ఎవ్వ రని ఎంతువోనన్ను? ఏ ననంతశోక భీకర తిమిరలోకైకపతిని, కంటకకిరీటధారినై కాళరాత్రిమధ్యవేళల, జీమూతమంది రంపు కొలువుకూటాల ... ..."

"ఆగండి! ఆగండి! ఏమి టీగొడవ! మీరు మృత్యుసమక్షానికి వెళ్ళ డానికి ఎల్లా అర్హతో నాకు తెలిసేటట్లు చెప్పండి!"

"నీకు గూడా నాసంగతి తెలియుటంలేదూ? అందరికీ ఇదే జబ్బు! అయితే విను. నా ప్రణయలేఖలు చదివినావా? చదివితే నా సంగతి విపులంగా తెలుస్తుంది. అందుకని అడుగుతున్నా."

"నే నేమీ చదవలేదు."

"జీవితమంతా మృత్యుదేవతపైన విషాదగీతాలు వ్రాసినాను. ఆమెసేవ నిరంతరం చేస్తున్నాను. జీవితం దుఃఖమయమని అందరికీ చాటించినాను. భూనభోంతరాళ

ములు మారుమ్రోగేటట్లు ఏడ్చాను. నన్ను ఏడ్వనియ్యనప్పుడు, ' మీరు మనసారగా నేడ్వనీరు నన్ను, నన్నువిడువుడు, ఒకసారి నన్ను విడిచినంత నేకాంత యవనికాభ్యంతరమున వెక్కి వెక్కి రోదింతును వినువులేక, అన్నాను. దుర్భరశోక విషమగీతు లేడ్చివైతు అన్నాను."

" బాగా ఏడ్చినట్లున్నారండీ ! "

" బాగా ఏమిటి, అద్భుతంగా ఏడ్చాను. మరి నన్ను రథం ఎక్కనియ్యి. నే నిక జీవింపలేను. చిరునవ్వు పెదవుల నిలుపలేను - జీవింపలేను. "

" ఎందుకండీ మీ రీవిధంగా రోదనంచేయడం ? "

" నే నేమని చెప్పేది తమ్ముడూ. ఎన్నని చెప్పేది ? మాటవరసకు కొన్ని చెబుతాను. సద్విపంచి తంత్రులను తెంచాను. కుసుమదామమును రేకు రేకుల జిదిమి ధూళి వెద జిమ్మినాను. మకుట రాజమును నేలపై బొరలించి పాదాల మెట్టినాను. అందని పండ్లకై అర్రు జాచినాను. పేదనైపోయి ఎట్లు జీవింతునోయి ! "

" మీ మాటలనుబట్టి చూస్తే మీరు అర్హులనే తోస్తున్నది. ఆ మూట ఏమిటి వీపుపైన ? "

" అవేవో వస్తువులు. "

" ఏమి సామగ్రి, దారిబత్తెమా ? "

" నీవు మూర్ఖుడులా ఉన్నావే ! అది కవితాసామగ్రి. "

" కవితాసామగ్రి అండీ ! ఏది చూపండి. పూర్వము ఒకరిద్దరు కవులు ఇల్లాగే కవితాసామగ్రితో వచ్చారు. వెన్నెలలు, మందారపుష్పాలు, చకోరములు, కదళికాకాండములు ...... ఏవేవో మంచి సొగసైన వస్తువులు తెచ్చుకొన్నారు. దయచేసి చూపండి మీ సామగ్రి చూస్తాను. ఏవి, ఏవి, విచిత్రంగా ఉన్నవి ! "

" ఇవి వినీలకుంతలములు. "

" ఇవి ? "

" ఇవి కంటకములు. ఇది కంటకకిరీటము ."

" ఇవో ? "

" ఇవి మేఘమాలికలు, ప్రణయకాలజంఝామారుతము, కరాళదంష్ట్రలు; కారుమబ్బులు. "

" ఇది ? "

" ఇదా ? ఇది వేదిక - "

" కాఫీ ? "

" కాఫీకాదు. కాఫీ మా సమితి గదిలో ఉంటుంది. ఇది వేదికన్నీరు. కృష్ణ పక్షములోని చంద్రకిరణాలు. "

" ఈ పక్కనున్నవి ఇవేమిటి ? "

" ఇవి ఎండుటాకులు, ఇనపసంకెళ్ళు, హృదయశోణితము. "

" ఇవి నిజంగా కొత్తరకం కవితాసామగ్రి. ఆమూలనున్న వేమిటి ? "

" అవి, విషాదగీతికలు, నిద్ర, విషాద వీచికలు ఇత్యాదయః. "

" బహు విచిత్రంగా ఉంది-బందరువారి కవితా సామగ్రివంటిది కాదు. ఇవి ఎప్పుడూ మీవెంట ఉండవలసిందేనా ? "

" ఆ, సర్వకాల సర్వావస్థలయందూ నావద్దనే ఉంటవి. "

" ఇదేనా మీకవితాసామగ్రి ? ఇంకేమైనా ఉన్నవా ? "

" ఇవేనా ! ఇంటిదగ్గర భోషాణం నిండా ఉన్నవి. ముఖ్యమైనవి మూడు తెచ్చాను. నాకు ఇంటివద్ద శుష్కహృదయపాత్ర, గాఢ లజ్జానుతాప సంకలిత హృదయ నీరజ దళాలరాలు కన్నీటిచుక్కలు, మలినబాష్పమౌక్తికములూ ఉన్నవి. "

" ఇంకేమి ఉన్నవి ? "

" నాకు నిశ్శ్వాసతాళవృంతాలు గలవు
నాకు కన్నీటి సరుల దొంతరలు గలవు
నాకమూల్యమపూర్వమానంద మొసగు
నిరుపమ నితాంత దుఃఖంపు నిధులు గలవు. "

" విన్నాను చాలు. మీరు రోదనం కళలలోకి తీసుకొని వచ్చినారు ! "

" నిజమైనమాట అన్నావు. చెప్పినానుగానూ హాహారు హాహారు మటం చేస్తునోయి స్వామి, అని. ? "

" కాని స్వామీ, దుఃఖానికి తగినన్ని ప్రబలకారణాలు కనిపించవు. Sorrow for it's own sake లాగ కనిపిస్తున్నది. బాణీ మార్చి చక్కని ఆనందగీతాలు పాడుకోండి. "

' నాకు మరణమ్ము వలదనినాను ' అంటూ చిరునవ్వుతో ఆయువకుడు కలుకు నడకతో ఇటూ అటూ చూస్తూ వెళ్ళిపోయినాడు.

౨

ఇంతలో ఇంకొకఆయన రథం సమీపించినాడు. ఇతడు పొడుగాటి మనిషి. చామనచాయఒళ్లు. ఊలుకోటు వేసుకొన్నాడు. టోపీ ఉంది. చేతిలో ఏవో గ్రంథాలున్నవి. వస్తూవస్తూ-ఆమైదానం నలుదిక్కులా జూచి,ఈ ప్రదేశంలో సరుకుమొక్కలు వేస్తే-అను కొంటూ రథాన్ని సమీపించి యకాయకీ రథంలోకి వెళ్లబోతుంటే భృత్యుడు ఆపి అడగవలసిన మామూలు ప్రశ్నవినయంగానే అడిగాడు. కాని ఆ మాత్రానికే ఈ పెద్దమనిషికి కోపం వచ్చింది. కళ్లు ఎర్ర జేశాడు. ఆ కర్ణాంతవిశాల నయనములు ఒక్కొక్కటీ కోడిగుడ్డు అంత అయ్యేసరికి మృత్యుదేవి భృత్యుడే కొంచెము జంకినట్లు కనిపించాడు.

" మిమ్ములను జూస్తే నా కేదో విపరీతంగా ఉంది. కొంచెం ముఖం అటు తిప్పి మాట్లాడండి. ఆ గుడ్లు ... "

" భయంగా ఉందా ! "

" భయమేమిటి మాకు, నరకంలో ఉండేవాళ్ళకు. అయినా ఏదో విపరీతంగా ఉంది అన్నాను. కాని తమరు ఎక్కడానికి వీలు లేదు. "

" ఎక్కడానికి వీలులేదూ ! ఎన్నిగుండెలతో అన్నా వామాట ! నాకళ్ళ ఎదుట పిడుగువంటివాళ్ళు పిల్లు లవుతారు. నీవు లెఖ్ఖా, జమా ! "

" ముందు దిగండి " అని భటుడు దింపినాడు.

" ఎంతవాడవోయి! ఏమని నీ ధైర్యం! బతకదల్చుకొనేనా నీ వీపనిచేయడం? నేను కళ్ళువిప్పి చూస్తినా పచ్చని పైరు భగ్గుమని పోతుంది. నిండునూతులు పాడుగోతులయి పోతవి. నీవు కదులుతావు మళ్ళీ ఇక్కడనుంచీ! " అని అతడు కోరమీసం మెలివేసినాడు.

భృత్యుడు ఎదిరిస్తే వ్యవహారం బెడుస్తుందని మృదువుగానే " అది గాదండీ, మీవంటివారు ఎందుకు ఇంతవేగం చావుకోరటం ? " అన్నాడు.

" అల్లా దారికి వచ్చి, అడగవలసినది అడుగు చెబుతాను. నేను అనుకొన్న ప్లానులు అన్నీ పాడయిపోయినవి. ఒక్కటీ పేరుకైనా కలిసిరాలేదు. "

" మీ ప్లానులు ఏమిటండీ ? "

" పెద్దపెద్ద విషయాలు చెపితే నీకు అర్థం కావటం కష్టం. జగత్తు యావత్తూ తోటలు వెయ్యవలెనని సంకల్పించుకొన్నాను; సాగలేదు. ఊషరక్షేత్రాలన్నీ పంట

భూములుగా మార్చాలన్న దృఢనిశ్చయం పురిట్లో సందుకొట్టిపోయిన పిల్లలాగ నశించింది. దేశంయావత్తు అచ్చుకూటాలలో నింపి పుస్తకాలమయం చేద్దామంటె పడ లేదు."

" అయ్యా, మీరు దయచెయ్యండి. "

" నేను వెళ్ళనోయి; మృత్యుదేవతవద్దకు వస్తాను. "

" చూస్తున్నాను. దిక్కుమాలిన భూలోకంలో ఏది తలపెట్టినా పాడే! "

" బాబూ, నామాట వినండి. మీరు ఇక్కడే ఉండి మీదారద్వయంతో సుఖంగా కాలము గడుపుతూ, ధర్మసంస్థాపనార్థం మీ యావచ్ఛక్తులూ వినియోగించండి. "

" అవును, మంచిమాటే జ్ఞాపకం చేసినావు. హిందూలా మార్చి లోకము మరమ్మతు చేస్తేగాని ధర్మసంస్థాపన కాదు. సరే చూస్తా " అని గబగబా నడిచి పోయినాడు.

3

తరువాత నల్లటి కుర్రవాడు రథాన్ని సమీపించినాడు. ముఖం కొన్ని కారణాలచేత నల్లనయినా, పూతలు పూయడంచేత అదోక శోభగా ఉంది. పైన చక్కని పట్టు ఉత్తరీయం వేసుకొన్నాడు. మొత్తంమీద కుర్రవాడు సౌందర్యముగానే ఉన్నాడని చెప్పక తప్పదు. అతడు వచ్చి " నేను రథం ఎక్కటానికే వచ్చాను " అన్నాడు.

" ఎల్లా ఎక్కుతారు ? "

" కాళ్ళతో. "

" పెంకితనం చేయక అర్హత చెప్పండి. "

" నా అర్హత నా ముఖమే చెపుతున్నది. నా జీవితంలో సౌఖ్యం అన్నమాట ఎరుగనోయి. స్నేహితులు – అంటే నిజమైన స్నేహితులు లేరు. విషాదగీతములు లెక్కలేనన్ని వ్రాశాను. "

" జన్మంతా ఏడుపే అయినపుడు విడిగా విషాదగీతిక లెందుకు ? "

" అనేకకారణాలచేత నేను అనేకపర్యాయాలు గోదావరీగర్భాన్ని చేరాలని కోరినాను. నా జీవితము దుఃఖపూరితమో కాదో వీటిని అడుగు - వీరు నాకు సఖులు " అని చిమ్మటలను చూపించి " వీళ్ళే నాకు ప్రియులు, అనుచరులు"అన్నాడు.

" ప్రేమించడానికి కాంత అయినా దొరికింది కాదా ? "

" కాంతలకు కరువై కాదు. నిజముగా మనసార నన్ను ప్రేమించేవాళ్ళు లేక."

" పోనీ నిష్కపటస్నేహితులను ఒకరినో ఇద్దరినో నమ్ముకొన్నట్లయితే దుఃఖపు జీవనానికి కొంత శాంతి అయినా కలిగేదిగా !"

" నాకు శాంతి ఎక్కడ ? నాకు సుఖము అంతా స్వప్నానుభూతము. పూర్వ సుఖములు ఈ ఎడదను రంపాలవలె కోస్తున్నవి."

" చెప్పుకొనడానికైనా ఎవరూ లేరు కాబోలు."

" నాకెవ రున్నారు ? ఆ విమలగౌతమీ ప్రవంతీవిశాలపులినములుతప్ప."

" మిమ్ములను చూస్తే నా హృదయం తరుక్కొని పోతున్నది. కాని మీరు ప్రతివిషయాన్ని కవితాభావముతో చూడక కొంత సంసారపక్షంగా ఉండటం నేర్చుకోండి."

" నీకుకూడా ఆ బుద్ధే పుట్టింది ?"

" కోపగించక దయచెయ్యండి. లోకము అంతా నందనవనం అనుకొని ప్రతి వస్తువూ సంతోషదాయకమే అనీ ప్రతిస్నేహితుడు విశ్వాసపాత్రుడు సహృదయుడే అనీ నమ్ముకోండి అవి ఏమిటండి జేబులో గొణగొణ ముంటున్నవి ?"

" అవి సెలయేటి రొదలు, పవనరోదనలు, విషాదగీతికలు."

" అదంతా కవితాసామగ్రి కాబోలు ! ఏవేవి తియ్యండి చూస్తాను."

" ఇవి తెగిపోయిన హృదయతంత్రులు. ఇది విషాదాంతకావ్యమును చించి కట్టిన గాలిపటము. ఇది త్రెంపి దూముడివైచిన దీర్ఘహృదయ దుర్లభాశామృణాళ తంతువు."

" ఇంకేమి ఉన్నవండీ ?"

" నాకు భగ్నహృదయ శకలములు ఉన్నవి. హృదయపాత్ర. ఇది మోయగా రాని యౌవనాశావిపంచి."

" ఇ దేమిటి ఇంతభయంకరంగా ఉన్నది !"

" ఇది అబ్ధిగర్భోజ్జ్వలద్బడబాగ్ని. ఇది నా హృదయంలో ఎప్పుడూ మండుతూ ఉంటుంది."

" మీరు భగవంతుణ్ణి నమ్ముకోండి."

" భగవంతుడినా నమ్ముకోవటం ! భగవంతుడు ఏమైనా ప్రాణ మిచ్చే స్నేహితుడు కాగలడా ? ఇదివరకు నమ్మింది చాలు'' అని గొణుగుకొంటూ తల వంచుకొని మందగమనముతో వెళ్ళినాడు.

౪

తరువాత మరియొక పెద్దమనిషి వచ్చినాడు. దీర్ఘ కాయుడు, చామనచాయ వర్ణము, గంభీరవదనము, దీర్ఘ కేశములు, లలాటమున తిలకరేఖ, మెడలో వకుళ మాల. చిటికెనవ్రేలి నున్న ఉంగరము మెరుస్తున్నది. పట్టుచొక్కా తొడిగి పచ్చ శాలువు వల్లెవాటుగా వేసుకొన్నాడు. ఒక చేతిలో బహుసుందరముగా బైండు చేసిన పుస్తకరాజము, ఇంకొక చేతిలో సొగసైనబాకు పట్టుకొని మెల్లగా అడుగులు వేసుకొంటూ పరధ్యానముగా, నిమీలిత నేత్రములతో రథమువైపు నడిచినాడు. చాలామంది అల్లరులు చాలించినారు. కొందరు వినయవిధేయతలతో వెనకకు తగ్గి ఆయనకు తోవ ఇచ్చినారు. ఒకరు 'నావనమ్మున దోహదసేవ నీవు సాదరంబుగ జూచు రసాలశాఖ పుష్ప ఫలవంతమయ్యె, ఏప్రొద్దు నిన్నె స్మరణకుం దెచ్చుచున్నది' అని గీతమాలికలు ఆయనపై విసిరినారు. కొందరు, సహృదయుడైన నాసుహృద్రత్న మునకనీ, కొందరు మార్గదర్శికనీ కావ్యాలు అర్పణము చేసినారు. ఇవన్నీ ఆయన చిరునవ్వుతో అంగీకరిస్తూ మృత్యురథంవైపు నడచినాడు. కంకణవిభూషితములైన కామినీ హస్తములు కొన్ని మనోహరముగా ఆయనను వారించినవి. కాని, బహుళ తాపముచే మతి భ్రంశమొంది వివశమైపోయె — అయ్యయో వెర్రినైతి ! అని ఆయన నోటినుంచి మాటలు అప్రయత్నంగా బయలు వెడలినవి. ఆ గుంపులోనుంచి ఎవరో "నాకంటె వెర్రి ఎక్కినదా మీకు ? నా వెర్రిపాట నా వెర్రికి సాక్ష్యం" అన్నమాటలు వినిపించినవి. "పక్షములు రెండు సర్వప్రపంచమునకు కృష్ణపక్షమొకటి నాకు కేవలంబు " అని మళ్ళీ ఆయన నోటినుంచి వచ్చేసరికి "ఆ ఆ కృష్ణపక్షము నాది నాది " అని కేకలు బయలుదేరినవి. " ఎల్లకాల మమావాస్యయే మదీయ హృదయమున " అని ఆయన మళ్ళీ అన్నాడు. తాను మృత్యురథా రోహణానికి అర్హుడని అందరికీ తెలియ జేయడానికి కాబోలు అల్లా చదవడం. ఆ మాటలు వినే సరికి ఒకఅబ్బాయి ముందుకువచ్చి " అన్నగారూ, అల్లా అనటానికి మీకు అధికారం లేదు. ఎన్నడేని ఆవదన చంద్రకాంతి తోచునయేని యాక్షణమునందు మాత్రము చతుర్దశీరాత్రి అన్నా అని ఉంది మీవిషయంలో. నాకు నిరంతరం అమావాస్య. నా హృదయంనిండా చీకట్లే. అసలు నన్ను చీకటితోనే చేశారు " అన్నాడు.

ఇంతలో ఆయన మృత్యురథం సమీపించినారు. మృత్యుదేవత భృత్యుడు కొంచెం జంకుతూ ఆయనను ఆపి స్వామీ, పెద్దమనుష్యులు మీరుకూడా అల్లాగా ఎక్కితే ఎల్లాగ ! మీకెట్టి అర్హత ఉందో చెప్పండి అన్నాడు.ఆయన అతనిని వీపుపై

తట్టి "మంచివాడవులాగ ఉన్నావు" అని మృత్యురథం మెట్లు మూడు ఎక్కి-తూర్పువైపు తిరిగిచూడటం మొదలుపెట్టినాడు.

"ఏమిటి చూస్తున్నారు ?"

"ఏమీ లేదోయి. గోచరించుచు నుండును కొంతవరకు మాయజిరభూరుహాగ్రముల్ మేడకొనయు ఇపుడు నేను" అని అంటుండగా "ఇక్కడనుంచి ఏమీ కనిపించదు, దయచేసి దిగండి" అని దింపినాడు భటుడు.

"ఏమిటి రథాన్ని పరీక్షిస్తున్నారు ?" అన్నాడు మళ్ళీ.

"ఇక్కడ స్త్రీవిగ్రహ ముంటే చూస్తున్నాను."

"అయ్యా, మీరు ఇటురండి. అర్హత చెప్పుకోనిది రథంమీద చెయ్యి వెయ్యకూడదు."

"నాకు అర్హత లేకేమోయి ! నేను మతిమంతుడను, అధిక గర్విని, ఆత్మాభిమానిని, ఇచ్ఛానుసారగామిని చరియించు మతంగజమును."

"ఇవన్నీ మరణార్హతను తెలుపవే !"

"అయినా, ఈతనువుపై విరక్తి జన్మించె నాకు !"

"నేను ఏలా నమ్మేది ?"

"నమ్మకం కలుగజేస్తాను, చూడు. వేళలన్నిట నే సమవృత్తితోడ పవ్వళించితి పాషాణ ఫలకముపయి. అంతేకాదు. ఏమిచేయుటకును నాకు నిచ్ఛలేదు. సర్వమును తోచుచున్నది స్వప్నమట్లు. పూర్వము ప్రొద్దువచ్చి మిగుల నన్ను ప్రేమించెడి మిత్రులిపుడు కాంచి ముఖభంగి శీఘ్రము కదలుచుండ్రు."

"అయ్యో !"

"విను మరి - రమ్యరూపములతో మనోరంజనమ్ము సలిపెడి విలాసవస్తువుల్ చక్షువులను నేడు వేధించుచున్నవి నిశిత శూల ఫలక సంకాశ భయద రూపములు దాల్చి."

"ఓహోహో ఈలక్షణాలన్నీ —"

"అడ్డం రాకు. ఏది కనుగొన్న నాకిపు డేవ్వువచ్చు. అఖిలవస్తువులందసహ్యమ్ము పుట్టె. నేమరు జనించుచుండును విసువు నాకు నాపయింగూడ హృదయ సంతాపమునను."

"ఇవన్నీ మరణసూచనలే. మరణార్హత ఉన్నట్లే తోస్తున్నది."

"తోస్తున్నదని మెల్లిగా అంటావేమి! నాకున్న అర్హత ఎవరి కున్నది ? అనేక పర్యాయములు మృత్యుదేవతను స్తుతించి ఆవిడను సంకీర్తనముచేసినాను. ఏడ్చాను ! విరహ సంతాపము ఘనీభవించి యుండి అణచుకొన్నను నిలువక యపుడు పొంగ

జాలుగా ప్రవహించు బాష్పముల వలన...పౌరుషోదంచితుడ నయ్యు బాలుపోల్కి రోదనము చేసినాను హృద్భేదకముగ. ఊరికి కృష్ణానదీ గభీరోదకముల తనువు త్యజియించి నీ పదధ్యానమునను... "

" ఓహోహో ! ఈ విచారమంతా విరహ మటండీ ! నేను విభ్రమములో పడి పోయినాను. వెళ్ళండి, మీ బోటి ప్రాజ్ఞులు ఎక్క తగినది కాదు ఈ రథము. "

" మంచి మాట అన్నావు. బాలాదపి సుభాషితమ్. "

" అదీగాక సామాన్యులకోసం ఏర్పడ్డది యీ రథం. "

" నిజమే ! ఈ రథం ఏమంత రమణీయంగా లేదు ! శిల్పచాతుర్యము బొత్తిగా లేదు. ఈ పద్ధతులను మార్చి మరో విధంగా చేయించుకోరాదూ ? దాసి పాపిణీ కావలెనంటే చెప్తాను. "

" చెప్పినాను కాదూ ! ఇది సామాన్యులకోసమని స్వామీ. "

" అవునవును. "

" తమరు ఇంటికి వెళ్ళి వేగిరము వివాహము చేసుకోండి. "

" ఇన్ని యేండ్లు వచ్చి ఇంక నేమి వివాహ మమరు నాకు విద్యలందె సుఖము. ఇంకనుంచి హృదయాన్ని రాధావల్లభునికి కైంకర్యము చేస్తాను. నిరతంబుగా భవదీయ పాదవిలసన్నీరేజయుగ్మంబుపై, స్థిరసంయుక్తి వసింపజేయగదవే శ్రీరాధికావల్లభా " అని పాడుతూ గంభీరగమనముతో బయలుదేరినాడు ఆయన.

" ఒకచేతిలో పుస్తకం మరొక చేతిలో ఖేటక పుచ్చుకొన్నారు, ఏమి టండి భావము ? " అని భటు డడిగినాడు.

" ఇది కావ్యము, ఇది ఖడ్గము. అంటే జీవితంలో ఉండే మార్దవమూ కాఠిన్యమూ నాలో ఐక్యం అయిన వన్నమాట. ఇదం బ్రాహ్మమిదం క్షాత్రం " అంటూ ఆయన నడిచిపోయినాడు.

* * *

ఇదంతా చూసే సరికి నాకు కూడా మృత్యురథం ఎక్కవలెనని బుద్ధి జనించినది. అటూ ఇటూ చూసి ఎరిగినవాళ్ళు సమీపంలో లేరని మనస్సు దృఢపరచుకొని మెల్లిగా నడిచిపోయి రథం ఎక్కబోయినాను. భృత్యుడు నన్ను ఆపి " నీ కేమైనా నవ్వులాటగా ఉందా ? ఇంటిదగ్గర సంగతి సందర్భాలు ఆలోచించుకొని వస్తున్నావా ? " అనేసరికి నాముఖం అప్రయత్నంగానే కళావిహీనం అయిపోయినది. అయినా ఝాత్రానికి ఓ అని మళ్ళీ కాలు కదిపేసరికి అతడు నావంక తీక్ష్ణవీక్షణములతో " మీకాంతంతో నీవు ఇల్లా వస్తున్నావని చెప్పేదా ? " అన్నాడు నేను మళ్ళీ మాట్లాడకుండా గిరుక్కున వెనకకు తిరిగి గబగబా గబగబా నడిచినాను

ఆమృత్యు రథం ఎవరినో కొంతమందిని ఎక్కించుకొని, మహావేగంతో అదృశ్య మైనది. నావెనక మేఘగర్జనలు, ప్రళయ ధ్వనులు సింహగర్జనలు ఇంకా చాలా రకముల భీకరరవములూ వినిపించినవి.

*

అన్నపూర్ణ

పెద్దిభట్ల
పూర్ణశర్మ

*

ఎచటి కేగిన నెందు జూచిన
ఎవరినోట వచింప విన్నను
అన్నమో శ్రీరామ చంద్రా
అనెడి నాదంబే.

ఎచటనో యేదేశమందో
ఎప్పుడో యిటువంటి క్షామము
వచ్చి లక్షలజనులు మృత్యువు
పాత బడినారు.

అనుచు తాతలు పలుక విందుము
అంతెకాని యెరుంగ మెన్నడు
దీని దొలగింపంగ జాలెడి
తెరగు లే దాకోల.

అని యొకానొక వాసరంబున
ఆ పురంబున నుండు పెద్దలు
చింతతో బహిరంగ మహా సభ
చేయ మొదలిడిరి.

ఎందరో భూస్వాము లుండిరి
ఎందరో వర్తకులు నుండిరి
ఎందరో యుద్యోగు లుండి, రి
కొందరో కలరు.

సకలవిధముల వార లాలో
చనలు చేయుచునుండి, రైనను
ఇపుడు తగినయుపాయ మిది యని
యెవ్వ రనలేదు.

అందరును నిస్సబ్ధులై తమ
యాననంబులు వాల్చియుండగ
అందరకు నచ్చెరువు తోపగ
నామె నిలిచినది.

ధనికురాలా, కాదు కాదు
తగిన బలగము కలద, కాదు
బిచ్చమున కిల్లిల్లు తిరిగే
పేదరా లామె.

చేత నక్షయపాత్ర మున్నది
చినుగుగుడ్డలు దాల్చి యున్నది
పరమశాంతము కలది యాయమ
వయసు ముదిరినది.

" ఏమి అవ్వా, యేమి చేతువు?
ఎట్లు కరవు తొలంగ జేతువు?
వినగ నుంటిమి చెప్పు మవ్వా
వీను లలరంగన్! "

అనగ విని యాముసలి దిట్టనై
ఆసనంబును మీది కెత్తుచు,
" ఇదిగో అక్షయపాత్ర చూడుం
డిదియె సాధనము!

" చిన్నపెద్దల భేద మెరుగను
కన్నతండ్రులై యెల్లవారలు
గడపగడపకు బోయి బిచ్చం
బడిగి తెచ్చెదను. "

*

పరివర్తనము
శ్రీనివాస శిరోమణి

అంకితము
శ్రీవత్స బాబురావుకు

ఒకటో అంకము

[సూర్యాస్తమయము కాబోతున్నది. అంతఃపురములో అలంకార మందిరములో నిలువుటద్దాల యెదట అశోక చక్రవర్తి నిలుచుని ఉన్నాడు. అతడు నల్లటివాడు. ఉంగరాలు తిరిగిన బిరుసు వెంట్రుకలు. మిడిగుడ్లు. ఆకళ్ళలో ఎర్రనిచారలు కూడా ఉన్నవి. గుబురుమీసాలు. పొట్టివాడు.

అర్ధనగ్నలు అయిన ముగ్గురు పరిచారికలు. ఒకతె చైనాదేశపుది - ఆమె వింజామర వీస్తున్నది. ఇంకొక పరిచారిక చందనచర్చ చేస్తున్నది. మరొకతె తిలకము ముఖాన దిద్ది పువ్వుమాల మెడలో వేసి అందముగా ఉండేటట్టు సవిరిస్తున్నది.

అలంకారమంతా అయిపోతున్న సమయములో ఒక పరిచారిక సవినయముగా ప్రవేశించి మ్రొక్కి నిలుచున్నది. ఆమెవంక చక్రవర్తి సాలోచనముగా చూచినాడు.]

పరిచారిక.

రాధాగుప్తులవారు వచ్చి ఉన్నారు.

అశోకుడు.

వెంటనే లోపలికి పంపించు.

[వింజామర వీస్తున్న పరిచారిక తప్ప అందరూ వెళ్ళిపోయినారు. అశోకుడు సుఖాసనా సీనుడయినాడు. రాధాగుప్తుడు ప్రవేశించినాడు. వృద్ధముఖములో గాంభీర్యము ఉట్టిపడుతున్నది. ప్రశాంతమయిన నేత్రములు. దీర్ఘకాయుడు.]

అశోకుడు.

[లేచి నమస్కారముచేసి రాధాగుప్తుడు కూర్చున్న తరువాత కూర్చుంటాడు.] ఏదో విశేషమున్నదను కొంటాను. లేకపోతే మీరిప్పు డెందుకు వస్తారు ?

రాధాగుప్తుడు.

అవును. ఇది సమయము కాదని తెలుసును. అయినా రాక తప్పింది కాదు.

అశోకుడు.

[వ్యగ్రభావముతో] చిత్తము. అప్పుడే చీకటిపడిపోయింది. మిమ్ములను విశేషము సేపు కూర్చుండ బెట్టను.

రాధాగుప్తుడు.

మీరేదో పనిమీద ఎక్కడికో వెళ్ళబోతున్నా రనుకొంటాను.

అశోకుడు.

అవును. మాళవ రాజకన్యనుచూసి ఇప్పటికి సంవత్సర మయి పోయినది. ఆమె నావిరహమును భరించ లేక కృశించి పోయి ఉన్నదట. విరక్తివల్ల ఒక్క ఆభరణమయినా ధరించడము లేదట.

రాధాగుప్తుడు.

[సాలోచనముగానూ, సాభిప్రాయముగానూ,]
అది మీవిరహదుఃఖమో - శోక పితృ సోదర వియోగదుఃఖమో - యోజించి నారా రాజా !

అశోకుడు.

తలిదండ్రులను గురించిన దుఃఖ మయితే ఒకనెల, శోకపోతే రెండునెలలు. కాని ఇంతకాలము దుఃఖించదు. అది కేవలము విరహమే. ఇప్పుడు ఉన్మాదినిగా ఉందని తెలుస్తున్నది. ఆమె విరహములో అంత్యావస్థకు తయారవుతున్నది. ఎందువల్లనంటే, నేను రాజధానిలోకి వచ్చి కూడా ఆమెను చూడలేను.

రాధాగుప్తుడు.

అయితే మీకిప్పుడు శకునము ఏమీ బాగాలేదు. శుభము అంటూ బయలుదేరబోతూఉంటే ఒంటిబ్రాహ్మణుడను ఎదురుగుండా వచ్చాను.

అశోకుడు.

ఇంకా బయలుదేర లేదుగా నేను !

రాధాగుప్తుడు.

మీరు బయలుదేరినట్టే లెక్క.

అశోకుడు.

అయితే మీరు వచ్చినపని ఏదో సెలవిస్తారా ?

రాధాగుప్తుడు.

చిత్తము. బ్రహ్మానందము కలిగించే వర్తమానము చెప్పడానికే వచ్చాను. ఉపగుప్తాచార్యులను ఎరుగుదురుకదా!

అశోకుడు.

ఉపగుప్తుడా ! బౌద్ధభిక్షువు కాదూ ?

రాధాగుప్తుడు.

అవును. మీ అన్నగారు సుసీముడి పక్షమువాడు. వాణ్ణి ఈమధ్యాహ్నమే పాతాళగృహములో ప్రవేశపెట్టినాము.

అశోకుడు.

[విషాదముతో కూడుకొన్న ఆశ్చర్యముతో.]
చంపివేసినారా ?

రాధాగుప్తుడు.

ఈపాటికి యమధామానికి చేరి ఉండేవాడే. అయితే మీతో కొంచెముసేపు మాట్లాడిన తరువాత తన్ను చంపమని ప్రార్థించినందున-

అశోకుడు.

నాతో ఏమి మాట్లాడుతాడో ?

రాధాగుప్తుడు.

మిమ్ములను తూలనాడుతాడు.

అశోకుడు.

[కోపముతోనూ ఆశ్చర్యముతోనూ] ఆ! తూలనాడుతాడా ? అయితే నేనే వాణ్ణి యమరాజ్య పట్టాభిషిక్తుణ్ణి చేస్తాను !

రాధాగుప్తుడు.

అయితే వాణ్ణి ప్రవేశపెడతాను.

అశోకుడు.

వాణ్ణి తీసుకొని రావడానికి ఎంతసేపు పడుతుంది ?

రాధాగుప్తుడు.

వెంటతీసుకొని వచ్చినాను. వాణ్ణి ప్రవేశ పెట్టి వెళ్ళిపోతాను.

అశోకుడు.

[ఏదో ఆలోచిస్తూ] చిత్తము.

[రాధాగుప్తుడు వెళ్ళిపోతాడు. ఉపగుప్తాచార్యులు ప్రవేశిస్తాడు. దీర్ఘకాయుడు. ప్రశాంత నేత్రములు. గంభీర మయిన వదనము. కాషాయాంబరధారి. నిశ్చలముగా తలవాల్చి నిలుచుంటాడు. అతన్ని చూస్తూనే అశోకుడి ఒళ్లుకంపించిపోతుంది మహా కోపం వస్తుంది. భస్మీభూతమయి పొయ్యేటంత కోపముతో అతని వంక అశోకుడు చూస్తాడు. అతని నిశ్చలతకు ఆశ్చర్యముకూడా కలుగుతుంది.]

అశోకుడు

ద్రోహీ, ఎంత నిశ్చలముగా ఉన్నావు ! నీది ఏదేశము ?

ఉపగుప్తాచార్యులు

నేను ద్రోహినికాను. ఈభూమి అంతా నాదేశమే.

అశోకుడు.

ఆఁ ఆఁ !

ఉపగుప్తుడు.

నీదేశానికి పరిమితిఉంది; హద్దులున్నవి; నాదేశానికి పరిమితిలేదు; నాల్గుదిక్కులూ నా దేశానికి హద్దులు -

అశోకుడు.

నీకు మతి పోయినట్టుంది !

ఉప.

[నవ్వుతూ] కాస్త కాస్త మంటిముద్దల కోసము పోట్లాడుకొనే నీబోటి రాజులకు మతి పోయింది. నాకేమీ మతి పోలేదు. ఈవిషయము హెచ్చరించి పోవడానికే నిదర్శనము కోసరము ప్రార్థించాను.

అశోకుడు.

ఏమిటి ?

ఉప.

దేశ దేశాలను జయించడ మెందుకు రాజా ?

అశోకుడు

ఏ మంటున్నావూ ?

ఉప.

ఏ మంటున్నానా ? దేశదేశాలమీదికి దండెత్తిపోయి రాజ్యాలనూ, జనాన్ని నాశము చేస్తున్నావే ! ఎక్కడయినా కాస్తజనము ఉంటే వారిహృదయాలలో చిచ్చుపెడుతున్నావే ! ఇదంతా ఎందుకోయి ? సరే, పోనీ, రాజుల్నూ జనుల సంగతి అలాఉంచు. నీజోలికీ జోక్యానికీ రాని వన్యమృగాలను వేటాడి చంపడ మెందుకు ! అవి ఘాతుకమృగము లంటావు ! అయితే నీకు పాలిస్తూ పాడ

పదమయినా తెలియనిగోవులు - శరత్కాల స్వాదునదీ జలము తాగనీయకుండా రక్తాన్ని ప్రవహింపజేస్తున్నావే! అంతా నిశ్శేషమయిపోయిన తరువాత ఎక్కడ ఎవరిని పరిపాలించ దలచుకొన్నావురాజా? చెప్పు చూతాము. కళింగదేశములో పురుషుడనేవాడు లేకుండా చేశావే! ఇక నీవు పాలించేది ఆదేశములో ఉన్న వితంతువులనా?

అశోకుడు

అనవసర ప్రశంస చేయకు.

ఉప.

సుఖదుఃఖాలూ, ఆదరానాదరములు, ప్రేమాప్రేమలు, ఆలోచనానాలోచనలు లేని నేను విశేషము మాట్లాడేట్లయితే శిలాగానే మారిపోతాను. విశేషము నీతో నేను మాట్లాడ దలచుకొనలేదు.

అశోకుడు.

అయితే ఎందుకు వచ్చావు ఇక్కడికి?

ఉప.

నీప్రతిబింబాన్ని నీకు చూపించి పోవడానికి వచ్చాను.

అశోకుడు.

[విసుగుతో] ఏమిటా ప్రతిబింబము?

ఉప.

మనుష్యాకారములో ఉన్నజంతువేమో అనిపిస్తున్నావు నీవు! లోకసంహారము చేస్తున్నావు. నీపనులు లోకకంటకములుగా ఉన్నవి. నీకు సుఖము ఇందులో ఉన్నదా అని ప్రశ్న. లే దేమోనని తోస్తున్నది. ఎందువల్లనంటే, దేశదేశాంగనలను తీసుకొని వస్తున్నావు. విశ్రాంతి కొంచెము చిక్కినప్పుడల్లా సారాసారములు విచారించకుండా కేవలము మాంసగ్రంథులయిన స్తనాలకోసము - శ్లేష్మాగారమయిన వదనముకోసరము మూత్రము స్రవించే జఘనపీఠము కోసరము - [కళ్ళుమూసుకొని] ఆహా నింద్యం నింద్యమ్ [కొంచెము సేపు ఊరుకొని] సబ్బం దుఃఖం సబ్బం దుఃఖమ్. [కళ్ళుతెరిచి] నేను చెప్పదలచుకొన్న దంతా చెప్పినాను. ఇంక నన్ను చంపివేయడానికి అనుజ్ఞ ఇయ్యి.

అశోకుడు.

నిన్ను చంపకుండా వదిలివేస్తే సంతోషిస్తావా?

ఉప.

నాకు సంతోషమూ లేదు, దుఃఖమూ లేదు.

అశోకుడు.

అయితే మాకెందుకు నీ వంత అపకారము చేయడము?

ఉప.

నే నొకరికి అపకారము చేయను. నీకు చేయనూ లేదు.

అశోకుడు.

చేయ లేదా ?

ఉప.

లేదు.

అశోకుడు.

నీవు నాశత్రువులతో ఎందుకు చేరి నావు ?

ఉప.

నీశత్రువులతో గానీ నీమిత్రులతో గానీ నాకు ప్రసక్తి లేదు.

అశోకుడు.

నీవు మాఅన్న అయిన సుషీముడితో చేరి నన్ను చంపదలచిన వారిలో ఒకడ వు కావా ?

ఉప.

నీకు రాజ్యాధికారము లేదన్నాను. అది ధర్మము. కాని నిన్ను చంపదలచినవారిని వద్దని వారించినది నేనే.

అశోకుడు.

[వినయముతో] మీ మాటలు నేను విశ్వ సిస్తున్నాను.

ఉప.

నీవిశ్వాసా విశ్వాసములతో నాకు నిమి త్తము లేదు.

[పరిచారిక ప్రవేశించి నమస్కారముచేసి నిలు చుంటుంది]

అశోకుడు.

[రూక్షముగా] ఏమిటి ?

పరిచారిక.

మాళవరాకుమారి దేవర దర్శనార్థము క్షణ మొక యుగముగా గడుపుతున్నట్లు వర్తమానము వచ్చింది.

అశోకుడు.

[మహానందముతో] ఆః ఆః సంతోషము! ఓసీ, ఈహారము నీకు బహుమానము. [అమూల్యాభరణము తీసి యిస్తాడు.] హో. ఓ భిక్షుకుడా, మా కత్యంత మోదావహ మయిన సమయములో వచ్చావు. చాలా అదృష్టవంతుడవు. నిన్ను చంపము. పో మ్మావలకు !

*

రెండో అంకము

[పాటలీ పుత్రనగరము వెలుపలి మైదానము. రాత్రి పదిన్నర గంటలు కావచ్చింది. గాఢాంధకారము. అశోక చక్రవర్తి పుష్పమాలాలంకృతుడయి ఉత్తరీయము జారి పోతూ వేగముగా నడుస్తూ ప్రవేశిస్తాడు. ఎదురుగుండా ఒక వృద్ధుడు ముసుగు పెట్టుకొని వస్తూఉంటాడు. అశోకుడా వ్యక్తిని చూసి ఆగిపోతాడు.]

అశోకుడు.

ఎవరా మనిషి ?

రాధాగుప్తుడు.

నేను [అంటూ ముసుగుతీసి నిలుచుంటాడు.]

అశోకుడు.

మంత్రివరేణ్యులా! అభివాదము. ఒంటరిగా ఎక్కడికి వెళుతున్నారో తెలుసుకోవచ్చునా ?

రాధాగుప్తుడు.

దేవరవా రెక్కడికి ఒంటరిగా వెళుతున్నారో నేను తెలుసుకోవచ్చునా ?

అశోకుడు.

నేను బాహ్యోద్యానాంతః పురానికి వెళుతున్నాను. సంవత్సరమునుంచీ ఏకాంతా స్వయంగ్రాహము కోసరము సంతపిస్తున్నానో ఆకాంత సందేశ మంపినది.

రాధా.

ఏమని ?

అశోకుడు.

అస్మద్రాధ పరిష్వంగము కోసరము క్షణమొక యుగముగా గడుపుతున్నట్టు.

రాధా.

ఇవ్వాళ అమావాస్య.

అశో.

అయితే కావచ్చును.

రాధా.

[గట్టిగా] ఇవ్వాళ అమావాస్య.

అశో.

[చిరునవ్వుతో] మన్మధుడికి వారాలు వర్జ్యాలూ లేవు. పో నియ్యండి.

రాధా.

కాదు. రాజా, ఒక్కసారి నిలవండి.

అశో.

ఎందుకు ?

రాధా.

మీ నియమాలను మీరే తిరస్కరిస్తే ఇక మీ నియమాలను ఇతరులు ఎలా అనుసరిస్తారు ?

అశో.

అసలు విషయ మేమిటో చెప్పవ చె ప్పండి. హృదయము దహించుకొని పోతున్నది. ఇంక నేను నిలవలేను.

రాధా.

తాము మారు వేషముతో రాత్రిసమయములో నగరపర్యటనం చేసేది ఈ రోజునే.

అశో.

అబ్బ, శుభమా అని వెళ్ళబోతుంటే అన్నీ అంత రాయాలే!

రాధా

సంకల్పాలకు వికల్పాలు లేకపోతే స్వారస్య ముండదు.

అశో.

పోనీ, ఈరాత్రికి మానివేసి రేపు రాత్రి నగరసంచారము చేస్తానులెండి.

రాధా.

జ్ఞాపకము తెచ్చుకోండి. రేపు రాత్రి తమరు మరొక విషయములో నిమగ్నులయి ఉంటారు.

అశో.

అబ్బ, అబ్బ,—నేను మీతో ఈ విషయమే చెప్పక పోయినట్లయితే?—

రాధా.

మీరెక్కడికి వెళ్ళుతున్నదీ నాకు తెలియకపోతేగా! అందుకోసరమనే వెతుక్కుంటూ వచ్చాను.

అశో.

మరి ఆ యువతీ దర్శనము చేయకుండా నేను జీవించజాలను. పోనీయండి, నా సంగతి అలా ఉంచండి. ఆయువతి మాత్రము ఇక జీవించడము దుస్తరము!

రాధా.

రాజా, పోనీయండి బ్రదకకపోతే మరొకతే —

అశో.

పెద్దలు - మీ నోటిలోనుంచి అశ్లీలములు రానీయకండి. అమ్మయ్యా, అంత మాట ఎలా అనగలిగినారు? ఆమెను ఒక సంవత్సరమునుంచీ ప్రవాసములో ఉంచినాను.

రాధా.

సంవత్సరము నుంచీ బ్రదికి ఉన్న మనిషి ఇప్పుడు ఈమాత్రానికే చచ్చిపోతే ఏం చేస్తాము!

అశోకుడు.

ఎందు కిదంతా — అలాగే నగరపర్యటనము చేస్తానులెండి.

రాధాగుప్తుడు.

మీరు అన్నతము లాడ రనుకొంటాను.

అశోకుడు.

ఈరాత్రికి క్షమించలేరా !

రాధాగుప్తుడు.

మీరా యువతి దగ్గరకు వెళ్ళకపోతే,ఏం?

అశోకుడు.

అమ్మమ్మ, కాదు! ఆసౌందర్య—

రాధాగుప్తుడు.

తిష్య రక్షాదేవికన్నా ?

అశోకుడు.

[చిరునవ్వుతో] చెప్పలేం మరి. తిష్యరక్ష మీ అంత వారిని ఇలాంటి పనులమీద పంపిస్తున్నదా ?

రాధా.

ఎంతమాత్రము కాదు. మీ రాయువతిని విసర్జించమని నాప్రార్థన.

అశో.

ఎందువల్ల ?

రాధా.

ఇందువల్ల అని మాత్రము చెప్పజాలను. తరువాత మీరు జన్మాంతము వరకూ దుఃఖిస్తారని నానమ్మకము.

అశో.

ఏమి టాయువతిని చూచిన మాత్రము చేతనే ?

రాధా.

ఏమో నా కదంతా తెలియదు. మీరు మాత్రము వెళ్ళవద్దని నా సలహా.

అశో.

ఆ రాకుమారి తండ్రిని సోదరుణ్ణి చంపించానని అందువల్ల నన్ను వరించదేమో నని మీరు ఊహ చేసి సలహా ఇస్తున్నారు. కాని ఆ దుఃఖము ఆమెకు ఎంత మాత్రము లేదు. నాకు తెలిసింది. నాకోసరము ఈ మధ్య కేవలము ఆమె ఉన్మాదిని అయిపోయింది. కాముకులకు తెలిసే విషయాలు మంత్రులకు తెలియడము కష్ట మను కొంటాను.

రాధా.

సరే నాకీ విషయాలతో పని లేదు. మీరీ రాత్రి నగరపర్యటనము చేయడమే నాకు కావలసిన విషయము.

అశో.

మళ్ళీ మొదటికి వచ్చారా ?

రాధా.

ఎంతదూరము చెప్పినా మీరు గ్రహించ లేకుండా ఉన్నారు. మీరు అక్కడికి వెళ్ళినట్టయితే, మీదట దుఃఖిస్తారు.

అశో.

దుఃఖించను, సుఖిస్తాను.

రాధా.

[గద్గద స్వరముతో] మీరు దుఃఖిస్తారు !

అశో.

మీరు తెలియదు లెండి.

రాధా.

కాదు. నేను అనుభవజ్ఞుణ్ణి. చెప్పుతున్నాను, వినండి. మీరు నగరపర్యటనముకు పొండి.

[అశోకుడు తల వంచి ఆలోచిస్తూ ఉంటాడు. రాధాగుప్తుడు వెంటనే వెళ్లిపోతాడు. అతడు తలయెత్తి చూసేసరికి రాధాగుప్తుడు కనిపించడు ఒకముసలిది మూలుగుతూ కర్ర ఊతగా చేసుకొని నడుస్తూ ఏడుస్తూ కనిపిస్తుంది.]

ముసలిది.

ఎవరు నాయనా, నీవు దొంగలాగా ఉన్నావు ?

అశో.

ఏమంటున్నావు! అశోకచక్రవర్తి రాష్ట్రములో దొంగలా ?

ముసలిది.

అశోకుడే పెద్దదొంగ అయితే ఇక రాజ్యములో దొంగలకేమి తక్కువ.

అశో.

[ఆశ్చర్యముతో] అశోకుడు దొంగా అవ్వా ?

ముసలిది.

అశోకుడు చేసే పనులు మామూలు మనుష్యులు చేస్తే బందిపోటు అంటారు. అదే అశోకుడు చేస్తూఉంటే, రాజాధిరాజు, చక్రవర్తి అంటారు. అట్లాంటి వాడికి చావు రాదుకదా నాయనా!

అశో.

ఎందుకు పాపము, అశోకుడికిచావు? నీకేం అపకారము చేశాడు ?

ముసలిది.

[రోషముతో కణుకుతూ] అపకారమా - వాడినోట్లో దుమ్ముపడ. నాకొంప కూల్చాడు, నా వంశనాశము చేశాడు. వాడు శిల, వాడు చావడు !

అశోకుడు.

ఆయనకు నీకొంపకూడా కావలసి వచ్చిందీ; నీవేం మహారాణివా నీవంశము నాశముచేయడానికి ?

ముసలిది.

అదికాదు బాబూ. నామెనిమిటి కిందటి సంవత్సరము మాళవదేశ యుద్ధములో చనిపోయినాడు. ఆయన వయస్సుచెల్లినవాడు, పోయినాడని ఒక్కఏడ్పు ఏడ్చి ఊరుకొన్నాను. ఈసంవత్సరము కళింగదేశయుద్ధములో నాకొడుకులిద్దరూ చనిపోయినారు.

అశో.

అయితే ఆకొడుకులకు బిడ్డలులేరా ?

ముసలిది.

అయ్యో అయ్యో బాబు - బుల్లి బాబు
[అని చతికిలబడి ఏడుస్తుంది.]

అశో.

[ఆమె పక్కనేనిలుచుని] ఏడవకు-ఏడవకు.

ముసలిది.

[ఏడుస్తూ] అయ్యో బాబయ్యా, నాగొంతు ఎందుకుపోతున్నది. నేనుకూడాచచ్చిపోగూడదూ ! ఈకూన అయినా—

అశో.

ఈకూన ఎవరు ?

ముసలిది.

నామనమడు. కొడుకులు పోయినా ఈ పసికందు బ్రతుకగూడదూ ?

అశో.

ఈ పసిబిడ్డ చనిపోయినాడా ?

ముసలిది.

ఆ ఈఉదయమే. అశోకుడు—వాడిదుంప తెగ ! ఈచనిపోయిన కూనమీాద కూడా వాడికి ద్వేష మెందుకో ?

అశో.

ఏంచేశాడు, ఏంచేశాడు ?

ముసలిది.

ఈఉదయము ఈపసికందును పాతిపెడదామని వల్లకాటికి పోతే, రాజుగారికి సుంకము చెల్లించనిది రాజభటులు పాతిపెట్ట నియ్యలేదు.

అశో.

పాపము, నీదగ్గిర డబ్బులేదు కాబోలు. రాజుగా రాసిపాయీల కుటుంబాలకు పింఛను ఇస్తున్నాడే !

ముసలిది.

వాడి డబ్బూ వాడూ ఊడ్చుకుపోను ! వాడిడబ్బు నాకక్కరలేదు. అందు కెన్నో సిఫార్సులు కావాలి. అయినా బందిపోటుదొంగ డబ్బు నా కక్కరలేదు.

అశో.

మరి నీ విప్పుడెక్కడికి వెళ్లుతున్నావు ?

ముసలిది.

శవాన్ని ఒక్కరోజుకంటె ఇంట్లో అట్టే పెట్టుకోగూడదని అపాదుముండాకొడుకు శాసనము. ఊరిబయట ఏగోతిలోనైనా పారవేసి నేనూ ఏగోతిలోనైనా పడుదామని బయలుదేరినాను.

అశో.

అంత అవస్థ పడవలసిన అవసరము లేదు. స్మశానములో రాజభటు లంతా మావాళ్ళే. నేను కూడా నీవెంట — కాదు కాదు నాకు పని ఉంది. నావేలి ఉంగరము ఇస్తాను. ఆఉంగరము చూపిస్తే వాళ్ళు నీకు కావలసిన సహాయ మంతా చేస్తారు.

ముసలిది.

నీ వెవరో ఈరాజ్యములో చాలామంచివాడివి లాగా ఉన్నావు. అయితే ఉంగరము వాళ్ళకిచ్చివేసేదా ?

అశో.

నీ ఇష్టము—పోసీ నీవు అమ్ముకొని ఆడబ్బు తీసుకో.

ముసలిది.

నాకెందుకు నాయనా నీడబ్బు?

అశో.

అయితే వాళ్ళ కిచ్చి వెయ్యి.

ముసలిది.

అయితే అబ్బాయీ, సరే కాని నాకు రాజదర్శనము కావలెనంటే ఏంచెయ్యాలో చెప్పగలవూ?

అశో.

ఎందుకు?

ముసలిది.

ఒక్క సంగతి అడుగుదామని – ఆసంగతి అడగగానే అక్కడి భటులు నన్ను ఎట్లాగూ తంతారు. నేను చచ్చిపోతాను. నేనుకూడా వాడిచేతులో చచ్చిపోదామని ఉంది.

అశో.

ఏమిటి అవ్వా ఆసంగతి?

ముసలిది.

ఇట్లా అడుగుదామని: "ఓరి అశోకుడా, మాకొంపలలో ఒకరిద్దరు చచ్చిపోతే మేమిట్లా ఏడుస్తాము. నీరాజ్యములో– రాజ్యమంటే కుటుంబము కదా – నీకుటుంబములో ఇంతమంది చచ్చిపోయినా ఇంతహాయిగా నిశ్చింతగా ఎట్లా ఉంటావు? ఆసంగతి ఏమిటో నాకు కూడా కాస్త చెప్పు. అయినా ఆ కళింగదేశములో మగపురుగు లేకుండా చేశావుట. ఇక రాజ్యము చేసేది వెధవముండలనూ, ముసలి ముండలనా?" అని అడగగానే అక్కడ ఉండే వాళ్ళు నన్ను చావదంతారు, సరిపోతుంది.

అశో.

నేను మహారాజుగారితో చెప్తానులే.

ముసలిది.

నీ వాయన కొలువులో ఉన్నావా ఏం? అయితే నీకు చెప్పవలెనని మనసులో ఉన్నా, చెప్పజాలవు. ఎట్లాగైనా నాకు దర్శన మిప్పింతూ.

అశో.

రాజుగారి దర్శనము కావడము దుస్తరము ముసలమ్మా. నేను వెళ్ళి పోవాలి, వెళ్ళనియ్యి.

ముసలిది.

నాయనా, నీవెవరో గుర్తు పట్టలేను. వెయ్యేళ్ళు వర్ధిల్లు. నీమేలు మరిచిపోను. నీవు సిపాయివా బాబూ? మా అబ్బాయలకు స్నేహితుడవా?

అశో.

ఆఁ అవునులే. వెళ్ళుతున్నాను. వెళ్ళవలెను. [అంటూ అశోకుడు వేగముగా వెళ్ళిపోతాడు. ముసలమ్మకూడా వెళ్ళిపోతుంది.]

మూడో అంకము

[తెల్లవారవస్తున్నది. పండువెన్నెల కాస్తున్నది. అప్పుడప్పుడు పిట్టలు కిలకిలా కూస్తున్నవి.

మల్లెపూదెలవల్ల పొదరిల్లుగా ఉన్న ప్రదేశములో చలువరాతి అరుగుకు ఒకపక్కన మాళవరాకుమారి నిలుచుని ఉంది. మరొకపక్కన అశోకచక్రవర్తి నిలుచుని ఉన్నాడు.

ఆమె సన్నగా పొడుగుగా తీగెలాగ ఉంది. రామచిలుక ముక్కులాంటి ముక్కు, వాలు గన్నులు. ఆమె ఒక్క ఆభరణమునైనా ధరించలేదు. ముఖానబొట్టు అయినా పెట్టుకోలేదు. చాలా కోపముతో ఉన్నట్టు కనబడుతున్నది.

అప్పుడప్పుడు అశోకుడివంక మిర్రిమిర్రి చూస్తూ వెంటనే తలవంచుకొంటూ ఉన్నది.]

అశో.

కార్యాంతరములలో పడిపోయి ఈదాసజనుడు ఇంతకాలమువరకూ నీ దర్శనము చేయలేక పోయినాడు, అన్యథా అనుకోవద్దు. [చేయి పట్టుకో బోతాడు.]

రాకుమారి.

[చెయ్యిపట్టుకోకుండా తప్పించుకొని ఒరకంటితో అతితీవ్రముగా చూసి ఊరుకొంటుంది.]

అశో.

ఈదాసాధముడి మీద ఇంతకోపము తగదు. నీవు మాట్లాడక పొయ్యేట్లయితే నాకు చాలా కష్టము వేస్తుంది. కోకిలలాగా ఒక్కపలుకుపలికి నా చెవులతుప్పు పోగొట్టరాదూ! అసలే తాపముతో ప్రాణాలుపోతున్నవే - నీకృపా కటాక్షములు నామీద బరిపి, నాతాపము బాపరాదా? అంత కోపమా! ఎందుకు అలా పెడతావు ముఖము? నిజముగా నేను నీకోపానికి పాత్రుణ్ణే! ఇదుగో నిజముగా నీకు కోపము వచ్చినట్టయితే ఎందుకు నీవు ఆ బాహు వల్లరులతో నన్ను బంధించి పారవేసి కోరికి వేయరాదు?

రాకుమారి.

[స్థాణువులాగా నిలుచుని తీవ్రముగా చూస్తూ ఊరుకొంటుంది.]

అశో.

[సమీపించి మోకాళ్ళపైన కూర్చునిదోసిలియొగ్గి]
నీగాఢాశ్లేషముకు నేను తగనా?

రాకు.

[అతిపరుషముగా] నేను మీ ఖైదీని, నన్ను మీ రింత వేడుకోవలసిన అవసరము ఏమీ లేదే.

అశో.

నా ఖైదివా? ఆఁ అంతమాట!--ఎంతమాత్రము కాదు. నేను నీబందిని, నీకోపపాత్రుణ్ణి.

రాకు.

నన్నిక్కడికి మీరు ఖైదీగానే తీసుకొని వచ్చినారు.

అశో.

కాదు. ఎంతమాత్రము కాదు. నీవు నా హృదయరాజ్ఞివి. రాణులందరూ నాకు ఒకయెత్తు, నీవు ఒక్కతెవు ఒక్కయెత్తు! ఇటువంటి హృదయ విదారక వాక్యములు నేను వినలేను.

రాకు.

హృదయ విదారకకృత్యములు చేసే వారికిమాటలతో పని ఏముంది? తమరీ దౌర్భాగ్యురాలిని —

అశో.

దాసుడి తప్పు దణ్ణముతో సరి అన్నారు. ఎందుకు మాటలని నా హృదయాన్ని చీల్చివేస్తావు?

రాకు.

నేను మిమ్ములను ఏమీ తూలనాడడము లేదు. తమఅంత శత్రు భీకరులు ఒక ఖైదిని, అందులో ఒకస్త్రీని ఇంత బ్రతిమాలడములో అర్థము తెలియడము లేదు.

అశో.

[రాకుమారి దగ్గరికి వెళ్ళికేయి పట్టుకొని కౌగిటిలో చేర్చుకోబోతాడు. ఆమె తప్పించుకుంటుంది. దగ్గరదగ్గరకు వెళ్ళబోతాడు. అతడు సమీపించిన కొద్దీ ఆమె దూరము జరుగుతూ ఉంటుంది]
నీవు అలా "ఖైదిఖైది" అంటూ ఉంటే నాకర్ణరంధ్రములలో సీసము కరిగించి పోసినట్టుగా ఉంటుంది. నీవు నాహృదయాధిష్ఠాన దేవతవు-

రాకు.

ఎంతఆశ్చర్యము-ఎంతఆశ్చర్యము. నాతండ్రి, నా అన్నమీకు పరమశత్రువులయి పోయినారు మీరువారినిచంపించినారు. నేను మాత్రము మీకంత ఆప్తురాలనైనానా? పాము చుట్టము పగ మాత్రము పగఅట. ఆహా!

అశో.

నిజమే, నీకత్యంత సంతాపము చేకూర్చిన మాట సత్యమే. అది క్షాత్రధర్మము. క్షత్రియాంగనవు నీవిటువంటి వాటికి ఇంతదుఃఖించకూడదని నామనవి.

రాకు.

[ఆశ్చర్యముతోనూ కోపముతోనూ] తాము క్షత్రియులా, క్షత్రియులా?

అశో.

నీకు తెలియదా ఆసంగతి? నేను క్షత్రియుడను కానా?

రాకు.

ఎంతమాత్రము క్షత్రియులు కారు. తమతల్లి బ్రాహ్మణాంగన. తండ్రిగారు మాత్రము క్షత్రియులు.

అశో.

[నవ్వుతూ] అయితే నేను- ఎంత వెర్రి దానివి !

రాక్ష.

రాధాగుప్తుడు మంత్రి కాక పోయినట్లయితే తమరెవరో తమకే తెలిసేది.

అశో.

[మందహాసముతో] రాధాగుప్తుడు ఏమి చేసినాడు ?

రాక్ష.

సుక్షత్రియుడయిన తమ అన్నగారిని మోసపుచ్చి బ్రాహ్మణాభిమానము వల్ల తమకు రాజ్యము కట్టబెట్టి తమను క్షత్రియులను చేసినాడు.

అశో.

మా అన్నగారి నెన్నడూ మోసము చేయలేదు. మాతండ్రే నాకు రాజ్యమిచ్చినాడు. రాధాగుప్తుడు నాకు రాజ్యమిప్పించి నాడన్న మాట అసత్యము.

రాక్ష.

ఏమో. తమవికృతాకారమునకు తమ తండ్రిగారెంతో అసహ్యించుకొనే వారట. ఇటువంటి తమ్ము కన్నందుకు తమతల్లి మీదకూడా రాజుగారికి కోపమువచ్చి తరువాత ఒక్కసారి అయినా చూడలేదట. తాము మరణిస్తే సంతోషింతామనే ఉద్దేశ్యముతో శత్రుసేనల పైకి తమ్ము పంపించినారట.

అశో.

నాపరాక్రమము పరీక్షచేయడానికి మా తండ్రిగారు అట్లా చేసి నారు. నీకు తెలియదు. నీవు చిన్నదానివి. నాకు గిట్టని వాళ్ళెవరో నీకివన్నీ కల్పించి చెప్పినారు. అయినా నేను క్షత్రియోచిత మయిన కృత్యములను చేయడములేదా ? గుణములను బట్టే వర్ణము లేర్పడుతవి.

రాక్ష.

[నవ్వుతూ] తాము తమ ఆకారమునకు తగిన పనులు చేస్తున్నారంటే సమంజసముగా ఉంటుంది.

అశో.

అయితే నాఆకారము క్షత్రియోచితము కాదా ?

రాక్ష.

కాదు. కిరాతాకారము.

అశో.

[నవ్వుతూ] నేను కిరాతుణ్ణా.

రాక్ష.

అవును. ఈరక్తపాతములు, ఈరాజ్యధ్వంసములు, ఈసౌఖ్యములు, ఏమిటివన్నీ-

అశో.

[వేగముగా చేయి పట్టుకొని కౌగిటిలోకి చేర్చుకో బోతాడు. ఆమె తప్పించుకోడానికి ప్రయత్నము చేయబోతూ చప్పున స్థాణువులాగా బిగుస్తుంది. కొంత ఆశ్చర్యము చెంది] ఇంత కోపమూ ఇంత ద్వేషమూ నా మీద వద్దు నేను నీదాసుణ్ణి. నేను తప్పు చేస్తే దండించ వలసినది నీవు. [కౌగలించుకో బోతాడు.

రాకు.

[కర్రవలె నిలుచుని కోపముతో చుర చుర చూస్తూ] మీరీ దేహాన్ని ఏమి చేసినా చేయవచ్చునని ఇది వరకే మనవిచేసి కొని ఉన్నాను. కాని నాహృదయము మాత్రము మీకు లభ్యము కాదు.

అశో.

నీహృదయము కోసరము, నీ అంతరంగము కోసరము కాకపోతే ఈరాజ్యాలు నేను జయించడము ఎందుకు ?

రాకు.

నాకు మీరాజ్యములతో పని లేదు. మీయుద్ధములతో పనిలేదు. [గద్గదస్వరముతో] మీ వికృతరూపము చూస్తూ ఉంటే త్రిశంకు జ్ఞాపకము వస్తున్నాడు. అమ్మో అమ్మో! [గజగజ వణుకుతూ] దేశదేశాలను ధ్వంసము చేసే తమకు అరక్షిత అయిన స్త్రీని ధ్వంసముచేయడము ఒకలెక్కా ! కానీయండి. నేను అసహాయను.

అశో.

[విచారముతో] నన్ను తూలనాడవద్దు. నీకోసరము సమస్తమూ, రాజ్యమూ పరిత్యజించి వేస్తాను. ఇక ఒకయుద్ధము చేస్తే విశ్వద్రోహము చేసినంత ఒట్టు.

రాకు.

సమస్తమూ త్యజించగలరు. రాజ్యము కూడా పరిత్యజించగలరు. కాని ఒక్క స్త్రీ కోసరము ఒక్క అశుచిభ్రష్ట్రక కోసరము ఎంతతాపత్రియము !

అశో.

[కోపముతో] నిన్ను మాత్రము పరిత్యజించలేనని అనుకొంటున్నావు కాబోలు !

రాకు.

ఒక్కస్త్రీకోసరము లోకాన్ని అంతా పరిత్యజించగలవారు ఇంతరాజ్యముఎలా చేస్తారా అని ఆలోచిస్తున్నాను.

అశో.

అయితే రాజ్యపరిపాలనకుకూడా అనర్హుడననే నీ అభిప్రాయము కాబోలు !

రాకుమారి.

ఏమో నాకు తెలియదు.

అశో.

[విసుగుతో] కనుసైగతో సమస్తదేశములనూ జయించినాను. కాని ఒక్క

స్త్రీహృదయాన్ని మాత్రము జయించ లేక పోయినానుగదా !

రాకు.

దేశాలను జయించినట్లే ఈస్త్రీని జయించవచ్చును. రాజా, తాము దేశదేశాల రాజులను జయించినారు కాని వారి హృదయాలను మాత్రము జయించ లేదు సుమా ! ఆయా రాష్ట్రజనులహృదయాలలో చిచ్చు పెట్టినారు. మీ కీవిషయము తెలియదు కాబోలు. అట్లాగే నా దేహము మీ అధీనము. నాహృదయముమాత్రము మీది కాదు. దాన్ని మీరు జయించలేరు.

అశో.

నాకు హృదయములేదా ?

రాకు.

ఏమో నాకు తెలియదు.

అశో.

భయపడ వద్దు, చెప్పు. నాకు హృదయములేదా ?

రాకు.

మీ ఇతరవిషయాలు నాకు తెలియవు. నాతండ్రిని చంపి నాఅన్నను చంపి నా తండ్రిరాజ్యాన్ని లాక్కొనినా ఈతుచ్ఛ దేహాన్ని ఆశించేవారికి హృదయము ఉందని నేను ఎలా అనుకొనేది ?

అశో.

[తేరిపార తీవ్రముగా చూస్తూ తల ఊగిస్తూ]
అవును !

రాకు.

[కండ్లు మూసికొని] అమ్మో అమ్మో, మీ నేత్రములు, మీ భీకరాకారము చూడలేను ! అమ్మయ్యో, మీకు కోపము వచ్చినట్టున్నది. నన్ను ఏంచేస్తారో కదా ! [గజగజ వణుకుతుంది.]

అశో.

భయములేదు, భయములేదు. నీహృదయాన్ని జయించిననాడే నీవు నన్ను చూడవచ్చును. [అని వెళ్ళిపోబోయి ఆమెవంక చూస్తాడు. ఆమె అట్లాగే వణుకుతూ ఉంటుంది.]
దాసీ, దాసీ
[ఒకదాసి పరుగెత్తుకొనివచ్చి ప్రణామము చేసి నిలుచుంటుంది.]

అశో.

ఈమెను తీసికొనిపో.

[రాకుమారి దాసీ వెళ్ళిపోతారు. అశోకుడు విచారముగా ఆలోచించుకుంటూ నిలుచుని ఉంటాడు, తెల్లవారవస్తుంటుంది. ఇంకొక అరగంటలో సూర్యోదయ మవుతుంది. దూరమునుంచి శ్రావ్యముగా ఈక్రిందిపద్యములు వినబడుతవి.]

జితమారారి సమరం
జ్ఞేయసాగర పారగమ్
లోకైక లోచనం బుద్ధం
వందేహం వందనారహమ్.

భవన్నవతరంతానం
తరీవశరణం సదా

శిరసా పణమే సమ్మా
ధమ్మం మోహావిద్ధంసకమ్.
కరణీయంకతం సబ్బం
పుణ్యక్షేత్ర మనుత్తరమ్
అత్థాక యాగణం సుద్ధం
వందేహం సుగతోరసమ్.

సమ్మా సమ్మాభిసంబుద్ధం
ధమ్మం ధమ్మస్స కాశసమ్.
సంఘం సంఘుత్తమం లోకే
వందేహం వందనారహమ్.

[ఈపద్యాలను అతిజాగరూకతతో ఆలకించి]

అశో.

దాసీ, దాసీ.

దాసి.

[గబగబ వచ్చి] మహాప్రసాదం.

అశో.

ఎవరా పద్యాలు పాడేది?

దాసి.

ఇక్కడికి అరక్రోసుదూరములో ఉన్న బౌద్ధారామములో ఉపగుప్తులవారున్నారు. బహుశః వారు.

అశోకుడు.

నీవు సత్వరము పోయి అశోకచక్రవర్తి పిలుస్తున్నాడని చెప్పి త్వరగా సూర్యోదయము కాక పూర్వమే తీసుకొనిరా. [కొంచెము నిదానించి] కాదు కాదు. అశోకుడు తమదర్శన భాగ్యము కోసరము ప్రార్థిస్తున్నాడని ప్రార్థించి తీసుకొనిరా. పో. నీవు వచ్చేవరకు నాకేమీ తోచదు.

దాసి

చిత్తము [అని వెళ్లిపోతుంది.]

అశో.

సమ్మా సమ్మాభి సంబుద్ధం.
అనే పద్యము పాడుతూ విచారముతో అటూ ఇటూ ఒకటిరెండుసార్లు పచార్లు చేసి వెళ్లి పోతాడు.]

*

*

కావ్యావళి

దేవులపల్లి
కృష్ణశాస్త్రి

౧

నా నివాసమ్ము తొలుత గంధర్వలోక
మధుర సుషమా సుధాగాన మంజువాటి.

ఏ నొక వియోగ గీతికను;
ఏను నిదుర
వెన్నెలల దారి నొకరేయి వెడలిపోతి
నొక విపంచీ విరహ కంఠ మొరసి మొగసి.

ఏ నొక వియోగ శాలినీ హృదయరాగ
వేదనా రేఖను;
ఆకలి వేగు నామె
యంగుళీ కిసాలయ చంచలాంచలముల
విడివడి యనంతవిశ్వాన బడితి నాడు.

అదియె మొదలు లేను సకలదిశాంతరాళ
మెల్లెడల నందులో పర్వులెత్తి పోవ;
ఆసమయ మాదిగా నప్సరోంగనాను
రాగ వీథుల కిన్నరీ రమ్య కంఠ
సీమలో శ్రావణాంబు దాశ్లేషపాళి
దార కాలోకపంక్తుల మారుతోరు
పథముల దిరుగాడుదు పవలు రేలు
కన్నుమోడుపు మెయివాల్పు గాని లేక !

ఇది ముగియబోని ఏ యర్థ మెరుగరాని
వేసటలేని ప్రియన్వేషణమ్ము !
ఈ ప్రవాస యాత్రారతి నిటులె నేను
కదలిపోవుదు నాశావకాశములకు
ఒక్కనిట్టూర్పుపోలిక ఒక్కమూన
బాష్పకణమటు ఒక గాథ వాంఛవగిది !!

*

౨

ఆయనాథ బాలిక ప్రియురాలు నాకు !

ఆమె నవసాంధ్య సమయ మల్లీమనోజ్ఞ
కుసుమకామిని; ఎదో వింతకోర్కె లీయ
దనపు వేదన నాజీవితమున రేపు.

ఆమె స్వప్నాల గను నెప్పుడు; ఆమె మేని
తలిరు లావణ్యమొక్క-నేత్రముగ విరిసి
వెరగుచూపుల దనుదాన యరసికొనును.

ఆమె సొగసు రేకులు విచ్చి యమృతమధుర
నటన కాసింపబోదు, గానమ్ము సేయు;
దామె ప్రాయంపు వాకిటులందు వలపు
తడబడి యడంగు సిగ్గువాకింతరల తెరల.

*

౩

తమి బిగిసిపోవు నొక్క సంధ్యావసాన
సాంద్రకాశ్మీర దృఢ పరిష్వంగమందు
నిమిడి నిలువెల్ల నొదిగి శోషిలినయాడు
నేను తొలిసారి కాంచి కంపిలితి నాడు.

కార్మొయిలు పెదవుల ఖండఖండములుగ
చిదికిపోయిన కౌముదీ మృదులకలిక
గాంచి యొకరేయి దుస్సహాగాధదుఃఖ
మాపుకోలేక యేడ్చె నాయార్ద్రమనసు.

క్రొత్తరాక నొడలె యెరిగి కొనని గాలి
తమకపుం గౌగిలింత తొందరల నలగి
యూపిరాడక మూర్ఛిల నొక్కయలరు
గని వనట గ్రుంగినా నొక్కదినముదినము.

వాడిపోయిన ప్రతిసౌరభమ్ముకొరకు
కను మొరంగిన ప్రతిహిమకణముకొరకు
బ్రతుకుబ్రతుకెల్ల కరగు బాష్పములు గాగ;
ఎట్లు కననేర్తు నానాటిదృశ్య మేను ?

దారి దలలెత్తు నింతసౌందర్యలవము
వదలిపోలేరు చంపెడువరకు వీరు;
మృదుల కరుణామధురము నాహృదయ, మెవ్వ
రెరుగజాలుదు రేమని యేడ్తు నపుడు !!

*

౪

నా వలెనె యీత డున్మత్త భావశాలి,
ఆగికో లేదు రేగు నూహాల నాకింత,
ఎట్టి నిశినే నదరిపోవు నగసి పడును;
ఎన్ని చుక్కలపాటు లెన్నన్ని మెరపులు !!

ఇంత చిరుగీతి కొద వేగిరించునేని
పాడుకొనును తాండవనృత్య మాడుకొనును;
మస్తక మ్మోరగా వంచి మున్ను మిన్ను
వేయికే లాడగా వ్రాసివేసికొనును.

ఏ నెరుంగుదు నావలెనే యతండు
పాటపదములకై నిత్యసాధకు డయ్యె;
ఏ నెరుంగుదు నావలెనే యతండు
ప్రతిపదమ్మున శీతలస్వాదు మధు తు
షారముల బార్శ్వముల విరజల్లు చేగు !!

*

౫

ఏను తొలుత నేగూడేని లేని పులుగు
రాయడ; వహించినాడ నా బ్రతుకు బాట
నాట నవయని రెక్కయుయ్యాలకొనల
దెరువె లేని తీరమె లేని దివ్యసీమ.

అంత నే మారిపోతి సంధ్యామనోజ్ఞ
చిత్ర సిందూరరేఖగా; చేయి జెయిగ
మెయిమెయిగ హాయిహాయిగా మెలగినాను
పైడివన్నియత్తో నీలినీడతోడ.

నేను మెలమెల్ల రిక్కనైనాను; కాని
ఆ విశాలపనీల సౌధాంతికమున
నుండగలనా ప్రవాసినై యుడుసఖాళి
బలుకరింపక యొక రెప్పపాటువేళ!

ఇపుడు నే నొక్క తుదిరేయి యిగులచాయ;
సొగసికొని చిమ్ముకొని నటియించుకొనుచు
నలమువెలుగుల పరువుల కులికి పారి
కుంచుకొని రిచ్చవడి క్రుంగిక్రుంగి యలసి
యిపుడు నే నొక్క తుదిరేయి యిరులచాయ
నై నశించుచున్నాను —

*

౬

సాయయనపుం దెరువు ఇరుదెసల శిర సెత్తు
ప్రతికుజము ప్రతిసుమము ప్రతివిహంగమరుతము
అంతలో నాహృదయమందు సంజయకావి
వింతలై నశియించునా,
నాబ్రతుకు
సుంతేని సహియించునా!

అంతమే లేని నాయాత్రాపథాన నా
పదచిహ్నములువోలె, పడియున్న వెన్నెన్నొ
యడుగుజాడలు మదీయార్ద్ర హృదయమ్ములో
నిశికడుపులో తారలై
నిశ్శబ్ద
వాటిలో చిరుపాటలై!

వెనుదిరిగి కనువిరిసి వీక్షింతునా, యంత
ప్రతిపద స్మృతజీవ ప్రతిభ పులకించి
పలుకరించిన, క్రొత్తబలముతో చలముతో
పదినడతు పవలు రేల,
అజ్ఞాత
భావికాలపు యుగాల!!

*

లోకభయము

శ్రీనివాస శిరోమణి

కాలము : అసహాయోద్యమదినములు

రంగము : గుంటూరు మండలము

ప్రథమాంకము

[నాలుగు దూలాల యింటిముందరి వరండా. మెట్లున్నవి. ఈవైపునా ఆవైపునా తోట్లలో క్రోటనులు ఎత్తుగా పెరిగి ఉన్నవి. ఇల్లు కొంచెము పాతది. వరండాకు పిట్టగోడ. ఒకవైపున కిటికీ కింద రెండుపడకకుర్చీలూ, వాటికి ఎదురుగా రెండుఉత్తకుర్చీలూ ఉన్నవి విశాలమై గాంభీర్యాన్ని సూచించేముఖమూ, ఊర్ధ్వపుండ్రమూ, కల భావనారాయణగారు, పడకకుర్చీలో పడుకొని ఆంధ్రపత్రిక చదువుతున్నారు. ఉదయము తొమ్మిదిగంట లయింది.

కృష్ణమూర్తి పాతికపండ్లవాడని చెప్పవచ్చును. పచ్చనిశరీరము. ధోవతికి మంచుకుచ్చెళ్ళు జారవిడిచినాడు. వెనక బిళ్ళగోచీ. చాలా పొడుగాటి తెల్లని లాల్చీతొడుగుకొన్నాడు, కాశ్మీరశాలువ వేసుకున్నాడు. కాళ్ళకు బర్మాదేశపుజోడు. అతనిముఖములో ప్రసన్నభావమూ, గాంభీర్యమూ ఉట్టిపడుతున్నవి. వెంట్రుకలు బాగాపెరిగిన గిరజాలక్రాపింగు. రూపముచూస్తే కవో, చిత్రకారుడో అనిపిస్తుంది. మెట్లదగ్గరకువచ్చి]

కృష్ణమూర్తి

అనంతరావుగారూ. [అని పిలిచినాడు]

భావనారాయణ.

ఎవ రాపిలిచేది ?

[సూచన. ఇది నాటకరచనలో నాప్రథమ ప్రయత్నము. ౧౯౨౮ సంవత్సరములో బాబురావుగారూ, నేనూ, బర్నార్డుషా నాటకములు చదువుతున్నప్పుడు సాంఘికవచననాటకాలు వ్రాయవలె ననేకోరిక కలిగింది. తరువాత కొద్దిరోజులకు ఈనాటకము కల్పించినాను. చాలా కాలము కాకితాల అడుగున పడిఉండి ఈమధ్యనే ఇది కనబడ్డది. దీనిని శ్రీశివశంకర శాస్త్రిలవారికి చూపిస్తే, బాగున్నదన్నారు.

ఇందులో స్వగతాలు కానీ, దీర్ఘోపన్యాసాలు కానీ, ఆకాశసంభాషణలు కానీ లేవు. ఈరూపకము చిన్నదిగా ఉన్నది. కాని, ఇష్టము వచ్చినవారు దీనిని మా అనుమతిలేకుండానే ప్రదర్శించుకోవచ్చును.— శ్రీనివాస శిరోమణి]

కృష్ణ.

అయ్యా, నమస్కారము. అబ్బాయి ఉన్నాడా ?

భావ.

[పునర్నమస్కారముచేసి] కూర్చోండి. [పత్రిక మూసి] బుచ్చిబాబూ, బుచ్చి బాబూ [అన్నాడు.]

ఇంట్లో లేడు నాన్నా! [అని స్త్రీకంఠము వినబడ్డది.]

మూర్తి.

అయ్యా, సెలవు తీసుకుంటాను. ఆయన వస్తే కృష్ణమూర్తి వచ్చినా డని దయ చేసి చెప్పించండి.

భావ.

మీరేనా చిత్ర కారు లని మాకుర్రవాడు ఈమధ్య చెప్పినాడు ?

మూర్తి.

చిత్తము.

భావ.

నిన్న ఆంధ్రపత్రిక పొగడుతూ వ్రాసింది మీబొమ్మలను గురించేనా ?

మూర్తి.

చిత్తము.

భావ.

అయితే మీతో కొన్ని విషయాలు మాట్లాడవలె నని ఉన్నది. గీతగోవిందాన్ని అనుసరించి చిత్రాలు వ్రాసినారే-అందులో అంతా పచ్చిశృంగారము! ఏమి బా గుంటుంది ?

మూర్తి.

అది పైకి పచ్చిగా కనపడవచ్చును. కాని అంతరార్థాన్ని తమబోటి ప్రాజ్ఞులు కొంచెము శ్రద్ధతోటి ఆలోచిస్తే-

భావ.

ఎబ్బెబ్బె, అంతరార్థ మేమిటి! అసలు కృష్ణుడికి లేనిపోని అంతరార్థాలన్నీ మీబోటివాళ్ళు కల్పిస్తున్నారు. అవన్నీ పామరులకు - అందులో మనదేశపువాండ్లకు - తెలియ వనే ఊహతోటే అయి ఉంటుంది. శ్రీరాముడే దైవముగా మన పూర్వులు కొలిచినారు. శ్రీరాముడెంత ఉదాత్తుడో ఒక్కసారి ఆలోచించండి. మహానుభావుడు!

మూర్తి.

చిత్తము. కాని, రాముడు లోకనాయకుడు. పెద్దలు తమతో నాబోటివాడు వాదించడము అట్టే బాగుండదు. అయినా నాస్వల్పబుద్ధికి -

భావ.

నిస్సంశయముగా మాట్లాడవచ్చును. మీరు చిన్నవా రైనా బాగా తెలిసిన వారిలాగ కనపడుతున్నారు.

[లోపలిగదిలో ఉన్నయువతి ఈమాటలకు కిటికీదగ్గరకు వచ్చి చూచింది. ఎదురుగుండా కుర్చీలో కృష్ణమూర్తి కనబడ్డాడు. వారు అన్యోన్యము చూచు

కున్నారు. అతనికి మహోల్లాసము కలిగింది.]

ఆమె బక్కపలచనిది. పద్దెనిమిదేళ్ళ ప్రాయమువలె కనిపిస్తుంది. తల దువ్వుకొని ఉన్నది, కాని ముఖాన తిలకము లేదు. చెవులను ఎర్రరాళ్ళ కమ్మలు మెరుస్తున్నవి. కోలముఖము. విశాలమైన సోగకన్నులు. కొంచెము పొడుగుపాటి మెడ. మెడలో బంగారపు గొలుసు. మామిడిపిందెల ఖాదీ తెల్లచీర కట్టుకొన్నది.]

మూర్తి.

[శాలువ సవరించుకుంటూ ఓరకంటితో కిటికీవంక చూస్తూ ఉత్సాహముతో] మనవిచేస్తాను. అసలీ రాధాకృష్ణ సాంప్రదాయము ఉత్తరహిందూస్థానములో ఉదయించింది. రానురాను వంగదేశములో వైష్ణవులు ఈతత్వాన్ని సంపూర్ణముగా అవగాహన చేసుకొని స్వయముగా రాధాభావము జీవితములో ఇముడ్చుకున్నట్లు తెలుస్తున్నది. శ్రీచైతన్యులవారు, అంటే వంగవైష్ణవ మతాచార్యుడు రాధలాగ కృష్ణుని కోసము విరహము అనుభవిస్తూ ఉండేవారట. ఇంతకూ అసలు తత్వమేమిటంటే శ్రీకృష్ణుడు పరమాత్మఅనీ, రాధ జీవాత్మఅనీ వారి అభిప్రాయము. ఈజీవాత్మ పరమాత్మల సంయోగాన్ని నాయికానాయకులకు - విశేషించి జారిణీజారులకు ఉండే మోహావేశముగా మహాభక్తులు నిశ్చయించినారు. ప్రపంచములో చూడండి, నాయిక నాయకుడికోసము ఎంతవేదన అనుభవిస్తుందో ! ఏపని చేస్తున్నా నాయికకు నాయకుడే కనిపిస్తాడు. [కిటికీకేసి చూచి] అవిధముగా భగవంతుణ్ణి పొందవలెనంటే ప్రపంచములో పడి మనము కొట్టుకులాడుతున్నా, నాయికవలె సర్వకాల సర్వావస్థలయందూ భగవంతుణ్ణి ప్రేమించమనీ, ప్రాపంచక విషయాలను మరచి పొమ్మనీ వారి ఉద్దేశము.

భావ.

ఇదంతా కాదనను. కాని సామాన్యులు, మీరు చెప్పిన గీతగోవిందము లాంటి పుస్తకము చదివితే ఇటువంటి భావాలు కలుగవనే నావిశ్వాసము. పైగా, సురతము వర్ణించి ఉండడమువల్ల వాళ్ళు నీతిబాహ్యులయిపోతారు.

మూర్తి.

సంస్కృత మున్నవాండ్లే చదువుకొని బాగుపడుతారు. ఒకవేళ పుస్తకము చదువుకొని జనులు అంత పాడై పోతాంటట్టయితే పోనీయండి. ఏం చేస్తాము.

భావ.

అట్లా అంటే ఎట్లా ? ఈడు వచ్చి సంస్కృతము చదువుకునే ఆడపిల్లలకు ఇటువంటి పుస్తకాలుపాఠము చెప్పడము ఎలా కుదురుతుంది ? ఒకవేళ వాళ్ళు చదువుకోవలె నంటారేమో, తగిన గురుముఖతా పాఠము లేకపోయినందువల్ల వాళ్ళు మీరు చెప్పే అంతరార్థము గ్రహించక పోవచ్చును. ఇటువంటి

తత్వాలవల్ల ఎన్నిచిక్కులు వస్తవో చూడండి.

మూర్తి.

అలా కాదు. ఆరాధామాధవుల గభీర తత్వము తెలిసినవారే-

భావ.

[విసుగుతో] మీరు రాధాకృష్ణుల బొమ్మలు అనేకము వ్రాస్తున్నారుగదా. ఆబొమ్మలలో మీరు రాధకు రవిక చిత్రించరే. ఆబొమ్మను చూచినప్పుడు మీరు చెప్పే అధ్యాత్మభావములు కలగడము దుర్లభము! ఏ మంటారు ?

మూర్తి.

బొమ్మనుచూచినా, గ్రంధము చదివినా సంస్కారాన్నిబట్టి ఊహాలు ఏర్పడుతవి.

భావ.

[విసుగుతో] ఏమిటోలెండి. ఈకాలములో ప్రతివాండ్లు మాట మాట్లాడితే సంస్కార మంటారు. ఇంతకూ నేను చెప్పవచ్చిన దేమంటే, సాహిత్యము చూతామన్నా, చిత్తరువులు చూతామన్నా నీతిబాహ్యతతప్ప మరొకటి కనబడడము లేదు. చూడండి, మాచిన్నప్పుడు వీరేశలింగం పంతులుగారు ఎన్నెన్నో గ్రంధములు వ్రాస్తూ ఉండేవారు. ఆయన ప్రహసనాలలోగాని వ్యాసాలలోగాని నిర్భయముగా ఒక్కొక్కరి పరివర్తనమును ఎలా ఖండించేవారో, తెలుసునా ? ఈకాలములో అ దేమీ లేదు. రసము రసమని ఏవో నీతిబాహ్య మైన కవిత్వాలూ కథలూ బయలు దేరుతున్నవి. మీరు మట్టుకు ఆకృష్ణుడి బొమ్మలు చిత్రించేకంటె అన్నము లేక మలమల మాడే బీదవాండ్లబొమ్మలు చిత్రించి భాగ్యవంతుల కండ్ల వెంబడి నీరు కారి దానధర్మాలు చేసేటట్టు చేయకూడదా ? దేశములో ఎంతమంది వితంతువులు బాధపడుతున్నారో తెలుసునా ? వారిదీనముఖాలలో కనపడే వేదన చిత్రించి సంఘమును వితంతు వివాహాల కున్ముఖము చేయగూడదా ?

కృష్ణ.

అయ్యా, వితంతువివాహాలు మొదలైన వాటిల్లో తల్లిదండ్రులు ధైర్యము చేయవలసినదే కాని చిత్రకారులుగానీ, సంస్కర్తలుగానీ, పాపము వితంతువులు గానీ, ఏమి చెయ్యగలరు ? ఎంతమంది వితంతువులు తల్లిదండ్రులకోసము సౌఖ్యాన్ని కోలుపోయినారు !

భావ.

[తెలియక కాలు వేసి బురద అని తెలుసుకున్నప్పుడు చప్పున వెనుకకు అడుగు వేసేవిధముగా] ఎందుకు లెండి ఇప్పుడు మనకు వితంతు వివాహాల ప్రశంస. [పరధ్యానముగా ఉంటాడు.]

[ఇంతలో శల్యపుంజానికి చొక్కా తొడిగినట్టు ఉండి కించిత్తు జీవకళయినా లేని అనంతరావు వచ్చినాడు. అతను రాగానే, చెవులలో పడినది వితంతు

వివాహవిషయము. చప్పున కండ్లబడినది కిటికీలో ఉన్న చెల్లెలు. పక్కకు చూసేసరికి కృష్ణమూర్తి. తండ్రికి కూతురు కిటికీలో కూర్చుని ఉన్నట్లు తెలియడానికి అవకాశము లేదని గ్రహించినాడు. మెల్లిగా మెట్లు ఎక్కి వరాండాలోనుంచి పోతూ కృష్ణమూర్తివంక కండ్లురిమి చూసి పెదవులు బిగించి మెల్లిగా బద్మాష్ అని లోపలికి వెళ్ళినాడు. భావ పరంపరలోపడి ఉండడమువల్ల కొడుకు వచ్చినసంగతే తెలియదు తండ్రికి అన్నమాట వినగానే ఆయువతి అక్కడినుంచి లేచి చప్పున వెళ్లిపోయింది. కోపము అణచుకొని]

కృష్ణ.

అయ్యా, పొద్దెక్కుతున్నది. తమకాలము చాలా వ్యర్థము చేసినా ననుకొంటాను. క్షమించండి. సెలవు తీసుకుంటాను.

భావ.

[పరధ్యానములో పడుకొని ఉండి] మంచిది. నేనేమీ మీ మనస్సుకు నొప్పి కలుగజేయ లేదని తలుస్తాను.

కృష్ణ.

ఎంతమాత్రము చేయలేదు. [లేచి తొట్రుపాటులో] సెలవు తీసుకుంటాను.

భావ.

వీలయితే అప్పుడప్పుడు వస్తుండండి.

కృష్ణ.

చిత్తము. [అని బయటికి పోయి పక్క మైదానములో కాలిదారిని నడుస్తున్నాడు. వెనకనుంచి చప్పట్లూ ఆగు ఆగని ధ్వని వినబడడమువల్ల తిరిగి చూచినాడు. అనంతరావు వచ్చినాడు.]

కృష్ణ.

అక్కడ కాబట్టి బతికిపోయినావు నీవు కూసినకూతకు ! మరొకచోటయితే –

అనంతరావు.

నోరు ముయ్యి ! నీవు నాయింటి కెందుకు వచ్చావు ?

కృష్ణ.

నీయింటికి రాలేదు, నీతండ్రి యింటికి—

అనంత.

నీవు నాతో స్నేహము చేసింది ఇందుకా ! గోముఖవ్యాఘ్ర మంటే నీవే ! నిన్నేమి చేసినా పాపము లేదు !

కృష్ణ.

నీవు పసివాడవు ! నీ కీవిషయాలు తెలియవు. కుర్రతనమువల్ల నీ వేమి చేస్తున్నావో నీకు తెలియడము లేదు.

అనంత.

ఛీఛీ నీ ముఖము చూడగూడదు ! [గద్గదస్వరములో] నీవు మా యింటికి స్నేహితుడివిగా వచ్చి, మా చెల్లెలిని అపహరిస్తావా ! మా కొంప నాశనము చేయదలచు కొన్నావా ! మా చెల్లెలిని

పాడుచేసి మా వంశానికి అపకీర్తి తేద లుచుకున్నావా !

కృష్ణ.

నా సదుద్దేశాన్ని గ్రహించలేకుండా ఉన్నావే! మీ చెల్లెలిని వివాహము చేసుకోవలె ననుకొన్నాను. ఆమెను నేను ప్రేమించినాను, నన్నామె ప్రేమించింది.

అనంత.

మిత్రద్రోహివి నీవు !

కృష్ణ.

[ఉద్రేకముతో] నేను కాను — నీవు, మీ వాళ్ళూ ద్రోహులు ! మీ వంశానికి అపకీర్తి వస్తుందనీ, లోకులు అపనిందలు వేస్తారనీ అమాయకురాలిని, చెల్లెలిని, కన్నులు తెరవనినాడు వితంతువయిన ఆమె హృదయమును అన్యాయముగా నలిపివేయ దలుచుకొన్నారే ! ఎంత దారుణము ! [ఆశ్చర్యముతో] నేను చేయబోతున్నది తప్పా ! నా ప్రయత్నానికి నిజంగా సహాయము చేయవలసినవాడవు. నీవు నీ భార్యా కులుకుతూ ఉంటే నీ చెల్లెలుమాత్రము ఎండుచెట్టువలె ఉండవలెననా నీ అభిప్రాయము ! హృదయము లేదా నీకు !

అనంత.

[అపరిమితోద్రేకముతో] నీ ఉపన్యాసము ఆపుతావా లేదా ! [అని వంగి పెద్దరాయి తీసి] ఇదుగో నీ తల బద్దలు చేస్తాను !

కృష్ణ.

[శాంతముగానూ గంభీరముగానూ] చెయ్యి, చూస్తాను.

అనంత.

[రాయి అవతల పారవేసి] పో, బతికి పోయినావు ! ఇక ఈ ప్రయత్నాలు చేయకు. చేసినట్లు తెలిస్తే నిన్ను ఖూనీ చేయిస్తాను, నే నెంత వాడనో నీకు తెలియదు. నడు, తిన్నగా ప్రవర్తించు !

కృష్ణ.

[నిర్లక్ష్యముగా] అలా చేతువుగాని లే. నీ చెల్లెలిని ప్రేమించడము మాత్రము మానడానికి వీలు లేదు.

అనంత.

ఏమంటున్నావు ! [అని అతనిమీదికి పోతాడు.]

కృష్ణ.

[తీవ్రముగా చూస్తూ] ఇంతవరకూ క్షమించినాను. ఇక నోరెత్తితే చితకగొట్టివేస్తాను! [అనంతరావు అతనిపైకి వెళ్ళుతాడు.]

కృష్ణ.

శాంతించు. అదుగో మనుష్యులు వస్తున్నారు. వాళ్లు చూస్తే అల్లరి అవుతుంది ఊళ్లో.

అనంత.

నిన్ను చంపివేస్తాను !

కృష్ణ.

వద్దన్నానా? కానియ్యి చేతనైతే.

అనంత.

భీరువువు నీవు! ద్రోహివి —

కృష్ణ.

ఎవ రయిందీ తెలుస్తున్నది.

అనంత.

మేము అన్నదమ్ములము మాట్లాడుకోని కారణమువల్ల విరోధుల మని అనుకొంటున్నావు కాబోలు. సమయము వస్తే ఏకీభవించి ఎంతటి పనయినా చేయ గలము. తెలుసునా నీకు?

కృష్ణ.

[మెల్లిగా] కాదనను. అయినా మీరు మాట్లాడుకోరని నీవు ఇప్పుడు చెప్పే దాకా నాకు తెలియనే తెలియదు.

అనంత.

ప్రతిరోజూ నీజాడలు కనిపెట్టుతునే ఉంటాను, జాగ్రత! [మూర్తి మెల్లిగా నడుస్తుంటాడు. అనంతరావుకూడా అతని పక్కనే ఎగరొప్పుతో మహాకోపంతో నడుస్తూ ఉంటాడు. చప్పున ఆగిపోయి మూర్తిచేతులు పట్టుకొని]

అనంత.

అదుగో భీమరాజు వస్తున్నాడు. వాడే! వాడే! ఆ మిడిగుడ్లూ ఆ ముఖమూ వాడివే!

కృష్ణ.

[అనంతరావు వీపు చరుస్తూ] భయము లేదు. అతను చాలా మంచివాడే. ఎవరి జోలికీ సాధారణముగా పోడే. అయినా నీకూ స్నేహితుడే నే.

అనంత.

స్నేహితుడా, స్నేహితుడా నాకు! కాదు, కాదు. అతనికి చాలా అపకారము చేశాను. అది అతను మరచిపోలేదు. ఈ విషయము అతనికి తెలిస్తే మావంశము — వంశము [ఏడుపుతో] మమ్ముగిని బతకనియడు! ఎన్ని అపవాదాలు వేస్తాడో!

కృష్ణ.

వెయ్యడు.

అనంత.

కృష్ణమూర్తిగారూ, కోపముతో నేను ఇష్టము వచ్చిన మాటలు మీవంటి యోగ్యులను అన్నాను. మీరీ ప్రయత్నములోనుంచి విరమించమని బతిమాలుకుందామని మొదట అనుకున్నాను. కాని మనోదౌర్బల్యమువల్ల ఈ పిచ్చి చేష్టలు చేశాను. మూర్తిగారూ, [అని గడ్డము పట్టుకొని] పొరపాటున నిద్రలోనైనా, అతను పక్కన ఉంటే మీరీ విషయము కలవరించవద్దు! నన్ను క్షమించండి! [అని వెనకకు వెళ్ళినాడు]

[తెర]

ద్వితీయాంకము

*

[తర్వాత మూడు మాసములు గడిచినవి. చిన్న పెంకుటిల్లు. ఒకగదిలో చాలా చిత్రపటాలు తయారైనవీ, తయారు అవుతున్నవీ గోడలనిండా ఉన్నవి. అందులో రాధాకృష్ణుల ఐక్యము ఉన్న బొమ్మ- మంచిచట్టము కట్టబడి- ఉన్నది. ఇంకొక గదిలో పట్టెమంచమూ - దగ్గరనే మేజాబల్లా, దానిపక్కనే రెండు కుర్చీలూ ఉన్నవి. మధ్యాహ్నము పన్నెండుగంటలు. కృష్ణమూర్తి మంచము మీదా నరసింహాచారి కుర్చీలోను కూర్చుని ఉంటారు. ఆచారి సన్నని వాడు, పచ్చని దబ్బపండులాంటి దేహము, చిన్న కోలముఖము, బుల్లినోరు, మీసాలు లేవు, వెంట్రుకలు ఉంగరాలు తిరిగి ఉన్నవి. బూడిదరంగు కోటు వేసుకొని ఉన్నాడు.]

కృష్ణమూర్తి

[అపరిమిత మయిన విచారముతో]
తలుచుకొంటే హృదయము దహించుకు పోతున్నది! అనంతరావు పిచ్చివేషము! ఆమె కిటికీలో కూర్చుని ఉన్నది. నేను ఆమెకు ఎదురుగా కూర్చుని మాట్లాడుతూ ఉన్నాను. ఆమె నా వాక్యాలకు ఎంతో ఆనందము సూచిస్తూ ఉన్నది. మామగారికి ఇది తెలియదు. అటువంటి సందర్భములో వచ్చి వాడు నన్ను పిచ్చి కూత కూశాడు. అప్పుడు ఎంతో నిగ్రహముతో అక్కడ కూర్చో కలిగానో ఎవరికి తెలుసును? నా జీవితములో అదే ప్రథమ పరాభవము!

ఆచారి

వాడింత నీచుడని నాకు తెలియదు సుమా! అయినా ఈ విషయాలు తలచుకొన్నకొద్దీ హృదయవేదన తప్ప మరొకటి ఉండదు. ఎప్పుడయితే వాని దురంతాన్ని చెప్పినావో ఆక్షణమునుంచే వాడు నాకు మిత్రుడు కాడు!

కృష్ణమూర్తి

ఇంతకూ నాకు జ్ఞానము లేకపోయింది. వాడు పరమ నీచుడని భీమరాజు నాకు మొదటినుంచీ చెపుతూనే ఉన్నాడు. చెల్లెలిని ప్రేమిస్తున్నానని తెలిస్తే అడ్డపడతాడని అతను చెప్పనే చెప్పినాడు.

ఆచారి

ఏమి టేమిటి! ఇదంతా భీమరాజుకు చెప్పినావు? కొంప ముంచినావు! అనుకొన్నంతా అయింది!

కృష్ణ.

అతనిహృదయము ఎంతఆర్ద్రమయినదో నీ కేమి తెలుసును ?

ఆచారి

అతని హృదయార్ద్రతనుగురించి ప్రశ్నించడము లేదు. అతనినోటికి అడ్డూ అపూ లేదు. నీకు తెలుసునా ఆసంగతి ?

కృష్ణ.

పైకి ఎంతవాచాలుడుగా కనబడుతాడో అత నంతగంభీరుడు. అతనికి నామీాద ఎంతఅభిమానము ! ఎంత గౌరవము !

ఆచారి

అతను గౌరవించడని కాదు. అస లతనితో ఎందుకు చెప్పవలసి వచ్చింది ? అతనికీ, అనంతరావుకూ విరోధము. అందువల్ల వాళ్ళకుటుంబముమీాద అపవాదులు వేయడానికి అవకాశము కల్పించావు.

కృష్ణ.

ఎంతమాత్రమూ అతను అలా చేయడు. నీవు భయపడ నక్కఱ లేదు. వాండ్ల కుటుంబముమీాద అపవాదులు వేయడమంటే నామీాద అపవాదులు వేయడమని అతనికి తెలియకపోదు. అత నంత అజ్ఞాని కాదు, లౌక్యుడు.

ఆచారి

వాగుబోతును లౌక్యుడంటావు — సరే లే. కాని, అతని కెందుకు చెప్పవలసి వచ్చింది ?

కృష్ణ.

నేను చెప్పలేదు.

ఆచారి

అయితే అతని కెట్లా తెలిసింది ?

కృష్ణ.

తెలియక తప్పింది కాదు.

ఆచారి

మరి ఎలా తెలిసింది ?

కృష్ణ.

నీవు నాతో ఆమెనుగురించి ఆవేళ చెప్పి చదువుకోవడానికి రాజమండ్రము వెళ్ళిపోతివి. ఆమె ఎవరో నాకు తెలియదాయెను. భీమరాజుకు వాండ్లకుటుంబాన్ని గురించి తెలిసినట్లు మరొకరికి తెలి—

ఆచారి

[అర్థోక్తిలోనే] వెంటనే ప్రేమావేశము వల్ల అతనితో చెప్పినావు కాబోలు— ఆమెను ప్రేమిస్తున్నట్లు.

కృష్ణ.

లేదు, లేదు. అప్పు డేదో సందర్భము కల్పించి భావనారాయణగారి కుటుంబాన్ని గురించీ ఆమెనుగురించీ అడిగినాను. అత నేదో అప్రియము చెపుతాడని నిశ్చయించినాను. కాని అలా కాలేదు. ఆమె చాలా యోగ్యురాలనీ, చదువుకొన్నదనీ చెప్పినాడు.

ఆచారి.

అయితే ప్రియము చెప్పినాడుగదా అని చెప్పినావా ?

కృష్ణమూర్తి.

లేదు. ఆమెపేరు ఇందిరాంబట. అతనికి తెలియ లేదు నాఅభిప్రాయము.

ఆచారి.

అయితే ఇక చెప్పవలసిన అగత్య మేమి వచ్చింది ?

కృష్ణ.

తరువాత ఒకసందర్భములో భీమరాజు నావివాహప్రశంస చేసి, నాకోసరము పెండ్లి సంబంధాలు వెతుకుతున్నట్టు చెప్పి నాడు. అతను తలచుకొంటే ఎంతపని అయినా చేస్తాడు. ఇక పెండ్లి సంబం ధాలవాండ్ల గోల పడలేక నే నొకరిని ప్రేమిస్తున్నట్టూ, ఆమెను వివాహము చేసుకొంటాననీ చెప్పినాను. అప్పు డతను చాలా సంతోషించి కార్యసాధనకు తోడుపడుతా నంటే చెప్పినాను. ఈ విషయము తెలిసినప్పుడు అత నేమీ విపరీతముగా ఎంచలేదు.

ఆచారి.

సరే, బాగానే ఉన్నది. అతను ఉన్ముఖుడు కావడమూ మంచిదే. కాని అనంతరావుకూ నీకూ జరిగిన విషయము కూడా చెప్పినావా అతనితో ?

కృష్ణ.

చెప్పలేదు.

ఆచారి.

అతను బ్రహ్మచారి. ఇలాంటివిషయాలలో ఎంతో అనుభవము ఉన్నవాండ్లే తలకిందు లవుతారు.

కృష్ణ

అతను దాసీవాండ్లచేతనో, లేకపోతే నౌకర్ల చేతనో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుప మంటాడు. వాండ్ల ఇంటిసమీపములో ఇల్లు అద్దెకు తీసుకొంటే వీ లవుతుం దంటాడు. నా కేమి టంటే, భవిష్యద్భార్యకు నీచులద్వారా దూతికా కార్యాలు నడపడము ఇష్టము లేదు. అతను చెప్పేది కేవలము నాటుపద్ధతి.

ఆచారి.

సరే. ఇప్పుడు గత్యంతర మేమిటి ?

కృష్ణ.

అదే తోచడములేదు.

ఆచారి.

ఇలాంటి పరిస్థితులలో మరొకరి సలహాలకన్న స్వయముగా ఏదో ఒకపంథా తొక్కడము మంచిది. ఎందువల్లనంటే, మాబోటివాండ్లు స్వయముగా ఆపరిస్థితులు తెలుసుకొని ఉండకపోవడమువల్ల ఒకవేళ తప్పుగా సలహాఇస్తే కార్యహాని కావచ్చును. ఏ మంటావు?

కృష్ణమూర్తి.

నిజమే. కాని ఒకమాట. ఆమెచిన్న తమ్ముడు నీస్నేహితుడితో ఈవిషయము చెప్పి సహాయము చేయమని కోరితే? వితంతువివాహ మంటే అతనికి చాలా ఇష్టమనీ, పైగా అత నొకవితంతువును ప్రేమించి నాడనీ తెలిసింది. అందువల్ల బాధ గ్రహించి సహాయము చేస్తా డనుకొంటాను.

ఆచారి.

అతనితో ఈవిషయము ఎంతమాత్రమూ ప్రస్తావన చేయవద్దు. అతని ధోరణి కని పెట్టవలెననీ, ఒక వేళ అనంతరావు ఈ సంగతి చెపితే అతను చప్పున మనలను అపార్థము చేసుకోకుండా ఉండడానికీ ఇదంతా చెప్పినాను. ఆమెకూ, నీకూ వివాహము కాకపోతే దుఃఖించను. అతనితో ఈవిషయము చెప్పి ప్రయోజనము ఉండదు.

కృష్ణ.

[నిట్టూర్పు విడిచి కొంచెము సేపు ఊరుకొని] అతనివల్ల లాభిస్తుందేమో అనుకొన్నాను.

ఆచారి

అతని రహస్యాలు చెప్పడానికి వీలు లేదు.

కృష్ణ.

పోనీ, అతనివల్ల ఆమెను గురించిన విశేషాలయినా గ్రహించి నాకు చెప్పగలవా ?

ఆచారి

నాకు సమస్తమూ తెలుసును. నేను నీకావిషయములు చెపితే అతనికి మోసము చేసినట్టవుతుంది.

కృష్ణమూర్తి

అటువంటప్పుడు చెప్పగూడదు. నిజమే.

ఆచారి

ఆమె ఉన్నదనీ, యోగ్యురాలనీ చెప్పినాను. ఆమెను ప్రేమించినది నీవు. నీకు సహాయము చేస్తానని నేను ఎన్నడూ వాగ్దానము చేయలేదు. ఈసందర్భములో నీవు స్వయముగా ఒకపంథా తొక్కవలెనని అందుకే చెపుతున్నది—అతనిమనో వేదన చూస్తూ, అతను నన్ను అనేక విషయాలు నీతో చెప్పవద్దని బతిమాలుకొంటూ ఉంటే నీతో చెప్పడమెట్లా ? నాకు ఇద్దరిబాధయందూ సానుభూతి ఉంది.

కృష్ణమూర్తి

అతనికంటె నేను నీకు ఎక్కువవాణ్ణి కానా ?

ఆచారి

నిస్సందేహముగా. కాని నీకు బాగా లోకానుభవము ఉంది. అనేక ప్రకృతులను చూసినావు. నిగూఢవిషయాలనుకూడా గ్రహించగలవు, నీవు సమర్థుడవు. అతను పసివాడు, అసమర్థుడు. తల్లి బలహీనులయినబిడ్డలను ప్రేమించినంతగా బలవంతులను ప్రేమించదు. అంతే, వాండ్లపైన ప్రేమ ఉండకపోదు. ఎంతవరకు ప్రేమ అవసరమో అంతే ప్రేమ ఉంచుతుంది. నాది అలాంటిదే. అతని అభిప్రాయాలను నేను మన్నించవలసి వచ్చింది.

కృష్ణ.

[నిర్వేదముతో తలవంచి అరచేతిలో ముఖము పెట్టుకొని] నిజంగా నీవు ఉదాత్తుడవు !

ఆచారి.

[అతన్ని చూసి కొంచెము తొట్రుపాటు చెందుతాడు. గోడమీద ఉన్న గడియారము కేసి చూచి నిలుచుని] వెళుతున్నాను. ఒంటిగంటకు ఒకచోటికి వెళ్ళవలసిన పని ఉంది

కృష్ణ.

[యథాప్రకారముగా] ఊఁ,

[వెనకకు తిరిగి చూస్తూ నటిసింపచారి వెళ్ళిపోతాడు. రెండో వాకిటిలోనుంచి భీమరాజు వస్తాడు. కొంచెము లావు టి మనిషి. గుండ్రనిముఖము కొద్దిగా మీసగడ్డం. ఫ్రెంచి కైలిగడ్డము. చిన్నబొజ్జ. పొడుగాటి లాల్చి తొడుగుకొన్నాడు. చకచకా కృష్ణమూర్తి దగ్గరకు వచ్చి హడావడిగా]

భీమరాజు.

నమస్కారం ! ఖులాసాగా ఉన్నారా ?

కృష్ణ.

[ముఖము పైకెత్తి చూస్తాడు కాని మాట్లాడడు]

భీమరాజు.

ఏదో విచారముగా ఉన్నట్టున్నారే.

కృష్ణ.

[మెల్లిగా] ఏదో, మతి సరిగా లేదు ఎప్పుడు వచ్చారు ?

భీమ,

ఉదయము బండిలో. ఇక ఈ ఊళ్ళోనే ఉండడము. మనస్సు సరిగా లేదంటున్నారు. వెళ్ళుతాను. [అని లేవబోతాడు.]

కృష్ణ.

కూర్చోండి.

భీమ.

ఏదో చాలా విచారముగా ఉన్నారు. ఏమిటి దిగులు ?

కృష్ణ.

దిగులు పోయి చాలకాల మయింది. ఇప్పుడే వస్తాను. నే నీ మధ్య వ్రాసిన బొమ్మలు చూస్తూ ఉండండి. [అని వెళ్ళుతాడు. భీమరాజు గోడకు తగిలించి ఉన్న బొమ్మలు పరిశీలిస్తూ ఉంటాడు. కృష్ణమూర్తి మూడునిముషాలలో మళ్ళీ వస్తాడు. తల దువ్వుకొని మంచిచొక్కా తొడుక్కొని ఉన్నాడు.]

భీమ.

[నవ్వుతూ] ఏమి టీబొమ్మ ? బెంగాలీ చిత్తరువులను మించిపోయింది మహాశయా ! ఇదేమి కొత్తపంథా యేమిటి ?

కృష్ణమూర్తి.

నాకు తెలియనే తెలియదండి. ముఖము వ్రాయబోయేసరికి mood మారిపోయి ఉంటుంది.

భీమ.

చిత్తము, క్షమించండి. మీ moods మా కొంప మీ కొంప తీస్తున్నవి ! ఇప్పుడు ఏ mood లో ఉన్నారో చెప్పండి దయచేసి !

కృష్ణ.

ఇప్పుడు మతి మతిలోనే ఉన్నది.

భీమ.

చాలా చిక్కిపోయినారు. ఏమిటి ఇలా అయినారు !

కృష్ణ.

మనఃస్వాస్థ్యము లేదు. అయినా, నేను చిక్కిపోయినానా ?

భీమ.

చాలా !

కృష్ణ.

నాకు తెలియనే తెలియదు.

భీమ.

ఆబొమ్మకు పే రేమి పెట్టినారు ? పద్మములో స్త్రీవిగ్రహము. ఆమెముఖములో దైన్యము కనిపిస్తున్నదే. విరహిణా యేమిటి ? పద్మము నాయకుడిహృదయ పద్మమా ?

కృష్ణ.

అవును.

భీమ.

ఆచూపులో ప్రేమప్రపంచ మంతా చిత్రించారు. ధన్యులు పొండి !

కృష్ణ.

ఈబొమ్మ చూడండి [అని పటము చేతికిస్తాడు.]

భీమ.

[పటము తీసుకొని చూస్తూ] బుల్లివాడా! మేఘాలు పట్టుకో బోతున్నాడే ! ఈ పిల్ల పూలు కోస్తున్నది ! బాగున్నారండీ. ఎవరిపిల్లలు వీళ్ళు ?

కృష్ణ.

[అణచుకున్న సంతోషముతో]నాపిల్లలే!

భీమ.

[ఆశ్చర్యముతో] మీకు పిల్లలేమిటి !

కృష్ణ.

నాకు పిల్లలుండగూడదూ !

భీమ.

బాగుంది! ఆలు లేదు చూలు లేదు, కొడుకు పేరు సోమలింగం!

కృష్ణ.

లీలాశుకుడు !

భీమ.

ఎందుకు, వెర్రివాడితో వేళాకోళం ? ఎవరిపిల్లలో చెప్పుదురూ !

కృష్ణ.

[వేలితో గోడమీది పటమువంక చూపుతూ] ఆమెపిల్లలు !

భీమ.

ఏమిటి, ఇంత పరస్పరవిరుద్ధంగా మాట్లాడుతున్నారు! ఒకసారి మీపిల్లలన్నారు ! ఇప్పుడు ఆమె పిల్లలన్నారు. అయితే ఆమె యెవరండీ ?

కృష్ణ.

[ఊరుకొన్నాడు.]

భీమ.

ఎవరండీ ఆమె?

కృష్ణ.

తర్వాత చెపుతా లెండి.

భీమ.

[ఆలోచించి చిటిక వేసి] తెలిసింది లెండి ! [బిగ్గరగా] భావనారాయణ గారి కుమార్తె కాదూ ?

కృష్ణ.

[చేతితో వారిస్తూ] అరవకండి !

భీమ.

అవునో కాదో ముందు చెప్పండి !

కృష్ణ.

[చిరునవ్వుతో మెల్లిగా] అవును. మీతో చెప్పుదామనుకున్నాను : మీరే గ్రహించారు.

భీమ.

[కుర్చీలో చేరగిలబడి, కాళ్ళు బారజాపి] అయితే ఆఊహ ఇంకా విడిచిపెట్టలేదన్నమాట ! ఎన్నిరోజు లయిందండీ ! ఆహా, మీ ప్రేమ ఎంతగభీర మండీ !

కృష్ణ.

ఈజన్మలో ఆమె లభించో లభించకో నేను మృతి చెందవలసిందే కాని ఈ హృదయము అన్యాయత్వము మాత్రము కాదు!

భీమ.

నామాట విని ఈఅభిప్రాయము విడిచిపెట్టండి. లాభము లేదు.

కృష్ణ

ఈభౌతికశరీరము నశించిపోయినా సూక్ష్మశరీరము నాఇందిరనే కోరుతూ ఉంటుంది !

భీమ.

కోరి ఏమిప్రయోజనము! కోరిక కోరికలాగే ఉంటుంది. కార్యము నెరవేరవద్దూ మరి !

కృష్ణ.

ఎందుకు నెరవేరదు ?

భీమ.

ఏమి టీవెర్రిధైర్యం! నెరవేరడానికి అవకాశాలు ఏమి ఉన్నవో సెలవియ్యండి, చూస్తాను.

కృష్ణ.

[విచారముతో] ప్రస్తుతము కనబడకపోయినా ఎప్పటికి నెరవేరుతుం దని విశ్వాసము.

భీమ.

ఈవిశ్వాసాల కేమి లెండి ! ఇంతకూ ఆమెతో మాట్లాడి మీ అభిప్రాయము చెప్పారా ?

కృష్ణ.

మాట్లాడకపోతే ఏమి ?

భీమ.

ఆమె ఎలాంటిఅభిప్రాయముతో ఉన్నదో. ఈవిషయములో నా కెప్పుడూ ఒకసందేహము. అసలామె మిమ్మల్ని ప్రేమించడము లేదనుకుంటాను.

కృష్ణ.

నయం !

భీమ.

మీకు అప్రియమని ఇదివరదాకా అనలేదు. కండ్లకు పసిగర్లు కమ్మితే జగత్తు

పచ్చగా ఉంటుందట. ప్రేమోన్మాదికి కూడా అంతే. ఒకవేళ ఏదయినా సందేహము కలిగితే ఏదో విధముగా సమాధానము చెప్పుకుంటాడు.

కృష్ణ.

నాయికానాయకుల హృదయాలకు ప్రత్యేక భాష ఉంటుంది. అదివాళ్ళకే తెలుస్తుంది. ప్రఖ్యాతగ్రంధకర్తలందరూ-

భీమ.

మొదటినుంచీ మీతో ఇదే చిక్కు! ప్రతిదానికీ గ్రంధాలమాట ఎత్తుతారు. పుస్తకాలలో విషయాలకూ లోకవ్యవహారాలకూ చాలా తేడా ఉంటుంది. ఇంతకూ మీరిద్దరూ తెలుగులో మాట్లాడుకున్నా మరో భాషలో మాట్లాడుకున్నా కార్యసాధనానికి మార్గమేమిటి? ఏలా నెరవేరుతుం దనేది నా ప్రశ్న.

కృష్ణ.

ఆమె మనోగతము నాకు తెలుసు —

భీమ.

మీరు లక్ష చెప్పండి కోటి చెప్పండి, ఆమెతో మీరుముఖాముఖి సంభాషిస్తే నేకాని ఏసంగతీ తేలదు. ఆమె మిమ్మల్ని ప్రేమిస్తున్నదీ మీ రామెను ప్రేమిస్తున్నదీ అప్పటితో గాని బయట పడదు. మీ రనుకున్న దంతా సత్యమే అయితే వివాహానికి ఆవిడ మార్గము చూపక పోదు.

కృష్ణ.

నిజమే. ఒక్కసారి ముఖాముఖి మాట్లాడవలె. కాని అన్నదమ్ములుఎప్పుడూ కని పెట్టిఉంటున్నారు. వాళ్ళయింట్లో నేను అడుగు పెట్టడానికి వీలులేదాయె! అక్కడికిఎన్నివిధాలనో ప్రయత్నించాను. ఈ విషయములో మీ రేదైనా మార్గము చూడండి.

భీమ.

బాగానే ఉందండీ. మామార్గాలు మీకు పనికి రావుగా! మేము నాటు మనుషులము కాదూ మరీ!

కృష్ణ.

అబ్బ, చెపుదురూ!

భీమ

ఉత్తరము పంపిస్తే?

కృష్ణ.

ఉత్తరమా!

భీమ.

[ఎగతాళిగా] అవును లెండి! భవిష్యద్భార్యకు ఇతరులద్వారా ఉత్తరాలు పంపిస్తారా ఎక్కడనైనా!

కృష్ణ.

అబ్బ, మతి పోతున్న దండీ!

భీమ.

నామాట విని ఉత్తర మొకటి వ్రాయండి. ఇంతలోనే మీ గౌరవానికేమీ లోపము రాదు.

కృష్ణ.

ఉత్తరము పంపవలసిందే?

భీమ.

తప్పదు.

కృష్ణ.

ఎవరు తీసుకు వెళ్ళుతారు ?

భీమ.

నాచేతి కివ్వండి. ఇం కేమీ ప్రశ్న వెయ్యగూడదు. నాసిద్ధాంతము మీకు తెలిసిందేగా. ఇష్టమయితేనే నాసహాయము కోరండి. లేకపోతే మీదారి మీది !

కృష్ణ.

అబ్బా, మీచిత్తమువచ్చినట్టు చెయ్యండి! నాగౌరవము మీగౌరవము కాదా యేమిటి !

భీమ.

మీ రీమాత్రము మొగ్గితే ఎన్నాళ్ళ కిందటో ఈవ్యవహారము యావత్తూ తేల్చివేసే వాణ్ణే !

కృష్ణ.

అయిపోయినదానికి విచార మెందుకు.

భీమ.

[ఆలోచిస్తూ] అయితే ఆమె ఉత్తరానికి జవాబు ఇవ్వకపోతే ?

కృష్ణ.

ఎందుకు. మీ కాసంశయము వద్దు. తప్పకుండా సమాధానము ఇస్తుంది.

భీమ.

ఒకవేళ ఇవ్వకపోతే !

కృష్ణ.

ఇస్తుం దండీ !

భీమ.

పదిము రోజులు గడువు.

కృష్ణ.

ఓ ంచిత్తము. ప్రథమ సమావేశము లోనే వివాహముహూర్తము నిర్ణయ మవుతుందనే విశ్వాసము ! [గోడమీది గడియారము గంట కొడుతుంది]

భీమ.

[ఉత్సాహముతో] గంట కొట్టింది. జయమే ! వెంటనే ఉత్తరము వ్రాయండి !

[తెర]

తృతీయాంకము

*

[నల దాటినది. మొదటిఅంకములో చెప్పినఇంటిదక్షిణపువైపువరండా. ఎదురుగుండా ఆవరణలో చిన్నతోట. ఎదట పెద్దపున్నాగచెట్టుచుట్టూ బాగా పెరిగిన లతలూ, పూలమొక్కలూ ఉన్నవి. అక్కడ మనిషి నిలుచుంటే వరాండాలో ఉన్నవారికి కనపడదు. రాత్రి తొమ్మిది గంటలు. పండువెన్నెల. కృష్ణమూర్తి వీపుమీాదనుంచి జారుతున్న పట్టుత్తరీయము సవరించుకుంటూ మెల్లిగానూ ఒయ్యారముగానూ మెట్లు ఎక్కేసరికి కుర్చీలో కూర్చుని ఏమో ఆలోచిస్తున్న ఇందిరాంబ చప్పున ఎదటఉన్న మనిషిని చూచి ఉలికిపడి లేచి నిలుచున్నది. కృష్ణమూర్తి చిరునవ్వుతో ఆమెవంక చూచినాడు. ఆమె ముఖము పక్కకు వాల్చి ఊరుకున్నది. దగ్గరకు పోయి]

కృష్ణ.

[నెమ్మదిగా] ఇందూ ! [అన్నాడు]

ఇందిర.

[బెదరుచూపు చూచింది]

కృష్ణ.

చివరమాట ఏమిటి ?

ఇందిర

మావాళ్లు చూస్తే చాలా చిక్కు వస్తుంది ! ఇప్పుడు వచ్చారే !

కృష్ణ.

భయము లేదు. చిక్కు లనుకునేవి ఆటకాల ముండవు. వివాహ—

[ఇంతలో లోపల మనుష్యులమాటలు వినబడతవి. ఇందిర చాలా ఆత్రముతో లోపలికి చూస్తూ] మిమ్ములను మావాళ్లు చూస్తే నాకు చాలా చిక్కు వస్తుంది. ఉండండి. నేను మళ్లీ వస్తాను. [అని లోపలికి వెళ్లి వచ్చి] ఇటు రండి [అని తీగలచాటుకు తీసుకు వెళ్లుతుంది]

కృష్ణ.

రజ్జుసర్పభ్రాంతి అంటే ఇటువంటిదే. ఎవరు చూస్తే ఏమి చిక్కు వస్తుందోనని మనము అనుకుంటాము కాని ఎవరికీ మన సంగతి పట్టనే పట్టదు. చూడు, నీమనోవ్యథ వాళ్లెవరైనా గ్రహించగలిగినారా ? మీా నాయన అన్నలూ భార్యలతో కాపురము చేస్తూ నీకు కూడా అటువంటిసౌఖ్యము కావలసి ఉంటుంది అన్న పాపాన పోయినారా !

ఇందిర

వాళ్ళపైన మీరు ఆపాదించే నేరాలన్నిటికీ వాళ్లు కారు బాధ్యులు, సంఘము.

కృష్ణ.

పైగానా! మీనాయనగారు సంఘసంస్కర్త అని పెద్దపేరు! సంఘము ఏమి చేస్తుంది మీవాళ్లు ధైర్యము చేస్తే? సంఘము జీవము లేనిది. సంఘాన్ని నిర్ణయించిన ధర్మశాస్త్రజ్ఞులు మీరు వివాహము చేసుకోడానికి అంగీకరించినారు. స్త్రీలకు కించిత్తు అయినా స్వాతంత్ర్యము ఇవ్వని హిందూలాకూడా వితంతువివాహము అంగీకరించింది.

ఇందిర

మీరు చెప్పిన దంతా నిజమే. సంఘము ప్రాణము లేనిదని మీరు అనుకోనవచ్చును; కాని వ్యక్తులను పీల్చి పిప్పి చేస్తున్నది.

కృష్ణ.

ధీరు లయినవాండ్లు చూడు, విద్యాసాగరులు, వీరేశలింగముపంతులు ఏమిచేసెనారో!

ఇందిర.

ప్రతివాళ్లు విద్యాసాగరులు వీరేశలింగంపంతులు అవుతారా?

కృష్ణ.

భగవంతుడు నాకు శక్తి ఇచ్చినాడు. నేను ధీరుణ్ణి.

ఇందిర

మీరు ధీరులే, నేను కాలేను.

కృష్ణ.

నీవుకూడా ధీరురాల వవుతావు నిజముగా నన్ను ప్రేమించి ఉన్నట్లయితే, ఇందూ!

ఇందిర

నే నీప్రపంచములో ప్రేమించింది — అనుక్షణము స్మరించేదీ, మననముచేసేదీ - ధ్యానము చేసేదీ — నిద్ర పోతూకూడా కలలో దర్శనము చేసేదీ — ఈఒక్కరినే [అంటూ పుస్తకములో నుంచి బొమ్మకార్డు తీసి చూపుతుంది. ఆకార్డులో ఛాయాపటము కృష్ణమూర్తిది.]

కృష్ణ.

[ఆనందముతో ఇందిరను కౌగిలించుకొని, ముద్దుపెట్టుకో బోవుచున్నాడు]

ఇందిర

ఊరుకోండి [అని తప్పించుకొని తల వంచుకొంటుంది.]

కృష్ణ.

[ఆమెగడ్డము చేతితో మృదువుగా ఎత్తి] మన మిద్దరము ఒకటే !

ఇందిర

[సిగ్గుతో] మానసికంగా.

కృష్ణ.

అవును. ఇంతవరకూ మానసికంగా ఐక్య మయినాము. భౌతికముగాకూడా ఐక్యము కావలెననే సంకల్పముతోటే సమస్త విధులు త్యజించినాను. సమస్త

ధర్మములు అవసర మయ్యేటట్లయితే నీకోసము త్యజించనిశ్చయించుకున్నాను. నిష్కామభక్తి ఉత్తమమని తెలిసినప్పటికీ నీ నీనుంచి కామ్యభక్తిలోకి దిగినాను. అనుక్షణమూ భగవంతుని నీకోసమే భజిస్తున్నాను!

ఇందిర

మీరు స్వతంత్రులు, నేను కాను. నేను మానసికంగానే మిమ్ములను—

కృష్ణ.

నీవూ స్వతంత్రురాలవే. అంతా నీయిష్టములో ఉన్నది.

ఇందిర.

స్వాతంత్ర్యము లేక పోలేదు. కాని నాకున్న చిక్కులు మీకు లేవు—

కృష్ణ.

నీకు భయ మెక్కువ! ఈజీవి నీకోసము సమస్తము త్యజించినాడు. నీవు స్వీకరించ పోతే ఈజీవితము దుర్భర మవుతుంది!

ఇందిర

[అమిత మైనప్రేమతో ముఖాముఖి మూర్తిని చూస్తూ] మీకింత నిర్వేదము వద్దు! మీరు ప్రాజ్ఞులు, అన్నీ తెలిసినవారు.

కృష్ణ.

[దిగులుతో] అయితే?

ఇందిర

మీమనోవేదన నేనుగ్రహించక పోలేదు.

కృష్ణ.

నామనోవ్యథ గ్రహించగలిగితే క్షమించనివాళ్లయినా అనుగ్రహిస్తారు!

ఇందిర

అంతమాట అనకండి!

కృష్ణ.

నిజముగా అనుగ్రహమే. భగవదనుగ్రహముకంటె నీఅనుగ్రహము నాకు చాలాగొప్పది! ఈదుఃఖములోనుంచి లేవదీయగలది నీవుగాని భగవంతుడు కాడు!

ఇందిర

అయ్యో, అలా విచారపడకండి!

కృష్ణ.

విచారపడక నేను చేయగల దేమున్నది? ఇంతకూ నామనస్సు నీయందు లగ్నము ఎందుకు చేసుకున్నావు?

ఇందిర.

నిజమే. [కన్నీళ్లతో] నే నెంత దుఃఖము అనుభవిస్తున్నానో మీకేమి తెలుసును!

కృష్ణ.

దుఃఖకారకుణ్ణి నేనా?

ఇందిర

కారు, ఎంత మాత్రము కారు—

కృష్ణ.

అయితే మ రెవరు?

ఇందిర

నేను జన్మించడమే!

కృష్ణ.

ఎందువల్ల?

ఇందిర

నేను జన్మించడము వల్లనే ఒకరికి కాదు అనేకులకు దుఃఖము కల్పించి నేనూ దుఃఖ పడుతున్నాను.

కృష్ణ.

ఎలాగు ?

ఇందిర

నేను జన్మించినరోజు మొదలుకొని నేటి వరకు నాతో సంబంధము కలవా రందరికీ దుఃఖమే.

కృష్ణ.

ఏవిధంగా ?

ఇందిర

నేను పుట్టిన సంవత్సరమే మాతండ్రి గారికి అనేకకష్టాలు వచ్చినవి. శత్రువులు ఆయన్ని జయిలులో పెట్టించడానికి ప్రయత్నము చేసినారట. మాతల్లికి అపరిమిత మైనజబ్బుచేసి చచ్చిపోతుం దనుకున్నారట —

కృష్ణ.

మీతండ్రికి శత్రువులు లేని దెన్నడు ? పాపము, ఆయనను దుర్మార్గుడని దూషించనివా రెవరు ! మీతల్లి జబ్బుమనిషి. నీవు జన్మించడము కారణము కాదు.

ఇందిర

మిమ్ములను ప్రేమించి మీకు దుఃఖము కలిగిస్తున్నాను !

కృష్ణ.

ఎంతమాత్రము కాదు ! నాఉన్నతికీ నీవు ఆలంబన మయినావు. నీవు నాఅండను ఉంటే సర్వకళాప్రపంచము జయించగలశక్తి నాకు వస్తుంది.

ఇందిర

ఇందువల్లనే మీకు దుఃఖము కలిగించిన దాన నవుతున్నాను.

కృష్ణ.

వివాహ —

ఇందిర

నా కాఅదృష్టం లేదు ! అందువల్లనే మీకు తీరనిసంతాపము !

కృష్ణ.

అయితే నాప్రేమ అంతా నిరర్థక మై పోయింది ! నీవు నన్ను ప్రేమించినానని చెప్పడ మంతా కేవలము కృత్రిమ మని పిస్తున్నది !

ఇందిర

నాప్రేమ కృత్రిమమో సత్యమో భగవంతుడికి తెలియకపోదు. నాఅంతరాత్మకు తెలుసు.

కృష్ణ.

కేవలము సత్య మైతే, నీవు నాకోసము సమస్తబంధములు తెంచుకో !

ఇందిర

తెంచుకోలేకుండా ఉన్నాను ! నేను అశక్తురాలను ! మాతండ్రి నన్ను అందరుపుత్రులకన్నా, అందరుపుత్రికలకన్నా ఎక్కువగా ప్రేమించి నాసుఖమే తనసుఖముగాచూస్తున్నాడు. ఇకమాతల్లి విషయము చెప్పనక్కర లేదు. మాతండ్రి వృద్ధు. ఆయన్నిదూషించనివాళ్ళు లేరు. మాతండ్రి ఈఒక్కవిషయములోతప్ప

లోకథయము

మరేవిషయములలోనూ నాకు లోటు చేయలేదు. నేను ఆయన అభిమతము చెల్లించడమే పరమధర్మముగా పెట్టుకున్నాను. ఇలాఉండగా మిమ్ములను ప్రేమించినాను. తల్లిదండ్రులను వదలిపెట్టి వచ్చి తీరని అపకీర్తి కలిగించలేను. పైగా నాతమ్ములకు వివాహము కాలేదు. అహోరాత్రములు ఆలోచించినాను. నేను పుట్టినప్పటినుంచి నాతో సంబంధము ఉన్నఅందరికీ సుఖమే. మీకు దుఃఖము కలిగించ దలచుకున్నాను. నేనుమాత్రము సుఖం అనుభవిస్తాను.

కృష్ణ.

[ఇంతవరకూ తల వంచుకొని ఆలకిస్తూ ఉండి ఇప్పుడు తల ఎత్తి ఎఱ్ఱబడిన కండ్లతో] నీకు సుఖ మెలాగు?

ఇందిర

మీకు తెలియదు స్త్రీల సంగతి. స్త్రీలు తాము కామించిన పురుషుడు అలభ్యుడయినపుడు మానసికంగానే ఆ నాయకునితో దైహికసంబంధమంత ఆనందము అనుభవిస్తారు. పురుషులు, అలా చేయలేరు.

కృష్ణ.

అయితే —

ఇందిర

నేను మావాళ్ళకోసము నాదైహికసౌఖ్యములు త్యజించినాను. మిమ్ములను దుఃఖసముద్రములో ముంచుతున్నాను!

కృష్ణ.

వాళ్ళయందుండేప్రేమ నామీదిప్రేమకంటే ఎక్కువన్నమాట!

ఇందిర

ప్రేమను తూచడానికి వీలు లేదు.

కృష్ణ.

సరే, వెళుతున్నాను.

ఇందిర

ఒక్క మనవి.

కృష్ణ.

ఏమిటి?

ఇందిర

మీరు మరొకయువతిని వివాహము చేసుకోండి.

కృష్ణ.

అటువంటి మాట అనకు!

ఇందిర

మీఅండ నుండడానికి వీలు లేదు. వచ్చేజన్మలో మన ముభయులమూ ఏకమవుదాము! ఈజన్మలో మీరు మరొకస్త్రీని చేపట్టమని నాప్రార్థన.

కృష్ణ.

నీమాట ఇంకేదైనా వెంటనే శిరసావహిస్తాను.

ఇందిర

[బాధతో] అబ్బా!

కృష్ణ.

నీకు బుద్ధిమారి ధైర్యము వచ్చినప్పుడు నాకు తెలియజెయ్యి.

ఇందిర

నాఅంతదౌర్భాగ్యురాలు చతుర్దశభువనాలలో లేదు !

కృష్ణ.

[నాలు గడుగులు ముందుకు వేసి] ఇందూ, వెళుతున్నా! [అని వెనకకు తిరిగి చూచినాడు.]

ఇందిర

[చప్పున ముందరికి వెళ్ళి అతనిని కౌగిలించుకొని] మిమ్మలిని పోగొట్టుకొని ఎలా బతుకుతాను !

కంఠధ్వని

[లోపలినుంచి] అమ్మాయీ !

కృష్ణ.

[తొట్రుపాటుతో వెనకకు చూస్తూ వెళ్ళుతాడు]

ఇందిర

[చేతిలో పుస్తకము కిందికి జారవిడిచి] నాఅంత దురదృష్టవంతురాలు లేదు ! [అని చీరకొంగు ముఖానికి అడ్డము వేసుకొని చాలాసేపు రోదనము చేస్తుంది.]

[తెర]

*

సౌందర్య దేవత

కొమాండూరు
కృష్ణమాచార్యులు

పూర్ణవారాశి మధ్య విఘూర్ణమాన
రమ్యమంథాద్రి పీఠఘురట్టమైన
జరఠకమఠేశ్వరుని పృష్ఠచక్రమందు
జనని, సేవింతు భవదీయచరణయుగము.

జలధిపరిధాన వలయిత సకలధరణి
చక్రమంతయు జనని, నీజఘనతలము.
ధవళరంభాకురుట్కాండ తలములంచు
దేవి, భవదూరు యుగళంబు తేజరిల్లు.

సాగరావర్త గంభీర జలములందు
జనని, భవదీయనాభికా సరసి గాంతు.
ఆద్యము ననంత మగుగగనాంగణమున
దేవి, భవదీయమధ్యంబు తేజరిల్లు.
హిమనదాది మహాగిరీంద్రములయందు
తల్లి, భవదీయవక్షోజ తటము లుందు.
పూతగంగాపయఃపూర సైకతమున
అన్న మొసగుదు వీ ప్రాణితతుల కెల్ల.
సాంద్ర పుష్పఫలోపేత శాఖలందు
దేవి, భవదీయ భుజలతల్ తేజరిల్లు.
అరుణ పల్లవపాణి పుటాంతరముల
సముద శుకశారికా మయూరములు ప్రాలు.
సరసిజాసవరసపాన సముదమధుప
బృందఝుంకారముల పరభృతమయూర
మధురకూజితముల జగన్మాత, నీవు
విమల కంఠస్వరంబులు వినుచునుందు.
మధురమధుమాససమోత్సవాపదల బొదలు
తరుణసహకారపల్లవాంకురములందు
భవదధరరాగరసమహాప్రభలు మెరయు
అమ్మ, కనుగొందు విస్ఫారితాంబకముల.
చారుచంద్రాతపప్రభాజటిల మైన
విమలశారదశార్వరీసమయమందు
మధురజాతీలతాంతకుడ్మలములందు
అమ్మ, కనుగొందు నీదరహాసములు.
అమలచంపకసురభిళోద్యానవీధి
కల విహరించు చందనశైలవాత
పోతముల గాంతు భవదీయముఖసరోజ
దివ్యగంధపరంపరల్ భవ్యమూర్తి!
వికసితోత్పలవనరమ్యవీధులందు,
చటులశఫరోల్లసజ్జలాశయములందు
జనని, సౌహార్దమసృణవిశాలమైన
నీకటాక్షపరంపరల్ నెగడుచుందు.

శిల్పిద్వయము

ముక్కపాటి
నరసింహశాస్త్రి

౧

వారిద్దరూ స్నేహితులు. స్నేహితు లంటే లోకములో అనుకొన్నట్టు కాదు. కవల పిల్లలస్నేహము వంటిది వారిస్నేహము. అంతకంటేకూడా ఎక్కువదేమో. స్నేహమంటే ఇద్దరువ్యక్తులకు అని తోచక మానదు. ఇక్కడ వారిద్దరికీ శరీరములు భిన్నములయినా ఆత్మమట్టుకు ఒక్కటే. అర్ధనారీశ్వరావతారముతో ఉపమిస్తే వారిస్నేహస్వరూపము తెలుస్తుంది. ఒకరు దగ్గర లేనప్పుడు ఆలోటు రెండోవారిలో కనుపిస్తుంది. వారిద్దరూ కలిసిఉన్నప్పుడే స్వరంగస్ఫూర్తి వహించిన ఒక్కమనిషిలాగా కనబడుతారు. ఇద్దరికీ ఒకమోస్తరు కట్టూ, ఒకమోస్తరురూపూ, ఇద్దరికీ [illegible]వినా భావసంబంధమూ.

వారిద్దరూ కవలలు కారు, సహోదరులు కూడా కారు, ఆఖరుకు బంధువు లయినా కారు. ఇద్దరూ ఒకమాటు ఒక స్కూలులో కలుసుకోవడము సంభవించింది. [illegible] రెండు విత్తనాలు కొట్టుకొనివచ్చి ఒక్క అడవిలో ఒక్కచోట పడి, [illegible]ముంగా పెరిగినట్టు వారికుటుంబాలు ఎక్కడినుంచో చదువుకోసం [illegible] అంత [illegible] చేరినవి. ఇద్దరూ ఆస్కూలులో కలు[illegible] మొదలు వారికి స్నేహము ఏర్పడ్డది. ఆవేళావిశేషమో, జన్మాంతర సంబంధమో! వారిస్నేహము చూస్తే బడిలో తక్కిన పిల్లలందరికీ అసూయగా ఉండేది. మేష్టర్లకు కోపముగా ఉండేది. పిల్లలలో ఎవరితోటి అయినా పేచీ వస్తే వారిద్దరూ ఏకమయ్యేవారు, వారిద్దరూ ఏకమయినప్పుడు జయించడమంటే అంతచులకనగా ఉండేదికాదు తక్కినవాళ్లకు. తరగతిలో ఇద్దరూ ఒకచోట కూర్చునేవాళ్ళు. మేష్టరు ఒకరిని ప్రశ్న అడిగితే చటుక్కున రెండోవాడు చెప్పుతుండేవాడు. ఆయనకు కోపము వచ్చి రెండోవాణ్ణి నిలుచోమంటే మొదటివాడు నిలుచుండేవాడు, లేకపోతే ఇద్దరూ నిలుచుండేవాళ్ళు. ఇలా అల్లరి చేస్తూ ఉన్నారని తెలివితేటల కేమయినా తక్కువా? క్లాసులో ఏలా ఉన్నా పరీక్షలలో ఇద్దరూ మొదటితరగతిలో ప్యాసు అవుతుండేవాళ్ళు. మేష్టర్లకు ఆశ్చర్యముగా ఉండి వాళ్ళు కాపీ చేస్తున్నారేమో అని పట్టుకోవలెనని విశ్వప్రయత్నము చేసినారు. అసలు పరీక్షలలో ఎవరైనా కాపీ చేస్తారన్న సంగతే ఆపిల్లలకు తెలియదు.

వారికి ఎంతస్నేహమో స్వభావాలలో అంతతారతమ్యము ఉంది. సూర్య చంద్రాదుల కెంతతారతమ్య మున్నదో వారిలో అంత తారతమ్య మున్నది. శ్రీనివాసరావుకు చురుకుపాలు ఎక్కువ అశాంతి, తొందర, చంచలము: పాదరసము మోస్తరు. పనిలోనూ మాటలోనూ నడకలోనూ చదువులోనూ పరుగే. ఏది తలుచుకొంటే అది నిముషాలమీద అయిపోవాలి. అయ్యేదాకా అతనికీ దగ్గిరున్న వాళ్లకూ కూడా నిద్రాహారము లుండవు. పని చేస్తున్నకొద్దీ తొందర హెచ్చు. తొందర హెచ్చయినకొద్దీ పని ఎక్కువ చేస్తారు. పనిలో ఉన్న చురుకు మాటలోనూ. మాటపట్టింపు వచ్చి ఏదన్నా అంటే ఎదటివాళ్లు ఎందులోనైనా పడి చావవలసిందే. ఈ చురుకుకుతోడు కొంచెము సూగేకారముపాలు ఎక్కువ. కాని ఆకోపము నిలవ ఉండదు, ఒక్కమాటు చిచింద్రీలా చురచురలాడి తక్షణము పోతూఉంటుంది.

శ్రీనివాసరావుకు ఎంతదుడుకో శంకరరావుకు అంత శాంతము. శ్రీనివాసరావు హృదయములో రక్తము పర్వతఝరిలాగా ప్రవహిస్తూ ఉంటుంది. శంకరరావు హృదయములో రక్తము సైకతశ్రేణిపైన ప్రవహించే సెలయేరు వలె ఉంటుంది. శంకరరావు మాట్లాడితే అమృతము ఒలుకుతూ ఉంటుంది. కోపము వచ్చి ఎవరినైనా పడతిట్టినా తిట్లు పడేవాడి మనస్సుకు బాధ కలగదు. హృదయము ఎంతగంభీరమో గమన మంతమందము. శంకరరావుకు కోపము రాగా ఎప్పుడూ ఎవ్వరూ చూడ [illegible] మబ్బులయినా అడ్డు వచ్చినప్పుడు చంద్రకాంతిఅయినా మగురు పడుతుంది, [illegible]ని శంకరరావు ముఖములో హాసచంద్రికలుమాత్రము ఎప్పుడూ మరుగు పోవి కావు. శ్రీనివాసరావు కుర్రాళ్ళతో పేచీలుపడి వస్తే శంకరరావు వాళ్ళందరను [illegible] తియ్యనిమాటలు చెప్పి పంపించేవాడు. శ్రీనివాసరావు రాజసుడు, శంకరరావు సత్వమూర్తి.

ఇద్దరికీ చక్కదనము అంటే అభిమానము ఎక్కువ. సౌందర్యవిహీన మయిన వస్తువుకానీ మనిషికానీ కనబడితే అక్కడ నిలవబడలేకపొయ్యేవాడు. అది గర్వము కాదు, పుట్టుకతో వచ్చిన స్వభావము. వాళ్ళేమి చేయగలరు? ఒక్కసారి అమిత అందవికారి అయిన మేష్టరు వారిక్లాసుకు వస్తే ఇద్దరూ ఆ క్లాసుకు వెళ్ళడము మానివేసినారు. హెడ్ మేష్టరుచేత రోజూ దెబ్బలు అయినా తినేవారు కాని ఆ క్లాసులో కూర్చునేవారు కారు. ఇద్దరిహృదయాలూ అతికోమలములు. తమకు కాదుకదా ఎవరికి ఏ బాధ వచ్చినా సహించలేకపొయ్యేవారు. కోమలమే కాకుండా అతివిశాలము. వారి చిన్నహృదయాలలోనే ప్రపంచమంతా ఇమిడిఉండేది. భావాలు అతిఉన్నతములు. నీచోద్దేశాలు చిన్నఊహాలు ఎప్పుడూ వారిమనస్సులో ప్రవేశించి మలినపరచలేదు. అటువంటి ఉద్దేశాలూ ఊహాలూ ప్రపంచములో ఉంటవని

కూడా వా రెరుగరు. పుట్టినప్పుడు ఏఅమాయికత్వముతో పుట్టినారో ఆ అమాయికత్వము వారితోపాటు పెరుగుతూ వచ్చింది కాని జ్ఞానము రాగానే వారిని విడిచిపెట్టలేదు. బాగాఎరిగిన వాళ్ళకు,ఇంకొకలోకములోఉండవలసినపిల్లలుపొరపాటునఈలోకములోపడ్డట్టు ఉండేది, కాని ఈలోకములో పుట్టి ఈఅన్నము తింటూ పెరిగిన పిల్లలు లాగాఉండేదికాదు రెండుసూర్యకిరణాలోచంద్రకిరణాలోపొరపాటునఆకాశమునుంచి జారిపడిన వనుపించేది వాళ్ళను చూస్తే. శ్రీనివాసరావు కూర్చోడము నేర్చుకొన్నప్పటినుంచీ పెన్సలుతోటో, సుద్దతోటో అస్తమానము గీట్లూ గీస్తూ ఉండేవాడు. నాలుగైదు ఏళ్ళు వచ్చేసరికి ఆగీట్లకు ఒకస్వరూపము ఏర్పడ్డది. బడిలో చదువుకోవడము ఆరంభించేసరికి చక్కనిబొమ్మలు గీస్తూఉండేవాడు. బొమ్మగీయడమంటే అతనికి కలిగేఉత్సాహము ఇంతా అంతా కాదు. నిద్రాహారములుకూడా అక్కరలేకపోయేవి. ఇదే అతనికి కాలక్షేపము. లేకపోతే యేపుస్తకమో పుచ్చుకుని ఎవరితోటీ మాట్లాడకుండా ఏమూలో కూర్చుండేవాడు. అదీ కాకపోతే ఏచెట్లకేసో, ఏపక్షులకేసో, పశువులకేసో దారేపోయేమనుష్యులకేసో, తదేకదీక్షతో చూస్తూ కూర్చునేవాడు. శంకరరావు ఏడాది వెళ్ళినప్పటినుంచీ సంగీతము వినబడేటప్పటికి అక్కడ జేరేవాడు. ఎంత ఏడుస్తూ ఉన్నాసరే, ఎంతకోపము వచ్చినాసరే సంగీతము వినబడే సరికి కోపము మరచిపోయి ఏడుపుచాలించి నిశ్చలంగా వింటూ కూర్చునేవాడు. తల్లి జోలపాట పాడనిదే ఎప్పుడూ నిద్రపోయ్యేవాడు కాడు. మాటలు నేర్చినప్పటినుంచీ ఏపుస్తకమో దగ్గిరపెట్టుకొని అస్తమానమూ చదువుతూ ఉండేవాడు. నాల్గుపంక్తులు వ్రాయనేర్చేటప్పటికి కొద్దితప్పులతో అది పద్యప్రాయంగా ఉండేది. క్రమేణ పద్యము చెప్పడమంటే అతనికి ఉండేసరదా ఇంతా అంతా కాదు. కోపము వచ్చినా పద్యమే. సంతోషమువచ్చినా పద్యమే. ఏడుపు వచ్చినాపద్యమే తిట్టినాపద్యమే. శ్రీనివాసరావూ శంకరరావూ క్లాసులో కూర్చుని పాఠమువినడము ఇష్టము లేకపోతే గురువుగారి బొమ్మ వికృతాకారముగా ఉండేటట్టు గీయడము అతనిపని. ఆయన్ను హేళనము చేస్తూ పద్యములు వ్రాయడము రెండోవారిపని. పిల్లలకు వాళ్ళిద్దరితోటీ తగాదా పడడమంటే హడలుగా ఉండేది. ఏమిబొమ్మలు వ్రాస్తారో-ఏమిపద్యాలు చెబుతారో ! అని భయపడేవాళ్ళు పిల్లలు.

౨

వాళ్ళకు తెలియకుండానే చూస్తూ ఉండగానే కొన్నిసంవత్సరములు గడిచినవి. చాలామందిజీవితాలలో చాలామార్పులు వచ్చినవనీ ప్రపంచమంతా కష్టమయమనీ, కాలమానము బాగుంది కాదనీ, ప్రజలు చెప్పుకోవడము మొదలుపెట్టినారు.

ఈస్నేహితు లిద్దరికీమాత్రము ఆమార్పు లేమీ అనుభవములోకి రాలేదు. సంవత్స
రానికి ఆరుఋతువు లున్నవని ఎక్కడో కావ్యాలలో చదువుకోవటమే కాని వాళ్ళకు
ఎప్పుడూ వసంతముగానే ఉండేది. కొత్తగా వికసించిన కుసుమముల సౌరభము
ఎప్పుడూ వారినాసికాపుటములకు తగులుతూ ఉండేది. దివ్యమూ, గంభీరమూ, అప
రిచితమూ, అయినవిశ్వగానము ఎప్పుడూ వారిశ్రవణకుహరములలో మారు మ్రోగు
తూ ఉండేది. వర్ణనాతీతము లయినవర్ణములూ, అపూర్వము లయినసౌందర్యము
లూ, ప్రకృతిలో వారికళ్ళ కెప్పుడూ గోచరిస్తూ ఉండేవి. అననుభూతములు, ఇంద్రి
యాతీతములూ, అపూర్వశోభాయుతములూ బ్రహ్మానందదాయకములూ అయినదృ
శ్యములు వారిమానసాకాశమున శరత్కాలమేఘములులాగా పరుగుపెడుతూ ఉం
డేవి. ఇవన్నీ స్వప్నములా అని సందేహము కలిగేది స్వప్నములకు విలక్షణమయిన
ఒకానొక ఆనందము, జాగ్రదవస్థలోకూడా ఉండడముచేత ఇవి స్వప్నములు కాజా
లవని నిశ్చయించుకొన్నారు వాళ్ళు. అయితే ఆదృశ్యముల స్వభావము ఏమిటో
వాటిభావ మేమిటో తెలిసికోవలెనని ప్రయత్నము చేసినారు. ఏగురువుల నడిగినా,
వీరిప్రశ్నలే వారికి బోధపడేవి కావు. ఎప్పటికైనా వాటిభావము తామే తెలుసు
కోవలెనని నిశ్చయము చేసుకొన్నారు. జ్ఞాపకము ఉన్నంతవరకూ ఆదృశ్యములు
చక్కని వర్ణములతో శ్రీనివాసరావు చిత్రించడానికి ప్రయత్నంచేసేవాడు, మృదు
మధురవాక్కులతో వాటిని వర్ణించవలెనని శంకరరావు ప్రయత్నిస్తుండేవాడు.

ఈ ఎండమావులను అనుసరించడములో మరికొన్నిసంవత్సరాలు నిముషాల్లా
ఋనవి. ఇద్దరికీ నిండుయౌవనము వచ్చింది. కళలలో సర్వతోముఖ మైన
గడిచిపో[illegible] సంపాదించినారు. ఈ అజ్ఞాతసుఖములను వెదకడములో, ఈ పాండితీ
కౌశలము [illegible] పోయినది. మానసాకాశము మేఘావృత [illegible]
సంపాదనలో [illegible] కొంత దన్ని[illegible]
నది. వెనకటిదృశ్యములు వెనకంటనవి. జీవితముల ఆనందము తగ్గింది. ఒకవిధ
మయిన అశాంతి బయలుదేరింది. తగినంతకారణము కనుపించదు. సరిఅయిన ఉప
శాంతి లేకపోయింది. వెనకటి ఆనందము కోరి తెచ్చుకొన్నదీ కాదు. ఇప్పటి
అశాంతి వారిలోపమువల్ల వచ్చిందీ కాదు. కాని ఇన్నిసంవత్సరములకు వసంత
ఋతువు పోయి వర్షఋతువు వచ్చింది — మళ్ళీ మధ్య హేమంతమూ శిశిరమూ
లేకుండా శరత్కాలము తరువాత వసంతము వస్తుందేమో !

3

నడివర్షాకాలము. శ్రావణమాసము. ఆసంవత్సరము గోదావరీపుష్కరము.
వర్షములు అఖండముగా కురిసి పుష్కరానికి కొంచెము తెరపి ఇచ్చినది. గోదా

వరి పొంగి పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తున్నది. రాజమహేంద్రవరములో ఎక్కడా అడుగు పెట్టడానికి శక్యము కాకుండా పుష్కరానికి వచ్చిన జనము కిక్కిరిసి ఉన్నారు. పుష్కరము ఏడురోజులు గడిచిపోయినవి. వచ్చినజనము కొంతమంది తిరుగుముఖము పెట్టినారు. సాయంకాలము అయిదుగంట లవుతుంది. శ్రీనివాసరావూ శంకరరావూ బజారులోకి షికారు వచ్చినారు. అక్కడి జనసమూహాన్ని దుకాణాలను చూస్తూ నెమ్మదిగా దారివెంట వెళుతూ హఠాత్తుగా ఇద్దరూ ఒక బొమ్మలదుకాణముదగ్గిర ఎవరో బలవంతాన పట్టుకొని ఆపినట్టు ఎవరిమట్టుకు వారు నిలవబడిపోయినారు. నిర్హేతుకముగా హృదయములో ఆందోళన బయలుదేరింది. చిరకాలముకిందట పోయిన వస్తు వేదో తలవనితలంపుగా కనపడినట్టు ఇద్దరూ ఒక్కమాటుగా దుకాణముకేసి చూచినారు. నిద్రలో నడిచినట్టు ఇంతజనసమూహాన్ని మరిచిపోయి నాల్గు అడుగులు ముందుకు వేసినారు.

దుకాణముదగ్గిర అనేకులు బొమ్మలు కొనుక్కొంటున్నారు. వారిమధ్య అనుపమలావణ్యవతి అయిన యువతికూడా బొమ్మలు కొంటూ ఉంది. ఆమెసౌందర్య మామెదే. సుమారు పద్ధెనిమిదిసంవత్సరము లుంటవి. నవసమోదముమయిన యౌవనమునకుతోడు సౌందర్యరాశిననే అవ్యక్తగర్వముతోనూ, చుట్టూ ఉన్న జనసమూహము ఎదుట ఉన్న బొమ్మలసముదాయము చూచుటవలన కలిగిన ఆనందముతోనూ ఆమె విశాలనేత్రములు తాండవిస్తున్నవి. ఆమెకు రోజాపుష్పమునందున్న నాజూకు సౌకుమార్యమూ కొంచెము తక్కువగా కనుపించినా, పా[illegible]యములను ఆకర్షింపజాలిన బంతిపువ్వులలోని నిండు, కాంతీ ఉన్నవి. ఆమె [illegible]త్యము పారిజాతసౌరభమువలె ఇంద్రియములను మెల్లిగా లాగించి దివ్యలోకమును స్ఫురింపజేయలేకపోయినా, సంపెంగిసువాసనవలె తీక్ష్ణమయి తల కెక్కి మతిభ్రమణము కలుగజేస్తుంది; ద్రాక్షారసమువలె రసనకు రుచికరముగా ఉండి శరీరమును పులకాంకితముచేయక, మద్యమువలె తీక్ష్ణమయి ఇంద్రియములను వశముచేసుకొంటుంది.

శంకరరావు హృదయములో ఆందోళన బయలుదేరినది. ఇన్నిదినాలనుంచీ ఉన్నమాంద్యము ఒక్కసారి సూర్యదర్శనము కాగానే మంచుతెరవలె తొలగిపోయింది. భావతరంగములు ఒకదాని నొకటి తరుముకొని వస్తున్నవి. అతనిదృష్టి ఎదురనున్నవాటి నతిక్రమించిపోయింది. ముఖమునకు వింత తేజస్సు వచ్చినది. నిర్దుష్టమైన ఆయువతి మానవరూపము అతని మనోవీధిలో ఇంతకన్నను లావణ్యవతి తేజస్విని అయిన ఇంకొక దివ్యస్వరూపమును స్ఫురింపచేసినది. స్వప్నములోవలె తోచిన ఆవిగ్రహమును హృదయస్థము చేసుకుంటున్నట్లు బాహ్యప్రపంచము మనోగోచరము కాకుండా కన్నులు మూసుకున్నాడు. పెదవులు కదలడము మొదలుపెట్టినవి.

మందాకినీ ప్రవాహమువలె అప్రయత్నముగా మెల్లగా స్వచ్ఛముగా ప్రవహిస్తున్న కవితాప్రవాహముతో ఈనూతన హృదయాధిష్ఠానదేవతను స్తోత్రముచేయడము ప్రారంభించినాడు. శ్రీనివాసరావుకు ఒళ్ళు తెలియలేదు. జ్వరమువచ్చిన వానివలె కండ్లు ఎర్రబడినవి ఒళ్ళు కాగడము మొదలుపెట్టినది. జేబులోనుంచి పెన్సిలు Sketch-Book తీసి ఆయువతి రూపమును వ్రాయడము ప్రారంభించినాడు. పక్కను తనస్నేహితుని, చుట్టుపక్కల ఉన్న జనాన్ని మరిచిపోయి గబగబ బొమ్మలిరువాత బొమ్మ వ్రాసినాడు. చిత్రమని పదిమంది శ్రీనివాసరావుపక్కన చేరినారు. ఈపదిమంది ఎందుకు చేరినారోఅని కారణము తెలియక ఇంకాకొంతమందీ వీళ్ళను చూసి మరికొంతమందీ చేరి పెద్దజనసమూహము ఏర్పడినది.

ఇంతలోనే ఆయువతి తనకు కావలసిన బొమ్మలు కొనుక్కొని ఇంటికి పోవలెనని వెనుకకు మళ్ళినది. చుట్టూఉన్నజనసమూహమును చూచినది. పరధ్యానముగా నిద్రలోవలె మాట్లాడుతున్నశంకరరావును చూచినది. యంత్రమువలె గబగబ బొమ్మలు గీస్తున్న శ్రీనివాసరావును చూచినది. గొడుగులు ముందుకు వేసి అందరి ... గా బొమ్మకేసి చూచినది. బొమ్మరూపము తనదేనని గ్రహించి అట్టే సిగ్గు ... పోయినది. సిగ్గుచేత ముఖము ఎర్రబారినది. ఏమి చేయడానికీ తోచలేదు, వల తా... ... దుకు సాగలేదు. వ్యాకుల భావముతో పులకిత అయి తలవంచుకొని కుడి నిలబ... ... గము శ్రీనివాసరావును మరింత వ్యామోహపెట్టినది. అంతకంతకు అడుగు ప ... ... తో ఈరూపమునుకూడా చిత్రించినాడు. నిలబడ్డది. ఈ ...

హెచ్చుతున్న ... లో తెలివి తెచ్చుకొని ఆ యువతి జనసమూహములోనుంచి రెండునిముషా ... వింతఆనందము తోచినది. అడుగు అడుగుకు వెళ్ళిపోయినది. ఎప్పుడూ ఎరుగని ... ని తిరిగి చూసూ ... ఆ అపరిచితుడయిన చిత్రకారుడు వెనుక వస్తున్నా... ఎప్పుడూ అనుభవించి ఉన్నది. ఇటువంటి అనుభవము ఆమె స్వల్పజీవితములో ఎప్పుడూ అనుభవించి ఉండలేదు. అపరిచితుడు కులీనుడు చక్కనివాడూ, అయిన ఒక యువకుడు తన్ను చూసి మోహించి తన చిత్రములను వ్రాసినాడనే జ్ఞానము ఆమెకు మితిలేని ఆనందము కలిగించినది. ఇంటికి చేరేవరకూ ఆమె పాదములు తేలిపోతూ గాలిలో ఎగిరిపోతున్నట్టు ఉన్నవి. ఇంటిదగ్గరకూడా ఆమెకు ఒకచోట నిలవబుద్ధి పుట్టలేదు. భోజనము చేయలేకపోయినది. కంటికి నిద్ర రాలేదు. ఎప్పుడూ ఆ బొమ్మల దుకాణము చుట్టూ పెద్దజనసమూహముమధ్యనిలబడిబొమ్మవ్రాస్తున్న శ్రీనివాసరావు కళ్ళకు కట్టినట్టుకనబడుతూఉండేది. ఆయువకు డెవ్వరో ఆయన పక్కను ఉన్నఆయ నెవరో, వారెప్పుడయినా మళ్ళీ కనబడతారో కనబడరో తననివాసము తెలుసుకోవలెనని ప్రయత్నము చేస్తారో! తనకోసరము వారెందుకు అంత శ్రమపడతారు! తనబోటి

౧౯

వాళ్ళను, తనకంటే చక్కనివాళ్ళను ఎంతమందిని చూసిఉండరు ? ఇవన్నీ ఇంక మరిచిపోవలిసిందేనా ? మరిచిపోబుద్ధి కావడము లేదే ! ఈమాత్రముకు ఈశ్వరుడు వారి నెందుకు చూపించవలె ? ఏవో రెండుకర్రముక్కలు ఎక్కడినుంచో ప్రవాహములో కొట్టుకొని వచ్చి ఒక్కక్షణము కలుసుకొని మళ్లీ ఎక్కడికో కొట్టుకొనిపోయినట్టు తనదారిని తనూ వారిదారిని వారూ పోవలసినదే కాబోలు ! కాని ఈజీవితములో ఈక్షణము ఒక్కటీమట్టుకు మరుపురాదు.

౪

ఇంతకాలమునుంచీ శ్రీనివాసరావునూ శంకరరావునూ ఆవహించినమాంద్యము తొలగిపోయినది. వాళ్ళజీవితములో తిరిగీ వసంతఋతువు ప్రారంభించినది. వాయువులో ఎక్కడ తిరిగినా నూతనసౌరభము, ఎటు విన్నా నూత్నగానము, ఎటు చూచినా నూత్నదృశ్యము ! జీవితము పూర్వమువలె ఉండడము మొదలుపెట్టినది. మధ్య నొకసారి నిద్రపోయి లేచినట్టుగా ఉన్నది. శంకరరావు కవితా గట్లనతిక్రమించి ప్రవహిస్తున్నది. శ్రీనివాసరావు వ్రాసే చిత్రములకు ప్రతిప్రదర్శనములోనూ అతను వ్రాసిన బొమ్మలకే మొదటి బహు మే.

మేఘావృత మయిన తనజీవితములో మెరపువలె ప్రవేశి యిన ఆ తేజస్విని ఎవరో తెలుసుకొని ఆమె సాన్నిధ్యములో ఉంటేనేకాని ము దుర్భరము అని స్నేహితు లిద్దరకూ తోచినది. ఒక్కసారి ఆమె సబడినంతమాత్రానే ఇంతటి ఆనందము, ఇంతఆవేశము కలిగి సిత్యమూ ఆమె సన్నిధానమందు వర్తిస్తుంటే ఎ ఉంటుందో ? లేకపోతే ఒక్కక్షణములోని ఆనందము ఎంతకాలము నిలుస్తుంది. ఎలాఅయినా ఆమెనివాసము తెలుసుకొని ఆమెసన్నిధానము చేరవలెను. లేదా తమచిత్రలేఖనమూ కవిత్వమూ ఇంతటితో వదిలిపెట్టి దేశాంతరము అయినా పోవలెనని దృఢసంకల్పముతో బయలుదేరినారు. కాని ఈప్రయత్నము వారికీ ఒక్కొక్కప్పుడు హాస్యాస్పదముగా తోచేది. ఒక్కసారి పుష్కరములో కనబడిన ముఖము కోసరము ఎక్కడని వెతకడము ? కలలో కనబడినవస్తువు జాగ్రదవస్థలో వెతకబోతే ఎక్కడ దొరుకుతుంది ? పురాణాలలోను ప్రబంధాలలోనూ దొరుకుతుందేమో కాని సామాన్య మానవజీవితములో అట్టిది దుర్లభము. అలాగని ఈ అద్వితీయానందదాయకమయినవస్తువును దొరకదనే భీతితో అప్రయత్నముగా విడిచిపెట్టడము ఏలాగు ? ఆమె కేవలము స్వప్నములోవస్తువు కాదు కదా ! కళ్ళఎదుట కనుపించింది కదా ! ఎక్కడనో ఒకచోట ఉండి తీరవలెను. కాని ఆకాశమునీదికి ఎగిరిపోదు

గదా! చిరకాలము పట్టవచ్చును, అధికప్రయాస కలిగించవచ్చును. అయితేమట్టుకు దృఢసంకల్పము ఉంటే ఏది అసాధ్యము? అందులో కేవలము స్వర్గానికి దారి చూపించగలిగిన ఆనందస్వరూపిణి మనలక్ష్యము అయినప్పుడు ప్రయత్నలోపము ఎవరు చేస్తారు?

నిండుయౌవనము. శక్తికి మించిన కార్యము ఉంటుందని గణనచేయని వయస్సు. నిద్రావస్థలో ఉండి ఒకదివ్యస్వప్నము కని హఠాత్తుగా మేల్కొనగానే కలిగిన ఆనందపారవశ్యముచేత వచ్చినఆవేశము. భావిజీవితానికంతా ఆధారమయిన దేవతాస్వరూపిణి లక్ష్యము. వీరిప్రయత్నము ఇంక ఎందుకు కొనసాగదు? పట్టణాలూ, పల్లెలూ గాలించినారు. ఒకనాడు తెల్లవారేసరికి ఒకగ్రామము చేరినారు. ఉదయభామిని అరుణకిరణాలలో ఒంటి నంటుకొనిపోయిన సన్నని గులాబిచీరె కట్టుకొని చెరువులో నీళ్లు బిందెతో ముంచుకొని విలాసముగా బిందె బుజాన పెట్టుకొని దూరాన్నించి వస్తున్న యువకులకేసి విస్ఫారితనేత్రములతో చూస్తూ నిలబడి ఉన్నది వారిలక్ష్యము. వారిప్రయత్నము సఫలమయినది. ఆమె స్వప్నము మూర్తీభవించింది అనుకొన్నది.
[illegible]లు వారికేసి [illegible] చూసి ముద్దులొలికే హంసగమనముతో ఇంటికి

[illegible]నిస్తు[illegible] శ్రీనివాసరావు కొంతకాలము ఆ గ్రామములో మకాము చేసి
[illegible]లములందూ దేవతాదర్శనము చేసినట్టు ఆమెదర్శనము చేస్తూ
నారు [illegible] ప్రసాదమువల్ల సమస్తసుఖములూ అనుభవించినట్టు ఆమెదర్శ
ఉండే [illegible] అనుభవిస్తుండేవాళ్ళు. నిరంతరము ఆమెను ధ్యానిస్తూ
నమువల్ల [illegible] ఆమెకటాక్ష వీక్షణములచేత వారి
తమ కార్యములలో నిమగ్నులయిఉం[illegible]
కృతులకు దేశమంతటా ప్రఖ్యాతి వచ్చింది.

౫

స్వప్నప్రాయముగా కాలము గడిచిపోతూఉన్నది. వీరి కావేశము ఏమాత్రమూ తగ్గలేదు. ఆమెను చూసినకొద్దీ ఇంకా చూడవలెననే బుద్ధి. చూడడముతో తనివి తీరక ఆమెసన్నిధానమందే ఎప్పుడూ ఉండవలెననే కోరిక. దగ్గర ఉన్నప్పుడు ఆమెను తమస్వాధీనము చేసుకోవలెననే కామము కలుగజొచ్చినది. ఎడారిలో దాహము కాకుండా ఉండవలెనే కాని దాహమయినప్పుడు ఒక్కచుక్కతో తృష్ణ తీరదు. ఏఅమృతసరస్సులోనో మునిగి కడుపునిండా నీళ్ళు తాగవలసినదే. అలాగే సత్యవతిని స్వాయత్తము చేసుకొంటేనే కాని ఉపాసనాసిద్ధి కాదనుకొన్నారు. అందుకోసరము వశీకరణతంత్రమును ప్రయోగించ మొదలుపెట్టినారు.

తను వ్రాసినచిత్తరువులపైన తనకే అసహ్యము తోచినది. కొన్నిటిని ముక్కలు ముక్కలుగా చింపి పారవేసినాడు. తనుఉపాసించినదేవత దయ్యముగా మారినది. అంతకంతకు హృదయములో వేదన హెచ్చిపోయినది. సత్యము ఎదుట పడితే సహించ లేకపోయ్యేవాడు. తననాశమునకు కారణ మామే అని భావించినాడు.

పాపము, ఆమె ఏమి చేయగలదు ? ఆమెను అని ఏమి ప్రయోజనము ? అనాగరకపుపడుచు, పల్లెటూళ్ళో పుట్టి పెరిగినది. పట్నవాసపు పద్ధతులూ, నాగరీకుల ఊహాలూ ఆమె కేమి తెలుస్తవి ? అడవిలో పుట్టి పెరిగిన పూల మొక్కను ఉద్యానవనములో పెంచడానికి తొట్టిలో పెడితే ఏమంత అందముగా ఉంటుంది ? ఆమె తనవల్ల ఏవిధమయినలోటూ రాకుండా ఉండవలెననే ప్రయత్నము చేసినది. తనగ్రామములో కెల్ల తనే చక్కనిపిల్ల. స్థితిమంతుగారాలు. చదువని విద్యావతి. వీటి నన్నిటిని మించి నవమన్మథులయిన యువకు లిద్దరూ నాగరికాగ్రేసరులు తన్ను వరించినారు. ఇంక ఆమె కహంకారము కలిగిందంటే ఆమెతప్పా !

శంకరరావును తను పూర్తిగా వశము చేసుకోలేక పోయినది అది కాకుండా శ్రీనివాసరావు అస్తమానము తనబొమ్మలు గీస్తూంటే ఒకవిధమయిన ఆనందము కలగ జేసినది అందుచేత శ్రీనివాసరావును వివాహము చేసుకొన్నది. అతన్ని సంతోష పెట్టవలె నని శాయశక్తులా తంటాలు పడ్డది. కాని కొలదికాలములోనే తాను విఫల మనోరథ అయినట్లు తెలుసుకొన్నది. ఏమి చేయగలదు? వరిచేలలలో ఉండే నవనవ జనపచేలలో ఉండే వాసన బంతిపూలలో ఉండేనిండే కాని నాగరికుల కిష్టమయిన శేఫాలీసౌరభము మల్లెపూవుసౌకుమార్యము తనలో తీసుకు రాలేకపోయినది. అది ఆమెలోపము ఎట్లా అవుతుంది? తన భర్త తన్ను ప్రేమించడము లేదని తెలుసు కొన్నది. ఆమధ్య వ్రాసినచిత్తరువు లన్నీ చింపివేయడము చూసింది. తనకుకూడా తన ప్రతిబింబము, ప్రతిఇంటా ప్రతిదుకాణములోనూ, ఉండడము హేయమని పించినది. తనభర్తకు తను సౌఖ్య మివ్వలేనప్పుడు తనకు జీవితములో ఉండేఆనందము నశించి పోయినప్పుడు త నింకా అక్కడ ఉండి భర్తను బాధించడ మెందుకు ? ఎక్కడికయినా పోయి తనదారి తను చూచుకొంటే శ్రీనివాసరావు ఎప్పటికయినా పూర్వపు మనిషి అవుతాడేమో. ఎప్పటికో ఒకప్పటికి తాను సుఖపడవచ్చునుకదా తనకు కావలసినది. తనకు చేతకానప్పుడు అతనిసౌఖ్యానికికూడా అడ్డు రావడ మెందుకని తన దారిని తను పోవడానికి అనుజ్ఞ ఇవ్వవలసినదని శ్రీనివాసరావును కోరినది. ఉభయులకు అదే మంచిదని చెప్పింది. శ్రీనివాసరావు ఎంతచిత్రకారు డయినా మనుష్యమాత్రుడు. సత్యమును చూసేటప్పటికి అతని మనస్సు చాలా క్లేశపడ్డది. ఆమెలోటు ఏమీ లేకపోయినా ఆమె నింతగా బాధించినాముకదా, అని చాలా విచారించినాడు.

ఈకష్టములకంతా కారణము తనూ కాదూ ఆమె కాదు. జీవితములో ఒకగొప్పపొరపాటు. ఆమె చెప్పినట్లు ఎవరిదారి వారు చూసుకోవడమే మంచిదేమో! అందుచేత ఆమె కోరినప్పుడు ఆమె ఇష్టము వచ్చినచోట ఉండవచ్చుననీ ఆమె కేలోటూ లేకుండా చేస్తాననీ చెప్పినాడు.

ఎక్కడినుంచో గాలికి కొట్టుకు వచ్చి తనపాదములవద్ద పడిన పుష్పమువలె ఆమె అతని జీవితములో ప్రవేశించినది. ఆపుష్పముతో తనగృహము కొన్నాళ్ళు అలంకరించుకున్నాడు. కొంచెము వాడుదల చూడగానే బయటకు పారవేసినాడు. ఇంకొకగాలి వచ్చి దాన్ని ఎక్కడికో ఎత్తుకు పోయినది.

౬

శంకరరా విప్పుడు భక్తాగ్రేసరు డైనాడు. శ్రీచైతన్యస్వామివలె భక్తిపారవశ్యముచేత తన్మయు డవుతూ ఉంటాడు. ఇప్పు డతనినోటినుంచి ఏవాక్కు వచ్చినా భక్తివిషయముతప్ప మరొకటి లేదు.

శంకరరావు మొదటినుంచి కూడా సత్యమూర్తి. అందుచేతనే అతనికవిత్వము తామసికము కాదు. అమృతప్రవాహమువలె హృదయమున కెప్పుడూ శాంతి నిస్తూ ఉండేది. జ్ఞానము వచ్చినప్పటినుంచీ నేటివరకూ అతనిహృదయము అనేకమార్పులు పొందింది. వాటితోపాటు అతనికవిత్వముకూడా మారుతూ ఉండేది. ఒకప్పుడు పర్వతఝురివలె ప్రవహించినా, ఒకప్పుడు ఝంఝామారుతమువలెకనబడ్డా, ఒకప్పుడు మలయమారుతమువలె ఉన్నా ఎప్పుడూ అందులో అమృతత్వము మట్టుకు లేకపోలేదు. ఏస్వరూపములో ఉన్నాఆనందదాయకముగానూ శాంతవంతముగానూ ఉండేది. క్రమేణా కొత్తపంథాలకు పోతూ నూతనఆదర్శములను చూపుతూ ఉండేది. పోను పోను సమస్తకళలు, కావ్యములు, శాస్త్రములు, వేదాంతములు, అన్నిటి ఉద్దేశమూ సత్యాన్వేషణమని, దానిఫలము ఆనందమని, ఆ ఆనందమే పరబ్రహ్మమని, అతనికవిత్వమువలనా, జీవితమువలనా చాటుతూ వచ్చినాడు. మొదట dreamer తరువాత కామి, పిమ్మటఋషి, ఆఖరికి అభిసారికగా మారినాడు. ఈకాలములో ఇంత మహాకవి, భక్తుడు, గాయకుడూ లేడనేఖ్యాతి అప్రయత్నంగా వచ్చింది.

ప్రపంచముతో ఏవిధమైన సంబంధము లేకుండా, ఎక్కడో ఒంటరిగా కూర్చుని తపస్సు చేసుకుందామని ఎంతప్రయత్నము చేసినా ఈకాలములో సాగడము కష్టము. ఎవరో ఒకరు ఈరహస్యము బయట పెట్టకమానరు. అక్కడనుంచి ఎవరో ఒకరు వచ్చి తపోవిఘ్నము కావించక మానరు.

ఒకనాటిసాయంకాలము ఆకాశము నిర్మలముగా ఉంది. అస్తమిస్తున్న సూర్యుడు వర్ణనాతీతము లైనచిత్రములతో ఆకాశము నంతా చిత్రించి వెళ్లిపోతున్నాడు. పక్క నున్న సెలయేరు ఏమేమో గొణుగుకుంటూ తనదారిని వెడుతూ ఉన్నది. చల్ల గాలికి ఆకులు కొంచెము గలగలలాడుతూ కదులుతూ ఉన్నవి చీకటి పడిపోతుం దనే భయముచేత పక్షులు తొందరగా గుంపులు గుంపులుగా గూళ్ళకు చేరుకుంటు న్నవి. చీకట్లు అన్నిపక్కలనుంచీ అలముకొని వస్తున్నవి.

శంకరరావు ఈశ్వరధ్యానము చేస్తూ తనపర్ణశాలముందు ఒక చెట్టుకింద కూర్చున్నాడు. తనవెనుక నెవరో అనతిదూరములో తనపద్యములే చదువుతున్నట్టు వినబడ్డది. వెనుకకు తిరిగి చూచాడు, ఎవ్వరూ కనపడలేదు. కంఠము కొంచెము కటువుగా ఉన్నా స్త్రీకంఠమువలె ఉన్నది. ఎప్పుడో పరిచితముగాకూడా ఉన్నట్టు తోచింది. "ఎవరు వారు" అన్నాడు శంకరరావు. డస్సినశరీరముతో, మాసిన బట్టలతో, తడబడే అడుగులతో, కన్నీరు కారుస్తూ, తలవంచుకుని సత్యము ముందుకు వచ్చింది. "అమ్మా, రా కూర్చో. ఇంత శ్రమపడి ఇక్కడికి కిప్పుడు వంటరిగా ఎలా వచ్చావు? ఎందుకు విచారిస్తున్నావు? శ్రీనివాసరావేడి? అతను సుఖముగా ఉన్నాడా" అని తొందర తొందరగా సమాధానానికి ఆగకుండానే ప్రశ్నలు అడిగినాడు. అమ్మా అనేమాట అతనినోటివెంట రాగానే, ఆమె ఆశావీలో, సూక్ష్మమైన ఆఖరుతంతువు తెగిపోయింది. దానితో ఆమెకు మరింతదుఃఖము వచ్చింది. శంకరరావు ఎప్పుడూ ఏవిధమైన దుఃఖమూ సహించలేక పోయేవాడు. అందులో అబల, అసహాయురాలు, తనదగ్గరకు వచ్చి ఇలా విచారిస్తూ ఉంటే మరీ భరించలేక ఏమి చేయడానికీ తోచక ఆమెను కూర్చోమని కన్నతల్లివలె ఓదార్చినాడు.

కొంతసేపటికి పొరలివస్తున్న దుఃఖతరంగములను ఆపుకొని, రాళ్ళనుకూడా కరిగించేచూపుతో ఒక్కసారి శంకరరావును చూచి తలవంచుకుని తనవృత్తాంతము సమగ్రముగా చెప్పినది. దుఃఖమును ఆపుకోలేక మళ్లీ ఒకసారి విచారించి, "నాకింక ఎక్కడా నిలువడానికి నీడ లేదు. దిక్కూలేదు. మీరే నాకు దిక్కు. మీరూ ఒకప్పుడు కొద్దో గొప్పో నన్ను ప్రేమించినారు. ఆకారణముచేతనే ఇక్కడకు వచ్చినా రనుకుంటాను. నే నప్పుడు మిమ్ములను కాదని ఆయనను వివాహము చేసుకోడము గొప్ప పొరపాటు! అందువల్లనే మా కిద్దరికీ ఈకష్టము. ఆపొరపాటు మన్నించమని కోరడానికి వచ్చినాను. అపరాధములు ఎంతటివాళ్ళ కయినా వస్తవి. మీ రీస్వల్పకాలములోనన్ను మరిచిపోయి ఉండరు; వెనుకటిప్రేమ ఇంకా ఏలేశమాత్రమో మిగిలి ఉండకపోదు; దయాస్వరూపులు, నామొర ఆలకించక పోరనే నమ్మకముతో మీపాదములమీద పడదామని వచ్చినాను. ఇంక పాల ముంచినా

నీట ముంచినా మీదే బాధ్యత!" అని పెద్దపెట్టున రాగాలుపెడుతూ శంకరరావు కాళ్ళపైన పడబోయినది.

శంకరరావు ఆమెను పట్టుకొని లేవదీసి కూర్చోపెట్టి "అమ్మా, విచారించకు. ఎంతపని జరిగినది! నీవు చెప్పినదంతా వింటే నాకు చాలా కష్టముగా ఉన్నది కాని నే నేమి చేయగలను? నేను నిన్ను ఒకప్పుడు ప్రేమించినానని అనుకున్నాను. అది సరియైనప్రేమ కాదని నాకు అప్పుడే అనుమానము కలిగి వివాహము కొరకు నిన్ను ఆట్టే తొందర చేయలేదు. నిన్ను మొదట చూచినప్పుడు నాకంటె భిన్నమైన దేవతా స్వరూపిణి ఒకతె నాకు ప్రత్యక్షమైనది. నేను నిశ్చయముగా నాటికీ నేటికీ ప్రేమించినది ఆమెను కాని నిన్ను కాదు. ఆమెయే నాపాలిటికి రమాదేవియై సమస్త ఐశ్వర్యములనూ ఇచ్చినది. ఆమెయే సరస్వతీదేవియై నన్ను కవిని చేసినది. ఆమె స్వరూపము అణుమాత్రమూ నీలో లేదు. తల్లీ, ఒకానొకప్పుడు నిన్ను ప్రేమించాననేభ్రాంతి నీకు కలుగచేసినందులకు క్షమించు. నిన్ను ప్రేమించుటతప్ప మరేసహాయమైనా నేను చేయగలిగినది ఉంటే తప్పక చేస్తాను ప్రస్తుతము చాలా అలసినట్టు ఉన్నావు. ఈఫలములు ఫలహారముచేసి ఈరాత్రికి ఇక్కడ విశ్రమించు. తరువాతసంగతులు ఉదయము మాట్లాడవచ్చు" అని ఆమెముందు కొన్నిఫలములు ఉదకమూ ఉంచి తనహృదయశాంతి కోసము అరణ్యములోకి వెళ్లిపోయినాడు.

సత్యమునకు పట్టరానిదుఃఖము వచ్చినది. శంకరరావు మాటలవల్ల ఇంక నిక్కడ తనకు ఏఆశా లేదని నిశ్చయమైనది. "ఔరా! ఎంతదిక్కు. అప్పుడు శంకరరావును పెండ్లి చేసుకున్నా ఇంతే అయ్యే దన్నమాట! అవును. నాపోటినిర్భాగ్యురాలికెంతసౌఖ్యము ఎలానిలుస్తుంది. ఇంక భవిష్యత్తు అంటూ లేదుకదా. ఏమూలనో పడి ఉండి నాజీవితములో స్వల్పకాలమును తేజోవంతముగా చేసిన ప్రభాతకిరణములను తలుచుకుంటూ కాలక్షేపము చేయవలసినదే కాబోలు" అని విచారిస్తూ అక్కడనే పడుకుని నిద్రపోయినది. తెల్లవారు ఝామున నే లేచి, శంకరరావుకు కనపడకుండా చెప్పకుండా వచ్చినదారినే వెళ్ళిపోయినది. ఎక్కడికో! మూసుకుని వస్తున్నచీకట్లతో వచ్చినది, మళ్లీ విరిసిపోతున్నచీకట్లతో విరిసిపోయినది!

౧౦

సత్యము వెళ్ళిపోయినప్పటినుంచీ శ్రీనివాసరావు మరీ పిచ్చివాడు అయిపోయినాడు. ఏపని చెయ్యబుద్ధి అయ్యేది కాదు. చదువుదా మంటే మనసు కుదురుగా ఉండేది కాదు. సత్యమును అన్యాయము చేశామే అని ఒకబాధ. తనచేతిలోవిద్య తన కెప్పుడూ ఆనందము కలుగచేసేది తన్నేదో ఉద్ధరిస్తుంది అనుకున్నది ఎందుకూ

పనికిమాలి వృథా అయిపోయినదే అని ఒకవిచారము. తనజీవితమంతా నాశనమై పోతున్నది అనిబెంగ. దీనితో ఏమీ తోచక బోనులో సింహములాగ ఇంట్లో ఊరికే తిరుగుతూ ఉండేవాడు. కొన్నాళ్లు అయ్యేసరికి ఆఊరూ, ఆఇల్లూ, ఆఇంట్లో వస్తువులూ చూస్తూ ఉంటే మరీ అసహ్యముగా ఉండేది. అందుకని కొన్నాళ్ళు అక్కడనుంచి లేచిపోయి శంకరరావుదగ్గర ఉంటే మనశ్శాంతి కలుగుతుం దేమో నని అక్కడకు బయలుదేరినాడు.

ఒకనాడు తెల్లవారేసరికి శంకరరావునివాసముదగ్గరకు చేరినాడు. అప్పుడే సూర్యోదయ మవుతున్నది. ఎక్కడ చూచినా కలకలలాడుతూ పక్షులు. నలుదిక్కులనుంచీ కమ్మనిపువ్వుసౌరభము. తుమ్మెదలఝుంకారము. సెలయేటిగానము. ఏమి ప్రశాంతము, ఏమిసౌందర్యము! ఏమి ఆనందము! శ్రీనివాసరావు ముగ్ధుడై పోయినాడు.

ఆశ్రమముదగ్గరకు వచ్చినకొద్దీ ఋషివాటికను సమీపించినప్పుడు క్రూరమృగములుకూడా శాంతము వహించినట్లు శ్రీనివాసరావుహృదయము ఆందోళన తగ్గి శాంతించినది.

శంకరరావు అప్పటికప్పుడే లేచి, స్నానముచేసి ప్రభాతసంకీర్తన చేస్తున్నాడు. అది పూర్తిఅయ్యేవరకూ, శ్రీనివాసరావు దూరాన నిశ్శబ్దముగా నిలబడ్డాడు. కొంత సేపటికి శంకరరావు కళ్ళుతెరిచి తల ఎత్తిచూచాడు. ఎదుట కన్నుల నీళ్ళుకారుస్తూ నిశ్చేష్టుడై నిలబడ్డశ్రీనివాసరావు కనపడినాడు. ఒక్కపరుగున వెళ్ళి అతనిని ఆలింగనము చేసుకున్నాడు. ఎంతసేపు ఇద్దరూ అలా బాష్పపూరితనయనములతో రుద్ధకంఠములతో, నిండుహృదయములతో నిలబడ్డారో తెలియదు. కొంతసేపటికి స్మృతి తెచ్చుకుని నిశ్శబ్దముగా కుటీరములోకి వచ్చి కూర్చున్నారు. అటువంటిక్షణములలో మాటలు ఏమి వస్తవి? అప్పుడు మాటలు లేకుండా మౌనముతో చెప్పేలాలనవాక్యములే ఎక్కువహృదయశాంతి నిచ్చేది. కొంతసేపటికి పెద్దవర్షము కురిసి వెలిసిన పిమ్మట ఉన్నఆకాశమువలె ఉన్నది అతని మనస్సు.

కొన్నాళ్ళు అక్కడనే ఉన్నాడు శ్రీనివాసరావు. మనిషి మామూలుమనిషి అయినాడు. మళ్ళీ ఇంటికి వెళ్లుదా మనేబుద్ధి పుట్టింది. "శంకరం, మళ్ళీ యింటికి వెళ్ళడమంటే భయముగా ఉన్నది. అక్కడ వెనుకటి యమబాధ పడతానేమో! ఇంక నాకు తరణోపాయము లేదా? నీవిజయమునకు కారణము ఏమిటి? నావినాశానికి కారణము ఏమిటి?" అన్నాడు శ్రీనివాసరావు.

"శ్రీనివాసులూ, నేను పొందిన పెద్దవిజయమూ లేదు, నీవు పొందిన పెద్దవినాశమూ లేదు. జీవితమంతా ఇంకా ఎదుటనే ఉన్నది. ఇదొక అనుభవము.

ఇది ఒకందుకు మంచిదే కాని ఒక్కసంగతి చెపుతాను. నీడను చూచి నీవు వస్తువని భ్రమపడినావు. సౌందర్యవంత మయినరూపము కనపడగానే బాహ్యరూపమును పట్టుకుని, ఈసౌందర్యమునకూ తేజస్సుకూ కారణమైన లోపల ఉన్నదివ్యస్వరూపము మును విడిచిపెట్టినావు. బాహ్యరూపము ఎంతచక్కగా ఉన్నా త్వరలో నశించక మానదు. ఎంతచక్కని పుష్పమైతేమట్టుకు వాడిపోయినతరువాత ఆనందము ఇవ్వ లేదు కదా. అందుకని ఆమిథ్యారూపాన్ని విడిచిపెట్టి లోపల ఉండే తేజోమూర్తిని తెలుసుకుని ఆరాధిస్తే, నీజీవితము ఆనందమయ మవుతుంది. నీ కిదివరకు చేసిన ఉపదేశము లన్నీసార్థక మవుతవి. సమస్తవిద్యలకూ కళలకూ అదే పరమావధి. నాకు ఇది తెలియనిది కాదు. మధ్యను వచ్చిన ఈఅనుభవము ఇకముందు సత్యాన్వే షణకు మరింత సహాకారిగా ఉంటుంది. ఇంక నాలుగురోజు లిక్కడ ఉండి కొంతపని ప్రారంభించి వెళుదువుగానిలే ” అన్నాడు శంకరరావు.

౧౧

శ్రీనివాసరావుకు మళ్ళీ నూతనోత్సాహమువచ్చినది. తిరిగితనకు ప్రేమాస్పదమైన చిత్రలేఖనము ప్రారంభించినాడు. అత నిదివరకు ఎప్పుడూఅనుకొననివిషయము ఒకటి స్ఫురించినది. కుంచె అప్రయత్నముగా కాగితముమీద జరగడ మారంభించినది. ఒక రంగు కలుపవలెనని ప్రయత్నముచేస్తే తా నిదివరకు ఎప్పుడూ ఎరుగని చక్కని కొత్తరంగు ఒకటి తయారయ్యేది. బొమ్మ అతిత్వరగా పూర్తి అయినది. అది సత్య రూపిణి అయినజగన్మాతరూపము. శ్రీనివాసరావే ఆపటముయొక్క సౌందర్యము, జీవము చూచి ముగ్ధుడై, దేవికి సాష్టాంగము చేసినాడు. స్త్రీరూపము అయినా ఆపటములో కనపడేది దేవతకాని మానవస్త్రీకాదని ప్రతివాళ్ళు ఒప్పుకున్నసంగతే. అది అతీంద్రియ విషయము. ఆజగన్మాత సాక్షాత్కారము లేనిదే మానవమాత్రు డాచిత్తరువును చిత్రించి ఉండలేడు. మామూలురంగులతో చిత్రించినపటము కా దది. అదొక దివ్యస్వప్నము. చిత్రమును శంకరరావుకు అంకితము చేసినాడు.

నాటినుంచీ శ్రీనివాసరావు వ్రాసినబొమ్మలకు కొత్తరూపము, వింతసౌంద ర్యమూ వచ్చినవి. సామాన్యులకు అర్థమయ్యేవి కావు. అలంకారగోష్ఠివలె ఉండేవి. క్రమేణా అతనిపేరూ శంకరరావుపేరూ దిగంతములకు వ్యాపించినవి. అనేకమంది కవులకూ చిత్రకారులకూ వారు మార్గప్రదర్శకు లయినారు. వారితో నూతనయుగ మొకటి ప్రారంభ మైనది.

*

చైతన్యశోభ

*

పెద్దిభట్ల
రామచంద్రరావు

ధవళ దేదీప్యమాన సుందర మనోజ్ఞ
తరళ కాంతుల వెదజల్లి ధర నెసంగు
జీవకోటికి ప్రాణసంజీవి గూర్చి
మిత్రు డార్తబాంధవుపోల్కి మెరయుచుండ.

తళతళ త్తళ రాజిత తరళకాంతి
తాండ వోజ్జ్వల విమల చైతన్యవీచి
పూర్ణిమ తరంగమాలికల్ పొంగిపొరలె
స్ఫీత వంశీమనోహర స్మితము లట్లు.

సమ్మదోత్సాహ విస్ఫూర్తి జలక మాడి
పర్వదినమున పావనవార్ధి దేలి
రాననాబ్జముల్ వికసింప నచటిజనులు
సుధను గ్రోలెడు నప్పటి సురల పగిది.

శ్రేష్ఠజీవరహస్య విచిత్రరుచిని
ముగ్ధ భవదీయ చైతన్య మూర్తి యపుడు
చిత్రితం బయ్యె హృదిని సజీవముగను ;
వెలిగె చైతన్య శోభన వీక్షనాళి.

*

భార్యా రూపవతీ శత్రుః

శ్రీనివాస
శిరోమణి

౧

రామారావు అనాకారి వాడనే చెప్ప వచ్చును. అయితే చూస్తే చీదర కలుగుతుందని అనడానికి మట్టుకు వీలు లేదు. పాపము అందముగా ఉండవలె నని అత నెంతో ప్రయత్నము చేస్తూ ఉంటాడు. కాని రూపాన్ని మార్చడము ఎట్లా సాధ్య మవుతుంది? ఏదో మామూలు భార్యా అయినట్లయితే ఎట్లా ఉండేదో! కాని ఆమె దివ్యసుందర విగ్రహము. కేవల హనుమద్వర ప్రసాద లబ్ధులయిన ఆంధ్రదేశస్థులలో ఆమె పొరపాటున జారిపడి పోయింది. ఇందుకు తోడు రామారావుకే ఆమె భార్య అయింది.

రామారావుకు ఏవిషయములోనూ లోటులేదు. చక్కగా చదువుకొన్నాడు, కావలసినదానికంటే ఎక్కువగానే వసతి ఉంది. ఏవృత్తిలేకుండా ఉంటే హాంగుగా ఉండదనుకొని ప్లీడరీ చేస్తున్నాడు. భార్యా కాపరానికి వచ్చినప్పటినుంచీ ఆమె రూపాన్ని అనుక్షణమూ చూస్తూ ఉన్నాడు. ఇప్పటికి అయిదు సంవత్సరాలు అయి పోయినవి. అయినప్పటికీ ప్రతిక్షణమూ ఆమె రూపములో ఏదో ఒక క్రొత్త సౌందర్యము అతనికి కనపడుతూనే ఉంది. ఎందుకు? ఎన్నిసంవత్సరాలు అతను చూసినా ఏదో నూతన సౌందర్యము ఎప్పటికప్పుడు ఆమెలో పొడకడుతూనే ఉంటుంది. అది ఆమె సౌందర్యలక్షణము. ఆమెను చూసి ప్రతిక్షణమూ అతను ముగ్ధుడయిపోతూ ఉండేవాడు. "కమ్మని కుందనము" అన్నట్లు ఆమె కేవలము రూపసే కాదు, విద్యాసంపన్నకూడాను.

ఈ మర్త్యలోకములో స్వర్గసౌఖ్యము అనుభవిస్తున్న దల్లా తనొక్కడే నని ఎప్పుడూ రామారావు అనుకొంటూ ఉండేవాడు. అందరూ కూడా అట్లాగే అనుకొంటూ ఉండేవాండ్లు. ఆమె దర్శన మబ్బితేనే జన్మ ధన్యక మయిపోతుందని ఏదో మిషమీద అతనితో అనేకమంది స్నేహముచేసుకొంటూ ఉండేవాండ్లు. ఇక ఆ పేటలో ఉన్న స్త్రీలంతా ఆమె తమ ఇంటికి వస్తేనే తమ ఇండ్లు పవిత్రమయిపోతవను కొనే వాండ్లు. ఏదో పూర్వజన్మలో చేసుకొన్న పుణ్యవిశేషమువల్లనే ఈ జన్మలో ఆమె లభించినట్టుగా రామారా వనుకొంటూ ఉండేవాడు.

కాలము గడిచినకొద్దీ అతని కామెమీద పూజ్యభావము ఎక్కువయి పోవడము మొదలు పెట్టింది. ఆమెను చూస్తే అతనికొక విధమయిన భయముభక్తీ కలుగుతూ ఉండేవి. ఏ బాలా త్రిపురసుందరినో ఏ మదన కామేశ్వరినో ఉపాసకులు ఉపాసించే విధముగా అత నామెను ఉపాసిస్తుండేవాడు. ఆమెను స్మరించిన మాత్రానికే అతనికి బ్రహ్మానందము కలిగేది. ఆమెను స్మరిస్తే ఎంతటి కార్యాన్ని అయినా చేసి పారవేసేవాడు.

ఆమె ఎంతసౌందర్యవతో అంత సౌందర్యవంతుడు సీతాపతి. అతను బ్రహ్మచారి, కవి. రామారావుకు చిన్నప్పటినుంచీ స్నేహితుడు. భార్యవచ్చిన తరువాత సీతాపతికీ రామారావుకూ స్నేహముమరింత అయిపోయింది. ఎందువల్లనంటే అన్నపూర్ణకు సీతాపతి కవిత్వమంటే మహాఇష్టము. ఎప్పుడూ అతను రామారావు ఇంటికి వస్తూఉండేవాడు. కాలముగడిచినకొద్దీ ఆముగ్గురి స్నేహము ఇంతింత అని చెప్పడానికి వీలులేకుండా అయిపోయింది. రామారావు ఇంట్లో ఉన్నా లేకపోయినా రాత్రింబవళ్ళు సీతాపతీ అన్నపూర్ణా ఏవో కబుర్లు చెప్పుకొంటూనో పద్యాలు చదువుకొంటూనో కాలక్షేపము చేస్తూ ఉండేవాండ్లు. కొంచెమించుమించు ఆ గృహము భూతల స్వర్గానికి మల్లే ఉండేది.

౨

సాయంకాలము “ బారు ఎసోసియేషన్ మీటింగు ” అయినందువల్ల రాత్రి ఎనిమిదిన్నర తొమ్మిది గంటలవరకూ రామారావు ఇంటికి రావడానికి పడలేదు. ఆ వేళ అమావాస్య. పైగా సాయంత్రమప్పుడు కొంచెము వర్షముకూడా కురిసింది. మబ్బుపట్టి ఉంది. చిమ్మచీకటి.

అన్నపూర్ణ ఇంటిదగ్గిర ఒంటరిగా ఉందని భర్తకు తహతహపుట్టింది. ప్రాణాలు అరచేతులలో పెట్టుకొని గబగబ నడుస్తున్నాడు. రస్తాఅంతా బురదగా ఉన్నందున కాలు జారుతూ ఉన్నది. ఎంతవేగముగా నడిచినా అనుకొన్నంత తొందరగా ఇల్లుచేరడానికి వీలులేకపోయింది. బండివాణ్ణి “ కోచీ ” తీసుకొని రావద్దని చెప్పినందున తన్ను తాను నిందించుకోవడము మొదలుపెట్టినాడు. ఎట్లా గయితే నేమి, చివరకు ఇల్లు సమీపించినాడు. గేటుదగ్గిరికి వెళ్ళినాడు. గేటు తలుపు ఒక్క తన్ను తన్ని గబగబా లోపలికి వెళ్ళినాడు. ఆవరణలో కొంత దూరము నడిస్తేనే కాని ఇల్లు రాదు. వరండాలో మాత్రము దీపము వెలుగుతున్నది. బంట్రోతు వరండాలో కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. కుక్కమొట్టుకు తోకఆడించుకొంటూ వచ్చిసాష్టాంగ దండ

పరిణామము చేసి యజమానిని ఆహ్వానము చేసింది. ఇంకా ఇంటి మెట్లదగ్గిరికి వెళ్ళ లేదు. దక్షిణపువైపు గోడమీద మాత్రము వెలుతురు కనిపిస్తున్నది. ఇంక ఏవైపునా వెలుతురు లేదు.

దక్షిణపువైపు గోడవంక చూచినాడు. వాక్యూం బ్రేకు వేస్తే సాధారణముగా మెయిలుబండి నలభై గజాలు వెళ్ళి నిలుస్తుందిట. కాని రామారావు బ్రేకు వేసేసరికి అతని దేహము తపీమని అక్కడనే ఆగిపోయింది. నిలుచుని గోడవైపే చూడసాగినాడు. అన్నపూర్ణను ఎవరో ముద్దుపెట్టుకొంటున్నట్టే కనుపించింది. ఉత్తరక్షణములో ఆలింగనము చేసుకోబోతున్నట్టు గోడమీద నీడ కనుపించింది. ఇంక చూడలేకపోయినాడు, కండ్లు మూసుకొన్నాడు. కండ్లు తక్షణమే తెరిచినాడు, బాల్కనిలో వాండ్లు తిరుగుతున్నట్టు గోడమీద కనబడ్డది. తలవంచుకొని లోపలికి నడిచినాడు. సావిట్లోకి వెళ్ళి దిగాలపడిపోయి పడకకుర్చీలో కొయ్యమాదిరిగా కూర్చున్నాడు. మాటల ధ్వనినిబట్టి బాల్కనిలో ఉంది సీతాపతి అని గ్రహించినాడు. అతని గుండెలు బద్దలయి పొయ్యేటట్టు కొట్టుకొంటున్నవి. లేచినాడు, తలగుడ్డ, కోటూ విప్పి కింద నేలమీద విసిరివేసినాడు. కుర్చీలో జారగిలబడినాడు.

యజమాని వచ్చినట్టు బంట్రోతు వెళ్ళి అన్నపూర్ణకు చెప్పినాడు. ఆమె గబగబ సావిట్లోకి వచ్చింది. ఆమె వెంట సీతాపతికూడా వచ్చినాడు. అతన్నిచూసి వాండ్లిద్దరూ ఆశ్చర్యపోయినారు. వాండ్ల ఆశ్చర్యాన్ని అతను కనిపెడుతూనే ఉన్నాడు. ఎంతో ఆదుర్దాతో అన్నపూర్ణ "ఏమి ఏమిటి అట్లా ఉన్నారేం?" అని అడిగింది. సీతాపతి "తలనొప్పిగా ఉందా ఏమిరా?" అన్నాడు.

"ఊఁ."

"ఎప్పటి నుంచి, ఎప్పటి నుంచి? అమృతాంజనము తెచ్చేదా?" అన్నది అన్నపూర్ణ.

"లాభము లేదు. అమృతాంజనముకు పోదు."

"అయినా రాచుకోకూడదా చల్లగా ఉంటుంది."

"లాభము లేదు. ఇది మామూలు మందులకు తగ్గిపొయ్యేది కాదు."

"మరి పోనీ డాక్టరుకు కబురుపంపించేదటరా?"

"అక్కరలేదు."

"మరెట్లాగండి?"

"నిద్రపోవడానికి ప్రయత్నము చేస్తాను. నిద్రపడితే దాని అంతట అదే పోతుంది. మీరు ఆదుర్దా పడవలసిన అవసరము లేదు" అంటూ బంట్రోతును

పిలిచి పక్కను ఉన్న గది చూపించి "ఇందులో మంచము వేయరా పడుకొంటాను" అన్నాడు రామారావు.

తక్షణము వంట్రోతు పక్క వేసినాడు. రామారావు లేవబోతుండగా అన్నపూర్ణ పట్టుకొనబోయింది. "అక్కర్లేదు" అని గట్టిగా అన్నాడు. అంత కఠినముగా రామారావెన్నడూ పలికి ఉండలేదు. అతను చాలా బాధపడుతున్నాడని ఆమె అనుకొన్నది. గదిలో మంచము మీద పడుకొన్నాడు. అన్నపూర్ణ సీతాపతికూడా ఆమంచము మీదనే కూర్చున్నారు. వాండ్లను చూస్తూ మీరిక్కడకూర్చుంటే నా బాధ ఎక్కువయిపోతుంది. పొండి" అన్నాడు రామారావు.

అన్నపూర్ణ చిరునవ్వుతో "అదేమిటండి, చిత్రము!" అన్నది. ఇంతలో వంటవాడు అక్కడికి వచ్చినిలుచున్నాడు. "అయితే భోజనము కొద్దిగా చేసిపడుండండి. ఒకనిద్రపోయిలేచే సరికి నొప్పితగ్గిపోతుంది" అన్నదామె.

"భోజనము చెయ్యను. ఈ నొప్పి ఈ దేహముతో పోవలసిందే!" అంటూ వంటవాడితో "కొంచెముకాఫీ త్వరగా తయారు చేసిపట్టురా" అన్నాడు.

"పోనీ చారూ అన్నము తినండి" అన్నదామె.

"అక్కరలేదు. నీవింకా భోజనము చేయలేదేం?"

"ఈవేళ అన్నయ్య కూడా ఉంటానన్నాడు. ముగ్గురమూ కలిసి భోజనము చేదామనుకొన్నానండీ!"

"అన్నయ్య ఎవరు!"

"అన్నయ్య ఎవరేమిటండి? సీతాపతి."

"మీరిద్దరూ వెళ్ళిభోజనము చెయ్యండి. భోజనముచేసి పడుండండి."

"అప్పుడే తొందరేం లేదులేరా. పోనీ అన్నపూర్ణా, నీవు వెళ్ళి భోజనము చెయ్యి."

అన్నపూర్ణ ఊరుకొన్నది. వెళ్ళమని సీతాపతి అన్నపూర్ణకు సంజ్ఞచేసినాడు. ఆమె వెళ్ళిపోయింది. ఇదంతా అతను చూస్తూనే ఉన్నాడు.

3

మద్రాను సర్దారుభవనానికి సీతాపతి వచ్చేసరికి రామారావు గదిలో మంచము మీద బోర్ల పడుకొని పొర్లిగింతలు పెడుతున్నాడు. ముఖమంతా గండుబారిపోయింది. సన్నగా చిక్కిపోయి ఉన్నాడు. గదితలుపు ఓరవాకిలిగా వేసిఉంది. ఆ ఓరలోనుంచి ఇదంతా చూసినాడు. సీతాపతి వెంటనే తలుపు నెట్టుకొని లోప

లికి వెళ్లినాడు. రామారావు అతన్ని చూస్తూనే కోపముగా "ముందు తెలియచేయకుండా ఎందుకు వచ్చావు?" అన్నాడు.

"నీవిలాసము తెలిస్తేగా" అన్నాడు.

ఏమీ మాట్లాడకుండా గోడవైపుకు ఒత్తిగిలి పడుకొన్నాడు. ఎంతోసేపు సీతాపతి కూర్చున్నాడు. అత నేమీ మాట్లాడలేదు. ఒకటి రెండు సార్లు పలకరించినా పలకలేదు. ఒకగంటసేపు ఓపికపట్టి కూర్చున్నాడు. తర్వాత సీతాపతికి విసుగెత్తిపోయి భోజనముచేయడానికి వెళ్ళిపోయినాడు.

రామారావు ఒక మాసములో యావదాస్తి తెగనమ్మి పారేసినాడు. ఆడబ్బు తీసుకొని ఎవరికీ ఏమీ చెప్పకుండా మద్రాసు వచ్చినాడు. అతనికి భార్యావిషయములో కలిగిన అనుమానమునుంచి వెర్రెత్తిపోయింది. ఎవరికీ తా నేమయి పోయినదీ తెలియకుండా ఆత్మహత్య చేసుకోవలెనని నిశ్చయించుకొన్నాడు. తన తదనంతరము తనదనే ఒక్క చిల్లిగవ్వ అయినా ఈలోకములో ఉండకూడదనుకొన్నాడు. అందుకోసరమే ఆస్తినంతా అమ్మివేసినాడు. ఆధనము ఏమిచేయవలెనో అతనికి తెలియలేదు. జన్మఎత్తిన తరువాత అంతధనమును ఒక్కసారిగా కండ్లతో చూసిఉండలేదు. ఒకరికి ధర్మముచేయవలెననే ఊహ అతనికి కలగలేదు.

యకాయెకీ మద్రాసు వచ్చినాడు. సర్దారు భవనములో బస చేసినాడు. డబ్బు వ్యయము చేయడానికి మార్గము చప్పున కనుపించడము కూడా గొప్ప విషయమే. నాల్గు అయిదు రోజులవరకూ ఏమీ పాలు బోయిందికాదు. ఇక ఎట్లాగూ చచ్చిపోవడము నిశ్చయమే కాబట్టి ఈ బ్రతికి ఉండే నాల్గురోజులూ ఖులాసాగాఖర్చుపెట్టి మరీ చచ్చిపోవడము మంచిదని నిశ్చయించుకొన్నాడు. ఇక గుర్రపు పందెములలో డబ్బు పెట్టసాగినాడు. మొదట మొదట పందెములలో ఓడి పోయినా చివరకు ప్రతిరోజూ గెలవడమునుంచి తెన్నుకు తెచ్చిన డబ్బుకంటే ఎక్కువ డబ్బు రావడము మొదలు పెట్టింది. ఇది ఒక క్రొత్త చిక్కులు.

ప్రతి రోజూ ఆరాత్రికి దేహత్యాగము చేయవలెననుకొని బయటికి బయలుదేరేవాడు. సముద్రములో పోయిపడితే అలలకు మళ్ళీ బయటకు కొట్టుకొనివస్తే తన్ను గుర్తుపడతారనే సందేహము వచ్చేది. మరి త నేమయి పోయినదీ ఇతరులకు ఎంతమాత్రమూ తెలియగూడదు. ఈ సందేహమురాగానే తిరిగి బసకువచ్చేవాడు. గది చేరగానే ఎదురుగుండా డబ్బుకనుపించేది. చనిపోయినతరువాత మనదీ అనేదిఏమీ ఉండకూడదే,ఏమిచేయడమా అనే ఈ సందేహములో పడికొంత సేపుకొట్టుకులాడేవాడు. ఇట్లా ఇరవై రోజులు గడిచిపోయినవి.

మధ్యమధ్య కండ్ల ఎదుట భార్యా పొడగడుతూ ఉండేది. ''అయిదు ఆరుసంవత్సరాలు అంతఅవ్యాజ ప్రేమ కనుపరిచినది. ఆహా ఎంతమోసము ఎంతమోసము. ఇందుకోసరమే మనపెద్దలు భార్యా రూపవతీ శత్రుః అన్నారు అవును, ఆడవాళ్ల సంగతి ఎవడు కనిపెట్టగలడు ? చివరకు బ్రహ్మదేవుడికి కూడా శక్యముకాదు. అందుకోసరమే " ఏతా హసన్తిచ రుదన్తిచ కార్యహేతో ... ... స్మశానసుమనా ఇవవర్జనీయాః అన్నారు ... అయితే పోనీ ఆడది, బుద్ధిహీనతవల్ల అట్లాంటి పనికి తయారయిందను కొందాము. అయితే వాడు-ఆసీతాపతి నాకు చిరకాలమిత్రుడే-ఎంతో అనురాగముతో ఉండేవాడే- వాడికెట్లా బుద్ధిలేకపోయింది ? నిజంగా ఆడదానికి మనసులో ఏమున్నా మొగవాడు దారి తీసేవరకూ దారిలోకి రాదని అంటారే లోకులు మరి. అయితే అది దారి తీసిఉంటుందా ? వాడుదారితీసి ఉంటాడా ? ఏకకాలంలో ఉభయులూ దారిపట్టినారా ? అయినా చచ్చిపోదలచుకొన్న వాడికి ఈ తర్కవితర్కాలెందుకు ? ఇందులో ఎవరు దారితీస్తే ఏమి ? ఉభయులూ పాకొంపముంచినారు. అసలు ఆ వెధవకు దాని దగ్గర అంతచను వీయడమే నాతప్పు. తప్పు నాదగ్గరపెట్టుకొని వాండ్లను దూషించడ మెందుకు ? ఇందుకోసరమనే కాబోలు మనువు, స్త్రీ అన్నదమ్ములతోనైనా సరే ఏకాంతమందు మాట్లాడగూడదని శాసించినాడు ... ...

" అయినా మన బంగారము మంచిదయితే కంసలివాడేమిచేస్తాడు ? ఇదేమి చచ్చు సామెతగా ఉందే ? కంసలివాడు కొలిమిలికి కొంత బంగారము ఊదిపారవేసి మెత్తుసరికోసరము రాగి కలుపుతేను. అసలు ఆ సీతాపతిగాడే దాన్ని దింపిఉంటాడు. లేకపోతే దాని కంతధైర్యమా సీతా అయితే స్త్రీ శక్తి స్వరూపిణిగా ? ఇంతకూ ఇల్లు ఇరకడము ఆలు మర్కటము ఉండవలెనన్నారు.... మనవాండ్ల సామెతలో ఎంతో వివేకము ఉంది. ఈ పెండ్లామే మర్కటము అయి ఉన్నట్లయితే వాడు దాని జోలికే పొయ్యేవాడుకాడు. ఏమో ఈ పాడు ఆలోచన అంతా ఎందుకు ? ఒక్కసారే నిశ్చయము చేసుకొన్నాను. ఈ రాత్రితో సరి. ఫోటోగ్రాఫు దుకాణాల వాండ్లదగ్గిర మందు తెచ్చుకో వచ్చును.

" అయినా ఇంతమాత్రానికే ఆత్మహత్య చేసుకోవడము అవసరమా ? చచ్చి పోయి చేసేదేమిటి ? ... సరే బ్రతికి ఉంటాను. అది వాడివెంట వెళ్ళిపోతే ఎంత అవమానము ! ఆ అవమానము భరించడముకంటే ముందుగా చచ్చిపోవడమే యుక్తము.... పోనీ నా యింట్లోనే ఉండి వాడితో కాలక్షేపము చేస్తూఉంటే ? వివాహము రద్దుచేసుకోడానికి హిందూలా ఒప్పుకోదుగా మరి ? అయితే వెళ్ళగొట్ట-

వనుకొంటాము. అప్పుడది Restitution of conjugal rights కోసరము దావా తీసుకొని వస్తే? అప్పుడు కోర్టులో నేను దాని చెడు ప్రవర్తన రుజువు చేయవలసి వస్తుంది! ... రుజువు చేయలేకపోతాను. రామా రామా అవమానము .. అవమానము. భరించలేను - భరించలేను. ... ఈ వెధవడబ్బు - ఈ డబ్బు ఒకటి నన్ను బాధిస్తున్నది. తీసుకొని వెళ్ళి కూమునదిలో పారవేస్తాను." అనుకొంటూ లేచి డబ్బు సంచి తీసుకొని బయలుదేరినాడు.

"సరే ఆఖరుపర్యాయము గుర్రపు పందెములో డబ్బు పెట్టి ఇంకా ఏమయినా వచ్చేట్లయితే అదికూడా కలిపి పారవేస్తాను" అని గుర్రపుపందెమునకు వెళ్ళినాడు. ఉన్నడబ్బు అంతా చావడానికి సిద్ధముగా కనబడే గుర్రానికి పందెము వేసినాడు. దురదృష్టవశాత్తు ఆ గుర్రము పందెము గెలిచింది. రెట్టింపు ధనము వచ్చింది. ఇక కోపము పట్టలేక కండ్లుమూసుకొని ఒక గుర్రముకు ఉన్నడబ్బుఅంతా పందెము పెట్టినాడు. ఓడిపోయినది. బ్రహ్మానందము అయినది. రాత్రికి మళ్లీ బసకు చేరినాడు.

చేతులో పాతిక ముప్పయి రూపాయిలకంటే లేదు. తన లెక్క చూడమని హోటలు యజమానిని అడిగినాడు. హోటలువాడి లెక్క ఇచ్చివేసి ఆ రాత్రికి ఆత్మహత్య చేసుకోవలెనని అతని సంకల్పము. ఇక్కడకూడా దురదృష్టవశాత్తు మరుసటి ఉదయము కాని లెక్కలు చూడడానికి వీలులేదనీ వేళ అయిపోయినందువల్ల గుమాస్తాలు ఇంటికి వెళ్ళిపోయినారనిన్నీ హోటలు యజమాని చెప్పినాడు. పెద్ద ఆశాభంగములో పడుకొన్నాడు. కండ్ల ఎదుట ఊరితో అత్యుత్సాహముగా అన్నపూర్ణ కనుపించడము మొదలుపెట్టింది. ఏడుపురాసాగిం[illegible]స్తూ పడుకొని నిద్రపోయినాడు.

౪

ఉదయమే నిద్రలేచి ఇంతకాఫీ పుచ్చుకొనివచ్చి మళ్ళీమంచముమీద పడుకొని రామారావు మసులుతున్న సమయములో సీతాపతి వచ్చినాడు.

అతనేదో పెద్దదుఃఖములో మునిగి తేలుతూ ఉన్నట్టు గ్రహించినాడు. అనేక పర్యాయములు అతన్ని మాట్లాడించవలెనని ప్రయత్నము చేసినాడు. కాని ప్రయోజనము లేకపోయింది. పయిగా కండ్లురిమి చూడడము మొదలుపెట్టినాడు. ఎప్పుడో ఒకప్పుడు సంగతిసందర్భములు రామారావు చెప్పకపోడని సీతాపతి ఊరుకొన్నాడు. విచారించగా అతను గుర్రపుపందెములో డబ్బుఅంతా పోగొట్టుకొన్నట్టు తెలిసింది.

మూడురోజు లయింది. నాల్గురోజు లయింది. ఏమీ మాట్లాడలేదు రామా రావు. సీతాపతికూడా మొదలకుండా ఊరుకొన్నాడు. ఏప్రస్తావనా తీసుకొని రాలేదు. ఆత్మహత్యకు సీతాపతి పెద్ద అంతరాయ మయినట్టు రామారావు భావించడము మొదలుపెట్టినాడు. పయిగా సీతాపతి మౌనముగా ఊరుకోవడము రామారావుకు మరింత కోపకారణ మయింది.

అంత తొందరగా రామారావులో అంత మార్పుకలగడానికి కారణమేమయి ఉంటుందా! అని సీతాపతి యోజించడము మొదలుపెట్టినాడు. అతని కేమీ అవగాహన కాలేదు. తనమీదా అన్నపూర్ణమీదా అతనికి అనుమానము కలిగిందేమో నని శంకించినాడు. రామారావు ఏవిషయమయినా సరే, ఇతరుల కెంత అప్రియమయినా నిర్మొహమాటముగా మాట్లాడే స్వభావము కలవాడు. కాబట్టి ఆ అనుమానమే అయినట్టయితే ఎన్నడో అతనితో చెప్పే ఉండే వాడనుకొన్నాడు. దీనికంతా ఏదో పెద్దబ్రహ్మాండమయిన కారణము ఉండిఉంటుం దనుకొన్నాడు. ఆ కారణము అన్నపూర్ణకుకూడా తెలియదు. తెలిసినట్టయితే తనతో తప్పకుండా చెప్పిఉండేదే నని సీతాపతి నిశ్చయించుకొన్నాడు.

సీతాపతి వచ్చి అయిదు రోజులయి పోయింది. ఇక ఏదోవిధముగా రామారావును సంభాషణలోకి దింపితేనేగాని అసలు విషయము బయటపడ దనుకొన్నాడు. మధ్యాహ్నము భోజనము అయిపోయిన తరువాత వెళ్లి రామారావు పక్కలో కూర్చున్నాడు. అతను కొరచూపులు చూడడము మొదలుపెట్టినాడు. మెల్లిగానూ, వినయముగానూ చిరునవ్వుతో “ఎందుకురా అంతకోపము? కోపమువల్ల వచ్చిన చిక్కులు పోతవా!” అన్నాడు సీతాపతి.

“నీ మీద నాకు కోపము లేదు.”

“అయితే ఎవరిమీద అంత కోపము? ఎందుకు?”

“నామీదనే — నా ఈ జన్మమీద!”

“నాతో అంటే అన్నావుకాని — మరెవరితో ఇట్లా అనకు. ఇట్లా అంటే విశాఖపట్నము పంపిస్తారు.”

రామారావు అతనివంక చూడకుండా ముఖము అటు తిప్పుకొని ఊరుకొన్నాడు. సీతాపతి ఎంతో ఓదారుస్తున్నవాడికిమల్లే “ఏం ప్రయోజనము. ఎంత దుఃఖము కలిగితే దాన్ని అంత మింగివేయవలెను. అది పెద్దల లక్షణము. సరే. కానియ్యి, ఏది ఎట్లా కావలసి ఉంటే అది అట్లా అవుతుంది. సాయంత్రము మరి ప్రయాణమయి పోదాము. ఏమంటావు!” అన్నాడు

కోపముతో "చాలుచాలు మెట్టవేదాంతము!" అన్నాడు రామారావు

"నీకు నిజంగా మతిపోయినట్టున్నది. ఇంటికిపోతే ఈపిచ్చ అంతా వదలుతుంది...... అన్నపూర్ణ నీకోసరము ఎంతపరితపించి ఎలా చిక్కిపోయి........."

అర్ధోక్తిలోనే రామారావు "అమ్మ, అమ్మ, ఎంతదొంగవురా! అమ్మ దుర్గ్రము! నాకోసరము పరితపిస్తున్నది—పరితపిస్తున్నదీ? ఆ ఏమిఅమాయికులురా!..." అంటూ వాక్యముపూర్తి చేయలేకపోయినాడు. ముచ్చెమటలు పోస్తున్నవి. ఒళ్ళు గజగజ వణకడము మొదలుపెట్టింది. మిర్రిమిర్రిచూడసాగినాడు. ఏదో మాట్లాడబోతాడు కాని మాట నోటివెంట పెగలడములేదు. మంచముమీద కూర్చున్నవాడల్లా లేచి అటు ఇటు వెర్రివాడిలాగా పచార్లుచేయ నారంభించినాడు.

కొంచెముసేపు సీతాపతి నిశ్చలముగా ఊరుకొన్నాడు. రామారావు ముఖములో ఆమొదట ఉద్ధృతము కొంతతగ్గిపోయి మామూలుస్థితిలోకి వస్తూఉండగా "ఏమిటి రామారావు. ఏమిటో చాలా గొడవగా ఉన్నావు" అని మెల్లగా సీతాపతి అన్నాడు.

"ఆ! ఆ! ఇంకా అమాయకపువేషము వేస్తున్నావా? నీవు పయోముఖవిషకుంభానివి. ముందు ఈగదిలోనుంచి నడుస్తావా? బంట్రోతుచేత గెంటించేదా? లే. లేవేం?" అన్నాడు రామారావు.

అత నెంతగందరగోళము చేస్తున్నాడో అంతకంత నిశ్చలముగా సీతాపతి కించిన్మందహాసముతో "పోనీలే అట్లాగే వెళ్ళిపోతాను. నాతప్పేమిటో చెప్పు. తప్పు తెలియకుండా దండనచేయడమా? అందులో నీవు 'లాయరు' కూడాను" అన్నాడు.

"అవునులే. నీ తప్పేమి లేదులే. అసలు తప్పంతా దానిదగ్గిర - ఆ అన్నపూర్ణదగ్గర - అమ్మయ్యో - నేను ఎంత మోసపోయినాను. మనువు 'స్త్రీ ఏకాంతముగా సోదరులతో నయినాసరే మాట్లాడకూడ'దని శాసించినాడు. మొదట నేనది చదివినప్పుడు మనువు ఉత్తఫూల్ అని అనుకొన్నాను."

"ఒరే ఇదా నీగొడవ నెలరోజులబట్టి అవస్థపడుతున్నది ఇందుకా? భూములు పుట్రలు అమ్మివేసిందికూడా ఇందుక నేట్రా. చాలా గొప్పవాడివి."

"రాస్కెలు, నీకు ఎగతాళా? నేను చూడలేదూ. ఆరోజు - రాత్రి మీ ఇద్దరు చేసినపని. ద్రోహి. ముందు నా యెదటనుంచి లేచిపో."

"ఏం చేశాముర మేము?"

"ఏంచేశామంటున్నావు తుపాకి ఉన్నట్లయితే అప్పుడప్పుడు ఆక్షణములో అట్లా మీ ఇద్దరిని కాల్చివేసి ఉండేవాణ్ణి సుమా. ముందులే. నీవు నాదగ్గిర వద్దు పో. నీదారిన నీవు పో."

" ఏంచేశావోయి ? "

" ఏంచేశారా గాఢాలింగనము చేసుకొన్నారు. నేను చూసినాను. ఈ కండ్లతో నేను చూసినాను. "

" సరే అప్పుడే అడగకపోయినావా అన్నపూర్ణను కాని నన్ను కాని ? ఏమిటా దుర్మార్గము. ఓరి వెర్రివాడ కేవలము వాగకప్పవయినావులే. లే, రయిలు టయిము అయిపోయింది. ఒక్కసారి ఈ విధముగానే అన్నపూర్ణను మందలించు. అప్పుడు నిజానిజములు తెలుసుకోకుండా ఇంత చాదస్తములో పడిపోతావని అనుకోలేదురా. ఎందుకులే. మరి నన్ను అడిగినట్టే ఆమెను కూడా అడిగి చూడు ఏం చెపుతుందో ? "

" అయితే నీవేమి సమాధానము చెప్పినావు ? "

" ఆమెను కూడా ఈవిషయము అడగమన్నాను. ఆమె నీతో ఇదివరకెన్నడయినా ఒక్కనాడయినా అసత్యము చెప్పిన పాపానపోయింది ? ఆలోచించు. రా. ఈ సాయంత్రము మెయిలులో వెళ్లిపోదాము."

" ఇది ఏదో పెద్దవ్యూహము పన్నావు. నేను, నీవు నాదగ్గిర వద్దుపో. పొమ్మంటె పోవేం." అని నెట్టివేసినాడు.

సీతాపతి చిరునవ్వుతో బయిటకు వెళ్లిపోయినాడు.

౫

అమర్నాదు రామారావు ఇంటికి ఎట్లాగో బయిలుదేరినాడు. రైలులోనే సీతాపతిని తన ఇంటి చాయల రావద్దని శాసించడముచేత మధ్యదారిలోనే అతను దిగబడిపోయినాడు.

అతను ఇంటికి వచ్చేసరికి అన్నపూర్ణ బయిట ఉంది. ఇల్లంతా మహారణ్యములాగా ఉంది. నౌకరు లేదు. వంటవాడు మట్టుకు ఉన్నాడు. కుక్క మట్టుకు ఎంతో ఆదరముతో అతన్ని ఆహ్వానము చేసింది. అన్నపూర్ణ బ్రహ్మానందముతో అతని యెదుట దూరముగావచ్చి నిలుచున్నది కాని అతను హిమాలయాపర్వతముకంటె అచలముగాను—అకంపముగాను ఉండి ఆమెవంకనయినా చూడలేదు. అది సమయము కాదని ఆమె అప్పటికి ఊరుకొన్నది. మూడురోజులూ ఎన్నిసార్లో దూరమునుంచి అతన్ని పలకరించి సంతోష పెట్టడానికి ప్రయత్నము చేసింది, కాని లాభములేకపోయింది.

ఆ మూడురోజులూ అతను అన్నము తినలేదు. ఏదో ఇంత కాఫీపుచ్చుకొని మత్తుగా పడిఉన్నాడు. ఎన్నివిధాలనో అన్నపూర్ణ పరామర్శచేయబోయింది. ఆమె వంక కన్నుఅయినా ఎత్తి అతను చూడలేదు.

నాల్గవరోజు ఉదయమే అన్నపూర్ణ వచ్చి అతనిసరసనే కూర్చున్నది. ఊరికే చూస్తూ ఏమీ మాట్లాడకుండా రామారావు ఊరుకొన్నాడు.

"ఎక్కడనుంచి వచ్చినారు. ఎప్పుడు బయలుదేరినారు. ఏమిటి, అన్నము ఎందుకు తినరు. ... ..." అంటూ ఏమేమిటో ప్రశ్నలు ఆమె ఎంతో ఆదుర్దాతో అడిగింది. అత నేమీ సమాధానము చెప్పకపోవడమే కాకుండా ఆమెవంక వెర్రిగా చూడడము మొదలుపెట్టినాడు. అతని ధోరణి ఆమెకేమీ అర్థముకాలేదు. కొంచెము సేపయిన తరువాత "సీతాపతి అన్నయ్య మీకు కనుపించాడా ?" అన్నది. ఈ మాట అతనికి పాము కరిచినట్టయిపోయింది. వెంటనే కోపముగా "వాడిసంగతి నాకేం తెలుస్తుంది. నీకు తెలియవలెను" అని చివాలున లేచి బయటకు వెళ్ళిపోయినాడు.

సాయంత్రము చీకటిపడే వరకూ ఇంటికి రాలేదు. ఆమె భోజనము మానివేసి అతని కోసరము ఎదురుచూస్తూ కూర్చున్నది. అత నెందుకు అట్లా అయిపోయినాడో కించిత్తు అయినా ఊహ చేయలేకపోయింది. పోనీ సీతాపతి అయినా అతని విషయమంతా ఉత్తరము వ్రాయలేదు. కారణము తెలియని ఈ దుఃఖముతో ఆమెకు జన్మమీద విసుగెత్తిపోయింది. ఇకఅతను ఇంటికి వచ్చినా రాకపోయినా ఈవిధముగా ప్రాయోపవేశము చేసి చచ్చిపోదామని నిశ్చయించుకొని పడుకొన్నది.

చీకటిపడిపోయింది. రాత్రి ఎనిమిది కావచ్చింది. వంటవాడు భోజనముసంగతి రెండుమూడుసార్లు జ్ఞాపకము చేసినాడు. ఆమె ఏమీ జవాబు చెప్పకపోయినందువల్ల వాడు వెళ్ళిపోయి పడుకొన్నాడు.

ఎనిమిదిన్నరగంటలప్పుడు రామారావు మెల్లిగా ఇంటికివచ్చి పడకకుర్చీలో జారగిలబడి పరధ్యానముగా కూర్చున్నాడు. అతను వచ్చినట్టు అన్నపూర్ణ తెలుసుకొని వెంటనే వెళ్ళి ఎంతోసంతోషము అభినయిస్తూ పడకకుర్చీచేతులమీద కూర్చుని మృదువుగా "ఏమిటి చాలావిచారముగా ఉంటున్నారు. కారణమేమిటి ? అని చుబుకము నిమరబోయింది. చటుక్కున లేచి కూర్చుని ఆమెచేయి కఠినముగా తీసివేసి "నాకేం విచారములేదు" అని విగ్గరిగా అన్నాడు భర్త.

" అయితే ఈఉపవాసాలు ఎందుకు ? ఎక్కడకో పోవడ మెందుకు ? ఈపర ధ్యాన మెందుకు – ఏమిటో మీవిషయమంతా విచిత్రముగా ఉందండి. " అన్నది అన్నపూర్ణ.

"ఇది నాయిల్లుకాదు. నాకేమి లేదు. నేను దరిద్రుణ్ణి. నాకు భోజన మెందుకు ? అని మెల్లిగా తనలో తను అనుకొన్నట్టు అన్నాడు.

" ఇది మీఇల్లు కాదండీ ?"

"నాది, కాదు. మీనాయన నీకు కట్టించి ఇచ్చినాను."

" అయితే నాఒక్కతె కోసరమండీ ఈ ఇల్లంతాను ? ఏమి టీవెర్రిమాటలు. ఇదివర కెప్పుడు ఇట్లా మాట్లాడేవారు కాదే మిమ్ములను ఎవరో ఏదో మోసము చేసినట్టున్నారు లేకపోతే మీకింత విచారము రాదు. "

"అవును అవును."

"సరే వంచేస్తాను. భోజనానికి లేవండి. భోజనము చేసినతర్వాత చెప్పుదురు గాని. "

"చెప్పేదేమీ లేదు. నేను నాఆస్తిఅంతా అమ్ముకొన్నాను. నాచేతిలో ఒకగుడ్డి గవ్వఅయినా లేదు. డబ్బులేనివాడికి భోజనమెందుకు. "

" మీ ఆస్తి నేనున్నాను ఇంకా. ఇదంతా మీదికాదా. ఇదుగో నాఆస్తి మీఇష్టము వచ్చినట్టు చేసుకొండి వ్రాసి యిస్తాను. క్రొస్తునము మీకు వయికము కావలసి ఉంటే ఈనగలు తీసుకొండి " అని వెంటనే నగలుతీసి యివ్వబోయింది.

రామారావు కొంచెమాశ్చర్యపడి ఆశ్చర్యము కనబరచకుండా మెల్లిగా గద్గదికతో "నేనే నీకక్కర లేకపోయినప్పుడు నీఆస్తిఅంతా నాకెందుకిస్తావో ఆశ్చర్యంగా ఉంది. ఇది ఏదో ఇదివరకటికంటె గొప్పమోసము చేయదలచుకొన్నట్టున్నావు. "

గజగజ వణుకుతూ లేచినిలుచుని "నేను ఇదివరకు మిమ్ములను మోసముచేశానండీ - మోసముచేశానుటండీ - అట్లామోసముచేస్తే తుపాకిని శారు ఎందుకు వెయ్యకపోయినారు ? నేనా - మోసము - మోసముచేయుటము - అమ్మా - " అంటూ కండ్ల నీళ్ళుకుక్కుకుంటూ చూడసాగింది.

"ఎంత నంగనాచివే - ఇందుకోసమనే పెద్దలు స్త్రీలు ఏడ్చి నవ్వి కోపగించుకొని ఇంకాఏవేవో పనులుచేసి మొగవాళ్ళను మోసముచేసి తమపనులు నెరవేర్చుకొంటారని అన్నారు. "

" నాఅపరాధము ఏమిటో సెలవీయండి. లేకపోతే నేనింకా ఇంతమాట మీనోటినుంచి వచ్చినతరువాత బ్రతుకను. "

—సగ ధార్యా యాతపతి శత్రు:

“ ఏమి దొంగవేషము. పాపము ఇంకా అమాయకముగా ప్రవర్తించి నన్ను వెర్రి వెధవాయను చేదామనుకొన్నావు కాబోలు. నేను ఆరాత్రి నీవు చేసిన పని చూడలేదనుకొన్నావుకాబోలు. ఈ రోజు ఉదయముకూడా కొంచెము సిగ్గు అయినా లేకుండా వాడిని గురించి నన్ను అడుగుతావా ? ”

కొంచెము విశాసముతో “ నేను సీతాపతి అన్నయ్య ... ... ”

“ అన్నయ్య అన్నయ్య అంటున్నావా ? ”

“ అయ్యో ఇందుకు మీ రింత మనోవ్యధ అనుభవిస్తున్నట్టు మాకు కొంచెమయినా చెప్పక పోయినారా? ఏమాత్రము మీ అనుమానము తెలిసినా ఆక్షణము ఆ అనుమానములో ఉన్న సత్యము మీకు తెలిసేటట్టు చేసేదాన్నే ” అంటూ గోడ వంక ఆమె చూసేసరికి దీపపుకాంతీ వారి ఉభయులు నీడా గోడమీద కనుపించింది. వెంటనే ఆమె అతని ముందు ఒక గజము దూరము వెళ్ళి నిలుచుని వంగి ఏదో అందుకో బోతున్నట్టు నిలుచుని అన్నది “ఆగోడమీద చూడండి ఏలా నీడపడిందో చూడండి చూడండి ” గోడమీద నీడలో అతను కూర్చున్నట్టున్నూ అతని కంఠాన్ని అన్నపూర్ణ కౌగిలించుకొన్నట్టున్నూ కనుపించింది. అతను ఆశ్చర్యపోయినాడు. తదేకముగా ఆ నీడవంకచూస్తూ “ ఏమిటి ఏమిటి ” అన్నాడు రామారావు.

“ఇదేరజ్జు సర్పభ్రాంతి అంటే — ఆ రాత్రి మీకు తలకాయ నొప్పివచ్చిందే - మీరు ఇంకా కొంచెంసేపటికి వస్తారు అనంగా సీతాపతిఅన్నయ్య బాల్కనిలో ఉన్నాడు. నేనేమో గదిలో బల్లమీద ఉన్నపుస్తకము అతనికి అందించడానికి వంగేసరికి మేమిద్దరము కౌగలించుకొంటున్నట్టు నీడకనుపించింది. అన్నయ్య నవ్వుతూ ఆనీడ నాకు చూపించినాడు కూడానండి. అది చూసే కాబోలు మీరు అనుమానపడ్డారు అనుకొంటాను. ఇక లేవండి మీగోడవ ఇదాఅండి”అతన్ని లేవదీయబోయింది. అతను ఆనీడచూస్తూ ఏమిటో వెర్రివాడిలాగా ఉండేసరికి ఇక లేవండి. భోజనము చేతాము. మొగవాండ్లు ఎంత వెర్రివాండ్లు అండి అని అతన్ని లేవదీసింది. అతను కొంచెము సిగ్గుతో లేచి నిలుచుని ఇంకా గోడవంక చూస్తూఉండేసరికి “నయము, ఎప్పుడు నీడ అట్లాగే ఉంటుందని అనుకొంటున్నారా ఏమండీ ” అన్నది అన్నపూర్ణ.

*

చెంచు రాణీ

చింతా దీక్షితులు

౧

కర్నూలునుంచి శ్రీశైలము వెళ్ళేటప్పుడు తోవలో నాగలూటి అనేగ్రామము వద్ద యాత్రికులు మజిలీచేస్తారు. ఆ చిన్న గ్రామములో కాపుర మున్న వాళ్ళందరూ చెంచువాళ్ళే. దానికే యీమధ్య బైరాగి కట్ట అనీ మొండికట్ట అనీ పేర్లువచ్చాయి.

నాగలూటిలో దేవాలయము ఉన్నది. దానికి ఎదురుగా నెగళ్లు వెలిగించి యాత్రికులు రాత్రులు గడుపుతారు. కొందరు దేవాలయమండపము మీద కెక్కి పడుకుంటారు.

నాగలూటి గ్రామము అడవులమధ్య ఉన్నది. మామిడీ చెట్లూ, వెదురు దుబ్బులూ అక్కడ ఎక్కువగా పెరిగిఉన్నవి. మాఘమాసములో తాండ్ర చెట్లు బాగా పుష్పిస్తవి. ఆ పువ్వుల సౌరభము రాత్రివేళల నాగలూటి ప్రాంతాల వ్యాపిస్తుంది. అప్పుడే మామిడి కాయలూ చిలకకొట్టులూ రాలడం ఆరంభం. చెంచు వాళ్ళు ఆ కాయలూ పళ్ళూ తిని, పొట్ట నింపుకుంటారు.

వేసవికాలములో నాగలూటివద్ద మృగభయము కద్దు. రాత్రివేళ అప్పుడప్పుడు నీళ్ళు తాగడానికి ఒక్కొక్క పెద్దపులి ఆ ప్రాంతాలకు వస్తూఉంటుంది. అందు కోసరమే యాత్రికులు నిద్ర మాని నెగళ్ళచుట్టూ కూర్చుంటారు.

నాగలూటి దగ్గిర చిన్న నీళ్ళకుండు (పుష్కరిణి) ఉన్నది. ఆ కుండులోకి ఎప్పుడూ పాతాళగంగ ధారగా వచ్చి పడుతూఉంటుంది. ఆ కుండులోనే యాత్రికులు స్నానము చేయడము. ఆ నీళ్ళే ఆ గ్రామస్థులు తాగడము. ఆ నీళ్ళ కోసమే పెద్దపులులు రాత్రివేళల రావడము కూడాను.

నల్లమల కొండలు అరణ్యమయము. అక్కడక్కడ చెంచుగూడెములు చాలా కలవు. నాగలూటి అటువంటి చెంచుగూడెమే. ఈ కొండలలోనే పుణ్యక్షేత్రములు కలవు. శ్రీశైల మన్నిటిలోను మహాత్తుకలదని ప్రసిద్ధి కెక్కినది. శ్రీశైలము మీది రాళ్ళన్నీ శివలింగములేనట. శ్రీశైలముమీది చెంచులందరూ సిద్ధులేనట.

శ్రీశైలమును బట్టి నల్లమలకొండలకూ అందలి అరణ్యములోని చెట్లకూ కూడా మహాత్తు కలిగింది.

ఒకయేడు శివరాత్రికి శ్రీశైలము వెళ్ళి తిరిగి వస్తూకొందరు యాత్రికులు నాగలూటి సమీపాన వంటచేసుకొంటున్నారట. వారికి ఆ నాటికి ఒక చెవులపిల్లి

ఆహారము కానున్నది. ఇంతలో దాని మాంసముంచి కూరవండుతూ కలియబెట్టడానికి ఏమీ లేక కర్రముక్క పక్కనపడి ఉంటే దానితో ఆ కూర కలియబెట్టేసరికి కుండలో నుంచి చెవులపిల్లి బుడుంగున బయటికి దుమికిపారిపోయిందట. సంజీవిని కున్న ప్రభావము నల్లమలకొండల మీది కొన్ని చెట్లకు కలదట.

చెట్లకే కాకుండా అక్కడవాసముచేసే కొందరు సిద్ధులకు కూడా యిటువంటి మహత్తు కలదట.

మనుష్యులకు ఆకలిలేకుండా ఉంటే ఎంతబాగుంటుందో, ఏతాపత్రయమూ లేకుండా హాయిగాభగవన్నామస్మరణచేస్తూ కాలంగడపవచ్చునుగదా అనుకొనేవాడు ఒక బ్రాహ్మడు. అతడు అగుపించిన బైరాగుల నందరినీ ఆశ్రయించి ఆకలిలేకుండా చేసు కొందామని చాలా ప్రయత్నించినాడు. ఒకమారు అతడు నల్లమల కొండలలో ఒక సిద్ధుడిని చూచాడు. ఆ సిద్ధుడు ఏదోపసరు తాగించి ఆ బ్రాహ్మడికి ఆకలి లేకుండా చేశాడు. అప్పటికి సంతోషించినప్పటికీ ఆ బ్రాహ్మడు తరువాత పడ్డ ఆందోళన యింతా అంతాకాదు. భగవన్నామస్మరణ అటుండగా తనకేదో జాడ్యము సంభవించి నట్టు అతడు భావించి ఎన్నోమందులు మింగాడు. లాభములేకపోయింది. తుదకొక బైరాగి అతనికి తటస్థపడ్డాడు. ఆబైరాగి అతనికో మందిచ్చినాడు. ఆ మందు ప్రభావము వల్ల అతడు పూర్వముతాను తిన్నపసరు కక్కివేసినాడు. ఆ బైరాగి ఆ పసరు తాను తిని క్షుధను జయించి అంతరాయరహితమైన సమాధిలో ప్రవేశించాడు. నల్లమలకొండల ప్రభావము అట్టిదనిలోకులు చెప్పుకొంటారు.

నాగలూటి గూడెములో చాలా వెదురుగుడిసె లున్నవి. కాని ఒకగుడిసె మాత్రము దూరముగా ఒక మామిడిచెట్టు కింద పుష్కరిణికి సమీపముగా ఉన్నది. ఆ గుడిసెలో ఒక చెంచెత ఒక చెంచు బాలుడూ కాపురమున్నారు.

చెంచుది ముసిలిది. నల్లని శరీరము. వయస్సులో అందకత్తె. ఇప్పుడు శరీరమంతా ముడతలు పడ్డది. చెంచుబాలుడు చామన చాయరంగు, నీలిరంగు కళ్ళు, రాగి వెంట్రుకలు. చెంచుబాలునకు ఇరవై సంవత్సరముల వయస్సు. ఇతడు ముసలిదాని కొడుకే. పగలు వేటాడి తనకూ తనతల్లికీ సరిపోయినంత ఆహారము సంపాదించేవాడు. ముసలిది ఎప్పుడూ గుడిసెముందు ఏదో పరధ్యానముగా ఆలోచిస్తూ కూర్చుంటుంది. అక్కడ చెంచువాళ్ళందరూ ఆమెను చెంచురాణీ అని పిలుస్తారు.

యాత్రికులు ఆమెను చూచి ఆమెను చెంచురాణీ అని పిలవడము విని ఆమె గొప్పసిద్ధురాలని భావించి కొబ్బరి కాయలూ అరటి పళ్ళూ ఆవిడకు సమర్పిస్తూ ఉంటారు. ముసలిదాని దృష్టి పళ్ళమీదగాని యాత్రికులమీద గాని ఎప్పుడూ పడ లేదు. అప్పుడప్పుడామె యీరీతిగా గొణుగుకొనేది. "సముద్రాలు. సముద్రాలమధ్య

దేశం. దేశంలో ఊళ్ళు. ఒక ఊళ్లో నాదేవుడు." యాత్రికులకు ఈమాటలు అర్థమయ్యేవి కావు.

ముసలిదానికి చిన్నతనములో తల్లిదండ్రులుంచిన పేరులచ్చి. మధ్యకాలములో వచ్చిన పేరు జెస్సీ. అంత్యకాలములో వచ్చిన పేరు చెంచురాణీ. ఆమె కొడుకుపేరు వీరభద్రుడు.

ఆమె యితరులతో ఎప్పుడూ మాట్లాడక పోయినప్పటికీ కొడుకుతో అప్పుడప్పుడు ప్రసంగించేది. సముద్రాలుదాటి దేశాలుదాటి తనను తనకొడుకు తీసుకొని వెళ్ళగలడేమో అని అడిగేది. సముద్రాల మధ్యదేవతల దేశాలు చూడడానికి అతనికి కుతూహలము ఉన్న దేమోనని కనుక్కొనేది. అక్కడ అడవులు ఉంటాయా అక్కడ వేటాడవచ్చునా అక్కడ చెంచువాళ్లుంటారా అని అత డడిగేవాడు. అక్కడ మన దేవు డున్నాడు, పెద్దవాడవైనాక అక్కడకు నన్ను తీసుకొని వెళ్ళవా అని ఆమె ప్రశ్నించేది వీరభద్రుడు ఆమె మాట లర్థము చేసుకొనలేక ఒక్కొక్కప్పుడు ప్రత్యుత్తర మిచ్చేవాడే కాడు.

ఉరు లొడ్డిపట్టి తెచ్చిన క్షుద్ర జంతువులూ, కాయలూ పళ్ళూ ఊచబియ్యమూ తేనెపట్టులమైనమూ ఆమె దేహాన్ని పోషిస్తున్నవి. ఆమె హృదయమును పోషించడమునకు తన కొడుకు విగ్రహమూ తన ఆలోచనలూ ఉండేవి.

అప్పుడప్పు డామె నిట్టూర్పు విడిచేది. వాయువుకూడా అప్పుడే ఏ చెట్ల సందు నుంచో నిట్టూర్పు విడిచేది.

ఆమె అప్పుడప్పుడు కన్నీళ్ళు విడిచేది. చెట్ల ఆకులనుండి అప్పుడే మంచు బిందువులు రాలేవి.

ఆమె అప్పుడప్పుడు కొడుకును కౌగిలించుకొని నీవే నాదేవుడవా అనేది. నేను [illegible]ననేవా డతడు. కాని ఆమాటలామెకు వినబడకుండా వెదురు దుబ్బులు కీచుమని ధ్వనిచేసేవి.

౨

ఆ ప్రాంతములలో నివాసముచేసే చెంచువాళ్ళందరూ వీరభద్రుణ్ణి చెంచురాణీ కొడుకనే పిలిచేవారు. అతనిని వాళ్ళందరూ గౌరవముగా చూచేవారు. వీరభద్రుడు వేటాడడములో చాలా నేర్పరి. విల్లమ్ములు పుచ్చుకొని అడవిలోకి వేటకువెళ్ళి అత డెప్పుడూ వట్టిచేతులతో ఇంటికి రాలేదు.

తాను అందరు చెంచువాళ్ళలాగా ఉండకపోవడమూ తననూ తన తల్లినీ అందరూ గౌరవముగా చూడడమూ అతనికి బోధపడినదికాదు. అందుకు కారణ మేమైఉండునా అని అతడు చాలా మందిని అడిగాడు. ఏకారణముచేతనో వాళ్లు అతనికి సరియైన కారణము చెప్పారుకాదు. తన తల్లితప్ప ఇంకెవరూ తనకు చెప్ప రని ఊహించి అతడు ఒకనాడు తల్లిని చెప్పవలసిందని తొందరపెట్టినాడు. తల్లి సందే హించి సందేహించి తుదకు చెప్పింది. పాతాళగంగ కొండలమధ్యనుంచి ప్రవహిస్తూ ఉన్నదనీ ఆ పాతాళగంగ అక్కడకు తూర్పుగా ఎక్కడో అరణ్యముమధ్య కొండ లలో మలుపు తిరిగినదనీ ఆ మలుపుదగ్గిర నీరు చలనములేకుండా ఉంటుందనీ, ఆ మలుపు గుహవలె ఉంటుందనీ, దానిపేరు పీనుగులగొంది అనీ అక్కడకు వెళ్ళినట్ల యితే ఇద్దరు చెంచువాళ్ళు కనిపిస్తారనీ ఆ చెంచువాళ్ళను కలుసుకొని తాను లచ్చి కొడుకునని చెప్పి, లచ్చి సముద్రాలమధ్యకు వెళ్లుతున్నదని చెప్పవలసినదనీ, వాళ్లే నీకు జన్మవృత్తాంతము యావత్తూ చెప్తుతారనీ ఆమె చెప్పింది. వీరభద్రుడికి అక్క డకు వెళ్ళవలెనని కుతూహలము కలిగినది. కాని తల్లిని ఒక్కతైనూ వదలిపెట్టి ఎలాగ వెళ్ళడం ? చెంచురాణి ఆ సంగతి గ్రహించి తనకు అక్కడ ఉన్న చెంచువాళ్లు తిండిపెట్టుతూ ఉంటారుకాబట్టి ఆ విషయమై అతడు బెంగపెట్టుకోవలసిన అవసరము లేదని చెప్పింది.

వీరభద్రుడు ప్రయాణానికి సిద్ధపడ్డాడు. విల్లమ్ములు తీసుకొన్నాడు. మొలలో పెద్దకత్తి దోపుకొన్నాడు. కట్టుకొన్న బట్టా పైమీదబట్టతోటే బయలుదేరాడు. అడ వులలో నడవడము ప్రారంభించినాడు.

తెల్లవారుజామున బయలుదేరి బారెడుపొద్దు ఎక్కేసరికి పెద్దచెరువు చేరు కున్నాడు. అక్కడ చెంచుగూడెము, లంబాడీగూడెమూ ఉన్నవి.

ఆ గూడెములవైపుపోక అతడు తోవలో సంపాదించిన మామిడికాయలూ టుంకిపళ్ళూ చింతగుల్లలూ తిని, చెరువులో నీళ్లు దాహంతాగి ప్రయాణంసాగిం చాడు. తోవలో చెంచువాళ్ళు అతన్ని చూచి ఎవడో పరాయివాడు వచ్చాడను కొని బద్దా అలుగులూ సర్దుకొన్నారు. సమీపమునుంచి చూచి చెంచురాణీ కొడుకు చెంచురాణీ కొడుకు అని అరుస్తూ పారిపోయినారు.

నడవగా నడవగా కృష్ణానది కానవచ్చింది. బండలమీదనుంచి మందముగా ప్రవహిస్తూఉంది. దానిగట్టునే అతడు నడిచిపోతున్నాడు. వెదురు దుబ్బులలోనుండి అడవి కోళ్ళుకూయడం ప్రారంభించినవి. కోతులమందలు అతనిని చూచి ఒక బండ మీదనుంచి ఇంకొక బండమీదికి దుముకుతూపోయి అదృశ్యమైనవి. తోవలో టేకు చెట్లూ, మద్దిచెట్లూ గొడుగుతుమ్మచెట్లూ, మంచిగంధపు చెట్లూ వెదురు పొదలూ

ఎన్నో ఉన్నవి. అతడువాటిని చూడకుండా తల్లిసంగతీ తనసంగతీ తలుచుకొంటూ వెళ్లుతున్నాడు. సాయంత్రమయ్యేసరికి శ్రీశైలము చేరుకున్నాడు. తోవలో చెంచు వాళ్లెవళ్ళూ అతనికి తటస్థపడలేదు. అతనికి ఆకలివేసింది. కత్తితో ఒక ఈతచెట్టు పడగొట్టిదానిని నరికి మువ్వతిని ఆకలి దప్పులు అణుచుకొన్నాడు. శ్రీశైల దేవాలయానికి ఎదురుగా ఉన్నసత్రపు గదులలో ఆరాత్రి నిద్రపోయాడు. రాత్రినాలుగో జామునలేచి, నలిగిన బాటగుండా వెళ్ళినాడు. తోవలో వెలుగు బంట్లు అతన్నీ అతని విల్లునూ చూచి తప్పుకొన్నవి. జింకల మందలు చెంగు చెంగున దాట్లు వేస్తూపారి పోయినవి. చాలా దూరంనడిచిపోగా అతనికి పాతాళగంగ గోచరమైనది. పాతాళ గంగను అనుసరించి అతడు నడిచి పోయాడు. చిటచిట లాడుతూ ఎండకాస్తున్నది. పాతాళగంగలో స్నానముచేసి కడుపునిండానీళ్ళుతాగి ఒక బండప్రక్క నీడలో విశ్రమించాడు. అతని చుట్టూ పెద్దకొండలు; అక్కడక్కడ వెదచల్లినట్లు పెద్ద పెద్ద రాళ్ళు. కొండలనిండా చెట్లు. పెద్ద పులులు సంచారముచేసే చోటది. అతనికి అక్కడ కునుకు పట్టింది. ఎంతసేపు నిద్రపోయాడో తెలియదు. కళ్ళుతెరిచే సరికి అతనికి ఎదురుగా ఉన్నబండమీద ఒక చెంచుపిల్ల కనబడినది. కళ్ళు నులుముకొని లేచి కూర్చుని మళ్ళీ చూచాడు. నల్లని పడుచు చెంచుపిల్ల పదహారు సంవత్సరముల ఈడుగలది అతనిని పరకాయించి చూస్తున్నది. ఆమెపక్క ఒకబుట్ట, బుట్టలో పళ్ళూ కాయలూ కత్తీ ఉరులూ మొదలైన వస్తువు లున్నవి.

చెంచుపిల్లలోనుంచి లావణ్యము సూర్యబింబమునుంచి వచ్చేకిరణముల లాగ వచ్చి అతని మనస్సు నాకర్షించింది. అతని మనస్సు మనస్సులోలేదు.

“ నీవు చెంచువేనా ? ” అని ప్రశ్నించింది చెంచుపిల్ల.

“ అవును ” అన్నాడు వీరభద్రుడు.

“ మన మిద్దరమూ ఈకొండలలో ఉండి పోదాము. నాతోకూడాఉంటావా?”

“ నీకు తల్లిదండ్రులు లేరా ? ”

“ లేరు, ఉన్నారు. నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పవేం ? ”

“ నాకు పీనుగుల గొంది చూపిస్తావా ? ”

“ చూపిస్తే నా నేస్తమవుతావా ? ”

“ మా అమ్మ నడుగుతాను. ”

“ మీ అమ్మ ఎక్కడుంది ? ”

“ నాగలూటిలో ”

“ నాగలూటిలో అడవే లేదు. ఇక్కడెంత అడవో! మనం స్వేచ్ఛగా తిరుగ వచ్చు కాదూ ? ”

" అవును. "

ఈ రీతిగా కొంతసేపు సంభాషణ జరిగింది. వీరభద్రుడికి చెంచుపిల్ల కడుపునిండా పళ్లుపెట్టింది. ఇద్దరూ కలిసి కేకలు వేసుకొంటూ పాతాళగంగ అవతలి గట్టుకు ఈదుకుపోయారు. ఏరుదాటి, అక్కడకొండలు చుట్టుతిరిగి యిద్దరూ వెళ్ళుతున్నారు. త్రోవలో ఎన్నో ఊసులు కథలు చెంచుపిల్ల చెప్పింది. ఎన్నోపాటలు పాడింది. ఆ రాత్రి వాళ్ళు ఒకచెట్టుమీద గడిపారు కబుర్లు చెప్పుకొంటూను. తెల్లవారకుండా లేచి వాళ్ళిద్దరూ ప్రయాణంసాగించారు. నలగని బాటలగుండా యితరులకు తెలియని మార్గాలగుండా చెంచుపిల్ల అతన్ని తీసుకుపోయింది.

పాతాళగంగ కొండలమధ్యనుండి ప్రవహిస్తూ ఉన్నది. ఒకచోట పాతాళగంగకు అడ్డముగా పర్వతము నిలిచిఉన్నది. కృష్ణానది ఆ పర్వతముచుట్టూ తిరిగి ప్రవహించవలసినచోటు ఇక్కడ. వరదలరోజులలో కృష్ణానది పర్వతమును పొడిచి వేస్తూ ఉంటుంది. చాలాకాలము ఈ రీతిగా చేయడమువల్ల ఆ కొండలో ఒకమోస్తరు గుహ ఏర్పాటైనది. వరదలులేనికాలములో ప్రవాహము మందముగా ఉండడము చేత గుహాలోనీళ్ళు చలనములేకుండా ఉంటవి. నదిలోపడ్డ మ్రాకులు వగైరా అన్ని వస్తువులనూ కృష్ణానది యీ గుహలో దాచుకొంటుంది. నదికి ఎగువను ఉన్నతమైన కొండ ఒకటి ఉన్నది. ఆ కొండకు సరాసరి కింద పాతాళగంగ. ఆ కొండఅంచున ఒక నున్నని రాయి కలదు. ఆ రాతిమీద రెండు పాదచిహ్నాము లున్నవి. వాటికి "సిద్ధరామయ్య పాదుక" లని పేరు. మోక్షము నాశించే యాత్రికులు ఈ పాదుకల మీద నిలవబడి పాతాళగంగకు తమ్ము తా మర్పించుకొంటారు. అటువంటివారినందరినీ కృష్ణానది యీ గుహలోకి చేర్చుతుంది. దీనికే పీనుగులగొంది అని పేరు.

పీనుగులగొందికి అవతలివైపున ఒక చిన్న చెంచుగూడె మున్నది. ఆ చెంచు గూడెముకు నాయకు లిద్దరు : గంగడు, గురవడు.

చెంచుపిల్లా వీరభద్రుడూ కలిసి యీ గూడెము చేరుకున్నారు. చెంచుపిల్ల యీ గూడెమువారికి చాలా పరిచితురాలే. గూడెములో స్త్రీపురుషులు చెంచుపిల్ల స్వాతంత్ర్యము చూచి ముక్కుమీద వేలుంచుకొంటారు. వారి ఆచారవ్యవహారములతోగాని వారి కట్టుబాట్లతోగాని చెంచుపిల్లకు ఏమీ ప్రసక్తిలేదు. ఒకరిచెప్పు చేతలలో లేకుండా స్వేచ్ఛగా పెరుగుతువస్తూ ఉంది ఆ చెంచుపిల్ల.

వీరు గూడెము చేరుకొనేసరికి గూడెములోని స్త్రీపురుషులు చాలామంది వేటకు పోయారు. వీరభద్రుడూ చెంచుపిల్లా కలిసి దుబ్బులవెంట షికారుచెయ్యడం మొదలుపెట్టారు. సాయంకాలమువరకూ వారు ఆ ప్రాంతాలతిరిగి కడుపునింపుకొని చివరకు గూడెము చేరుకొన్నారు.

3

ఒకరోజున చెంచుపిల్ల అక్కడ స్త్రీ పురుషుల నందరనూ పోగుచేసి నాట్యమాడించింది.

గంగడూ గురవడూ వీరభద్రుడూ ఆ నాట్యములో చేరక కొంతదూరముగా ఒక బండమీద కూర్చున్నారు. వీరభద్రుడిని చూడడముతోనే అతను లచ్చి కొడుకని వాళ్ళిద్దరూ గుర్తించారు.

"నీవు ఇంతదూరం ఇప్పుడు రావడానికి కారణమేమి ?" అని వాళ్ళడిగారు.

"మా అమ్మ సముద్రాలమధ్యకు వెళ్ళుతుందట. ఆ సంగతి మీతో చెప్పమన్నది" అని వీరభద్రుడు చెప్పాడు.

"గౌరిని నీ వెక్కడ చూచావు ?" అని వారడిగారు.

"గౌరి ఎవరు ?"

"నీతో వచ్చిన చెంచుపిల్ల."

"తోవలో తటస్థపడి నాకు దారి చూపించింది."

"అయితే నీ వదృష్టవంతుడవే !"

"ఎందుచేత ?"

"గౌరి ఇంతవరకు ఏ పురుషుడితోటీ కలిసిమెలిసి ఉండలేదు." వీరభద్రుడు మాట్లాడలేదు.

"గౌరి చిన్న చెంచురాణీ."

"మా అమ్మను చెంచురాణీ అనీ నన్ను చెంచురాణీ కొడుకనీ పిలవడానికి కారణమేమిటి ?" అని వీరభద్రుడు అడిగాడు.

వారిద్దరిలో కొంచెము పెద్దవాడైన గంగడు ఆ వృత్తాంతమంతా వీరభద్రుడితో ఈ విధముగా చెప్పాడు.

లచ్చి చిన్నతనములో చాలా అందముగానూ చురుకుగానూ ఉండేది. ఆమె ఎక్కలేని కొండలూ చెట్లూ లేవు. పురుషులతో సమానముగా వేటాడుతూ మోట పనులుచేస్తూ ఉండేది. ఇంతేకాకుండా అడవులలో తిరిగి మందులూ మాకులూ సంపాదించి వైద్యము చేయడమే కాకుండా కొంతవరకు మంత్రములుకూడా నేర్చుకొన్నది. ఆ కారణముచేత చెంచువాళ్ళకు లచ్చిఅంటే భయము భక్తీ.

చిన్నతనములో లచ్చీ నేనూ చాలా స్నేహముగా ఉండేవాళ్ళము. ఇద్దరమూ కలిసి వేటకు వెళ్ళేవాళ్ళము. ఇద్దరమూ ఏటిలో ఈదులాడే వాళ్ళము. ఇద్దరమూ నదిఒడ్డున పొంచుండి, ఇసుకలో పడుకోవడముకు మొసళ్ళువచ్చినప్పుడు వాటిని

ఉచ్చులతో పట్టుకొనేవాళ్ళము. అప్పుడు మాకు భయమంటే ఏమిటో తెలియదు. ఒక్కొక్కప్పుడు చాలారోజుల వరకూ మేము అడవుల్లో వేటాడుతూ ఉండి పోయేవాళ్ళము.

ఆకాలములోనే లచ్చి నన్ను పెళ్ళాడతానని చెప్పింది.

అప్పుడు చెంచువాళ్ళకు చాలా కష్టదినములు. అడవులలో పండిన పంటంతా అధికారులు తీసుకుపోయేవారు. మాకు తినడానికి తగినతిండి ఉండేదికాదు. ఎన్ని విధాలు తంటాలుపడ్డా, మాకు ఆకలి అణిగేదికాదు. అప్పుడు మేమందరమూ ఆందు వాళ్లు మగవాళ్ళూ-- ఆలోచించాము. మాలో గురవడు చాలాబుద్ధిమంతుడు. అనేకమంది అనేకసలహాలు చెప్పారు. తుదకు అప్పుడు తీర్మానించుకొన్నాము- అధికారులను అడవులలో కాలుపెట్టనివ్వ కూడదని. అయితే ఆరీతిగా చెయ్యడం ఎలాగ? అందరూ ఆలోచించారు. ఎవరికీ మార్గంతోచిందికాదు. ఎవరైనా సరియైన మార్గంసూచించినట్లయితే వారిని లచ్చి పెళ్లాడతానన్నది. గురవడుతాను చేస్తాన న్నాడు. నాకు దుఃఖము కలిగింది. లచ్చి మీాదా గురవడి మీాదా నాకు కోపం వచ్చింది. పగలు తీర్చుకోవడానికి సమయముకాదది.

గురవడు చెంచువాళ్ళ నందరినీ పదిజట్టులకింద విడదీసి ఒక్కొక్క జట్టుకు ఒక్కొక్క పెద్దను ఏర్పాటు చేశాడు. కొన్నిజట్టులను రోడ్లు కాయడానికి పంపాడు. కొన్నిజట్టులను అడవులలో ఉన్న అధికారుల మీాదకు పంపాడు.

తరవాత గురవడు లచ్చిని పెళ్ళిచేసుకొన్నాడు. లచ్చి తల్లిదండ్రులకు నాలుగుజతల ఆవుల నిచ్చి లచ్చిని తీసుకు పోయాడు. ఒకనాడురహస్యముగా లచ్చిని నేను కలుసుకొని చిన్నతనములో అది అన్నమాట జ్ఞాపకముచేశాను. లచ్చి నవ్వింది. ఈరీతిగా చెప్పింది. "చిన్నతనములో నిన్ను పెళ్ళి చేసుకొన్నాను. ఇప్పుడు గురవడిని పెళ్ళిచేసుకొన్నాను. నాకిద్దరు భర్తలు. ఉండకూడదా?" రహస్యముగా ఇద్దరు భర్తలుండకూడదని నేను చెప్పిన మాటలు పెడచెవిని పెట్టింది. పర్యవసాన మేమి జరిగిందంటే-లచ్చి గురవడితో సంసారము చేస్తూ ఉన్నప్పటికీ మేమిద్దరము భార్యాభర్తల వలెఉండడానికి నిశ్చయించుకొన్నాము. ఈవిషయము మాత్రము రహస్య ముగా ఉంచాము.

ఆరోజులలో చెంచువాళ్ళ ప్రతాపము లోకానికి వెల్లడయింది. రోడ్లమీాద ఎవరు ప్రయాణము చేసినప్పటికీ వాళ్ళు చెచుంవాళ్ళ అలుగులకు గురి అయ్యేవారు. మావాళ్ళందరూ అధికారులను దొరికినంత మట్టుకు హతమార్చారు. అడవి సమీా పానికి రావడానికి అందరూ భయపడ్డారు. ఆరోజులలో ఎందరిని చెంచువాళ్లు చంపా రో ఎందరిని చెరపెట్టారో చెప్పడానికి వీలులేదు. అడవిరాజ్యం కొంతకాలం మళ్లీ

చెంచువాళ్ళు ఏలారు. మా కష్టము కడుపునిండా తిండిదొరికింది. సంతోషించాము.

కాని తలవని తలంపుగా పోలీసుపటాలాలు అడవుల్లో ప్రవేశించినవి. మాకూ వాళ్ళకూ అనేకయుద్ధాలు జరిగినవి. మాకు అలుగులూ దబ్బలూను, వాళ్ళకు తుపాకులు. ఆకారణముచేత చెంచువాళ్ళు చాలామంది చచ్చిపోవడం సంభవించింది. అందువల్ల వాళ్ళు భయపడి పారిపోవడం మొదలుపెట్టారు. పోలీసువాళ్ళు వాళ్ళని అడవులలో జింకలని వేటాడినట్లు వేటాడారు. కొంతకాలానికి అడవిరాజ్యం చెంచు వాళ్ళ వశం తప్పి మళ్లీ తెల్లవాళ్ళ స్వాధీన మైనది. చావగా మిలిగిన చెంచు వాళ్ళు తెల్లవాళ్ళ రాజ్యాన్ని ఒప్పుకోక తప్పిందికాదు. మాయలు పన్ని లంచా లిచ్చి ఒక తెల్లదొర చెంచునాయకులను కొందరిని పట్టుకొని ఉరిదీయించాడు. దానితో అల్లరులు సద్దుకొన్నవి.

చెంచువాళ్ళ కోపం చల్లార్చడానికీ, వాళ్ళల్లో మళ్ళీ కలవరం కలగకుండా ఉండడానికీ, వాళ్ళకు సరియైన జీతాలిచ్చి పనిచేయించడానికీ ఒక తెల్లదొర ఏర్పాటై నాడు. అతడు జాలిగుండెవాడు, మంచివాడు. అతడు నాగలూటి దగ్గిరబంగాళాలో ఉండి అన్నికార్యములూ న్యాయముగా చక్కపెట్టేవాడు. చెంచువాళ్ళ నందరినీ దయతో చూచేవాడు. వాళ్ళు కష్టసమయములో ఉన్నప్పుడు వాళ్ళకు డబ్బిచ్చేవాడు. చెంచువాళ్ళందరకూ అతడంటే గౌరవమూ భక్తీ కలిగినవి. అందరూ సంతుష్టిచెంది కాలక్షేపం చేస్తున్నారు.

లచ్చి నాతో చనువుగా తిరుగుతున్నదనే సంగతి గురవడు గ్రహించాడు. గురవడూ లచ్చీ కలిసి ఒకనాడు వేటకు వెళ్ళారు. నేనూ స్వతంత్రముగా వేటకు వెళ్ళాను. ఆరోజు మధ్యాహ్నము మే మొకచోట తారసపడ్డాము. గురవడికి నన్ను చూడడంతోనే కోపం వచ్చింది. నామీదకు వచ్చి పడ్డాడు. మే మిద్దరమూ కలియ బడ్డాము. లచ్చి నాపక్షము వహించింది. గురవడిని తోసిపారేసింది. గురవడు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. ఆరోజున లచ్చీ నేనూ సాయంకాలమయ్యేవరకూ అడవుల్లో తిరిగి యింటికి చేరుకొన్నాము.

గురవడు చెంచులలో పెద్దవాళ్ళనందరినీ పిలిచి తగవుపెట్టాడు. పెద్దలం దరూ విచారణకు పూనుకొన్నారు. ఈవిషయము నిజమేనా అని నన్ను అడిగారు. నేను నిజమే నన్నాను. నిజమేనా అని లచ్చిని అడిగారు. నాయిష్టమని లచ్చి నిర్ల క్ష్యముగా సమాధానం చెప్పింది. నేరము నిర్ధారణ అయినదికాబట్టి పెద్దలందరూ తీర్పుచెప్పారు. "గురవడి భార్యయైన లచ్చిని గంగడు మోసంచేసి తన భార్యగా చూచుకొంటున్నాడు కాబట్టి ఈరోజునుంచీ గంగడే లచ్చిని ఏలుకోవలసి ఉంటుందనీ,

గురవడికి అపకారం జరిగిందికాబట్టి అతనికి గంగడు పదిహేనురూపాయలు దండుగ యిచ్చుకోవలసి ఉంటుందనీ" తీర్పు.

లచ్చి నావశమైనందుకు నేనూ లచ్చికూడా సంతోషించాము. కాని పది హేనురూపాయల దండుగ ఇచ్చుకోవడ మెలాగ ? నావద్ద అప్పుడు ఒక్కరూపా యైనా లేదు. నాకు చెప్పతగ్గ ఆస్తి ఏమీలేదు. దండుగ యిచ్చుకోకపోయినట్లయితే నన్ను ఏమైనా వాళ్ళుచేయవచ్చును. ఏమిచెయ్యడానికీ తోచక నేను లచ్చినిమాత్రం స్వీకరించి దండుగమాట తలపెట్టకుండా చాలా రోజు లూరుకొన్నాను. చెంచుపెద్ద లకు కోపం వచ్చింది. నన్ను శిక్షించడానికి చెంచువాళ్ళు సిద్ధపడుతున్నారు. నా బంధువులూ స్నేహితులూ నాపక్కనుండి నన్నుకాపాడుటకు ప్రయత్నిస్తున్నారు. అప్పుడు మాలో ఒక యుద్ధము జరగవలసినదే కాని తప్పి పోయింది. కారణ మేమి టంటే ....

నాగలూటిలోఉన్న తెల్లదొరకు మా వివాదవృత్తాంతము తెలిసింది. అతడు వచ్చి సంగతిసందర్భములను తెలిసికొని వివాదకు కారణము పదిహేనురూపాయలే కదా అనుకొని ఆరూపాయలు అతడు గురవడికి నాతరఫున ఇచ్చి వెళ్ళిపోయాడు. కాని ఒక చిక్కు తటస్థించింది. పదిహేనురూపాయలు ఎవరిస్తే వారికే లచ్చికూడా చెందవలసి ఉంటుంది. లచ్చి నాకే చెందవలసి ఉంటుందని నేను ఎంత చెప్పినా పెద్దలు చెవిని పెట్టారుకారు. అది ఆచారం అన్నారు. మరునాడు వాళ్ళు లచ్చిని వెంటబెట్టుకొని తీసుకువెళ్ళి "ఈమె నీ భార్య" అని చెప్పి తెల్లదొరకు అప్ప చెప్పారు. తానిచ్చిన రూపాయలకు తనకీ ప్రతిఫలము ముట్టినదని తెల్లదొరకు వారు నచ్చచెప్పారు. తెల్లదొర ఆశ్చర్యపోయాడు. కాని తాను చెంచువాళ్ళమధ్య ఉన్నాడు కాబట్టి చెంచువాళ్ళ ఆచారములకు బద్ధుడైనట్లు తలచి విధికి తలవంచి ఊరుకొన్నాడు. అతడు బ్రహ్మచారికూడాను. లచ్చి ఆనాటినుంచీ తెల్లదొరయింట్లో ఉండడము తటస్థించింది.

౪

లచ్చిని చెంచుపెద్దలందరూ ఈరీతిగా చెయ్యడం నాకు కష్టమనిపించింది. గుర వడికికూడా కష్టమనిపించింది. ఆకారణముచేత అతనూ నేనూ స్నేహితులమయాము. తెల్లదొర దగ్గరనున్న లచ్చిని తీసుకురావడానికి ప్రయత్నాలుచేశాము. అందువల్ల చెంచువాళ్లందరికీ మాటవస్తుందని మిగిలిన చెంచువాళ్ళు మమ్మలిని మందలించారు. అయిన చెంచుకుటుంబములో పుట్టిన చెంచుదాన్ని పరాయివాళ్ళ కర్పించడం

న్యాయముకాదని వాళ్ళతో చెప్పాము. వాళ్ళు విన్నారుకారు. అప్పుడు మే మిద్దరమూ మా స్నేహితులను బంధువులనూ తీసుకొని, అక్కడ చెంచువాళ్ళని కులం తక్కువవాళ్ళని నిందించి, బయలుదేరి వచ్చి యిక్కడ — ఈపీనుగులగొంది దగ్గిర ఒక గూడెము నిర్మించుకొని కాపురంచేస్తున్నాము. మా యిద్దరికీ లచ్చిమీద అభిమానం పోలేదు. ఎప్పటికైనా దానిని మావశంచేసుకోవలెననే ఆశతో ఉన్నాము.

లచ్చి దొరగారియింట్లో ప్రవేశించింది. కొన్నాళ్ళవరకూ లచ్చికీ దొరగారికీ సంభాషణ జరగలేదు. కాని అక్కడనుంచి లేచి పారిపోయివస్తే దొర ఏమిచేసి పోతాడో అని భయం. అది అటుండగా అక్కడ కూటికీ బట్టకూ లోటులేకుండా దివ్యముగా జరిగి పోతున్నది. అటువంటి భాగ్యము వదలిపెట్టడానికికూడా ఆమెకు మనస్కరించిందికాదు. దొరగారు క్రమక్రమముగా లచ్చితో మాట్లాడడం మొదలు పెట్టారు. "నా ప్రియా, ఇటు వచ్చుము. నాకొక ముద్దు నిచ్చుము" అనే వారట. లచ్చికి విలువయైన బట్టలూ నగలూ మంచిమంచి ఆహారమూ పెట్టేవారట. దానా దీనా వారిద్దరికీ అన్యోన్యం కుదిరింది. ఇద్దరూ భార్యా భర్తలలాగ ఉంటున్నారని చెంచువాళ్ళకు తెలిసింది. చెంచువాళ్ళు దొరగారితో మాట్లాడవలసి వచ్చినా, దొరగారితో తమ కష్టసుఖాలు చెప్పుకోవలసి వచ్చినా, దొరగారిని ఏమైనా కోరవలసివచ్చినా లచ్చి ద్వారానే ఆ పనులు చేసేవారు. లచ్చి క్రమక్రమముగా చెంచువాళ్ళందరకూ దేవతవంటి దైనది.

తెల్లదొర లచ్చిని "బెస్సీ, నా ప్రియా, బెస్సీ" అని పిలిచేవాడు. చెంచువాళ్ళ వ్యవహారాలు పరిష్కరించవలసి వచ్చినప్పుడల్లా తెల్లదొర తన బెస్సీ సలహా లేనిదే ఏపనీ చేసేవాడు కాడు. లచ్చి చెంచువాళ్ళందరికీ సాధ్యమైనంతవరకూ ఉపకారం చేసేది.

తెల్లదొరా బెస్సీ కలిసి అప్పు డప్పుడు, కొందరు చెంచువాళ్ళను తీసికొని, షికారు వెళ్ళేవారు. ఆ సమయాలలో బెస్సీ తుపాకీ గురితప్పకుండా కాల్చడం నేర్చుకొన్నది. ఇది చూచి చెంచువాళ్ళు బెస్సీ అంటే భయముతో ఉండేవారు. ఆ రోజులలోనే చెంచువాళ్ళు లచ్చికి చెంచురాణీ అనే పేరుపెట్టారు. దొరగారుకూడా ఈ మాట విని సంతోషించి చెంచురాణీ అని ఆమెను పిలిచేవారు.

ఒకనాడు నేనూ గురవడూ కలిసి నాగలూటి వెళ్ళాము. అక్కడ కొన్నాళ్ళు వేచిఉండి సమయము కనిపెట్టి లచ్చిని రహస్యముగా కలుసుకొన్నాము. మేము కొత్తగా నిర్మించిన కొత్తగూడెముకు తీసుకొనిపోతే వస్తుందేమో నని అడిగాము.

లచ్చికి మా మీద అభిమానం తగ్గలేదు కాని మాతో వచ్చినట్లయితే దొర ఏమైనా చేసిపోతాడనీ, మాకే కాకుండా చెంచువాళ్ళందరకూ అది శ్రేయ

స్కారము కాదనీ ఏమేమో సాకులు చెప్పి తప్పించుకొన్నది. మా ప్రయత్నాలు నిష్ఫలమైనవి. అప్పుడు లచ్చి కడుపుతో ఉంది. దొర ఆవిడను రోజు రోజూ ఎక్కువ ఆదరముతో చూస్తున్నాడు. ఆ రోజులలో లచ్చిని కాలు కదపనిచ్చేవాడు కాదు. రాత్రిం బగళ్ళు తన బెస్సీ దగ్గరే గడిపేవాడు. లచ్చికి దొర అంటే ఎక్కడా లేని ప్రేమ. ఇట్లా అన్యోన్యముగా ఉంటూ ఉండగా ఇంతట్లోకి తెల్లదొరకు బదిలీ అయినది. ఆ సంగతి లచ్చితో చెప్పి ఆవిడను వదలిపెట్టి వెళ్ళడానికి అనుమతి అడిగాడు. లచ్చి తనను కూడా తీసుకువెళ్ళమని ఎంతో ప్రార్థించింది. అది వీసగదన్నాడు దొర. చివరకు లచ్చి ఒప్పుకొన్నది. దొర ఆవిడకు కొన్ని బహుమతు లిచ్చి అక్కడనుంచి వెళ్ళిపోయాడు. చెంచురాణీ ఒక్కర్తే ఆ ప్రాంతాల గుడిసె వేయించుకొని అందులో ఉంటూ ఉన్నది.

ఈ సంగతి తెలిసి నేనూ గురవడూ కలిసి మళ్ళీ నాగలూటి వెళ్ళినాము. లచ్చి మమ్మును చూచి కళ్ళ నీరు పెట్టింది. మాతో రమ్మని ఆమెను కోరితే తన స్థితి మాతో చెప్పి రానన్నది. అప్పుడే ఒక తుపాకీ, ఒక వెండి సిగరెట్టు కేసూ, మూడు కాసులూ మా చేతికి జాగ్రత్త చేయమని చెప్పి యిచ్చింది. తాను కోరినప్పుడు వాటిని తిరిగీ యియ్యవచ్చునని చెప్పింది. నీవు వచ్చావు కాబట్టి నీకు వాటిని ఈ రోజున అప్పచెప్పుతాము. నీవు ఆమె పుత్రుడవు కాబట్టి, అవి నీ తండ్రివి కాబట్టి నీకే చెందవలసినవి. నీవు చిన్న శిశువుగా ఉన్నప్పుడు మేము మళ్ళీ నాగలూటి వెళ్ళి లచ్చిని రమ్మన్నాము. తెల్లదొర ఎప్పుడైనా ఆ ప్రాంతాలకు రావచ్చుననీ అందుచేత తా నక్కడనే ఉండవలెననీ ఎప్పటికైనా తాను తెల్లదొరదేశం వెళ్ళవలెననీ, తన కొడుకు పెద్దవాడైనాక తన్ను తప్పకుండా తన తండ్రి దగ్గిరికి తీసుకువెళ్ళు తాడనీ ఏమేమో ఆటంకములు చెప్పింది. తెల్లదొరతో కాపురం చేసే రోజుల్లో అతడు తన దేశాన్ని గురించీ తన దేశస్థులను గురించీ వారి వేమభాషలు ఆచార వ్యవహారములను గురించీ ఆమెతో చెప్పాడు. అప్పటినుంచీ లచ్చికి ఆదేశం వెళ్ళవలెననీ ఆదేశంలో తన భర్తతో కూడా కాపురం చేయవలెననీ కోరిక."

వీరభద్రుడు తన తల్లికథ ఆమూలాగ్రముగా విన్నాడు. తన పుట్టుకసంగతి తెలుసుకొన్నాడు. ఉండుండి తన తల్లి సముద్రాలమధ్యకు వెళ్ళిపోతానని చెప్పడం అప్పు డతనికి బోధపడింది.

గౌరి యింతట్లోకీ పరుగెత్తుకొనివచ్చి "ఇంతసేపూ ఏమిచేస్తున్నావు నాకు కనిపించకుండా. రా నాట్య మాడదాం రా" అని చెయ్యిపట్టుకు తీసుకుపోయింది. చాలాసేపు వారు చెంచువాళ్ళందరితో కలిసి ఆడుతూ పాడుతూ సరదాగా కాలం గడిపారు.

వీరభద్రుడు ఆరోజుననే తుపాకీ వగైరా వస్తువులు గంగడు గురవళ్ళ దగ్గర పుచ్చుకొని యింటికి వెళ్ళడానికి ప్రయాణమయ్యాడు. చెంచుపిల్లకూడా వస్తానన్నది.

వాళ్ళిద్దరూ మరునటిదినం ఉదయం ప్రయాణమయినారు. కొత్తదోవల గుండా చెంచుపిల్ల అతన్ని తీసుకుపోతున్నది.

ఆనాటిసాయంకాలం వారు ఒక కొండకొలనుదగ్గర విశ్రమించారు. సంతోషముగా కబుర్లు చెప్పుకొన్నారు. చెంచుపిల్ల అక్కడ అప్పుడు తనను పెళ్ళిచేసుకోమని అతనిని కోరింది. "మీ తల్లిదండ్రులకు కట్నముకింద ఆవులని ఇస్తేనేకాని పేచీ వస్తుందేమో" అన్నాడు వీరభద్రుడు. "నన్ను అందరూ చిన్న చెంచురాణీ అంటున్నారు. నేనే అందరినీ శాసిస్తాను. నాకు చెప్పేవాళ్ళెవళ్ళూ లేరు" అని ఆమె చెప్పింది.

"నీవు చిన్న చెంచురాణీ వయితే నీకంటె పెద్ద చెంచురాణీ ఒకతె ఉండవచ్చుగదా. ఆమె మాటలూ వినవా?"

"ఎవరు పెద్ద చెంచురాణీ?"

"నా తల్లి"

"నిజంగా! అయితే వింటాను. అందుచేతనే నిన్ను పెళ్ళిచేసుకొందామని నాకు తోచింది."

"నేను నిన్ను పెళ్ళాడనంటే ఏమి చేస్తావు?"

"నిన్ను నేను పెళ్ళాడుతాను. నేను చిన్న రాణీని నామాట నీవు వినాలి."

"పెళ్ళి చేసుకొన్న తరువాతకూడా నీ మాట నేను వినవలసి ఉంటె నేను పెళ్ళిచేసుకోను."

"అప్పుడు నీ మాట నేను వింటానులే" అని చెంచుపిల్ల అతని సమీపించి బతిమాలేటట్టు నిలుచున్నది. వీరభద్రుడు చిట్టచివరకు పెళ్ళిచేసుకోవడానికి ఒప్పుకున్నాడు. కాని తన తల్లితో చెప్పితేనేగాని ముందుగా మాట యివ్వనన్నాడు. చెంచుపిల్ల కొంతసేపు కోపగించింది. కొంతసేపు ఏడ్చింది. అక్కడనుంచి వెనక్కు వెళ్ళిపోతా నన్నది. ఇక ముందు అతనికి తోవ చూపించనంది. ఇన్నీ చేసి చివరకు అతని కంఠాన్ని కౌగిలించుకొని అక్కడ అప్పుడు తనను పెళ్ళిచేసుకుంటేనే గాని వదిలిపెట్ట నన్నది. వీరభద్రుడు చివరకు ఒప్పుకొన్నాడు.

కొండ సరస్సు నీళ్ళల్లో నక్షత్రాలు ప్రతిఫలిస్తున్నవి. చెట్ల కొమ్మలసందులలోనుంచి గాలి నెమ్మదిగా వీస్తున్నది. వెదురుపొదలలో రొదలు వినబడుతున్నవి. అప్పుడే పక్షిదంపతులు గూళ్ళల్లో నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నవి. ఒక్క పక్షి మాత్రము కొమ్మమీద కూర్చుని చల్లగా పలుకుతున్నది. ఆ సమయాన ఆ స్థలాన ఆ చెంచే

పిల్లకూ చెంచువాడికీ వివాహము జరిగింది. పెండ్లిపెద్దలు లేని వివాహము, కట్నములు లేని వివాహము.

మొదట మానవ దంపతులకు ఇటువంటి సందర్భములలోనే వివాహము జరిగి ఉంటుంది.

తమ వివాహము స్థిరపడినట్లు నిదర్శనముగా వారు ఒకరి నొకరు ముద్దు పెట్టుకొన్నారు. ఒక్కమారు ఒకరి కౌగిలిలో ఒకరు ఒదిగినారు. చెట్టుమీద పక్షి మరీ మధురముగా పాడింది.

తెల్లవారుజామున చెంచులిద్దరూ కిలకిలలాడుతూ కబుర్లు చెప్పుకొంటూ నాగలూటి వైపు నడిచివెళ్ళారు. వారికి ప్రపంచమంతా కలకలలాడుతున్నది. నడక శ్రమగా లేదు. చెంచుపిల్ల మాటలలో, నడకలో, కథలలో, అవయవములలో అంతటా ఉత్సాహమే; అంతా నవ్వే.

వారిద్దరూ నాగలూటి చేరుకున్నారు. వీరభద్రుడు తన గుడిసెదగ్గిరికి చెంచు పిల్లను తీసుకు వెళ్ళాడు. అక్కడ అతని తల్లి కనిపించింది కాదు. పొరుగు చెంచు వాళ్ళు వచ్చి అతనితో చెప్పారు ఈ రీతిగా. అతడు వెళ్లిన మరునాడే చెంచురాణీ జబ్బుపడినదనీ ఆ జబ్బులోనే " నేను సముద్రాల మధ్యకు వెళ్ళిపోతున్నా " అని ఉండుండి చెప్పి మరణించిందనీ.

వీరభద్రుడు చాలాసేపు దుఃఖించాడు. చెంచుపిల్ల అతనిని ఓదార్చింది. మరునాడే వారిద్దరూ నాగలూటి పుష్కరిణిలో స్నానముచేసి దట్టముగా ఉన్న అడవులలో వన్యమృగములతోపాటు కాపురము చెయ్యడానికి వెళ్ళిపోయారు.

వీరభద్రుడు ఇంకా విచారముగా ఉండడము చూచి చెంచుపిల్ల గౌరి అతనితో అన్నది. " నీ తల్లి చెంచురాణీ సముద్రాల మధ్యకు పోయింది. నీ భార్య చెంచు రాణీ నిన్ను వదలకుండా యీ అడవులలోనే నీతో తిరుగుతున్నది. ఇంకా నీ కెందుకు విచారం ? "

*

అభిప్రాయభేదము

చింతా దీక్షితులు

౧

ఆయనకు కూతురుతప్ప ఇంకెవరూ సంతానములేరు. ఆయన వడ్డీవ్యాపారం చేసే షావుకారువద్ద గుమాస్తా. ఆయనద్వారానే షావుకారు బదుళ్ళు ఇచ్చేవాడు. ఆయనే పద్దులు వ్రాసేవాడు, అప్పులు వసూళ్లు చేసేవాడు. ఆయనకు ముప్ఫయి రూపాయలజీతం. ఇదిగాక నూటికిరూపాయచొప్పున తాను బదులిప్పించినవారిదగ్గర నుంచి రుసుము వసూలుచేసేవాడు. దానాదీనా ఆయన జీవయాత్ర గడుపుతున్నాడు. ఇల్లు కొన్నాడు, తోట వేయించాడు.

ఈమధ్యనే ఆయన భార్యకొకకాసులపేరూ కూతురికొకకంఠె చేయించాడు. కూతురు కంఠె పెట్టుకొని ఆడుకొంటూంటే తల్లిదండ్రులు చూచిసంతోషించేవారు. కూతురికి అయిదోయేడు.

౨

ఆప్రాంతాన యానాదిమనిషి కాపురముంది. ఆమెకు ఒకకూతురు. ఆకూతురికి మూడోయేడు. రెండుసంవత్సరములైనది భర్త ఆమెను వదిలిపెట్టి ఎక్కడకో వెళ్లి. అప్పటినుంచీ ఆ యానాదిమనిషి దొరికినప్పుడు కూలీనాలీచేసుకొంటూ ఏచెట్టుకిందో ఏపంచనో నిద్రపోతూ కూతురినిపెట్టుకుని కాలక్షేపంచేస్తూ ఉన్నది. కూలిదొరకనప్పుడూ, రెండుమూడు రోజులపాటు తిండిదొరకనప్పుడూ కూతురిని పోషించడానికి మార్గం కనపడక ఆమె వీధులవెంట ముష్టికి బయులుదేరేది.

ఆ యానాదిమనిషికి ఆకూతురే సర్వమూ. ఇరుగుపొరుగువాళ్ళను యాచించి తెచ్చుకొన్న చిరుగుచొక్కాలతోనూ పరికిణీలతోనూ కూతురికి ముస్తాబుచేసేది. ముస్తాబుచేసిన కూతురిని చూచి ఆతల్లి హృదయం ఉప్పొంగేది.

నల్లని, సన్నని, బూదిద అంటిన శరీరం, చిక్కుకట్టిన నల్లనిజుట్టూ, తళతళ లాడినవ్వేకళ్ళూ, అకారణముగా పెదవులు విడిపడడంచేత కలిగిననవ్వూ రోజురోజూ చూచే ఆమెకు భర్తలేనిలోపం కనిపించలేదు. దీనికితోడు కొంతముస్తాబు కూతురికి చేస్తేనేకాని ఆతల్లికి మనశ్శాంతి లేకపోయేది.

అందుకని బయళ్లలో వికసించిన తంగేడుపువ్వులు తీసుకువచ్చి ఆమె కూతురికి చెవులో జూకా లుంచేది, మెళ్ళో పేరులు వేసేది.

ఒకమారు పచ్చగన్నేరు పువ్వులూ, ఒకమారు తురాయి పువ్వులూ, ఒక మారు తంగేడుపువ్వులూ సంపాదించి కూతురికి ముస్తాబు చేసేది. కాని ఆమెకు ఇంకా తృప్తి కలగలేదు. కారణం ఏమిటంటే ?

పండుగులకూ పబ్బాలకూ నాగరికులపిల్లలు బంగారునగలు ధరించడం ఆమె చూచింది. అవిచాలా బాగున్నవని ఆమె అనుకుంది. తన కూతురుకూడా అలాంటి నగలు పెట్టుకుంటే ఎంతబాగుంటుందో— ఎంతబాగుంటుందో ! అపూటకు తిండిలేని ఆయానాదిమనిషికి బంగారునగలు ఎక్కడనుంచి వస్తవి ?

3

సంవత్సరాదినాడు అందరూ ముస్తాబైనారు. అందరూ వేపపువ్వు తిన్నారు.

ఆ యానాదిమనిషికి సంవత్సరాదికీ ఇతరదినములకూ తేడాఏమీలేదు. అన్ని రోజులూ ఒక్కటే. అన్నిరోజులూ తిండికీ బట్టకూ తాపత్రయపడవలసినరోజులే.

అప్పుడు తంగేడుపువ్వులు పూయడంలేదు. రాధామనోహరం పువ్వులూ నందివర్ధనపువ్వులూ కలవు. వాటితోటి ఆమె కూతురికి అలంకరించింది. కాని వెనుకటి కోరిక ఇంకా సఫలం కాలేదు. తనకూతురికి బంగారునగ లుంచి ముస్తాబుచేసి ముద్దు పెట్టుకుంటే ముద్దుపెట్టుకుంటే —

ఆనాడు మధ్యాహ్నం కూతురిని చంకనుపెట్టుకొని వీధివెంట నడచి వెళుతున్నది యానాదిమనిషి. కూతురు తల్లితో ఏవేవో ఊసులాడుతున్నది.

ఒకచోట ఆగున—అంటే షాహుకారుదగ్గరగుమాస్తా—కూతురు ఆడుకుంటున్నది. కంటె మెల్లోపెట్టుకొని ఆడుకొంటున్నది. ఆయానాదిమనిషి ఆపిల్లను చూచింది. ఆకంటె చూచింది. తనకూతురికి ఆకంటె—అలాంటికంటె పెట్టితే —పెట్టితే ఎంత బాగుంటుందో — అలాంటికంటె ఎలాగ పెట్టడం ? పోనీ ఆకంటేపెట్టితే— అమ్మో ! ఆకంటే !

ఆతల్లి ప్రాణం ఉండబట్టిందికాదు. ఆ యానాదిమనిషి ఆపిల్లదగ్గిరికి వెళ్ళింది. పళ్ళుపెడతానని మంచిమాటలాడింది. మెళ్ళోకంటెతీసింది. తనకూతురుమెళ్ళోపెట్టింది. చూచింది. తల్లిప్రాణం కుదుటపడింది. తనకూతురిని ముద్దుపెట్టుకొంది. కాని ఒక సందేహంకలిగింది.తంగేడుపువ్వులవల్లకలిగేఅందంకంటే ఈకంటెవల్లఏమిఎక్కువ అందం కలిగింది? ఎందుకో ఈభాగ్యవంతులు ఈలాగంటి నగలుపెట్టుకుంటారు ?

కంటె మెళ్ళోనుంచి తీసినతర్వాత గుమాస్తాకూతురు కెవ్వున కేక వేసింది. యానాదిమనిషి భయపడింది. ఆపిల్ల కేక విన్నవాళ్లు పరుగెత్తుకువచ్చారు. యానాది మనిషి పరుగెత్తింది భయపడి. వాళ్ళు వెంటపడ్డారు. పట్టుకొన్నారు. తన్నినారు చితకామతకా ఆ యానాదిమనిషిని.

కంటె తీసినట్లు ఆమె ఒప్పుకుంది. కాని కారణం చెప్పిందికాదు. ఆమెకూతురు మెళ్ళోకంటె వాళ్ళు తీసుకొన్నారు. కూతురు ఏడ్చింది. యానాదిమనిషి కూతురు ఏడ్పు విని జాలిచెందింది.

పోట్టగడవక ఆమె దొంగతనం చేసిందని పోలీసువాళ్ళరు ఆమెను అప్ప చెప్పారు

గుమాస్తా న్యాయముగా సంపాదించినడబ్బుతో చేయించినకంటె అన్యాయంగా దొంగిలించినందుకు యానాదిమనిషి కొంతకాలం చెరసాలలో కూతురుతో కూడా ఉండవలసివచ్చింది. దొంగతనము చేసినందుకని ప్రజలన్నారు, తన కూతురికి ముస్తాబు చేసినందుకని ఆమె అనుకొన్నది.

*

దీక్షితులన్నగారు

వింతభావాల్ వెతకడానికి
వింతవ్రాతలు వ్రాయడానికి
చింతా దీక్షితు లొక్కడే మా
కెంతో నచ్చాడు.

కవికుమారుడ సేన అంటూ
కావ్యగీతా లల్లుకొంటూ
గీతమాలిక లంచమిచ్చి
కన్య పట్టాడు.

తాళవృక్షపు చెత్తునుండీ
దవ్వుదవ్వుల వింతలను మా

మూలు మానవ మాత్ర దృష్టుల
మించి చూస్తాడు.

నెమలికన్నుల నీలిగప్పి
వెన్నెలలతో వెల్ల వేసి
గట్టిమాటల పొదిగి ఇట్టె
ఇల్లు కడతాడు !

౮

ఇంటిముందర తాను తన
వరహాల తల్లికి బువ్వ పెడుతూ
పాడుకుంటూ ఆడుతూ బా
జాలు పలికించు.

ఇంతలో శీతాచలోన్నత
శృంగవీథులపై వరూథిని
నగ్నతకు ఒకమంచు తెలివస
నమ్ము కడతాడు.

కాపుపడుచో గడ్డిపువ్వో
ప్రకియమధుర ప్రణయతత్వమొ
ఒక్కకట్టే - చిటికలో నొక
పటము కడతాడు.

బొల్లిభావా లొల్లబోదు,
కల్లగీతా లల్లబోదు,
పొడుపుకథ బ్రహ్మాండసత్యము
పొదిగివేస్తాడు.

ఇంతకూ మాయన్న దెంతటి
ఘనతరో, కృష్ణమ్మ చేతుల
పొదుగు వెదురై తేనతేటల
పులకరిస్తాడు !

[కృష్ణశాస్త్రి : : ముద్దుకృష్ణమ్మ]

శ్రీ గుణానుభవము

కొమాండూరు
కృష్ణమాచార్యులు

*

క్షీరసముద్రశీకరవిచిత్రభవత్కుచకుంభ యుగ్మక
స్మేరవిలోకనంబుల నశేషమహాయుగముల్ మురారి కిం
పార గతించె తత్పరిచయంబున వానినె దేవి, కృష్ణుఁ డా
భీరకుమారికా స్తననిపీడమిషంబున సంస్మరించెదున్.

భవదధరామృతంబు మురవైరి యనేకసహస్రకల్పముల్
చవిగొని తత్ప్రభావమున చండనిశాటవధూకుచాద్రి సం
భవవిషనిర్ఝరంబులను పానము చేసియు స్వస్థుఁడయ్యె యా
దవశిశు వైనవా డదియె తల్లి, మహాద్భుత మయ్యె నిద్ధరన్.

అవనిపయిన్ వనస్పతి బృహస్పతిగా నొనరింపజాలు నే
యువతి యపాంగవీక్షణమహోత్పలమాలిక లట్టి పద్మసం
భవరసనాగ్రవర్తి యగుభారతి, నీచరణాబ్జయుగ్మకం
బవిరళభక్తి గోడ లయి యమ్మ, నిరంతరమున్ భజించెదున్.

అంబ, భవద్దయార్ద్రమధురాంబకశీతలదృష్టిపాతపా
త్రం బగుకీటకం బయిన తత్క్షణ మంబుజమిత్రుఁ డో సహ
స్రాంబకుఁడో త్రియంబకుఁడొ యక్షవిభుండొ సహస్రవక్త్రుఁడో
అంబుజగర్భసంభవుఁడొ యౌట విచిత్రమె విష్ణుగేహినీ.

పలితశ్మశ్రువలీవిసంగతతనున్ ప్రభ్రష్టదంతానునిన్
చలితగ్రీవు భవత్కటాక్షలహరీస్నాతున్ వయోగర్వని
స్తులయోషిచ్ఛతకంబు త్రస్తసిచయస్థూలస్తనంబై రణ
ద్వలయంబై గళితాంశుకం బగుచు నాధన్యాత్ము సేవింపదే.

జనని, భవత్కఠోరకుచసాంద్రవిమర్దపరిశ్రమంబునన్
వనజదళాయతాక్షు ఘనవక్షము రాజతశైలసాను పే

ఘణజనితస్ఫులింగ చయచండ భుజాబలశాలి యైనరా
వణుని నిశాతసాయకనిపాతము సైచె మహారణంబునన్.

రవిసుతవైరి వాలినిబరాఙ్ముఖు దోషవిదూరు జంపి రా
ఘవుడు యశంబు గాంచినను గాంచగనిమ్ము మహాపరాధు ల
త్యవినయచిత్తు లుగ్రదనుజాంగన లంతటివారి బ్రోచు నీ
కవనితనూజ, లోకమున నంటినదుర్యశ మేమి తెల్పుమా.

పురుషులనైన మోహపుసముద్రమునం బడద్రోయ జాలు సుం
దరతమరూపసంపదకు దాస్యము సేయ ననంగబాణ జ
ర్జరితశరీరయై పరవశత్వమునం జనుదెంచుకామినిన్
ఖరతరఖడ్గపాతమున గాసి యొనర్తురటమ్మ జానకీ.

ఏల విరూప జేసి తిది యేమని వచ్చినదానివారలన్
కాలుసప్రోలి కంప దశకంధరు డన్న సహింపలేక నీ
పాల మహాపరాధమును బాపపురక్కసు డెంచె నింతకున్
మూలము రాముడై జనని, ముంచెను నిన్ను వియోగవారిధిన్.

స్త్రీ లని దోషశూన్య లని చిత్తమునం దొకశంక లేక తా
కేళియపోతె నుగ్రశరకీలల నేర్చెను తాటకారి నీ
పాల మహాపరాధి యగువాయసమున్ వధియింపకుండ తా
నేల క్షమించు లోకజనయిత్రివి నీ వట లేకయుండినన్.

అలసు డనంగు డయ్యె గుసుమాంబకు డంబ, గిరీశకార్ముకో
ద్దళనప్రతిష్ఠ దీర్ఘభుజదండవిఖండితచండరావణున్
కలిత భవత్కటాక్షవిశిఖం బగుభ్రూలతికాశరాసనం
బెలమి ధరించి గెల్చి జగదేకధనుర్ధరు డయ్యె జానకీ.

వానరవీరువాలమున బంక్తిముఖాసురభర్తయానతిం
బూని నిశాచరుల్ జ్వలనమున్ దరికొల్పినవాడు చల్లనా
మానసవీధి నట్టికృప మాత, జనించెను నీకు నట్టి దీ
దీనునిపై రఘూద్వహునిదేవి, యొకింత యనుగ్రహింపవే.

దేవి, భవత్కథాశ్రవణదీక్ష యొకింతయు లేదు సంస్తుతుల్
రావు రచింప నీసుగుణరత్నమహాబ్ధి యపారమాట, నీ
పావనమందిరాంగణము ఫాలతలంబును సోక మ్రొక్కగా
బోవు మదీయపాదములు మూర్ధశిఖామణి నమ్మ, జానకీ.

జనని, సముద్రమధ్యమున జన్మముగాంచి సహోదరత్వముం
గనినవనస్పతుల్ పశుగణంబులు లుబ్ధకశేఖరుండు భూ
జనుల కభీష్టసిద్ధియును సస్యసమృద్ధియు జేయుచుండ ని
న్ననవరతంబు గొల్చెడుమహాత్ములభాగ్యము లెన్నశక్యమే.

అంబ, తిమిత్తిమింగిలగిలాదిమహాజలసత్వముల్ సము
ద్రంబుజలంబశేషమును ద్రావగ నేర్చిన మందరంబు దా
నంబుధిలో తెరుంగునోకో యట్టిది కాదె భవద్గుణాబ్ధిపా
రంబు నెరుంగ మానవవరాకులు సేయుమహాప్రయత్నముల్.

నీదుపదాబ్జసేవకయి నిత్యము వచ్చు విరించిరుద్రశ
క్రాదిసుపర్వబృందము లహంప్రథమోక్తి వినమ్రమౌళి సం
ఛాదితదిగ్విభాగు లయి సత్వరవృత్తి నమస్కరించునం
భేదరవంబు సైన్యపతివేత్రలతాచలనంబు లాపెడున్.

నీదుపదాబ్జరేణువులు నిత్యము మౌళి ధరించువారె దా
మోదరునాభికాసరసిజోదరపీఠి సుఖోపవిష్టులై
వేదములం జపించుచును విశ్వపదార్థములన్ సృజించుచున్
మోదముతోడ దేవఋషిముఖ్యులు గొల్వ సుఖింతు రమ్మరో.

అంబ, సమస్తభూతహృదయంబుల సన్నిహితుండు పుండరీ
కాంబకు డట్టివానిహృదయంబున జొచ్చితి వీవు, సర్వలో
కంబులకున్ శరణ్యుడు జగత్పతి యచ్యుతు డట్టివాని రో
లంబకనీలదృష్టినిగళంబున బంధితుగా నొనర్పవే.

సకలచరాచరాత్మకవిశాలజగంబు సృజింప బెంపగా
వికలము సేయ శక్తు డగువిశ్వనియామకు డచ్యుతుండు తా
వకవికచోత్పలామల విభారమణీయ విశాలనేత్ర యు
గ్మకచలనంబులన్ మెలగు మాత, భవత్పదపద్మ దాసుడై!

జనసంత్రాణపరాయణంబులు సుధాసారాంబువాహంబు లం
జనరేఖాంచిత పక్ష్మలంబులు జగత్సంత్రాసహారుల్ జగ
జ్జననీ, నీదుకటాక్షమాలికలు సంచారంబు లెచ్చోట జే
యునో యచ్చోట సమస్తసంపదలు సద్యోజాతముల్ కావొకో.

*

ఓమానవోత్తమా !
ఓవీరమూర్ధన్య !
ఓయమృత భాసమానోన్నతప్రేమ సా
మ్రాజ్యైక చక్రవర్తీ !

స్నేహశీలి !

నీహృదంతికములో నిరుపమానాఘాత
రత్నాకరామూల్య
రాగసంపద మెరయు;
నీయాశయమ్ములో నిర్మలోత్తుంగ ది
వ్యాకాశ సంకాశ
భాగ్యరాసులు మెరయు.

ఈయశ్రుఝరులతో
ఇరులతో, సొదలతో,
రొదలతో, ఈహాస
మృదుల వాసనలతో,
వినముతో, సిగ్గుతో,
కొసరు తేనియలతో
ఈపాట బ్రతుకు నీ
కేపాటిదోయి నా

నచ్చెలీ !
నచ్చెలీ !

*

ఇది నితాంతతమఃక్రాంత మిది దరిద్ర
మీనిశాంతమ్ము శూన్య మిం దెన్నడో ర
హశ్శిథిలసుప్తి గలవర మంది లేచి
గుబులుకొను లేతనెత్తావి గుసగుస లవో !

అంత నీయంధమందిరమందు నొక్క
రెప్పపాటు వేకువ, ఒక్క రెప్పపాటె
ఉన్మిషిత జీవనాగమనోత్సవమ్ము,
ఉదితగీతా ప్రవేశముహూర్త వేళ.

అప్పుడే గ్రహనక్షత్రవాతాయనముల
కొలుకులందు లేవెలుంగుతళుకుచిన్నరు
లరుణమసృణ తోరణపంక్తు లల్లునేమొ
ఆడునేమొ, వాడినమోముల ట్టైనాల్బ్బ.

తెరచికొన్నద్వారము దొచ్చి విరిసికొన్న
వాకిలిం జేరి, మంగళవాద్యపాళి,
గద్గదికమోన, నవరించి గళము, పాడు
నేమొ, నిర్జననిశ్శబ్ద మిట్టె మూగు.

మరల గ్రుడ్డిరాతిరి పడు, మరల నోరు
కాని శ్రుతులేని లేని చీకటులు, మరల
మరల పాడిల్లు –

*

*

లేవే అమ్మా!

చింతా దీక్షితులు

[నాలుగేండ్ల పిల్లలకు]

కావు కావుమని కేకలు వేస్తూ
లేచా యమ్మా కాకుల్లూ.
కిల కిల కిల కిల మని అరుస్తూ
పలికా యమ్మా చిలకల్లూ
పెరటి దొడ్డిలో గంతులు వేస్తూ
పిలిచా యమ్మా పిచ్చికలూ.
లేవే అమ్మా లేవే అమ్మా
నాకూ బువ్వా పెట్టమ్మా!
బువ్వా పెట్టితే వాటిని చూస్తూ
వాటికి బువ్వా పెడతాను.
బువ్వాగ రేస్తే ఎగిరి పట్టుకొని
నాతో బువ్వా తింటాయి.
పశువుల దొడ్లో అంబే అంటూ
అరుస్తున్నది తువ్వాయి.
తువ్వాయిని వాళ్ళమ్మ దగ్గిరికి
పంపే పాలూ తాగిస్తా.
తువ్వాయిని వాళ్ళమ్మ నాకుతూ
తలనీళ్ళోసిన తర్వాత—
మెళ్ళో మువ్వలు గంటలు కట్టీ
పరిగెత్తిస్తూ పరిగెడతా.
లేవే అమ్మా లేవే అమ్మా
లేచీ బువ్వా పెట్టమ్మా!

*

వ్యర్థయత్నములు

చింతా దీక్షితులు

ప్రేమతో నాతులసి మొక్కను
పెంచితిని గంగోదకంబుల
పసుపు కుంకుమ తోడ భక్తిని
పూజ లొనరిస్తి.

ఉదయ సాయం కాలముల క
ర్పూరదీపం బార తిచ్చితి
హృదయతాపము తీర లక్ష్మీ
స్తవ మొనర్చితిని.

పక్కనే పొంచున్న లోకపు
మాని సొక్కడు పెదవి విరిచెను
ఎందుకో యీవ్యర్థయత్నము
లెందుకో అనియెగా.

ప్రతిమ నొక్కటి మలచినా నది
ప్రతిఫలించిన దంద మంతా
తనివి తీరగ విగ్రహంబు న
లంకరించితిని.

మంచినగలూ మంచిగంధము
మంచి మంచి రకాల పువ్వులు
ప్రతిమ కుంచితి, హృదిని నిల్పితి
తపము చేసితిని.

౩.౨౧

పక్కనే పొంచున్న లోకపు
మాని సొక్కడు పెదవి విరిచెను
ఎందుకో ఈ వ్యర్థయత్నము
లెందుకో అనిమొగ్గ.

కొత్త కొత్త రకాల విద్యలు
కొత్త ఆటలు కొత్త పాటలు
ముద్దు తల్లికి నేర్పుచుంటిని
మోద మలరంగగ.

చిన్ని పాదము లెత్తి నాట్యము
చిన్ని పెదవులు కదిపి గీతము
చిన్ని చేతుల నెత్తి తాళము
తల్లి నేర్చినది.

పక్కనే పొంచున్న లోకపు
మాని సొక్కడు పెదవి విరిచెను
ఎందుకో యీ వ్యర్థయత్నము
లెందుకో అనిమొగ్గ.

హృదయ భారము తీరు నంచును
మధుర భావము లేర్చి కూర్చితి
అడవిపువ్వులు గుచ్చి దండగ
అరుత దాల్చితిని.

అనుభవించిన కష్టసుఖముల
నఖిలమును మథియించి, సారము
తీసికొనుడో రండు రండని
తిరుగ జొచ్చితిని.

వక్కాణే పొంచున్న లోకపు
మౌని సాక్కుడు పెదవి విరిచెను
ఎందుకో యీ వ్యర్థప్రయత్నము
లెందుకో అనిరోగా.

వక్కాణిసి పలుకు లన్ని
కడెను నా చెవులందు, విడిచితి
సర్వమయ్యెడ, మౌనముద్రను
దాల్చి కూర్చుంటిగా.

శిరము వంచితి, కనులు మూసితి
మౌనముద్ర వహించి యుంటిని
వక్కమౌనిసి పలికె మళ్ళీ
ప్రస్ఫుటము గాగా.

ఎందుకో యీ మౌన మూనుట
ఎందుకో యీ మాంద్యమంతా
పోయి సాంఘిక సేవ చేస్తే
పుణ్యముండునుగా!

*

శ్రీ వేంకటేశార్పణము

నోరి నరసింహశాస్త్రి

స్వామీ నీ మహనీయతాగుణము విస్తారంబుగా నీ మహా
సామర్థ్యప్రతిభాప్రసాదములు విస్పష్టంబుగా మాకు నీ
ప్రేమానర్ఘ్యల కల్పబుద్ధులకు సంప్రీతిన్ గటాక్షించినా
నీ మానోజ్జ్వలరమ్యకాయముల బహ్వాదివ్యరూపంబులన్.

నీసేవార్థము నీ ప్రతిష్ఠ సలుపన్ నిర్మించుకొన్నావు నీ
ప్రాసాదంబుగ ఈశరీరమని నే భావింపగా లేక పే
రాస న్నాదని యెంచి యాత్మసుఖమే యాశించి యత్నించి యా
యాసం బందితి దాన దేహమపవిత్రాత్మంబు గావించితిన్.

ఈ యజ్ఞానమహాతమిస్రచయ మధ్యేసంచరిష్ణుండనై
కాయంబున్ బహు చిత్రమార్గముల శృంగారింతు గర్వింతు లే
బ్రాయంబున్ బలమున్ జవంబు గని నే నన్యార్జితార్థావళిన్
స్వాయత్తం బొనరించి చోరుడు సముత్సాహించు చందంబునన్.

నీ వాత్సల్య మపార మప్రతిమ మజ్ఞేయం బచింత్యం బగున్
దేవా యీదృశ మానవాధమునిపై దీపింప ముమ్మారులున్
నా వెంటన్ వృషభాకృతిం బడి ననుం దర్శించి ఘర్జించి నీ
సేవాతత్పరబుద్ధి పెంచితివి హృత్సీమన్ క్రమావిష్కృతిన్.

క్షీరాంభోధి సమాన నిర్మలవపుశ్శ్రీ నొప్పి విశ్వంభరా
భారాలంబనదక్షమాంసల భుజాప్రాంతిన్ గళద్ఘంటికా
హారాలంకృత రమ్యసాస్న యిటు నట్లాడంగ వెంటాడగా
నారంభించిన నోర్యమగాదిని మహోక్షాకారు ధ్యానించెదన్.

అంతట నీపదసాగమెచ్చు భవదీయారాధనాపేక్షయున్
స్వాంతంబం దభివృద్ధి నొందగ భవత్సందర్శనార్థంబు నీ
చెంతన్ శ్రీగిరిమీద జేరితి గదన్ శీఘ్రంబ గోపాలక
ప్రాంతక్షోణికి పిల్వగాన చను గోవత్సంబు చందంబునన్.

నీ సాన్నిధ్యమహత్త్వ మెట్టిదియొ గానీ స్వామి నాకంటటన్
ఈ సంసారమునం దసారమతి జన్మించెన్ మనస్తాపముల్
మాసెన్ జిత్త మనేక జన్మగతసంస్కారంబు జృంభింపగా
భాసిల్లెన్ భవదీయ దివ్యపదసేవాభావనైకాగ్ర్యమై.

నా యజ్ఞానము గర్వమున్ గలుషమున్ నానాటికిన్ వృద్ధియై
మాయన్ లేక మదిన్ శిరోగ్రమున నిమ్మాక్షికన్ బ్రసారించె నే
మా యన్నించెడి దీర్ఘకేశముల నీ కర్పించితిన్ భక్తితో
నా యాకారవికారచింతనము సన్యస్తంబుగా నాత్మలోన్.

నీకే కార్యము చేయ ప్రీతి యగునో నీ సన్నిధిన్ నిల్చి నే
యాకారంబు మునీంద్రసమ్మతము ఆ యాకార్యముల్ చేసి ఆ
యాకారంబు ధరించి నిన్ బ్రయతు జేయన్ యత్నముల్ చేసితిన్
నాకేలా ఇక మూఢలోక మెటులన్ భావించి వర్ణించినన్.

ఈ లోకం బతిమూర్ఖచిత్త మది మోహీభూతమౌ శీఘ్రమే
యాలోకింపగ సత్యసూక్ష్మముల సత్యాల్పంబు తద్బుద్ధి నా
కేలా ఎన్నగ దాని వర్ణనలు నిన్నే వేళ నాయాత్మలో
పొలంజూచుచు నీప్రియంబు సలుపన్ బుద్ధిన్ బ్రసాదింపవే.

*

జాతకము

చింతా దీక్షితులు

తమ తమ జన్మలలో మనుష్యులు చేస్తూ ఉన్న కర్మలూ వాటిఫలములూ చిత్రగుప్తులో వారి కింది గుమాస్తాలో జాబితాలు వ్రాసి ఉంచుకొంటారు. ఈజాబితా లన్నీ వారు బ్రహ్మదేవుడికి పంపిస్తారు. వీటినిబట్టి బ్రహ్మదేవుడు ఒక్కొక్క మనిషికీ ఒక్కొక్క జాతకం తయారుచేసి ఆ జాతకాల ననుసరించి మనుష్యులను పుట్టిస్తాడు. అంటే మనుష్యుడు పుట్టడానికి పూర్వమే అతని జాతకం బ్రహ్మదేవుడు తయారుచేసి తన ఆఫీసులో ఉంచుకొంటాడన్నమాట.

మనుష్యుని సౌందర్యాదులూ, మంచిచెడ్డలూ, కష్టసుఖములూ వగైరా విషయములన్నీ అతడు పుట్టడానికిముందే నిర్ణయింపబడి ఉంటవన్నమాట స్పష్టము.

ఇక మనుష్యుడు భూమిమీద పడ్డతరువాత అతనిజాతకం వ్రాద్దామని యితర మనుష్యులు ప్రయత్నిస్తారు. జాతకంవ్రాయడ మనగా బ్రహ్మదేవుడు వ్రాసిన జాతకంలో విషయములు ఏవిధముచేతనైనా గ్రహించడముకు ప్రయత్నించడమే. జననకాలమును బట్టీ, దేశమునుబట్టీ, గ్రహాదులగతులనుబట్టీ యీరహస్యభేదనము చేయడముకు మనుష్యులు ప్రయత్నిస్తారు. జాతకములేని బ్రతుకు దీపములేని యింటివంటిదని వారు సూత్రముచేసి ఆసూత్ర ప్రకారము ప్రతివాడూ జాతకము వ్రాయించుకోవాలని నిర్దేశిస్తారు. ప్రతివాడూ జాతకం వ్రాయించుకొంటాడు. కాని ఆ జాతకం నిదర్శనమియ్యదు. ఏమండీ జాతకము నిదర్శన మివ్వడంలేదంటే జోస్యానికి పార్వతీదేవి శాపం ఉన్నదని వారు సమాధానం చెప్పుతారు. ఇటువంటి జాతకాలవల్ల లాభమేమిటి? ఈగుడ్డిదీపం యింట్లో ఉంటేనేంత లేకపోతేనేంత అని అతడు నిరుత్సాహపడతాడు.

న్యాయానికి అతడు నిరుత్సాహ పడవలసిన అవసరములేదు. మనుష్యుని సౌందర్యాదులు (అనగా తనుభావము) తెలుసుకోడానికి మాతాపితాదులను గురించి తెలుసుకోడానికి జాతకము అవసరములేదు. ప్రతిరోజూ యీ విషయములు అతనికి అనుభవైకవేద్యములే. ఇంక కష్టసుఖములు లాభనష్టములు తెలుసుకొనుటకు కూడా జాతకాలు అవసరము లేదు. జాతకా లున్నప్పటికీ అవి సరియైన నిదర్శనమివ్వడం లేదు కాబట్టి అవి ఉన్నా లేనివాటిలోనే జమ.

అయితే కష్టసుఖాదులు తెలుకోవడం ఎలాగంటే దానికి ఒక సూక్ష్మమార్గమున్నది. ఈ సూక్ష్మమార్గము ననుసరించి ఎవరిమట్టుకువారు తమతమ భావిఫలము

లన్నుగ్రహించుకో వచ్చును. దీనికోసం జోస్యుల నాశ్రయించడం, డబ్బు ఖర్చుపెట్టడం, ప్రకటనల కోసం పత్రికలు తిరగవెయ్యడం ఇత్యాదిపనులు చేయవలసిన పనిలేదు. ఆ మార్గం ఏమిటంటే —

ప్రొద్దున్నే లేచి ఎవరిముఖం చూస్తే ఏయేఫలాలు సంభవిస్తాయో, రాత్రుళ్ళు ఏయేకలలు గంటే ఏయేఫలాలు వస్తాయో, వీధులోకి వెళ్ళేటప్పుడు ఏయే శకునాలు వస్తే ఏయే ఫలాలు పుట్టుతాయో వెనక తుమ్ము ముందు తుమ్ముల ఫలమేమిటో పంచాంగము పరిశీలించే వారికందరికీ తెలిసినవిషయమే. వాటినిగురించి యిక్కడ చెప్పదలచుకోలేదు. నేను చెప్పదలచిన విషయములేమంటే —

ఆ యింట్లో నీవు పదేళ్ళబట్టి కాపురమున్నావు. వీధిగుమ్మందాటి లోపలికి వెళ్ళడం, లోపలినుంచి గుమ్మందాటి వీధిలోకిరావడం, చాలాసారులు జరిగి ఉంటుంది. కాని ఎప్పుడూ ఏమీ ప్రమాదము కలగలేదు. కాని దశాచ్ఛిద్రము వచ్చినా, అంతర్దశ విదశలు జబ్బిచ్చినా, గుమ్మం దాటేటప్పుడు ద్వారబంధం టక్కున బట్టతలకు తగిలి బొప్పికట్టడమో, లేకపోతే గడపకాలికితలిగి సాష్టాంగంగా దొర్లాడడమో జరుగుతుంది.

ఈరీతిగా చాలామారులు జరిగినట్లయితే దశమారిపోయిందని ఊహించుకోవాలి. ఒకమారు అజాగ్రత్తవల్ల గుమ్మంతగిలి తలబొప్పికట్టిందని నీవు చాలాజాగ్రత్తగా నడుస్తూ వంగుని, కాలెత్తి జాగ్రత్తగా గుమ్మందాటడానికి ప్రయత్నిస్తావు. జాతకంబాగుంటే సరేసరి; బాగులేకపోయినట్లయితే ఎంతజాగ్రత్తగా ఉన్నాసరే జరిగేదేమో జరగకమానదు. ఎంతో వంగుని నీవు గుమ్మందాటేటప్పుడు నీతోపాటు ద్వారబంధం కూడా వంగి తలకుతగిలితీరుతుంది. లేదా కాలెత్తి ఎంతోజాగ్రత్తగా నీవుగడపదాటదామనుకుంటే, కాలితోపాటు గడప పైకిలేచి (లేచినట్లుమాత్రం అగుపడదు) కాలికి అడ్డువచ్చి భూమిని ఆలింగనం చేయిస్తుంది.

ఎన్నోమార్లు ఆరోడ్డున నడచిఉంటాము. ఆరోడ్డుసంగతి అన్నివిషయాలూ — ఎత్తులు, పల్లాలు, రాళ్ళు, గోతులు ఇత్యాది — మనకు కంఠతా వచ్చి ఉంటవి. కాని జాతకం జబ్బిచ్చినప్పుడు గోతులో కాలుపడి కాలికి ఇరుకు నొప్పిపట్టడమో. రాళ్ళులేనిచోటకు రాళ్ళువచ్చి బొటనవ్రేలికి తగిలి పొప్పరూడిపోవడమో, కాలితో కూడా రాళ్ళుపైకిలేచి ఆరాళ్ళుకాలికి గట్టిగాతగలడమో ఏదోఒకటి సంభవించి తీరుతుంది. ఇటువంటి వేవిసంభవించినా వీటినిబట్టి భావిఫలములను జాతక మక్కరలేకుండా తెలుసుకోవచ్చుగదా! ఇంకోసంగతి —

మనము చేసేసహవాసాలవల్లకూడా మనకు మనజాతకం కొంతవరకు తెలుస్తుంది. ఒకనికి ఒకమాటు ఒకకవీశ్వరుడి స్నేహంచెయ్యడం తటస్థించింది. ఎలాగట

స్ఫురించిదంటే—ఆకవీశ్వరు డొకనాడు చేత్తో నల్లేరుకాడలు పట్టుకొని అతనికి కనిపించాడు. "నల్లేరుకట్టుకు వెడుతున్నారు. ఏమిచేస్తారండోయి కవీశ్వరుడుగారూ" అని ఆయన కుశలప్రశ్న చేశాడు. అప్పుడు కవీశ్వరుడు నవ్వుతూఅన్నాడుగదా "మన పూర్వులు ఏమన్నారంటే—ఒక నుయ్యైనా తవ్వించాలి ఒకచెరువైనా తవ్వించాలి, ఒక గుడైనా కట్టించాలి, ఒకమొక్కైనా పాతించాలి అని. పోనీ మనపెద్దలమాట ఎందుకు కొట్టివెయ్యడం అని ఆలోచించి యీనల్లేరుమొక్క మాదొడ్లో పాతుతామని తీసుకు వెళ్ళుతున్నాను."

ఆ క్షణమే అతడు కవీశ్వరుడితో జట్టుకట్టాడు. అంతే కాకుండా ఆ కవీశ్వరుడికి తనయింట్లో ఒకభాగం అద్దెకు కూడా యిచ్చాడు. (హాస్యదృష్టితో ఎప్పుడైతే యీపనిచేశాడో అప్పటినుంచీ అతని పాట్లు వర్ణించనలవి కావు. పాపము అతనికి వేళపట్టున తిండిలేదు వేళపట్టున నిద్రలేదు. తెల్లారితే సరి కవీశ్వరు డాయన్నిచూచి "ఆ" లేచారా, రండి రాత్రి వ్రాశాను ఈపద్యాలు, ఏలా ఉన్నాయో చూడండి" అని కూర్చోబెట్టి ఆపద్యాలు చదివి ప్రతిపదార్థాదులు చెప్పి అలంకారాలు చెప్పిపూర్వకవుల పద్యాలతోనూ ఆధునికుల పద్యాలతోనూ వాటిని పోల్చిచూపి వాటి ఆధిక్యతనచ్చజెప్పి ఏపన్నెండు గంటలకో భోజనానికి వదలిపెట్టేవాడు. మొహమాటంకొద్దీ అతడు కవీశ్వరుడు పెట్టుతూ ఉన్న యమయాతన సహించి ఊరుకొన్నాడు. ఆయన యీ మధ్య ఒట్టు పెట్టుకొన్నాడు. బ్రతికిఉండగా కవీశ్వరుడన్నవాడితో మాట్లాడననీ తన యిల్లు అటువంటివాడికి అద్దెకు ఇవ్వననీ.

అతని జాతకం ఎన్నాళ్ళైతే జబ్బుగా ఉందో అన్నాళ్ళూ ఆ కవీశ్వరుడి సహవాసం తప్పలేదు. జాతకం అక్కరలేకుండానే యిటువంటి నిదర్శనాలు ఉంటూ ఉంటే ఇంకా జాతకం వ్రాయించుకోవడ మెందుకు ?

కవీశ్వరులు రెండురకాలు—ఒకరకం తుమ్మెద కవీశ్వరులు, ఇంకోరకం సాలెపురుగు కవీశ్వరులూను. తుమ్మెదకవు లేమిచేస్తారంటే ఆ పువ్వునూ ఆ పువ్వునూ ఆశ్రయించి వాటిలో మకరందమూ, పుప్పొడీ తీసి యింటికివచ్చి తేనెపట్టుపెట్టి అందులో మకరందందాచి అదే తమ ప్రయోజకత్వం అని లోకానికి వెల్లడిచేస్తారు.

ఇక సాలెపురుగుకవు లేమి చేస్తారంటే, గూడుకు కావలసిన సామగ్రిఅంతా తామే సమకూర్చుకొని, సాధనాలన్నీ చూచుకొని, గూడు ఎప్పుడు ఎక్కడ ఏరీతిగా కట్టాలో ఆలోచించుకొని ఆరీతిగా కట్టుతారు.

జాతకఫలాలు తెలుసుకోవడం విషయములో ఈఉభయుల సహవాసం ఒక్కమోస్తరు ఫలములనే ఇస్తుంది కాబట్టి పాఠకులు జాగ్రత్తగా ఉండవలసి ఉంటుంది.

జాతకం దశమారడానికి సిద్ధంగా ఉన్నప్పుడు మన ప్రశ్నలకు సరియైన సమాధానాలు రావు. ఈసంగతి గ్రహించి మనజాతకం మారుతూ ఉన్నదన్నసంగతి మనము గ్రహించుకోవాలి. ఒక ఆసామి తన కొడుకును పిలిచి "అబ్బాయీ యీ ఉత్తరం పోస్టులో పడేసిరారా" అంటే కొడుకు అన్నాడుగదా "ఆపోస్టులో ఉత్తరాలు వెళ్ళవు నాన్నా, నేనుచూశాను. ఆపోస్టు ఎప్పుడూ అక్కడే ఉంటుంది." ఆఉత్తరం కొడుకు పోస్టులో వెయ్యలేదు. తండ్రే వేశాడు ఎండలో పరుగెత్తుకువెళ్ళి. వెళ్ళదనే నిశ్చయంలో కొడుకు ఉత్తరం పోస్టులోవేస్తే అది వెళ్ళదలచి ఉన్నా వెళ్ళడం మానుతుందని అతని భయం.

ఇంక కొందరిజాతకం సాధారణంగా నెలంతా సరిగ్గాఉండి మధ్య మధ్యను మాత్రం చాలా నీచలోకి దిగుతుంది. అది శీతాకాలమనుకోండి. చలిచేత పక్కలు వంచుకుపోతున్నాయి. వెచ్చని పరుపు మీద వెచ్చనికంబళీ కప్పుకొని తెల్లవారిన తరువాత తాగబోయే వెచ్చ వెచ్చని కాఫీనిగురించి సుఖస్వప్నము కంటున్నాడను కోండి ఒకపెద్దమనిషి. అప్పుడే తెల తెల వారుతోంది. అతడు పూర్తిగా నిద్రాలేని పూర్తిగా మెలకువాలేని స్థితిలో ఉన్నాడు. ఆసమయంలో ఎక్కడో సమీపం నుంచి వచ్చి మధురధ్వని అతనిచెవులో పడుతుండి. "ఏమండీ, ఏమండీ, తెల్లారుతోందండీ" అనే ధ్వని. ఆ ధ్వని లక్ష్యముచేయక అతడు మరింత గట్టిగా కంబళీని తన్నిపెట్టి స్వప్నము చెడిపోకుండా ఉండడానికి దానిమీదనే బుద్ధినిలిపి ఉంటాడు. మళ్ళీ ఆ ధ్వని. "ఏమండీ; ఇంకా నిద్రేనా; ఇదిగో చూడండీ; ఏమండీ; వినబడ్డంలేదూ." అని ఉండుండీ ఆ ధ్వని చెవులో పడడముచేత అతడు ఆ ధ్వని తన భార్యదిగా గ్రహించి ఇంక మాట్లాడక ఊరుకుంటే ఏమి కొంప మునుగుతుందో అని బద్ధకంగా "ఊ," అంటాడు. ఇతర సమయాల్లో ఆ ధ్వనిని అతడు 'కలస్వనంబు' అనీ 'మధురమంజుల కంఠరవంబు' అనీ అనే వాడేగాని యీ సమయములో "ఏమిటా వెధవగోల" అనదలచి నోటిదాకా వచ్చిన ఆ మాటలను దిగమ్రింగి, ఆ మాటే అంటే కొన్నాళ్ళదాకా ఇంట్లో తనకు పరువుదక్కదనుకొని, పెద్ద మనిషి తరహాగా 'ఊ,' అంటాడు. ఆవిడ మళ్ళీ "ఏమండీ, ఆ కంబళీతీసి ఒకమాటు కూచోండీ; ఇదిగో; ఎంత పిలిచినా పలకరే మిటమ్మా; ఏమండీ" అని అంటుంది. అతడు స్వప్నము చెడినందుకు విసుగుకొంటూ మోటుతనంగా ఏమాట అనడానికీ భయపడి, చలిని ఒకమారు తలచుకొని "ఎందుకూ" అంటాడు. "తెల్లవారిన తరువాత కూడా ఆ నిద్రయేమిటి? ఒకమాటు లేచి దాసీది వచ్చించి కాబోలు అంట తప్పేలాలు దాసీదాని కోమాటు పడవేసి, వంటిల్లు కొంచెం బాగుచేసి, పొయ్యిలో నిప్పువేస్తేనే

గాని కచేరికి ఆలస్యం అవుతుందేమో తరవాత మీ యిష్టం. కుర్రాళ్ళు లేచి చద్దన్నం కోసం ఏడుస్తారుకూడాను" అని ఆవిడ చల్లగా జారవిడుస్తుంది.

తన విధిని తిట్టుకొని, ఇటువంటి అనుభవాలు తనకు రావడానికి పూర్వ జన్మంలో ఏమి కర్మలుచేసి ఉండాలో ఒక మారు ఆలోచించి, తన జాతకం ఆనాడు మొదలు మూడురోజులదాకా చాలా నీచలోకి దిగిం దనేసంగతి గ్రహించి, ఎవరిని ఏమనడానికీ భయపడి, నిమ్మళంగా లేస్తాడు.

ఆ క్షణం మొదలుకొని మూడురోజులదాకా తన భార్య ఉత్తరవులను తూచా తప్పకుండా అతడు నిర్వహించడమునకు పూనుకొంటాడు —

పొయ్యిలో నిప్పువెయ్యడానికి ఊరంతా తగులబెట్టడానికి సరిపడే అరడబ్బా కిరసనాయిలూ, నాలుగు అగ్గిపెట్టెలూ ఖర్చుపెట్టి, కర్రలనూ, కిరసనాయిలునూ గట్టిగా తిట్టి తన భార్యను మాత్రం మనసులో తిట్టుకొని నీళ్లోడుతూ ఉన్న పొయ్యి కేసి చూచి బిక్కమొహం వేసి బియ్యం కడగడానికి నూతిదగ్గిరికి వెళ్ళుతాడు. పొయ్యి మహా తెలివైనవస్తువు; ఆడవాళ్ళ అదుపాజ్ఞలలో ఉంటుంది. వాళ్ళను చూచేటప్పటికల్లా అది రాజి భగ్గున మండుతుంది. ఆడవాళ్ళంటే దానికి భయమో అభిమానమో ఏదో ఉండి ఉండాలి. ఇంక మొగవాళ్లను చూస్తే ఆ పొయ్యి [illegible]కువ గట్టుతుంది. మండించడానికి మగవాడుగానే ప్రయత్నం చేశాడా, పొయ్యి కిక్కురమనకుండా నీళ్ళు గారుతుంది. మంట అక్కర్లేదు అన్నం అడుగంటుతుందని అతడు అనుకున్నాడా ఆ పొయ్యి భగభగ మండిపోయి ఆర్పడానికి ఎన్నిప్రయత్నాలు చేసినా లక్ష్యపెట్టదు.

తన భార్య వంటచేసినప్పుడు అతడు ప్రతివస్తువుకూ అనేక వంకలు పెట్టడం అలవాటు. తాను వంటచేస్తూ ఉన్నప్పుడు అతడు నలపాక భీమపాకాలని మించి వండ దలచుకొంటాడు. కాని ఫలితమేమిటంటే, అన్నం అడుగంటనైనా అడుగంటుతుంది; లేకపోతే చిమిడిపోతుంది; లేకపోతే అంతా బియ్యమే. మిగిలిన వస్తువులలో ఉప్పూ కారమూ మొదలైన పదార్థాలు వేటికవి స్వరాజ్యం చేస్తూ ఉంటాయి.

కుర్రవాళ్ళకి అన్నంపెట్టడం ఒకపెద్ద పేచీపని. వాళ్ళుతినమంటే తినరు. పోనీ అనిపెట్టపోతే నోరుపట్టరు. అతని అనుభవాన్నిబట్టి ఇటువంటి చిక్కులలో మగ ప్రజలందరూ నేర్చుకోవలసిన విషయమొకటుంది. పిల్లవాడు అన్నం తినకనోరు పట్టక పోయినట్లయితే నిమ్మళంగా తొడపాశం పట్టాలి. అప్పుడు వాడు నోరు తెరిచి ఏడుస్తాడు. ఒక ముద్ద వాడి నోట్లోపెట్టి నోరుముయ్యాలి. అప్పుడు తినకముచేస్తాడు. ఈ ప్రక్రియ అనేకచోట్ల జయప్రదంగా నెరవేరింది. పిల్లలున్న వాళ్ళందరూ

యీ ప్రక్రియ తప్పకుండా అవలంభించవలెనని లోక కల్యాణమును కోరే అతని అభిప్రాయము.

ఏలాగైతే నేమి ఆరోజుకు వంటముగించి పిల్లలకీ భార్యకీ యింత పెట్టి తానింత తిని, కాలిన చేతివేళ్ళకేసి ఎర్రబడి నీళ్ళు కారుతూ ఉన్నకళ్ళతో చూచి ప్రపంచ మంతా తన విరోధులే అనే దృఢ విశ్వాసముతో అతడు కచేరీకి వెళ్ళుతాడు.

ఆ మూడురోజులకే జాతకం వ్రాయడమెందుకు. మొదటిరోజు " ఏమండీ " అనే శబ్దం అతని చెవుల్లో పడింది మొదలు అతనిజాతకం స్పష్టముగా తెలుసుకోవచ్చు నుగదా !

కొందరుమనుష్యులకు చిన్నచిన్న చిక్కులు ఆజన్మం సంభవిస్తూనేఉంటవి. అవి జాతకాన్ని తెలుసుకోవడముకు కొంతమట్టుకే పనికివస్తవనే సంగతి అందరూ గ్రహించవలసిఉంటుది.

ఆయన చాలాచదువుకొన్నవాడనిపేరు. నేనొకమారు ఆయన దర్శనం చేయడానికి వెళ్ళాను. నే వెళ్ళేటప్పటికి ఆయన భాగవతం చదువుతున్నాడు. నేను నమస్కరించి కూర్చుని వింటున్నాను. ఒక అరగంటసేపయింది. ఆయన భాగవతం కిందబెట్టి యిటూ అటూ చూచాడు. వెదకడం మొదలుపెట్టాడు చుట్టూఉన్న పుస్త కా లన్నీ తల్లకిందులుచేశాడు. వ్యాసపీఠం ఎత్తిచూచాడు. భాగవతం ఎత్తి కింద చూచాడు. భాగవతం కాగితా లన్నీ తిరగవేసి చూచాడు. లేచాడు, కూర్చున్నాడు. మధ్యమధ్య పెళ్ళాన్నీ కొడుకులనీ తిట్టాటు.

" ఇక్కడే పెట్టానండీ, ఇప్పుడేనూ " అన్నాడు. మళ్ళీ భాగవతమంతా తిప్పి పరిశీలించాడు. బట్ట తడుముకొన్నాడు. " ఇంతట్లోకే ఎక్కడకు పోయిందో ; ఎప్పుడూ యింతే " అని విసుకున్నాడు. పుస్తకాలు ఇటూ అటూ విసరికొట్టాడు. చివరకు దొరికింది—పొడుంకాయ. రొంటినున్న పొడుంకాయసంగతి మరిచిపోయి యింత బాధపడ్డాడు. ఒకపట్టు పొడుంపీల్చుకొని భాగవతం పుస్తకంకోసం వెతికి, తర వాత పేజీకోసం వెతికి, వ్యాసపీఠంమీదపెట్టి మళ్ళీ పురాణం చెప్పడం మొదలు పెట్టాడు. అరగంట అయింది. పొడుం పీల్చుకోవాలని బుద్ధి పుట్టింది. మళ్ళీ పొడుం కాయవేట ప్రారంభం. గుర్తుగా ఉండాలని కాలిక్రింద పెట్టుకొన్న పొడుంకాయ కనబడదు. యథాప్రకారం మళ్లీ చేయవలసిన పనులన్నీచేసి భార్యనీ పిల్లలనీ తిట్టిన తరవాత గావంచాలో పొడుంకాయ దొరికింది.

ఆయన చాలా తమాషామనిషి, ఒకమారు ఆయన పంక్తిని కూర్చుని భోజ నము చేస్తున్నాను. ఆయన భార్య పచ్చడి వడ్డించేటప్పుడు చెయ్యిజారి సగం పచ్చడి కిందా సగం విస్తట్లోనూ పడింది. ఆయన ఏమీ కోపం చెయ్యలేదు. నెమ్మదిగా

"ఏదీ ఒసే. కొంచెం బుర్ర వంచు ఆ నెత్తిమీదా అది ఏమిటి" అన్నాడు. ఆవిడ ఏమిటో అనుకొని బుర్ర వంచించి. ఆయన పరిశీలనగా రెండు నిముషాలు చూచి 'అబ్బే మరేమీ లేదు. నెత్తిమీదకుగానే వచ్చాయేమో నని చూచాను' అన్నాడు. ఆవిడ ఏమిటంది. ఆయన వికటంగా 'కళ్ళు' అన్నాడు.

ఇంకోమారు ఆయనా నేనూ భోజనము చేస్తూ ఉన్నాము. ఆవిడ చారు వడ్డించింది. ఆయన పురిషెడు చారు పుచ్చుకొని ఒకమారు సకిలించి, పెళ్ళాన్ని పిలిచి "చూడావే; నాలుక ఎలాగ ఉందో ఒకమాటు చూడు," అన్నాడు. ఆవిడ చూచి బాగానే ఉన్నదన్నది. ఆయన "బాగా చూడు. చిల్లులూ ఏమీ పడలేదు గదా" అన్నాడు. ఆవిడ బుర్ర వంచుకొని వెళ్లిపోయింది.

ఇంక ఆవిడ సంగతి, ఆవిడ మొగంనిండా చక్కగా బొట్టు పెట్టు కుంటుంది. ఎంత పెద్ద బొట్టు పెట్టు కుంటే అంతకాలం అయిదో తనం అనుభవించ వచ్చునని ఆవిడ ఊహ. మొగుడు తనతో సంతోషంగా మాట్లాడిన రోజున-అంటే నీకు కొత్త చీరకొని పెట్టనా అనీ, తెల్లముక్కు పుడక చేయించనా అనీ, కాసులు గుచ్చుకో డానికి దారంపేని పెట్టనా అనీ ఈరీతిగా మాట్లాడిన రోజున — ఆవిడ పెద్దబొట్టు పెట్టుకొనేది. తనకు భర్తమీద ఏరోజు నైనా అనురాగం కలిగినప్పుడుకూడా—అనగా తనకు ఇష్టమైన పెరుగుతోటకూర బజారు నుంచి తెచ్చినప్పుడూ, పొరుగూరు వెళ్లి వచ్చేటప్పుడు కొత్తపుట్టిగాని పేలాలకి పచ్చజొన్నలు కాని తెచ్చినప్పుడూ – ఆవిడ పెద్ద బొట్టు పెట్టుకొనేది.

తనమీద ఎందు చేతనైనా భర్తకు కోపం వచ్చినప్పుడూ, లేదా తనకు భర్తమీద కోపం వచ్చినప్పుడూ,—అనగా దొండకాయకూర వండవద్దన్నప్పుడు అది వండినా, అత్తిసరు రాత్రిళ్ళు పెట్టవద్దన్నా, పప్పులో బెల్లం గుమ్మడి కాయముక్కలూ వెయ్యవద్దన్నా, పొరుగింటి వెంకమ్మ మొగుడితో మాట్లాడినా (ఆవిడకూ వెంకమ్మకూ అలుకు గుడ్డ విషయమై ఆ మధ్య పేచీవచ్చింది.) ఆవిడచాలా చిన్న బొట్టు పెట్టుకొనేది.

చాలా కోపం వచ్చినప్పుడు అన్నం వండడం మాని వెయ్యడమే కాకుండా బొట్టు పెట్టుకోవడం కూడా మానివేసేది. తనబొట్టుకీ భర్తఆయుర్దాయానికీ పరస్పర సంబంధం ఉన్న దని ఆవిడ అభిప్రాయము.

ఇటువంటి చిక్కులు ఆ జన్మం ఉండేవే కాబట్టి దీనినిబట్టి జాతక ఫలములను సరిగా చెప్పడం కష్టము.

కొందరి చర్యలవల్ల వారి జాతకమే కాకుండా గ్రామము జాతకమూ దేశము జాతకమూ కూడా చెప్పవచ్చు. మా ఊళ్ళో సీతయ్యగారనే ఒక పెద్దమనిషి

ఉన్నాడు. ఆయనకు ఇల్లు కట్టించడం అంటే ఎంతో సరదా. ఆయన పునాదులు తీయించి గోడలు పెట్టడానికి అదుసూ లేక పోతే సున్నం కలిపి పీధుల్లో పెట్టి, సగం గోడ లేవదీసేటప్పటికల్లా ఎంత మండు వేసంగిలోనైనా నాసరే ఏ కాలములోనైనా నాసరే వాన కురిసి తీరుతుంది. పంచాంగం సహాయము లేకుండా, గవర్నమెంటువారి వాతావరణశాఖోద్యోగి సహాయం లేకుండా, వాన రాకనుగురించి సీతయ్యగారి గోడల సహాయముతో చెప్పవచ్చును ఆయన భార్య రామమ్మగారి విషయం కూడా అంతే. ఆవిడ వడియాలు పెట్టడానికి గుమ్మడికాయ తరిగి, పప్పు రుబ్బడం తరవాయిగా వాన కురిసి తీరుతుంది. ఆ వడియాలన్నీ యింట్లో ఉండి బూజుపట్టేదాకా వాన వెలవనే వెలవదు. అందుచేతనే ఆ వూరి వారంతా వానలు వెనకబట్టి నప్పుడు కుంభాభిషేకాలు మొదలైనవి చెయ్యడం తలపెట్టక సీతయ్యగారి దగ్గిరికి వచ్చి ఏదైనా గోడ కట్టమనీ, లేకపోతే రామమ్మగారి దగ్గిరకు వచ్చి రెండు గుమ్మడికాయలూ కుంచెడు మినుములూ యిచ్చి తప్పకుండా వడియాలు పెట్టమనీ ప్రార్థిస్తారు. ఆ వూరికి ఎప్పుడూ అనావృష్టిదోషం పట్టలేదు. చూచారా గ్రామం యొక్క జాతకం ఒక కుటుంబం వారి చర్యలనుబట్టి ఏరీతిగా చెప్పడానికి అనుకూలముగా ఉంటుందో !

ఇక పిల్లలున్న వాళ్ళకి ఎప్పుడూ జాతకం మంచిది కాదని ఒక విధివాక్యము చెప్పవచ్చును. కావ్యాలలో మాత్రం, పిల్లలవల్ల భూలోకస్వర్గ మనుభవిస్తామని చెప్పబడి ఉంటుంది కాని పిల్లలున్న వాళ్ళ అనుభవము వేరుగా ఉంటుంది

శుభ్రముగా బట్టలు కట్టుకొని అపేక్షతో తన చిన్నపిల్లవానిని ముద్దుపెట్టుకోవలెనని ఎత్తుకోవడంతోనే వాడు నవ్వుతూ నవ్వుతూ బట్టలన్నీ పాడుచేసి పారేస్తాడు. అనుభవించిన వాళ్ళకిగాని ఇందులో సుఖం కనిపించదు.

సుఖంగా రాత్రి నిద్రపోతూంటే గోల్లునగోలపెట్టి తను నిద్రపోకుండా ఇంట్లో ఎవరినీ నిద్రపోనీకుండా చేస్తాడు పిల్లవాడు. వాడిని ఓదార్చడానికి బ్రహ్మదేవుడు దిగిరావాలి. తీరా ఓదార్చేటప్పటికి తెల్లవారుతుంది. ఇంక వాళ్లు రాత్రి పగలూ చేసే అల్లరికీ, పాడు చేసే వస్తువులకూ, చింపే పుస్తకాలకూ మితిలేదు. మిగిలిన విషయాలు చూద్దామంటే— తెలివితేటలా సున్న, ఎవరికైనా జాలిపుట్టించే స్థితిలో ఉంటారుగాని పిల్లలు ఎవరినీ మెప్పించే స్థితిలో ఉండరు. ఇటువంటి పిల్లలను పెట్టుకొన్నవాళ్ళజాతకం మంచిదని ఎలాగ చెప్పవచ్చును ?

కాని యిందులో ఒక మెరుగుంది. ప్రతికష్టానికీ ఒకవిరుగుడు ఉండిఉంటుంది. పిల్లవాళ్ళవిషయంలో అవిరుగుడు భూచాడు. భూచాడంటూ ఒకడుండబట్టి — నిజంగా ఉన్నా లేకున్నా — పిల్లలుగలవాళ్ళు వాడిధర్మమా అని బ్రతుకుతున్నారు. లేకపోతే వాళ్ళపాట్లు చెప్పాలా ?

పూర్వకాలంలో బూచాడితో పాటు బడిపంతులు పిల్లల విషయంలో యములాడికింద ఉండేవాడు కాని యీ మధ్య ఆ హక్కు అతడు వదులుకో వలసి వచ్చింది.

జాతకం తెలుసుకోవడానికి పై విషయాలతో పాటు ఈ కింది సలహా కూడా అందరూ గమనించ వలసి ఉంటుంది.

ఎవరికైనా కష్టాలు తటస్థించినప్పుడు అతడు — ఇది నా ఖర్మం అనీ లేదా విధి అనీ, లేదా జాతక మహిమ అనీ అనుకుంటాడు. 'విధి' అనేది లేక పోతే-అనే వాడు ఒక సరదా మనిషి. మనుష్యులను కష్టపెట్టడం దాని సరదా. ఎవరు ఎక్కువ లొంగుతారో వారినది ఎక్కువగా కష్టపెట్టుతుంది. కాబట్టి మనము విధికి లొంగినట్లు ఎంతమాత్రమూ కనబడకూడదు. మనమే విధిని లొంగ దీసుకొన్నట్లు దానికి కనబడాలి. అందుచేత ఎప్పుడూ విధిని గురించి ఫిర్యాదు చెయ్యకూడదు. విధితో కలహించకూడదు. విధికి లొంగనట్లు నటించాలి. ఈ విధంగా చేసినట్లయితే విధిబుర్ర వంచుకొని సిగ్గుతో లేచి పోతుంది. "అయ్యో ఎంత ఖర్మం వచ్చింది" అనిఅన్నావా విధినెత్తికెక్కి తొక్కుతుంది.

గుమ్మం తలకి తగిలి బొప్పికట్టినప్పుడు తలతడుముకొని కళ్ళవెంబడి నీళ్ళు కార్చకూడదు. అలాగ చేస్తే విధికి లోకువవుతాము. ఏమిచెయ్యాలంటే గుమ్మం టక్కున తగలడంతోనే నవ్వాలి. గుమ్మంకేసి చూచి గుమ్మాన్ని ఒక మాటు దువ్వాలి. గుమ్మంకర్ర చాలా గట్టిదని ప్రశంసించాలి.

రైలుబండికోసం ప్రయాణమై వెళ్ళితే జాతకం బాగు లేనప్పుడు అది తప్పిపోతుంది. అలాంటప్పుడు 'అయ్యో బండి తప్పిపోయిందే' అనకూడదు. బండి తప్పిపోవాలనే ఉద్దేశ్యముతోనే తానక్కడకు వెళ్ళినట్లు నటిస్తే విధి లొంగిపోతుంది. లేకపోతే విధి అనేక చిక్కులు పెట్టుతుంది.

ఒకకూలివాడిచేతికి నేతిచెంబిచ్చి నేను ముందు నడుస్తున్నాను. అప్పుడు నాకు జాతకం జబ్బురోజులు. నాజాతకప్రభావమువల్ల వాడు రాతినితన్ని కిందబడి నెయ్యి పారబోశాడు. వాడితో నేను దెబ్బలాడతానని విధి అనుకొన్నది. నే నాసంగతి గ్రహించి వాడితో సాదరంగా మాట్లాడి, కాలికి దెబ్బతగలలేదుగదా అని ఊరడించి నిర్ణయించిన కూలికంటె అర్ధణా ఎక్కువ యిచ్చి పంపించివేశాను. విధి సిగ్గుపడి పారిపోయింది.

ఏదైనా పత్రికకు వ్యాసం గాని పద్యం గాని పంపించి దానిని చప్పున ప్రకటించక పోయినట్లయితే విసుగుకో కూడదు. ఆలస్యంగా ప్రకటిస్తారనే ఉద్దేశముతోనే వాటిని పంపినట్లు నటిస్తేనేగాని విధి లోకువ గట్టుతుంది. అందుచేత ఏమి చెయ్యాలంటే, ఆ పత్రికాధిపతికి ఉత్తరం వ్రాసి ఆలస్యంగా వేసినందుకు తన కృత

జ్ఞత తెలియజేయ్యాలి. " మీరు నా వ్యాసము ఆరునెలల తరువాత మీ పత్రికలో ప్రకటించినందుకు నేను చాలా కృతజ్ఞుడను. ఇక ముందుకూడా యీరీతిగానే నా వ్యాసములు ప్రకటిస్తూ ఉంటే నేను చాలా సంతోషిస్తాను. మీరు ఆలస్యంగా వేస్తారనే షరతుమీదనే మీకు నా రచనలు పంపుతూ ఉంటాను " అని ఈ మాదిరిగా ఉత్తరం వ్రాయాలి. విధిని జయించడానికి, ఎప్పుడూ జాతకం బాగుపడని గ్రంథకర్తలకు, ఇదే మార్గం.

ఈ వ్యాసములో సుళువు బలువులు గ్రహించి మెలకువలు తెలుసుకొని ఎవరిజాతకం వారు తమ తమ దినచర్యలనుబట్టి తెలిసికోవడముకు ప్రయత్నంచేస్తూ ఉన్నట్లయితే నా శ్రమ వ్యర్థము కాలేదని తలుచుకొనడముకు అవకాశం చిక్కుతుంది.

*